# నాటు పడింది



**వివేకానంద రెడ్డి లోమాటి**

**95819 39039**

శంకరయ్య ఈ మధ్య రెండు చేతులా బాగా సంపాదిస్తున్నాడు. బెల్లం చుట్టూ ఈగలన్నెట్టు డబ్బుతో పాటు జనాల రాకడ చిన్నగా మొదలైంది. అప్పులకోసమని వచ్చే పనిబాటలోల్లు, ఎలక్షన్లోస్తే ఇంటి ముందు తచ్చాడే కార్లు, తెల్ల చొక్కాలు నేలమిందున్న మనిషిని కాస్తా గాల్లోకి ఎక్కిస్తున్నాయి. అవన్నీ చూసి చూసి తనకు తెలియకుండా తనే ఒక గొప్ప వ్యక్తిలా, తనకెదురెవరు వస్తార్లే అని ఒక రకమైన కుంచిత స్వభావంలోకి కూరుకుపోతున్నాడు రోజు రోజుకూ. ఎవరూ ఎదురు తిరగనన్ని రోజులూ శంకరయ్య వీరత్వాలు బాగనే సాగినాయి గానీ ఒక దెబ్బ మాత్రం గట్టిగా తగిలింది. ఆ దెబ్బ కొట్టినోడు అతనికంటే బలవంతుడో లేకుంటే ఎక్కువ పలుకుబడున్నోడో అయ్యుంటే పెద్దగా పట్టించుకోకపోవును గానీ ఆమె ఒక ఆడామె కావడంతోనే వచ్చి పడింది చిక్కంతా.

***

మల్లన్నది చిన్న సంసారం. లోకం పోకడ పెద్దగా ఒంటబట్టలేదు మనిషి కూడా బాగా మెతక. నాయన పంచిచ్చిన తాతల కాలం నాటి కొంచెం భూమినే దున్నుకుంటూ, అందుబాటులో ఉన్న భూములు

కౌలుకో, గుత్తకో చేసుకుంటూ రేయింబవళ్లు ఒళ్లు దాచుకోకుండా కష్టపడి ఇద్దరు కూతుర్లకు పెళ్లి చేసినాడు సంవత్సరం అటు ఇటుగా. అంతా అయిన తర్వాత చూస్తే రెండు లక్షలు అప్పు తేలింది. దానికి తోడు కొడుకు చదువు ఉండనే ఉంది. చదువు లేక మంచో చెడో చెప్పే వాళ్లు లేక పొలాల గెట్లమ్మిటి తిరుక్కుంటూ తనెంత ఇబ్బందులు పడింది తెలుసు కాబట్టి కొడుకును మాత్రం బాగా చదివించి ఈ రొంపిలోనుంచి బయటపడెయ్యాలని ఎప్పట్నుంచో ఆశ. ఒంట్లోని చెమట మొత్తం చిందించైనా కష్టపడి పని చేసేంత శక్తి ఉంది గానీ ఆ శ్రమకు తగ్గ భూమే సరిగా లేదు. కౌలుకు గుత్తకు చేస్తూ ఎన్ని రోజులని అనుకుంటాండగా గంగన్న తన ఎకరా భూమి అమ్మాలనుకుంటున్నాడు అనే మాట మల్లన్న చెవినపడింది.ఆలోచనల్లో పడ్డాడు మల్లన్న. ఎకరా ఎనభై వేలు. అది చదును చూసి తయారు చేపించడానికి ఇంకో ఇరవై ముప్పై వేలు అవుతుంది. పొలం మంచి పొలమే కాబట్టి కాలం కలిసొస్తే చేతినిండా పైరు తియ్యొచ్చులే అని కొనుక్కున్నెడు. కొన్నెడే గానీ అది మాన్యం భూములైందాన రిజిస్ట్రేషన్ కాలేదు కానీ పైర పెట్టుకోడానికేం ఇబ్బంది లేదు. అలా గడిచిపోయినింటే ఏ సమస్య ల్యాకుండా అయిపొయినిందును గానీ కాలం ఊరకెక్కడ ఉన్నిస్తుంది.

గొడవంటే పెద్ద గొడవేమీ కాదు గెట్టిగా నాలుగు సెంట్ల నేల. మల్లన్న కొన్న పొలం కింద రెండెకరాల డీకేటి భూమిని శంకరయ్య పట్టా చేపించుకున్నాడు. ఎంత కాదనుకున్నా మల్లన్న తన దాయాదే నాలుగు సెంట్ల నేల పోతే పోయిందిలే లెక్క పెట్టి కొనుక్కున్నాడు నాది డీకేటీ గదా అని శంకరయ్య అనుకుంటే సరిపోవును గానీ నాకు అడ్డమెక్కడ వస్తార్లే అని సర్వేయర్ ద్వారా కొలతలేపిచ్చి నాకు అక్కడిదాంకా వస్తాది మీ ఉద్ది అక్కడికి పెట్టుకోండి అని రాయి పాతించాడు.

మల్లన్న ఒప్పుకోలేదు. ఇప్పుడున్నెది పాత ఉద్ది కదా దాన్ని కదిలిస్తే నా పొలం జేడెలు పడి నాశనమవుతుంది కదా అని ఒప్పుకోలేదు. నువ్వెంతంటే నువ్వెంతని అర్సుకున్నారు. గొడవ పెద్దదైంది. ఈ గొడవ దెబ్బకు మల్లన్న ఒంటరి వాడుగా మిగిలితే తమ్ముళ్ల బలంతో శంకరయ్య మరింత బలవంతుడయ్యాడు. అప్పటి వరకూ శంకరయ్యదే తప్పని మల్లన్న దగ్గర ఊదరగొట్టినోళ్లంతా తీరా గొడవ ముదిరాక ఏమీ తెలీనట్టు మౌనంగా జారుకున్నారు. పెద్ద గెట్టు తవ్వియ్యాలని మర్సటి రోజు మనుషుల్ని పిలుచుకొచ్చాడు శంకరయ్య. ఆయనకు అదనపు బలం అన్నట్టుగా వాళ్ల నాయిన తమ్ముడు ఇంగా కొంతమంది మనుసులు కూడా వచ్చినారు. ఇవతల పక్క మల్లన్న మల్లన్న భార్య సంటెమ్మ మాత్రమే.

తవ్వడం మొదులుపెట్టగానే పొయి ఆపినాడు ఆపినాడు మల్లన్న. 'నా సర్వే నెంబరు ప్రకారం నాకు అక్కడ వరకూ వస్తుంది నువ్వెవరు నన్ను ఆపేదానికని' మల్లన్న మీదకొచ్చాడు శంకరయ్య. 'నీదెట్టైతది..! డీకేటీ భూమిని పట్టా చేపిచ్చుకున్నోడివి నువ్వు

లెక్క పెట్టి కొన్నోన్ని నేను. అదిగాక పాత గెట్టు పోతే పొలం నాశనం అవ్వదో‘ ఆవేశంగా అన్నాడే గానీ వాళ్ల చూట్టూ ఉన్న జనబలం చూసి లోపల జంకుగానే ఉంది మల్లన్నకి.

‘వాటన్నింటితో నాకు పని లేదు. నా సర్వే నెంబరు ఉన్న కాడికి నేను తీసుకుంటా‘ అని అందరూ నాయనా కొడుకులు చుట్టుకున్నారు. దిక్కు తెలీలేదు మల్లన్నకు. ఆ మాట ఈ మాట అనుకుంటాండగా ‘రేయ్ ఏందిరా నీది నా కొడకా‘ అంటా ముసిలాయన మల్లన్న చెంపమింద కొట్టాడు. ఆ దెబ్బకు అదిరి కింద పడ్డాడు మల్లన్న.

పడినోడు లేచి తిరగబడింటే ఇంకోలా ఉండేదేమో గానీ భయపడి నోటికొచ్చినట్టు గొనుక్కుంటూ గమ్మగయిపొయ్యాడు మల్లన్న.

మొగున్ని తన కళ్ళముందే కొట్టి కిందపడేసేసరికి కోపంతో రగిలిపోయింది సంటెమ్మ. ఒకపక్క మొగుని చేతగాని తనాన్ని తిట్టుకుంటూనే వాళ్లమిందికి నోరు చేసుకునింది.

మట్టి తవ్వుతున్న కూళోల్లను ఆపించింది. ఒక ఆడదాని ముందు వెనక్కి తగ్గితే అవమానం గాదో అని ఆవేశంతో ఊగిపోతున్నాడు శంకరయ్య కూడా. ఆమెను ఏమీ చెయ్యలేక ఆ అక్కసుతో మల్లన్న తన అన్న అనే విషయం కూడా మరిచి మల్లన్న మిందకు కాలి చెప్పుత్తాడు. వెనక్కి తగ్గలేదు సంటెమ్మ. తనూ ఎత్తింది. ఆమె తెగువకు అదిరిపడ్డారు ఆ సంఘటన చూస్తున్న వాళ్లంతా.

పరిస్థితి శృతిమించేట్టుందని గమనించిన పనివాళ్లలో ఒకతను బలవంతంగా ఆపాడు. మనిషి మనిషిలా లేడు శంకరయ్య. ఇంత బతుకూ బతికి ఒక ఆడదాని ముందు వెనక్కి తగ్గాల్నా అని పొయ్యి మీద అన్నం ఉడికినట్టు కుతకుత ఉడికిపోతున్నాడు. ‘మీ అంతు చూస్తా పైరు ఎట్ట పెడ్తారో మాన్యం భూమిని రిజిస్ట్రేసన్ ఎట్టా చేపిచ్చుకుంటారో చూస్తా‘ అని మీసం తిప్పి తొడగొట్టాడు అందరి ముందు. ‘నీకిష్టమొచ్చింది చేసుకోపో. నీ కళ్ళముందే పైరు పెడ్తా సూచ్చాండు‘ అంతే పౌరుషంగా సవాలు చేసింది సంటెమ్మ. ఆ క్షణం ఆమె ఒక సాధారణ ఆడ మనిషిలా కనిపించడంలేదు. సమస్త మొఘల్ సైన్యాన్ని, సింహాసనాన్ని ఎదిరించి కదనానికి కాలు దువ్విన రుద్రమ్మలా రౌద్రంగా మారిపోయింది. ఈమేనా ఇన్ని రోజులు మనం చూసిన సంటెమ్మ అనిపిస్తోంది అక్కడి వాళ్లకి.

***

రోజులు గడుస్తున్నాయి. ఇప్పుడు పొలం అనే దానికంటే పరువు సమస్య అయి కూర్చుంది. ఎక్కడ తిరుగుతున్నా ఏం చేస్తున్నా సంటెమ్మ చేసిన సవాలే గుర్తొస్తోంది శంకరయ్యకు. ఇంత పలుకుబడుంది రాజకీయముంది ఒక్క ఆడదాని దగ్గర జంకాల్నా అని ఒకపక్క మనసు తొలుస్తోంది. ఎన్నెన్నో కుట్రలు మనసులో మొలకెత్తుతున్నాయి. ఎమ్మార్వో ఆఫీసులో విచారిస్తే ’డీకేటీ భూముల్లో మేము తలదూర్చలేము వేరే దారిలో చూడు అదీ గాక నాలుగైదు సెంట్ల నేల కోసం ఎందుకుపో అంత గొడవ’ అన్నారు. ఆ

మాటలు రుచించలేదు శంకరయ్యకు.

నేరుగా పోలీస్ స్టేషనుకు వెళ్లాడు. విషయం చెప్తే సివిల్ కేసుల్లో మేం నేరుగా రాకూడదు అన్నాడు ఎస్సై. ఏం చెయ్యాలో అర్థం కాలేదు శంకరయ్యకు. అయినా ఆశ తీరక 'సరే అయితే కేసులు గీసులు ఏమొద్దు గానీ ఊరికే అలా వచ్చి బెదిరిచ్చిపోండి సాలు' అన్నాడు పళ్లిగిలిస్తూ. సరే అని ఇద్దరు కానిస్టేబుళ్లను పిలిపించి 'ఆ శంకరయ్య విషయం ఒక్కరవ్వ చూసిరాపోండి' ఆర్డర్ వేశాడు ఎస్సై. సాయంత్రం పది వెయ్యి రూపాయల నోట్లు వచ్చి చేరాయి ఆ ఎస్సై పర్సులోకి.

***

'మల్లన్నంటే నువ్వేనారా?' దబాయించాడు పోలీసు. 'నేనే సార్' చేతులు కట్టుకోని భయపడ్తా భయపడ్తా చెప్పాడు మల్లన్న. 'ఏంటీ పొలం దగ్గర రౌడీయిజం చేస్తున్నావంట' అన్నాడు. 'నేనేం దౌర్జన్యం సార్. డీకేటీ భూములు రాపిచ్చుకోని మామిందికొచ్చి వాళ్లే చేస్తున్నారు' 'చ్చా ముయ్ నోరు. పద పొలం దగ్గరికి నీ చూద్దాం నీ యవ్వారమేంటో' అని బండ్లో ఎక్కించుకునిపొయ్యారు ఇద్దరు కానిస్టేబుల్లు.

పొలం దగ్గరికి వెళ్లి చూసి 'రేయ్ మీ పొలం మీరుండకుండా ఆయన పొలంతో మీకేం పనిరా. మర్యాదగా ఉండకపోతే జైల్లో తన్నులు తింటావు కొడకా నువ్వు' గద్దించగానే వణికిపొయ్యాడు మల్లన్న. ఏమంటే ఏమవుతుందో అని భయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు. పొలం దగ్గర పోలీసులు ఉండే సరికి ఏమైందా ఏమా అని బర్రెలు అక్కడ బీట్లో తోలి అక్కడికి వచ్చింది సంటెమ్మ. ఆమెను చూసి 'నువ్వేనామ్మా సంటెమ్మంటే' అడిగాడు పోలీసు. అవునన్నెట్టు తలూపింది సంటెమ్మ. 'ఏమ్మో.. నీకు నోరు పెద్దదంట. మొగోళ్లని కూడా లెక్క చెయ్యవంట. ఒక్కరవ్వ తగ్గిచ్చుకో. పెద్దోళ్లతో యవ్వారాలు గాదు' మెత్తగా బెదిరిస్తున్నట్టుగా అన్నాడు. 'వాళ్లాడిన ఆటలన్నీ చూస్తూ మేం గమ్మగా కూర్చోవాల్నా' మాటల్లో బెరుకనేది లేకుండా చెప్పింది.

ఆమె మాటల్లో కనపడుతున్న స్థిర చిత్తానికి అదిరిపడ్డాడు ఆ పోలీసు కానిస్టేబుల్. 'ఎవర్తో మాట్లాడ్తాండావో గుర్తుపెట్టుకోమ్మోవ్ సంటెమ్మా. నీకు నీ కుటుంబానికి మంచిది' అన్నాడు. 'దౌర్జన్యం చేసేవాళ్లనేం ఏమనలేక మా దగ్గరికి వచ్చి బెదిరిస్తున్నారు. ఇదేం పద్ధతి సార్' అన్నది.

'అన్ని అతి మాటల్తో నీకు పనిలేదు. ఎస్సై సారు చెప్పాడు చేలో పైరు పెట్టాగాకండీ' అన్నాడు. ఆ మాటలు సంటెమ్మను భయపెట్టకపోగా మరింత బలంగా తయారుచేశాయి. అదే అన్నది 'పైరు పెట్టేది పెట్టడమే. ఎవరొచ్చి ఆపుతారో నేనూ చూస్తా' అన్నది.

***

నారు ఎదిగి వరి మడికి బురదపెట్టేసరికి దాదాపూ నెల గడిచింది. ఇంకో పక్క ఎలాగైనా

పైరు పెట్టకుండా ఆపాలని సతపోరాడుతున్నాడు శంకరయ్య. ఈ నెల రోజుల్లో పోలీసులొచ్చారు, వీఆర్వోలొచ్చారు రాజకీయల్లో తిరిగే పెద్దమనుషులొచ్చారు ఎవరెన్ని చెప్పినా మల్లన్న దగ్గర ఆగిపోతున్నాయి గానీ సంటెమ్మ దగ్గర నిలబడ్డంలేదు. 'ఏం పొయ్యేకాలమో ఆ నా కొడుకు దీన్నే పట్టుకుని ఊగుతున్నాడు ఈసారికి పైరు వద్దులేయే. చాలిద్దాం' పోలీసులంటే ఉన్నె భయంతో అన్యాడు మల్లన్న.

'ఏం పొడుచ్చురా వాళ్లంతా వచ్చి. నీకంత భయమైతే పొలం దగ్గరికి కూడా రాకుండా ఇంట్లోనే కూర్చో. నేనే నాటిచ్చా' మొగునిలోని భయాన్ని కసురుకున్నెది సంటెమ్మ. ఆమెకంత మొండి ధైర్యం పట్టుదల ఎక్కన్నుంచి వచ్చినాయో అర్థం కాలేదు మల్లన్నకు. నారు నాటడానికి కూళోల్లను పిలిస్తే గొడవ గురించి తెలిసి ఊర్లో ఎవ్వరూ రాలేదు. ఎక్కువ డబ్బులిచ్చి వేరే ఊరోళ్లను గుత్తకు మాట్లాడింది. 'సరేమ్మా మొన్నాడొచ్చి నాటి పోతము మధ్యాహ్నానికి అన్నం చేసిపెట్టు సాలు' అన్నారు కూళోల్లు.

***

పొద్దున ఎనిమిది గంటలకల్లా పన్నెండు మంది కూళోల్లు వచ్చారు. నారుమడి చూపించి ఎకరాకు సరేపోయేమాయిన నారు పీకమని చెప్పింది. ఇంగోపక్క శంకరయ్య భార్య వీళ్లు చేసే ప్రతిపనినీ దూరం నుంచి కనిపెట్టుకోని చూస్తోంది. ఇంక కొద్దిసేపట్లో నారు పీకడం అయిపోతుంది అనంగా ఆ సమాచారం మొగునికి చేరవేసింది ఆమె. ఇలా జరుగుతుంది ముందే గ్రహించాడోమో పోలీసుల్ను పిలిపించాడు శంకరయ్య. పీకిన నారు కట్టలన్నింటినీ బాయి దగ్గన్నుంచి గంపలో పెట్టుకుని బురద మడి దగ్గరికి మోస్తున్నాడు మల్లన్న.

పోలీసులు వచ్చీ రాగానే 'రేయ్ పైరు పెట్టాకండి అని ఒక్కసారి చెప్తే అర్థంగాలేదా నీకు. రా స్టేషన్ కు ఎస్సు సారు పిలుచ్చాండు' అన్నాడు పోలీసు. ఆ మాటనంగానే భయపడ్డ మల్లన్న భయపడి జీపు ఎక్కడానికి పోతుంటే మొగున్ని ఆగమనింది సంటెమ్మ. పోలీసు దగ్గరికి వెళ్లి 'ఎందుకు రావాల స్టేషనుకు?' అడిగింది. 'ఎందుకో తెలీదో.. ' వెటకారంగా సమాధానమిచ్చాడు అతడు.

తమ తప్పు లేనప్పుడు ఎందుకు భయపడ్డం అనే తత్వం సంటెమ్మది. మేమంటే లెక్కలేదా నీకు అనే పంతం పోలీసులది. మాటా మాటా పెరిగింది. 'తీసకపొయ్యేది తీసకపొయ్యేదే. మీరు నాటాకాండి ఇంటికి పోండి' అని కూళోల్లను బెదిరిచ్చి మల్లన్నను జీబులో ఎక్కించుకుని సక్కా పొయినారు వాళ్లు. ఏం చెయ్యాలో దిక్కు తెలీలేదు సంటెమ్మకి. యట్ట తిరిగీ నాటియ్యాల. పొద్దు చూస్తే అప్పటికే టైం పదకొండు కావొస్తోంది. ఏం చేద్దామని కూళోల్లను అడిగితే 'నీ ఇష్టమమ్మా నాటుకు వరి ఎదిగిచ్చా అంటే నాటిపోతాము' అన్నెరు వాళ్లు. అప్పటికప్పుడు పరుగు పరుగున ఊళ్లోకొచ్చి నారు

మోపీడానికని ఒకరిద్దర్ని పిలిస్తే మాకెందుకులే లేనిపోని గొడవలనుకున్నెరేమో ఎవ్వరూ రాలేదు.

మరోపక్క నాటు ఆపేడానికి లేదు గెట్టిగా తీర్మాణించుకుని కోక రొండికి చెక్కుకుని నారు వేసుకోవడానికి గోతం సంచి తీసుకుని బయల్దేరబోతుంటే 'ఆడ కూతురివి బురద గెనాలమ్మిటి అంత దూరం నుంచి యాడ మోసకొస్తవుమ్మా' అన్నారు ఆము పరిస్థితి చూసి జాలిగా. 'నా గురించి వదిలెయ్యండి మీరు మొదలు పెట్టండి. మీకు నారు ఎదిగిచ్చే బాధ్యత నాది' అని చెప్పి నారమడి వైపు కదిలింది. పొద్దన లేచి తాగిన కొన్ని కాపీ నీళ్లు తప్ప కడుపులోకి ఏం పోలేదు. పళ్లు కూడా తోమింది లేదు. కడుపులో తిప్పినట్టుంది.

దానికి తోడు పన్నెండు మంది నాడ్తాంటే ఒక్క మనిషి నారు ఎదిగియ్యాలంటే సావుజంపలైతాంది. కానీ తప్పదు. ఎందుకొచ్చిన తంటా నిదానంగా నాటుకోవచ్చులే అనుకున్న ప్రతిసారీ గతమంతా కళ్ళముందు కదలాడుతోంది. తమని ఒంటరి చేసి వాళ్లంతా ఆటలాడ్డం, మొగున్ని కొట్టడం, స్టేషను మొహం ఎరుగని భర్తను జీపులో ఎక్కించుకుపోవడం మరీ ముఖ్యంగా 'మీ అంతు చూస్తా' అని పొగరుబట్టి శంకరయ్యకొట్టిన తొడ తాలూకు శబ్ధం ఇంకా చెవులు దాటి పోలేదు. అన్నీ ఒక్కొక్కటే మరింత శక్తినిస్తున్నాయి.

ఆ ఊపులో పరుగు పరుగున పోవడం ఒక్కటే అరవై డెబ్బై నారు కట్టలు సంచిలో కుక్కడం భుజానికెత్తుకుని ఆ బురదగెనాలమ్మిటి జారకుండా అర్థ కిలోమీటరు మాయిన నడవడం. అదొక యజ్ఞంలా సాగిపోతోంది. 'ఇదెక్కడి రాక్షసిరా నాయనా' అనుకుంటున్నారు ఆమె పంతం చూసేవాళ్లు. శంకరయ్యకైతే మొహంలే నెత్తురు చుక్క అనేదే లేదు. మధ్యాహ్నం సంగేటేల దాటింది. అన్నం చేసే వాళ్లెవురుండారు. ఎవ్వరూ లేరు ఇంటి దగ్గర. అన్నం లేకుంటే కూళోళ్లు బురదలో ఎక్కువ సేపు పని చెయ్యలేరు. యట్టరా భగమంతుడా అనుకుంటూ 'ఓబ్బీబ్బీ అంగడికాడికిపొయి అన్నం పార్సల్లు తెచ్చవా' బంగప్పడింది పక్క కయ్య వెంకట్రామున్ని. 'సరేత్తా' అని పొయి తెచ్చిచ్చాడు. ఆమె పడ్తున్న నరకయాతనకు మనసు కరిగిందేమో 'నువ్వు అన్నం తిని రాపోత్తా నారు నేను మోపిచ్చా' అని రెండు మూడు మూటెలు మోపిచ్చినాడు. అయినా గాని తిన్లేదు సంటెమ్మ. నారెదిగయ్యాల నారెదిగియ్యాలని ఖాళీ కడుపున అట్నే తిరిగుతాంది.

మొగున్ని పోలీసులు తీసుకపొయ్యారే అనే దిగులొకపక్క, ముందల్లా అవీ ఇవీ బాగా మట్లాడ్తారు ఇలా ఇరుకూ ఇబ్బందైనప్పుడు మాత్రం ఒక్కరూ తోడురాని ఈ పల్లె జనాలమింద ఒక రకమైన విరక్తి భావం మరోపక్క పొద్దటాంచి ఏమీ తినందాన కడుపులో తిప్పుతున్నా కూడా అట్నే తిరిగింది కసిగా. తొందర తొందరగా నడ్సడం వల్ల బురద గెనాలమ్మిటి నడుచ్చా ఒకసారి కిందకూడా పడింది. అయినా ఆమె పయణం ఆగలేదు.

ఉదయం మొదలైన వరి నాటు అనే యజ్ఞాన్ని ఎంతమంది రాక్షసులు అడ్డుకున్నా అంతులేని ఆత్మస్థైర్యంతో తనే దగ్గరుండి పూర్తి చేయించింది సంటెమ్మ. అప్పటికి ఎండ గుర్రాలను తోలి తోలి అలసిన సూర్యుడు పడమటి కొండల్లోకి దిగుపోవడానికి సిద్ధంగా ఉన్నాడు. గెట్టుమింద చూడగానే పచ్చని గాలికి నవ్వుతూ కదలాడాయి అప్పుడే పడిన నాట్లు. వాటిని చూసి ఒక మహా సామ్రాజ్యాన్ని ఒంటి చేత్తో జయించిన వీర సైనికుని మందహాసంలా చిక్కటి చిరు నవ్వు ఒకటి విరిసింది సంటెమ్మ మొహం మింద.

(సమాప్తం)

**వివేకానంద రెడ్డి లోమాటి వివేకానంద రెడ్డి లోమాటి స్వస్థలం కడప జిల్లా బద్వేల్ మండలం నందిపల్లె గ్రామం. తల్లిదండ్రులు సత్య నారాయణమ్మ, బాలవీరారెడ్డి. బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్) చదివారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. పుస్తకాలు చదవడం, ట్రెక్కింగ్ అంటే విపరీతమైన ఆసక్తి. ఆ అనుభవాలనే.. 'వివేక్ లంకమల' కలంపేరుతో కథలుగా మలుస్తున్నారు. పుట్టి పెరిగిందంతా పల్లెటూళ్లోనే. అందుకే.. ఈయన రచనల్లో కుటుంబం, వ్యవసాయం, పశువులు, అడవి నేపథ్యాలుగా కనిపిస్తాయి. కరువు సీమ, ఓబుల్రెడ్డి ఎద్దులు, యామయ్య గుర్రం కథలు పాఠకుల మెప్పు పొందాయి. తొంభైల కాలంనాటి పల్లెటూరి ప్రేమ కథ నేపథ్యంలో తీసిన 'అరణ్యవాసం' సినిమాకు కథ, కథనం, మాటలు అందించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పూర్తయి, పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మన చుట్టూ ఉన్న సమాజాన్ని, మనం చూసిన సంస్కృతిని అక్షరబద్ధం చేసి.. తర్వాతి తరాలకు కానుకగా అందించడమే కథ, నవల అంతిమ లక్ష్యమని వివేకానంద రెడ్డి విశ్వాసం.**



హైమావతికలివె

# బతుకు బొమ్మ

''ఒకసారి ఆలోచించు కీర్తి ! ఇంకో పది రోజుల్లో శ్రీజకు ఐదేళ్లు నిండుతాయి. ఇంకా ఆలస్యం చెయ్యకు. దానికి తోడుగా చెల్లెలో, తమ్ముడో వుంటే ఆడుకుంటుంది కదా. పెద్దయ్యాక కష్ట సుఖాల్లో తోడబుట్టిన వాళ్ళు తోడుగా వుంటారు.... ఇంకా ఏదో చెప్పబోతున్న తల్లి సుశీల మాటల్ని మధ్యలోనే అడ్డుకుంది కీర్తి.

అమ్మా ! ఎప్పుడూ ఈ టాపిక్ తప్ప ఇంకోటి మాట్లాడవా ? నీకు చాలా సార్లు చెప్పాను. శ్రీజకు మేము ఏ విషయంలోను తక్కువ చెయ్యడం లేదు. మంచి స్కూల్ లో చదివిస్తున్నాము. చాలా మంచి బొమ్మలు కొనిస్తున్నాము. మంచి ఏక్టివిటీ వున్న క్లాసుల్లో చేర్పిస్తున్నాము. అంతకంటే ఏమి కావాలి ? హాయిగా, సంతోషంగా వుంది. ఇంకోళ్ళుంటే తలనొప్పే. నర్సరీ క్లాసులో చేర్పించాలంటే ఒకటిన్నర లక్ష తీసుకుంటున్నారు,

అదీ కాస్త డీసెంట్ గా వుండే స్కూల్లో చేర్పిస్తే. ఉన్న ఒక్కరిని సక్రమంగా పెంచితే చాలు. తోబుట్టువులు సాయం చేస్తారనే ఆశలు పెట్టుకోకు. మీలాగా ఇప్పటి వాళ్ళు లేరు. కొట్టుకు ఛస్తున్నారు చిరాగ్గా అంది కీర్తి.

ఈ బీదరుపులు ఎందుకే ? ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా వున్నారు. ఆమాత్రం ఇంకో బిడ్డను పెంచలేరా ? మరీ విచిత్రం. తోడుగా ఇంకో బిడ్డ వుంటే పిల్లలు సంతోషంగా వుంటారు. ఎంత కొట్టుకున్నా ఒకరి మీద మరొకరికి ప్రేమ వుంటుంది. ఆ విషయం మర్చిపోకు. రెండో బిడ్డ విలువ వాళ్ళు పుట్టాక తెలుస్తుంది. నీకు అనవసరమైన ఆలోచనలు ఎక్కువయ్యాయి. ఇంకా ఆలస్యం చేయకండి..... కాస్త కోపంగా అంది సుశీల.

అమ్మా ! ఈ విషయం గురించి ఇంక మాట్లాడకు. నాకు చిరాకేస్తోంది. నీ కన్నా మా అత్తగారు ఎంతో నయం. ఒకసారి చెప్పారు. మా ఇద్దరి అభిప్రాయాలు చెప్పేశాము. ఆ తర్వాత ఆవిడ, మామగారు ఈ విషయంగా మాట్లాడ లేదు. నువ్వే సుత్తి కొడుతున్నావు. చిరాగ్గా అంటూ, శ్రీజ బర్త్ డేకి రెండ్రోజుల ముందే రండి... నాకు కాల్ టైమ్ అయ్యింది. వస్తా .... అంది కీర్తి.

సరే. అలాగే వస్తాము.... అంది సుశీల. ఇప్పుడు తృప్తిగా వుందా? అంటున్న భర్త మాటలకు తలెత్తి అతని వైపు చూసింది. ఏ మ ం టు నా ్న రు ? అర్థమయ్యేట్లు చెప్పండి.... అంది. మీ తల్లీ కూతుళ్ళ సంభాషణ వినబడుతూనే వుంది. అన్నిసార్లు నీ కూతురికి చెప్పి సుత్తి కొట్టొద్దు అనిపించుకోవడం బాగుందా ? ఇప్పుడు వాళ్ళు పెద్ద వాళ్ళయ్యారు. వాళ్ళ విషయంలో దూరి మాట్లాడితే బాగుండదు. మనకెందుకు ఈ విషయాలు. హాయిగా, ప్రశాంతంగా వుండాల్సిన వయసు మనది... అన్నాడు మాధవరావు. మీరలా అనుకుంటారు గానీ నేను అనుకోను. మన పిల్లలకు మంచి, చెడు చెప్పాల్సిన వాళ్ళం మనమే. వేరే వాళ్ళు చెప్పలేరు. సాధ్యమైనంత వరకు మనం నచ్చ జెప్పే ప్రయత్నం చెయ్యాలి. అది మన బాధ్యత... అంది సుశీల. అయితే చెప్పి వాళ్ళ చేత తిట్టించుకో. నేను మాత్రం చెప్పను.... అన్నాడు మాధవరావు.

అలాగే. పిల్లలకు మనం చెబితే బాగుండదు అని పరాయివాళ్ళలా నేను వుండలేను. సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తాను. 'పెదవికి మించిన పన్ను' అని తెలిసిన తర్వాత వూరుకుంటాను. తల్లిగా నేను కొన్ని విషయాలు చెప్పక తప్పదు.... అంటూ అక్కడి నుండి వెళ్ళి పోయింది సుశీల. 'తల్లులకు తాపత్రయం ఎక్కువ' .... అనుకుంటూ టీవీలో మొదలైన క్రికెట్ మేచ్ చూడసాగాడు మాధవరావు.

****

కరోనా ఉధృతం తగ్గడం వల్ల, ఒకే వూరు కావడం వల్ల చాలా నెలల తర్వాత కూతురి ఇంటికి వెళ్ళారు సుశీల, మాధవరావు. తనను చూడగానే సంబరంగా ఎదురొచ్చి, సంతోషంగా కౌగలించుకున్న కూతురిని చూడగానే సుశీలకు కంటనీరు తిరిగింది. ఎన్నాళ్ళయింది సుశీలా నిన్ను చూసి... అంటూ కౌగలించుకున్న తన స్నేహితురాలు, వియ్యపురాలు అయిన ఇందిరను చూసి సంతోషంతో ఉప్పొంగింది సుశీల మనసు. కరోనా వల్ల ఆత్మీయులకు దూరంగా వుండాల్సి వచ్చినందుకు నొచ్చుకుంటూ అందరూ ఆ విషయాల గురించే మాట్లాడుకున్నారు.

ఎన్నో రోజుల తర్వాత అమ్మమ్మను, తాతయ్యను చూసిన శ్రీజ వాళ్ళ దగ్గరే కూర్చుని ఆడుకోసాగింది. మర్నాడు జరగబోయే తన బర్త్ డే గురించి అందరికీ చెబుతూ సంబరంగా తిరిగింది.

శ్రీజ కోసం ఆన్ లైన్ లో బొమ్మ తెప్పిస్తానని అన్నావు. తెప్పించావా ? ఆత్రుతగా అడిగింది సుశీల. తెప్పించానమ్మా. అదే సెలెక్ట్ చేసుకుంది. విడియోలో చూసి ఆ బొమ్మ కావాలంది. అందుకనే దాన్ని తెప్పించాను. మీ గిఫ్ట్ అని చెప్పాను. రేపు రాత్రి వరకు శ్రీజకు చూపించను. సర్ ప్రైజ్ .అమెజాన్ లో వచ్చింది... అంది కీర్తి. పోనీలే దానికి నచ్చింది. సంతోషం. మాకు ఇవన్నీ తెలియవు. అందుకే నీకు చెప్పాను తెప్పించమని... అంది సుశీల. బయట ప్రపంచంతో సంబంధం లేకపోయే సరికి ఆన్ లైన్ వాళ్ళ పంట పండింది... అంది ఇందిర. నిజమే ఇందూ ! బైటికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి కాబట్టే ఒకే వూర్లో వున్నా ఆరు నెలల తర్వాత మీ ఇంటికొచ్చాను. ఎంత భయంకరమైన పరిస్థితో చూడు అంది సుశీల.

మా మాధురి వాళ్ళు పక్క బిల్డింగ్ లో వుండే ఫ్లాట్ లో చేరడం వలన నాకు అంత ఇబ్బంది కలగలేదు. లేకపోతే నీలాగే బాధ పడే దాన్నేమో... అంది ఇందిర. నిజం. మాధురి కూతురు పూజి, శ్రీజ ఒకే వయస్సు కాబట్టి ఇద్దరు కలిసి ఆడుకునే వాళ్ళు. లేకపోతే శ్రీజ సతాయించేది.. అంది కీర్తి. చాలా రోజుల తర్వాత కలిసిన సుశీల, ఇందిర కాలేజీ రోజుల నుండి మనవల పుట్టుక వరకు ఎన్నో సందర్భాలలో తాము కలిసి, ఆనందించిన మధురమైన ఘట్టాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు.

***

కోవిడ్ ప్రభావం తగ్గినా, అయిదారు మంది పిల్లలను మాత్రమే శ్రీజ పుట్టిన రోజు వేడుకకు పిలిచింది కీర్తి. పిల్లల కేరింతల మధ్య, ఆటల మధ్య ఆనాటి సాయంత్రం సందడిగా గడిచింది. శ్రీజ తమకు ఇచ్చిన బహుమతులను తీసుకుని పిల్లలు వెళ్ళిపోయారు. తమ పేర్లతో వున్న బహుమతులను శ్రీజకు అంద జేశారు ఇందిర, సుశీల దంపతులు.

తల్లి సహాయంతో ఆ గిఫ్ట్ బాక్స్ లను తీసి బొమ్మలను చూసిన శ్రీజ కళ్ళు సంతోషంతో మెరిసాయి. అధునాతనమైన వంట ఇంటి సామాను, ముద్దుగా వున్న ఆడపిల్ల బొమ్మ తెగ నచ్చేసి వాటితో ఆడటం మొదలు పెట్టింది శ్రీజ. అమ్మమ్మా ! ఈ బొమ్మ పేరు 'లైవ్ డాల్' . ఇది నీళ్ళు తాగుతుంది తెలుసా.. అంది

అందరూ ఆసక్తిగా ఆ బొమ్మ వైపు చూశారు. ముద్దుగా వున్న ఆ విదేశీ బొమ్మ నోరు కాస్త తెరిచినట్లుగా వుంది. చిన్న గ్లాస్ లో చిన్న చెంచా తీసుకొచ్చి ఆ బొమ్మ నోట్లో పోసింది. ఆ నీళ్ళు బొమ్మ గొంతులోకి వెళ్ళిపోయాయి. శ్రీజ సంబరంగా అమ్మమ్మ వైపు చూసింది. చూశావా ? బొమ్మ నీళ్ళు తాగేసింది.. అంది. అందరికీ చూసేందుకు సరదాగా అనిపించింది. ఆసక్తిగా చూడసాగారు.

శ్రీజ బొమ్మ ఫ్రాక్ ను పైకి జరిపి తడిసిన డైపర్ ను, బొమ్మను చూపించింది. చూశావా ! బామ్మా ! బొమ్మ నీళ్ళు తాగింది కదా ! ఇప్పుడు 'సు సు' పోయింది. అంటూ బొమ్మకు డైపర్ ను మార్చి ఇంకో డైపర్ ను వేసింది. అందరు పెద్దగా నవ్వారు. ఈ బొమ్మ నీళ్ళు తాగుతుంది. సు సు పోతుంది. అందుకే దీన్ని 'లైవ్ డాల్' అంటారు అంటూ తనకు చేతనైన భాషలో చెప్పింది శ్రీజ. సుశీల, ఇందిర ఒకరినొకరు చూసి నవ్వుకున్నారు. నీళ్ళు తాగడం, సు సు పోవడం తప్ప ఈ బొమ్మ ఇంకే పని చెయ్యదా ? ఇదేనా లైవ్ డాల్ ? గొంతు తగ్గించి మెల్లగా ఇందిరతో అంది సుశీల.

ఇద్దరికీ నవ్వాగ లేదు. అయినా ఇదెక్కడి ఖర్మే. చిన్న పిల్లలు హాయిగా ఆడుకోకుండా నీళ్ళు తాగించడం, పొత్తి గుడ్డలు మార్చడం .... ఇదేమి ఆట. పెద్దయ్యాక తప్పదు. ఇంత చిన్న వయసులో కూడా ఇదే ఆటా ...నవ్వుతూనే చిరాకు పడింది సుశీల. ఇద్దరు గొంతు తగ్గించి మాట్లాడుకున్నారు.

కీర్తికి అర్థమై నవ్వుకుంది. ఏం చెయ్యనమ్మా ? ఈ బొమ్మ కావాలని గోల. అందుకనే తెప్పించాను .. అంది. ఈ బొమ్మ వెల ఎంత ? అంది సుశీల. మూడు వేలా అయిదొందలు.. అంది కీర్తి. మూడు వేలా అయిదొందలా ? ఆశ్చర్యంగా అడిగింది సుశీల. అవునమ్మా .. అంది కీర్తి. సుశీలకు ఆ విషయం మింగుడు పడలేదు. డైపర్లు మారుస్తున్న మనవరాలిని చూస్తుంటే ఏమనాలో అర్థం కాలేదు. ఆ డైపర్లు కూడా టిష్యూ పేపర్లతో చేసినట్లు వున్నాయి. పడెయ్యక తప్పదు. అలాంటివి ఆరో ఏడో ఇచ్చారు. గంట లోపల ఖాళీ అయిపోతాయి. ఫారెన్ బొమ్మలు అబ్బో అనుకుంటాము. ఎంత దోపిడీ!. పోనీ గొప్పగా వుంటే పర్వాలేదు. ఆ బొమ్మ కూడా చూసేందుకు అంత గొప్పగా లేదు. బొమ్మలో పైనుండి కింది వరకు గొట్టం పెట్టి ఎంత దోపిడీ చేసారు ! ఎంత దండగ ! రెండ్రోజులు ఆడాక పిల్లలు ఒక పక్కన పడేస్తారు....

సుశీల మాటలు విని ఇందిర నవ్వాపుకోలేక అవస్థ పడింది. కాసేపటికి ఇద్దరూ

కుదుట పడ్డారు. పోనీలే ... పిల్ల ఇష్ట పడి ఆడుకుంటుంది... అని సర్ధుకున్నారు. తనతో బాటు ఆ బొమ్మతో ఆడుకునేందుకు తన వెంట తిరుగుతున్న పూజీకి బొమ్మను ఇవ్వకుండా శ్రీజ కోప్పడటం సుశీల దృష్టిలో పడింది. అలా చెయ్యకూడదు శ్రీజా ! పూజీతో కలసి ఆడుకోవాలి అంటూ నచ్చజెప్పింది.

***

మాధురి ఆహ్వానం మేరకు మాధవరావు, సుశీల వాళ్ళ ఇంటికి వెళ్లారు. ఇందిర సుశీలతో బాటు వెళ్ళింది. భోజనాలయ్యాక అందరూ కబుర్లలో పడ్డారు. పూజీ ! అన్నం తినిందా ? అంటున్న ఇందిరతో లేదమ్మా. అది రెండు రోజులుగా సరిగా తినడం లేదు. పేచీ పెడుతోంది. శ్రీజకు కొనిచ్చిన లైవ్ డాల్ కావాలని గొడవ. శ్రీజ కూడా చిన్న పిల్ల కదా. దాని బొమ్మ అది ఆడుకోవడానికి ఇవ్వదు. ఇది కూడా అలాగే చేస్తుంది. కొనిస్తాను అంటే వినదు. అర్జెంట్ గా కావాలంటుంది. ఆ బొమ్మ కొనడం వేస్ట్ అని అందరూ అంటుంటే నిజమే అనిపిస్తోంది. కానీ ఇవన్నీ పిల్లలకు అర్థం కావు. ఆ బొమ్మ కావాలని ఏడుపు. పిల్లలు అడగ్గానే కొనిస్తూ వుంటే అదే అలవాటై పోతుందని భయంగా వుంటుంది. అందుకే నేను ఆ బొమ్మ కోసం ఆర్డర్ చేయలేదు.. అంది మాధురి. ఇంతలో నెలల పాపాయిగా వున్న చిన్న కూతురు కావ్య ఏడవడంతో పాపను సముదాయించ సాగింది. ఇందిర, సుశీల పూజీని మాట్లాడించే ప్రయత్నం చేశారు.పూజీ పెద్దగా ఏడుస్తూ అమ్మమ్మా ! అంటూ ఇందిర ఒళ్ళో వాలింది. వెక్కిళ్ళ మధ్య 'లైవ్ డాల్' కావాలని చెప్పింది. ఇందిరకు ఎలా సముదాయించాలో అర్థం కాలేదు. చూడు పూజీ ! బొమ్మ కోసం ఇలా ఏడుస్తారా ? నీ దగ్గర ఎన్నో బొమ్మలున్నాయి. ఇవే బాగున్నాయి. అమ్మ, నాన్న ఎన్నో మంచి బొమ్మలు నీకు కొనిచ్చారు కదా. ఆ లైవ్ డాల్ బొమ్మ బాగా లేదు... అంది.

లేదు అమ్మమ్మా. చాలా బాగుంది. నేను కొనుక్కుంటా... అంది ఏడుస్తూ. జానకి సుశీల వైపు చూసింది. వినే స్థితిలో లేదు... మెల్లగా సుశీలకు మాత్రమే వినబడేటట్లు అంది. సుశీల పూజీ చెయ్యి పట్టుకుని ముద్దు పెట్టుకుంది. పూజీ ! శ్రీజ లైవ్ డాల్ నిజంగా బాగా లేదు. ఆ బొమ్మ నీళ్ళు తాగుతోందని అనుకుంటున్నావా ? అది నిజంగా తాగదు. దాని గొంతులో ట్యూబ్ లాగా పెట్టారు. మనం నీళ్ళు పోస్తే అవి ట్యూబ్ లోకి వెళ్తాయి. కిందకు వస్తాయి. అది సు సు అనుకుని డైపర్ మారుస్తోంది శ్రీజ... అంది.

పూజీ సుశీల వైపు చూసింది. నిజమా ? .. అంది. అవును పూజీ ! అది నిజం. ఆ బొమ్మ నవ్వుతుందా? సుశీల అడిగిన ప్రశ్నకు నవ్వదు అంటూ సమాధానం ఇచ్చింది పూజీ. పోనీ నువ్వు పిలిస్తే నీ వైపు చూస్తుందా ?. చూడదు. నువ్వు ఆడిస్తే

ఆడుకుంటుందా ?      ఆడుకోదు. అలాంటప్పుడు అది లైవ్ డాల్ ఎలా అవుతుంది ? లైవ్ డాల్ అంటే కదులుతూ ఆడాలి కదా ? సుశీల మాటలకు పూజీ ఆలోచనలో పడింది. కేరింతలు కొడుతూ, పాకుతూ, చిరునవ్వులు చిందిస్తున్న చిన్న మనవరాలు కావ్యను ఎత్తుకుని పూజీ పక్కన కూర్చుంది ఇందిర. కావ్య కేరింతలకు పూజీ నవ్వసాగింది. మళ్ళీ బొమ్మ గుర్తుకు వచ్చి పేచీ పెట్టింది.

చూశావా పూజీ ! పాపాయి నిన్ను చూసి నవ్వుతుంది. ఆడుకుంటుంది. అన్నం తింటుంది. నువ్వు కూడా పాపతో ఆడుకోవచ్చు. ఇంకొంచం పెద్దదైతే బుజ్జి పండు మాట్లాడుతుంది. కానీ లైవ్ డాల్ ఇవన్నీ చేయలేదు కదా. శ్రీజకు చెల్లెలు లేదు. ఆ బొమ్మతో ఆడుకుంటుంది. ఇప్పుడు చెప్పు. నీ చెల్లి బాగుందా ? ఆ బొమ్మ బాగుందా ? అంటున్న సుశీలతో చెల్లే బాగుంది. ఆ బొమ్మ పిచ్చిది... అంటూ చెల్లెల్ని ముద్దు పెట్టుకుంది పూజీ. రక్షించావు సుశీలా ! అంటూ ఇందిర పూజీతో మాట్లాడుతూ అన్నం తినిపించింది.

***

మూడు రోజులు గడిచాయి. ఈ పిచ్చి బొమ్మ నాకొద్దు. నీళ్ళు తాగుతుంది. సు సు పోతుంది. అంతే. చెల్లెలు, తమ్ముడు వుంటే నవ్వుతారు, ఆడుకుంటారు, మాట్లాడుతారు. నాకు బుజ్జి పండు లాగా చెల్లెలు కావాలి... ఏడుస్తున్న శ్రీజను చూసి ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయారు. ఎవరెంత సముదాయించినా శ్రీజ కుదుట పడలేదు. పూజీయే చెప్పింది. ఇది పిచ్చి బొమ్మని. చెల్లెలు బాగుంటుందని. ... వెక్కుతూ అంది శ్రీజ.      పొరబాటు చేశాను ఇందూ ! పూజీని సమాధాన పరిచేందుకు అన్న మాటలు ఇలా ఇంకో సమస్యను తెచ్చిపెడతాయని అనుకోలేదు. దిగులుగా అంటున్న సుశీలను ఓదార్చింది ఇందిర. చిన్న పిల్లల మాటలను పట్టించుకోకు. ఈ రోజు ఇలా అన్నా, మళ్ళీ మరచి పోతారు. అంది ఇందిర.

***

రెండ్రోజుల తర్వాత తమ ఇంటికి వెళ్ళారు సుశీలా, మాధవ రావులు. మూడు నెలలైనా శ్రీజ చెల్లెలు కావాలని అడుగుతూనే వుందని ఇందిర ద్వారా తెలిసినప్పుడు సుశీల తనను తాను మరోసారి తిట్టుకుంది.

***

ఏడాది తర్వాత రెండో మనవరాలి బారసాల చూస్తున్న సుశీల కళ్ళు ఆనందాశ్రువులతో నిండిపోయాయి. చెల్లెల్ని ప్రేమగా చూస్తూ సంబర పడుతున్న

శ్రీజను, పాపాయిని ముద్దు పెట్టుకుంటున్న తన కూతురు కీర్తిని చూస్తుంటే మనసులోని దిగులు మాయమైంది. తెలియని ఉత్సాహం, సంతోషం మనసులో నిండాయి. తడి బట్టతో శ్రీజ బొమ్మల మీద వున్న మట్టిని తుడుస్తున్న సుశీలకు 'లైవ్ డాల్' కనబడింది. దాన్ని కూడా శుభ్రం చేసింది. ఒక ప్రాణం లేని బొమ్మ ఒక జీవి పుట్టేందుకు ఎంత దోహదం చేసింది !... అనుకుంటూ నవ్వుకుంది.

***

**హైమావతి కలివె డిసెంబర్ 16, 1957లో మద్రాసులో జన్మించారు. బి.ఏ పూర్తి చేశారు. వివాహం అనంతరం భర్త ఉద్యోగరీత్యా మహారాష్ట్ర, హైదరాబాద్, బెంగుళూర్, పూనా, ఢిల్లీ మొదలైన ప్రాంతాల్లోనూ నివసించారు. ఆమె ఎన్నో కథలు, వ్యాసాలు రచించారు. ఆమె ఇంటర్మీడియెట్ చదివేటపుడు ఆంధ్రజ్యోతి దీపావళి సంచికలో "ఐస్‌క్రీం" అనే తొలి కథ ప్రచురించబడింది. తర్వాత అదే పత్రికలో అనేక వ్యాసాలు, పేరడీలు ప్రచురితమయ్యాయి. ఇప్పటి వరకు 11 నవలలు రాశారు. "శ్రీకృష్ణ దేవరాయలు" నవలకు సిరి కోన సాహితీ వాక్ఛులి లో నిర్వహించబడిన పోటీలో ప్రత్యేక బహుమతి పొందారు. ఈమె రాసిన కొన్ని కథలు, రేడియో నాటకం ఆకాశ వాణిలో ప్రసారమయ్యాయి. హిందీలోని "తీస్రీ మంజిల్" సినిమాను తెలుగులో నిర్మించినపుడు దాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. హైమావతి కలివె రాసిన కథల్లో "బతుకు బొమ్మ" కథ ఆమెకు మరింత గుర్తింపు తీసుకువచ్చింది. ఈమె కలం పేరు "హైమా భార్గవ్".**

# అస్తిత్వం



**గాజోజు నాగభూషణం**
**9885462052**

కలో...నిజమో.. తేల్చుకోలేని భ్రాంతిలో భర్త, పిల్లలు మిగతా కుటుంబ సభ్యులంతా ఆశ్చర్య పోతున్నారు. కోపమంటే ఏమిటో తెలియని ప్రసన్నవదనంలో ప్రకంపనలు.. అనునయంగా, మృదు మధురంగా మాట్లాడే కంఠంలో కల్లోల కెరటాల ఘోష, ఆవేశపు ఆనవాళ్ళు ఆవగింజంతైనా అగుపించని మనిషిలో కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహం. లోలోన మసిలీ, మసిలీ ఒక్కసారిగా బద్దలైన అగ్ని పర్వతంలోంచి ఉప్పొంగిన లావాలా ఎన్నేళ్ళుగానో అణచిపెట్టుకున్న ఆలోచనల సునామీ సుడిగుండపు తాకిడికి వాళ్ళంతా కొంతసేపు స్థాణువులై పోయారు.

భర్త, ఇద్దరు పిల్లలు ఒకవైపు తానొక్కతే ఒకవైపు ఉండి వాళ్ళు లేవనెత్తుతున్న ప్రతి ప్రశ్నకు ధీటైన సమాధానం చెప్పడమే కాకుండా భార్యగా, తల్లిగా, స్త్రీగా తాను పోషించిన భిన్న పాత్రల్లో తనకు దక్కిన గౌరవం, దొరికిన స్వేచ్ఛ, పొందిన తృప్తి గురించి తన ముప్ఫై ఏళ్ళ సంసార జీవితం

గడిచిన తరువాత, అందులోని డొల్లతనాన్ని సుమతి వెల్లడిస్తుంటే, ఒకింత న్యూనత భావనలో పడిపోయారు భర్త, ఇద్దరు పిల్లలు.

ఈ ఉత్కంఠకంతటికీ కారణం తన కూతురు శైలు పెళ్ళి

విషయం. రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామికవేత్త సురేంద్ర కొడుకుతో కూతురు శైలు పెళ్ళి ఖాయం చేద్దామని సుమతి భర్త మనోహర్ ఇంట్లో ప్రతిపాదించినపుడు, తను ప్రేమించి పెళ్ళి చేసుకుందామని అనుకున్న అబ్బాయి గురించి చెప్పింది శైలు. దానితో మొదలైంది ఇంట్లో యుద్ధం.

తన బిజినెస్ పార్టనర్ అయిన సురేంద్ర తనలాగే కోట్లకు అధిపతి. తన మనసులోని మాట చెప్పినపుడు సురేంద్ర అంగీకరించడంతో ఎంతో ఉప్పొంగిపోయాడు మనోహర్. తన బిడ్డకు దక్కబోతున్న గొప్ప అదృష్టంగా భావించాడు. కానీ, ఇప్పుడు తన కూతురు ఒక ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ను ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని చెప్పడంతో ఇంట్లో భీభత్స వాతావరణం నెలకొంది. భర్త, కొడుకులు శైలు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నపుడు, కూతురుకు రక్షణ గోడగా నిలవాలనుకుంది సుమతి. అందుకు బిడ్డపై తనకున్న ప్రేమ ఒక్కటే కారణం కాదు. తన జీవితంలో స్త్రీ అనుభవించిన మానసిక సంఘర్షణ కూడా కారణమే.

ఇంత ఆస్తి, అంతస్తు, సొసైటీలో మనకున్న పేరు ప్రతిష్ఠలు ఏవీ నీకు సంతృప్తినివ్వలేకపోగా, నీలో అనేక అసంతృప్తులు దాగి వున్నాయంటున్నావంటే దీన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు సుమతీ!

మీకే కాదు, చాలామంది మగవాళ్ళకు అర్థం కాదండీ. ఎందుకంటే, మీరు మీ కళ్ళతో మమ్మల్ని చూస్తూ, మీ మనసుతోనే అంచనా వేస్తారు. మీ అవగాహనా చట్రంలోంచే నిర్ధారణలు చేసి నిర్ణయాలు తీసుకుంటారు. మా గుండెపై చెవిపెట్టి, మా హృదయ స్పందనలు అర్థం చేసుకొనే స్నేహతత్వం ఎంతమంది మగవాళ్ళకు ఉంటుందండీ?

అదేంటమ్మా అట్లా అంటావు. నాన్నగారు నీకేం తక్కువ చేశారని. ఎన్నడూ నిన్ను అగౌరవ పరిచినట్లుగానీ, తక్కువ చేసినట్లు గానీ, నేనైతే చూడలేదమ్మా.

పెద్దవాడు ముగించగానే, చిన్నవాడు అందుకొని ఎన్ని కంఫరట్స్ ఉన్నాయమ్మా. నువ్వు ఏది కావాలంటే అది పొందే అవకాశముంది. పెద్ద బిజినెస్ మేన్ భార్యగా నీకుండే గౌరవ మర్యాదలున్నాయి. అయినా ఎన్నడూ లేని ఇంత అసంతృప్తి ఇప్పుడెందుకమ్మా?

నిజమేరా! అన్నీ ఎక్కువగానే ఉన్నట్లనిపిస్తుంది. దేనికీ లోటు లేనట్లే ఉంటుంది. నిర్ధారించేది మీరు కదా! మీరూ ఆ తాను ముక్కలే కదా! నాన్నగారిని రోల్ మాడల్ గా తీసుకొని, యువ పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్న సంపద పుష్పాలే కదా! పావురానికి పంజరానికి మధ్యనుండే పెనుగులాటను పసిగట్టే దృష్టి మీకెక్కడిదిరా! అగౌరవ పరచక పోవడమే మమ్మల్ని గౌరవించినట్లు కాదు. మా అభిప్రాయాల్ని గౌరవించినపుడే మమ్మల్ని గౌరవించినట్లు. ఒక తల్లిగా, నా బిడ్డ తీసుకున్న నిర్ణయాన్ని స్పష్టమైన అవగాహనతోనే సమర్థిస్తున్నాను. ఒక స్త్రీగా సరియైన సహానుభూతితోనే ఆమె ఆలోచనను స్వాగతిస్తున్నాను.

నాకు మాత్రం నా కూతురు జీవితం బాగుండాలని ఉండదా సుమతీ! ఆమె భవిష్యత్తు గురించి, నాకు మించి ఎవరు ఆలోచిస్తారు? సురేంద్ర కుటుంబం సంబంధాన్ని ఒప్పుకోవడమే అదృష్టంగా నేను భావిస్తుంటే, తల్లీ-బిడ్డలు మీరిద్దరూ అసాధారణమైన వాదన చేస్తున్నారు.

కోటీశ్వరుల సంబంధాన్ని కాదని, ఒక సాధారణ కుటుంబంలోకి వెళ్ళి మన కూతురు ఏం బావుకుంటుందో, సమర్థిస్తున్న నువ్వు సరియైన కారణాలను చూపగలవా?

కోట్ల సంపదతో కోర్కెలన్నీ తీరుతాయన్న భ్రమలో మీరున్నారండీ! నిజానికి సంపదలు ఎన్ని

రకాల సర్దుబాట్లను జీవితంలోకి మోసుకొస్తాయన్న నాణానికి రెండోవైపున్న కోణాన్ని మీరు గమనించలేరు. బాల్యం నుంచీ కన్న కలలు బంగారు పంజరంలో శిథిలమౌతాయి. మాకు తెలియకుండానే మా చుట్టూ అతిమర్యాదల అడ్డుగోడలు మొలుచుకొస్తాయి. క్రమక్రమంగా, వ్యవస్థీకృతమైన ఈ రంగుల ప్రపంచంలో మేము వివర్ణమై పోతుంటాము.

చెల్లెలికి సపోర్ట్ చేయాలన్న ఒకే ఒక అభిప్రాయంతో వాస్తవానికతీతంగా వాదిస్తున్నావు. కోటీశ్వరుడైన నాన్నను చేసుకొని, నీవేం కోల్పోయావో చెప్పగలవా అమ్మా అన్న పెద్దకొడుకు

మాటలకు వ్యంగ్యమైన నవ్వొకటి నవ్వింది సుమతి.

నేను కోల్పోయినవి చాలానే ఉన్నాయి కాబట్టే, నా కూతురు జీవితంలో పదిలపర్చుకోవాల్సిన కొన్ని మధురమైన అనుభూతులు చెదిరిపోవద్దని కోరుకుంటున్నా. నేను ఎం.ఏ. సోషియాలజీ చేసింది, సామాజిక శాస్త్రంగా మానవ సమాజాన్ని అధ్యయనం చేయాలన్న తీవ్రమైన కోరికతో. పి.హెచ్.డీ. చేయాలన్న నా ఆశలు పెళ్ళి పేరుతో ఆవిరయ్యాయి. ముప్పై ఏళ్ళ క్రితం అప్పుడప్పుడే బిజినెస్ లో నిలదొక్కుకుంటున్న మీ నాన్న నా ఉన్నత చదువును చూసి ఉత్సాహపడే నన్ను పెళ్ళి చేసుకోవడానికి ముందుకొచ్చారు. మా స్థాయికి మించి ఎంతో పైస్థాయిలో ఉన్న సంబంధం రాగానే, రీసర్చ్ వైపు వెళ్ళాలన్న నా కోరికను తుంచేసి, పెళ్ళిపీటల మీదికెక్కించారు మా నాన్న. పెళ్ళయ్యాక మీ నాన్న క్రమక్రమంగా అందనంత ఎత్తుకు ఎదిగారు.

సమాజ సంబంధాలను అధ్యయనం చేయాలన్న కోరిక గానీ, బోధనా రంగంలోకి వచ్చి, భావితరాన్ని తయారు చేయాలన్న ఆకాంక్ష గానీ, అథః పాతాళానికి చేరుకున్నాయి. వ్యాపారం విస్తరిస్తున్న కొద్దీ, ఆయన ప్రాథమ్యాలను పట్టించుకోవడానికే నా సమయమంతా వెచ్చించడ మనేది, నాకు తెలియకుండానే చాప కింద నీరులా జరిగిపోయింది. మంచులా నా కల శాశ్వతంగా కరిగి పోయింది. ఎన్నిసార్లు అనుకున్నానో... మన ఇంటి పనీ, వంట పనీ చేస్తున్న నౌకర్లకూ, నాకూ ఏమిటి తేడా అని. చదువుకున్న నేనూ, చదువుకోని వాళ్ళు అందరం ఈ నాలుగు గోడల మధ్యన పనుల కోసమే పరిమితమైన వాళ్ళమని.

నీ ఇంట్లో నీకు స్వేచ్ఛ లేదని, నీ సంపద నీకు ప్రతిబంధకమని ఎట్లా అనుకుంటావమ్మా అన్న చిన్న కొడుకు మాటలకు చిరాగ్గా చూసింది సుమతి.

ఇల్లంటే ఇన్నేసి రూములుండి, ఇన్ని అలంకారాలు – సౌకర్యాలతో ఇంద్రభవనంలా ఉంచుకోవడం కేవలం సోషల్ స్టేటస్ కోసమే. కడుపుకు కావలసిన ఆరోగ్యకరమైన ఫుడ్డు, అలసిన దేహాన్ని నిద్ర పుచ్చడానికి ఒక బెడ్డు, ఇంతకన్నా మించి కోట్ల రూపాయల విలువ చేసే ఈ ఇంటిలో ఏం వాడుకుంటామురా.. ఇక స్వేచ్ఛ అంటే ఎవరికి వాళ్ళు నిర్వచించుకొనేది. పుట్టినిల్లంటే ఆడపిల్లకు అత్యంత అపురూపమైనది. ఇక్కడి సౌకర్యాలు, మధ్యతరగతి వాళ్ళైన మా పుట్టింట్లో లేవన్న మిషతో అక్కడికి వెళ్ళడమే బంద్ అయిపోయింది. మా పుట్టింటి

సంబంధాల వాళ్ళిండ్లకు మనం పోము.. మన స్థితికి జంకి వాళ్ళూ ఇక్కడికి రారు. ఆ సంబంధాలన్ని దాదాపు కట్. ఎక్కడ నా స్వేచ్ఛ నాకు దొరికినట్లు.

మ్ఫు ఏళ్ళ సంసార జీవితంలో నీకు అన్నీ ఎక్కువే ఇచ్చానని ఇన్నాళ్ళు గర్వంగా ఫీల్ అయ్యే వాడిని సుమతీ! ఈ సంపద, బడా పారిశ్రామిక వేత్త మనోహర్ భార్యగా నీకున్న గౌరవం, ముఖ్యంగా ఎలైట్ గ్రూపుల్లో నీపట్ల చూపే ఆదరణ అన్నీ.. అన్నీ నీ హోదాను పెంచేవి, నిన్ను సంతృప్తిగా ఉంచేవే అనుకున్నాను. కానీ, ఒక్కసారి నేను గర్వంగా ఫీల్ అయ్యే అంశాలను, నువ్వు పనికిరానివన్నంత తేలికగా తీసిపారేశావు– దీనిని ఎలా చూడాలో తెలియడం లేదు.

ధనవంతుల ఇండ్లల్లో అందరూ అసంతృప్తులతోనే జీవిస్తారని నేను సాధారణీకరించి చెప్పడం లేదండీ! వ్యక్తుల మనస్తత్వాలు, ప్రాథమ్యాలపై ఆధారపడి మనుగడ ప్రకటితమవుతుంది! మీరన్నట్లు నాకు దక్కిన ప్రతి గౌరవమూ, మీ భార్యగా పొందుతున్నదే. నా స్వీయ అస్తిత్వాన్ని కోల్పోయి మీ నీడగానే గుర్తింపు పొందుతున్నాను. విద్యార్థిగా ఉన్నపుడు స్కూల్ టాపర్ గా ఉండి, టీచర్స్ చే అభినందనలందుకున్న ప్రతీసారీ, జీవితంలో నాకంటూ ఒక గుర్తింపును పొందాలి అని బలంగా అనుకొనేదాన్ని. అది కాలేజీ దాటి, యూనివర్సిటీ కొచ్చేసరికి మరింత బలంగా నాటుకుపోయింది. యూనివర్సిటీ కేంద్రంగా జరిగే అనేక ఉద్యమాలు, ప్రముఖుల ప్రసంగాలు నన్ను ఎంతో ఉద్వేగ పరిచేవి. స్త్రీలు, అణగారిన వర్గాల పట్ల జరుగుతున్న అన్యాయాలు, సమాజంలో పేరుకుపోయిన అంతరాలకు కారణాలను అన్వేషించి పరిష్కార మార్గాలు కనుగొనాలని స్థిరంగా అనుకొనేదాన్ని. కానీ, పి.జీ. అయిపోగానే పి.హెచ్.డి. చేయాలన్న నా కోరికల వెలుగును, పెళ్ళి అనే మేఘం కమ్మేసింది. నా చదువు, అందాన్ని చూసి కానీ కట్నం లేకుండా చేసుకుంటానన్న మీ ప్రతిపాదన మా నాన్నపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. నాకిప్పుడే పెళ్ళి వద్దు. ఇంకా చదువుకుంటానన్న నా వాదన వేదనగానే మిగిలిపోయింది. ఏడాది తిరిగేలోపు పెద్దవాడు, మరో రెండేళ్ళలో మరో ఇద్దరు పిల్లలు. ఊపిరి సలుపని ఒత్తిడే మిగిలింది.

'పెళ్ళి తరువాతనైనా నీ మనసులో కోరిక చెప్పి ఉండవచ్చు కదా సుమతీ!

పెళ్ళి తరువాత నా ప్రయారిటీస్ అన్నీ.. మీరు, మీ అవసరాలు, పిల్లలు– వారి పెంపకాల చుట్టే తిరిగాయి. విద్యార్థి నుండి ఇల్లాలిగా మారిన తరువాత నాకంటూ మిగిలిన చిన్న చిన్న కోరికలు చూడా క్రమంగా ఆవిరైపోయాయి. మీకు నా మీద అవ్యాజమైన ప్రేమ ఉంది. ఆ ప్రేమ సంపద రూపంలో, కంఫరట్స్ రూపంలో మీ మనసుకు కనిపిస్తుంది. మీ మగవాళ్ళకు విశాలమైన ప్రపంచం ఉంటుంది. మా ఆడవాళ్ళకు భర్త, పిల్లలు ఇల్లే లోకంగా మారిపోతుంది. కొత్త కొత్త స్నేహాలు, విస్తృతమైన సంబంధాలతో మీ ప్రపంచం విస్తరిస్తూనే ఉంటుంది. సమాజ సంబంధాలకు దూరమై, సంసార బంధాల్లో బందీ అయ్యి క్రమక్రమంగా ఏకాంత వాసంలోకి వెళ్ళిపోతాము మేము. ఇదంతా ఏదో కుట్రగానో, పథకం ప్రకారమో జరుగడమంటూ ఉండదండీ! ప్రకృతి నిర్దేశించిన పునరుత్పాదక బాధ్యత అనివార్యమైనదే అయినా, కుటుంబ వ్యవస్థ నిర్మాణం చేసిన ఇల్లాలి పాత్రే మా రెక్కలు కత్తిరించి ఎగిరే స్వేచ్ఛను హరిస్తుంది. నా కూతురు మళ్ళీ ఇదే సంపద సాలెగూటిలో చిక్కి గిలగిలలాడే కంటే, తను కోరుకున్న వ్యక్తితో,

కోరుకున్న జీవితాన్ని దక్కించుకుంటే నేనెంతగానో సంతోషిస్తాను.

ఎప్పుడో కానీ నోరు విప్పని అమ్మ, అప్పుడప్పుడు నా దగ్గరే తన మనసు విప్పి మాట్లాడేది నాన్నా! మీ అందరి ముందూ మౌనమునిలా ఉన్న అమ్మ ఎదలో ఎన్ని ఎండిన చెలిమెలున్నాయో తెలిసిన తరువాత, అమ్మ మనసుకు కావాలనే దగ్గరైన కొద్దీ స్త్రీగా నాలో అస్తిత్వ చైతన్యం మేలుకొంది.

అదే మన ఇంటికి వచ్చిన ఇద్దరు వదినలూ సంపన్న కుటుంబాల నుంచి వచ్చి, అదే సంపదకు కేంద్రమైన మన ఇంటి వాతావరణంలో హాయిగా, ఒకింత గర్వంగా జీవిస్తున్నారు. మధ్యతరగతి కుటుంబంలోంచి వచ్చినందుకే కాబోలు, అమ్మకు ఆ జీవితాల్లోని కలలు, కాంక్షలు, సొంత కాళ్ళపై ఎదిగి జీవితాన్ని గెలుచుకోవాలన్న ఆర్తి అధికంగా ఉండిందేమో!

నువ్వూ ఈ సంపన్న కుటుంబంలోనే పుట్టి పెరిగావు కదమ్మా! ఈ జీవితాన్ని కాదని, సాధారణ జీవితాన్నే కోరుకుంటున్నావా? వాస్తవాలు వేరుగా ఉంటాయి. అనుభవంలోకి వస్తే గానీ అవగతం కావు తల్లీ! నీ ముందుకు వచ్చిన విలాసవంతమైన జీవితాన్ని కాదని, ఒడిదుడుకుల జీవితాన్నే స్వాగతిస్తావా?'

విలాసాలు విశ్వాసాలకు విఘాతంగా మారుతాయని అమ్మ నుండే నేర్చుకున్నాను నాన్నా! ఇక మీరు ఒడిదుడుకులు అనుకుంటున్నారు. నేను జీవితాన్ని గెలుచుకోవడంలో ఉన్న ఆనందాన్ని.. అదీనూ, నిత్య నూతన అనుభవాల సమాహారమైన అనుభూతుల సారమైన జీవితాన్ని జీవించాలన్న స్పష్టమైన అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అందుకు మీ ఆశీర్వాదం కావాలి నాన్నా!

ఇప్పుడు మనోహరకు వాదించడానికి ఏ కారణాలు కనిపించడం లేదు. అనుమానించడానికి ఏ సంశయాలూ లేవు. ఉరుములు, మెరుపులతో అల్లకల్లోలమైన ఆకాశం నిర్మలంగా మారినట్లు, అనేక సంఘర్షణలతో సతమతమైన మనోహర్ మనసు తేలికపడగా, రెండు చేతులూ సాచి సుమతినీ, శైలునూ చెరోవైపు పొదివి పట్టుకున్నాడు.

* * *

***గాజోజు నాగభూషణం వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తిరీత్యా కవి, రచయిత, గాయకుడు కూడా! 'మట్టి సరిగమలు', 'ప్రాణ దీపం' కవిత్వ సంకలనాలను వెలువరించారు. తెలంగాణ ఉద్యమ గేయాలు రాసి, స్వయంగా పాడి.. 'నెత్తుటి గాయాలు' పేరుతో సీడీలుగా తీసుకొచ్చారు. ఇప్పటివరకు పది కథలు రాశారు. 'ప్రాణ దీపం' పుస్తకానికి రెండు రాష్ట్రస్థాయి పురస్కారాలు దక్కాయి. అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారంతోపాటు ఇతర పురస్కారాలను అందుకున్నారు. ఉత్తమ చిత్రాలను ప్రోత్సహించే కరీంనగర్ ఫిలిం సొసైటీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. '2009 టీవీ నంది అవార్డ్స్' జ్యూరీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 'తెలంగాణ రచయితల వేదిక' రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు.***

# నిషేధిత స్వప్నం



కడెం లక్ష్మీ ప్రశాంతి
**78933 99773**

"అనూ.. అనూ! పిలుస్తుంటే పలకవేం!? ఏంటా పరధ్యానం? ఎప్పుడూ ఏదో లోకంలో ఉంటావ్! ఆఫీస్‌కు వెళ్తున్నా.. తలుపేసుకో!" అంటూ లంచ్‌బాక్స్ తీసుకుని హడావుడిగా వెళ్లిపోయాడు హర్ష. తన సమాధానం కోసం కూడా చూడకుండా వెళ్తున్న అతణ్ని చూసి.. దీర్ఘంగా నిటూర్చింది అనూహ్య. ఈమధ్య ఆమెకు జీవితం పట్ల చాలా అసంతృప్తిగా ఉంది. నిజం చెప్పాలంటే పెళ్లయినప్పటి నుంచీ అలాగే ఉంది. ఈమధ్య కాలంలో తారాస్థాయికి చేరిందంతే! అనూహ్య ఈ విషయం చాలాసార్లు భర్తకు చెప్పాలని ప్రయత్నించింది. కొన్నిసార్లు చెప్పింది కూడా. అయినా అతని ధోరణిలో మార్పు రాకపోగా.. ఎక్కడలేని ఆశ్చర్యాన్ని ప్రదర్శించాడు."పనికిమాలిన పుస్తకాలు చదివి మనసు పాడు చేసుకుంటున్నావు" అన్నాడు.

అనూహ్యకు ఒక్కసారిగా తన జీవితమంతా కళ్లముందు కదిలింది.

అనూహ్యకు చిన్నప్పటి నుంచీ నానమ్మ %--% తాతయ్య దగ్గరే చేరిక ఎక్కువ. సాహిత్యాభిమానులైన వాళ్లిద్దరూ, అనూహ్యకు కూడా బాల్యం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేశారు. ఆమె ఇంజినీరింగ్‌కు వచ్చేసరికి.. విశ్వనాథ నుంచి చలం వరకూ అందరి పుస్తకాలూ చదివేసింది. ముఖ్యంగా చలం.. అభిమానిగా మారిపోయింది. ఇంజినీరింగ్ పూర్తికావడంతోనే ఉద్యోగం రావడంతో వెంటనే జాయిన్ అయిపోయింది అనూహ్య. తన కజిన్ పెళ్లికి వెళ్లిన అనూహ్యను చూసిన హర్ష, ఆమెను ఇష్టపడి తన తల్లితండ్రులతో అనూహ్య వాళ్లింట్లో మాట్లాడించాడు. పేరున్న కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మంచి జీతం. ఎలాంటి బాధ్యతలు లేవు.

ఏ ఆడపిల్ల తల్లిదండ్రులకైనా.. చాలా అనుకూలమైన సంబంధం. అందువల్ల కాదనడానికి ఏ అభ్యంతరం కనిపించలేదు. అయినా కూడా తుది నిర్ణయం అనూహ్యకే వదిలేశారు. హర్ష, అనూహ్య ఇద్దరూ ఓ రెస్టారెంట్‌లో కలుసుకున్నారు. పరిచయాలు అయ్యాక.. అనూహ్య తన అభిప్రాయాల్ని చెప్పడం మొదలుపెట్టింది.

"హర్షా! నేను మొదటినుంచీ చాలా స్వేచ్ఛగా పెరిగాను. నా జీవితాన్ని నాకు నచ్చినట్టుగా తీర్చిదిద్దుకున్నాను. పెళ్లి తర్వాత కూడా నేను జాబ్ చేస్తాను. నా స్వేచ్ఛనూ, ఇండిపెండెన్స్‌ని వదులుకోను. పెళ్లి తర్వాత ఇంటి పనులే కాదు. పిల్లల బాధ్యత కూడా ఇద్దరం పంచుకోవాలి".

ఆమె చెప్పిందంతా చిరునవ్వుతో విన్న హర్ష..

"అనూహ్య! నేను ఏరోజూ నీ స్వేచ్ఛకు అడ్డురాను. జాబ్ చెయ్యాలా? వద్దా? అనేది కూడా నీ ఇష్టం. ఇంటి పనులు, పిల్లల పెంపకం పూర్తిగా ఆడవాళ్ల పని అనుకునేంత మూరు□ణ్ని కాదు!" అన్నాడు అదే చిరునవ్వుతో!

అనూహ్య తనకు పుస్తకాలు చదవడం చాలా ఇష్టమని, చలం తన అభిమాన రచయి-ంతని చెప్తే.. అతను మాత్రం తను పెద్దగా బుక్స్ చదవననీ, సినిమాలు చూస్తానని చెప్పాడు. కాకపోతే ఆమె అభిరుచులకు ఏనాడూ అడ్డు చెప్పనన్నాడు. ఆ మాటతో అనూహ్య మొహం వికసించింది. ఇద్దరూ తమ అంగీకారాన్ని ఇంట్లో తెలియజేశారు. నెలలోనే మంచి ముహూర్తం కుదరడంతో.. వాళ్ల పెళ్లి జరిగిపోవడం, అనూహ్య అత్తారింటికి వెళ్లిపోవడం చకచకా జరిగిపోయాయి. అనూహ్య చెప్పినట్టుగానే.. ప్రతిరోజూ ఇంటి పనుల్లో భాగం పంచుకుంటున్నాడు హర్ష. వారాంతాల్లో సినిమాకో, రెస్టారెంట్‌కో వెళ్లడం.. అప్పుడప్పుడూ లాంగ్‌డ్రైవ్‌లతో జీవితం సాగిపోతున్నది.

కాలం గడిచేకొద్దీ అనూహ్యలో అసంతృప్తి చోటు చేసుకుంటున్నది. హర్ష తనకేమీ లోటు చెయ్యడు. ప్రేమగానే చూసుకుంటాడు. కానీ, రాత్రి అయ్యేసరికి తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా అతనికి నచ్చినట్టు ప్రవర్తిస్తాడు. తన అవసరం తీరగానే పడుకోవడమో లేదంటే ఫోన్ చూసుకోవడమో చేస్తాడు తప్ప.. తనను పట్టించుకోవడం కాదు కదా, కనీసం తన ఉనికిని కూడా గుర్తించనట్టుగా ఉంటాడు. ఈ పరిస్థితిని కొన్ని నెలలవరకూ భరించిన అనూహ్య, ఇక భరించడం తనవల్లకాక హర్షతో మాట్లాడటానికి నిశ్చయించుకుంది. తనను దగ్గరికి తీసుకుంటున్న భర్తతో..

"నీతో మాట్లాడాలి హర్షా!" అన్నది.

"ఇది మాట్లాడే టైమా అనూ!? ఏదైనా ఉంటే మార్నింగ్ మాట్లాడుకుందాం".

"ప్లీజ్! నేను చెప్పేది విను".

"సరే! ఏంటో చెప్పు?".

"నీ బిహేవియర్ ఇబ్బందిగా ఉంది హర్షా! బెడ్రూమ్‌లో నీకు నచ్చినట్లు ఉండమని ఒత్తిడి చేస్తావే కానీ, నాకెలా ఉంటే ఇష్టమో ఒక్కసారైనా ఆలోచించావా?".

"అనూహ్య!" అన్నాడు ఎర్రబడ్డ మొహంతో.

"నన్ను పూర్తిగా మాట్లాడనివ్వు హర్షా! నేనూ మనిషినే. బొమ్మను కాను.. నీకు నచ్చినట్టు వాడుకొని పక్కకు తోసేయ్యడానికి. నాకూ కొన్ని కోరికలు ఉంటాయని ఎందుకు ఆలోచించవ్? భార్యాభర్తల సంగమంలో ఇద్దరూ ఆనందాన్ని చవిచూడాలి కానీ, ఒకరి ఆనందం ఇంకొకరికి బాధను మిగల్చకూడదు. అణువణువూ ప్రేమ తొణికిసలాడే అనుభవం, రెండు మనసులు సంతోషంతో నర్తించే అనుభవం కావాలి హర్షా! ఏ అనుభూతిలేని అనుభవాన్ని భరించలేకపోతున్నా. ఈ సంగతి నీకు మన ఫస్ట్‌నైట్ అప్పుడే చెప్పాల్సింది. నువ్వే అర్థం చేసుకుంటావని అనుకున్నా. పెళ్లయి పదినెలలు అవుతున్నా.. నువ్వు నావైపు నుంచి ఆలోచించక పోవడంతో, నేనే చొరవ తీసుకొని చెప్తున్నాను"..

తన మనసులో మాట చెప్పింది అనూహ్య.

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలుస్తున్నదా అనూహ్యా! అసలు ఏ భార్యయినా భర్తతో ఇలా మాట్లాడుతుందా? నువ్వింత విచ్చలవిడిగా మాట్లాడుతావని నేనస్సలు అనుకోలేదు"..

కోపంతో ఊగిపోతూ అంటున్న అతణ్ని చూసి ఆశ్చర్యపోయింది ఆమె. తను ఏం తప్పుగా మాట్లాడిందో ఆమెకు అర్థం కాలేదు. ఏ భార్యయినా తన కోరికల్ని భర్తతో కాక ఎవరితో చెప్పుకొంటుంది? ఇందులో విచ్చలవిడి తనమేముంది? ఒక స్త్రీ తన శారీరక వాంఛల గురించి కట్టుకున్న భర్తకు కూడా చెప్పకూడదా? ఆలోచనల్లో మునిగిపోయిన అనూహ్య.. హర్ష కోపంతో వేరే బెడ్రూమ్‌లోకి వెళ్లిన సంగతి గమనించలేదు.

"పెళ్లికి ముందు.. 'నాకు పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం' అని నువ్వు చెప్తే ఏంటో అనుకున్నాను.. ఇలాంటివి చదువుతావని అనుకోలేదు"..

వ్యంగ్యంగా అంటున్న భర్తవైపు ఆశ్చర్యంగా చూసింది అనూహ్య.

"మీ చలం గురించి గూగుల్ చేశాను. అతను స్త్రీ స్వేచ్ఛ పేరుతో ఆమెలోని సెక్సువల్ ఫీలింగ్స్‌ను ప్రోత్సహిస్తూ కథలు రాస్తాడట కదా!? ఇలాంటి పుస్తకాలు చదివే ఆడవాళ్లతో కాపురం చెయ్యడం చాలాకష్టం. ఇకనుంచైనా ఆ పుస్తకాలు చదవడం మానెయ్"..

అంటున్న అతణ్ని చూస్తే అసహ్యం వేసింది.

'ఇలాంటి వాళ్లకు చలం పుస్తకాలే కాదు.. స్త్రీ హృదయమూ ఎన్ని జన్మలెత్తినా అర్థం కాదు. ఇక అతనితో మాట్లాడటం వల్ల లాభం లేదు' అనుకొని మౌనంగా ఉంది. హర్ష మాత్రం రోజూ ఏదో ఒక వంకన ఎత్తిపొడుపు మాటలు మాట్లాడటం మానలేదు.

ఆ సూటిపోటి మాటలు అనూహ్యకు విసుగు తెప్పిస్తున్నాయి. ఎలాంటి స్పందనలు లేకుండా, కేవలం మగవాడు కోరున్నట్లు నడుచుకోవడానికే స్త్రీ ఉన్నదని భావించే అతణ్ని చూస్తుంటే చిరాగ్గా అనిపిస్తున్నది. చక్కగా చదువుకొని, మంచి పొజిషన్‌లో ఉన్న అతను.. ఆడవాళ్ల విషయంలో ఇంత సంకుచితంగా ఆలోచించడం అనూహ్య జీర్ణించుకోలేక పోతున్నది.

తనమీద చెయ్యి పడ్డట్టుగా అనిపించడంతో మెలకువ వచ్చింది అనూహ్యకు. ఎదురుగా తనను దగ్గరికి తీసుకుంటున్న భర్తను చూడగానే.. ఆమెకు ఎక్కడలేని కోపం వచ్చింది. వారం నుంచి తనను మాటలతో వేధిస్తున్న అతను, తన అవసరానికి

దగ్గరవడం సహించలేక పోయింది. అతని చేతిని విసురుగా నెట్టేసి వెళ్లిపోబోతున్న ఆమెకు.. బలవంతంగా దగ్గరయ్యాడు.

జరిగింది తలుచుకుంటుంటే అనూహ్య మనసు అవమానంతో రగిలిపోతున్నది. భార్యను రేప్ చేసే స్థాయికి దిగజారిన హర్ష అంటే.. ఆమెకు అసహ్యం వేస్తున్నది.

ఏమనుకుంటున్నాడు తన గురించి? భార్యే కదా.. ఏం చేసినా పడుంటుందని అనుకుంటున్నాడేమో!? ఆయనలో మార్పు వస్తుందేమోననే ఇంతకాలంగా ఎదురుచూసింది. మారడం కాదు కదా.. మరీ రాక్షసుడిలా తయారవుతున్నాడు. ఇక సహించే ఓపిక తనకు లేదు. ఏం చేయాలో నిర్ణయించుకుంది అనూహ్య. చెప్పా పెట్టకుండా ఇంటికి వచ్చిన కూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది రాధ.

"బాగున్నావా అనూ!? ఫోన్ అయినా చేయలేదు. ఒక్కదానివే వచ్చావేం. అల్లుడుగారు ఏరీ?".

ప్రశ్నల వర్షం కురిపిస్తున్న కోడల్ని..

"అబ్బా రాధా! ముందు దానికి తాగడానికి ఏమన్నా తీసుకురా!".. అని కోడల్ని మందలిస్తూనే.. మనవరాలి చేతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకున్నది తులసమ్మ.

తిండీ, నిద్ర లేనట్టు పీక్కుపోయి ఉన్న ఆమె మొహాన్ని చూసి గతుక్కుమంది రాధ.

"ఏంటే అలా ఉన్నావు? హర్షా, నువ్వూ బానే ఉన్నారు కదా!?"..

కంగారుగా అడుగుతున్న తల్లిని చూసి, క్షణకాలం కలవరపాటు చెందినా అంతలోనే తేరుకొని..

"అమ్మా! అనవసరంగా టెన్షన్ అవ్వకు. మేమిద్దరం బాగానే ఉన్నాం. ఆఫీస్ పని ఎక్కువ అవడం వల్ల కాస్త రెస్ట్‌లెస్‌గా ఉందంతే!" తల్లికి సర్దిచెప్పింది.

కూతురి మాటలతో తేలికపడ్డ రాధ.. అనూహ్యకు ఇష్టమైన ఉల్లిపకోడీ చేయడానికి వంటింట్లోకి వెళ్లింది. మనవరాలు నిజం చెప్పడంలేదన్న సంగతి తులసమ్మ గ్రహించినా.. అడగడానికి సమయం కాదని ఊరుకుంది. తల్లి చేసిపెట్టిన పకోడీ తింటూ కబుర్లలో మునిగిపోయిన అనూహ్య.. ఫోన్ రింగ్ అవడంతో హ్యాండ్‌బ్యాగ్‌లోంచి ఫోన్ తీసింది. డిస్‌ప్లేపై నెంబర్ చూడగానే.. తాత్కాలికంగా మర్చిపోయిన కోపం, బాధ ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. పక్కన అమ్మ, నానమ్మ ఉండటంతో సర్దుకొని, ఫోన్ లిఫ్ట్ చేసింది.

"అనూ! నేను ఆఫీస్ పని మీద చెన్నై వెళ్తున్నాను. నువ్వు ఆఫీస్ నుంచి మీ ఇంటికి వెళ్లు. నేను తిరిగి రాగానే మన ఇంటికి వద్దువు!"..

అసలేం జరగనట్టు మాట్లాడుతున్న భర్తపై కోపం రెట్టింపయ్యింది. ఇంట్లో వాళ్లముందు బయటపడటం ఇష్టంలేక.. అన్నిటికీ 'ఊఉ' కొట్టింది.

రాత్రి భోజనాల్లో అనూహ్యకు ఇష్టమైన వంటలన్నీ చేసి కొసరికొసరి తినిపించారు రాధ, తులసమ్మ.

అన్నం తినగానే బల్లున వాంతి చేసుకుంటున్న అనూహ్యను చూసి, ఇంటిల్లిపాది కంగారుపడ్డారు. హాస్పి

టల్‌కు వెళ్దామని హడావుడి చేస్తున్నవారిని వారించి తన గదిలోకి వెళ్లింది. వంటిల్లు

సర్ది, కూతురి గదిలోకి వచ్చిన రాధ.. అనూహ్యను తన ఒళ్లోకి తీసుకుంటూ..

"అనూ తల్లీ! ఆరోగ్యం బానే ఉంటుందా? పీరియడ్స్ రెగ్యులర్‌గా వస్తున్నాయా?" అని అడిగింది.

అప్పుడు గుర్తొచ్చింది తనకు.. డేట్ అయిపోయి పదిరోజులు దాటినా, తనకు ఇంకా పీరియడ్స్ రాలేదని. ఈ గొడవల్లో పడి ఆ సంగతే గమనించలేదు. కాస్త ఒంట్లో నలతగా ఉన్నా పట్టించుకోలేదు.

"ఎప్పుడూ రెగ్యులర్‌గానే ఉంటాయి. ఈ నెలలోనే రాలేదు" అని చెప్పింది.

ఆ మాట వినగానే.. తన అనుమానం నిజమేనేమోనని సంతోషించింది రాధ.

"రేపు ఆఫీస్‌కు సెలవు పెట్టు. హాస్పిటల్‌కు వెళ్దాం!" అన్నది కూతురితో!

తల్లి ఆంతర్యాన్ని గ్రహించిన అనూహ్య..

"ఈమాత్రం దానికి లీవ్ ఎందుకమ్మా? నేను ఆఫీస్ నుంచి వచ్చేటప్పుడు కిట్ తెచ్చుకొని, ఇంట్లో టెస్ట్ చేసుకుంటాను" అన్నది.

అంతకుముందే అక్కడికి వచ్చి, వాళ్ల సంభాషణ విన్న తులసమ్మ..

"అమ్మ చెప్పినట్టు వినవే అమ్మడూ! రేపొక్కరోజు సెలవు పడేస్తే.. శనివారం, ఆదివారం కలిసొస్తాయి. నువ్వు కాస్త విశ్రాంతి తీసుకున్నట్టు ఉంటుంది. రెండ్రోజులు మాతో ఉన్నట్టూ ఉంటుంది!".

"సరే నానమ్మా!" అంటూ తలూపింది అనూహ్య.

అనూహ్యను సిటీలోనే పేరున్న హాస్పిటల్‌కు తీసుకెళ్లింది రాధ. పరీక్షల అనంతరం అనూహ్య తల్లి కాబోతున్నదని నిర్ధారించారు డాక్టర్. ప్రిస్క్రిప్షన్‌తోపాటు తీసుకోవాల్సిన ఆహారం, చెకప్‌కు ఎప్పుడు రావాలో తదితర వివరాలతో కూడిన చార్ట్ ఇచ్చారు.

అనూహ్య ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.'అనూహ్యను ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలి. పుట్టబోయేది పాపా? బాబా? పాప అయితే ఏం పేరు పెట్టాలి? బాబు అయితే ఏం పేరు పెట్టాలి?' అని సంబురంగా మాట్లాడుకుంటున్నారు ఇంట్లోవాళ్లు.

వీళ్ల మాటలతో తనకేం సంబంధం లేదన్నట్టు.. మందలోంచి తప్పిపోయిన మేకపిల్లలా ఒక పక్కన కూర్చుంది అనూహ్య. తనకు తానుగా దగ్గరయ్యే అవకాశం హర్ష ఎప్పుడూ కల్పించలేదు. అతని సాన్నిధ్యంలోని ఆనందాన్ని చవిచూడకుండానే తాను తల్లి కాబోతున్నదంటే.. తన హృదయం బాధగా మూలిగింది. అప్రయత్నంగా ఆమె చేతులు పొట్ట మీదికి వెళ్లాయి. తనలో ఒక జీవి ప్రాణం పోసుకుంటున్నదనే ఊహే.. ఆమెకు అద్భుతంగా అనిపించింది. పూర్తి ఆకృతైనా దాల్చని ఆ బిడ్డపై అవ్యాజమైన ప్రేమ కలిగింది ఆమెకు.

"అనూ! అల్లుడుగారి నుంచి ఫోన్!"..

అంటూ వచ్చిన తల్లి చేతిలోంచి ఫోన్ తీసుకుని..

"హలో!" అన్నది అనూహ్య.

"థాంక్యూ వెరీమచ్ రా! నాకెంత హ్యాపీగా ఉందో తెలుసా!? ఆంటీ చెప్పగానే

నీముందు వాలిపోవాలని అనిపించింది. కానీ, ఏం చేయను? వర్క్ ఉండిపోయింది. టూడేస్‌లో వచ్చేస్తాను. టేక్ కేర్ రా!"..

అంటూ అతను ఇంకా ఏదో చెప్పబోతుంటే..

"హర్షా! నాకు చాలా నీరసంగా ఉంది. రెస్ట్ తీసుకుంటాను".. మరోమాటకు అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది. భర్త ఫోన్.. తన సంతోషాన్ని నాశనం చేసినట్టు అనిపించింది.

"అల్లుడుగారు ఎన్నిసార్లు ఫోన్ చేసినా నువ్వు తియ్యకపోతే ఏమైందోనని నాకు కాల్ చేశారు. మాటల సందర్భంలో విషయం చెప్పేశాను. సారీ రా!"..

అపాలజిక్‌గా అంటున్న తల్లిని చూసి,

"పర్లేదమ్మా!" అంటూ నవ్వేసింది అనూహ్య.

"అమ్మడూ! ఆదివారం కూడా పనేంటే? ఆ ల్యాప్‌టాప్ పక్కన పెట్టు. సరదాగా మాట్లాడుకుందాం. మళ్లీ మీ ఆయనొస్తే తుర్రుమంటూ వెళ్లిపోతావ్".. అనూహ్య దగ్గర కూర్చుంటూ అన్నది తులసమ్మ.

నానమ్మ మాటలకు ల్యాప్‌టాప్ మూసేసింది.

"అమ్మడూ! వచ్చినప్పటినుంచీ చూస్తున్నా. అదోలా ఉన్నావ్. ఏమైంది నా తల్లికి?".. మనవరాలి తలను ఆప్యాయంగా నిమురుతూ అడిగింది. ఆమె చూపించే ప్రేమకు కరిగిపోయిన అనూహ్య..

తులసమ్మ గుండెలపై వాలిపోయి, తన మనసులో గూడు కట్టుకున్న ఆవేదనంతా చెప్పింది.

అక్కడే ఉండి వాళ్ల మాటలు విన్న రాధ..

"ఏం మాట్లాడుతున్నావ్ అనూ!? ఏ అనుభూతులూ లేకుండానే తల్లివి అవుతున్నావా? మగడన్నాక కాస్త తొందరపాటు సహజం. చూసీచూడనట్టు సర్దుకుపోవాలి కానీ, సంసారాన్ని పాడు చేసుకుంటావా? పదినెలలుగా హర్షను చూస్తూనే ఉన్నాం. అతను చాలా మంచివాడు. నువ్వు లేనిపోనివి ఆలోచించడం మానేసి అతనితో సవ్యంగా ఉ ండు.." అంటున్న కోడల్ని వారించింది తులసమ్మ.

"అది మీ గారాబం వల్లే ఇలా తయారయ్యింది. ఇప్పుడు ఎలా నచ్చచెప్తారో చెప్పి వాళ్లిద్దరూ అన్యోన్యంగా ఉండేటట్టు చూడండి".. రుసరుసలాడుతూ అక్కణ్నుంచి వెళ్లిపోయింది రాధ.

తల్లి మాటలకు స్థాణువైపోయిన మనవరాల్ని చూస్తుంటే జాలేసింది తులసమ్మకు.

"నానమ్మా! నా భర్త నా ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా నాతో సంసారం చేస్తున్నాడు. కాదంటే రేప్ చేస్తున్నాడు" అని చెప్తున్న మనవరాలితో..

'సర్దుకుపో తల్లీ!' అని ఎలా చెప్పగలదు. కానీ, చెప్పాలి. తప్పదు.

"అమ్మడూ! నీ బాధ నేనర్థం చేసుకోగలను. కాలం మారినా ఆడది తన లైంగిక

వాంఛలను వెల్లడించుకునే స్వేచ్ఛ రాలేదు. మగాడికి అనుకూలంగా ఉండాల్సిందే తప్ప మన కోరికల్ని బయటపెడితే తట్టుకునే భర్తలు ఎక్కడున్నారు? వినడానికి కష్టంగా ఉన్నా ఇదే నిజం. నువ్వు నీకోసమే కాదు. నీ కడుపులో బిడ్డ కోసం కూడా ఆలోచించి, మంచి నిర్ణయం తీసుకోరా!"..

కన్నీళ్లతో తన మొహంలోకి చూస్తున్న మనవరాలి చూపుల్ని తట్టుకునే శక్తి లేక.. అక్కణ్నుంచి వెళ్లిపోయింది తులసమ్మ.

ఇంట్లో అందరూ ఒకటేమాట. తనను సర్దుకుపొమ్మని. హర్షను తప్పు పట్టకపోగా.. మగాడు అలాగే ఉంటాడని సమర్థింపు. ఆడదాని సుఖసంసారానికి పిల్లలు పుట్టడమే చిహ్నంగా భావిస్తున్నది అమ్మ. పిల్లలు ఉన్నవాళ్లందరూ భర్తతో సుఖంగా ఉన్నట్టేనా? తమ అమ్మాయిని ఎవరైనా కామెంట్ చేస్తేనే సహించని కుటుంబసభ్యులు.. పెళ్లిపేరుతో ఆమెపై అత్యాచారం జరుగుతున్నా చూసీ చూడనట్టు ఉంటారు. మూరెడు పసుపుతాడు ముడేసి, అమ్మాయి మనసు తెలుసుకోకుండా ఏం చేసినా ఎవ్వరూ.. ఇదేమని అడగరు. స్త్రీ శరీరం పట్ల అతనికి హక్కు ఎవరిచ్చారు? ఆమే ఒక మనిషేనని, ఆమెకూ శారీరకపరమైన కోరికలు ఉంటాయనే స్పృహేలేని వాళ్లకు ఏం చెప్తే అర్థమవుతుంది. ఆడపిల్ల తన రొమాంటిక్ లైఫ్ గురించి కలలు కనడం తప్పా? తన శరీరానికి ఎలా ఆనందం కలుగుతుందో జీవిత భాగస్వామికి చెప్పడం నేరమా?..

సమాధానంలేని ప్రశ్నలతో రాత్రంతా నిద్రలేకుండానే గడిపింది అనూహ్య.

హర్షతో ఇంటికి వెళ్తున్న కూతుర్ని దగ్గరికి తీసుకొని.. "అనూ! నేను చెప్పేది అర్థం చేసుకో. నీ భర్త చెడ్డవాడేం కాదు. ఆ ఒక్క విషయంలో నువ్వు సర్దుకు పోయావంటే.. నీ జీవితం బాగుంటుంది" కూతురికి హితబోధ చేసింది రాధ. ఆమెకూ కూతుర్ని చూస్తుంటే కష్టంగానే ఉంది. కానీ, తనుమాత్రం ఏం చేయగలదు? ఇంటి పని, ఆఫీస్ పనికి తోడు.. వేవిళ్ల బాధతో సతమతమైపోతున్నది అనూహ్య. భర్త ధోరణిలో మార్పేమీ లేదు. రాత్రి ఓ అరగంట తన శరీరం తనది కాదనుకొని అతనికి అప్పగిస్తున్నది. అయినా అతనికి తృప్తి లేదు. బెడ్ మీద శవంలా ఉంటున్నావంటూ సతాయిస్తుంటాడు. భర్త ప్రవర్తనతో ఆమెలో అసహనం పెరిగిపోతున్నది.

నాలుగురోజుల క్రితం జ్వరం వచ్చి తగ్గడంతో.. నీరసంగా ఉంటున్నది అనూహ్యకు. నాలుగు మెతుకులు తిన్నాననిపించి.. వంటిల్లు సర్దుకొని పడుకోడానికి బెడ్రూమ్‌లోకి వెళ్లింది. ఆమె కోసమే ఎదురుచూస్తున్న హర్ష.. రెండుచేతులతో అనూహ్యను చుట్టేశాడు. ఆమె తన పరిస్థితిని చెప్తున్నా వినిపించుకోవడం లేదు. అంతే.. ఇన్నాళ్ల నుంచీ లోలోపలే ఉన్న అసహనం, అసంతృప్తి లావాలా బయటికి వచ్చాయి. తన బలాన్నంతా కూడదీ-సుకుని అతణ్ని ఒక్కతోపు తోసింది. చేతికందిన ఫ్లవర్‌వాజ్ తీసుకుని భర్త మీదికి విసిరేసి..

"నాకు ఇష్టం లేకుండా నన్ను తాకితే సహించేది లేదు".. గట్టిగా చెప్పి, గదిలోంచి బయటికి వచ్చేసింది.అనూహ్య ఇచ్చిన షాక్ నుంచి తేరుకొని హాల్‌లోకి వచ్చిన హర్ష.. సోఫాలో కూర్చొని 'మైదానం' చదువుతున్న అనూహ్యను అలా చూస్తుండి పోయాడు.కడెం లక్ష్మీ ప్రశాంతి

లక్ష్మీ ప్రశాంతి స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామం. బాల్యం నుంచే చందమామ మొదలైన కథల పుస్తకాలను చదివిస్తూ, ప్రశాంతికి పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించారు తల్లి లక్ష్మి. ఆ ఆసక్తితోనే కళాశాల స్థాయి నుంచి కవితలు రాయడం మొదలుపెట్టారు. తనకు మార్గదర్శిగా నిలిచిన తల్లి పేరును ముందు చేర్చుకొని, 'లక్ష్మీ ప్రశాంతి' పేరుతో పాఠకులకు దగ్గరయ్యారు. భర్త అశ్విన్ శ్యామా సాహచర్యంలో ఇతర భాషల సాహిత్యం.. ముఖ్యంగా బెంగాలీ, రష్యన్ సాహిత్యం పరిచయమయ్యాయి. కొన్నేళ్ల విరామం తర్వాత కవిత్వం రాయడంపై దృష్టి పెట్టి, అనేక పోటీలలో బహుమతులు అందుకున్నారు. తల్లి కోరికపై కథలు రాయడం ప్రారంభించారు. 'నిషేధిత స్వప్నం'.. రచయిత్రి మూడో కథ. ఒక స్త్రీ తన లైంగిక స్వేచ్ఛ గురించి, కోరికల గురించి మాట్లాడటం.. ఈనాటికీ పూర్తిస్థాయిలో ఆమోదయోగ్యం కాకపోవడం, లైంగిక చర్యలో ఆమె భావాలకు విలువ లేకపోవడాన్ని ఆధారంగా చేసుకొని రాసిన కథ 'నిషేధిత స్వప్నం'.

**లక్ష్మీ ప్రశాంతి స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామం. ఈమె కడెం సోమేశ్వరరావు, కొండపల్లి లక్ష్మి దంపతులకు జన్మించారు. ఈమెకు ఒక సోదరుడు. బాల్యం నుండి లక్ష్మీ ప్రశాంతి తల్లిగారు చందమామ మొదలగు కథల పుస్తకాలు ఆమెతో చదివిస్తూ పుస్తకపఠనం పట్ల ఆసక్తి కలిగించారు. ఆ ఆసక్తే ప్రశాంతి కళాశాల స్థాయికి చేరుకున్నాక చదవడంతో పాటు రాయాలనే తపన కలిగించింది. అలా కవితలు రాస్తూ తన పేరుకి ముందు తనకు మార్గదర్శిగా నిలిచిన తన తల్లిగారి పేరు అయిన లక్ష్మిని చేర్చుకొని "లక్ష్మీ ప్రశాంతి" పేరుతో కవితలు వ్రాస్తూ అనేక పత్రికలకు పంపేవారు. డిగ్రీ తర్వాత అశ్విన్ శ్యామాతో ఆమె వివాహం జరిగింది. అశ్విన్ సహచర్యంలో ఆమెకు ఇతర భాషాసాహిత్యం, ముఖ్యంగా బెంగాలీ, రష్యన్ సాహిత్యం పరిచయమయ్యాయి. లక్ష్మీ ప్రశాంతి రాసిన కవితలకు అనేక పోటీలలో బహుమతులు సైతం అందుకున్నారు.**

**కేవలం కవిత్వానికే పరిమితమైన ఆమె.. వారి అమ్మగారి కోరికపై కథలు వ్రాయడం మొదలుపెట్టారు. అలా ఆమె రాసిన "నిషేధిత స్వప్నం" కథ ఆమె మూడోవ కథ. ఒక స్త్రీ తన లైంగిక స్వేచ్ఛ గురించి, కోరికల్ని గురించి మాట్లాడటం ఈనాటికి పూర్తిస్థాయిలో ఆమోదయోగ్యం కాకపోవడం, లైంగిక చర్యలో ఆమె ఫీలింగ్స్‌కి విలువ లేకపోవడాన్ని బేస్ చేసుకొని వ్రాసిన కథ "నిషేధిత స్వప్నం".**

# సెల్యూట్



శ్రీసుధామయిజి
**79810 85444**

పువ్వులన్నీ కొలువు తీరాయి. పూలవనాలు బారులు తీరాయి. వీర జవానులకు స్వాగతం చెప్పడానికి.. అన్నట్టు. పూలతోటల స్వర్గంగా భాసిల్లుతున్న ప్రాంతం.. 'ఈశాన్య రాష్ట్రాలలో అక్కాచెల్లెళ్లు' అని పేరు గాంచిన రాష్ట్రాలలో ఒకటైన అరుణాచల్ ప్రదేశ్. వీర జవానుల కవాతును విస్ఫారిత నేత్రాలతో వీక్షిస్తూ.. తమకు తాముగా కొమ్మలను వీడి.. వారి శిరస్సులను పూలవర్షంతో అభిషేకిస్తున్నాయి. తల మీదుగా నేలరాలిన పువ్వులు.. వీర జవానుల పాదాల స్పర్శను తమ వీపున మోస్తూ, సగర్వంగా తలెత్తి చూసి సెల్యూట్ చేస్తున్నాయి.

మెక్‌మోహన్ రేఖ. సరిహద్దులో భారత సైన్యం డేగ కళ్లతో పహరా కాస్తున్నది. సరిహద్దుకు ఆవలివైపున.. ఓ కొండ ప్రాంతంలో ఓ గుడారం. అక్కడ వందల సంఖ్యలో చైనా సైనికులు మోహరించి ఉన్నారు.క్రమంగా చీకటి పడింది.

గుడారం చుట్టూ లైట్లు వెలిగాయి. ఇంతలో రెండు వాహనాలు దుమ్ము లేపుకొంటూ వచ్చి, ఆ గుడారం వద్ద ఆగాయి. అందులోంచి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఇద్దరు ఆర్మీ కమాండర్లు దిగారు. వారిని చూసి అక్కడ ఉన్నవారంతా సెల్యూట్ చేశారు. వారిద్దరూ గుడారంలోకి ప్రవేశించి, ఏదో మాట్లాడుకుంటూ.. ఎవరికోసమో ఎదురు చూస్తూ ఉండిపోయారు. మరికాసేపటికి అక్కడికి మరో వాహనం వచ్చి ఆగింది. అందులోంచి దిగిన ఒక కెప్టెన్.. వడివడిగా గుడారంలోకి ప్రవేశించాడు. కొద్దిసేపటి తర్వాత ఆ గుడారంలో రహస్య సమావేశం మొదలైంది. ఇద్దరు కమాండర్లలో ఒకరు తన దగ్గరున్న మ్యాప్‌ను బయటికి తీశాడు. మ్యాప్‌ను కెప్టెన్‌కు చూపిస్తూ వివరించడం మొదలుపెట్టాడు.

"భారత భూభాగంలో మన సైనికులు ఎంత మేరకు ఆక్రమించారో తెలిపే మ్యాప్ అది".. అని చెప్పాడు. అది చూసిన కెప్టెన్..

"మనం అనుకున్నది సాధించడానికి చాలా దగ్గరలో ఉన్నాం!" అన్నాడు. ఇంకొక కమాండర్‌ను చూస్తూ..

"మనం ఇక్కడినుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలోని డోక్లామ్ వరకూ తవ్విన సొరంగం ఉంది కదా.. దానికి సరైన రక్షణ ఏర్పాటు చేశారా?" అని అడిగాడు. దాంతో ఆ కమాండర్..

"మన సైనిక బలగం ఆ పరిసర ప్రాంతంలో బంకర్లు ఏర్పాటు చేసుకుంది. ఆ బంకర్ల నుంచే వారు తమ విధులు నిర్వహిస్తున్నారు కెప్టెన్!" అని చెప్పాడు.

"నేను మీకు ఆయుధాలతో నింపిన మిలటరీ వాహనాలు, కొన్ని డిస్ట్రాయర్లు, ఇంకా రాకెట్ ప్రొజెక్టర్లు ఏర్పాటుచేస్తాను. మీరు ఎంత తొందరగా గ్రామాలు నిర్మిస్తే అంత తొందరగా మనం ఈ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవచ్చు" అన్నాడు కెప్టెన్.

"మీరు ఆయుధ సంపత్తిని మాత్రం అందజేయండి. మిగిలింది మేం చూసుకుంటాం" అన్నారు ఇద్దరు కమాండర్లు. క్రూరమైన నవ్వు మొహంలో కదలాడుతుండగా.. ఒక కమాండర్ పైకి లేచి, ఇండియా మ్యాప్ తీసుకున్నాడు. కెప్టెన్ ఎదుట ఉన్న టేబుల్ మీద పరిచాడు. మ్యాప్‌ను చూపిస్తూ.. బలంగా కొట్టి కెవ్వున అరిచాడు. అతని చేయి టేబుల్ మీద ఉన్న మేకును బలంగా తాకింది. రక్తం చివ్వున పొంగి.. మ్యాప్‌లో తాము ఆక్రమించిన భాగంలో చిమ్మింది. మ్యాప్‌లోని ఆ ప్రాంతం రక్తవర్ణంతో తడిసిపోయింది. ఆ కమాండర్ తన కుట్రకు తగిన మూల్యం చెల్లించుకున్నాడు. అది చూసిన కెప్టెన్ వారిద్దరిని చూస్తూ..

“ఇదే పనికిరాని ఆవేశం.. ఇదే తెలివి తక్కువతనం.. ఇదే మూర్ఖత్వం.. మనల్ని చావుదెబ్బ తీసింది తెలుసా?” అన్నాడు. ఆ మాటలు వింటూ, రక్తమోడుతున్న చేతిని చూస్తూ తల కిందికి వంచుకున్నాడు ఆ కమాండర్.

“సరిగ్గా యాభై ఎనిమిది సంవత్సరాల కింద మనం ఇలాగే తల వంచుకున్నాం!” అంటూ కుర్చీలోంచి పైకి లేచాడు. సిగరెట్ వెలిగించుకుని, గుప్పున పొగ వదులుతూ గుడారం బయటికి నడిచాడు. దూరంగా అక్కడక్కడా సైనికులు గస్తీ తిరుగుతున్న భారత భూభాగం. ఆ భూమిని తదేకంగా చూస్తున్న కెప్టెన్‌కు ఒక్కసారిగా వెన్ను జలదరించింది. ఆ జలదరింపు.. తెలియని ఒక హెచ్చరికలా అనిపించింది. తిరిగి గుడారంలోకి వచ్చి, అక్కడున్న కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకున్నాడు. దీర్ఘమైన శ్వాస తీసుకుని వదులుతూ వారిని చూస్తూ గతాన్ని చెప్పడం ఆరంభించాడు.

“అది 1962వ సంవత్సరం. మనకు ఇండియాకు నూరనాంగ్ యుద్ధం మొదలైన కాలం. ఆ యుద్ధంలో చావు తప్పి కన్ను లొట్టబోయింది అన్న తీరులో మనం విజయం సాధించాం. శత్రువైనా మెచ్చుకోక తప్పనిసరి పరిస్థితి. కారణం.. జస్వంత్ సింగ్ రావత్ అనే ఇండియన్ రైఫిల్ మాన్. మన సైనికులు ఇండియా సైన్యాన్ని విజయవంతంగా ఎదుర్కోవడంతో వారందరూ వెనుతిరిగారు. కానీ, వారిలో ఒకే ఒక్కడు.. అతడే ఒక సైన్యమై.. మనవాళ్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఒక్కడే మూడు రోజులపాటు పోరాడి మన సైనికులను దాదాపు మూడొందల మందిని మట్టుబెట్టాడు. ఇదంతా ఆ ఒక్కడు కొండ మీద ఉన్న కనుమల్లో ఉండి, ఎంతోమంది సైన్యం ఉన్నట్టు మనకు భ్రమ కల్పించాడు. ఈ వ్యూహంలో అతడు ఎంతో విజయం సాధించాడు. మన సైనికులను ముప్పుతిప్పలు పెట్టి ఏం జరుగుతున్నదో అర్థం కాని పరిస్థితిని కలిగించాడు. ఆ వీరోచిత పోరాటం చూసిన మన సైనికులు భయంతో వెనక్కి తగ్గారు. ఏం చేయాలో తెలియక మన సైనికులు.. జస్వంత్ సింగ్ ఉన్న కనుమల చుట్టూ కాపలా ఉండిపోయారు. అక్కడ ఎంతమంది ఉన్నారో తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేయసాగారు. అదే సమయంలో ఆ వీరుడికి ఆహారం తీసుకెళ్తున్న ఒక వ్యక్తి మన సైనికులకు దొరికాడు. మన సైన్యం అతణ్ని పెట్టిన చిత్రహింసలను భరించలేక అతడు నిజం చెప్పేశాడు. అది విన్న మన సైనికులతోపాటు నేను కూడా ఆశ్చర్యపోయాను. కారణం.. అప్పుడు మన బెటాలియన్‌కు నాయకుణ్ని నేనే. ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే మన సైన్యం జస్వంత్ సింగ్ శిబిరాన్ని చుట్టుముట్టింది. అతడి వీరత్వాన్ని, దేశభక్తిని చూసి నేను క్షణకాలం అసూయ

చెందాను. దేశభక్తికి నిజమైన నిర్వచనం జస్వంత్ సింగ్ రావత్.

అంతమంది తన శిబిరాన్ని చుట్టుముట్టినా, అంతటి క్లిష్ట సమయంలోనూ జస్వంత్ తన పోరాటాన్ని వదలలేదు. ఒక్కడే చివరి నిమిషం వరకు వీరోచితంగా పోరాడి.. మన సైనికులను రెండొందల మందిని మట్టుబెట్టాడు. చివరికి ఎవరికీ దొరకకుండా తనను తాను కాల్చుకుని మరణించాడు"..

మాటలు పూర్తికాగానే.. ఒక్కసారి దీర్ఘంగా శ్వాస తీసుకుని, కళ్లు మూసుకుని అలా ఉండిపోయాడు కెప్టెన్. ఆ శిబిరంలో జస్వంత్ సింగ్ గురించి వివరిస్తుంటే గాలి కూడా స్తంభించిపోయింది.జస్వంత్ సింగ్ వీరత్వం గురించి ఊపిరి పీల్చుకోవడం కూడా మర్చిపోయి వింటున్న ఇద్దరు కమాండర్లు తెప్పరిల్లి నోటమాట రాక ఉండిపోయారు. కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత.. కెప్టెన్‌ను చూస్తూ ..

"ఇప్పటికీ తవాంగ్ జిల్లాలో బాబా జస్వంత్ పేరుతో స్థానికులు ఆరాధిస్తున్న వ్యక్తి. మరణించిన తర్వాత కూడా సరిహద్దుల్లో ఇప్పటికీ అతడి ఆత్మ విధులను నిర్వహిస్తున్న వ్యక్తిగా పేరు పొందిన జస్వంత్ సింగ్! మీరు చెప్పిన జస్వంత్ సింగ్.." అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు ఒక కమాండర్. ఆ మాటలకు కెప్టెన్ తలూపుతూ..

"ఆ ముగ్గురూ ఒక్కడే!" అన్నాడు. కెప్టెన్ మాటలను విన్న ఇద్దరు కమాండర్లు జస్వంత్ సింగ్ దేశ భక్తికి తలవంచి అలా ఉండిపోయారు. కొద్దిసేపటి తర్వాత కెప్టెన్ పైకి లేచాడు.

"మనం ఇక సమావేశం ముగిస్తున్నాం. మీరు ఆవేశంతో కాకుండా ఆలోచనతో ప్రవర్తించండి. ఇండియా సైన్యం మనకంటే ఎన్నో రెట్లు బలమైనది. ఇండియన్ ఆర్మీలో ఒక్కో సైనికుడు ఒక్కో మిసైల్‌తో సమానం. మన ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. మన దగ్గర ఆయుధాలు మాత్రమే ఉంటాయి. కానీ, వారి దగ్గర దేశభక్తి అనే మారణాయుధం.. హ్యూమన్ బాంబ్ లాంటిది. దేశం కోసం మృత్యువుతోనైనా కలబడే తెగింపు వాళ్లది. అప్రమత్తంగా మెలగండి" అని చెప్పి, అక్కడి నుంచి నిష్క్రమించాడు.

కెప్టెన్ వెంటే.. ఆ కమాండర్లు కూడా అక్కడినుంచి వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత డ్రాగన్ సైనికులంతా ఏమరుపాటుగా ఉన్న సమయంలో.. ఒక సైనికుడు ఆ ప్రదేశం నుంచి మెల్లగా ముందుకు వెళ్లడం మొదలుపెట్టాడు. గస్తీ తిరగడానికే అన్నట్టు

మరింత ముందుకు నడిచాడు. అక్కడ కొద్దిసేపు అటూఇటూ తిరిగాడు. చుట్టుపక్కల నిశితంగా పరిశీలించి, తనను ఎవరూ గమనించడం లేదని నిర్ధారించుకున్న తర్వాత.. ఆ సైనికుడు చీకటిలో కలిసిపోయాడు. వడివడిగా అడుగులు వేస్తూ మెక్‌మోహన్ సరిహద్దు రేఖను చేరుకున్నాడు. ఒక పెద్దగుట్ట చాటున నెగడు ఏర్పాటు చేసి.. తన దు-స్తులపై ధరించిన డ్రాగన్ సైనిక దుస్తులను ఆ మంటలో తగలబెట్టాడు. తన ఒంటిపై ఉన్న దుస్తులను ఒకసారి చూసుకున్నాడు. తన భుజం మీదుగా.. యూనిఫాంపై ఉన్న 'మువ్వన్నెల జెండా'.. ఆ మంటల వెలుతురులో మరింత వెలిగిపోతూ కనిపించింది. అది చూసిన ఆ వ్యక్తి పెదాలు సన్నగా విచ్చుకున్నాయి. వెంటనే అక్కడినుంచి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యాడు. సుదూరంగా కనిపిస్తున్న శిబిరాన్ని చేరుకోవాలని ముందుకు నడిచాడు. అప్పటికే తూర్పు దిక్కున వెలుగురేఖలు విచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

భారత భూభాగంలోని శిబిరం. లోపల ఇద్దరు మేజర్ జనరల్స్. ఇద్దరు బ్రిగేడియర్స్. సరిహద్దు ఉద్రిక్తతల గురించి, డ్రాగన్ దురాక్రమణల గురించి తీవ్రమైన చర్చలు కొనసాగిస్తున్నారు. డ్రాగన్ సరిహద్దుల నుంచి వచ్చిన ఆ సైనికుడు భారత శిబిరం వద్దకు చేరుకున్నాడు. ఆ సైనికుణ్ని చూసిన అక్కడున్న సైనికుల వదనాలలో చిరునవ్వు విరిసింది. శిబిరం లోపలికి అడుగుపెట్టి.. అక్కడున్న అధికారులకు సెల్యూట్ చేశాడు.

"దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టడం భారత సైన్యం తన శ్వాసగా జీవిస్తున్నది" అని ఒక బ్రిగేడియర్.. పక్కనున్న మరో బ్రిగేడియర్‌తో చెప్పాడు.

ఈ సైనికుడు తన భుజాన ఉన్న మువ్వన్నెల జెండాను జాగ్రత్తగా తీసి, ఆ జెండా వెనుక అమర్చి ఉన్న శక్తివంతమైన చిన్న రికార్డర్‌ను బయటికి తీశాడు. దాన్ని జాగ్రత్తగా మేజర్‌కు అందించాడు. తిరిగి వారికి సెల్యూట్ చేసి.. శిబిరం బయటికి వచ్చాడు. తన తోటి సైనికుల దగ్గరికి వెళ్లి.. ఏమీ జరగనట్టే తన విధుల్లో మునిగిపోయాడు. శిబిరంలో ఉన్న నలుగురు ఆ రికార్డును జాగ్రత్తగా వినసాగారు. అది వింటుంటే వారందరి వదనాలు జేవురించాయి. డ్రాగన్ దేశ కుట్రలు, పన్నాగాలు విన్న వారందరూ.. వాటిని ఎలా నిలువరించాలో తమలో తామే చర్చించుకోసాగారు.

"ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి మన సైనిక బలగం సరిపోయినా, ఇది సైన్యం మాత్రమే ఎదుర్కోగల విషయం కాదు" అని ఒక బ్రిగేడియర్ అన్నాడు.

“డ్రాగన్ దేశాన్ని, వారి ఆగడాలను ఎదుర్కోవడానికి వారి వ్యూహాలను తిప్పికొట్టడానికి తగిన సమర్థులు కావాలి” అని ఇంకొక బ్రిగేడియర్ చెప్పాడు.

“వారి ఎత్తులను చిత్తు చేస్తూ.. పైఎత్తు వేసే సమర్థుడు ఇప్పుడు ఎంతో అవసరం” అని అక్కడున్న ఒక మేజర్ అన్నాడు. ఇంకొక మేజర్ ఏమీ మాట్లాడకుండా ఆలోచిస్తూ ఉండిపోయాడు. కొద్దిసేపటి తర్వాత..

“డ్రాగన్ దేశం ఆగడాలను నిలువరించడానికి నా దృష్టిలో ఒకే ఒక వ్యక్తి ఉన్నాడు” అన్నాడు ఆ మేజర్. మిగిలిన ముగ్గురూ కుతూహలంతో.. ‘ఆ వ్యక్తి ఎవరా? మేజర్ ఏం చెప్తాడా?’ అని చూడసాగారు. మేజర్ అక్కడున్న ప్రొజెక్టర్ ఆన్ చేశాడు. స్క్రీన్‌పైన ఒక వ్యక్తి. చురుకైన చూపులతో కొదమసింహంలా కనిపిస్తున్నాడు. ఉరుమును ఒడిసిపట్టగల పిడుగులా ఉన్నాడు. మేజర్ ప్రొజెక్టర్ ఆఫ్ చేసి..

“విక్రమ్ సింగ్ రావత్! ఆవేశం కొండంత.. దేశభక్తి ఆకాశమంత..” అని చెప్పాడు. ఇంకొక మేజర్ మిగిలిన వారిని చూస్తూ..

“ఈ వ్యక్తిని ఆర్మీలోకి తీసుకోవడానికి మనం తిరస్కరించాం కదా!” అన్నాడు.

“ఎస్.. విక్రమ్ సింగ్ రావత్ ఆర్మీలో సెలెక్ట్ కాకుండా తిరస్కరించడానికి కారణం.. అతని ఆవేశం మాత్రమే!” అన్నాడు మేజర్.

“ఇంటర్వ్యూలో ‘శత్రుసైనికులు దాడి చేస్తేనో.. ఎదురైతేనో ఏం చేస్తావు?’ అని అడిగిన ప్రశ్నకు ఇతని సమాధానం.. ‘శత్రు సైనికులు కంటబడితే చంపేస్తాను!’ అని. క్రమశిక్షణను కటువుగా పాటించే భారత ఆర్మీలో, ఇలాంటి ఆవేశపరుణ్ని ఎలా తీసుకోవాలి? అనే కారణంతో అతన్ని పక్కన పెట్టాం. కానీ, అతడి రికార్డు చూస్తే.. ఆ వ్యక్తి ఊరి నుంచి కొన్ని వివరాలు మనకు చేరాయి. విక్రమ్ అన్యాయాన్ని సహించే మనిషి కాదనీ, న్యాయం కోసం ఎంతవరకైనా తెగించి పోరాడుతాడని ఆ రికార్డులు చెప్తున్నాయి. దేశభక్తి, ఆవేశం, ఆలోచన.. అన్నిటికీ మించి యునిఫామ్ ధరించాలన్న అతనిలోని బలమైన కోరిక మనకు అనుకూలంగా ఉన్నాయి. విక్రమ్ సింగ్ రావత్ ఈ సర్జికల్ స్ట్రయిక్‌కు సమర్థుడని నా అభిప్రాయం!” చెప్పాడు మేజర్. అతని మాటలతో అంతా ఏకీభవించారు. అత్యవసర సమావేశంలో ప్రధాని, కేంద్ర హెూంమంత్రి, త్రివిధ దళాధిపతి.. రాష్ట్రపతి తమ ఆమోదముద్ర వేశారు. ‘లైసెన్స్ టు కిల్’.. అంటూ డ్రాగన్‌పై యుద్ధానికి అండర్ కవర్ వన్‌మ్యాన్ ఆర్మీగా విక్రమ్ సింగ్ రావత్‌ను ఎంపిక చేశారు.

మెక్‌మోహన్ రేఖ దాపునే ఉన్న శిబిరం.. లోపల ఉన్న ఓ వ్యక్తిని చూస్తూ..

“మిస్టర్ విక్రమ్ సింగ్ రావత్! జరిగినదంతా విన్నావు కదా! నీతో ఒక సైనిక

బెటాలియన్ వస్తుంది. డ్రాగన్ దేశాన్ని, ఆ దేశ ఆగడాలను నిలువరించాలి. అవసరమైన ఆయుధాలు కూడా మీతో వస్తాయి" అన్నాడు కల్నల్. అందుకు విక్రమ్ సింగ్ ఏదో చెప్పబోయేంతలో.. శిబిరానికి కొద్ది దూరంలో ఏదో కలకలం. ఇంతలో శిబిరంలోకి ఒక సైనికుడు పరుగుపరుగున వచ్చాడు.

"కల్నల్ సాబ్.. డ్రాగన్ సైనికులు మన సైనికుల మీద దాడి చేశారు. సరిహద్దు వెంట యుద్ధ వాతావరణం నెలకొని ఉంది" అని చెప్పాడు. అది విన్న విక్రమ్ సింగ్ ఆవేశంతో పైకి లేచాడు. కల్నల్ వెంటనే..

"విక్రమ్ సింగ్.. మీరు వెళ్లండి. మీకు కావాల్సిన ఆయుధాలను మన బెటాలియన్ మీకు అందజేస్తుంది" అన్నాడు.

"కల్నల్ సాబ్! నాకు మామూలు ఆయుధాలతో పని లేదు. ఈ ఆపరేషన్‌కు నాకు కావాల్సినవి ఇవే!".. అంటూ ఒక పేపర్‌పై రాశాడు. దాన్ని కల్నల్‌కు అందించి అక్కడి నుంచి బయల్దేరాడు.

విక్రమ్ రాసిన వివరాలు చూసి కల్నల్ ఆశ్చర్యపోయాడు. శత్రు సైనికులను విక్రమ్ ఎలా నిలువరిస్తాడో అర్థమైన కల్నల్ మోముపై చిరునవ్వు విరిసింది.

సరిహద్దు ప్రాంతాన్ని చేరుకున్నాడు విక్రమ్. అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. ఎదురుగా ఉన్న కొండల చాటు నుంచి డ్రాగన్ సైనికులు విచక్షణరహితంగా కాల్పులు జరుపుతున్నారు. మన సైనికులు దీటుగా ఎదుర్కొంటున్నారు. అక్కడికి వెళ్లిన విక్రమ్ సింగ్ పరిసరాలన్నీ జాగ్రత్తగా పరికిస్తున్నాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న బెటాలియన్ సైనికులు విక్రమ్ దగ్గరికి వచ్చారు. వారు తెచ్చిన వస్తువులను తాను చెప్పినట్టు అమ-ర్చమని కోరాడు విక్రమ్ సింగ్. అన్ని వస్తువులనూ విక్రమ్ సింగ్ చెప్పినట్టుగానే ఆ ప్రాంతంలో అమర్చారు సైనికులు. వారందరినీ పక్కకు వెళ్లమని చెప్పి తన పని మొదలుపెట్టాడు విక్రమ్ సింగ్.

విద్యుదయస్కాంత వికిరణ రూపాలైన మైక్రోవేవ్ తరంగాలు అవి. వాటినే తన ఆయుధాలుగా మార్చుకున్నాడు విక్రమ్. డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ అయిన మైక్రోవేవ్ కిరణాలను దూరంగా కనిపిస్తున్న కొండల మీదికి ప్రసరింప చేయసాగాడు. క్రమంగా ఆ కిరణాల వేవ్‌లెంగ్త్ (తరంగ దైర్ఘ్యం) ఒక మిల్లీ మీటర్ నుంచి ఒక మీటర్ వరకు మారింది. హై ఎనర్జీ రేడియో ఫ్రీక్వెన్సీలు కంటికి కనిపించని వేగంతో, తరంగాల రూపంలో దూసుకెళు_తున్నాయి. ఆ ఫ్రీక్వెన్సీని క్రమంగా పెంచసాగాడు విక్రమ్.

ఫిరంగులు, తుపాకులు, బుల్లెట్లు ఉపయోగించకుండా.. కేవలం అతి నీలలోహిత కిరణాలను ప్రయోగించి శత్రుమూకలతో యుద్ధం చేస్తున్నాడు విక్రమ్.

ఆ నాన్–కాంటాక్ట్ వార్ ఫేర్‌లో.. ఎక్కడో కొండలలో, గుట్టల మాటున ఉన్న కొన్ని వందలాది మంది డ్రాగన్ సైనికులు ఆ కిరణాల ప్రభావంతో ఎక్కడి వారక్కడ కుప్పకూలిపోసాగారు. కేవలం కొన్ని గంటల్లోనే వారందరూ నిర్వీర్యులై ఒక్కరు కూడా ప్రతిదాడి చేయడానికి వీలు లేకుండా చేశాడు విక్రమ్ సింగ్. అది చూసిన మన సైనికులు హర్షధ్వానాలు చేస్తూ విక్రమ్ సింగ్‌ను అభినందించారు. తర్వాత అక్కడున్న బెటాలియన్ సైనికులకు కొన్ని సూచనలు అందచేసి, వారితోపాటు డ్రాగన్ దేశం సొరంగాలు, గ్రామాలు నిర్మించిన ప్రదేశానికి బయల్దేరాడు విక్రమ్ సింగ్. ఎదురుగా కొన్ని కిలోమీటర్ల దూరంలో డ్రాగన్ దేశం నిర్మించిన సొరంగాలు, గ్రామాలు ఉన్నాయని గుర్తించాడు. తనతో వచ్చిన బెటాలియన్ సైనికులకు.. 'టి.. రెక్స్' అనే నిఘా పరికరాలను అందించాడు. లాంగ్ రేంజ్ అబ్జర్వేషన్ సిస్టం అని పిలిచే ఆ నిఘా వ్యవస్థ పరికరాల ద్వారా కొన్ని కిలోమీటర్ల దూరంలో డ్రాగన్ దేశం నిర్మించిన గ్రామాలను చూడటం మొదలుపెట్టారు. ఎదురుగా ఉన్న గ్రామాలలో ఇళ్లలాంటి నిర్మాణాలు దాదాపు వంద వరకూ ఉన్నాయి. గ్రామాలను కలిపే తారు రోడ్లు అప్పటికే పూర్తయ్యాయి. అవన్నీ భారత భూభాగంలోకి చొచ్చుకుని వచ్చి మరీ నిర్మించారు. ఎక్కడ చూసినా ఆలివ్ గ్రీన్ రంగు ట్రక్కులు నిలబెట్టి ఉన్నాయి. సొరంగాలు తవ్వుతున్నట్టు ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవన్నీ గమనిస్తున్న మన సైనికులకు ఆవేశం ఉప్పొంగుతున్నది. అన్నిటినీ నిశితంగా పరిశీలిస్తున్న విక్రమ్ సింగ్ ఆదేశాల కోసం వేచి ఉన్నారు వారందరూ. ఒక్కసారిగా..

"ఫైర్!" అని ఆదేశించాడు విక్రమ్ సింగ్.

అందుకోసమే ఎదురుచూస్తున్న సైనికులంతా ఒక్కసారిగా ఆ నిర్మాణాలపై ఫిరంగి గుళ్ల వర్షం కురిపించారు. దీంతో నిర్మాణాలన్నీ ఒక్కసారిగా భూకంపం వచ్చినట్టుగా కుప్ప కూలిపోయాయి. అది చూసిన భారత సైనికులు దేశభక్తిని అణువణువునా నింపుకొని హర్షధ్వానాలు చేయసాగారు. డ్రాగన్ దేశంపై సర్జికల్ స్ట్రయిక్‌ను విజయవంతంగా పూర్తిచేసిన విక్రమ్ సింగ్ రావత్.. కల్నల్ ఎదురుగా ఉన్నాడు. తాను ధరించిన సైనిక యూనిఫామ్‌ను కల్నల్ ఎదుట ఉంచాడు.

"ఇక నాకు ఈ యూనిఫామ్‌తో పనిలేదు. ఒక్కసారైనా ఈ యూనిఫామ్ ధరించాలనే

కోరిక ఉండేది. దేశభక్తినే యూనిఫామ్‌గా ధరించాను. ఈ దేశంకోసం ఎప్పుడైనా.. నా ప్రాణాలు త్యాగం చేయడానికి నేను సిద్ధంగా ఉంటాను".. సెల్యూట్ చేస్తూ చెప్పాడు విక్రమ్ సింగ్ రావత్. శత్రువులను వేటాడిన సింహం వెనుతిరిగింది.

"మిస్టర్ విక్రమ్ సింగ్ రావత్.. గ్రాండ్ సన్ అఫ్ గ్రేట్ వారియర్ జస్వంత్ సింగ్! మీ తాత రక్తం, దేశభక్తి నీలో నిలువెల్లా నిండి ఉంది. ఈ క్షణం నుంచి యూనిఫామ్ లేని సైనికుడివి నువ్వు. దేశాన్ని కాపాడే యోధుడివి. రాష్ట్రపతి ప్రత్యేక అనుమతితో నియమించబడ్డ సోల్జర్‌వి. నీ సాహసాన్ని భారతసైన్యం విస్మరించదు!".. విక్రమ్ సింగ్ రావత్ భుజం తట్టి, చెప్పాడు కల్నల్.

సాహసమే శ్వాసగా ముందుకు నడుస్తున్నాడు విక్రమ్ సింగ్ రావత్.

**శ్రీసుధామయి.**

**శ్రీసుధామయి స్వస్థలం వజ్రకరూరు మండలం, గంజికుంట గ్రామం. ఎంబీఏ పూర్తిచేశారు. ఆమె దాదాపుగా 80 కథలు, పదహారు నవలలు రాశారు. ఈనాడు, స్వాతి, విపుల, ఆంధ్రభూమి, డైలీ, వీక్లీ, మంత్లీ, అంతర్జాల పత్రికల్లో ఈమె రచనలు అచ్చయ్యాయి. హారర్. కామెడి, క్రైమ్, థ్రిల్లర్, ఫిక్షన్, రొమాన్స్, మానవ సంబంధాలు, ఇలా అన్ని జోనర్స్‌లో రచనలు చేశారు. డిటెక్టివ్ సిద్ధార్థ, జ్వాలాముఖి మంత్రాలదీవి, మాయాద్వీపం, పచ్చల లోయ- పాతాళసుందరి .. అద్భుతలోకం, నాగకిరీటం, మణిద్వీపరహస్యం, మహాతలం-మాయాదర్పణం, భూతాలదీవి-భేతాళమాంత్రికుడు, అదృశ్యవనం, గుప్పెడంత ఆకాశం.. ఇలా విభిన్నమైన జోనర్లలో, తెలుగులో వున్న అన్ని పత్రికల్లో ఈమె రచనలు ప్రచురితమయ్యాయి.**

# ఆడపులి



**పుట్టగండి గోపీకృష్ణ**
**9491091620**

గూడెం ఘొల్లుమంది.

లోతువాగులో చేపలు పట్టటానికి పోయిన కుర్రాడిని పులి కరుచుకు పోయిందని తెలిసి ఆడామగ, పిల్లజెల్ల, ముసలిముతక & అందరు కన్నీరుమున్నీరయ్యారు. గూడెం పెద్ద పోచయ్య ఆగమేఘాల మీద దహెగాంలోని ఫారెస్టు ఆఫీసుకు బయలుదేరాడు.

ఆఫీసు బయటే ఆపిన సిబ్బందికి జరిగింది ఏంటో చెప్పాడు పోచయ్య. 'మళ్లీ పులి బెడద మొదలయ్యిందన్న మాట' అన్నాడు గార్డు యాదగిరి. 'కడుపు నిండ తింటానికి బువ్వ లేకపోయినా ఏసంది మీకు చెప్పుకోనీకి రాలె. సెలిమల్ల సుక్క నీళ్లు లేకపోయినా సాయం అడగలే. అబంసుబం తెలీని పిల్లల్ని కనేది మెకానికి తినబెట్టనీకా అని అడగటానికి వచ్చిన' ఆవేశంగా అన్నాడు పోచయ్య.

'ఏం పోచయ్యో! నోరు లేస్తందే మేమేమన్నా పులిని తీసుకొచ్చి మీ గూడెంలో వదిలామా? అదేదో మా తప్పయినట్లు అంటుండవే' అన్నాడు యాదగిరి.

'ఇయ్యన్నీ కాదు గానీ, మెకాన్ని మీరు సంపుతరా? మమ్మల్ని సంపమంటరా?' అన్నాడు పోచయ్య. 'సంపుతాడంట, సంపుతాడు. అట్ల చేస్తే బొక్కలో పెడతారు. అయినా పోయి లోపల ఆఫీసరుతో చెప్పుకో.

ఏం దారి చూపిస్తుందో?' అని వెటకారం చేస్తూ, లోపలకు దారి చూపించాడు యాదగిరి.

లోపల గదిలో కొత్తగా వచ్చిన, పట్టుమని పాతికేళ్లు లేని యువతి కూర్చుని ఉంది. ఆమే ఫారెస్టు రేంజ్ ఆఫీసరని తెలిశాక ఏం చెప్పుకోవాలో అర్థం కాలేదు పోచయ్యకి. పెద్ద చదువులు చదివిన ఆడాళ్లతో ఎట్ట మాట్లాడాలో అతనికి తెలియదు.

పోచయ్యకి, తమ గార్డు యాదగిరికి మధ్య జరిగిన సంభాషణ లోపల గదిలో కూర్చుని ఉన్న కళ్యాణికి వినిపిస్తూనే ఉంది. నిజానికి ఆమెకు వినపడాలనే అవసరానికి మించి గొంతు పెంచి మాట్లాడుతున్నాడు యాదగిరి. ఉద్యోగంలో చేరిన రోజు నుండి యాదగిరి ఇలాంటి వ్యంగ్యపు మాటలు మాట్లాడటం వింటూనే ఉంది కళ్యాణి. అవి ఒక స్త్రీని తమ పై అధికారిగా చూడలేని మగ అహంభావపు ప్రేలాపనలని ఆమె అర్థం చేసుకుంది. ఊరుకున్న కొద్దీ& అవి మరింత ఎక్కువవుతున్నాయి. అయినా ప్రస్తుతం ఇది సందర్భం కాదు కాబట్టి, లోపలకు వచ్చిన పోచయ్యను, 'ఏమయింది పెద్దయ్యా?' అని సౌమ్యంగా అడిగింది ఆమె.

ఏం జరిగిందో వివరించాడతను.

వెంటనే అతన్ని జీపులో ఎక్కించుకుని తన సిబ్బందితో గూడానికి బయలుదేరింది కళ్యాణి. తెలంగాణ, మహరాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కొమరం భీమ్ జిల్లాలోని పెంచికల్పేట్ ప్రాంతం దట్టమయిన అడవులకు ఆనుకుని ఉంటుంది. పెద్దపులులు గడ్డి మేయటానికి వెళ్ళిన ఏ పశువునో, ఊర్లో కట్టేసి ఉన్న మేకనో పట్టుకు పోవటం అప్పుడప్పుడూ జరుగుతుంటుంది. అయితే మనిషి మీద దాడి చేయటం అన్నది ఎప్పుడో కానీ జరగదు.

జీపు లోతువాగుని సమీపించింది. అప్పటికే అక్కడకు గుంపులు గుంపులుగా జనం చేరుకున్నారు. చనిపోయిన కుర్రాడి బంధువుల రోదనలు బిగ్గరగా వినిపిస్తున్నాయి. కళ్యాణి పరిసరాలు జాగ్రత్తగా పరీక్షించింది. కుర్రాడిని అడవిలోకి ఈడ్చుకుపోయిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కళ్యాణితో ఉన్న సిబ్బందిలో మల్లేశం అనుభవజ్ఞుడు. ఇలాంటివి ఎన్నో చూశాడు. అక్కడి కాలి ముద్రలు చూసి, 'ఇది పెద్ద పులే' అని ఖరారు చేశాడు.

కళ్యాణి గూడెం వాళ్లని సముదాయించి, అతి త్వరలో ఆ పులిని బంధించటం జరుగుతుందని, అప్పటివరకు ఎవరూ ఒంటరిగా బయట తిరగవద్దని చెప్పింది. ఆమె చెప్పిన మాటలు ఎవరూ నమ్మకపోయినా, అంత కంటే చేయగలిగింది లేక అప్పటికి ఊరుకున్నారు.

వెను తిరిగి ఆఫీసుకు వచ్చి, జరిగిన సంగతులన్నీ అప్పటికప్పుడు తన పై అధికారులకు వివరించింది. విని ఊరుకోవటం తప్ప వారి నుండి ఎలాంటి రెస్పాన్స్ లేదు.

మల్లేశం ఒక్కడే ఆమెకు సానుకూలంగా ఉన్నాడు. అతను కూడా అక్కడ గార్డే. అందరిలోకీ సీనియర్. ఆమెకు మంచి, చెడూ చెప్తున్నాడు. 'మీరు టెన్షన్ పడకండి' అని ఆమెకు ధైర్యం నూరి పోశాడు.

'అసలు అడవిలో హాయిగా ఉండాల్సిన పులులు ఇలా ఊరి మీదకు ఎందుకు వస్తాయో?' అంది కళ్యాణి. 'అవి మన దిక్కుకి రాటం లేదమ్మా, మనమే అవి వచ్చేట్టు చేస్తున్నాం. అడవులు

కొట్టేస్తున్నం. లారీలు, జేసీబీలు పెట్టి ఏట్లో ఇసుక తోడుతుంటే నీరు నిలువ ఎట్టా ఉంటది? మెకాలకి తిండి, నీరు లేకపోతే అవి గూడేల మీద పడక ఏం చేస్తాయి?...' అన్నాడు మల్లేశం నిర్వేదంగా.

గూడెంలో మనుషులు బెదిరి పోకుండా, నలుగురు గార్డులను పంపింది కళ్యాణి. వారికి రైఫిల్సుతో పాటు ట్రాంక్విలైజర్ గన్స్ కూడా ఇచ్చింది. కొద్ది దూరం వెళ్లాక తన మీద జోకులు వేస్తూ యాదగిరి నవ్వుతున్న వెకిలి నవ్వులు ఆమె చెవిని దాటి పోలేదు. 'మీరు కొద్దిగా స్ట్రిక్టుగా ఉండకపోతే ఆ యాదగిరి ఇలానే నెత్తికి ఎక్కుతాడమ్మా' అన్నాడు మల్లేశం.
'స్ట్రిక్టుగా ఉండటం అంటే ఏమి చెయ్యాలి? కొట్టాలా, తిట్టాలా' అని మనసులో అనుకుంది కళ్యాణి. పైకి మాత్రం, 'దానికంటే ముందు పులిని పట్టుకోవాలి. యాదగిరి సంగతి ఆ తరువాత చూద్దాం' అంది.

రెండు రోజులు గడిచాయి. ఏ దుర్ఘటనా జరగలేదు. గండం గడిచినట్లే అనుకుంటుంటే, గూడేనికి ఉత్తరాన ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో చిన్న పల్లెలో పత్తి పీకటానికి వెళ్ళిన పన్నెండేళ్ల బాలికని నోట కరుచుకుని పోయింది పులి. మొదటిసారి ఆ పులి మ్యాన్ ఈటర్ ఏమో అన్న అనుమానం ఫారెస్ట్ అధికారులకు కూడా వచ్చింది. మరి కొంత మంది సిబ్బందిని ఆ ప్రాంతానికి తాత్కాలికంగా పంపారు. చుట్టు పక్కల దాదాపు పాతిక చిన్న చిన్న గ్రామాలు ఉన్నాయి. పులి రెండు రోజుల్లో ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణించిందంటే, తన తదుపరి దాడి ఎక్కడయినా చేయవచ్చు.

కొత్తగా వచ్చిన సిబ్బందితో పాటు తను కూడా అలుపెరగకుండా గస్తీ తిరుగుతోంది ఆమె. 'మనం డిఫెన్సులో ఉండటం కాదు. ఆ పులిని పట్టుకోవాలి. అందుకు ఏమి చేయాలి?' మల్లేశాన్ని అడిగింది కళ్యాణి. 'మెకానికి తెలివి ఎక్కువ. అది ఎక్కడ ఉందో తెలిస్తే మాటు వేసి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పట్టొచ్చు. లేదూ ట్రాప్ పెట్టొచ్చు. కానీ ఇలా రోజుకొక ఊరిలో దాడి చేస్తున్న మ్యాన్ఈటర్ని పట్టుకోవటం చాలా కష్టం' చెప్పాడు మల్లేశం.

మరో రెండు రోజుల తరువాత మరింత ఉత్తరాన ఉన్న మరో ఊరిలో, అర్ధరాత్రి మందు కొట్టి సైకిల్ మీద వస్తున్న ఒక యువకుడిని పొట్టన పెట్టుకుంది ఆ పులి. 'జరుగుతున్న హత్యలను చోద్యం చూస్తున్నట్లు చూడటానికి కాదు నేను ఇక్కడ ఉంది' అనుకున్న కళ్యాణి, తన స్నేహితురాలు మానసకు కబురు చేసింది. మానస డ్రోన్ ఆపరేటర్. ఆమె దగ్గర వివిధ రకాల డ్రోనులు ఉన్నాయి. పైగా మానస కూడా అడ్వంచర్ అంటే ఇష్టపడుతుంది. పెద్దపులినే పట్టుకునే అవకాశం అని తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుండి అక్కడకు చేరుకుంది మానస. రావటమే కాదు, తనతో కొన్ని డ్రోనులు కూడా తెచ్చి వెంటనే కార్యరంగంలోకి దూకింది.

'డ్రోన్ కెమెరాలు కొంత మంది ఆపరేట్ చేస్తూ ఉంటే మరికొందరు కంట్రోల్ రూములో ఏర్పాటు చేసిన మానిటర్లలో పులి కనిపిస్తుందేమో అని వెతుకుతూ ఉండాలి. అలా

మొత్తం అడవిని జల్లెడ పట్టవచ్చు' చెప్పింది మానస. 'ఎక్సలెంట్' ఆమె ఐడియా నచ్చి మెచ్చుకుంటూ అంది కళ్యాణి. 'కానీ డ్రోన్ ఆపరేట్ చేయటం అందరి వల్లా కాదుగా' అంది. 'దాన్ని నాకు వదులు. లోకల్గా ఉన్న కాస్త చదువుకున్న యువతీ యువకులను పిలిపించు. వారికి ఒక గంటలో నేర్పిస్తాను' అంది మానస.

ఈలోపు లోకల్ ప్రజాప్రతినిధి నుండి విమర్శలు ఎక్కువయ్యాయి. 'ఇంత రిస్కుతో కూడుకున్న పోస్టులోకి మహిళని పంపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వెంటనే మహిళా రేంజర్ని మార్చి మగ ఆఫీసర్ని పంపండి.' అని డిమాండ్ చేయసాగాడు. డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ నుండి కళ్యాణికి ఫోన్ వచ్చింది. 'నిన్ను అక్కడ నుండి ట్రాన్సఫర్ చేద్దామనుకుంటున్నాం' అని చెప్పాడాయన.

కళ్యాణి ఉద్యోగంలో చేరటానికి వచ్చినపుడు మారుమూల ఉన్న ఆ ఊరిని చూసి ఇక్కడ నుండి ఎప్పుడెప్పుడు విముక్తి కలుగుతుందా? అని అనుకున్న మాట వాస్తవం. కానీ ఇలా ఒక పెద్దపులి చేతిలో ఓడిపోయి, వెళ్ళిపోవటం అంటే అది తనకు మాత్రమే కాదు, ఆడవాళ్లందరికీ అవమానమని ఆమె భావించింది. అందుకే, 'నాకు ఒక వారం సమయం ఇవ్వండి సార్' అని అడిగింది.

'వారంలో ఏమవుతుంది కళ్యాణీ! మగవాళ్ళయితే నీకంటే ఏదో ఎక్కువ సాధిస్తారని కాదు. ఈ ప్రజా ప్రతినిధుల విమర్శలకు కొన్ని రోజులు విరామం దొరుకుతుందని' అన్నాడాయన. 'లేదు సార్. వారంలో ఆ పెద్దపులిని పట్టుకుంటాను' ఆత్మ విశ్వాసంతో చెప్పింది కళ్యాణి. కొద్దిగా ఆలోచించి, 'సరే వారం సమయం ఇస్తున్నాను. వారం తరువాత కూడా పులిని పట్టుకోలేక పోతే, నీ అంతట నువ్వే అక్కడ నుండి వచ్చేయాలి' అంటూ ఫోన్ పెట్టేశాడాయన.

ఈలోపు మానస అక్కడి యువతీ యువకులను ఉపయోగించుకుని డ్రోన్ కెమెరాలతో అడవిని జల్లెడ పట్టటం ప్రారంభించింది. 48 గంటల్లో వారి కృషి ఫలించింది. పులి ఆచూకీ తెలిసింది. నీరు తాగటానికి సెలయేరుకు వచ్చిన పులి డ్రోన్ కెమెరాకి చిక్కింది. అది ఆడ పులి. పిల్లలతో ఉంది. పైగా దాని నడకని పరీక్షించిన కళ్యాణి దాని ఒక కాలు విరిగి ఉందని గమనించింది. 'విరిగిన కాలుతో పులి అడవిలో జంతువులను వేటాడ లేదు. అందుకే అది నెమ్మదిగా కదిలే మనిషిని ఆహారంగా ఎంచుకుంటోంది' చెప్పింది.

వెంటనే రియాక్టయిన ఆమె పులి కనిపించిన ప్రదేశానికి బయలుదేరింది. పులి నీరు తాగటానికి వచ్చిన సెలయేరు దగ్గర ఉన్న ఒక చెట్టు మీద కళ్యాణి తన బృందంతో మాటు వేసింది. కళ్యాణి మిగిలిన సిబ్బందికి జాగ్రత్తలు చెప్పింది. 'ఈ ట్రాంక్విలైజర్ గన్ పేలిస్తే మత్తు మందు ఉన్న సిరంజి దూసుకు వెళ్ళి పులి శరీరంలో గుచ్చుకుంటుంది. 30 నుండి 45 నిమిషాల వ్యవధిలో అది మత్తులో కూరుకు పోతుంది. కానీ ట్రాంక్విలైజర్ ప్లాస్టిక్తో చేసి ఉంటుంది. లోహంతో చేసిన బుల్లెట్లా గురి కుదరదు. ఏ మాత్రం గాలి ఉన్నా గురి

తప్పుతుంది. అందుకే, పులి నిలకడగా ఉందనుకున్నప్పుడే కాల్చాలి' అని తను నేర్చుకున్న మాటలు వారికి చెప్తూ, 'అది నీళ్ళు తాగేందుకు సెలయేటి వద్దకు వెళ్ళేవరకు ఎవరూ కాల్చవద్దు. అప్పుడయితే అది కదలకుండా చాలా సేపు ఉంటుంది' అని హెచ్చరించింది.

ఒక రోజు గడిచేటప్పటికి ఎప్పుడు వస్తుందో తెలియని పులి కోసం చెట్టు మీద మాటు వేసి కూర్చోవటం అంత తేలిక కాదని ఆమెకు అర్ధమయింది. రెండవ రోజు రాత్రి పులి సెలయేటి దగ్గరకు వచ్చిన అలికిడి అయి చెట్టు మీద ఉన్న అందరూ అప్రమత్తమయ్యారు. అసలే రాత్రి. దట్టమయిన చెట్లు చీకటిని మరింత పెంచి పోషిస్తున్నాయి.

చెట్ల గుబుర్లను అడ్డుగా చేసుకుని పులి నీటి వైపు నెమ్మదిగా అడుగులు వేస్తోంది. అలా వెళ్తున్న పులి ఒక్కసారిగా ఆగింది. మనుషుల వాసన దానికి తగిలినట్లు ఉంది, చుట్టూ చూడబోయింది. కళ్యాణి ఇచ్చిన సూచనలు మరచిపోయాడో, ఆమె విజయం సాధించటం రుచించలేదో& ఆమె సూచనలకు విరుద్ధంగా గన్ పేల్చాడు యాదగిరి. ఠప్ మన్న శబ్దంతో ట్రాంక్విలైజర్ దూసుకెళ్ళింది. అయితే అది పులికి తగలలేదు. దాని పక్కగా వెళ్ళి గడ్డిలో పడిపోయింది.

ఈలోపు గన్ పేల్చిన శబ్దానికి అలెర్ట్ అయిన పులి క్షణంలో పొదల్లోకి దూరి మాయమయింది. యాదగిరిని ఏమి అన్నా ఇప్పుడు ఉపయోగం లేదని తెలుసు కాబట్టి కళ్యాణి ఏమీ మాట్లాడ లేదు. అతని కళ్ళలో కనీసం విచారం కనపడలేదు కళ్యాణికి. 'ఇక ఇక్కడ కాపు కాయటం వృధా. మళ్ళీ అది ఇక్కడకు రాదు' అంది ఆమె. తిరిగి డ్రోన్ కెమెరాలతో ట్రాకింగ్ మొదలయింది. ఈలోపు ఎరగా వేసే బోనులు వచ్చాయి. అడవి లోపల వరకు వాహనాలు రావు కాబట్టి ఆరేడుగురు మనుషులు కలిసి ఆ బోనులను మోసుకు వెళ్ళాలి. పులి ఎక్కడకు వస్తుందో అంచనా వేసి అక్కడ ఈ బోనులు పెట్టాలి.

మరో రెండు రోజుల తరువాత బహిర్భూమికి వెళ్ళిన ఒక మహిళని పులి ఈడ్చుకు పోవటం డ్రోన్ కెమెరాలో రికార్డ్ అయింది. అది ఈసారి ఉత్తరానికి కాకుండా వెనక్కి ప్రయాణిస్తోంది. 'మనం అనుకున్నదాని కంటే ఇది జిత్తులమారి పులి' అని డిక్లేర్ చేసింది కళ్యాణి.

'పులికి ఆహారం దొరికింది కాబట్టి దాహం కూడా తీరాలి. దానికోసం అది ఎక్కడకు వస్తుందో అంచనా వేసి అక్కడ బోను పెడదాం' చెప్పాడు మల్లేశం. పులి కనిపించిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న ఒక నీటి మడుగును గుర్తించి అక్కడకు బోనును చేర్పించారు. అప్పటికి డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఇచ్చిన వారం గడువు ముగియటానికి ఇంకా ఒక్క రోజు సమయం మాత్రమే ఉంది. బోనులో ఉంచటానికి తెచ్చిన మేకను పక్కకు జరిపి, 'బోనులో అది కాదు, నేను కూర్చుంటాను' అంది కళ్యాణి. 'అది ప్రమాదం అమ్మా' అంటూ ఏదో చెప్పబోయిన మల్లేశాన్ని మధ్యలో అడ్డుకున్న కళ్యాణి, 'మేక కంటే మనిషి రుచే ఇప్పుడు దానికి ఇష్టం. దానిని పట్టుకోవాలంటే ఇదొక్కటే మార్గం. నాకు ఏమీ కాదు, మీరు వెళ్లండి. పులికి మత్తు ఎక్కగానే

మీకు కబురు చేస్తాను'' అంటూ వాకీటాకీ చూపించింది.

అందరు ఆమె చెప్పిన సూచనలు పాటించినా, యాదగిరి మాత్రం ఎవరికీ తెలియకుండా వెనక్కి వచ్చి ఒక చెట్టు ఎక్కి కూర్చున్నాడు. నిజంగానే కళ్యాణి పులిని పట్టుకుంటే ఆమెకు ఎక్కడ పేరు వస్తుందో అని అతని దుగ్ధ. తనే మత్తు ఇంజెక్షన్తో పులిని కాల్చి ఆమెకు వచ్చే పేరు రాకుండా చేయాలని అతని ఊహ.

బోనులో మేకని పెడితే బోను తలుపు తెరచి ఉంచుతారు. మేక కోసం బోనులోకి వచ్చిన పులికి మేక చిక్కుతుంది. అప్పుడు బోను తలుపు వేసుకు పోయి పులి బంధింపబడుతుంది. ఇప్పుడు ఇక్కడ లోపల ఉంది మనిషి కాబట్టి బోను తలుపు వేసి ఉంచుతారు. మనిషి కోసం బోను దగ్గరకు పులి వస్తే మనిషి మత్తు ఇంజెక్షన్తో దానిని కాల్చాలి.

కూర్చున్న కళ్యాణి ఉన్న భాగం తప్ప మిగిలిన బోను కనపడకుండా పచ్చటి చెట్ల కొమ్మలు, తీగలు బోను మీద కప్పారు. చీకటి పడింది. అడవి మొత్తం కీటకాలు చేస్తున్న శబ్దాలతో నిండి పోయింది. బోను మేక కోసం చేసింది కాబట్టి మనిషికి విశ్రాంతిగా కూర్చునే వీలు ఉండదు. వంగి కూర్చోవాలి. గంట మీద గంట గడుస్తున్నా పులి జాడ లేదు. నడుము లాగేస్తోంది. సమయం చూస్తే రాత్రి రెండవుతోంది. తెల్లవారితే తను ఓడిపోయినట్లు ఒప్పుకుని వెళ్ళిపోవాలి. ఓటమి అన్న భావం సహించరానిదిగా తోస్తోంది ఆమెకు. ఇది పులికీ తనకీ మధ్య వ్యక్తిగత పోరాటంలా మారింది. బోనులో మేక ఉంటే దాని అరుపులకు ఎట్రాక్ట్ అయి పులి వచ్చేదేమో. ఇప్పుడు తను ఏమీ చప్పుడు చేయకపోవటంతో అది రావటం లేదేమో. అలా అనిపించిన మరుక్షణం బోను తలుపు పెద్ద శబ్దంతో తెరచింది కళ్యాణి. తోచిన పాట పాడుతూ శబ్దం చేస్తూ బోను బయట నిలబడింది. దాదాపు అరగంట పాటు అలా ఏదో ఒక శబ్దం చేస్తూనే ఉంది కళ్యాణి.

అయినా పులి జాడ లేదు. వాకీటాకీ లో తన సిబ్బందిని సంప్రదిద్దామా అనుకుని కూడా ఆ సమయంలో వారు చేయగలిగింది ఏమీ ఉండదని, ఆ ఆలోచన విరమించుకుంది. ఇక తను ఓడిపోయానని నిశ్చయించుకుని తిరిగి బోనులోకి వెళ్లటానికి వెను తిరిగిన కళ్యాణి ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఎప్పుడు వచ్చిందో, ఎదురుగా పులి ఉంది. సరిగ్గా బోనుకు, తనకు మధ్య ఉంది అది. ఇప్పుడు తను వెళ్లాలన్నా బోనులోకి వెళ్లలేదు. చేతిలోని ట్రాంక్విలైజర్ గన్ ఎక్కుపెట్టి గురి చూసింది కళ్యాణి. తన చేతులు వణకటం స్పష్టంగా తెలుస్తోంది కళ్యాణికి. పులి ఒక అడుగు వెనక్కు వేసింది. అది కూడా దాడికి సన్నద్ధం అవుతోందని అర్థమవుతోంది. కళ్యాణి సరిగ్గా గురి చూసుకునే లోపే పులి పెద్దగా గాండ్రించి కళ్యాణి మీదకు దూకింది.

అదే సమయంలో కళ్యాణి చేతిలోని గన్ పేలింది. మత్తు మందు ఇంజెక్షన్ పులికి గుచ్చుకుందో లేదో చీకట్లో తెలిసే అవకాశం లేదు. ఇంకోసారి పేల్చేందుకు స్పేర్ ట్రాంక్విలైజర్ తన దగ్గర లేదు. బోనులో ఉంది. మీదకు దూసుకు వస్తున్న పులి విరిగిన కాలు, అది

అనుకున్న విధంగా దూకటానికి సహకరించ లేదు. కళ్యాణి మీద పడాల్సిన పులి కొద్దిగా ముందు పడింది. కళ్యాణి పక్కకి తప్పుకుంది. ఆ పడటంతో దాని విరిగిన కాలు మరింత నొప్పి పెట్టినట్లు ఉంది, పులి భయంకరంగా గర్జించింది. ఆ గర్జనకు చెట్టు మీద కూర్చున్న యాదగిరి పట్టు తప్పింది. బిక్కబీటుగా వచ్చి పులికి ఎదురుగా పడ్డాడు. కళ్యాణికి తను తప్పించుకోవటమే కాదు యాదగిరిని రక్షించాల్సిన బాధ్యత కూడా మీద పడింది.

కింద పడటంతో యాదగిరి చెయ్యో, కాలో విరిగినట్లుంది. బాధతో విలవిలలాడుతున్నాడు. అతడిని భుజాల దగ్గర పట్టుకుని బోను దగ్గరకు లాక్కెళ్లి లోపలకు తోసింది. తను కూడా బోనులోకి వెళ్ళి తలుపు వేసేసుకుంది. అయితే ఆమె వాకీటాకీ కిందకు జారిపోయింది. సిబ్బందిని పిలిచే అవకాశం లేకుండా పోయింది.

పులి కూడా విరిగిన కాలు కలిగిస్తున్న నొప్పి నుండి కోలుకుంది. ఆ తరువాత అరగంట పాటు పులి బోను చుట్టూ తిరుగుతూ అడవి అంతా దద్దరిల్లేలా గాండ్రిస్తూనే ఉంది. అంత దగ్గరగా పులి పెడుతున్న గాండ్రింపులకు ధైర్యం సడలిపోయి యాదగిరి గజగజ వణుకుతున్నాడు. కొంతసేపటికి భయంతో స్పృహ తప్పి పోయాడు. కళ్యాణికి కూడా ఆ అరుపులకే తన గుండె ఆగుతుందేమో అనిపించింది. ఆమెకు ఉన్న ధైర్యమల్లా ఒకటే, పులి శరీరానికి వేలాడుతున్న ట్రాంక్విలైజర్. ఆ మందు పనిచేసి పులి స్పృహ తప్పే క్షణాల కోసం ఎదురు చూస్తోంది కళ్యాణి.

సరిగ్గా నలభై నిమిషాలకు పులి కింద పడి పోయింది. ఆ తరువాత బోను నుండి బయటకు వచ్చి కింద పడిన వాకీటాకీ తీసి మల్లేశానికి జరిగింది చెప్పింది. మరో అరగంటలో వలలు తీసుకుని సిబ్బంది వచ్చారు. పులిని ప్రాణాలతో బంధించారు. మరుసటి రోజు అక్కడకు వచ్చిన డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్, 'మొత్తానికి అనుకున్నది సాధించావ్. ఒక మ్యాన్ ఈటర్ని ప్రాణాలతో పట్టుకోవటం అంటే సామాన్యమయిన విషయం కాదు& మేకకు బదులు బోనులో కూర్చుని మరీ పులిని పట్టుకునే అంత ధైర్యం నీకు ఎలా వచ్చింది?' అన్నాడు మెచ్చుకోలుగా.

'ఆ ఆడపులి విరిగిన కాలు వలన, పిల్లలకు ఆహారం సంపాదించటానికి మరో దారి లేక మ్యాన్ ఈటర్గా మారింది. కానీ మన డిపార్టుమెంటులోనే, ఒక స్త్రీ తమ అధికారిగా రావటాన్ని సహించని ఒకడు నన్ను మరింత దారుణంగా హింసించబోయాడు. అలాంటి వారికి సమాధానం చెప్పటానికే ఈ సాహసం చేయవలసి వచ్చింది సార్.' అంది. 'ఎవరతను? ఇప్పుడే అతని మీద చర్య తీసుకుంటాను' అంటూ ఏదో అనబోయాడు డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్.

'అక్కర్లేదు సర్. మ్యాన్ ఈటర్గా మారిన పులి పిల్లలతో సహా జ్యూకి వెళ్ళి పోయింది. దానిని బంధించే ప్రక్రియలో నాకు కూడా నిజం భయం అంటే ఏంటో తెలిసింది. ఆ భయం అనుభవించిన నాకు ఇక ఏ యాదగిరి భయం లేదు. ఆ పులిని చూసి నా ముందే బట్టల్లో

ఉచ్చు పోసుకున్నాడు యాదగిరి. వాడు నన్నేం చేస్తాడు. ఇక నుండి ఎవరిని ఎలా కంట్రోల్ చెయ్యాలో అలా చేస్తాను' అంది కళ్యాణి ఆత్మవిశ్వాసంతో. 'ఒక ఆడపులి ఇంకో ఆడపులికి జీవిత పాఠం నేర్పిందన్నమాట' అన్నాడు డీఎస్పీ వెళ్ళిపోతూ.

సమాప్తం

* * *

**పుట్టగంటి గోపీకృష్ణ స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. ప్రస్తుతం కర్ణాటకలోని ధార్వాడ జిల్లాలో కర్ణాటక గ్రామీణ వికాస్ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2007 నుంచి రచనలు చేస్తున్నారు. ఇప్పటివరకూ 35 నవలలు, 130 కథలు ప్రచురితమయ్యాయి. ఇద్దరి కలయిక, ఇటు తూరుపు అటు పశ్చిమం, క్వీన్ మేరీ, డూప్లికేట్ నవలలు పాఠకాదరణ పొందాయి. వివిధ పత్రికలు నిర్వహించిన నవలల పోటీల్లో 'నిన్నటి నేడే రేపు', 'రణక్షేత్రం', 'రాజగురువు' ప్రథమ బహుమతులు దక్కించుకున్నాయి. 'గౌరీ కళ్యాణం' నవలకు అనిల్ అవార్డు వచ్చింది. వివిధ సాహితీ సంస్థలు, పత్రికలు నిర్వహించిన పోటీల్లో వైరస్, ఎన్‌కౌంటర్, ఫాంటసీ, రోకలి ఓబవ్వ, తనదాక వస్తే.. రచనలు బహుమతులు గెలుచుకున్నాయి. 'సాహిత్యం' అనేది చదివే పాఠకుడికి ఏదో ఒక రసాస్వాదన కలగజేయాలని, రచనలో చదివించే గుణం ముఖ్యమని గోపీకృష్ణ నమ్ముతారు.**

# బోగం ఎంకటి



చిప్పబత్తుల శ్రీనివాస్

ఎన్నీలలో కూసొని ఎక్కెక్కి ఏడ్సుకుంట ఆ సమాధులను తడుముతున్నడు. ఇలా ఎన్నాళ్లని ఏడుస్తూ బతకడం! నిజానికి ఆ పన్నెండేండ్ల పిలగానికి భూమ్మీద ఉండాలనే లేదు. కానీ, సావుకు చేతులు సాచి ఏడ్వడం శాతగానితనం కిందనే లెక్కకదా!

'..అయితే ఎదురీదైనా బతకాలి. లేదంటే వరద కొట్టుడుకు మునకలేస్తూనైనా పోవాలి. సస్తూ బతకడం, బతుకుతూ సావడం చేసుకుంట, దానికింకా 'బతుకు' అని పేరు పెట్టుడెందుకు?! ఉన్నచోటు నచ్చని చేపపిల్ల కలగన్న చోటును చేరేదాకా ముందుకు కదులుతూనే ఉంటది. బాధల్లో బందీ అయిన మనిషి జిందగీని, సుఖాలను తాకట్టుపెట్టి ఇడిపించుకోవాలి. కష్టాలు నిన్నిష్టపడి కోలాటమాడుతుంటే కూడా, నువ్వు కొసదాకా ఓపిక పట్టాలి. పుట్టినోడల్లా సావాల్సిందే! కానీ, సచ్చేలోపు ఈ భూమ్మీద నీ గెలుపు ముద్రలు పడాలి. అవి చెరిగిపోనివి కావాలి. బతుకంటే కథగా మిగలడం. ఇది గుర్తుంచుకో కొడుకా!'

తండ్రి చెప్పిన మాటలు గుర్తుకొచ్చి అంత దుఃఖంలోనూ నవ్వుకున్నాడు తను. కొండంత ధైర్యం గుండెల నిండా నిండిపోయింది. మనిషికి నిజమైన ధనమూ, ఈ బండికి ఇంధనమూ.. ధైర్యమే! అది అనుభవించినవారికే

అర్థమవుతుంది.

* * *

'ఎంకటికి బాకీ పడనోళ్లు ఎవరుంటార్రా భాస్కరా? అందరమూ అతని రుణంలో ఉన్నోళ్లమే! నిజానికి ఊరే ఆయనకు బాకీ పడిపోయింది'.. కొడుకుతో ఎన్నడూ లేనంత విచారంగా మాట్లాడుతున్నాడు రాములు. 'చిన్నప్పటి నుంచీ చూస్తూనే పెరిగిన కదా! ఎంకటి మామను. మీ ఇద్దరీ స్నేహమూ, అంతకుమించిన అనుబంధమూ నాకు తెలియందా నాన్నా!'.. మనసులో అనుకున్నాడు భాస్కర్.

'భాస్కరా! నువ్వు ఎలాగైనా కోడలును తీసుకురావాల్సిందే! నువ్వేం చెప్తవో ఏమో గానీ.. కోడలు మాత్రం వచ్చి తీరాలి!'.. ఈ మాటలు వింటూనే అదిరిపడ్డాడు భాస్కర్. 'నాన్నా.. సుమతి సంగతి నీకు తెల్సిందే కదా! ఆమెను ఒప్పించడం నావల్ల కాదు. అంతగా కావాలంటే నీతో రెండ్రోజులు ఉండి వెళ్తాలే!' అనునయిస్తూ అన్నాడు భాస్కర్. '..అయితే నువ్వు కూడా రానక్కర్లేదు!'. 'అదికాదు నాన్నా!'.. భాస్కర్ ఏదో చెప్పబోయాడు. '..ఇది నా చివరి కోరికనుకో!' అంటూ ఫోన్ పెట్టేశాడు రాములు.

'ఎంకటి మామ చనిపోతే నన్ను రమ్మనడంలో ఒక అర్థముంది. కానీ, సుమతిని తప్పనిసరి రమ్మనడం ఏంటి? ఎంకటి మామ చనిపోయాడట. నాన్న ఫోన్ చేసి మనిద్దర్నీ రమ్మన్నాడని చెప్పగానే, ఉన్నపళంగా వెంట బయల్దేరడానికి ఆమె మామూలు ఇల్లాలు కాదు.. సుమతి. ఈ భూమ్మీద ఉన్నంత వైవిధ్యమూ, వైరుధ్యమూ, వైశిష్ట్యమూ.. అన్నీ ఆమెలోనే నిబిడీకృతమై ఉన్నట్లు అనిపిస్తుంది. సుమతి ప్రాక్టికాలిటీ భరించడం చాలా కష్టం. కొన్ని విషయాల్లో కఠినంగా ఉంటుంది. ఎదుటివారి అభిప్రాయాలను చాదస్తంగానో, తెలివి తక్కువతనంగానో తీసిపారేయడంలో ఆమెకు ఆమే సాటి. మేనమామ కూతురే అయినా.. మా కుటుంబంలో తనింకా కలిసిపోయినట్లు అనిపించదు. అదేంటో గానీ మా నాన్న మాత్రం ఆమెను చిన్నమాట కూడా అనడు. ఆమె తల బిరుసుతనం పొగరనిపిస్తుంది. ఆ వెంటనే తెలియనితనమని తేలిపోతుంది. పల్లెలన్నా, మట్టిమనుషులన్నా.. తనకు మొదట్నుంచీ చులకన భావనే! అంత గొప్ప డాక్టర్‌గా పేరు సంపాదించుకుంది గానీ, మట్టి మనుషులను దగ్గరికి రానీయదు. అందులో ఎంకటి మామకు మినహాయింపు అస్సలు లేదు. ఆమెకు నచ్చని వ్యక్తుల్లో ఎంకటి మామ ముందు వరుసలో ఉంటాడు. ముతక బట్టలు వేసుకుని, చేతుల నిండా కాయలతో, ఎడమ కాలికి బేడీ వేసుకొని ఎంకటి మామ ఎదురుపడితే చాలు.. సుమతికి కోపం అదుపు తప్పుతుంది. వయసులో పెద్దాయన అనికూడా చూడకుండా ఎలా పడితే అలా మాటలు అనేస్తుంది. అలాంటి వ్యక్తి చివరి చూపునకు ఆమె వస్తుందని ఆశించడం ఆత్మవంచనే అవుతుంది!'..

భాస్కర్ అంతర్మథనంలో మునిగిపోయాడు.

* * *

'మీరెళ్లిరండి!' అన్నది. ఆ విషయం అసలు తనకు అనవసరం అయినట్లు. 'సుమతీ!'.. భాస్కర్ ఏదో చెప్పబోయాడు. చురుక్కున తలెత్తి చూసింది.. 'చెబితే అర్థం కాదా!?' అనే తీక్షణతా భావానికి జోడీగా తిరస్కరణ బాణం కూడా విసిరింది. చేసేదేమీ లేక తండ్రికి ఫోన్ చేశాడు భాస్కర్. రెండు నిమిషాలయ్యాక సుమతి ఫోన్ మోగింది. '..అమ్మా! ఇప్పటిదాకా నోరు తెరిచి నిన్నేమీ అడగలేదు నేను. ఈ ఒక్కసారి ఈ ముసలోడి మాట కాదనకు. దీనికి బదులు నా చావుకు నువ్వు రాకున్నా ఫరవాలేదు'.. తండ్రి మాటలు భాస్కర్‌కు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఎక్కడో గుండె కలుక్కుమంది. తట్టుకోలేక బాల్కనీలో నిల్చుండిపోయాడు. కొంతసేపయ్యాక.. 'వెళ్దాం పదండి!' అంటూ భాస్కర్ వెనకాల సుమతి గొంతు.

* * *

'..నేనెలా తలకొరివి పెడతాను మామయ్యా!? ఎంకటికి నాకు.. ఐమీన్ మనకు ఏ రిలేషన్ ఉందని? నా కన్న తల్లిదండ్రులు ఉండగా ఆ అనాథ శవానికి నాతో అంత్యక్రియలు చేయించడంలో మీ ఉద్దేశం ఏమిటి? మీ మధ్య స్నేహం ఉంటే మాత్రం.. నన్ను ఇన్‌వాల్వ్ చేయడం, దానికో రిలేషన్ క్రియేట్ చేయడం మాత్రం కరెక్టు కాదు' అంటూ సుమతి అసహనంగా రాములు వైపు చూసింది.

సుమతి మాటలు మౌనంగానే వింటున్నాడు రాములు. 'నాన్న ఇలా చేస్తున్నాడేమిటి?' అని భాస్కర్ అయోమయంగా చూస్తున్నాడు. రాములు ఆలోచనల్లోంచి బయటపడి దీర్ఘంగా నిట్టూర్చి.. సుమతి వైపు నింపాదిగా చూశాడు. 'నీకెట్లా చెప్పాలో అర్థం కావడం లేదమ్మా! చెప్పినా నువ్వది జీర్ణించుకోలేవు. నీ పరిస్థితి నేనర్థం చేసుకోగలను'.. నెమ్మదిగా అన్నాడు రాములు. 'మీరంతగా బాధ పడేసరికి రావాల్సి వచ్చింది. ఇలా మీ పెద్దరికాన్ని అడ్డుపెట్టుకొని పిచ్చి పనులు చేయిస్తారనుకుంటే.. మీ మీదున్న గౌరవం తగ్గుతుంది'.. సుమతి మాటలు వాడిగా, వేడిగా గుచ్చుకునేలా..

'మిత్రద్రోహం చేస్తూ ఇచ్చిన మాట తప్పుతున్నా.. అమ్మా! ఇక చెప్పక తప్పదు. నువ్వు.. నువ్వు..' అంటూ ఆగాడు రాములు. సుమతి, భాస్కర్ ఇద్దరూ రాములు వైపే చూస్తున్నారు.

'నువ్వు.. ఎంకటి కన్న కూతురువు!' గద్గద స్వరంతో.. రాములు ఇన్నాళ్లూ దాచిన రహస్యం చెప్పాడు. కళ్లు బైర్లు కమ్మి తూలిపడబోయారు.. ఆ భార్యాభర్తలు.

* * *

డెబ్బై అయిదేండ్ల కిందటి ముచ్చట. రజాకార్ల జమానాలో సంగంలో కల్సిండు మోహన్ దొర. నాలుగూర్లకు పెద్దొరగా హడల్ సాగించుకునే నరోత్తం దొరకు ఇది మింగుడు పడలేదు. పెద్ద కొడుకు జనంకోసం నిలబడుతుండు అంటే.. ఇగ దొరతనానికి డొల్లవడ్డట్టే! పెద్ద కొడుకు మీద ఆశలొదిలేసుకుని మిగిలిన ఇద్దరు కొడుకులను ముందట నిలవెట్టిండు.

నాలుగేండ్లు గిర్రున తిరిగిపోయినయ్. భూమ్మీద ఉన్నాడో లేడో అనుకుంటున్న సమయానికి ఊళ్లోకి అడుగువెట్టిండు మోహన్ దొర. వెంట ఓ అమ్మాయి. ఆమె చంకలో ఓ

పిలగాడు. మొదట్నుంచీ ఆదర్శభావాలు గల మోహన్ దొర, సంగంలో సభ్యురాలైన చంద్రకళను ఆదర్శ వివాహం చేసుకున్నడు. దొర గడీలో చంద్రకళకు కోడలు హోదా దొరకలేదు. అసలు నరోత్తం దొర వారిని ఇంట్లోకే రానీయలేదు. తండ్రికి దూరమైన మోహన్ దొరకు ఊరి జనాలు దగ్గరయ్యారు.

ఇలాగైతే కొడుకు దారికి రాడని ఆస్తిలో వాటా ఇవ్వనన్నాడు నరోత్తం దొర. వాటా కావాలంటే దొరోరి పిల్లను మళ్లా పెళ్లి చేసుకోవాలని ఎర వేశాడు. పెళ్లి వెనుక మతలబు అర్థం చేసుకున్న మోహన్ దొర.. తండ్రి మాటను ఎడమ చేత పక్కకు జరిపి, ఆస్తి వాటాకోసం కోర్టులో దావా వేశాడు. ఊరి జనంతో కలిసిమెలిసి తిరుగుతున్నడనీ, ఆస్తి కోసం కోర్టుకు పోయాడనీ నరోత్తం దొర, కొడుకును కంట్ల పెట్టుకొనేటోడు. కాలం కూడా పగబట్టింది.

భూమిలేని పేదోళ్లతో కలిసి పరంపోగును సాగులోకి తెచ్చారు మోహన్ దొర దంపతులు. ఎండనకా, వాననకా చెమట చిందించేటోళ్లు.. ఆ భార్యాభర్తలు. రాత్రిళ్లు పేదోళ్లకు చదువు చెప్పేవారు. ఇవన్నీ చూడలేని కాలం.. పొలం దగ్గర పని చేసుకుంటుంటే, పిడుగు రూపంలో వారిని మింగేసింది. అప్పటికి పన్నెండేండ్లకొచ్చిన వెంకటాద్రి.. ఏకాకి అయ్యిండు.

* * *

'ఎంకటి బతుకుల జరిగినవన్నీ నాకొక్కనికే తెలుసు. అందుకే, ఎవరికీ చెప్పొద్దని ఒట్టు పెట్టుకున్నడు. తన బతుకును అవమానంగా, జన్మను ఒక అపరాధంగా బాధ పడేటోడు. నెత్తురు కారుతున్న నిలువెత్తు గాయం లెక్క కనిపించేటోడు'.. రాములు కన్నీళ్లు తుడుచుకుంటూ చెబుతున్నాడు. 'ఇన్ని రోజుల్నుంచీ ఈ నిజాన్ని మింగలేక, కక్కలేక.. గరళాన్ని కంఠాన దాచిన శంకరుని బతుకైంది నాది. చెబితే మాట తప్పినవాడిగా, చెప్పకపోతే ధర్మం తప్పినవాడిగా.. ఇలా అంతరాత్మ ముందు ముద్దాయిగా నిలబడని రోజులేదు. ఇన్ని బాధలు పడేకంటే.. ముందు నేనే చచ్చిపోతే బాగుండని ఎన్నిసార్లు ఆ దేవునికి మొక్కుకున్ననో!' అంటూ ఆగిపోయాడు రాములు. సగం దూరం నడిచాక.. మనదారి అది కాదని, మన గమ్యానికది చేర్చదని తెలిసినప్పుడు ఆ మనిషి పరిస్థితి ఎలా ఉంటుంది? ఇప్పుడు సుమతికీ అలాగే ఉంది. భాస్కర్.. అయోమయం, అనుమానం ఈ రెండిటి మధ్య ఇరుక్కుపోయాడు. 'అసలు.. నేనెవర్ని?'.. రాములు చేతులు పట్టుకొని అడిగింది సుమతి.

* * *

ముందుముందు ఆస్తి వాటాల్లో గొడవలెక్కడ వస్తాయోనని నరోత్తం దొర వెంకటాద్రిని వెంట తీసుకెళ్లిండు. కొడుకు కొడుకన్న కనికరం లేకుండా ఇంటి వారసుణ్ని ఇంటికి చిన్న పాలేరుగా మార్చేశిండు. పొట్టకు, కట్టుబట్టకు లోటు రాకుండా కట్టు బానిసత్వంలో వెట్టి చేసుకుంట.. కండలు కలికలి చేసుకొని మంచి పనిమంతుడు అయ్యిండు వెంకటాద్రి. కాలం వెనుకముందు జరిగిందంతా వెళ్లగక్కింది. కోర్టు దావాలో మోహన్ దొర గెలిచిండు. వారసునిగా వెంకటాద్రి నిలిచిండు. వందల ఎకరాల భూమి.. చేను, చెలక, తోటలు..!

అదంతా కాదని వాళ్ల నాయన ఎవుసం చేసిన పరంపోగు, దాని పక్కనున్న పదెకరాలు తీసుకున్నడు. నరోత్తం దొర మొకం శిన్నగైపోయింది. పెళ్లీడుకొచ్చిన వెంకటాద్రికి పిల్లను చూసేవాళ్లు లేరు. పిల్లను ఇచ్చేవాళ్లూ లేరు. ఆ ఇంటికి కోడలు వరుసైన నీరజ.. వెంకటాద్రిని ఇష్టపడ్డది. ఆడపిల్ల అయ్యుండి కూడా ఆశగా మనసును గొంతులోకి ఒలికించి అడిగింది.

తరతరాలుగా అంతరాలను లెక్కలోకి తీసుకొనే ఈ లోకం.. మనసు ఊసులను పట్టించుకుంటదా? అందుకే నా అనేవాళ్లు లేని వెంకటాద్రి పెళ్లి ముచ్చట దూరం పెట్టిండు. పట్టుపట్టిన నీరజ.. వెకటాద్రి చెయ్యి పట్టేదాకా వదిలిపెట్టలేదు. దానికోసం కన్నోళ్లనే కాదనుకున్నది. అదృష్టం అమాంతం పూలవాన కురిపించినట్టు సంబురపడ్డడు వెంకటాద్రి.

సంవత్సరం తిరిగేసరికల్లా కలల పంటగా ఓ పాప ఒడిలోకి చేరింది. బతుకును మొలకెత్తించిన ఆ పసిబిడ్డకు సుమతి.. అని పేరు పెట్టుకున్నరు. అంతలోనే అంతా తలకిందులైంది. దురదృష్టం ముందు అదృష్టం చిన్నదైపోయింది. నెలల పాపనొదిలి, కోరి కట్టుకున్న భర్తనొదిలి హఠాత్తుగా తనువు చాలించింది నీరజ.

* * *

'జీవితం విసిరిన ఆ సవాళ్లకు మీ నాన్న దగ్గరే కాదు.. మరెవ్వరి దగ్గరా జవాబులుండయ్! మా ఇద్దరి మధ్యనున్న స్నేహంతోనే పసిపిల్లగా ఉన్న నిన్ను మా పెద్ద బామ్మర్దికి సాదుకోనిచ్చిండు. నువ్వే ఎంకటి బిడ్డవి. ఎంకటే నీ కన్నతండ్రని నాకొక్కనికే తెలుసు. నిన్ను సాదుకున్న తండ్రికి కూడా నువ్వెవరి బిడ్డవో ఇప్పటికీ తెల్వది. ఈ ఊళ్లో ఎంకటిని సాయం అడగనోళ్లు లేరు. అతని సాయం పొందనోళ్లూ లేరు. అంతెందుకు భాస్కర్ పెద్ద సదువులకు పైసలు సాయం చేసింది మీ నాన్నే! పేరుకే మా బామ్మర్ది నీకు తండ్రి.. నీకైన ఖర్చులన్నీ నేనే పెట్టెటోణ్ని. అవన్నీ ఎంకటి పైసలే!'..

సముద్ర కెరటమొకటి ముఖాన్ని తాకినంతగా తల్లడిల్లిపోయింది సుమతి. ఇదంతా నిజమేనా అన్నట్లు, నమ్మలేనట్లు చూస్తున్నాడు భాస్కర్. 'మనిషి చూస్తే మోటుగా కనిపించేటోడు గానీ, ఎంకటి మనసెంత తేటదో నాకు తెలుసు. రంది నుంచి తప్పించుకోవడానికి పనికి మించిన మందులేదు. అది మీ నాన్నకు బాగా తెలుసు. 'ఎంకటి బావా! నీ కష్టాలకు లెక్క లేకపాయె!' అంటే ఏమనేవాడో తెలుసా!?.. 'బళ్లె బడి పంతులు గట్టోనికి గొట్టు లెక్కలేస్తడు. మోస్తడనుకున్న మొండోనికి దేవుడు బరువు లెక్కువ ఇస్తడు. అదంతే రాములు బావా!' అంటూ ముద్దుగా నవ్వేటోడు. గట్టువాగు చుట్టూ మొలకలు నాటి.. నాటి.. గుట్టనంతా పెద్ద జంగల్ లెక్క చేసిండు. ఊళ్లె బడి ఉండాలని పట్టుబట్టి కట్టించిండు. ఎనుకటెప్పుడో కూలిపోయిన శివాలయాన్ని బాగు చేయించిండు. గొడ్డు కష్టం చేసుకుంట సంపాదించెటోడు. వచ్చిన పైసలన్నీ మంచి పనులకు కర్సు వెట్టేటోడు. అష్టకష్టాలు వెట్టిన నరోత్తం దొర తొంటిరిగి మంచాన వడితే, మనసులో కల్మషం లేని మనిషాయె ఎంకటి.. ఎత్తిపోసి ఒంటి పుండ్లన్నీ కడిగిండు. ఈ లోకం పాడుగాను. ముంగట

ముచ్చట వెట్టి ఎనుకాల ఎక్కిరించేది ఎంకటిని. నేనెప్పుడన్నా రేషానికి వోతె.. 'రాములు బావా! నున్నగున్న రాయిమీద దుమ్ము నిలువది. నల్లగున్న వరుని మీది మరక ఆనది! ఎవలెట్ల అనుకుంటె.. గట్లనే అనుకోనియ్యి. కుడి ఎడమలను అటీటు చేసి అద్దం జూపంగనే.. మన అంతరాత్మ నమ్ముతదా ఏంది?!' అనేటోడు'..

ఏండ్ల నుంచి జమైన బాయిల పూడిక తీసినట్లు రాములు మనసు అల్కగయ్యింది. సుమతినే చూస్తున్నాడు భాస్కర్. 'ఎన్నిసార్లు చీదరించుకుందో తను. ముఖమ్మీదే సూటిపోటి మాటలన్నా.. ఏమాత్రం చిన్నబుచ్చుకునేటోడు కాదు ఎంకటి మామ! పండుగకో, ఫంక్షన్‌కో ఊళ్లోకి మేమొస్తే చాలు.. మా ఇంటి చుట్టే తిరిగెటోడు పాపం! కళ్ల ముందర కన్నబిడ్డ పరాయిదానిలా పట్టించుకోకున్నా.. బయటపడకుండా ఎట్లా తట్టుకున్నాడో!? పిల్లల్ని ముట్టుకోవద్దని గద్దరించి పెట్టినప్పుడు చిన్నబోయినట్లు ముఖం పెట్టిన ఎంకటి మామ ఏమనుకున్నడో?!' భాస్కర్ అపరాధ భావంతో తల పట్టుకున్నాడు.

ఎవల నుంచి ఏదీ ఆశించని ఎంకటి ఈ లోకానికి మాత్రం ఇచ్చుకుంటనే బతికిండు. మార్చుడు, ఏమార్చుడు ఈ మనుషులకు కొత్తకాదు కదా! తండ్రి కులం కొడుక్కు చెందనీయకుండా చేసి.. వెంకటాద్రిని ఎంకటిగా మార్చారు వీళ్లు. తల్లి కులం ఏంటిదో తెల్వనందుకు ఇదే మనుషులు ఎంకటిని 'బోగం ఎంకటి'ని చేశారు.

'నాలాంటి వాడి బిడ్డనని నలుగురికి తెలిస్తే.. నా బిడ్డ నారాజ్ అయితది రాములు బావా! ఈ ఒక్క ముచ్చట మాత్రం మనతోనే మట్టిల కల్వనీ..' అంటూ కాళ్లు మొక్కబోతున్న ఎంకటి గుర్తొచ్చి అప్రయత్నంగా కాళ్లు వెనక్కి జరపుకొన్నాడు రాములు. కానీ, ఇప్పుడు సుమతి ..

'మామయ్యా! ఆ దేవునికి ఒక్కపూట తిండి పెట్టలేని దౌర్భాగ్యురాలిని..' అంటూ రాములు కాళ్లు చుట్టేసి గుండెలవిసేలా ఏడుస్తున్నది.

* * *

ఎంకటి మరణాన్ని తట్టుకోలేక నింగి మనసుక్కూడా మబ్బు పట్టిందేమోనన్నట్లు ఒక్కసారిగా వాతావరణం మారింది. కదిలిస్తే కన్నీరుగా కురుస్తాయేమోనన్నంత బరువెక్కాయి మేఘాలు. అక్కడి దృశ్యం చూస్తే ఎవరో రాజకీయ నాయకుడో, గొప్ప పేరుమోసిన వ్యక్తో చనిపోయినట్లు అనిపిస్తున్నది. అనాథలా పెరిగి, అనాథలా బతికిన వ్యక్తంటే ఎవ్వరూ నమ్మరు.

'డెడ్‌బాడీ మెడికల్ కాలేజీకి డొనేట్ అయ్యింది. ఫార్మాలిటీస్ పూర్తయి చాలా సేపైంది. ఇప్పుడు ముట్టుకోవడం కుదరదు. ప్లీజ్ అర్థం చేసుకోండి!'.. శవం దగ్గరికి వెళ్లబోతున్న ముగ్గుర్నీ ఆపారు వైద్యులు. 'అంటే!?'.. కొన్ని క్షణాలకు అర్థమైంది సుమతికి. నేత్ర దానమో, అవయవ దానమో కాకుండా.. ఎంకటి ఏకంగా తన పార్థివదేహాన్ని దానం చేస్తానని బతికున్నప్పుడే బాండ్ రాసిచ్చాడన్న మాట. సుమతి ముఖం మీద మబ్బులు ముసుకున్నాయి. 'పుట్టుడు పుట్టుడే ఏడ్సుకుంట పుడుతం! పోయేటప్పుడు కూడా

ఏడ్సుకుంట పోతరా బావా!? మనం నవ్వుకుంట బోతంటే.. లోకం ఏడ్సుకుంట ఎనుక రావాలె! ఔ.. బావా! నేను వోతె నువ్వు తప్ప నాకేడ్చెటోళ్లు ఎవలున్నరు ఇంక!'.. అని వారం రోజుల కింద పరాచికాలాడిన ఎంకటి మాటలు గుర్తుకొచ్చి రాములు దీనంగా ఏడుస్తున్నాడు.

ఏడుస్తున్న తండ్రిని పొదివి పట్టుకున్న భాస్కర్ కళ్లనిండా నీళ్లు. 'ఎవ్వరికీ ఏ ఇబ్బందీ కలిగించుడు ఇష్టపడని ఎంకటి, మారాజు లెక్క తనదారి తాను చూసుకున్నడు'.. వెనక నుంచి ఎవరో అన్న మాటలు అవి. సుమతి గుండెను ఈటెల్లా పొడిచాయి. అప్పుడే ఎవరో కొన్ని పేపర్లను ఆమె చేతిలో పెట్టారు. అవి ఆస్తి వీలునామా పత్రాలు.

'ఎందుకు నాన్నా! ఇంత పెద్ద శిక్ష వేశావ్! ఒక్కసారి మాట్లాడు నాన్నా!' అంటూ ఆకాశం వైపు చేతులు చాచి, గట్టిగా అరిచింది సుమతి. చెంపలపై జారుతున్న కన్నీళ్లను వర్షం తుడిచేస్తుంటే.. అభిషిక్తమవుతున్నది సుమతి.

* * *

**చిప్పబత్తుల శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం, ఊటూర్ గ్రామం. ఈయన పోస్ట్‌గ్రాడ్యుయేషన్, టీచర్ ట్రైనింగ్ చేశారు. విద్యాభ్యాసం అనంతరం 2002 నుండి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. చిప్పబత్తుల శ్రీనివాస్‌కి చిన్ననాటి నుండే పుస్తక పఠనంపై ఆసక్తి ఉండేది. అయితే వికారాబాద్‌లో టీచర్ ట్రైనింగ్‌లో ఉన్నపుడు ఆయన గురువు చెన్నయ్య సర్ కవితలు, కథలు రాయమని ప్రోత్సహించడంతో రాయడంపై కూడా ఆసక్తి కలిగింది. అలా ఆయన రాసిన మొదటి కవిత 2000 సంవత్సరంలో ఆంధ్రప్రభ వీక్లీలో ప్రచురితమయింది. అలా 2004 లో ప్రియదత్తా వీక్లీ వారు నిర్వహించిన పోటీలో "సప్త వర్ణాల ఆశ" కథ రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతికి ఎంపికైంది. 2006లో "మా మంచి నాన్న" అనే కథను రచించారు. అనంతరం ఆయన చాలా ఏండ్ల (14 సంవత్సరాలు) తరువాత "గంగిరెద్దు–గానుగెద్దు" కథ రచించారు. ఈ కథ ఈయనకి గొప్ప గొప్ప రచయితల ప్రశంసలు దక్కేలా చేసింది. ఇప్పటి వరకు ఈయన 23 కథలు, డజనుకు పైగా కవితలు, కొన్ని వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు. అలాగే ఈయన కలం పేరు సుగంధ. కలం పేరును పేరుతో కలుపుకుని సుగంధ శ్రీనివాస్‌గా రచనలు చేస్తుంటారు.**

# నేరము - శిక్ష



ఇంద్రగంటి
నరసింహ మూర్తి

మూడు గంటలు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరంలో రోడ్లు జలమయమయ్యాయి. రాత్రి ఏడు గంటల సమయంలో కరెంటు లేక నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడసాగారు. విపరీతమయిన ఆలోచనలతో వేడెక్కిన అరవింద్ రెయిన్ కోటు వేసుకుని హెల్మెట్ పెట్టుకుని బైక్ తీశాడు. స్పోర్ట్స్ బైక్ వేగంగా రోడ్డెక్కింది. గంట తరువాత ఇంట్లోకి అడుగుపెడుతున్న కొడుకుని చూసి తండ్రి కిరీటి ఆందోళనకు గురయ్యాడు.

“ఇంత వర్షంలో ఎక్కడికి వెళ్లావురా” ప్రశ్నించింది తల్లి కృష్ణవేణి. మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయాడు అరవింద్ అరగంట తరువాత డిన్నర్ కు రమ్మని పిలిచింది కృష్ణవేణి. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న కొడుకు చేతిపై కాలిన మచ్చలు గమనించిన తల్లి “ఆ మచ్చలేమిట్రా” అని ఆదుర్దాగా అడిగింది. జవాబివ్వకుండా అన్నం కలుపుకోబోయి అరచేతిని ఊదుకున్నాడు అరవింద్. కుడి అరచేతిలో చిన్న పుండును గమనించి అరవింద్‌కు అన్నం తినడానికి

స్పూన్ అందించింది తల్లి.

కొడుకు వాలకం తండ్రి మనసులో అనుమానం రగిల్చింది. "వర్షంలో ఎక్కడికి వెళ్లావు ... ఏం ఘనకార్యం చేశావు" గద్దించాడు కిరీటి. "అర్జంటు పనిమీద ఒక స్నేహితుడిని కలవడానికి వెళ్లాను. చిన్న దెబ్బ తగిలిందంతే ..." అంటూ అన్నం కెలికి ఆకలి లేదంటూ డైనింగ్ టేబుల్ దగ్గరనుండి లేచిపోయాడు అరవింద్. చేతులు కడుక్కుని తన గదిలోకి వెళ్లి తలుపేసు కున్నాడు. కిరీటి మదిలో ఆందోళన మొదలైంది. కృష్ణవేణికీ గాభరాగా ఉంది. ఇద్దరికీ తిండి మీద ధ్యాస పోయింది. కంచంలో నీళ్లు పోసి లేచిపోయాడు కిరీటి. కృష్ణవేణి భర్తను అనుసరించింది. ఇన్‌వర్టర్ వీక్ అవడంతో గదుల్లో లైట్లు ఆరిపోయాయి. హాలులో చీకటిలో కూర్చున్నారిద్దరూ. కొడుకు ఏదో నేరం చేసిఉంటాడని వారి మనసు హెచ్చరించసాగింది.

కృష్ణవేణితో వివాహం నాటికి కిరీటి డిగ్రీ చేసి చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. వివాహమయ్యాక భర్తను ఎమ్‌బిఎ చేయమని ప్రోత్సహించింది కృష్ణవేణి. భార్య ప్రోత్సాహంతో ఉత్సాహంగా ఎమ్‌బిఎ పూర్తి చేశాక కిరీటి దృష్టి బిజినెస్ వైపు మళ్ళింది. ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కృష్ణవేణి తండ్రిని ఒప్పించి భర్త వ్యాపారానికి పెట్టుబడి అప్పుగా ఇప్పించింది. మామగారి మద్దతుతో కిరీటి ఫ్యాన్సీ స్టోర్ తెరిచాడు. భార్య, బావమరుదులు అతనికి అండగా నిలిచారు. వారి సేవాదృక్పథం కస్టమర్లను ఆకట్టుకుంది. వ్యాపారం పుంజుకుంది. ఏడాదిలో ఫ్యాన్సీ స్టోర్ సూపర్ మార్కెట్ గా మారింది. నాణ్యమైన సరకులకు చిరునామాగా నిలిచింది. రెండేళ్ల తరువాత మరో బ్రాంచి వెలసింది. ఆర్థికంగా బలపడుతున్న జంట రెట్టించిన ఉత్సాహంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేయసాగారు. కాలం వేగంగా పరుగెడుతోంది. పదవ వివాహ వార్షికోత్సవం నాడు భార్యాభర్తలు స్టార్ హోటల్ లో లంచ్‌కు వెళ్లారు.

"మన పెళ్లయి పదేళ్లయింది. వ్యాపారంలో స్థిరపడాలనే ఆలోచనతో ఇన్నాళ్లూ కుటుంబ నియంత్రణ పాటించాం. అనుకున్నట్లు వ్యాపారాన్ని విస్తరించాం. స్వంత నివాసం ఏర్పరచుకున్నాం. నేను తల్లిని కావాలనుకుంటున్నాను. ఇద్దరు పిల్లలు నట్టింట్లో తిరిగే ముచ్చట చూడాలని మనసు ఉవ్విళ్లూరుతోంది." అంటూ తన కోరికను వెల్లడించింది కృష్ణవేణి లంచ్ చేస్తూ ... గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు కిరీటి భార్యవైపు ప్రేమగా చూస్తూ ...

మూడు నెలల తరువాత కృష్ణవేణికి తను నెల తప్పినట్లు అర్థమయింది. భార్య నోట శుభసంకేతం విన్న కిరీటి ఆనందం అంబరాన్నంటింది. కృష్ణవేణిని అపురూపంగా చూసుకోసాగాడు. తొమ్మిదో నెలలో కృష్ణవేణికి గైనిక్ ప్రోబ్లమ్స్ మొదలయ్యాయి. బిడ్డ అడ్డం తిరిగిందన్నారు. ఆపరేషన్ చేసి మగబిడ్డను బయటకు తీశారు. తల్లి ఆరోగ్య రక్షణకు గర్భసంచి తీసేయాల్సి వచ్చింది. రెండు నెలల తరువాత కృష్ణవేణి ఆరోగ్యం కుదుటపడింది. తనకిక పిల్లలు పుట్టే యోగం లేదని బాధపడుతున్న కృష్ణవేణిని కిరీటి ఓదార్చాడు. మూడో

నెలలో బారసాల నాడు తమ బిడ్డకు 'అరవింద్' అని నామకరణం చేశారు తల్లిదండ్రులు.

* * *

ఒక్కగానొక్క బిడ్డ అరవింద్‌ను గారాబంగా పెంచసాగారు తల్లిదండ్రులు. అరవింద్ ఖరీదైన బట్టలలో మెరిసేవాడు. మెడలో బంగారు పతకం ధగధగలాడేది. తమ పుత్రరత్నాన్ని రాజకుమారుడిలా పెంచాలని తలపోసారు కిరీటి దంపతులు. "మన అబ్బాయిని డాక్టర్ చేయాలి" అన్న కృష్ణవేణి కోరికకు తన మద్దతు ప్రకటించాడు కిరీటి. అరవింద్ డాక్టరు పట్టాతో హుందాగా నడచివస్తున్నట్లు ఊహించుకుని పరవశించేది కృష్ణవేణి.

మూడేళ్ల వయసు నుండే అరవింద్ విపరీతమైన అల్లరి చేయసాగాడు. అరవింద్ అల్లరి భరిస్తూ, కుమారుడిని ముద్దు చేయసాగింది కృష్ణవేణి. కిరీటి కుమారుడిని పల్లెత్తు మాట అనేవాడు కాదు. తన మాట నెగ్గేవరకు పంతం పట్టడం అరవింద్‌కి అలవాటైంది. ఒక్కగానొక్క బిడ్డ ఏడిస్తే తట్టుకోలేకపోయేది తల్లి. కొడుకు ఏంకోరినా కాదనలేకపోయేవాడు తండ్రి. మంకుపట్టుకు మారుపేరుగా మారాడు అరవింద్.

* * *

అరవింద్ కు నాలుగేళ్లు నిండాయి. పేరున్న కాన్వెంటులో చేరిస్తే క్రమశిక్షణ పేరుతో పిల్లాడిని శిక్షిస్తారనే భయంతో అంతగా పేరులేని ప్రయివేట్ స్కూల్ లో అరవింద్‌ను చేర్చారు తల్లిదండ్రులు. తన కొడుకు తప్పుచేసినా దండించకూడదని షరతు విధించాడు కిరీటి. స్కూల్లో అరవింద్ అల్లరికి అడ్డులేకుండా పోయింది. తోటి విద్యార్థులను కొట్టడం, వారి పుస్తకాలు, పెన్సిల్స్ వంటివి లాక్కోవడం లాంటి పనులలో అరవింద్ ఆరితేరాడు.

ఏడో తరగతిలో సుధాకర్ తోటి విద్యార్థితో తగవుపడి అతనిని రక్తం వచ్చేలా కొట్టాడని స్కూలు నుండి సస్పెండ్ చేశారు. కిరీటి స్కూల్‌కి వెళ్లి పెనాల్టీగా అధికమొత్తం స్కూలు యాజమాన్యానికి చెల్లించి అరవింద్ సస్పెన్షన్‌ను రద్దు చేయించాడు.

మళ్లీ స్కూల్లో చేరిన అరవింద్ కాలరెత్తుకు తిరగసాగాడు. తను తప్పుచేసినా డబ్బు ఖర్చు పెట్టి తప్పు కప్పిపుచ్చుకోవచ్చు ననే భావన బలపడింది. తను ఐశ్వర్యవంతుడు కనుక చుట్టూ ఉన్నవారు తన మాటకు విలువనివ్వాలని, తనకు ఎదురు చెప్పినవారిని ఉపేక్షించకూడదన్న అహంకారం పెరిగింది. అరవింద్ ఇస్తున్న చిన్న చిన్న కానుకలకు ఆశపడిన తోటి విద్యార్థులు అతని అహంకారాన్ని హీరోయిజంగా పొగుడుతూ అరవింద్‌ను రెచ్చగొట్టసాగారు.

"మీరు మాకు ఆర్థికంగా సహాయం చేస్తున్నందున మీ అబ్బాయిని భరిస్తున్నాం. ఈమధ్య మీవాడు మరీ మితిమీరు తున్నాడు. కాస్త అదుపు చేయండి" అని స్కూల్ ప్రిన్స్‌పాల్ కిరీటికి ఫోన్‌లో చెప్పారు. ప్రిన్స్‌పాల్ చెప్పిన విషయాల్ని భార్యకు తెలియజేశాడు కిరీటి. "ఈ వయ–సులోనే మంచి బుద్ధులు నేర్పాలి. మొక్కయి వంగనిది మానయి వంగదన్నారు. నువ్వు వాడిని దండించు" అన్నాడు కిరీటి.

"ఒక్కగానొక్క కొడుకు. వాడి కాల్లో ముల్లు గుచ్చుకున్నా నా ప్రాణం విలవిలలాడుతుంది. వాడు బాధపడితే నేను చూడలేను. వాడినేం అనకండి. కాలంతోపాటే వాడూ మారతాడు." కన్నీళ్లతో చెప్పింది కృష్ణవేణి. కిరీటి మౌనం వహించాడు.

* * *

పదో తరగతి పరీక్షలో విజయం సాధించి, జూనియర్ కాలేజీలో చేరిన అరవింద్ సినీమాల్లో హీరోలా ధీరత్వం ప్రదర్శించాలనుకుంటూ కాలరెగరేసుకు తిరగసాగాడు. తన మాటకు ఎదురుచెప్పినవాళ్లని బెదిరించడం మామూలయింది. ఎమ్ సెట్ కోచింగ్ కు వెడుతున్నట్లు ఇంట్లో చెపుతూ సినీమాలు, షికార్లతో సమయం వృధాచేయసాగాడు.

ఇంటర్ రెండు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. ఇంటర్ సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యాడు అరవింద్. ఎమ్ సెట్ లో ర్యాంకు తెచ్చుకోలేకపోయాడు. బి.ఎస్‌సి డిగ్రీలో చేరాడు.

డాక్టర్ అవుతాడనుకున్న కొడుకు డిగ్రీ కోర్సులో చేరడంతో కిరీటిని నిరుత్సాహం ఆవహించింది. "పోనీలెండి ... మీలాగే డిగ్రీ తర్వాత పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తాడు. చదువు పూర్తయ్యాక వాడినీ వ్యాపారం లోకి దింపుదాం. వాడిని డాక్టరు చదివిద్దామన్న డబ్బు పెట్టుబడిగా పెట్టి కొత్త వ్యాపారం ప్రారంభిద్దాం" సలహా ఇచ్చింది కృష్ణవేణి. "వాడికి సద్బుద్ధులు ప్రసాదించమని భగవంతుని ప్రార్థించడమే మన కర్తవ్యం" అన్నాడు కిరీటి.

* * *

డిగ్రీ కాలేజీలో చేరాక తండ్రిని ఒప్పించి స్పోర్ట్స్ బైక్ కొనిపించుకున్నాడు అరవింద్. కొడుకు ముచ్చట కాదనలేక పోయాడు తండ్రి. స్పోర్ట్స్ బైక్‌పై దర్జాగా కాలేజీకి వెళ్లసాగాడు అరవింద్. తనకు తిరుగులేదన్న అహంకారం మనసులో బలంగా నాటుకుంది. సాయంకాలం మోటార్ బైక్ పై నగర విహారం ఉత్సాహాన్నిస్తోంది. యవ్వనారంభంలో అమ్మాయిల వైపు మనసు లాగసాగింది. చూస్తున్న సినీమాలు వయసుకు మించిన ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. చేతిలో స్మార్ట్‌ఫోన్ కొత్తలోకం చూపిస్తోంది. కాలేజీ అనుభవాలు మధురానుభూతులుగా మార్చుకోమని మనసు హెచ్చరిస్తోంది. చదువుకోవలసిన వయసులో అమ్మాయిలను వలలో వేసుకునే మార్గాలు అన్వేషించసాగాడు అరవింద్. రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. డిగ్రీ ఫైనల్ ఇయర్ లో అడుగుపెట్టాడు అరవింద్. జాలీగా కాలం గడుస్తోంది.

* * *

"ఈరోజు సాయంత్రం నా మిత్రుడు రాఘవరావు తనకు ప్రమోషన్ వచ్చిన సందర్భంగా ఇస్తున్న పార్టీకి మనల్ని ఆహ్వానించాడు. సాయంత్రం ఆరింటికి అందరం వెడదాం" అన్నాడు కిరీటి లంచ్ చేస్తూ. "రాఘవరావు భార్య సునీత నాకూ ఫోన్ చేసింది. అలాగే వెడదాం" చెప్పింది కృష్ణవేణి. అనుకున్నట్లే సాయంకాలం ముగ్గురూ రాఘవరావు ఇంటికి చేరుకున్నారు. అతిథులను సాదరంగా ఆహ్వానించారు రాఘవరావు దంపతులు.

సునీత తన కూతురు అర్చనను కిరీటి కుటుంబానికి పరిచయం చేసింది. అర్చన బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్నట్లు చెప్పింది. కృష్ణవేణి సునీతకు సహాయం చేయడానికి ఆమెతో లోపలికి వెళ్లింది. కిరీటి అక్కడ చేరిన మిత్రులతో కబుర్లు పంచుకోసాగాడు. అర్చనను చూడగానే అరవింద్ గుండె లయతప్పింది. ఆమె అందానికి ముగ్ధుడైన అరవింద్ చూపు తిప్పుకోలేక పోతున్నాడు.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఇదేనేమొ ... అబ్బ ... అర్చన అందాలభామ. నా మనసు దోచింది. ఐ లవ్ హర్ ...' అనుకుంటూ మధురమైన ఊహలలో తేలిపోసాగాడు అరవింద్. అరవింద్ చూపులకు అర్చన తడబడింది. అతని చూపులు విషపు చూపులని ఆమె మనసు హెచ్చరించింది. అటూ ఇటూ తిరుగుతూ అరవింద్ చూపుల నుండి తప్పించుకోవాలని ప్రయత్నించింది. పార్టీ పూర్తయి అతిథులు వెళ్లిపోయాక అర్చనకు హృదయభారం తీరినట్లయింది.

* * *

ఆరాత్రి అరవింద్‌కు నిద్రపట్టలేదు. చంద్రబింబం లాంటి అర్చన ముఖం అతని మనసులో ముద్రపడింది. రాత్రి చాలాసేపు ఆలోచించి మరునాడు తన ప్రేమను అర్చన ముందు వ్యక్తపరచాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నట్లే మర్నాడు సాయంత్రం ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర కాపుకాశాడు. కాలేజీ స్కూటర్ స్టాండ్ లో స్కూటీ స్టార్ట్ చేస్తున్న అర్చనను పలకరించాడు. "నువ్వు ఈ కాలం అమ్మాయిల్లా మోడరన్ డ్రెస్‌లో గాక సంప్రదాయ దుస్తుల్లో కాలేజీకి రావడం నాకు నచ్చింది. నువ్వు చాలా అందంగా ఉంటావు" అన్నాడు నవ్వుతూ. అతని మాటలు వినడం ఇష్టంలేనట్లు అర్చన ముఖం తిప్పుకుంది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మనిద్దరం మేడ్ ఫర్ ఈచ్ అదర్. మన పెళ్లికి మన తల్లిదండ్రులూ కాదనరు. ఏమంటావ్ ..." అన్నాడు తమకంగా. "సారీ ... నాకీ ప్రేమలూ అవీ నచ్చవు. ప్రస్తుతం చదువే నా లక్ష్యం. బి.టెక్ తరువాత ఎమ్.టెక్ చేసి ఫారిన్ వెళ్లాలనుకుంటున్నాను. నా దారికి అడ్డురాకు." అంటూ స్కూటీ స్టార్ట్ చేసి రివ్వున వెళ్లిపోయింది అర్చన.

అర్చన తిరస్కారాన్ని అవమానంగా భావించాడు అరవింద్. ఎలాగైనా అర్చనను తన దారిలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. వరుసగా రెండు రోజులు అరవింద్ అర్చనను వెంబడించాడు. ఆమె ఇంటికి వెళ్ళే దారిలో ఎక్కడో ఒక చోట ఆమె స్కూటీకి తన బైక్ అడ్డుపెట్టి తన ప్రేమను వెల్లడించసాగాడు.

అరవింద్ ప్రవర్తనను తన తల్లిదండ్రులకు చెపితే వారు మనస్తాపానికి గురవుతారని భావించింది అర్చన. పోలీస్ కంప్లయింట్ ఇస్తే కుటుంబం అల్లరిపాలవుతుందని భయపడింది. అరవింద్‌కు తనే గట్టిగా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది.

* * *

చీకటి గదిలో అరగంట మౌనం రాజ్యమేలింది. కిరీటి, కృష్ణవేణిలు ఎవరి ఆలోచనల్లో వారు సతమత మవుతుండగా  ఒక్కసారి లైట్లు వెలిగాయి. కరెంటు వచ్చిందంటూ వార్తలు చూద్దామని టివి ఆన్ చేశాడు కిరీటి.  "బ్రేకింగ్ న్యూస్ ... అర్చన అనే ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినిపై ఏసిడ్ దాడి జరిగింది. నిందితుడు చాలా తెలివిగా కటిక చీకట్లో అర్చన ముఖంపై ఏసిడ్ పోసి పారిపోయాడు. ఆమె వెంటనే మరణించింది.  అర్చన తల్లిదండ్రులు నిందితుడి ఆచూకీ చెప్పలేక పోతున్నారు.  వర్షం కారణంగా నిందితుడు  సాక్ష్యాధారాలు లేకుండా చేయగలిగాడని పోలీసులు చెబుతున్నారు ..."

వార్తలు వింటూంటే కిరీటి చేతిలో రిమోట్ జారి కిందపడింది. కృష్ణవేణి గుండెలో మంట రగిలింది. తల్లి మనసు కంపించింది. "అరవింద్ చేతిపై కాలిన మచ్చలు ... ఏసిడ్ చుక్కలు పడడం వలన కాదుగదా ... అంటే ... అరవింద్ ..." ఆపైన ఊహించుకోలేకపోయింది మాతృమూర్తి.

కిరీటి గబగబా అరవింద్ గదిలోకి వెళ్లాడు. అతని కళ్లు నిప్పులు కురుస్తున్నాయి. "నువ్వు ... అర్చన అనే అమ్మాయి ముఖంపై ఏసిడ్ పోసి వచ్చావు కదూ" అరుస్తున్నట్టు అడిగాడు కిరీటి. "నీకెలా తెలిసింది నాన్నా ..." గాభరాగా అన్నాడు సుధాకర్. "అంటే నేననుకున్నది నిజమేనన్న మాట ... ఆ అమ్మాయి నీకేం అపకారం చేసిందిరా దుర్మార్గుడా ..." గద్గదస్వరంతో అంది కృష్ణవేణి.

"నా ప్రేమ తిరస్కరించింది. రెండు రోజుల క్రితం  నన్ను చెప్పుతో కొట్టింది. తట్టుకోలేకపోయాను.  ఈరోజు  వర్షం రావడంతో నా ప్లాన్ సులభంగా అమలయింది. సాక్ష్యాధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డాను. మీరేం కంగారు పడకండి. నన్నెవరూ పట్టుకోలేరు." తడబడుతూ చెప్పాడు అరవింద్. కోపంతో అరవింద్ చెంపలు వాయించాడు కిరీటి. కృష్ణవేణి కళ్లు వర్షించసాగాయి. నెత్తి మొత్తుకుని రోదించింది.

"మీరు గాభరాపడకండి ... నాకేం కాదు ..." దృఢంగా చెప్పాడు అరవింద్.
తన కసి తీరిందని పైశాచిక ఆనందం పొందుతున్నాడు అరవింద్. ఒక ప్రాణం హరించినా పశ్చాత్తాపపడకుండా నిబ్బరంగా  ఉండగలుగుతున్న కొడుకు రాక్షస మనస్తత్వానికి కృష్ణవేణి మనసు వికలమైంది.

'తప్పు చేసిన పిల్లలను చిన్నవయసులో దండించకపోతే వయసు ముదిరాక అదుపు తప్పుతారని తెలిసీ అలక్ష్యం చేశాను. నా గారాబం వాడిని చెడగొట్టింది. కొడుకుకి మంచి నడత నేర్పడంలో తల్లిగా నా బాధ్యత నిర్వర్తించలేకపోయాను' అనుకుంటూ చెంపలు వాయించుకుంది కృష్ణవేణి.

అర్చన అమాయక ముఖం కళ్లముందు కనపడుతూంటే కృష్ణవేణి హృదయం ద్రవించింది. అరవింద్ మీద కోపం రగిలింది. 'ఏం చేయాలా ...' అని ఆలోచించసాగింది. ఎదురుగా గోడపై ఉన్న తైలవర్ణ చిత్రంలో అర్జునుడికి గీతాబోధ చేస్తున్న శ్రీకృష్ణ పరమాత్మ

వైపు దృష్టి సారించింది. మందహాసంతో కృష్ణ పరమాత్మ తనకేదో సందేశమిస్తున్నట్లు అనిపించింది. అర్చనపై విషం చిమ్మినప్పుడే అరవింద్ మృతప్రాయుడయ్యాడని బోధపడింది. కర్తవ్యం స్ఫురించింది. సెల్ తీసి పోలీస్ స్టేషన్‌కు ఫోను చేసింది.

అరగంటలో పోలీసులొచ్చారు. తన ప్రాణానికి ప్రాణంగా పెంచిన అరవింద్‌ను కన్నతల్లి స్వయంగా పోలీసుల కప్పగించింది. "వాడిని ఉరితీయండి" అరిచింది కృష్ణవేణి.

అరవింద్‌తో పాటు కిరీటిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టేట్‌మెంటు రికార్డు చేసుకుని కిరీటిని విడిచిపెట్టారు. రెండు గంటల తరువాత పోలీస్ స్టేషన్ నుండి ఇంటికి బయలుదేరాడు కిరీటి.

* * *

"అరవింద్ చేసిన నేరానికి తగిన శిక్ష పడుతుంది. అంతమాత్రంచేత అర్చన తల్లి కడుపుమంట చల్లారుతుందనుకోను. ఒక సంఘవిద్రోహ శక్తిని సమాజానికి అందించిన తల్లిగా నాకు ఈ నేరంలో భాగం ఉంది. ఏ చట్టానికి చిక్కని నేరస్తురాలిని. నాకు నేను శిక్ష విధించుకుంటున్నాను". టేబుల్ మీద కృష్ణవేణి స్వదస్తూరితో రాసిన లేఖ ... ఎదురుగా ఫ్యాన్‌కు వేలాడుతున్న కృష్ణవేణి మృతదేహం చూస్తూ పోలీస్ స్టేషన్ నుండి ఇంటికి వచ్చిన కిరీటి కొయ్యబారిపోయాడు.

* * *

**ఇంద్రగంటి నరసింహ మూర్తి స్వస్థలం కాకినాడ. ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం కెనరా బ్యాంకులో 30 సంవత్సరాలు విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఈయన రాసిన 200 లకు పైగా కథలు పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈయన రాసిన కథలలో ఆదిత్యహృదయం, జీవితచక్రం, స్థితప్రజ్ఞత, జీవనసమరం, ఆటుపోట్లు, జీవనరాగం కథలు పాఠకుల నుంచి మంచి ప్రశంసలు పొందినవి. ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం ద్వారా కొన్ని కథలు ప్రసారమయ్యాయి. అలాగే ఈనాడు అంతర్యామిలో 22 వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఈయన వెలువరించిన పుస్తకం "జీవ స్వరం" కథల సంపుటి.**



సింహ ప్రసాద్
**9849061668**

# మళ్ళీ విత్తనంలోకి

చీకటి అంతకంతకూ దట్టమవుతోంది. ఎన్నో రకాల భయాలు వికృత రూపం దాల్చి రత్తాలు గుండెల్లో నగ్నంగా నర్తిస్తున్నాయి.

ఉద్యోగం కోసం పొద్దుటనగా ఊరి మీద పడ్డ ఆమె మొగుడు అర్ధరాత్రవుతున్నా తిరిగి రాలేదు. నాన్న వస్తాడు, తినడానికేదో తెస్తాడని ఆశగా చూసి చూసి నిరాశపడ్డారు పిల్లలు. తల్లి పెట్టిన రెండు ఎంగిలి మెతుకులు తిని శోష వచ్చినట్టు పడుకుండి పోయారు.

రత్తాలుకి కాళ్ళూ, చేతులూ ఆడటం లేదు. ఇంతదాకా ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? ఇంట్లో ఎదురు చూస్తోన్న పెళ్ళాం బిడ్డలు గుర్తు రాలేదా? లేక తన దారి తను చూసుకోవాలని ఎందులోనైనా దూకి....!

'ఛా ఛా ఆ ఆలోచనకు భయపడిపోయింది. కన్నీరు పొంగివస్తోంటే మెడలోని శిలువని కళ్ళకద్దుకుని ప్రార్థించింది.

మెరుపు మెరిసింది. ఆ వెలుగులో వాసు వస్తూ కన్పించాడు. వెర్రి సంబరంతో పరుగునెళ్ళి భర్తని వాటేసుకుంది. ముద్దులు కురిపించింది. 'పిచ్చిదానా. మనకి మంచిరోజులు వస్తున్నాయే...' 'ఉద్యోగం దొరికిందా?' ఆశగా అడిగింది. 'ఒకళ్ళిచ్చేదేంటి బోడి. నేనే కల్పించుకున్నాను. పిల్లలు నిద్రపోలేదు కదా. బిర్యానీ తెచ్చానే.. 'డబ్బెక్కడిది?' అనుమానంగా చూసింది.

'చెట్టంత మగాణ్ణి. ఆ మాత్రం సంపాదించలేనా. పద పద...' ఇంట్లో కెళ్ళారు. అడ్డదిడ్డంగా పడుకున్న పిల్లల్ని చూసేసరికి వాసు కళ్ళల్లో కన్నీటి అల భళ్ళున పగిలింది. 'పాపం ఇప్పటిదాకా నీ కోసం కలవరిస్తూనే వున్నారు....' వాళ్ళని లేపడానికెళ్తూ, 'మజ్జానం ఇంటాయనొచ్చాడు. రెండ్రోజుల్లో అద్దె బకాయి కట్టకపోతే ఇంట్లోని సామానంతా బయటపడేస్తానన్నాడు చెప్పింది రత్తాలు.

'వాడి మొఖం! రెండ్రోజులెందుకు. రేపే వాడికి దిమ్మ తిరిగే ఠలక్ ఇస్తాను కళ్ళు తుడుచుకుంటూ నవ్వాడు. మొగుడి వంక చిత్రంగా చూసింది. పిల్లలు కళ్ళు నలుపుకుంటూ లేచి కూర్చున్నారు. 'మీ నాన్న బిర్యానీ తెచ్చాడు సంబరంగా చెప్పింది తల్లి. వాసు పార్శెల్ విప్పుతోంటే గుప్పుమని వచ్చిన బిర్యానీ వాసనకి పిల్లల ముఖాలు వికసించాయి. 'మా నాన్న మంచోడు అని కొడుకు అంటే, కూతురొచ్చి అమాంతం తండ్రి మెడని చుట్టేసింది. ముందు నాకు పెట్టమంటే నాకు పెట్టమని పిల్లలిద్దరూ పోటీపడ్డారు. 'చిన్నది కదా. ముందు నా బంగారానికి...' అంటూ బిర్యానీ ముద్ద కూతురు నోటికి అందివ్వబోతూ ఆగిపోయాడు. కళ్ళ నుంచి కన్నీళ్ళు ధారలుగా కారుతూ ముద్దని తడిపేస్తున్నాయి. 'వుహు. నీకొద్దు చిట్టి తల్లీ. నువ్వు మాఅదృష్టానివి. అన్న పెద్దోడు. నా తర్వాత నా అంతవాడు కదా....' అంటూ వాడికి పెట్టబోయి ఆగి బావురుమన్నాడు. వాసు ప్రవర్తనకి పిల్లలు ఆశ్చర్యపడితే, ఇల్లాలు అనుమాన పడింది.

'ముందు నాకు పెట్టు మావా...' అంటూ అతడి చేతిని పట్టుకుని ఆ ముద్దని తన నోట్లో పెట్టుకోబోయింది రత్తాలు. గభాల్న చేయి లాగేసుకుని బిర్యానీ పొట్లాన్ని చుట్టేసి బలంగా బయటికి విసిరేశాడు. మళ్ళీ ఏమనిపించిందో పరుగున వెళ్ళి తీసి ఇంటెనకాల వున్న మురుగు కాల్వలోకి విసిరేసి కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు. 'ఏడ్సేవాళ్ళూ మిగలకుండా అందరం కట్టగట్టుకుని చద్దామా మావా?' భార్యనీ, పిల్లల్నీ వాటేసుకుని ఆకాశం బద్దలైనట్టు ఏడ్చాడు. తల కొట్టుకున్నాడు. 'నేను చేతకాని వాడ్ని రత్తాలూ. ఎందుకూ పనికిరాను. దేనికీ పనికిరాను...' గోడకు చేరబడి అరచేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చాడు. పిల్లల్ని తన ఒళ్ళో పడుకోబెట్టుకుని జోకొడుతూ మొగుడి వంక ఆశ్చర్యంగా వేదనగా చూసింది. 'నువ్వేమీ సెయ్యకుండానే ఇలాగున్నామా. పిల్లగాళ్ళని ఇంతోళ్ళని చేశామా!' 'అదంతా ఎప్పటి మాటో. కితం జన్మలోది. ఇప్పుడదేం చెల్లదు. అదంతా తుడిచిపెట్టుకుపోయింది రత్తాలూ. నా పని అయిపోయింది. ఇంక బతకడం వేస్ట్....'

'నీ రెక్కలూ నా రెక్కలూ చల్లగా వున్నాయి మావా. ఏమీ మిగలనట్టు ఆ ఏడుపేంటి సెప్పు. ఉద్యోగం దొరక్కపోతే అంతా అయిపోయినట్టేనా. మనకంటే నిష్ట దరిద్రులెంతమంది లేరు. వారు బతకడం లేదా? మనల్నెందుకు మోయాలని భూదేవి మనల్నడిగిందా? లేదు కదా?' 'నీకు తెలీదు రత్తాలూ. బయటి పరిస్థితి చాలా ఘోరంగా వుంది....' 'నీ సిన్నప్పటి కన్నా సెడిపోయిందా?' ఆమె సూటిగా అడిగిన ప్రశ్న వాసు కాలర్ పట్టుకుని కూర్చోపెట్టింది. వెర్రిగా చూశాడు. జ్ఞాపకాల్లో కప్పడిపోయిన గతం పునరుద్ధానం చెంది కళ్ళ ముందు నిలిచింది.

అప్పట్లో పల్లెలో ఊరవతలున్న మాలపల్లెలో వుండేవారు. తల్లీ తండ్రీ వ్యవసాయ కూలీలు. తండ్రి కూల్డబ్బుల్ని తాగుడికి తగలేసేవాడు. తల్లి తన కష్టంతో తననీ మరి నలుగురు పిల్లల్నీ సాకేది. పేడ పోగేస్తూ, పరగ ఏరుతూ, గొడ్లు కాస్తూ రూపాయీ అర్ధా సంపాదించేవారు. అయినా అంబలి తప్ప అన్నం దొరికేది కాదు. తినీ తినక మాడుతోంటే, అమ్మమ్మ తనని నగరానికి తీసుకొచ్చింది. 'నా మనవడికి కూలి పనిప్పించు సామీ అని తెలిసిన అందర్నీ ప్రాధేయపడింది. అంతా విదిలించేసారు. అయినా అధైర్యపడకుండా సార్ గారి స్కూలుకి తీసుకెళ్ళింది.

'తిండి లేక మాడిపోతున్నాడయ్యా. వీడ్ని మీకాడ పెట్టుకుని ఒక ముద్ద పెట్టండి శాన. ఒక్క రూపాయి ఈయొద్దు అంటూ సార్గారి కాళ్ళ మీద పడిరది అమ్మమ్మ. తన వంక చూసి చప్పరించేశారాయన. 'మైనర్ని పనిలో పెట్టుకోకూడదు.

'అలాగనమాకండి. పెద్దదాన్ని, మీ కాళ్ళట్టుకున్నాను. కనికరించండి సామీ. ఏ పని సెప్పినా చేత్తాడు. కుక్కలా నమ్మకంగా పడుంటాడు. కడుపు కింత అన్నం పెట్టండి చాలు. పెద్ద మనస్సు సేసుకోండయ్యా ఆయన కాళ్ళని గట్టిగా పట్టుకుని బ్రతిమాలింది. ఆయనెంత చెప్పినా, కోప్పడ్డా వినక పోయేసరికి, 'సరేలే. ఏదోటి చూస్తాన్లే అన్నారు. 'స్కూల్లో ప్యూన్గా పెట్టుకుంటాను. నెలకు రెండు వేలిస్తాను. ఎవరైనా అడిగితే నీ వయస్సు పద్దెనిమిది అని చెప్పు...

'తమరు నిజంగా దేవుడే. అలా సూత్తావేంట్రా. అయ్యగారి కాళ్ళ మీద పడు అంటూ తనని వంచింది. సార్గారి పాదాలు పట్టుకుని నమస్కరించాడు. అలాగ తను పద్నాలుగేళ్ళ వయస్సులో సార్గారి ఆశ్రయంలో కెళ్ళిపోయాడు. ఆ తర్వాత మరి వెనుదిరిగి చూడలేదు. సార్ గారికీ, తర్వాత మేడమ్ గారికీ చేతికింది మనిషయ్యాడు. స్కూలు పనీ ఇంటిపనీ అని చూడకుండా చెప్పిన పనల్లా చేశాడు. ఇంట్లోనూ ఆఫీసులోనూ వ్యాక్యూమ్క్లీనర్తో శుభ్రం చేసేవాడు. కూరగాయలు తెచ్చేవాడు. అటక మీంచి సామాన్లు దించేవాడు. రోజూ సోఫాలూ, కుర్చీలూ మేడమ్ మెచ్చుకునేలా తుడిచేవాడు. మేడమ్ వెంట బజారు కెళ్ళేవాడు. సరుకులు మోసేవాడు.

'వాసు బాగా ఆసరాగా వుంటున్నాడు. వాడికి కారు డ్రైవింగ్ నేర్పిద్దాం. నమ్మకంగా మన దగ్గరే పడుంటాడు. ఎప్పుడంటే అప్పుడు ఎక్కడికంటే అక్కడికి వెళ్ళొచ్చు మేడమ్ సార్గారికి

చెప్పి ఒప్పించింది. ఆవిడే డ్రైవింగ్ స్కూల్లో చేర్పించింది. అది నేర్చుకుంటూ పొద్దుట్నుంచి రాత్రి దాకా ఇంట్లోనూ స్కూల్లోనూ పనిచేసేవాడు. డ్రైవింగ్ బాగా వచ్చాక సార్ గారి డ్రైవర్ అయ్యాడు. జీతం అయిదువేలు చేశారు. మరి రెండేళ్ళకు పెళ్లయ్యింది. ఊరి చర్చిలో జరిగిన పెళ్లికి సార్గారూ మేడమ్ వచ్చి ఆశీర్వదించారు. ఇంటికి కావాల్సిన సామాన్లు కొనిపెట్టారు.

రత్తాలు స్కూల్లోనే ఆయాగా చేరింది. కాలం చీకూ చింతా లేకుండా గడిచిపోతోంది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఒకరోజు తెల్లవారు జామున సార్గారికి గుండెపోటు వచ్చింది. త్వరగానే కోలుకున్నారు గాని అమెరికాలో వుంటోన్న వారబ్బాయి ఒత్తిడి తెచ్చి స్కూల్ అమ్మించేశాడు. ఆ తర్వాత అమెరికా వెళ్ళిపోయారు.

'ఇదీ మంచికే' అనుకున్నాడు తను. అప్పటికే చాలామంది డ్రైవర్లతో పరిచయాలయ్యాయి. ట్రావెల్ ఏజెంట్ దగ్గర కమీషన్కి పని చేస్తే ఎక్కువ సంపాదించొచ్చని గ్రహించాడు. అలాగే చేశాడు. ఆదాయం బావుంది. చక్కని ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. చెల్లెళ్ళకీ తమ్ముళ్ళకీ అండగా నిలబడ్డాడు.

'పిల్లల్ని స్కూల్లో చేర్చాలి. దానికి తగ్గట్టుగా సంపాదించాలి. డ్రైవర్గా వుండి పోకూడదు. ఓనర్ డ్రైవర్ని అవ్వాలి. అది నా కల అనేవాడు రత్తాలుతో మెరుస్తోన్న కళ్ళతో. షిర్డి, తిరుపతి, విజయవాడ లాంటి దూర ప్రదేశాల టూర్లకి ఇష్టంగా వెళ్ళేవాడు. ఎక్కువ కమీషన్ రావడమే గాక బేటాలు మిగిలేవి. మెల్లగా కూడబెట్టడం మొదలెట్టాడు. మూడేళ్ళు ఎద్దులా పనిచేశాడు. పిల్లల్ని స్కూల్లో చేర్చడమే కాదు ఫైనాన్స్ కంపెని సాయంతో కారు కొనగలిగాడు. రత్తాలు మాల్లో స్వీపర్గా చేరింది. ఆమె సంపాదనా బావుంది. పిల్లల్ని ప్రైవేటు స్కూల్లోకి మార్చారు. త్వరత్వరగా కారు అప్పు తీర్చేస్తే కారు సొంతమైపోతుందన్న ఆశతో అటు ఓలా కీ, ఇటు ఉబర్ కీ కూడా తిరిగాడు. ఎక్కువ గిట్టే సమయాల్లో ఎక్కువ తిరిగాడు. రోజు వారీ టార్గెట్లు పూర్తి చేశాక గాని డ్యూటీ దిగేవాడు కాదు.

గోదావరి మీద పడవ ప్రయాణంలా తమ బతుకులు సాఫీగా సాగిపోతున్నాయి. ఇంతలో కరోనా మహమ్మారి పంజా విసిరింది. లాక్డౌన్ ప్రకటించారు. కారు చక్రాలు ఆగాయి. భార్య పనీ పోయింది. అయినా కృంగిపోకుండా వున్నదంతా వూడ్చుకు తిన్నారు. అప్పులు చేశారు. కానీ కారు కిస్తీలు కట్టలేకపోయారు. ఫైనాన్స్ వాళ్ళు కారు తీసుకుపోయారు. సర్వం కోల్పోయినట్టు అయిపోయారు. చిన్నా చితకా ఉద్యోగాల కోసం రోడ్డున పడ్డారు. మాల్స్ తెరవలేదు. ఎన్నో షాపులు హోటళ్ళు మూతపడ్డాయి. ఇంటి నుండి పని వల్ల సాఫ్ట్వేర్ వాళ్ళు ఊళ్ళకెళ్ళిపోయారు. టాక్సీలకు డిమాండ పూర్తిగా పడిపోయింది. డ్రైవర్ ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. రత్తాలు మాత్రం నాలుగిళ్ళలో పనిమనిషిగా చేరింది. అదే తమకు ఒక ముద్ద పెడుతోంది.

అప్పులవాళ్ళూ ఇంటాయనా ఒత్తిళ్ళు పెంచారు. ఎన్నాళ్ళని ఇలా ఆర్ధాకలితో బండి లాగించడం అన్పించింది. బతకడానికి దారి లేనప్పుడు చావడమే పరిష్కారం అనుకున్నాడు.

చచ్చిపోతే తమ కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, వేదనలు అన్నీ హూష్కాకి అయిపోతాయని చెప్పి బిర్యానిలో విషం కలిపి తెచ్చాడు...! గాఢంగా నిట్టూర్చాడు వాసు. 'ఆ బిర్యానీ తినేశామనుకో. అంతా కట్టకట్టుకుని చచ్చామనుకో. ఇదివరకటిదంతా పోయిందనుకో. మళ్ళీ మొదలుకాడ్నుంచి స్టార్టు చేద్దాం మావా. నేను నాలుగు కాదు ఎనిమిదిళ్ళలో పని చేస్తా. నువ్వూ డ్రైవర్ అనేగాక చిన్నదో చిటికెదో ఏది దొరికితే అది చెయ్యి. బతుకు గాడిలో పడితే పరుగెత్తడం ఎంతసేపు మావా..!'

రత్తాలు వంక పిచ్చిగా చూశాడు. ఆమె ధీమాకి అబ్బురపడ్డాడు. 'ఇంకిలాంటి పిచ్చిపని చెయ్యనని మాటియ్యి మావా చేయి చాచింది. 'అది కాదు రత్తాలూ. ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్టు...' ఆపై మాటలు పూర్తి చేయలేదు. నవ్వింది. 'ఇంటెనకాల కాదు ఇంట్లోనే చచ్చాం. ఇది కొత్త జనమ. ఉన్నదాంతోనే తృప్తిగా బతుకుదాం. నాకు మాటియ్యి మావా.. ఆమె చూపులు మంత్రించినట్టుగా ఆమె చేతిలో చేయి వేశాడు. ఆ మర్నాడు పనికెళ్ళిన రత్తాలు గాలిలో తేలుతూ వచ్చింది. 'నేను పనిచేస్తున్న అపార్టుమెంటుల్లోని వాచ్మేన్ భార్యకి జబ్బు చేసిందట. వాళ్ళ ఊరెళ్ళిపోయారు. నీ గురించి చెప్పాను. తీసుకు రమ్మన్నారు. రా మావా వెళ్దాం చెయ్యి పట్టుకుని లాగింది.

'వాచ్మేన్ పనా! ఫ్యాంటూ షర్టూ తొడుక్కుని సొంత కారు నడిపిన వాణ్ణి....!' 'మన ఇంటాయన. తన్ని తరిమేస్తే ఎక్కడ తల దాచుకోవాలన్న భయం, దిగులు పోయాయమని సంతోషించు మావా. మనం ఉండటానికి ఇల్లు ఇస్తారు. కార్లూ, బైకులూ తుడిస్తే అదనంగా ఎంతో కొంత ముడుతుంది. నేనందులోనే ఇంకో రెండు మూడిళ్లలో పని చూసుకుంటాను. ఆ దగ్గర్లోనే సర్కారోడి స్కూలుంది... సంబరంగా చెప్పుకుపోతోంది రత్తాలు. అతడా విషయాన్ని జీర్ణించుకోలేక రాయిలా వుండిపోయాడు. అయినా ఆమె పట్టించుకోలేదు. బలవంతాన అసోసియేషన్ సెక్రటరీ శ్రీరాములు దగ్గరికి లాక్కుపోయింది.

వాసునీ అతడి వాలకాన్నీ చూసి అన్నాడాయన. 'వాచ్మ్యాన్ పని చేయగలవా?' తల నిలువుగా ఆడించాడు. 'ఒకసారి బిల్డింగులోని అన్ని ఫ్లోర్లూ చూసిరా. రోజూ అన్ని ఫ్లోర్ల బాల్కనీలూ తుడవాలి. ప్రతి శుక్రవారం కడగాలి. బోరు నీళ్ళు, మంజీరా నీళ్ళు ట్యాంకుల్లోకి ఎక్కించాలి. టైం ప్రకారం నీళ్ళు వదలాలి. నెలకోసారి ట్యాంకులు కడగాలి....'నేనుంటాను కదండి. ఇద్దరం కలిసి చేసుకుంటాం అంది రత్తాలు. ఏదో అనుమానం రాగా, 'నువ్వు బట్టలు ఇస్త్రీ చేస్తావు కదా?' అడిగారు. 'మేం చాకళ్ళం కాదండి.. కళ్ళు విప్పార్చి చూశారు. 'ఇదివరకేం పనిచేశావేంటి?' 'కారు డ్రైవర్నండి

'ఇప్పుడా పని లేకే కదా దీని కొచ్చావ్. కరోనా నిన్నే కాదు అన్ని వృత్తుల్నీ, ఉపాధుల్నీ దెబ్బతీసింది. ఎలాగోలా నిలదొక్కుకోవాలి. అల వచ్చినప్పుడు తల వంచుకుంటే తర్వాత తలెత్తుకుని నిలబడొచ్చు. చెట్టు మొదల్ని అడ్డంగా నరికినా మళ్ళీ చిగురిస్తుంది. ఎందుకంటే అది జీవలక్షణం!'

తలొంచుకున్నాడు వాసు.  ఇబ్బందిగా చూసింది రత్తాలు. ఇస్త్రీ పని ఊహించలేదామె. 'ఇస్త్రీ పని చేయడానికి చాకళ్ళే కానక్కర్లేదు. ఎవరైనా నేర్చుకోవచ్చు. చేయొచ్చు. ఇష్టం, శ్రద్ధ వుంటే ఏ పనైనా సులువుగా వస్తుంది. ఇక్కడ మొదట్నుంచీ వాచ్ మ్యానే ఇస్త్రీ చేస్తున్నాడు. దానికోసం ఇంకొకర్ని ఎక్కడ్నుంచి తీసుకొస్తాం!'

వాసు తటపటాయిస్తుంటే అన్నాడాయన 'పనిని గౌరవించడం నేర్చుకున్నవారే చులాగ్గా పైకొస్తారు. నీకంత నామోషీగా వుంటే, వద్దులే'.. శ్రీరాములు లేచి వెళ్ళబోతోంటే ఆపింది రత్తాలు. 'అన్నీ నేర్చుకుంటాడు. నాదీ గేరంటీ. మీరెలా చెబితే అలా చేస్తాం. తిండికి లేక పిల్లలు మాడిపోతున్నారు. కనికరించండి చేతులు జోడించింది. 'అదీ భేషైన మాట. నాలుగు డబ్బులు కళ్ళ జూడాలంటే ముందు చేతినిండా పనుండాలి. దేవుడు రెండు చేతులిచ్చింది ఒక దానికి దెబ్బ తగిలితే రెండోది ఉపయోగిస్తుందనే..

ఆ మర్నాడే వాచ్మేన్ గదికి మారిపోయింది వాసు కుటుంబం. ఆ రూమ్ చాలా చిన్నది. పడకకీ, వంటకీ అన్నింటికీ అదే. చాలా ఇరుగ్గా వుంది. అసంతృప్తిగా చూశాడు. అనునయించింది రత్తాలు. వాసు ఉదయం అయిదింటికే లేచి స్పాంజి తీసుకుని పైపు నీళ్ళతో కార్లు కడుగుతోంటే మార్నింగ్ వాక్ కెళ్తూ ఆగారు శ్రీరాములు. 'ఇంకాస్త పొద్దుటే లేచి ఈపని కానివ్వాలి. త్వరగా తెమిలెళ్ళి చెత్త ఎత్తు

కార్లూ బైకులూ తుడిచాక, ప్లాస్టిక్ డ్రమ్ తీసుకుని ఒక్కో ఫ్లాట్కూ వెళ్ళాడు. గుమ్మం పక్కన పెట్టిన చెత్తని అందులో పోశాడు. కొన్నిట్లలోంచి దారుణమైన వాసన వచ్చింది. ముక్కుకి కర్చీఫ్ కట్టుకుని ఆ పని పూర్తి చేశాడు.  దాన్ని తీసుకెళ్ళి గ్రౌండ ఫ్లోర్లో వెనక పక్కన ఉంచిన పెద్ద డ్రమ్ముల్లోకి చెత్తని మార్చాడు. పిమ్మట చీపురందుకుని బాల్కనీలు చిమ్మి, టెర్రేస్ మీదకెళ్ళి మంజీరా నీళ్ళు వదిలాడు.

ఆ సరికి పూర్తిగా డీలా పడిపోయాడు. సానుభూతిగా చూసింది రత్తాలు. 'పిల్లల చేత పాలప్యాకెట్లు, పేపర్ వేయిస్తే...' ఆమె మాటలు పూర్తికాకుండానే కయ్యిమన్నాడు. 'వాళ్ళ రాత నాలాగా కాకూడదు.  బాగా చదువుకోవాలి. పస్తులుండైనా చదివిస్తా..  పిల్లల తలలు ఆప్యాయంగా నిమిరింది. 'అలవాటులేకే లే. మెల్లగా అలవాటు పడిపోతాను ఆమెని నొప్పించలేక అన్నాడు.

'వాసూ, ఇవాళ ఇస్త్రీ పెట్టె కొని తెచ్చేసుకో. ఇస్త్రీలు ఎప్పుడు మొదలుపెడతావని అంతా అడుగుతున్నారు  అన్నారు శ్రీరాములు. 'ఇవాళ కొంటానండి. కానీ...' తలగోక్కున్నాడు. 'నీభార్య చెప్పిందిలే. ట్రెజరర్ శర్మకి చెప్పాను. అడ్వాన్సు ఇస్తాడు, తీసుకో. ప్రక్క అపార్టుమెంటులోని వాచ్మాన్ని కలిశాడు వాసు. ఇస్త్రీ చేస్తున్నాడతడు. 'కొత్త వాచ్మేన్వి నువ్వేనా. అక్కడంతా మంచి వాళ్ళులే. బాగా చూసుకుంటారు'.. 'అన్నా, ఇస్త్రీ పెట్టె కొనాలి. సాయం రావా.. 'మీరు చాకళ్ళు కాదా?'.. తల అడ్డంగా వూపాడు. 'నేర్చుకుని చేస్తావన్నమాట. ఇక మీ జనం కర్మ కాలినట్టే నవ్వి తిరిగి అన్నాడు. 'రెండ్రోజులు నాతో వుండు నేర్పేస్తాను..

అతడ్ని తీసుకుని బజారు కెళ్ళి ఇస్త్రీ పెట్టె కొన్నాడు. చాలా బరువుగా వుంది. బరువెక్కు వుంటేనే బట్ట బాగా నలుగుద్దని కొనిపించాడు.

ఒకరోజు నేర్చుకునే సరికే జబ్బలు పట్టేశాయి. ఏడుపు తన్నుకొచ్చింది. 'నేనీ బాడుకావ్ పని చేయలేను. నాతరం కాదు ఏడుస్తూనే కస్సుమని కరిచేశాడు. 'పిల్లల మొకాలు చూసి ఓపిక పట్టు మావా. ఇదివరకు మాల్లో స్వీపర్ని. ఇప్పుడు అంట్లూ, బాత్రూమ్లూ కడగటం లేదూ. హరిశ్చంద్ర మారాజంతటోడే కాలం కర్మం కలిసి రాక కాటికాపరయ్యేడు!' మ రి రెట్టించలేదూ తనలో తను రగుల్తూండిపోయాడు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. అలాగని వాసు పని విషయంలో బద్ధకించలేదు. ఎంత బాగా చెయ్యగలడో అంతబాగానూ చేస్తున్నాడు. అంతా అతడి పనినీ, అంకిత భావాన్నీ మెచ్చుకొంటోంటే గుండెల మీంచి పెద్ద బరువు దిగిపోయినట్టు ఫీలవుతోంది రత్తాలు. కాని వాసుకి ఆనందంగా లేదు. ఎలాగైనా సరే పైకి ఎగబ్రాకాలన్న కసితో కష్టపడుతున్నాడు.

అదే అపార్టుమెంటులో వుంటున్న ఆనందరావు ఏదో ఏజెన్సీ తీసుకున్నాడు. ట్రక్ ఆటో కొన్నాడు. డ్రైవర్ కోసం చూస్తోంటే వెళ్ళి కలిశాడు వాసు. తన డ్రైవింగ్ లైసెన్సు చూపించి, అనుభవం ఏకరువు పెట్టాడు. 'రోజుకి నాలుగైదు గంటల పని వుంటుంది. డిస్ట్రిబ్యూటర్ దగ్గర సరుకు లోడ్ చేసుకుని, నేనిచ్చిన లిస్టు ప్రకారం సరుకుని షాపులకి సప్లై చేయాలి. అబ్బే నీకెలా కుదుర్తుందీ!' 'కుదిరించు కుంటాను. పగలు ఖాళీయే కదండి. ఎలాగైనా చేసేస్తాను. అదయ్యాకే ఇస్త్రీ పని పెట్టుకుంటాను సార్

'ఇక్కడుండే వాడివి గనుక నిన్ను పెట్టుకుంటే నాకూ మంచిదే అనుకో. సరే ముందు సెక్రటరీ అనుమతి తీసుకో.. ఎగిరి గంతేశాడు. 'నాకు డ్రైవింగ్ ఎంతో ఇష్టమండి. చిన్న అవకాశం వచ్చింది సార్. మీరు పర్మిషనిస్తే...' శ్రీరాములుని అడిగాడు వాసు. ఆయన కతడి మీద గుడ్ ఇంప్రెషన్ వుంది. ఇతడొచ్చేక అన్ని పనులూ సాఫీగా సాగి పోతున్నాయి మరి. 'వాచ్మాన్ డ్యూటీకి ఇబ్బంది లేకుండా చేసుకుంటానంటే చేసుకో. ఎవరి దగ్గర్నుంచీ ఎలాంటి కంప్లయింటూ రాకూడదు సుమా..

ఆ మర్నాడే కొత్త ట్రక్ ఆటో ముందు కొబ్బరికాయ కొట్టి ఎక్కాడు వాసు. భార్యా బిడ్డలకు సంతోషంగా వీడ్కోలిచ్చి ముందుకు దూకించాడు. అతళ్ళో ఉత్సాహం వెల్లువవడం చూసి మురిసిపోయింది రత్తాలు. భవిష్యత్తు మీద భరోసా చిక్కింది వాసుకి. భార్యతో పిల్లత్తో తెగ కబుర్లు చెబుతున్నాడు. చక్కగానూ, వేగంగానూ చేస్తున్నందుకు ఆనందరావు ఎంతో సంతోషించారు. 'నువ్విదే స్పీడుతో చేస్తానంటే మరిన్ని సరుకులకు ఏజెన్సీ తీసుకుంటాను.. 'తీసుకొండి సార్. అవసరమైతే కొన్ని బట్టలు ఇస్త్రీకి పక్క వాచ్మేన్కి ఇచ్చేస్తాను.. విషయం భార్యకి చెప్పి పొంగిపోయాడు. 'మనకి మళ్ళీ నిజంగానే మంచి రోజులొస్తున్నాయే

'మన కష్టమే మనల్ని కాపాడుతుంది భర్తని వాటేసుకుంటూ అంది. పిల్లలు కడుపు నిండా తింటూ బడికెళ్ళి శ్రద్ధగా చదువుకుంటున్నందుకే ఆమెకి చెప్పరానంత ఆనందంగా వుంది.

ఒకరోజున ఆటో దిగుతూనే వచ్చి రత్తాల్ని చుట్టేసి గిరగిరా తిప్పేశాడు వాసు. 'ఏవైంది మావా. ఈ పిచ్చి సంబరమేంటి.. 'నక్కని తొక్కానే. నేను సరుకు తెచ్చే డిస్ట్రిబ్యూటర్ గారబ్బాయికి నేనూ నా పనీ బాగా నచ్చాయి. వారి ఫార్మా కంపెనీలో ఉద్యోగుల్ని తీసుకురావడానికీ తీసుకెళ్ళడానికీ, టాక్సీల కాంట్రాక్టు ఇస్తున్నారట. నన్ను అప్లై చెయ్యమన్నారు

'మనకి కారు లేదుగా!' 'వస్తుందే. వాళ్ళే బ్యాంకుల్తో మాట్లాడి ఇప్పిస్తానన్నారు. బ్యాంకు కిస్తు తగ్గించుకుని వాళ్ళే తిన్నగా బ్యాంకుకి జమ చేసేస్తారు. మిగతాది మనకిస్తారు. నేను మళ్ళీ ఓనర్ డ్రైవర్ని అయిపోతున్నానోచ్ మిన్నంటేలా అరిచాడు వాసు. రత్తాలు నవ్వింది. వసంతకాలపు వేకువ వెలుగులా వుందది!

* * *

**చెలంకూరివరహ నరసింహ ప్రసాద్**

**చెలంకూరివరహ నరసింహ ప్రసాద్ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలంలోని మల్లవరం గ్రామం. ఇండియన్ బ్యాంక్ లో సీనియర్ మేనేజర్ గా పనిచేస్తూ 2001 లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈయన రాసిన మొదటి కథ 'కథగా ముగియని కథ' 1973 లో స్వాతి మాస పత్రికలో ప్రచురింపబడింది. ఇప్పటివరకు 445 కథలు, 70 నవలలు, 2 నాటకాలు, కొన్ని కవితలు వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. 12 కథాసంపుటాలు వెలువడ్డాయి. 112 కథలకు, 18 నవలలకు, 2 నాటకాలకు బహుమతులందుకున్నారు. 40 కథలు కన్నడ, తమిళం, హిందీ లోకి అనువదింపబడ్డాయి. 2 నవలలు కన్నడంలోకి అనువదింపబడినవి. నా కథ "మళ్ళీ విత్తనంలోకి" కోవిడ్ కష్టకాలంలో ఒకప్పటి మా కారు డ్రైవర్ ఎదుర్కొన్న అనుభవాలకి కథారూపమే ఈ కథ.**

# ఫుట్ బాల్




**కె.వి.యస్.వర్మ**

**9848787266**


ఈ మధ్య సుహాస్ చాలా సమయం నాతోనే గడుపుతున్నాడు. కోవిడ్ కారణంగా స్కూళ్లు మూసివేయడంతో తరచూ నా కూడా పొలానికి వస్తున్నాడు. చదివేది ఏడో క్లాసే అయినా చాలా కబుర్లు చెబుతాడు. టచ్ ఫోన్ కొంచెం అలవాటు కావడంతో ఏవేవో చూస్తూ ఆసక్తికరమైన విషయాలుంటే నాకు చెబుతుంతాడు . సుహాస్ వాళ్ల అమ్మా నాన్నాతో యాప్రాల్ లో పెద్ద అపార్టుమెంటులో వుంటున్నాడు. ప్రతి శనివారం వెళ్లి వాడిని మా రాంపల్లి విలేజ్ కు తీసుకు వచ్చేవాడిని.

స్కూళ్లు బంద్ కావడంతో మా వూరిలోనే ఎక్కువగా వుంటున్నాడు. వచ్చేటప్పుడు కూడా ఫుట్ బాల్ తెచ్చుకున్నాడు. ఇక్కడ ఆడడానికి వాడి వయసు కుర్రాడొకడే వున్నాడు మా ఎదురింట్లో. అతను వచ్చే వరకూ మా ఇంటి ముందరి రోడ్డు మీద సుహాస్ ఒక్కడే ఫుట్ బాల్ ను పాదం మీంచి

మోకాలు వరకూ, ఆపై వరకూ తిప్పుతూ ఆడుతుంటాడు. అప్పుడప్పుడూ నేను ఆసక్తితో చూస్తుంటాను. అలా బాల్ ను చేత్తో పట్టుకోకుండా కాలితోనే తిప్పడానికి ఏమన్నా పేరుందా అని అడిగాను. ఉంది తాతయ్యా' అని ఫుట్ బాల్ ను చేత్తో పట్టుకుని, 'జగ్లింగ్ ' అంటారు అని చెప్పి , బంతి మీదనే ద్రుష్టి పెట్టి, మళ్లీ పాదం మీద నుంచి మోకాలు వరకూ అటూ ఇటూ తిప్పుతూ మధ్యలో బాల్ ను నేలమీదకు తెచ్చి, గట్టిగా తన్నాడు. కంకర రోడ్డు మీద రాళ్లు పైకి రావడంతో, కాలికి ఓ రాయి తగిలి 'అమ్మా' అన్నాడు. చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి అటు చూశాను, గట్టిగానే తగిలినట్టుంది, రక్తం కారుతోంది. వాడి కళ్లల్లో నీళ్లు.

'లోపలికి రా' అని పైపు దగ్గరకు తీసుకెళ్లి కాలి మీద చల్లని నీళ్లు కాసేపు పడేలా చేశాను. తర్వాత మందు వేసి, కట్టు కట్టాను. 'తగ్గిపోతుంది. రెండ్రోజులు కాలికి దేన్నీ తగలనీకు. గాయం చిన్నదే అయినా రేగితే గబుక్కున మానదు' అన్నాను. 'రెండ్రోజులా' అన్నాడు అయిష్టంగా మొహం పెట్టి.



'అవును' అన్నట్టుగా తలూపాను. 'సరే తాతయ్యా. మీకూడా పొలం వస్తాను' అన్నాడు కుంటుకుంటూ నడుస్తూ. 'ఇవేళ వద్దులే' అన్నాను సుహాస్ కాలి వంక చూస్తూ . చిన్నప్పటి వాడి సుకుమారపు కాళ్లు కళ్ల ముందు కదిలాయి. అలాగే తెగిన వాడి చిటికన వేలూ గుర్తుకొచ్చింది.

* * *

పదినెలల సుహాస్ ను మంచం కొసన పడుకోబెట్టి, వాడి ముందు నేల మీద కూర్చుని పాదాలను ముద్దుపెట్టుకునేవాణ్ని. మంచుబిందువు సుతారంగా తాకిన గులాబీ రేకుల్లా వుండేవి వాడి లేత పాదాలు. కొద్దిగా కితకితలు పెడుతుంటే కాళ్లూ చేతులూ ఊపుతూ కిలాకిలా ఒకటే నవ్వు, తెల్లటి మల్లెపువ్వుల్లా కనువిందు చేస్తూ. పట్నానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోనే వున్న మా ఊరి పల్లెటూరి కళ తగ్గుతున్నా పొలాలకు దగ్గరలో వుండడంతో చెట్టూ పుట్టా ఇంకా వున్నాయి. కాకి కావ్ కావ్ అంటే వాడూ అలా అనేవాడు.

సుహాస్ అమ్మా నాన్నా ఉద్యోగాలు చేస్తుండడంతో మా ఇంటికి దగ్గరలోనే వున్న ఓ కాన్వెంటులో ఎల్.కె.జి.లో చేర్పించాం సుహాస్ ను. ఒకనాడు వాడి టీచర్ 'మీ మనవడు గడుగ్గాయి అండీ' అంది పగలబడి నవ్వుతూ. ఏవిటన్నట్టు ఆమె వంక చూశాను. 'ఇవేళ ఎబిసిడిలు చెప్పు' అంటే, 'మీకొచ్చుగా' అన్నాడు అంటూ మళ్లీ నవ్వు. నాకూ నవ్వొచ్చేసింది. ముళ్లపూడి బుడుగు గొర్తొచ్చి, సుహాస్ భుజాల మీద చేతులు వేసి, 'బుడుగూ బుడుగూ అల్లరి పిడుగు' అన్నాను. వెంటనే వాడు చేతులు చాచాడు ఎత్తుకోమంటూ, మనవణ్ని ఎత్తుకుని గిరగారా తిప్పాను. తర్వాత కొన్ని రోజులకు ' టీచర్ కొట్టింది' అన్నాడు వాడు. 'దేంతో' అన్నాను.

'నోటితో' అన్నాడు. నాకు అర్ధమయింది, వాడి ద్రుష్టిలో  కొట్టడం అంటే తిట్టడం అని. కార్తీకమాసం రావడంతో వాడి స్కూలు వాళ్లు  వనభోజాలు ఏర్పాటు చేశారు మాతోటలో. మేమంతా వెళ్లాం. అంత వరకూ సరదాగా ఆడుకుంటున్న సుహాస్ 'ఇక్కడికీ వచ్చిందీ' అన్నాడు దూరంగా కనిపించిన టీచర్ ను చూసి,  అదోలా మొహం పెట్టి. మాకు నవ్వాగలేదు. టీచర్ అంటే స్టూడెంట్ కు భయమో, కోపమో వుంటాయనుకుంటూ 'అలాగనకూడదురా' అన్నాను నెమ్మదిగా. వాడికామాట నచ్చినట్టులేదు.

రోజూ రాత్రి నా పక్కన పడుకున్న సుహాస్ ను జోకొడుతూ 'జో అచ్యుతానంద జోజో ముకుందా' అని పాడడం ఒక డ్యూటీగా పెట్టుకున్నాను. అలా జోకొడుతుంటే నెమ్మదిగా నిద్రలోకి జారుకునేవాడు. ఆ రాత్రి కూడా జోకొడుతూ ఏదో ఆలోచిస్తూ  పాడుతుంటే, 'తాతయ్యా, తప్పు పాడుతున్నారు' అన్నాడు. 'లాలి పరమానంద లాలి  గోవిందా'ను ముందు వెనకలుగా పాడినట్టు గమనించి, 'అమ్మ వెధవా' అంటూ ముద్దు పెట్టుకుని, నవ్వుకుంటూ సరిగా పాడాను.వీడికెంత గుర్తో అని మనసులోనే అభినందించాను.

మా ఇంట్లో ఓ చిన్న ఫంక్షన్ కు మా స్నేహితుడు  వచ్చాడు. భోజనం చేశాక  సుహాస్ కబుర్లకు ముచ్చటపడి,' చిన్న మ్యాజిక్ చేస్తాను. ఓ తాడు, బ్లేడు కావాలి' అన్నాడు. మనవడు ఆశ్చర్యపడతాడు కదా అని అవి తెచ్చి ఇచ్చాను. తాడును బ్లేడుతో  సగానికి రెండు ముక్కలుగా కోసి, వాటిని చూపించి,  చేతులతో వాటిని అటూ ఇటూ తిప్పి, ఒకే తాడుగా చూపించాడు. సుహాస్   ఆనందం పట్టలేక చప్పట్లు కొట్టాడు. మిత్రుడు భోజనం చేసి వెళ్లిపోయాడు.

మర్నాడు  పొద్దుట సుహాస్ గుక్కపెట్టి ఏడుస్తుంటే, పెరట్లోకెళ్లి చూసేటప్పటికి  చిటికన వేలు చివర కొద్దిగా తెగి, ఒకటే రక్తం.' ఎలా తెగిందిరా' అంటే తనూ మ్యాజిక్  చేద్దామని తాడు కోస్తుంటే వేలుకు బ్లేడు తగిలింది' అన్నాడు ఏడుస్తూనే. గబగబా దగ్గరే వున్న క్లినిక్ కు తీసుకెళ్లాను. డాక్టర్ కట్టు కట్టి, ఓ ఇంజక్షన్ చేసి,

మందులు రాశాడు.' మా ఫ్రెండుకు మ్యాజిక్ వచ్చు కాబట్టి ఓ ట్రిక్ చేశాడు. నువ్వూ అలా చేయాలనుకుంటే ఎలా? పులిని చూసి నక్క వాత పెట్టుకోవడమంటే అదే' అంటూ ఆ కథ చెప్పాను. సుహాస్ శ్రద్ధగా విన్నాడు.

–4–

పిల్లలందరిలాగే సుహాస్ బొమ్మలంటే ఇష్టపడేవాడు. అయితే, కాసేపు ఆడుకున్నాక బొమ్మలో ఏముందో చూడడం కోసం ప్రయత్నించేవాడు. ఒకోసారి  దాన్ని పగలగొట్టేసేవాడు. వాళ్ల నాన్న తిడితే, 'వాడిష్టప్రకారం చెయ్యనిద్దూ. ఏమో ఏఆర్ రెహ్మాన్ అంతటి ముజీషియన్ అవుతాడేమో' అనే వాణ్ని. తను ప్రతి బొమ్మలోనూ ఏముందో చూడాలనుకునేవాణ్నని ఓ సందర్భంలో రెహ్మాన్ చెప్పిన సంగతి గుర్తొచ్చి అలా అన్నాను.

చేపలు పెంచుతాను, అక్వేరియం కావాలన్నాడు ఒకనాడు. దాన్ని కొని ఇంటికి తీసుకొచ్చాక అందులో రంగురంగుల చేపల్ని పెంచడం మొదలెట్టాడు. వాటికి ఆహారం వాడే

పెట్టేవాడు. స్కూలుకి వెళ్లేటప్పుడు మధ్యాహ్నం చేపలకు ఏ ఆహారం వేయాలో వాళ్ల నాన్నమ్మకు చెప్పేవాడు. కొన్నాళ్లకు వాడికి ఆ సరదా తీరిపోయింది. కుక్కను పెంచుకుందామన్నాడు.అది చాలా కష్టమైన వ్యవహారమంటూ వాళ్ల అమ్మా నాన్నా వద్దన్నారు. వాడు కాసేపు ఆలోచించి, 'అపార్టుమెంటులో అయితే వద్దంటున్నారు. తాతయ్యా మీ ఇంటి వెనక వున్న ఖాళీ స్థలంలో పెంచుకోవచ్చు కదా' అన్నాడు. నేను సరేనన్నాను. ఓ నల్ల కుక్క పిల్లను తెచ్చాను. దానికి తిండి పెట్టడం, దానితో ఆడుకోవడం వాడికి చాలా సరదాగా వుంది. దానికి బ్లాకీ అని పేరు పెట్టాడు. అది వాడికే కాకుండా ఇంట్లో అందరికీ బాగా చేరువ అయ్యింది.

తర్వాత కొన్నాళ్లకు మా ఇంటి దగ్గరి కాన్వెంట్ లో అయిదో తరగతి వరకే వుండడంతో సుహాస్ ను యాప్రాల్ లోని పెద్ద కాన్వెంట్ లో చేర్చారు. 'ఇక వాడి కుక్క సరదా కూడా తీరిపోతుందిలే ' అనుకున్నాను. అయితే, ప్రతి శనివారం సాయంత్రం మా వూరు వచ్చేసి, బ్లాకీతో ఆడుకుంటున్నాడు. వాళ్ల నాన్నో నేనో వాడిని తీసుకొచ్చేవాళ్లం. వాడు వచ్చేటప్పుడు బిస్కట్లు తప్పక కొనిపించేవాడు కుక్క కోసం. దానికి ఎప్పుడన్నాకాస్త బాగోలేకపోతే తెగ బాధపడేవాడు.

* * *

సుహాస్ 'తాతయ్యా' అంటూ నా భుజం తడుతుండడంతో నేనీ లోకంలోకి వచ్చాను.

–5–

'ఆన్ లైన్ క్లాసుకు టైమయ్యిందేమో' అన్నాను. 'ఇంకో పది నిమిషాల టైముంది లెండి. బ్లాకీ కనిపించడం లేదు. ఎక్కడికెళ్లిందో' అన్నాడు. 'ఇక్కడే ఎక్కడో తిరుగుతుంటుంది. దానికీ కాలక్షేపం కావాలి కదా. నువ్వు ఫుట్ బాల్ ఆడుకుంటుంటే ఎంతసేపని చూస్తుంది' అన్నాను.

'అవును కదా' అన్నట్టు చూసి, ఆన్ లైన్ క్లాసు కోసం ఫోన్ పట్టుకుని గదిలోకెళ్లిపోయాడు . నేను హాల్లోకి వెళ్లి టీవీ చూస్తూ కూర్చున్నాను. కొంతసేపటికి బ్లాకీ వచ్చింది. అటూఇటూ చూసింది. సుహాస్ కోసమేననుకున్నాను. అంతలో మా ఎదురింటి వాళ్లబ్బాయి వచ్చాడు ఫుట్ బాల్ ఆడడానికి. ఆన్ లైన్ క్లాసు పూర్తి చేసుకుని సుహాస్ బయటికొచ్చి,బ్లాకీ తల నిమిరాడు. అది రెండు కాళ్లూ పైకెత్తి, వాడి పొట్టమీద పెట్టి, తోక ఊపుతూ గారాలు పోయింది. తర్వాత సుహాస్ తన ఫ్రెండుతో ఫుట్ బాల్ ఆడడం మొదలెట్టాడు. రెండు ఇటుకలు అటూఇటూ దూరంగా పెట్టి, వాటి మధ్యకు బంతి వెళ్తే గోల్ కొట్టినట్టుగా ఏర్పాటు చేసుకన్నారు. గోల్ అంటూ సుహాసే చాలాసార్లు అరిచాడు.

తర్వాత ఏడుపు మొహంతో బంతి పట్టుకుని నా దగ్గరొచ్చాడు సుహాస్. 'తాతయ్యా, ఫుట్ బాల్ ఓ పక్కన చిట్లిపోయింది. ఇంక ఆడడానికి పనికి రాదు' అన్నాడు. 'మరోటి కొందాములే' అన్నాను. ఈ మధ్యే మీరు కొన్నారు కదా. నాన్నను రేపు ఇక్కడికొచ్చేటప్పుడు కొని తెమ్మంటాను' అంటూ అరుగు మీద వున్న ఫోన్ తీశాడు.కాసేపు 'ఆ, ఊ' అంటూ ఫోన్ ఆఫ్

చేసి, ముఖం మాడ్చుకుని  కూర్చున్నాడు. 'ఏమయ్యిందిరా' అంటే, 'పుట్ బాల్ ఇప్పుడు కొనను.అస్తమానం పాడు చేస్తే కొనాలంటే సంపాదించేవాడికి తెలుస్తుంది. ముందు ఆన్ లైన్ క్లాసులు బాగా ఫాలో అవ్వు' అన్నారు నాన్న అని చెప్పాడు. సరే. యాప్రాల్ వెళ్లేటప్పుడు ఇసిఐల్ దగ్గర ఆగి, పుట్ బాల్ కొంటానులే' అన్నాను.



మీరు కొనవద్దు. నాన్న కొనకపోతే నేను కొనుక్కోలేనా' అన్నాడు కోపంగా.  వాడి వంక ఆశ్చర్యంగానూ, అభిమానంగానూ చూస్తూ, 'ఎలా కొంటావురా' అన్నాను. సుహాస్ ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. కోపంగా ఉన్నాడు కదా అని నేనూ మౌనం పాటించాను. మర్నాటి నుంచి పొద్దుటే కాకుండా సాయంత్రం కూడా నాతో పొలానికి వస్తున్నాడు. మెంతి కూర, కొత్తిమీర వంటివి రెండో పంటగా నేను వేయడం ఇంతకు ముందే చూశాడు. ఇప్పుడు వాటి వివరాలు అడిగాడు. చెప్పాను. వరి చేలో నేను కలుపు తీస్తుంటే వాడూ వచ్చి తీశాడు. 'వద్దులే , కాళ్లకు బురద అంటుకుంటుంది ' అన్నాను. వాడు వినలేదు. 'తాతయ్యా, మీతో ఇలా చెయ్యడం నాకిష్టం' అన్నాడు. మనసులో ఆనందించాను.

'ఏరా, పెద్దయ్యాక ఏమవుదామనుకుంటున్నావు' అని అడిగాను. నేను కూడా మీలా వ్యవసాయం చేస్తాను. ఇక్కడి పచ్చని పైరూ, చెట్లూ, పక్షులూ బలేగుంటాయి' అన్నాడు. రెండురోజుల తర్వాత సుహాస్ ను తీసుకెళ్లడానికి వాళ్ల అమ్మ వచ్చింది. వెళ్లే దారిలో నాలుగు తొట్టెలు కొంటేనే వస్తాను అన్నాడు ఆమెతో. ఎందుకంటే ,కొత్తి మీర,  మెంతికూర వాటిలో పండిస్తాను అన్నాడు. 'సర్లే, రా' కొంటానంది.

'తాతయ్యా, గోనె సంచిలో మట్టి వెయ్యండి పట్టుకెళ్తాను' అన్నాడు. సరేనని ఇంటి వెనకున్న మట్టిని తవ్వి, గోనెసంచిలో పోశాను. దాన్ని కారు డిక్కీలో వాడి సాయంతో పెట్టాను. మాకూ, బ్లాకీకి 'బాయ్' చెప్పి, అమ్మతో వెళ్లిపోయాడు. ఈసారి పదిహేను రోజుల వరకూ సుహాస్ మావూరు రాలేదు.నేనూ పొలం పనులతో వాళ్ల అపార్టుమెంటుకు వెళ్లలేకపోయాను. అయితే, అప్పుడప్పుడూ ఫోన్ చేస్తున్నాడు. కొత్తిమీర, మెంతికూర తమ బాల్కనీలోని తొట్టెల్లో ఎంత ఎత్తుకు పెరిగాయో చెబుతున్నాడు. ఈ సరదా ఎంతకాలం వుంటుందిలే అనుకున్నాను.అయితే,కుక్క సరదా అలానే వుంది. తనూ పండించాలనే సరదా కూడా అలాగే



వుంటుందేమోననుకున్నాను. పొలం పనులయిపోవడంతో నేనూ మా ఆవిడా యాప్రాల్ వెళ్లాం కొన్నాళ్లు వుందామని.  కాన్వెంటు నుంచి రావడంతోనే సుహాస్  ఓ గంట ఆన్ లైన్ లో ట్యూషన్ చెప్పించుకుంటాడు. ఆ తర్వాత అపార్టుమెంటులో ఓ పక్కనున్న పచ్చని పచ్చికలో స్నేహితులతో పుట్ బాల్ ఆడుకుంటున్నాడు. 'నువ్వు ఆడుకుంటున్న పుట్ బాల్ ఎవరిది' అని అడిగాను.

'మా ఫ్రెండ్ ది. ఇంతకు ముందు నా బంతితోనే వాళ్లూ ఆడేవాళ్లు. నాది పోవడంతో అతనుకొన్న బాల్ తో ఆడుకుంటున్నాం. కొన్నాళ్లకు నేను కొన్నాక దాంతోనూ ఆడుకుంటాం' అన్నాడు సుహాస్. ఫుట్ బాల్ కొనుక్కోవాలన్న వాడి కోరిక అలానే వుందన్నమాట' అనుకుంటూ, 'ఫుట్ బాల్ ఆటగాళ్లలో నీకు ఎవరు ఇష్టం. ఎందువల్ల' అని అడిగాను.

'క్రిష్టియానో రొనాల్డో అంటే నాకిష్టం. అతను చిన్నప్పుడు తల్లిదండ్రులతోపాటు రోడ్లు ఊడ్చేవాడు. ఆ రోడ్లమీద తనతోటివాళ్లతో ఫుట్ బాల్ ఆడేవాడు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని రొనాల్డో నిరూపించాడు. మీకు గూగుల్ చూడ్డం వస్తే ఇంకా ఎన్నో వివరాలు తెలుస్తాయి' అన్నాడు. అవన్నీ చూసే ఓపిక నాకు లేదు. నేను వయసులో వున్నప్పుడు అర్జెంటీనా సాకర్ ఆటగాడు మారడోనా అంటే చాలా ఇష్టపడేవాడిని. అతని పరుగులో, నడకలో ఎంత అందముండేదో తెలుసా' అన్నాను. మారడోనా పేరు విన్నాను కానీ, అతని ఆట చూడలేదు. యూట్యూబ్ లో చూస్తాను లెండి తాతయ్యా' అంటూ ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు.నేను టీవీ వైపు తల తిప్పాను. ఓ గంట పోయాక'తాతయ్యా, అతని ఆట బలే బాగుంది' అన్నాడు. ఏరా , అందరూ క్రికెట్ ఆడుతుంటారు కదా. నువ్వు ఫుట్ బాల్ ఆడతావేంటి' అని అడిగాను. 'క్రికెట్ లో అయితే అప్పుడప్పుడూ అటూ ఇటూ పరిగెడతారు, బ్యాటింగ్ లోనయినా బౌలింగ్ లోనయినా. అదే ఫుట్ బాల్



సాకర్ లో అయితే క్షణక్షణానికీ కదులుతూనే వుంటారు. అంతే కాదు, ఇందులో చాలా డేరింగ్ వుంటుంది' అన్నాడు. 'ఫుట్ బాల్ బాగా ఆడి, పెద్ద ఆటగాడివి అవ్వాలనుకుంటున్నావా'. లేదు, తాతయ్యా. సరదాగా ఆడుతున్నాను. ఒంటికి కూడా మంచిది కదా. ఏమో ఒక వేళ ఏమైనా అవకాశాలొస్తే, అప్పుడు ఆలోచించవచ్చు' అన్నాడు. సుహాస్ తో మాట్లాడేటప్పుడు వాడి వయసులో నన్ను గుర్తు చేసుకుంటాను.అలాగే మా అబ్బాయిని కూడా. నాకంటే మా అబ్బాయి, వాడి కంటే సుహీస్ చాలా తెలివిగా వ్యవహరిస్తుంటారనుకున్నాను. అంతలో , 'తాతయ్యా, మెంతికూర, కొత్తిమీర ఎలా పెరిగిందో చూద్దురుగానీ రండి' అంటూ బాల్కనీలోకి తీసుకెళ్లాడు. 'నాలుగు తొట్టెల్లో వేశావు. చాలా పండుతుంది' 'ఎన్ని కేజీలు వస్తుందంటారు''ఏడెనిమిది కేజీలు రావచ్చు. ఇంట్లోకి అంత అవసరం లేదు కదా'..'మీరు పొలంలో బోలెడు పండిస్తారు కదా. ఇంటికంత అవసరం వుంటుందా'.. 'మాది వ్యవసాయం. అలా ఎక్కువ పండిస్తేనే మంచి ఆదాయం వస్తుంది'.. 'ఆదాయం అంటే డబ్బులే కదా' అన్నాడు సుహాస్ నా ముఖంలోకి చూస్తూ. 'అవును' అన్నట్టు తలూపాను.



'నేనూ డబ్బుల కోసమే వాటిని ఇంటిలో పండించాను' అన్నాడు. నేను మనవడి వంక ఆశ్చర్యంగా చూశాను. తన ధ్యాసలో తనుండి, 'తాతయ్యా, ఇప్పుడు మెంతికూర, కొత్తిమీర

కేజీ  ఎంత రేటు వుంది‘ అని అడిగాడు. చెప్పాను. ఫోన్ తీసుకుని, ఏదో చూసి,’మీరు చెప్పినదానికంటే ఎక్కువే వుంది‘ అన్నాడు. ’.మార్కెట్ ధర కాస్త అటూ ఇటూ వుంటుంది‘ అన్నాను. మర్నాడు అపార్టుమెంటు పక్కనే కూరగాయలమ్మే ఆవిడ దగ్గరకు నాన్నమ్మను తీసుకెళ్లి కొత్తిమీర, మెంతికూర కేజీ ఎంతకు కొంటుందో అడిగించాడు. మొత్తానికి బేరాలాడి రెండు పెద్ద సంచిల్లో పట్టుకెళ్లి అమ్మేశాడు. అయిదొందలొచ్చాయని చెప్పాడు. మళ్లీ ఇంకో పంట వేస్తానన్నాడు.

’ఈ డబ్బులేం చేస్తావు ’తాతయ్యా, మర్చిపోయారు. పుట్ బాల్ నేనే కొనుక్కుంటానన్నాను కదా‘ గుర్తొచ్చింది నాకు.  నేనప్పుడు పెద్దగా పట్టించుకోలేదు  ’ మిగతా డబ్బులు నేనిస్తాలే ‘అన్నాను. వద్దులెండి. మరో పంట వచ్చాక నేనే కొనుక్కుంటాను‘ అన్నాడు. ఆలోచిస్తూ కాసేపున్నాక, ’పుట్ బాల్ కు డబ్బులొచ్చాక, ఈ తొట్టె పంటలు మానేస్తావా‘ అన్నాను. లేదు తాతయ్యా. నాకు వాటి మీద ఇష్టం పెరిగింది. అగ్రకల్చర్ బియస్సీ చదువుతాను. ఉద్యోగం వచ్చినా,మీలా వ్యవసాయం చేస్తాను. మీలా అంటే మీలాగ కాదు. కొత్త కొత్త పద్ధతుల్లో‘ అన్నాడు.

భూమిలా  వుండే పుట్ బాల్ నా బుర్రలో తిరుగుతోంది. నన్ను మించిన కొడుకు, వాడిని మించిన మనవడు... సుహాస్ ఆలోచన్లు బాగానే వున్నాయి. ఏం జరుగుతుందో వేచి చూడాలనుకున్నాను.

## కలిదిండి వెంకట సుబ్రహ్మణ్య వర్మ

కె.వి.యస్.వర్మ స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా పెనుమళ్ల. పలు దినపత్రికలు, న్యూస్ ఛానళ్లలో సీనియర్ జర్నలిస్టుగా బాధ్యతలు నిర్వహించి, విరమణ పొందారు. 1968లో వీరి మొదటి కథ ‘స్త్రీ హృదయం’ ప్రచురితమైంది. ఇప్పటివరకూ వందకుపైగా కథలు ప్రముఖ వార, మాస పత్రికల్లో ప్రచురితమయ్యాయి. కొన్ని కథలు హిందీ, తమిళం, కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆంధ్రభూమి దినపత్రిక న్యూస్ ఎడిటర్‌గా ‘కథాకళి’, వార్త డైలీ డిప్యూటీ ఎడిటర్‌గా ‘ప్రతిధ్వని’ పేరుతో 500లకు పైగా ఫీచర్స్ కాలమ్స్ ప్రచురితమయ్యాయి. వందలాది సమీక్షలు చేశారు. ఐదు కథా సంపుటాలు, రెండు ఫీచర్స్ సంపుటాలు, శ్రీశ్రీపై వ్యాసాల పుస్తకం, ఒక కవితా సంపుటి వెలువరించారు. మరికొన్ని ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి.

# ఆకలి



**దాసరి వెంకటరమణ**
**9000572573**

రాత్రి తొమ్మిదవుతోంది. జోరున వర్షం కురుస్తోంది. కిటికీ పక్కన కూర్చొని, వీధి లైటు వెలుగులో కనిపిస్తున్న వర్షపు చినుకులను చూస్తున్నాను. సవ్యసాచి సంధించి బలంగా వదిలిన శర పరంపరలా వాన చినుకులు ధరణికి అభిముఖంగా ఏటవాలుగా కురుస్తున్నాయి. వేసంగి తాపానికి బాగా మగ్గిన శరీరానికి తొలకరి చినుకుల్లో తడిసి, మెత్తగా తగుల్తున్న చిరుగాలి స్పర్శ ఆహ్లాదకరంగా ఉంది. అప్పుడప్పుడు ఒకటీ అరా వాహనాలు వైపర్స్ తో అద్దాలు తుడుచుకుంటూ హడావిడిగా వెళ్తున్నాయి. పక్కింటి ఐటీ వామనరావు వాళ్ళ ఇంటి ముందు కారు ఆపి గేట్ తెరవడం కోసం హారన్ కొడుతున్నాడు.

‘తాతయ్యా! అమ్మ భోజనానికి రమ్మంటోంది‘ తల తిప్పి చూశాను. మనవరాలు మృదుల నిలబడి వుంది. కారు హారన్ సౌండ్ లో నాకు వినపడలేదు కానీ, ఆ పిలవడం రెండోసారో, మూడోసారో అనే ధ్వని ఆ పిలుపులో స్పష్టంగా వినపడుతోంది. తలతిప్పి చూసే సరికి మరోసారి డైలాగ్ అప్పజెప్పి రివ్వున వెళ్ళిపోయింది. ఒంట్లో నలతగా వుండి, వాకింగుకెళ్ళక రెండు

రోజులయింది. కడుపు నిండుగా వుంది. మధ్యాహ్నం తిన్నది అలాగే ఉన్నట్టుంది. వర్షం పెరగడం లేదు. అలాగని తరగడం లేదు. వర్షధ్వని ఒకే లయలో వినిపిస్తోంది. అయిదు నిముషాల తర్వాత మృదుల మళ్ళీ వచ్చింది.

'తాతయ్యా! అమ్మ త్వరగా రమ్మంటోంది.' 'నాకు ఆకలిగా లేదమ్మా! ఈ పూటకు పాలు తాగి పడుకుంటాలే! మీరు తినండి' మృదుల వెళ్ళిపోయింది. ఆకలి అనే పదం అప్రయత్నంగా మరో రెండు సార్లు నా నోట్లోంచి అస్పష్టంగా విన్పించీ విన్పించక బయటికి వచ్చింది. ఆకలి .... డెబ్బయ్యేళ్ళ నా జీవితంలో ఆ పదం నా చెవిన పడిన ప్రతిసారీ, వెంటనే ఒకానొక దృశ్యం కళ్ళముందు అలా కదలినట్టయి ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోతాను. ఇప్పుడూ అదే జరిగింది. చిన్ననాటి ఆ సంఘటన నా కళ్ళ ముందు సినిమా రీలులా కదిలింది.

అప్పుడు నాకు అయిదారేళ్ళు ఉంటాయేమో...... కర్నూల్ సత్యనారాయణ స్వామి గుడి పక్కనున్న బొగ్గు గనులకు ఎదురుగా నంద్యాల రోడ్డు పక్కన యాప చెట్టుకింద ఒక ఇంట్లో బాడుగకు ఉండేవాళ్ళం.

ఆ రోజు పగలు ఎప్పుడు పడుకున్నానో గుర్తు లేదు కానీ, లేచే సరికి బాగా ఆకలేస్తోంది. బైటికి వచ్చి సూస్తే యాప చెట్టు నీడ సూరిగాడి ఇంటిముందు కట్టేసిన మేక పిల్ల మీదకు పోయింది. అంటే పైటాల దాటిపోయిందని అర్థం. అందుకే ఆకలిగా ఉంది. బాగా నీర్సంగా గూడా ఉంది. మాయక్క యాడికి పోయింటాది. ఆస్పత్రికే పోయింటది. మా యమ్మకు చయ జబ్బంట. అందుకే పెద్దాసుపత్రిలో చేర్పిచ్చినాం. అసలు మా యమ్మను ఆస్పత్రిలో సూపిచ్చడానికే మేము ఈ కర్నూలొచ్చినామంటా. మా యక్క అప్పుడప్పుడు సెప్తాది.

రోడ్డు శానా ఎత్తు మీదుంది. అందుకే మెల్లగా పాక్కుంటా రోడ్డెక్కాను. బద్దరంగా రోడ్డు దాటినాను. సత్యనారాయణ సామి గుడి కాటికి రాంగానే మద్దిలేటి ఓటల్ల రెండు పైసల బిస్కట్ బన్నులు కంటపడినై. ఓటలంటే పెద్ద ఓటలు గాదు. గుడి గోడ నానుకొని చిన్న వారపాకు. దాని కింద ఒక టేబులు. పక్కన నాపరాళ్ళతోటి కట్టిన బెంచీ. టేబులు మీద సీసాలో బిస్కట్టూ, బన్నూ సూడగానే నోరూరింది. ఆ బెంచీ మీద కూసోని, గాజు పలకల గిలాసలో, కాపీల బన్ను అద్దుకొని తినాలని ఆ ఓటలు సూసినప్పుడల్లా అనిపిస్తది. అట్టా తినేటోల్లను మస్తుమందిని సూసినా. అందుకే ఆడికి రాగానే అది గుర్తుకొస్తాది. మల్ల మల్ల ఎనుకకు తిరిగి, ఆ బన్నుకెళ్ళి సూసుకుంటూ ముందుకు పోతుంటే, కాలికి రాయి తగుల్కోని బోర్లా పడినా. ఓటలు కాడున్న ఒక మనిసి బెరీత వురికొచ్చి, నన్ను లేపి నిలబెట్టిన, 'ముందు సూసి నడ్సు మొగోడా!' అన్న్యాడు. మోచేయి కొంచెం దోక్కపోయింది. నోట్లోంచి ఉమ్మి తీసి దానికి రాసినా. దెబ్బ తగిల్తే అట్టా జేయాలని మా యమ్మ జెప్పింది. గుండూడి పోయి, సెల్లాడం జారిపోతోంది. దాన్ని మీద్కి గుంజుకొని, మొల్తాడు ఎక్కిచ్చినా. మెల్లిగా కినాల్ కట్ట దాటినా.

పెద్దాసుపత్రిలోకి పోవాలంటే ఆ...డున్న పెద్ద గేటి కాట్కి పో పన్లా. కినాల్ కట్ట దాటినాంక ఆసుపత్రి గోడకు సన్న బొక్క ఉంటది. దాంట్ల దూరి కాలి బాటెంబడి పొతే, ఆస్పత్రి ఎనకాల

ఎర్రపూల సెట్లకాడ చయ వార్డుంటది. మా యక్కా నేను ఎప్పుడు పోయినా ఇట్టానే పోతం.

తీరా మాయమ్మ కాడికి పోయేతాలికి, మంచమ్మీద మా యమ్మ లేదు. నేను ఉరికి బైటికి వచ్చిన. వార్డు పక్కన సెట్టుకింద ఇస్కల మా జేజి కూసోనుంది. నన్ను సూడగానే, 'పాపోడూ! ఇక్కరా, మీ యమ్మను పరీచ్చలు జేపియ్యనీకి తోల్కబొయినారు.'అనింది.

'మల్ల అక్క' 'అక్క గూడ్క బోయింది. వస్తార్లె ... కూసో.... ఇంద... ఈ బన్ను తిను' అనింది. బన్ను అనగానే మల్ల నోరూరింది. జేజి తన పాతబట్టల ముల్లె ఇప్పి, దాంట్లోంచి, మల్ల ఒక సన్న ముల్లె ఇప్పి ఎర్రెర్ర గీతలున్న కాయితంలోపల సుట్టి పెట్టిన బన్ను తీసిచ్చింది. ఆ బన్ను తీస్కొని గబుక్కున నోట్ల పెట్టుకొని, తుపుక్కున వూసేసిన. బన్ను పాసిపోయింది. బాగా వాసనొస్తోంది. నోరంతా ఎట్టనో ఐపోయింది. బన్ను అనగానే రెండు పైసల బన్ను లాగుంటది అనుకుంటి. 'పాపోడూ! ఏందిరా అట్ల వుమ్మితివి'అనింది మా జేజి. 'తూ..... వాసనొస్తోంది.'అన్యా.

'వాసన రాని బన్నులు మీ నాయన సంపాచ్చి పెట్టి నాడుపో!' అనింది జేజి. నాకు వెంటనే మా నాయన గుర్తుకొచ్చినాడు. గిరుక్కున తిరిగి రోడ్డు మీదికొచ్చినా. మా నాయన సీ క్యాంపిల సుబ్రమన్నెం డిపోలో కట్టెలు గొడ్తాడు. నన్ను సూస్తానే గొడ్డలి పక్కన పడేసి. 'పులిపిల్ల... పులిపిల్ల వచ్చింది ' అని ఎదురొచ్చి నన్ను ఎత్తుకుంటాడు. కాసేపైనాంక 'పో! సిన్నెంకటి మామ కాడ బెల్లం చెరుకు తెచ్చుకపో' అని, 'ఒహోయ్! నీ అల్లు డొస్తున్నాడు బెల్లం చెర్కు కొట్టు' అంటాడు. కాసేపాగి 'మంచిజ్జాసి కొట్టు' అంటాడు. నేను బొయ్యి, బెల్లం చెర్కు తెచ్చుకొని, అవతాల ఇవతాల కణుపుల కాడికి మెల్లగా ఈనెలు ఒల్చుకొని నమిలి, నడిమిట్లోది నాయనకిస్తే, రప్ప రప్ప ఈనెలు ఒల్చి, కణుపులు కొరికి సన్న సన్న ముక్కలు సేసి నా కిచ్చేటోడు. బెల్లం చెరుకులు తల్చుకొనే తాల్కి నోట్ల నీళ్ళూరినాయి.

మెల్లిగా కినాల్ కట్ట దాటినా, మద్దిలేటి ఒటేల్ల సూరిగాడు బెంచీ మీద కూసోని, కాపీల బన్ను అద్దుకొని తింటున్నాడు. పక్కనే ఆల్ల నాయినున్నాడు. బన్ను సూడగానే, మల్లా కడుపుల ఆకలి గుర్తుకొచ్చింది. ఎందుకో నాకు సూరిగాడి కెల్లి సూడబుద్ధి కాలే. ఆన్ని సూడనట్టుగానే నేరుగా ముందుకొచ్చినా. బొగ్గు గనిల ఇనుప చక్కురాల టాక్టార్ గని బొక్కల్ని బూడ్చుతోంది. టాక్టారు ముందు పెద్ద ఇనుప రేకు లాంటిది ఉంటది. దాంతో ఆడీడ మన్ను కువ్వ జేసుకొని, తీస్కబోయి గని బొక్కలోకి నూకుతది. నేను మా యమ్మెంట రెండు మూడు సార్లు, బిర్ల కంపెనీ సబ్బు నీళ్ళ కాలవల బట్ట లుతుకనీకి బోయినప్పుడు సూసినా. ఇప్పుడు ఆ టాక్టార్ కాడ జనం మూగినారు. ఏందో అని పోయి సూసిన. టాక్టార్ ఒక గని లోన్కి పోయి ఇర్క పోయింది. బైటికి తియ్యనీకి తంటాలు బడ్తుండారు. నేను శానా సేపు నిలబన్యా. యాశీర్కొచ్చి, కడుపుల ఆకలి గుర్తుకొచ్చి, మల్ల రోడ్డు మీద్కి ఒచ్చినా.

రెండు రోడ్ల మధ్య పసుప్పచ్చ సిమెంటు రాయి వుంది. నడ్సనీక శాతగాక ఆ రాయిమీద కూసున్నా. దాని మీద అచ్చరాలున్నాయి. ఒక్కెల్లి నంద్యాల అనీ, మరొక్కెల్లి గుత్తి,

అనంతపురం అని వాటెన్కాల కర్నూలు అని రాసుంటదని మా యన్న సెప్పినాడు. నాకు సదవనీక రాదు గాని, మా యన్న సెప్పింది గుర్తుంది. మా యన్న ఉస్సుమానియా కాలేజీల పేద్ద సదువు సదువు తున్నడు. మా యింట్ల ఉండడు. యాన్నో దూరాన ఆస్టల్ల ఉంటాడంట మా యమ్మ జెప్పింది. కిందికి దిగి ఆ రాయి ముందు మోకాళ్ళ మీద కూసున్న. పచ్చరంగు మీద అచ్చరాల గుంతలుల్ల నల్ల రంగేసినారు. నేను సూపుడు ఏలు అచ్చరాల మీద పెట్టి ఆ వూరు పేర్లు సదువుకుంటా దిద్దుతున్నా. యా రోడ్డు యా వూర్కు బోతదో నాకు తెల్సు కదా! 'ఓయ్ బొట్టు సామీ ఆడేం జేత్తున్నావ్.' అని ఇనిపించే తాల్కి ఎనిక్కి తిర్గి సూసినా. సూరిగాడు అంగితో మూతి తుడ్సుకుంటా వస్తున్నాడు. 'ఏం... ల్యా' అని, మల్ల ఆడు దగ్గరి కొచ్చినాంక. 'మా యక్క ఆస్పత్రి కాడుంది. నాకు బాగా ఆకలైతుంది.' అన్యా. 'మద్దిలేటి ఓటల్ల బన్ను రొట్టె తింటావా?' అన్న్యాడు. నాకు నోటెంబడి మాట రాల్యా. తలకాయ మాత్రం ఊపినా. నా మడుసుల ఆడు తినిపియ్యడులే అనిపిచ్చింది. 'నువ్వు ఓ పంజెయ్యాల' అన్న్యాడు. నాకు కొంచెం ఆశ పుట్టింది. 'ఓ!....' అన్నా. 'ఐతే.. నా యెంట రా...' అన్నాడు. నీను వానేనకాల్నే నడిసినా. రోడ్డు దాటి మా ఇంటి కాడికి ఒచ్చినాం. నన్ను మా ఇంటిముందు చిన్న గద్దె మీద కూసోబెట్టి 'ఉండు ఇప్పుడే వస్తా' అని ఆళ్ళింట్లోకి పోయినాడు. కాసేపున్న్యాక ఒక సలాకి తీసుకొచ్చి, 'దీన్ని బట్టుకున్నవంటే బన్ను రొట్టె తినిపిస్తా...' అన్న్యాడు. నేను మరింకేమీ ఆలోచించకుండా, టక్కున దాన్ని పట్టుకొని, ఎంటనే 'అమ్మా! సస్తినే...'అని అరచి, చెయ్యి ఇదిలిచ్చుకుంటా కింద మన్నుల వడి దొర్లుతున్నా. సూరిగాడు 'అట్ట వదిలెయ్య గూడ్దు అట్నే కొంచేపన్నా పట్కాల... నేను నీకు బన్ను తినిపియ్యను పో...' అని సలాకి పడేసి వుర్కినాడు.

అప్పుడే మా యన్న సైకిల్ మీద ఒచ్చినాడు. నన్ను అట్ట సూడగానే, సైకిల్ స్టాండ కూడా ఎయ్యకుండా, ఆడ బడేసి, నన్ను లేపి గద్దె మీద కూసోబెట్టి, ఏం జరిగింది అనే. నేను ఏడ్చుకుంటానే అంతా సెప్పినా. మా యన్న సూరిగాన్ని నానా కూతలు తిట్టి 'నీకు బన్ను నేను తినిపిస్తా... పా.....' అని నన్ను మద్దిలేటి ఓటేలు కాడ్కి తోల్క పోయినాడు. బన్నూ, కాపి గూడ్క ఇప్పిచ్చినాడు. నేను నా సెయ్యి కెల్లి సూస్కున్న. సెయ్యంతా మసి అంటింది. బాగా మంటగుంది. ఇంకా సెయ్యి ఇదిలిచ్చుకుంటా ఎడుస్తానే వున్న్యా. మా యన్న పలకల కాపి గిలాస నా ముందుకు జరిపి 'తగ్గి పోతదిలే, నాక్కనపన్నీ ఆ సూరిగాడి గు...వలగొడ్తా, దీంట్ల బన్ను అద్దుకొని తిను..బాగుంటది'అన్నాడు. నేను ఆ మసి చెయ్యి తోనే బన్నును కొంచెం కొంచెం తుంచి, కాపిల అద్దుకొని తింటున్నా. కండ్లనుండి కారిన నీళ్ళు నా నోట్లోకి వచ్చినయ్. సల్లారిపోయిన కాపి, మసి అంటిన బన్ను, కండ్ల నీళ్ళు అన్ని కలిసిపోయినై. బన్ను కడుపుల పన్న్యాక లోపల మంట సల్లారింది. నేను తింటున్నంత సేపూ మాయన్న గొంతు గూసోని నా మొగం లోకే సూడబట్టే.

నేను తిన్న్యంక మా యన్న పై జోయిలోంచి పది పైసల బిళ్ళ మద్దిలేటి కిస్తే, ఆయప్ప సిల్లర తిరిగిచ్చినాడు. సిల్లర జోయిలేసుకుంటూ మా అన్న 'ఇంగ... పా ' అన్న్యాడు. నేనొక సారి

నా సెయ్యి జూసుకున్నా. మంట తగ్గి పోయింది. నేను నా సెయ్యికెల్లి సూస్కుంటుంటే, 'నేను మందు రాపిస్తా తగ్గి పోతది గానీ... ఇంగ పోదాం రా..' అన్న్యాడు. నేను ఆన్నుంచి లేయ్యలేదు. మెల్లిగా 'అన్నా!'అన్న్యా. మా యన్న ఏందని నాకెల్లి సూసినాడు. 'నేను కాలె కాలె సలాకి మల్లా పట్టుకుంటన్నా' అన్న్యా. మా యన్న గబుక్కున 'ఎందుకురా?' అన్న్యాడు.

'ఇప్పుడు శాంచేపు పట్టుకుంటాలే .. ఐతే ఈ పారి రెండు బన్నులు తినిపియ్యాల'అంటి. మా యన్న మాట్లాడ్ల్యా . కాసేపు గమ్మునుండి, కండ్లల్ల నీళ్ళు గార్తుంటే, మాట్లాడకుండా పోయి రెండు బన్నులు తీసుకొచ్చి ఇచ్చే. మద్దిలేటికి జెప్పి దుడ్లు మల్లొచ్చినప్పుడు ఇస్తా అని, శాంచేపు బంగపోయి కాపి ఇప్పిచ్చినాడు. బన్ను కాపీల అద్దుకొని తింటూంటే. అన్న నా ముందరొచ్చి కూసునే. అన్న కండ్ల నుండి నీళ్ళు కార్తానే ఉన్నయ్. అన్న ఎందుకేడ్సి నాడో నాకు అప్పుడు అర్థం కాల్యా.

'తాతయ్యా! ఇదిగో పాలు, ఈ బన్ను ముంచుకొని వేడి చల్లారక ముందే తాగమంది అమ్మ' మనవరాలు ఎంత స్పీడ గా వచ్చిందో అంతే స్పీడ గా వెళ్లి పోయింది. బయట వర్షం ఇంకా తగ్గలేదు. నేను గతం జ్ఞాపకాల వెల్లువలో తడిసిన గుర్తుగా నా కళ్ళనుండి జారిన కన్నీళ్లు. ఒక బన్ను ముక్క పాలల్లో ముంచుకొని, నోట్లో పెట్టుకుంటే, వెనుకటి రుచి గుర్తు చేసుకోవడంలో నా మనసు మునిగి పోయింది.

## దాసరి వెంకటరమణ

దాసరి వెంకటరమణ స్వస్థలం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ. విద్యాభ్యాసం హైదరాబాద్‌లో సాగింది. 'చందమామ కథలు – బాలల వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై పరిశోధన చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్నారు. 2014లో 'ఆనందం' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న ఈయన.. 1982 నుంచి కథలు రాస్తు న్నారు. మొదటి కథ చందమామలో అచ్చయ్యింది. ఇప్పటివరకు దాదాపు 500 రచనలు.. వివిధ వార, మాస పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పలు రచనలు పాఠ్యపుస్తకాల్లో చోటు సంపాదించుకున్నాయి. వివిధ సంస్థల నుంచి ఎన్నో పురస్కారాలు, బహుమతులు అందుకున్నారు.

# మొట్టమొదటి కడపటివాడు



డా ఎల్ కె సుధాకర్

పెద్ద కష్టమేమీ కాదు... నువు సులభం గానే గుర్తు పట్టగలవు. మిగలముగ్గిన దోస పండుని నిలువునా కోసినట్టు ఉంటాడాయన. వయసు తొంభై మూడు..అయినా అరవై మూడు కి మించవని పందెం వేయొచ్చు.రోజుకి రెండు మొక్కజొన్న పొత్తులు తిని బతికేస్తున్నా డు. ఆయనతో నడక లో పోటీ పడ్డం మనవల్ల కాదంటే కాదు.చాలా ముఖ్యమైన పనన్నారు. ఏంటో చెప్పరు. నువ్వే చూస్తావు గా. వెళ్లి రిసీవ్ చేసుకో. విమానం వచ్చేది పన్నెండు న్నరకీ. బయల్దేరు.

అన్నట్టు ఆయన పేరు కూడా విచిత్రం గా ఉంటాది. యాజ్ఞ వల్క్య కృష్ణ ...ఈ రోజుల్లో ఆ గోల ఎందుకులే అనీ...సింపుల్ గా కే.వై. కృష్ణ గారనో..బాగా దగ్గరి వాళ్ళైతే యజ్ఞ కృష్ణ అనో పిలుస్తారు. అసలు ఇదేదీ కాదు ఆయన పేరు కృష్ణ సోమయాజులు అంటాడు మన శర్మ. తమాషా ఏంటంటే ఎలా పిలిచినా పలుకుతాడు మహానుభావుడు. తానంత గొప్ప సైంటిస్ట్ నని గానీ...ఈ దేశమే గర్వించదగ్గ పనులు ఇన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరిం చబడ్డాయని గానీ..పిసరంత గర్వం వెదికినా కనబడదు. అసలు నేనే వద్దును. ఒప్పుకోడు. సీరియస్

అవుతాడు. ఆఫీస్ పని ఆగకూడదు. ఆయనతో మంచి అనుభవం నీకు.నాది పూచీ..వెళ్ళిరా...గాల్లోనే రెండు చేతులూ జోడించి నమస్కారం చేసుకుంటూ చెప్పుకు పోతున్నాడు ఆఫీసర్. ఆలోచనల తోనే రాజమండ్రీ ఎయిర్ పోర్టు కి చేరుకున్నాను. నిజవే..ఆయన్ని అంత మందిలోనూ గుర్తుపట్టడం అసలు కష్టం కాలేదు. పరిచయాలయ్యాయి. ఆయన పెర్సనల్ బాగ్ ఆయనే మోసుకుంటూ కారెక్కారు. లె మి హెల్ప్ మైసెల్ఫ్ డియర్ బాయ్....

ప్రభుత్వ వ్యవస్థ ప్రసాదించిన జన్మ హక్కు లాంటి అతి వినయం తో ముందు సీట్లో కూర్చో బోయాను. ఆయన నవ్వీ నో ఫార్మాలిటీస్. ఇలా వచ్చి వెనక సీట్లో కూచో. మాట్లాడేప్పుడు మెడ నొప్పి రాకుండా ఉంటుంది.

ఆ..నీ పేరు నాకు చాలా ఇష్టం. అంబేడ్కర్...అన్నారాయన. ప్రయాణం మొదలైంది . మనం ఎలాగూ గంటన్నర ప్రయాణం చేశాక గానీ అమలాపురం లో నా బసకి చేరుకోలేం కదా??! కార్ అద్దాలు దించేసి హాయిగా గోదారి గాలిని తనివితీరా ఆస్వాదిస్తూ...ఆయన ధ్యానం లోకెలిపోయారు. నాలో ఒకటే ఉత్సుకత. సార్ మీ పేరేమిటి అని అడగాలి...ఎలా. పేరులో నేముంది..అనీ నవ్వేస్తాడా!!!

డ్రైవర్ సెల్ మోగింది...అవతల అతడి భార్యనుకుంటా. పిల్లాడి గురించో...పిల్ల గురించో రాంకుల పిర్యాదులు. సిజేరియన్ పిల్లలు మరీ..అంటున్నాడు డ్రైవర్. ఈయనది విన్నారు...చిన్నగా నవ్వుకున్నా రు. బయటినుంచి గోదారి గాలి చల్లగా మొహాన కొడుతోంది.

అంటే సిజరియన్ పిల్లలు చదువులు చదవ రంటావెంటోయ్...అన్నారు. డ్రైవర్ కి ఎందుకో ఏమి పాలుపోలేదు. నవ్వబోయి ఏం చెయ్యాలో తోచక... హారన్ కొట్టాడు. మళ్లీ నిశ్శబ్దం కార్లో...గాలి హోరు తప్ప ఏమీ లేదు.

నిశ్శబ్దాన్ని ఆయనే ఛేదించేరు. నేను ఇక్కడే పుట్టానోయ్. నేనూ సిజరీయన్ బేబీ నే...ఆ మాటకొస్తే బహుశా ఇండియా లోనే మొట్టమొదటి సిజేరియను ఆపరేషన్ మా అమ్మదే అయ్యుంటుంది... అన్నారు. పలకరిస్తూ న్నట్టు ధవళేశ్వరం గోదారి గాలి కార్లో మమ్మల్ని స్పృశిస్తూంది. జ్ఞాపకాల ఆనకట్ట తెగినట్టు...వరద గోదారిలా ఆయన భావోద్వేగం. ఆ! అన్నట్టు నువు కథలు రాస్తావంట కదా..అన్నారు నా వేపు తిరిగి. కొంచెం సిగ్గూ..కొంచెం గర్వం..ఒకేసారి ప్రదర్శిస్తూ తలూపాను. నా కథ చెప్పనా. కాలక్షేపం కూడానూ అన్నారు.

సరిగ్గా తొంబై మూడేళ్ళ క్రితం ..... మా అమ్మ సద్బ్రాహ్మణ కుటుంబం లో ఉన్న పిల్ల.... నెలలు నిండి ప్రసవానికి సిద్ధం గా ఉన్న రోజులు. అత్తగారు...అమ్మగారు ఒకే ఊరు కావడం తో ఇబ్బందులు లేవు. అంబాజీపేట లో దొరల ఆసుపత్రికి పరీక్షకి తీసుకెళ్లారు. ఆ డాక్టర్ నర్సూ ల పేర్లు కూడా నాకు గుర్తే .అమ్మ ఎంత మురిసి పోయేదో వాళ్ళని తలుచుకుని. పీటర్ సన్...మారియా. తెల్ల దొరలు. పరీక్ష చేసిన డాక్టర్ కి అమ్మ కడుపులో బిడ్డ తేడా గా ఉన్నట్టు తెలిసింది. అప్పటికప్పుడు పుస్తకాలు రిఫర్ చేసుకున్నాడు. ఫోనులూ...వగైరాలు లేవు. ఉన్నదల్లా చదువుకున్న పాటి జ్ఞానమూ,ఆసుపత్రి లో ఉన్న పుస్తకాలూనూ. తోడుగా తల్లుల

లాంటి నర్సులు. రెండు రోజుల తర్వాత మళ్లీ రమ్మన్నారు అమ్మని. పరీక్ష చేశారు. ఆపరేషన్ చేస్తే తప్ప తల్లీ బిడ్డా చెప్పలేమన్నారు. ఆపరేషన్ కి సిద్ధం కమ్మన్నారు.

పిదప కాలం కాకపోతే దేవుడిచ్చిన మేర కి కృష్ణా రామా అనుకోక ఈ ఆపరేషన్ ఏవిటి...ఖర్మ. ఇంటా వంటా లేని విడ్డూరం కాపోతే. చస్తే వాడి లీల అనుకోవాలి గానీ..వీళ్ళేం దిగొచ్చారా..తలరాతలు కూడా మార్చేస్తారే. ససేమిరా ఒప్పుకునేది లేదు. అంటూ తోక తొక్కిన తాచే అయ్యాడు యాజులు...మా నాన్న. నానమ్మ అయితే ఒకటే శోకన్నాలు పెరట్లో. సంప్రదాయాలు మంట గలిపెస్తున్నార్రా దేవుడో..వద్దురా ఆ పిల్ల వాళ్ళ నాన్న ఇంగిలేసు చదువు చదివిన వాడంటే విన్నారా.... ఇంత రాద్ధాంతం లోనూ తనని సమర్థించిన వాడు పుట్టింటి దరపు న ఆమె తమ్ముడే. స్వతంత్ర పోరాటం లో చురుకైన కార్య కర్త గా అప్పుడప్పుడే ఎదుగుతున్న వాడు. బ్రిటిష్ వాళ్ళని ఎంత శత్రువులు గా చూసినా...వాళ్ళ ఆసుపత్రుల సేవలూ..రైల్వే తదితరాలు నిశితంగా గమనిస్తున్న తరం వాడు.

ఆ విధంగా గా మా అమ్మకి సిజేరియను ఆపరేషన్ పెట్రమాక్స్ లైట్ ల కాంతిలో పీటర్సన్ గారు విజయవంతం గా చేశారు. ఇదిగో ఇన్నేళ్ళకి నేనిలా. అంటూ నవ్వారాయన. డ్రైవర్ కి వింతగా చాలా విశేషం గా తోచిందన్నది అతడి చూపుల్లోనే తెలుస్తోంది. ఏవోయ్.. మరి నేనెలా సైంటిస్ట్ అయ్యానంటావు?? అంటూ మేళమాడేరు.

కారు రోడ్డు పక్కన టీ బంకు దగ్గర ఆపమన్నారు. ముగ్గురం దిగేము. ఇలా రోడ్డు పక్క బంకు ల్లో టీ గానీ రొట్టెలు గానీ ఏ స్టార్ హోటల్ లో కన్నా బ్రహ్మాండం గా ఉంటాయి. తెలుసా..అంటూ అక్కడే నులక మంచం మీద కూర్చుంటూ..నన్నూ..డ్రైవర్ నీ కూడా కూర్చోమన్నారు. డ్రైవర్ ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. ఆయన ప్రతిదీ గమనిస్తూనే ఉన్నారు. ఇక్కడ సరే. మరి కారు లో తప్పకుండా కూచో వలసిందే కదా!! అంటూ నవ్వారు. డ్రైవర్ కి ఓ క్షణం లో అర్థమయింది. వెంటనే కూచున్నాడు.టీ పకోడీ ఆర్డరు ఇచ్చేరు. వేడిగా పకోడీ లు నములుతూ మళ్లీ కబుర్లు మొదలెట్టారు. అలా నేను రికార్డులలో లేకపోయినప్పటికీ బహుశా ఈ దేశం లోనే మొట్టమొదటి సిజేరియన్ పిల్లాడినయ్యాను. ఇంటికొచ్చాక మా నాన్న అప్రాచ్యపు ముండా!! అన్నాట్ట అమ్మని. నన్ను చూడనే లేదంట.వాడా అప్రాచ్యపు వెధవ. వాడి మొహం చూస్తేనే అష్ట మహా పాతకాలూ మెడకు చుట్టుకున్నట్టు. నేను చూడను..ఆ అప్రాచ్యున్ని. మా మావయ్య నన్ను ఎత్తుకుని మురిపోతూ ఆడిస్తూ ఉన్నప్పుడల్లా నాన్న గారి తిట్ల దండకం మొదలయ్యేది.

పిల్లాడి జాతక చక్రం అంటూ మావయ్య ఓ కాయితం పట్టుకొచ్చి నాన్న కి వినబడేలా చదివిన రోజు నుంచీ ఆయన ధోరణి లో కొద్దిగా మార్పొచ్చింది. పిల్లాడు తండ్రి పుణ్య కార్యాల ఫలం గా పుట్టాడు. ప్రపంచం గర్వించదగ్గ మహా పురుషుడి చిన్నెలు కొట్టొచ్చినట్టే కనబడుతున్నాయి. నక్షత్ర బలం ...ఆ తెల్లోడు తెలిసి చేశాడో..దైవ సంకల్పమో చెప్పలేం గానీ...భూపతన సమయం...అమోఘం. అద్భుతం. అంతెందుకు...ఒక్క మాటలో యాజులి కొడుకు కోటికి ఒక్కడు. అన్నిటికంటే ముఖ్యం తన తండ్రి తాలూకు పూర్వ జన్మ బాకీ గా

ఉన్న అకాల మరణ గండం వీడి జన్మ సమయం పుణ్యమా అనీ పూర్తిగా గడిచినట్టే. (ఏరా తమ్ముడూ! నిజం చెప్పు...ఇది నీ పనే గదూ!!! భడవా! బావకి టోపీ వేస్తావూ!! ).

అప్పటినుంచీ నేను యాజులు గారబ్బాయిగా గారాల పుతుడినయ్యాను. ఇంతలో నా నామకరణ మహోత్సవం. నామ కరణం అనగానే...ఉన్నట్టుండి నాలో ఉత్సుకత పెరిగింది. ముందుకు జరిగాను. కారు కడియం పూల తోటల మధ్య హైవే మీద పరిగెడుతోంది. రంగు రంగుల పూలు నేలకి ఇంద్రధనుస్సు లు దిగివచ్చినట్టు.

ఆయన కళ్ళు మూసుకుని తిరిగి చెప్పడం మొదలెట్టారు. పంతులు గారి లెక్కల ప్రకారం య తో మొదలవ్వాలి పిల్లా డి పేరు. అలానే పెట్టాడు మా నాన్న. ఆ రోజుల్లో ఘనం గా జరిగిన ఆ బ్రాహ్మణ మహోత్సవం లో మా అమ్మ ఓ అపురూపమైన నిర్ణయం తీసుకుంది. అంతా విని మా మావయ్య ముందు కాస్త ఆశ్చర్యం...ఆపై సంతోషం వెలిబుచ్చా డు. (అప్పుడు నువ్వు ఎంతో ముద్దొచ్చావ్ ట్రా...మావయ్యకి).

ఆరో ఏట బళ్ళో వేయడానికి వెళ్ళినప్పుడు నా పేరు(ఏవిటి...ఈ అప్రాచ్యుడు అప్పుడే బడి ఈడుకొచ్చాడూ..) మాస్టారికి చెప్పి....ఇంటిపేరు తో కే.వై. కృష్ణ అని మాత్రం రాయించింది. నాన్న కి మాట్లాడే ఛాన్స్ ఇవ్వలేదు. మాస్టారు కాస్త తడబడ్డా డు. కానీ అక్కడున్నది బుచ్చమ్మ...మా అమ్మ. కొడుకు ను కన్నప్పటి నుంచీ అమ్మ లో ఆత్మ స్థైర్యం అలవోకగా పెరిగిపోయింది. ఇప్పుడు తను  మామూలు అణిగి మణిగి ఉండే ఇంట్లో మనిషి కాదు మరి. ఆయనేం అనలేదు. ఎప్పటిలానే మానాన్న నన్ను ఈ అప్రాచ్యపు వాడికి ఇంగిలీసు స్టయిల్ పేరుట్టుకుంది చూసావుటే...అమ్మా. అంటూ దండకం మొదలెట్టాడు. అలా నేను అప్రాచుడి గా మా అగ్రహారం లో పేరెళ్ళి పోయాను.

ఇంతకీ అప్రాచ్యుడు అంటే..ఎంటి సార్!!?? ఆయన నవ్వేరు. కారు రావులపాలెం వంతెన మీదికొచ్చింది. గోదారిని చూడగానే అమ్మమ్మనో.. మేనత్తనో.. చూసినట్టు ఉంటుందయ్యా.. అన్నారు. విశాల ప్రశాంత గంభీరం గా ప్రవహిస్తోంది గోదారి. వందల సంవత్సరాల చరిత్ర ల్ని తనలో కలిపేసుకునీ ..ఏమీ తెలియని అమాయకత్వం నిండిన మార్మిక తత్వ వేత్త లా. ఆయన నిజం గానే ఎవరో చిన్నప్పటి చట్టాల్ని చూసినంత ఆప్యాయంగా గోదారి వేపు చూస్తూ మౌనంగా ఉండిపోయేరు. నేనూ కదిలించలేదు.

కారు బ్రిడ్జి దాటుతుండగా..అడిగేరు...నేను ఇక్కడికి ఎందుకొస్తు న్నానో తెలుసా..నీకూ??!!.లేదంటూ తలూపాను. ఆయన చెప్పిన సంగతిని విని ఆశ్చర్యపోవడం తప్ప ఏం చెయ్యాలో తోచలేదు. పిల్లలు ఇద్దరూ రెండు దేశాల్లో సెటిల్ అయిపోయారు. నేనేమో రిటైర్ అయ్యి చాలా ఏళ్ళు గడిచిపోయాయి. ఆవిడ వెళ్ళిపోయి...అవును ఆ మేన మావ గారి కూతురే..

ఇప్పటికే పాతికేళ్ళు దాటేసింది. హైదరాబాద్ లో ఉన్న (దాదాపు) కోటి రూపాయల ఆస్తి నీ ఇక్కడి కోన సీమ పల్లె లో ఒక ఆసుపత్రి అభివృద్ధి కీ..కొన్ని స్కూళ్ళ కోసమూ డొనేషన్ ఇద్దామని. దానికి మీ వాళ్ళ నడిగితే ఇదిగో నిన్ను పంపించేరు. నీకు ఇలాంటి విషయాలు

బాగా తెలుసనీ...నువ్వతే నన్ను గైడ చెయ్యగలవనీనూ.

ఆయన చెప్తున్న ప్రతీ సంగతీ కొత్తగానే ఉంది. అది గతం లో జరిగింద యినా...ప్రస్తుతం ఆయన నిర్ణయమైనా...నన్ను విచిత్రమైన అనుభూతి కి లోను చేస్తోంది. అన్నింటికంటే ముఖ్యం ...ఆయన నామకరణం దగ్గరే ఆగిపోయిన నా ఆలోచనలు. అందులో ఏమీ విశేషం ఉన్నట్టు లేదు గానీ ఇంతవరకూ ఆయన అసలు పేరు ఎవరికీ తె లీదన్న తమాషా ..నన్ను ఆట పట్టిస్తోంది. ఆయనా అంతే సరదాగా దాటేస్తున్నారు. అయితే ఇప్పుడు పేరుకి బదులు ఆయన ఆశయాలు ఇంకా ముచ్చటే స్తున్నాయి.

కథ అర్ధాంతరంగా ఆపేసి...ప్రస్తుతం లోకొచ్చేరు. ఎంత సంపాయించి ఏం లాభం మై బోయ్...దాంతో నీవు బతకడం ..నీ కుటుంబం బతకడం ..ఇంకా..ఇంకేమీ లేనప్పుడు నీ జీవితానికి అర్ధం ఏమిటి??. ఇంత ఆస్తినీ నేను ఏం చేసుకోను? పిల్లలా? రమ్మన్నా రారు(ఎన్ని యుగాలైనా ఈ డిసిప్లిన్ ఇండియా లో రాదు డాడీ..)

ఒక పేరొందిన సైంటిస్ట్ గా నా పిల్లలకి నేను నేర్పించింది ఇదా?? కార్పొరేట్ పరుగులు...ఆయాసాలు.. డబ్బులూ..ఆపైన జబ్బులూ...ఇంతేనా...అందుకే అమ్మ పుట్టిన ఊరికి నన్ను గన్న మా నేలకి నా వంతు సాయం గా ఈ చిన్న పని చేద్దామని నిశ్చయించుకున్నా. అందుకే ఈ ప్రయాణం. ఇప్పుడు నీ సాయం. నువ్వు చేయాల్సింది నాకు నిజం గా సేవ చేయగలిగే ఆసుపత్రిని నాకు చూపించడం..ఇంత కంటే కఠిన పరీక్ష..హే భగవాన్.....ఆపై నేను చెప్పిన గ్రామాల్లో కులాలకి అతీతంగా కొన్ని స్కూల్స్ సెలెక్ట్ చేద్దా ము. నేను కూడా ఇక్కడే వీలైనంత వరకూ గోదారొడ్డున ఒక చిన్న కుటీరం వేసుకుంటా. ఇక్కడే ఉంటా. ఏదో ట్రాన్స్ లో ఉన్నట్టు చెప్పుకు పోతున్నారాయన. ఇంకా ఎంత కాలమో ఈ ప్రయాణం నాకైతే తెలీదు. సంకల్పం చేసుకున్నాను. వచ్చేసాను. ఇక నువ్వు సహాయం చెయ్యడవే.నీ గురించి కనుక్కున్నా లే.

కారు అమలాపురం గెస్ట్ హౌస్ దగ్గర ఆగింది. ఆయన స్నానం చేసి రిఫ్రెష్ అవుతా అన్నారు.

నేను ఆఫీస్ కి ఫోన్ చేసాను. విషయం క్లుప్తంగా వివరించేను. నాకు తెలిసినంతలో ఆయన ఔదార్యానికి తగ్గ ప్లాన్ అప్పటికే నా మనసులో ఒకటి తయారయింది. అదే మా ఆఫీసర్ కి వివరించాను. అందుకే కదా నిన్ను పని గట్టుకుని ఆయనకి ప్రోటోకాల్ కి వేసాను. కానీయి. ఆల్ ది బెస్ట్ అన్నాడాయన.

ఆయన కాస్సేపు విశ్రాంతి తర్వాత లోపలికి పిలిచేరు. నేను అనుకున్నది చెప్పాను. మీలాంటి ఆయన ఇలా పల్లెల్లోకీ...దళిత వాడల్లోకి వచ్చి ఏ స్వార్థమూ లేకుండా ఇంత చేస్తానంటే బహుశా మా వాళ్ళు నమ్మరండి. ఆయన నవ్వేడు...నవ్వితే పారిజాతం చెట్టు ఊగినట్టు ఉంది. నిండా మానవత్వపు పరిమళం. ఓ పనిచే యి. నా పేరు చెప్పు. అప్పుడు నమ్ముతారు. మళ్ళీ ఆయనే గుర్తు చేశారు. నాకు ఉత్సుకత...మళ్ళీ.

నా పేరు చెప్పలేదు కదూ...యేసు కృష్ణ. ఆవేళ మా అమ్మ బళ్లో మాస్టారితో ఈ విషయం

చెప్పి ఎవరికీ తెలీకుండా ఇనిషియల్ మాత్రం రాయిం చింది. అప్పట్నుంచీ నా పేరు కే.వై. కృష్ణ గానీ అందరికీ తెలుసు. యేసు కృష్ణ అనీ దాదాపు  ఎవరికీ తెలీదు. మా బ్రాహ్మల మిత్రులు  మిగతా కథ నంతా పుట్టించేరు. నాకు బోలెడంత సరదా...కామెడీ సినిమా అన్నమాట. మనుషులు మనుషులు గా కృతజ్ఞత తో ఉండడానికి పేరు తో పనేముంది... మత మార్పిడి చేస్తే మాత్రం ఉపయోగం ఏముంది...కావాల్సింది మనసు. కదా..అన్నారు. ఆపై ఆయన అకౌంట్ వివరాలు చెప్పేరు. ఇన్నాళ్ళూ ఉన్న ఫ్లాటు అడ్రెస్స్ వగైరాలు. ఆయన రాబోయే రెండేళ్ళలో ఏమేమి పనులు అనుకుంటున్నారో వివరంగా చెప్పేరు.

ఇవన్నీ కొనసాగించడం అంతా సులువు కాదని నాకు తెలుసు. గానీ నువ్వు..నీలాంటి వాళ్ళూ తలుచుకుంటే చెయ్యగలరు. నిజాయితీ... అంతే..అంతకు మించిన పెట్టుబడి జీవితం లో ఇంకేం ఉండదు. డబ్బం టావా..ఇదిగో నేనిస్తా. నీ గురించి పూర్తి వివరాలు చాలా కాలంగా కనుక్కున్నా కే నిన్ను నాకూడా పంపమన్నాను. ఎంతైనా సైంటిస్ట్ నీ కదా..ఏదీ ఊరకే నమ్మను. పిల్లాడు రత్నం సార్...సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో చదూకుని ఇంత వాడయ్యాడు. సిన్సియర్. తన కొచ్చే జీతం లోంచి ప్రతీ నెలా కొంత హాస్టల్లో పిల్లలకీ ఖర్చు పెడుతూ...రాత్రిళ్ళు వాళ్ళకి టూషన్లు చెప్తూ ఉంటాడు. మీకు నచ్చుతాడు..ఇదీ నీ గురించి నాకు వచ్చిన అచ్చమైన సమాచారం. నవ్వేరాయన.

కోటి రూపాయలా...బాబోయ్ అన్నాడు చంద్ర. అంతా చెప్పేసరికి వాడికి దాదాపు మతి పోయింది. ఎంత ఆస్తి ఉంటే మాత్రం ఇలా గుర్తు పెట్టుకుని మరీ మనూరొచ్చి ఈ మంచి పనులెంటీ... ఎవరో మామూలు ఆయనలా లేడీయన...రేపే వచ్చి ఓ పాలి చూడాలనుంది.

ఆ రాత్రి నాకో అంతర్జాతీయ కాల్ వచ్చింది.

నేను...ఆస్ట్రేలియా నుంచి కృష్ణ గారి అబ్బాయిని మాట్లాడుతున్నాను. ఆయన ఇవ్వాళే అక్కడ దిగారని తెలిసింది. కొడుకూ...వారసుడు... అనేం లేదా పెద్ద మనిషికి. కోట్ల రూపాయల ఆస్తిని ఏదో దానం చేస్తానని తిరుగుతున్నాడ ట. ఇలాంటి అప్రాచ్యపు వేషాలతోనే జీవితం అంతా గడిపాడు. మీరెవరో తెలీదు. వాకబు చేస్తే చెప్పేరు. చూడండి మిస్టర్... మీరీ విషయం లో జాగర్త గా ఉండడం మంచిది. మా చెల్లాయి అమెరికా లో ఉంటుంది..అది నా కంటే సీరియస్ గా ఉందీ విషయంలో. రేపు లీగల్ విషయాల్లో మీ పేరు చేర్చడం...మీరు అనవసరం గా ఇబ్బందుల్లో పడడం ...అందుకే ముందుగా ఓ మాట చెప్తున్నా. ఆయన్ని ఎలా కన్విన్స్ చేస్తారో మీ ఇష్టం. ముదనష్టపు మనిషి...అప్రాచ్యుడు. వుయి డోంట్ లైక్ హిం.

కాల్ కట్ అయ్యింది. నాకు ఏం చేయాలో పాలుపోలేదు. నిజానికి ఇది ఊహించిందే. గానీ ఇంత గొప్ప పెద్దాయన పెంపకం లో యిలాంటిది ఉంటుందని అనుకోక పోవడం తో వచ్చింది దిగులు. ఇంకో భాషలో చెప్పాలంటే అదీ నిజమేనేమో అని కూడా అనిపించింది ఓ క్షణం. కోటి రూపాయల ఆస్తి. దానం ఇచ్చేయడవే!!??.... వెంటనే..ఎందుకో నా మీద నాకే చిరాకేసింది. పొద్దున్నే ఈ సంగతి ఎలా వివరించాలా అంటూ ఆలోచిస్తూ కలత నిద్రలో

గడిపాను.

ఆరు లేరండి. తెల్లారగట్టే ఎలిపోయారు. మీరు వస్తే థాంక్స్ చెప్పమన్నారు...అన్నాడు వాచ్ మన్. ఆ తర్వాత ఆయన ఎక్కడున్నారో ఎవరికీ తెలియలేదు. హిమాలయాలకు వెళ్ళిపోయారని అన్నారు. ఎక్కడో మారుమూల వృద్ధాశ్రమం లో ఉంటున్నారని కొందరన్నారు. చనిపోయారని కొందరు కాదని కొందరూ అనుకుంటూనే ఉన్నారు. ఏమైనా ఆయనెక్కడున్నా వాళ్ళ పిల్లలకి మాత్రం తెలియ నివ్వరని నాకు తెలుసు.ఆయనతో సరదా పడి తీసుకున్న సెల్ఫీ లు చూస్తున్న ప్పుడెల్లా....తెలిసిందా...అప్రాచ్యుడు అంటే ఏంటో... అని కవ్విస్తూ నవ్వుతుంటారాయన ఫోటో లోంచి.

***

## డా. ఎల్.కె. సుధాకర్

ఎల్.కె. సుధాకర్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం. రచయితలు, సాహితీ అభిమానులకు 'కొబ్బరాకు సుధాకర్'గా ఈయన సుపరిచితులు. ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ అనేక కథలు, కవితలు రాశారు. కొబ్బరాకు కవిత్వం, గొబ్బిపూలు కథలు పుస్తకాలను వెలువరించారు. కైలాస మానసరోవరం అనువాదం, కుంకుమ రజను పేరుతో భారతీయ కవితల అనువాదం, స్వామి నిగమానంద జీవిత చరిత్రను పుస్తకాలుగా తీసుకొచ్చారు. వివిధ పత్రికలు, సాహితీ సంస్థలు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో 17 (ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక) బహుమతులు గెలుచుకున్నారు. మూడు బంగారు పతకాలు అందుకున్నారు.

# ఫుట్ బాల్



టి. సంపత్ కుమార్

'ఏమండీ, ఈసారి అక్టోబర్లోనే రెండు పండగలొస్తున్నాయ్... మీ అమ్మని రెన్నెల్లు మీ తమ్ముని దగ్గరే ఉండేట్టుగా చూడండి. దసరా-దీపావళి పండగ రోజుల్లో నేను ఆమె మొహం చూస్తూ సేవలందించలేను.' శుక్రవారం పొద్దటిపూట తలస్నానం చేసి తలపై టర్కీటవల్ని గోవర్ధనగిరిలా చుట్టుకొని పూజకి సిద్ధమౌతూ భరించే మనిషికి హుకుం జారీచేసింది జయంతి.

సునిల్ లాప్టాప్ స్క్రీన్ వైపే సీరియస్ గా చూస్తూ వేళ్ళని టకటక లాడిస్తున్నాడు. వేళ్ళనొక్కులు తెరపై అక్షరాలరూపంలో కనబడుతున్నాయి. తన మాటలు సునిల్ చెవుల్లోకి దూరలేదని నిర్ధారించుకొంది . మెల్లిగా అడుగులేస్తూ సునిల్ వెనక నిల్చుంది.

ఉలుకులేదు. పలుకు అంతకీలేదు. టవల్నితీసి తలవెంట్రుకలని సునిల్ పై మృదువుగా జాడించాలనుకొంది. తుంపరతోనైనా లోకంలోకి వస్తాడన్న ఆశ. ఇలాటి చేష్టలు జయంతికి ఇష్టం. తెరపైన

అంకెలు, గ్రాపులు చూసి సీరియస్ పనిలో మునిగిపోయాడని వెనక్కి జరిగింది. సోఫాలోకూచోని సెల్ ఫోన్ తీసింది. ఫోన్లో సందేశం వచ్చిన మృదుసంగీతం వినగానే సునిల్ యాంత్రికంగా మెసేజ్ చూశాడు. జయంతినుండి. ఏమి తెలియనట్టుగా ఎటో చూస్తున్నట్టు నటిస్తున్న జయంతి.

'వచ్చేనెల మీ అమ్మని తీసుకురావద్దు. రెండు పండగలొస్తున్నాయ్. మీతమ్ముడి దగ్గరే ఉండేట్టుగా చూడండి. నవంబర్-డిసెంబర్ మన దగ్గర పడుండనీ. దసరా-దీపావళి పండగ రోజుల్లో ఆమె మొహం చూస్తూ నేను సేవలందించలేను.'సునిల్ కి సర్రున కోపంవచ్చింది. కనబడనీకుండా పనికొనసాగించి డాక్యుమెంట్ మూసేసాడు. నీళ్ళుతాగి జయంతికి ఎదురుగా కుర్చీలాక్కొని కూచున్నాడు సునిల్. ప్రాణమున్న పావుకదలికల్ని ఓ కంట గమనిస్తూనే ఉంది జయంతి. అపజయమెరుగని జయంతి! జయం దరిదాపుల్లోకి కూడా దూరలేని సునిల్!! వారి పెళ్ళయి మూడు దశాబ్దాలయ్యింది. ఒక్క కూతురు. రెసిడెన్షియల్ స్కూల్లో చదువుల పంజరపు చిలకై పైచదువులకోసం స్వేచ్ఛా విహంగమై కెనడాకి వెళ్లింది.

***

గోడపై సంపూర్ణకుటుంబ ఫోటో. అందులో నిత్యమూ నవ్వుతూనే ఉంటారందరూ! మధ్యలో మూలజంట. అటూయిటూ ఇద్దరు కొడుకులు. హత్తుకొని వారి భార్యలు. ప్రధానజంటకి వెనకాల కూతురు అల్లుడు. అమ్మ భుజాలపై అప్యాతతతో ఆనించిన కూతురిచేతులు. పిల్లలు అక్కడక్కడ... ఫోటో నిండుగా సౌష్టవంతో ఉంది. ఫ్యామిలీఫోటోకి రెండడుగుల దూరంలో తండ్రి క్లోజప్ ఫోటో. సైజు పెద్దది. అద్దంపైనే అంటుకొన్న బొట్టు. ఎప్పటికీ చెదరని చిరునవ్వు. ఎన్నటికీ వాడని రంగురంగుల పూలమాల.

ఆయన పెద్దబొట్టుతో చిరునవ్వుతో గోడెక్కినప్పటినుండే ఆమె నుదటిబొట్టు మాయమైంది. నవ్వుకి సంకెళ్ళు. కొప్పుకి పూలు చుట్టుకోవిక. ఆమె అశుభమయ్యింది. స్వంత ఇంట్లో. పిల్లల ఇళ్ళల్లో. ఇరుగుపొరుగు వాడల్లో... ప్రపంచానికే... అంతకుమించి కన్నవారి హృదయాల్లో... ఇంటికి కోడళ్ళుగా వచ్చిన వారి మనసుల్లో మరీనూ... ఆమెని దూరంగానే ఉంచాలి. మొహంచూస్తే అశుభం. ఇంట్లో శుభకార్యాలు జరిగితే దరిదాపుల్లో ఉండొద్దు. కొడుకులఇళ్ళల్లో అమెకోసం చాటు గదులు. దాన్నే ప్రత్యేకగది అని అందరికీ గర్వంగా చెబుతారు.

ఇంట్లోనే ఉంటుంది. మనసుల్లో స్థలంలేదామెకు. వంతులవారిగా. ఒక్కో నెల ఒకకొడుకు దగ్గర. తేదీలుతప్పని ఒప్పందం. శుభకార్యాలుంటేనో, పండగలొస్తేనో, సోషల్ పార్టీలు జరిగేదుంటే, ఇళ్లువిడచి ప్రయాణాలు చేయాల్సివస్తే, దగ్గరి బంధువులొస్తే ఒప్పందాలు మెత్తబడతాయి. సర్దుబాట్లు తప్పవు. అందరికీ 'ఆమె' అక్కరలేదు. దూరంగా ఉంచాలి!

అమెలాటి వారెందరో ఇంకా అశుభంగానే లెక్కించబడే ఒక ఆడ ప్రజాతి! ఒక్కొక్క సంతానాన్ని తొమ్మిదినెలలు ఏకదాటిగా కడుపులో పెంచిన తల్లి ఇప్పుడు కొడుకులవద్ద నిక్కచ్చిగా నెలలవారిగా.

***

ఆమె ఆయనకి ఎంతచెప్పినా వినలేదు. పెళ్లయిన కొన్నాళ్లకే తెలిసింది భర్తకి సిగరెట్టు

పెదిమలమధ్యే ఉంటుందని. మానేయమని ప్రేమతోచెప్పింది. ఏష్ ట్రే ఎప్పటిమాదిరిగానే నిండుతుంది. మరికొన్నాళ్ళకు బుజ్జగించి చెప్పింది. ఫలితం శూన్యం. రాత్రిపూట తియ్యటి మాటల్తో చెప్పింది. సరే అన్నాడు. మరునాడే మరిచాడు. ఇలా ఎన్నిసార్లో! ఆయన దగ్గినప్పుడల్లా వింత శబ్దం. 'మీరు సిగరెట్టు తగ్గించకపోతే మీతో మాట్లాడను.' '..........' 'మీరు సిగరెట్టు మానెయ్యక పోతే నేను అన్నం ముట్టుకోను.' '..........''నువ్వు సిగరెట్టుతాగడం ఆపకపోతే నేనుచస్తాను.' ఏడుస్తూ నిలదీసింది. '..........''మనిషివా, పశువ్వా? గొడ్డుకు నాలుగు దెబ్బలేస్తే వింటుంది. నీకెంత చెప్పినా బుర్రకెక్కదు.''..........''నీ చావేదో చావు...' 'చస్తాను...'

సిగరెట్టు చివరన బూడిదని కప్పుకొన్న మంట పొగనిపీల్చినప్పుడల్లా ఎర్రగా కనబడుతుంది. ఆ మంటలోని ఎరుపు కణాలు నోటిద్వారా, ఆతరువాత గొంతుద్వారా నల్లబడ్డ ఊపిరితిత్తుల్లోకి చేరాయి. అక్కడే స్థిరనివాసమేర్పరచుకొని మినుకుమినుకు మంటూ రోజుల్ని లెక్కబెడుతున్నాయి. శరీరంలోనే చితిమంటకి ప్రతిష్ఠానం! కొన్ని రోజుల్లోనే ఎరుపు కణికలు ఇంటిబయట పిడకలతో రాజుకొంటున్న కణికల్లో కలిసిపోయాయి. సిగరెట్లని కాల్చిన శరీరాన్ని కాల్చడానికి సంసిద్ధమౌతున్నాయి.

ఆమెకి ఏడుపురాలేదు. పోయినందుకు భాదేంలేదు. సిగరెట్టు పీల్చినప్పుడల్లా కనిపించే ఎర్రనిమంటే వెంబడున్న చితిమంటలా కనిపించేది. శరీరాన్ని మెల్లగా కాలుస్తున్నట్టుగా ఊహించుకొనేది. ఆ రోజు వచ్చింది. సంసారజీవితం సమాప్తం. ఒంటరి స్త్రీజీవితం ఆరంభం.

** *

ఫ్యామిలి ఫోటోలోని ప్రాణులందరూ, కీలకవ్యక్తి మినహా, హాల్లో కూచోని ఉన్నారు. ఆమె ఎటోచూస్తూ అచేతనంగా ఓచోట శిలలా. ఆరోజటి చర్చాంశం 'ఆమె'! పిల్లలు తమ సబ్జెక్ట్ కాదని టీవీ రూములోకి చేరి రక్తమాంసాల్లేని కార్టూన్ ఫిల్మ్ చూస్తున్నారు. హాల్లో రక్తమాంసాలతో పాటు భావోద్రేకాలూ నిండిన ప్రాణులు. ఆమెచుట్టూ ఎన్నో ఊరించే ఉపగ్రహాలున్నాయి. ఇల్లు. నగలు, బాంకు బాలెన్సు. ప్రతినెలా వచ్చే పెన్షన్... ఇంకా... ఇంకా... పిల్లలు బాగా నవ్వుతున్నారు. కదలని కార్టూనే ప్రింటులో నవ్వు తెప్పింస్తుంది. తెరపై కదిలే కార్టూన్లంటే ఇంటి బాధ్యతలెరుగని పిల్లలకి మరెంతోఇష్టం. పెద్దలు సీరియస్ గా ఉన్నారు. ఆమె వింటూనేఉంది. పిల్లలు తనభవిష్యత్తుని నిర్ణయిస్తున్నారు. జీవితకాలాన్ని ముక్కలుచేసి నెలలవారిగా పం(ఉం)చుకొనే యోజన రూపం పోసుకొంటుంది.

తలుపుల్లేని చెవుల్లోకి చర్చలమాటలు దూరుతుంటే తన పిల్లలపట్ల ఆమెకు పరమ అసహ్యం కలిగింది. నాలోంచేనా వీళ్ళు పుట్టారా అన్న అనుమానమూ వేసింది. తరాజుల్లేకుండానే పంపకాలయ్యాయి. ఆమెని శారీరకంగా ముక్కలు చేయలేదు. కాని ఆమె భవిష్యత్తు కాలాన్ని నెలలకి కుదించి స్థానభ్రంశ ప్రణాళిక గీచారు. నెల పెద్దోడి వద్ద. చిన్నోడి వద్ద నెల. నెలమానం ఖచ్చితంగా పాటించాలి. ఒక్కరోజు అటు–ఇటు కాకూడదు. ఎవరిదగ్గరుంటే వారికే పెన్షన్.
ఆమెకి ఇష్టమచ్చినప్పుడు కూతురుదగ్గరికి. నెలకాగానే దిగబెట్టాలి. వచ్చి తీసుకుపోవడం ఎవరికీ కుదరదు. ఆమెవిని లోలోపలే నవ్వుకొంది. తన రాతలు నుదటలేవని, పిల్లలచేతుల్లోనే

ఉన్నాయని గ్రహించింది.

పిల్లలు కడుపులో ఉన్నప్పుడు చేసిన కదలికల్ని 'వీడు తన్నుతున్నాడు' అని సంతోషాలతో, ఆ మధురక్షణాల్ని భర్తతో, అత్తగారితో, తల్లితో పంచుకొనేది. పరుగెత్తుకొంటూ వారు వచ్చి పొట్టపై చేయిపెట్టి చిట్టి కదలికల్ని అప్యాయతతో అనుభవించేవారు. లోపలున్నపుడు తీపితన్నులు. ఇప్పుడు బయటనుండి గట్టిగా తన్నుతున్నారు. గుండె

***

ఆమెకి పిల్లలు నిర్దేశించిన మాసవలసల కాలెండరయ్యింది. సూర్యచంద్రోదయాల్లో తేడా ఉండొచ్చు. ఒక్క రోజు అటుఇటూ కాదు. ప్రతినెలా చివరిరోజున ఆమె ఇల్లు మారుతుంది. రెండు ఇళ్ల మధ్యదూరం మూడువందల కిలోమీటర్లు. మార్పు కోసం అపుడపుడు చిన్నమజిలీ కూతురిదగ్గర. అల్లుడుండేది పొరుగు రాష్ట్రంలో.

ఇంటిదగ్గర్లో ఉన్న మైదానంలో పిల్లలు పుట్ బాల్ ఆడుతున్నారు. అందరి దృష్టి కదిలేబంతిపైనే. ఆటగాళ్లు బంతిచుట్టు. బంతి కాళ్ళ మధ్యలోంచి నెట్టువైపు దొర్లుతూ వెళ్లింది. ఆటగాడు పరుగెత్తి బంతిని మరోవైపున్న నెట్టువైపు లాంగ్ షాట్ కొట్టాడు. గాలిలో ఈదుతూ బంతి మరోవైపు. అక్కడున్న కిలాడి బంతినాపి అంతేవేగంతో వచ్చినవైపే తన్నాడు. బంతి అటునుండి ఇటు... ఇటునుండి అటు...

ఆమె అటునుండి ఇటు... ఇటునుండి అటూ.. ఏళ్ళుగడిచాయి. కొన్నిసవరింపులు. అవసరాలనిబట్టి ఒక కొడుకువద్ద వరసగా రెండునెల్లుంటే తరువాతి రెండునెల్లు ఇంకొకరివద్ద. పిల్లలపరీక్షలు ఉన్నాయని మీఇంట్లో పరీక్షలు రాసే పిల్లలులేరని... మేము వచ్చేనెల్లో ఇంట్లోఉండమనో, మాకు బంధువులస్తున్నారనో...శుభకార్యాలున్నాయనో...సవరింపులు కాలక్రమేణా రూపం మార్చుకొన్నాయి. వచ్చేనెల మా ఇంట్లో శుభకార్యాముందని, ఆమె ఇంట్లో ఉండకూడదనో...

వాళ్ళు అలాచేస్తే మనమేందుకు చేయకూడదని కోడళ్ళకి కొత్తకారణాలు దొరికాయి. బంతిని ఎవరు వారివారి మైదానల్లో ఉంచుకోకుండా అటునుండి ఇటు, ఇటునుండి అటు... తన్నుతూనే ఉన్నారు. తన్నుల్ని భరిస్తూ ఆమె ప్రయాణం చేస్తూనేఉంది. చిన్నకొడుకు దగ్గరినుండి పెద్దోడింటికి. పెద్దకొడుకు దగ్గరినుండి చిన్నోడింటికి.

***

సునిల్ ఓపిగ్గా జయంతివైపే చూస్తున్నాడు. చూడనట్టుగా ఆమె నటన. సహజ ప్రవర్తన – నటనల మధ్య నిమిషం గడిచింది. నిద్రపోతున్నట్టు నటించేవారిపై ఎన్నినీళ్ళు కుమ్మరించినా లేపలేం! మరింత దగ్గరిగా జరిగాడు. జయంతి తలతిప్పక తప్పలేదు. చేతుల్ని పట్టుకొన్నాడు. 'మీరు నన్ను ఓదార్చి ఒప్పించే ప్రయత్నం చేయద్దు.' చేతుల్ని వెనక్కిలాక్కొంటూ. 'నిన్ను బలవంతంగా నేనొప్పించను. నీ సహకారంలేకుండా ఏదీచెయ్యను. సరేనా?' ఒకరికళ్ళల్లోకి ఒకరుచూసుకొన్నారు. 'నాకొక మాటిస్తావా జయంతీ? ప్రేమతో సునిల్. 'మాటలగారడిలోకి దించొద్దు.' 'చెప్పానుకదా నీవొప్పుకోనిపని ఏదీచేయనని.' 'చెప్పండి.' 'రెండురోజుల

ప్రయోగం. నేనుచెప్పింది జాగ్రత్తగావిను. స్వతహాగా అనుభవించి అన్వయించుకొనే ప్రయోగం. నువ్వు నిజాయితీగా పాల్గొనాలి మరి.''తమాషాగా మాట్లాడకండి. వివరించి చెప్పండి.' 'కొన్నేళ్ళ క్రితం మనం వార్తల్లో చదివాం, గుర్తుంది కదూ? సాధారణమనుషులు జైలుజీవితాన్ని ఒక్కరోజు అనుభవించడానికి సంగారెడ్డిలో, దిల్లీలోని తిహార్ జైల్లో.. ఎవరైనా ఒక్కరోజు జైల్లోగడిపిరావచ్చు.'

విచిత్రంగాచూసింది జయంతి సునిల్ వైపు. మొహంలో భయం...'భయపడకు. నువ్వుఎక్కడికీ వెల్లద్దు. మనింట్లోనే ప్రయోగం. ఒప్పుకోన్నట్టేనా?' జయంతి సందిగ్దంలోనే ఉంది. ప్రయోగవివరాలు తెలియకుండానే ఎలాఒప్పుకోను? 'నీవొప్పుకొంటే నేనూ ఓరకంగా ఈప్రయోగంలో పాల్గొన్నట్టే...' 'అయితే ఓకే.' 'నువ్వు అమ్మలా, నేను నీలా.' 'సరేలే! ఇప్పుడైనా క్లియర్గా చెప్పండి.' చిరాగ్గా జయంతి. సునిల్ జాగ్రత్తగా వివరించాడు. గమ్మత్తుగాఉందే, రెండురోజులు ఇంట్లోనేకదా అని జయంతి నవ్వుతూ ఉత్సాహంగా ఉంది. సునిల్ ప్రశాంతంగా ఊపిరిపీల్చాడు. రెండో శనివారం, మరునాడే వచ్చే ఆదివారం రంగానికి సిద్ధమయ్యాయి.

** *

వచ్చినపుడల్లా ఆమెని 'ప్రత్యేకంగా' ఉంచే పైగదిలోకి జయంతి శనివారం పొద్దున్నే మారింది. వసతులు ఎప్పటిలాగే. అదనంగా ఏమిఉండవు. టీవీలో ఒకటే తెలుగుచానల్. న్యూస్ పేపర్ ఉండదు. ఫోనులో కాల్స్ వస్తాయి కాని బయటకు తాను చేయరాదు. తనపనులు తానుచేసుకొని గదిలోనే గడపాలి. సమయానికి తిండి వస్తుంది. మాట్లాడేందుకు ఎవరురారు. తాను కిందికి పోకూడదు.

గృహిణి పాత్రలో సునిల్ ఇల్లు, కిచెన్ చూసుకోవాలి. సమయానికి తిండి పైకివెళ్ళి ఇవ్వాలి. కావలసిన కనీసావసరాలు పైగదిలో ఉన్నాయోలేదో చూసుకోవాలి. టీ బిస్కట్లతో సునిల్ పైకి వెళ్ళాడు. జయంతి శూన్యంలోకి చూస్తుంది. టేబుల్ పై కప్పుపెట్టి జయంతివైపు చూడకనే మాట్లాడకుండా బయటకొచ్చాడు. ఆమెకి తాను అలాగే విసురుగాపెట్టి బయటపడే సంగతి గుర్తుకొచ్చింది.

జయంతి టీవీ ఆన్ చేసింది. కాస్సేపుచూసాక బోర్. ఒకటే చానెల్ పెట్టించారు. కూర్చిలోంచి లేచి కిటిల్లోంచి బయటకిచూసింది. గదిలో అటూఇటూ అడుగులేసింది. ఎనిమిదిన్నరవుతుంది. సునిల్ ఉప్మాతో వచ్చాడు. టేబుల్ పైన పెట్టి ఖాళీకప్పు తీసుకొని వెళ్ళాడు. సునిల్ని అదోవిధంగా చూసింది. కాస్సేపు ఒరిగింది. నిద్ర రాలేదు. టీవీ చూసింది. పన్నెండవుతుంది. కిందినుండి ఏవోశబ్దాలు వినబడుతున్నాయి. ఎవరో వచ్చినట్టున్నారు. 'ఒంటరిగావున్నారా?' బంధువడిగాడు. 'అవును. జయంతి రెండ్రోజులకోసం హైద్రాబాద్ వెళ్లింది.' 'మరైతే రాత్రికి మా ఇంటికిరండి బోజనానికి.' 'రెండ్రోజులేకదా. అన్నీచేసే వెల్లింది. మీకుతెలుసు నాకు వంటచేయడం ఇష్టమని.' 'వచ్చే నెల మీవంతు కదూ? అమ్మేపుడొస్తుంది? పండగలకి మీదగ్గరే ఉంటుందన్నమాట!' జయంతికి సంభాషణ మెల్లిగా వినబడుతుంది.

‘అవునండి. ఈసారి అమ్మ పండగలకి మాదగ్గరే. సంతోషంగా ఎదిరిచూస్తున్నాం.’ సునిల్ జవాబు. జయంతికి సర్రున కోపం.

బంధువు వెళ్ళిపోయినట్టున్నాడు. కింద నిశ్శబ్దం. లంచ్ కి ఇంకాటైముంది. ఆమె వచ్చేనెల్లో ఇంట్లో ఉండకూడదనుకొంటే ఈయనేమో పండగలకి తప్పక ఉంటుందంటున్నాడు. యుద్ధానికి జయంతి మాటలకత్తుల్ని పదునుపెడుతుంది. సునిల్ పళ్ళెంతోవచ్చి పెట్టివెళ్ళబోతుంటే కోపంతో ‘మీతో మాట్లాడాలి.’ అంది. పట్టించుకోకుండా పెదిమలపై నిలువుగా వెలుని పెట్టి మాట్లాడకూడదు అనే సైగచేసి వేగంగా వెళ్లిపోయాడు. రోజు ఆమెతో ఏమీ మాట్లాడకుండా పళ్ళెం పెట్టి విసురుగా వెళ్ళే విషయం జయంతికి గుర్తుకొచ్చింది.

నిమిషాలు గంటలుగా గడుస్తున్నాయి. టీవీ ప్రోగ్రామ్స్ బోర్ బోర్. ఫోన్ అందుబాటులోలేదు. కిందికి దిగొద్దు. కాస్సేపు పడుకొందామని మంచంపై ఒరిగింది.
కునుకు పట్టిందోలేదో కింద పిల్లలమాటలు. పక్కింటి పాప తన బర్త్ డే కేకుముక్కలతో వచ్చింది. వెంబడి చిన్నపిల్లల గుంపు. అరుపులు... నవ్వులు... జయంతికి ఆ గొంతులన్నీ పరిచయమే! కిందికిపోయి అందరిని సరదాగా పలకరిద్దామనుకొంది. ఒప్పందం ప్రకారం కిందికిదిగొద్దు. కళ్ళల్లో నీళ్ళు. సునిల్ పుట్టినరోజు కేకుముక్కని ఆమెకోసం తను గదికి పంపిన విషయం గుర్తుకొచ్చింది. సునిల్ పిల్లల్తో క్యారమ్ ఆడాడు. ఆ వీధిలో పిల్లలు ఆయన్ని ‘క్యారమ్ అంకుల్’ అంటారు. జయంతికూడ ఆడేది.

భారంగా గడుస్తుంది. చీకట్లు పడుతున్నాయి. మొహంపై నీళ్ళుచల్లుకుంది. కిటికీలోంచి బయటకి చూసింది. తెలిసినవారు తిరుగుతున్నారు. వీదిలైట్లు వెలిగాయి. గుడినుండి పాటలు. అటూ ఇటూ తిరిగింది. మరోకిటికీ దగ్గరికెళ్లి చూసింది. ఎన్నోఆలోచనలు! ఎన్నడూ ఇంతతీరిగ్గా ఉండని జయంతి బుర్రలోకి మరెన్నో ఆలోచనలు. సవాళ్లుచేసే ఆలోచనలు. వేడెక్కిన బుర్రతో మంచం దగ్గరికి వచ్చింది. టేబుల్ పై డిన్నర్! సునిల్ ఎప్పుడు పెట్టివెల్లాడో తెలియనేలేదు!

ఆమెతో మాటాముచ్చట లేకుండా తాను ఎన్నిసార్లు టేబుల్ పై పెట్టివెళ్లలేదు! ఠక్కున గుర్తుకొచ్చింది. పళ్ళెంపట్టుకొని కిటికీదగ్గరికెళ్ళి బయటిలోకాన్ని చూస్తూ తినేసింది. రాత్రంతా నిద్రరాలేదు. ఏవేవో విషయాలు పీడించాయి. ప్రశ్నలపరంపర. గురుతుకొచ్చి గుబులుని నింపాయి. ఆమె మొహం స్పష్టంగా కనబడింది. ఎన్నడూలేనంత ప్రకాశవంతంగా! ఎంతో అప్యాయతతో తనవైపు చూస్తోంది. తనవైపేకాదు తన భర్త, పిల్లలవైపు... ప్రేమతో... వాత్సల్యంతో...నిద్రలేక గదిలోనే తిరిగింది. కిటికీలదగ్గరికెళ్లి చూసింది. లోకం నిద్రలోఉంది. ఎవరు

***

మరునాటి ఉదయం. ఇప్పటికి వేయి ఆరు వందల నిమిషాలు గడిచాయి. సునిల్ టేబుల్ పై టీ పెడుతున్నప్పుడు మెలకువ వచ్చింది. జయంతి మాట్లాడాలని ప్రయత్నం చేసింది. కానీ ఒప్పందం గుర్తుకొచ్చి మౌనంగా ఉండిపోయింది. బ్రేక్ ఫాస్ట్ తెచ్చినపుడు ఎలాగైనా మాట్లాడుతా అనుకొంది.

బ్రేక్ ఫాస్ట్ సమయం వరకు ఆగలేకపోయింది. ఇరవైఏడు గంటల్లో మొదటిసారి జయంతి గది దాటింది. పేపర్ చదువుతున్న సునిల్ వేగంగా మెట్లు దిగుతున్న జయంతిని ఆశ్చర్యంతో అపరాధం చేస్తున్నదానిలా చూసాడు.'ఏమండీ. అత్తమ్మని నెలనెలా కాదు. ఎప్పటికీ మనవద్దే ఉంచుకొందాం. పాప గది కింద ఖాళీగానే ఉంది. దాన్ని ఆమెకోసం రెడీ చేద్దాం. వచ్చేనెల్లో రెండు పండగలొస్తున్నాయి కదా. నాలుగురోజులు ముందుగానే తీసుకొద్దాం. అత్తమ్మని తీసుకెళ్లడానికి వస్తున్నామని మీ తమ్ముడికి ఫోన్ చేయండి.'

* * *

**టి. సంపత్ కుమార్ స్వస్థలం ఖానాపూర్ (నిర్మల్ జిల్లా). ఈయన చదువు, ఉద్యోగరీత్యా 40 సంవత్సరాలు ఢిల్లీలో ఉన్నారు. రిటైర్ అయ్యాక 2016 నుండి నిర్మల్‌లో ఉంటున్నారు. 1987 నుండి ఈయన కథలు రాస్తున్నారు. ఈయన రాసిన మొదటి కథ "బాగా సదుకో" మంచి గుర్తింపునిచ్చింది. ఇప్పటి వరకు సంపత్ కుమార్ 50 కథలు, "కదలికలు" అనే ఒక నవల రచించారు. లియోసా, రించిన్, పెన్నులు, చంద్రి-78,000, తాతయ్య దంతం, అనగా అనగా ఒక దేశం మొదలైనన కథలు ప్రశంసలు పొందాయి. చంద్రి-78,000 కథ కేంద్ర సాహిత్య అకాడెమీ హిందీ సంకలనంలో చోటుచేసుకొంది. లియోసా కథని ఐదు ప్రత్యేక సంకలనాల్లో ప్రచురించారు. ఈయన రాసిన కథలకు గాను ఎన్నో బహుమతులు, పురస్కారాలను పొందారు. కొన్ని కథలు ఇంగ్లీష్, పంజాబీ, హిందీల్లోకి అనువాదం అయ్యి ప్రచురింపబడ్డాయి.**

# బోగన్విలియా

ఏమీ తోచనపుడు అద్దాల కిటికీలోంచి రోడ్డు మీద వచ్చేపోయే జనాలని చూడటం నాకు అలవాటు...దారెమ్మట పోయేవాళ్ళు ఈ అద్దాల మేడ వంక ఒక్కసారైనా తమ చూపు తిప్పి చూడకుండా వెళ్లడం నేను చూడలేదు!

అఫ్కోర్స్ ..ఎవరికైనా వారికి లేని వస్తువు మీద మనసు పారేసుకోవడం సహజం ! కానీ ఒకసారి అది హస్తగతమైతే దాని మీదున్న మోజు క్రమేణా తగ్గిపోతుందన్న విషయం ఎవరికి వారు తమ స్వానుభవంలో మాత్రమే తెలుసుకుంటారు !

నిజానికి ఇలాంటి చక్కటి ఇల్లుని నాకు తెలీకుండానే కట్టించి , దాన్ని మా మొదటి పెళ్లి రోజు కానుకగా చెప్పి నన్ను స్ప్రైజ్ చేసాడు రవి ! ఈ ఇంటి అందాలను ఏ కోణంలో చూసినా –రవి అభిరుచిని అభినందించకుండా వుండలేను. రవి గురించి ఆలోచిస్తూ కిటికీ లోంచి బయటకు చూస్తున్నాను.



**అమృత లత**
**98488 68068**

ఎదురుగా – రోడ్డు మీద ...డివైడర్ల మధ్య పూల మొక్కలు పెడుతూ కన్పించారు కూలీలు .. పూల మొక్కలంటే ప్రాణమిచ్చే నేను .. వాళ్ళు ఆ మొక్కల్ని ఎలా పెడుతున్నారా అని బాల్కనీలో కూర్చుని ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాను.

కూలీలందరూ ఆడవాళ్లే ! వాళ్ళు ..తెల్లగా , అందంగా , బలిష్టంగా వున్నారు.ఎర్రటి ఎండలో పని చేస్తున్నారు. ఇద్దరు అమ్మాయిలు చక చకా మట్టి తవ్వుతూంటే.. మరో ఇద్దరు ఎరువులాంటిదేదో వేస్తున్నారు. ఇంకో ఇద్దరు పూల మొక్కల్ని నాటుతున్నారు. రోడ్డు పక్కన వున్న చెట్లకు తమ పాత చీరలని ఉయ్యాల్లా కట్టి , వాటిలో చంటి పిల్లల్ని పడుకోబెట్టి , రెండు మూడేళ్లున్న పిల్లలతో ఆ ఉయ్యాలలను ఊగిస్తున్నారు.

ఏ వస్తువైనా ఒక చోటు నుండి మరో చోట పెట్టడానికే ఆపసోపాలు పడే నాకు – ఇంచుమించు నా వయస్సులోనే వున్నట్టుగా వున్న ఆ అమ్మాయిలు ఆడుతూ పాడుతూ ఎంతో సునాయాసంగా పనులు చేసుకోవడం చూసి ముచ్చటేస్తోంది ! వాళ్ళ చేతుల్లో ఏవో పూల మొక్కలు .. అవి ఏ పూలవో కన్పించడం లేదు. కాకపోతే .. అవి ఏ ఎర్ర గన్నేరు మొక్కలో , తెల్ల గన్నేరు మొక్కలో కాకపోతే బావుణ్ణనిపించింది !

పూలు తక్కువ , ఆకులెక్కువగా వుండే ఆ గన్నేరు పూల మొక్కలకన్నా – ఆకుల్నే కన్పించకుండా విరగబూస్తూ –చాలా రోజుల పాటు వాడిపోకుండా నిత్యనూతనంగా కనిపించే బోగన్విలియా మొక్కల్ని... ఆ డివైడర్ల మధ్య నాటితే కంటికి ఇంపుగా వుంటాయి కదా అన్పించింది. అప్పుడే ఫ్యాక్టరీ నుండి తొందరగా ఇంటికి వచ్చిన రవితో అదే విషయం చెప్తే–' ఛ ! బోగన్విలియా మొక్కలా ? అవేం బావుంటాయి ఇందూ ? పైగా వాటికి సువాసన కూడా వుండదు ! ' అంటూ నన్ను ఆట పట్టించాడు.

'ఇల్లు కట్టిన కొత్తలో వాటిని మన కాంపోండ వాల్ మీద పాకేలా పెట్టుకుందామని నేనోసారి అడిగితే – 'వాటికి ముళ్ళుంటాయ్ .. నువ్వు ఉత్తినే కూర్చోవు సరి కదా .. వాటికి నీళ్లు పోస్తానూ .. కత్తిరిస్తానూ అంటూ బయల్దేరుతావు ! అసలే సుకుమారమైన శరీరం నీది , వాటి ముళ్ళు గుచ్చుకుంటే – నేను తట్టుకోలేను ! కావాలంటే మల్లె పూల మొక్కలు పెట్టుకో..' అంటూ తప్పించుకున్నారు మీరు, గుర్తుందా ?' గుర్తు చేసాను.

రవి మాట్లాడలేదు. 'అయినా రవీ – నీకు మల్లె పూవులంటే ఎందుకంత మోజు ? అవి ఒక్క రోజులో విచ్చుకుని వాడిపోయే పూలు ! ఆ బోగన్విలియా పూలు చూడండీ ,ఎంతకీ వాడిపోవు– ఎండావానలకి తట్టుకుంటాయి ! కంటికి ఎంతో ఆహ్లాదం కలిగిస్తాయి !' అన్నాను

విననట్టు నిల్చున్నాడు రవి. ' అప్పుడు ఇంట్లో పడనివ్వలేదు సరే – కనీసం .. ఇప్పుడు ఈ వీధిలోనైనా ఆ పూలను చూసి తరించే భాగ్యం మాకు లేదేమిటి ? ' ఏడ్పించాను రవిని

' సర్లే – నేను అడ్డుపడిందీ ఇప్పుడు కాదు .. అప్పుడెప్పుడో మన పెళ్ళైన కొత్తలో కదా

! నీ కంటికి ఆ పూలు అంత ఆహ్లాదం కలిగిస్తే ఇప్పుడు నేనెందుకు అడ్డం పడతాను చెప్పు ! ' అంటూ వాతావరణం తేలిక చేద్దామని కాబోలు ..'పూవునైనా కాకపోతినీ ..నీ కంటి చూపూ సోకగా ... ' కూని రాగం తీస్తూ బాత్రూంలో దూరాడు. మరో పది నిముషాల్లో ట్రిమ్ గా తయారై –

'ఇందూ ! మా ఫ్రెండ వాళ్ళింట్లో ఈ రోజు స్టాగ్ పార్టీ వుంది .. ఏ అర్థరాత్రో వస్తాను. పాపని స్కూల్ నుండి తీసుకొచ్చి – నేనొచ్చేదాకా డ్రైవర్ ఇక్కడే వుంటాడు. ఫస్ట్ టైమ్ మిమ్మల్ని వదిలి వెళ్తున్నాను కదా ... ఎమర్జెన్సీ లో మీకు తోడుంటాడని డ్రైవర్ని ఇక్కడే వుండమన్నాను .మళ్ళీ నా కోసం అతడిని పంపించకు .. నేనే డ్రైవ్ చేసుకుంటూ వస్తాను. జాగ్రత్త డాళింగ్ ! మా ఫ్రెండ కో చక్కటి గిఫ్ట్ కొనాలి .. మావాళ్లంతా నన్ను తొందరగా రమ్మంటూ ఒకటే గొడవ చేస్తున్నారు .. వస్తా ! బై ! ' అంటూ హడావిడిగా బయటపడ్డాడు.

టైమ్ చూసాను .. పదకొండున్నర అవుతోంది ! బయట ఇంకా ఎర్రటి ఎండ ! అంతటి ఎండలో కూడా డివైడర్ దగ్గర నవ్వుతూ తుళ్ళుతూ పనిచేసుకుంటున్నారు కూలీ అమ్మాయిలు.

పెళ్ళై అయిదేళ్ళు అవుతోంది ! నన్ను ఒంటరిగా వదిలిపెట్టి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదు రవి. స్టాగ్ పార్టీలో ఆడవాళ్లకు ప్రవేశం వుండదు కాబట్టి .. మొదటిసారిగా నన్ను వదల్లేక వదల్లేక ఒక్కడే వెళ్ళిపోయాడు. అవునూ ..ఎంతటి అదృష్టం చేసుకుంటే భార్యని కంటికి రెప్పలా చూసుకునే రవిలాంటి భర్త లభిస్తాడు అమ్మాయిలకు ? రవి ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి ..

***

పెళ్ళైన కొత్తలో ..'నా చెంప తాకగానే ..చెలీ నీ చేయి కందేనేమో – ' ' కుసుమాలు తాకగనే నలిగేను కాదా నీ మేను .. ' తనకి నచ్చిన పాటల్ని పాడుతూ ఏడ్పించేవాడు రవి. 'అవునూ.. నిన్ను చూడకముందు – సౌకుమార్యం ఆడవాళ్లకు అలంకారమంటూ కవులు అభివర్ణిస్తూంటే .. అదంతా ఉత్త ట్రాష్ అనుకునేవాణ్ణి ! కానీ చిదిమితే పాలుగారే సౌకుమార్యం నీది ! ఇలాంటి సౌకుమార్యం ఎంత అదృష్టం చేసుకుంటే లభిస్తుందో చెప్పు ! పైగా అది నీ సొంతం కావడానికి నీకు ఎన్ని తరాల జీన్స్ సాయం చేసి వుంటాయో ఆలోచించు ఇందూ ..' మోహావేశం ఎక్కువైనప్పుడల్లా మురిపెంగా అంటాడు రవి. కానీ ఈ సౌకుమార్యాన్ని ఏం చేసుకోనూ ? ఇది ఒక్కరోజులో వికసించి వాడిపోయే మల్లెపూవు లాంటిది కదా ! ఊటీలో , కొడైకెనాల్లో .. ఎక్కడ ఏ పార్కు లో తిరుగుతున్నా –' ఏయ్ ఇందూ ! అలా ఎండలో తిరగకు ... ఇదిగో ఇలా నీడ పట్టున నడువు !' అంటూ నా చేయి పట్టుకుని నేను చెట్ల నీడల కిందే నడిచేలా చేసేవాడు రవి ..

ఇంట్లో బోర్ కొట్టి ,ఎప్పుడైనా – 'వాకింగ్ కి వెళదాం ' అని అడిగితే – ' సన్నగా నాజూగ్గా వున్నావ్ కదా ! ఇంకా ఈ వాకింగ్ లు ఎందుకు చెప్పు ?' అనేవాడు. అథవా నా పోరు పడలేక వాకింగ్ కి వచ్చినా– చుట్టు పక్కల అటూ ఇటూ చూసి – ' నా దేవేరికి ఛత్రం పడతాను చూడూ !' అంటూ నా కొంగో , దుప్పట్టానో గొడుగులా చేసి, రెండు చేతుల్తో దాన్నెత్తి , నా మీద కప్పి నా వెనకాలే నడుస్తూ – ' నీ అడుగులోన అడుగు వేసి నడవనీ , నే నడవనీ ' పాడేవాడు. 'ఇలా అల్లరి చేస్తే – ఛస్తే మీతో వాకింగ్ రాను– పోండి !' అని మొండికేస్తే –'సర్లే ! నేను రాను , నువ్వెళ్లు ! కానీ ఎండ రాకముందే ఇంటికి వచ్చేయాలి ! ఎండలో నడిస్తే కందిపోతావ్ ..జాగ్రత్త ! పొద్దున్నే చలిగా వుంటుంది. చెవుల చుట్టూ స్కార్ఫ్ కట్టుకో ! చీరతో నడవకు..కుచ్చెళ్ళు తట్టుకుని పడిపోతావు ! చుడీదార్ వేసుకో, జీన్స్ అయితే ఇంకా కంఫర్టబుల్ గా వుంటుంది ' అంటూ సవాలక్ష జాగ్రత్తలు చెప్పేవాడు.

ఎప్పుడైనా జన్మకో శివరాత్రి పొద్దున్నే– 'ఒక్కదానికి నాకు బోరుకొడ్తోంది –మీరూ రండి ప్లీజ్ !' అంటూ రవిని వాకింగ్ కి బయల్దేర దీస్తే – ఇంటి బయట కాలెడుతూనే ..నా కొంగుచ్చుకు లాగుతూ .. నీకో సంగతి చెప్పనా ? నువ్వు నడుస్తూంటే – నీ నడుం వెనకాల కదిలీ కదలనట్టు కదిలే ఆ సన్నటి నడుం మడతలు .. నీకెంత అందంగా – నాకెంత టెంప్టింగా వుంటాయో తెలుసా ?' అంటూ ఆ మడతల్ని గిల్లి – నన్ను వివశురాల్ని చేసి – ఆ రోజటి మా వాకింగ్ కి ఎసరు పెట్టించేవాడు.

నేను మున్ముందు ఏ జబ్బు బారినపడో ఈ సౌకుమార్యాన్ని పోగొట్టుకుంటే ... చూసి తట్టుకోగలడా ? అప్పుడూ ఇంత అపురూపంగా నన్ను చూసుకోగలడా ? ఎందుకో రవి లోని ఆ 'సౌందర్య స్పృహ' నన్నెప్పుడూ ఏదో తెలీని అభద్రతాభావానికి లోను చేసేది. అదే మాట పైకి చెప్తే –

' యూ సిల్లీ గాళ్ ! గులాబీ పువ్వు సుకుమారమైంది. దానిది మనకన్నా షార్ట్ లైఫ్ ! అలా అని .. దాని రెక్కలు రాలిపోతూంటే చూస్తూ కూర్చోలేం కదా ! మరి కొన్ని గంటలపాటైనా అది తాజాగా వుండాలనుకుంటాం. నీళ్లు చిలకరించో .. తడి గుడ్డలో చుట్టో ..అది వాడిపోకుండా వుండేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తాం కదా ! ' అనేవాడు..అయితే .... నేను భయపడ్డట్టే – మా పెళ్ళై ఓ పాప పుట్టాక –ఎప్పుడో ఏ యాభై ఏళ్ళ వయసు తర్వాతో వచ్చే ఆస్టియోపోరాసిస్ ముప్పై ఏళ్ళ వయసులోనే నా ఎముకల్ని గుల్లబారేలా చేయడం, తుమ్మినా దగ్గినా చిన్న చిన్న ఫ్రాక్చర్స్ కావడం, కాలి వేళ్ళ కణుపుల మీద , చేతి వేళ్ళ కణుపుల మీద ఉబ్బెత్తుగా బొడిపెల్లా స్పర్స్ పెరిగి కీళ్లు నొప్పెట్టడం – తద్వారా నేను ఏ చిన్న వస్తువునీ లేపలేకపోవడం చూసి – షాక్ అయ్యాడు రవి.

'విటమిన్ – డీ మాత్రలు బాగా వేసుకోవాలి , ఎండలో తిప్పాలి ' అని డాక్టర్లు

చెప్పినపుడు .. తను నన్ను 'అసూర్యం పశ్య'లా అపురూపంగా చూసుకున్నందుకే నాకిలా జరిగిందేమోనన్న గిల్టీనెస్ మొదలయి… నా పట్ల అంతకు ముందున్న శ్రద్ధ రెట్టింపైంది రవికి ! అయితే .. ఇంతకు ముందులా ప్రతి దానికీ సున్నితంగా చూసుకోవడం మానేసి – ఎండలోనే వాకింగ్ చేయించడం, ఇవ్వాల్సిన మోతాదులో డీ విటమిన్ లాంటి టాబ్లెట్స్ ఇవ్వడం మొదలెట్టాడు రవి.

***

రాకింగ్ చైర్లో కళ్ళు మూసుకుని రవి తలపుల్లో మునిగితేలుతోన్న నేను –' అమ్మా ! ఒక్కమాట ..' ఆయా పిలుపుకి ఉలిక్కి పడి కళ్ళు తెరిచాను.' అమ్మా ! మన ఇంటి ముందున్న రోడ్డు మీద డివైడర్స్ లో మొక్కలు పెడుతున్నవాళ్లకి దాహంగా వుందట ! వాళ్ళు గేట్ ముందు నించుని మంచి నీళ్లు అడుగుతున్నారు… ఇవ్వమంటారా ? ' అడిగింది ఆయా. వాల్ క్లాక్ వంక చూసాను. మధ్యాహ్నం మూడవుతోంది. ' సర్లే ..వాళ్ళని లోపలికి రమ్మని పిలువు ! పొద్దుటినుండీ ఎండలో పనిచేస్తున్నారు కదా ! దాహంగా వుందేమో పాపం .. ఇంట్లో సకినాలూ , లడ్డూలూ వున్నాయి కదా ! వాళ్ళకీ , వాళ్ళ పిల్లలకీ తలా కొన్ని ఇవ్వు , టీ కూడా చేసివ్వు ' చెప్పాను.

' సరేనమ్మా ! ' అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది ఆయా. పాప స్కూల్ నుండి వచ్చే టైమ్ అయింది. ఈపాటికే డ్రైవర్ తీసుకు రావాలి ! ఏ ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కున్నారో … ఇంకా ఇంటికి రాలేదు! ఫోన్ చేస్తూంటే రిసీవ్ చేసుకోవడం లేదు.. డ్రైవింగ్ లో ఫోన్ మాట్లాడకూడదని మాట్లాడడం లేదేమో అని సరి పెట్టుకుందామనుకుంటే – కనీసం నా కాల్ చూసైనా .. ఎక్కడో ఓ చోట అతడు కారు అపి మాట్లాడవచ్చు కదా అన్పించింది !

నాలో అంతకంతకీ టెన్షన్ పెరిగిపోతోంది ..ప్రతి రోజూ అయిదు గంటలకల్లా ఇంటికి వచ్చే పాప .. ఈ రోజు ఆరైనా .. జాడే లేదు ! డ్రైవర్ కి ఎన్ని సార్లు ఫోన్ చేసినా..రిప్లై లేదు .. కాస్సేపటికి ఆ ఫోన్ కాస్తా స్విచాఫ్ వచ్చింది. మనసు ఎందుకో కీడు శంకిస్తోంది. రవికి ఫోన్ చేసాను, అదీ స్విచాఫ్ వస్తోంది…స్టాగ్ పార్టీ లో వాళ్ళ ఫ్రెండ్సందరూ స్విచాఫ్ చేసుకోవడం మామూలే ! ఇప్పుడెలా ? స్కూల్ కి ఫోన్ చేసాను .. 'పిల్లల్ని ఎప్పట్లా ..మూడున్నరకే వదిలారు, మీ డ్రైవర్ వచ్చి తీసుకెళ్లాడు' చెప్పాడు వాచ్ మాన్. ఇక లాభం లేదని .. పాపకి బ్యాండ ట్రాకింగ్ , బ్యాగ్ ట్రాకింగ్ గుర్తొచ్చి వాటినీ వెరిఫై చేసాను. బ్యాండ ఒక చోట , బ్యాగ్ ఒక చోట స్విచాఫ్ అయ్యాయి .. కారు జీపీఎస్ తో అనుసంధానమై వుంటుందని గుర్తొచ్చి , ఆ దిశగా చెక్ చేసాను. కారు మేడ్చల్ పరిసర ప్రాంతంలో ఔటర్ రింగ్ దగ్గర ఎక్కడో ఆగిపోయినట్టుగా … తెలిసిపోయింది !

వెంటనే పోలీస్ వాళ్లకి ఫోన్ చేసాను…ఎంగేజ్ వస్తోంది ! ఇంట్లో ఇంకో కారు వుంది

! నాకు డ్రైవింగ్ వచ్చినా – చేతుల్లో చేవ లేక, కాళ్ళల్లో శక్తి లేక కారు బయటికి తీయలేని నా అశక్తత గుర్తొచ్చి, నాకు తెలిసిన ఫ్రెండ్సందరికీ ఫోన్ చేస్తూ ..కాలు గాలిన పిల్లిలా అటూ ఇటూ తిరగడం మొదలెట్టాను. ఫ్రెండ్స్ కూడా ఒక్కరొక్కరే రావడం మొదలైంది. ఇంతలో ఆయా లోపలికి వచ్చి –

' అమ్మా ! మీరు చెప్పినట్టు .. ఆ పూల మొక్కలు పెట్టినవాళ్లకి సకినాలూ , లడ్డూలూ ..టీ ఇచ్చాను.. వాళ్ళు మీతో మాట్లాడి వెళ్ళిపోతామంటున్నారు ' ' ఇప్పుడా ?' నా మనసంతా ఆందోళనగా వుంది ! ఎవరితోనూ మాట్లాడే స్థితిలో లేను .. అదే విషయం చెప్పాను... ఆయా బయటికి వెళ్లి – మరుక్షణం గోడక్కొట్టిన బంతిలా తిరిగి వచ్చింది ! ఆయాతో పాటు పొద్దుట్నుండీ మొక్కలు పెట్టిన ఆరుగురు అమ్మాయిలూ లోపలికి తోసుకొచ్చారు. వాళ్లంతా ...వేళ కాని వేళ .. ఎనిమిది గంటల రాత్రి .. అందులోనూ .. ఆందోళనగా వున్న సమయంలో లోపలికి చొచ్చుకు వచ్చినందుకూ , ఆయా వాళ్లకి అడ్డుపడనందుకూ ఆమె వంక ఒకింత చిరాగ్గా , అసహనంగా , కోపంగా చూసాను. నా చూపులు చూసి .. భయపడిపోయిందో .. మరే కారణమో ...ఓ మూలన బిత్తర చూపులు చూస్తూ నించుంది ఆయా. నా అసహనం గమనించిందేమో –

' మేడమ్ ! అయాం సంగీత ! వుయ్ నో యూ ఆర్ వర్రీడ అబౌట్ యువర్ డాటర్స్ సేఫ్టీ నౌ ! ' చొరవగా తనని తాను పరిచయం చేసుకుంది ఆ వచ్చిన వాళ్ళలోంచి ఓ అమ్మాయి. ఒక కూలీ అమ్మాయి ఇంగ్లీష్ మాట్లాడ్డం చూసి ఒకింత ఆశ్చర్యం, ఆమె నోటెమ్మట నా కూతురి ప్రస్తావన రావడం కొండంత ఆనందం, మరు క్షణం అంతకు మించిన ఆందోళనా నాలో ముప్పిరిగొన్నాయి.

' మేడమ్ ! నా పేరు రజని. ఈ సంగీతా నేనూ చైతన్యా ఇంజనీరింగ్ కాలేజీలో క్లాస్మేట్స్ !' అంది మిగితా ఐదుగురిలో మరో అమ్మాయి. 'ఏంటీ , మీరు స్టూడెంట్సా? పొద్దుటినుండీ మా ఇంటి ముందున్న డివైడర్స్ లో మొక్కలు పెడుతోన్న కూలీలు కదా ...మీరు ?' నాలోని అనుమానం ..ప్రశ్నల రూపంలో బయటికి తన్నుకు వచ్చింది !

'వీళ్ళు నిజంగానే కాలేజీ అమ్మాయిలు అమ్మా ! వారానికో రోజు హరిత హారంలో భాగంగా –మాలాంటి వాళ్ళతో కలిసి , ఎలాంటి ఫోటో ప్రదర్శనల్లేకుండా సింపుల్ గా మొక్కలు పెట్టడం వీళ్లకి సరదా ! ఈవారం వాళ్ళు మీ కాలనీని సెలెక్ట్ చేసుకున్నారు ! ఈ రోజు మొక్కలు పెట్టిన మా ఆరుగురిలో వీళ్ళిద్దరే కాలేజీ అమ్మాయిలు , మిగితా నలుగురం కూలీలం ! ' చెప్పింది కూలీల్లోని ఇంకో అమ్మాయి.

నా ప్రాణానికి ప్రాణం నా పాప గురించి నేను వర్రీ అవుతూంటే ... మధ్య ఈ కాలేజీ పిల్లలేమిటో , వీళ్ళ కథేమిటో.. అయోమయంగా వుంది.. ఇంతకీ ఇక్కడ ఏం జరుగుతోంది ? అసలు వీళ్ళు ఏం చెప్పాలని లోపలికి వచ్చారు .. నాకంతా అగమ్య గోచరంగా , అంతకు మించి అసహనంగా వుంది. 'మేడమ్ ! మీ పాప ఇంకా రాలేదని

కదా మీరు బాధ పడుతున్నారు ! ఆ విషయం చెపుదామనే వచ్చాం !' అంది సంగీత . ఇంతలో – 'ఇదిగో మీ పాప ! ఈ రాత్రి మీ పాప మీ ఇంటికి క్షేమంగా చేరేలా ఈ కాలేజీ అమ్మాయిలు పూనుకోకపోతే .. మీ పాప మీకు ప్రాణాలతో దక్కేది కాదు !' అంటూ బిలబిలమంటూ లోపలికి అడుగెట్టారు పోలీసులు..

' మమ్మీ !' అంటూ ఒక్కుదుటున పరిగెత్తుకొచ్చి వెక్కి వెక్కి ఏడుస్తూ నన్ను వాటేసుకుంది పాప. పాపని గట్టిగా గుండెలకు హత్తుకుని, ఎడాపెడా ముద్దుల వర్షం కురిపించాను.. నా కళ్ళనుండి ధారాపాతంగా కన్నీళ్లు కురుస్తూనే వున్నాయి .. ప్రపంచం ఏమై పోనీ .... నేనేమీ వినదలచుకోలేదు.. నా పాప నాకు దక్కింది , అది చాలు !

'జల్సాల కోసం దొంగతనాలు చేస్తూ ...మూడేళ్ళ కింద కాలేజీ నుండి డిబార్ అయ్యాడు మీ డ్రైవర్. అతడి బాక్గ్రౌండ తెలీని మీ ఆయన ...అతడ్ని పనిలో పెట్టుకున్నారు.. అతడి నక్క వినయాలు తెలీక అతడ్ని పూర్తిగా నమ్మారు మీరు . పెళ్ళిళ్ళకీ , ఫంక్షన్స్ కీ ఎక్కడికి వెళ్లినా – మీ పర్స్ ని మొయ్యలేక ..దాన్ని కార్లోనే వదిలి వెళ్లేవారు మీరు .. పైగా ఆ పర్సుని కొన్ని సార్లు అతడి చేతికే ఇచ్చేవారు. అందులోంచి డబ్బు కొట్టేస్తూ – తన సరదాలు తీర్చుకునేవాడు అతడు ...' అంటూ ఒక నిముషం ఆగాడు సబ్ ఇన్స్పెక్టర్.

మరు నిముషం నా వంక చూస్తూ– 'మరో విషయం అమ్మా ! మీరెప్పుడూ మీ పర్స్ లో ఎంత డబ్బు వుందో కూడా చూసుకునే వారు కాదు కాబట్టి .. చాలా రోజులుగా అతడికి ఆడింది ఆటగా , పాడింది పాటగా గడిచిపోయింది...ఈ మధ్య మీ అనారోగ్యం మూలంగా మీరు ఎటూ వెళ్లలేకపోవడంతో .. మీ పర్స్ లోంచి డబ్బు కొట్టే అవకాశం దొరక్క .. తన అవసరాలు తీరే దారీ లేక .. మీ అమ్మాయిని కిడ్నాప్ చేసి , డబ్బులు డిమాండ చేయాలన్న ఆలోచనతో ఛాన్స్ కోసం ఎదురు చూసాడు – ఆ అవకాశం మీ వారి ' స్టాగ్ పార్టీ ' రూపంలో తనకు దొరికిందనీ మా ఇంటరాగేషన్ లో అంగీకరించాడు మీ డ్రైవర్! ' విడమరిచి చెప్పాడు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ .

' అవును మేడం ! ఈ రోజు తను ఇంట్లో వుండననీ , ఎప్పుడో అర్థరాత్రి దాకా రాననీ , అందాకా మీకు కాపలాగా తననే వుండమని మీ భర్త అతడికి చెప్పడంతో .. తను ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తోన్న ఛాన్స్ దొరికిందని ఉబ్బితబ్బిబ్బయ్యాడు మీ డ్రైవర్ .. ఆ సంతోషంలో తన స్నేహితుడితో కలిసి – తనతో సహా మీ పాపని మరెవరో కిడ్నాప్ చేసినట్టుగా ఏమేం చేయాలో , ట్రాకింగ్ ద్వారా ఆ పాప ఆచూకీ తెలిసే అంశాలు ఏమేమి వున్నాయో , వాటిని ఎక్కడెక్కడ ఎలా ధ్వంసం చేయాలో , చివరకు కారుని ఎక్కడ వదిలిపెట్టాలో , ఒకవేళ తమ ప్లాన్ బెడిసికొడితే .. తమ గుట్టు రట్టయితే ... ఆ పాపని ఎలా చంపేయాలో ...అన్నీ డీటైల్డ్ గా ... తన స్నేహితుడితో ... రోడ్డు పక్కన చెట్ల కిందున్న ఫుట్ పాత్ మీద నించుని డిస్కస్ చేసాడు మీ డ్రైవర్.. ' చెప్పింది రజని.

' అంతకన్నా ఓ అయిదు నిముషాల ముందు ... మా చెట్లు నాటే కార్యక్రమాన్ని రికార్డ్ చేయడానికోసం .. అతడు నించున్న ఫుట్ పాత్ పక్కనున్న చెట్టు కొమ్మ మీద మా సెల్ఫోన్ ని ఆటో మోడ్ లో పెట్టుకున్నాం ! లంచ్ టైమ్ లో వెళ్లి మా మొబైల్ చూస్తే ... అందులో మా చెట్లు నాటే కార్యక్రమంతో పాటు మీ డ్రైవర్ సంభాషణ కూడా రికార్డ్ అవడం కన్పించి విస్తుపోయాం . దాన్ని వెంటనే మేము పోలీసులకు ఫార్వర్డ్ చేయడంతో .. వాళ్ళు మీ పాప ఆచూకీని సకాలంలో తెలుసుకోగలిగారు !'చెప్పింది సంగీత.

' అదొక్కటే కాదు – కాలేజీ అమ్మాయిలు చెప్పిన విషయాన్ని వెంటనే తమ భర్తలకు చేరవేసి ... వాళ్ళ భర్తలు కూడా ఓ క్యాబ్ బుక్ చేసుకుని మీ డ్రైవర్ని ఫాలో అయ్యేలా ఈ నలుగురు కూలీ అమ్మాయిలు కూడా పూనుకోకపోతే ఈ కేసుని మేము ఇంత తొందరగా – అదీ కేవలం మూడున్నర గంటల వ్యవధిలో చేధించగలిగే వాళ్ళం కాదు ! క్రెడిట్ గోస్ టు దెమ్ ఆల్సో !' కూలీ అమ్మాయిల వంక ప్రశంసాపూర్వకంగా చూస్తూ చెప్పాడు సబ్ ఇన్స్పెక్టర్

' అతడు చాలా తెలివైన నేరస్తుడు సర్ .. అయితే ఎంత తెలివైన నేరస్తుడైనా ... ఒక చిన్న తెలివి తక్కువ పని ద్వారా పట్టుబడిపోతాడని తరచూ మీ పోలీసులు చెప్పే మాట నిజమైంది ! ' అంది రజని.

' మీ వారు పెద్ద బిజినెస్ టైకూన్. ఆయనకి ఎంతకీ మిమ్మల్ని అపురూపంగా చూసుకోవాలన్న తపనే తప్ప – మీ చుట్టూ ఎన్ని విష నాగులు తిరుగుతున్నాయో పట్టించుకోలేని బిజీ మనిషి ! ఇదిగో మీ ఆయా కూడా మరో విషప్పురుగు ..ఆమెతో కలిసి మరెన్నో పన్నాగాలు పన్నాడు మీ డ్రైవర్. మీ అదృష్టవశాత్తూ అతడి మొదటి పన్నాగం ఇలా బెడిసికొట్టింది ! డ్రైవర్లనీ , పని మనుషుల్నీ కొత్తగా పనిలోకి తీసుకునే ముందు ఆధార్ కార్డు అడగడం , వాళ్ళ నడత గురించి ఊరి పెద్దల్ని అడిగి తెలుసుకోవడం చాలా అవసరం ' చెప్తున్నాడు సబ్ ఇన్స్పెక్టర్ ఆయాని అదుపులోకి తీసుకుంటూ.

నా తల తిరిగి పోతోంది ...కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి ! ఆ తర్వాత నాకు ఎప్పుడు స్పృహ వచ్చిందో తెలీదు గానీ .. కళ్ళు తెరిచేసరికి .. నేనేదో హాస్పిటల్లో వున్నట్టుగా అర్థమైంది . నా మంచం చుట్టూ చేరి నా వంకే ఆదుర్దాగా చూస్తోన్న రవీ , పాప ,నలుగురు కూలీ అమ్మాయిలు , ఇద్దరు కాలేజీ అమ్మాయిలు కన్పించారు. ముందుగా ఆ నలుగురు కూలీ అమ్మాయిలను దగ్గరకు రమ్మంటూ సైగ చేసి – ' అమ్మాయిలంటే మీలా ధైర్యంగా , చురుగ్గా , అలర్ట్ గా వుండాలి ! అప్పుడు – మీరే కాదు , దేశంలోని ఆడపిల్లలందరూ క్షేమంగా , నిర్భయంగా వుంటారు ! ఇప్పుడు కావాల్సింది ... నాలా చేవలేని మనుషులు కాదమ్మా... నవ్వుతూ తుళ్ళుతూ తమ చెమట చుక్కల్ని ధారపోస్తూ ... ఎంత పని చేస్తున్నా .. ఎంతకీ వాడిపోని 'బోగన్విలియా ' మొక్కల్లాంటి మీ శ్రమజీవులు ! మీ

రుణం ఎప్పటికీ తీర్చుకోలేను !' అంటూ రెండు చేతులూ జోడించాను.

రవి కళ్ళు తడిసాయి! ' మీరన్నది అక్షరాలా నిజం మేడమ్ ! తమ కొమ్మల్నీ , రెమ్మల్నీ చిదిమివేయాలని చూసే వ్యక్తులని ... వాళ్ళ ఒళ్ళంతా రాష్ వచ్చేలా చేసి, కసి తీర్చుకుంటాయి ఆ బోగన్విలియా మొక్కలు ! ' అంది రజని. ' మీరేం తక్కువ తల్లీ ? కాళ్లతో అదిమి తొక్కినా– చివ్వున పైకి లేచి , నిటారుగా నించునే మెత్తని లాన్ లాంటి వాళ్ళు మీ కాలేజీ అమ్మాయిలు ! మీలాంటి వాళ్ళుంటే ... ఎవరూ కిడ్నాపులకీ , యాసిడ్ దాడులకీ , రేప్ లకీ , కత్తిపోట్లకీ గురికారు! అసలు మీలాంటి వాళ్లకి ఇవ్వాలి .. దేశంలోని అత్యున్నత పురస్కారాలు ! ' అంటూ ఆ కాలేజీ అమ్మాయిల చేతుల్ని నా చేతుల్లోకి తీసుకుని ముద్దెట్టుకున్నాను ! పాప కళ్ళు మెరిసాయి !

## జి. అమృతలత

జి. అమృతలత స్వస్థలం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్. ఎంఏ, ఎంఈడీ, పీహెచ్‌డీ చేశారు. హైదరాబాద్‌లోని 'మౌరి టెక్' సాఫ్ట్‌వేర్ సంస్థకు బిజినెస్ డెవలప్‌మెంట్ అడ్వయిజర్‌గా పనిచేస్తున్నారు. స్వాతి వార పత్రిక 1971లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల కోసం నిర్వహించిన కథల పోటీలో వీరు రాసిన 'మనసు ఎదగని మనుషులు' కథానిక.. ఉత్తమకథగా ఎంపికైంది. అదే ఏడాది ఎమెస్కో సాహితీ సంస్థ నిర్వహించిన కథల పోటీలో.. 'కన్నీళ్లతో కాలక్షేపం' కథకు ప్రథమ బహుమతి లభించింది. 'సృజన' మాసపత్రిక 1970లో నిర్వహించిన కవితల పోటీలో.. 'కూలి' కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది. నిజామాబాద్ నుంచి వెలువడిన 'అమృతకిరణ్' పక్షపత్రికకు రెండేళ్లపాటు ఎడిటర్‌గా పనిచేశారు. తెలంగాణ ఉద్యమకాలంలో 'గాయాలే.. గేయాలై' కవితా సంకలనం, 'వెతలే.. కథలై' కథా సంకలనం వెలువరించారు. అమృత వర్షిణి, సృష్టిలో తీయనిది, స్పందన, చుక్కలలోకం చుట్టొద్దాం!, గోడలకే ప్రాణముంటే, ఓటెందుకు? సంపుటాలు ప్రచురితమయ్యాయి. వివిధ సంస్థలు, సొసైటీల నుంచి పలు అవార్డులు, సన్మానాలు అందుకున్నారు.

# స్వాతంత్ర్యం



**చింతకింది శివశంకర్**

ఆగస్టు 15, 1947. నిన్న అర్ధరాత్రి అఖండ భారత దేశాన్ని రెండు సర్వసత్తాక దేశాలుగా విభజించి స్వాతంత్రాన్ని ప్రకటించింది బ్రిటిష్ ప్రభుత్వం. భారతదేశంలోని నాయకులు, ప్రజలు జెండాను ఎగరేసి సంబరాలు చేసుకుంటున్నారు. అంటూ సాగుతున్న వార్తలకు మధ్యలో అంతరాయం కలిగిస్తూ..

ఏంటి భారతదేశానికి అప్పుడే స్వాతంత్ర్యం వచ్చిందా..! వచ్చే సంవత్సరం ఇస్తానన్నారుగా, ముందే ఇచ్చేశారేంటి అంటూ అనుమానంగా అడిగాడు మైపాల్ రెడ్డి. తండ్రి మాటలు విని రేడియో సౌండ తగ్గించింది మైపాల్ రెడ్డి కూతురు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత విన్స్టన్ చర్చిల్ ఓడిపోయాడు నాన్న, ఇప్పుడు బ్రిటన్లో కొత్త ప్రభుత్వం లేబర్ పార్టీ అని ఏర్పడింది. అందుకే

పోయిన యేడాదే మనకు ఎన్నికలు పెట్టింది ఈ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారతీయుల ఒత్తిడి బాగా ఎక్కువైంది. అందుకే ఇచ్చే స్వాతంత్రమేదో ముందు ఇచ్చేసి వెళ్ళిపోతున్నారు అంటూ జరిగిన, జరుగుతున్న రాజకీయాల్నివివరించింది. మైపాల్ రెడ్డికి భారతదేశంలోని రాజకీయాలే అంతంత మాత్రమే తెలుసు, బయటి దేశాలవంటే అసలే తెల్వవు. వెళ్తే వెళ్లారుగాని, దేశాన్ని రెండు ముక్కలు చేసి వెళ్ళాలా..!? తప్పదు నాన్న.. స్వాతంత్రం కావాలంటే రెండుగా విడదీయాలి అయినా రెండు మతాలుగా కలిసుండటం కంటే రెండు దేశాలుగా విడిపోవడం మంచిది అని ఎవరు చెప్పారు. అంబేద్కర్ లాంటి కొంతమంది మేధావులు మద్దతిచ్చారు.

ఈయనొకడు పానకంలో పుడకలాగా అందరూ ఒకటంటే ఈన ఇంకోటంటాడు. అందుకే ఈ గతిలేనోళ్లను చదువుకోవద్దని దూరం పెట్టింది చదువుకుంటే ఇగో ఇలా అన్నింట్లో వేలుపెడతారు అంటూ అక్కడే ఇల్లు తూడుస్తున్నదేవమ్మ వైపు చూశాడు. ఇంతలో కూతురు ఏదో చెప్పబోయింది..అంతలోనే, ఏందే అట్లా సుస్తుండవు. ఇల్లు సక్కగా తూడువు అన్నాడు.

ఇల్లు తూడుస్తూ భయంభయంగా బయటకు వచ్చింది. బకీటల నీళ్లు పారబోసి ఇంటికి బయల్దేరింది. నిజానికి దేవమ్మ ఇల్లు తూడుస్తూనే, ఆ తండ్రి కూతుర్లు మాట్లాడుకునే మాటలన్నివిన్నది. పటేల్ సెప్తే ఊరంతా ఇంటది అట్టాంటి పటేలు కూతురు మాట ఇంటాండు.ఎంతైనా చదువుకున్న పిల్ల అని ఆలోచిస్తూ ఇంటికి చేరుకుంది. ఇంట్లో నుండి ఉమ్మేస్తే వాకిట్లో పడ్డట్టు, వాకిట్లో నుండి ఉమ్మేస్తే వీధి అవతల పడ్డట్టు, ఊరు నుండి ఉమ్మేస్తే ఊరి అవతల పడ్డట్టు ఉంది ఆ గుడిసె.

ఆ గుడిసెలో ఆరేండ్ల పిలగాడు, వాడు భూమ్మీద పడగానే మొగుడు పోయిండు అప్పటి నుండి నానా కష్టంచేసి పెంచుతుంది కొడుకుని. పొద్దుగాల లేసి ఇంత అంబలి కాసి, పటేల్ ఇంటికి పోతది ఆ ఇంట్లో ఉన్న పనంతా చేసి మల్ల ఇంటికొచ్చి తిని కూలిపనికి పోయి,పోద్దుగుకినాక వస్తది. బుక్కెడు వండుకొనితిని పిల్లగానికి కథలు సెప్పుకుంట పండుకుంటది.

ఇంటికొచ్చిన దేవమ్మని సుసిండు కొడుకు. అమ్మ ఇయ్యాల అంబలి కొంచెమే కాసినవ్.ఏం లేదు బిడ్డ శాననే కాసిన కానీ పొద్దుగాల ఒకాయనొస్తే కొంచెం పోసిన. ఎవరమ్మా ఆయినా. ఏమో ఎవరు పొద్దుపొద్దుగాల శాతకాక మన ఇంటి ముందు కూసుంటే ఇంత పోసిన. అమ్మా మనకు తక్కువ అయితది కదనే. ఏం కాదు, నువ్వు మధ్యానం అంబలి తాగు నేను వొట్టిరొట్టె తీసుకుపోతా. అమ్మ రాతిరికేం తొక్కే. చింత చిగురు చేస్తాలే. అమ్మ నాకు కోడిగుడ్డు... కోడిగుడ్డు.. అంటూ ఎగిరాడు. సరే ఇయ్యాల కోడివెట్టె గుడ్డు నీకే.., నీవుమాత్రం యాడికిపోకుండా ఈనే ఆడుకో నేను అప్పటికొస్తా. అమ్మ అమ్మ శెల్కలకు నేను వస్తానే.

వొద్దుబిడ్డా అది శానదూరం నువ్వు నా ఎంబడి వస్తే, కోన్నిపట్టుకొని గంపకింద ఎవరు పెడ్తారు. మాపటికి గుడ్డు కావాల్నా.. వద్దా..!? కావాలి... కావాలి...ఐతే ఈనే ఉండు..,

సరేనా... అంటూ దేవమ్మ సద్ది కట్టుకొనిపోయింది.

పటేలు శెల్కల పత్తి ఏరనికేపోయింది. దేవమ్మతో పాటు శానమంది వొస్తరు. వాళ్లకి పది సాల్లా అవ్తల పత్తి ఏరుతుంది. తెచ్చుకున్న సద్దికూడా ఒక్కదానిదే దూరంగా ఉంటది. ఏం అవసరం వచ్చినా... ఏ ఆపద వచ్చినా.. ఆ దిక్కుకు పోవ్వొద్దు. పని శెసేటప్పుడు పాటలు పాడుకుంటూ పనిచేస్తరు. దేవమ్మకు వాళ్లు పాడే పాటలన్ని వచ్చు అయినా పాడకూడదు.

ఎండ నెత్తిమీదికొచ్చింది అందరూ తిననీకే కుసున్నరు. దేవమ్మ కూడవెల్లి తెచ్చుకున్న సద్దిప్పి వొట్టిరొట్టెను ఇరిసి నీల్లల్ల నానవెట్టింది. దానికి తోడు కాస్త మెర్పొడి తీసుకొచ్చింది. రొట్టింకా నానలేదు. అందుకే నీల్లల్లకి వొత్తుకుంటా గాలికి అక్కడిక్కడ చూసింది. దూరంగా ఎవరో వొస్తున్నట్టు అనిపిచ్చింది. చేతిలో కట్టెను చూసి కావలాయన అని గుర్తుపట్టింది. రొట్టె కాస్త నానింది, ఓ రొట్టెతుంకను మెర్పొడిల అద్దుకొని నోట్లేసుకుంది. ఇంతలో కావలాయన

దేవమ్మ.. ఓ దేవమ్మ.. అని పిలిచిండు. ఇదేంది కావలాయినా నాకోసం వొచ్చిండు. అనుకొని పలికింది. నిన్ను పటేల్ రమ్మంటుండు. అదేంది ఎండపొద్దున రమ్మంటుండు అనుకొని సరే వొస్తున్నా అంటూ తెచ్చుకున్న సద్ది మూటకట్టుకుంది. పటేల్ ఇంటికాడ పోలీస్ జీప్ ఆగివుంది. దేవమ్మ ఇంటి ముందుకు వొచ్చిందో..లేదో.. దూరం నుంచి సూసిన పటేల్ కోపంగా దేవమ్మ మీదికి వొస్తూ..

నీయమ్మ నాఇంట్ల పనిజేసుకుంట నన్నే సంపనికే సుస్తావా అంటూ చెంప మీద కొట్టిండు. దేవమ్మ పరిశానైంది. వెనక నుండి పోలీస్ వొచ్చి..పటేల్ సాబ్ ఇవన్నీ మేం సూసుకుంటం అంటూ దేవమ్మతోనికి పోయి ఆ చంప ఈ చెంప సర్సిండు. నిజంజెప్పు, పటేల్ను సంపనికే ఎప్పట్నించి సూస్తున్నరు..!? ఎంతమంది వచ్చిండ్రు... ఎవరెవరు వచ్చిండ్రు..!? దేవమ్మకి ఏం అర్థంకాలే..భయమైతుంది...ఏం జేయ్యల్నో ఏం తోస్తలేదు.నాకేం తెల్వదు సారూ.. నేనెందుకు పటేల్ని సంపాలనుకుంటా.. అంటూ ఏడుస్తుంది. పోలీసు దేవమ్మ జెడవట్టుకొని అసలు నీకు అన్నలకు సంమ్మందమేంది.. ఎప్పటి నుండి పని చేస్తున్నావ్ వాళ్లకు.. అన్నాడు దేవమ్మకి భయం ఎక్కువైంది. నాకేం తెలుసు సారూ.. అన్నలు ఎవరో కూడా నాకు తెల్వదు. నన్ను నమ్మండి సారూ.. అంటూ ఏడుస్తూనే ఉంది.

ఏం తెల్వదానే., దొంగ ముండా.. అంటూ పటేల్ పండ్లు కొరుకుతూ మీదికి వచ్చిండు.

పటేల్ సాబ్, నేను చూసుకుంటా అని శెప్పిన కదా మీ చేతికి ఎందుకు మైలంటుకుంటది అనుకుంటు దేవమ్మతోనికి పోయి.. ఇయ్యాల పొద్దుగాల మీ ఇంటికి అన్నలు వచ్చిండ్రా.. లేదా.. అన్నాడు. లేదు.. అన్నట్టుగా తలూపింది దేవమ్మ.పోలీస్ కండ్లల్ల క్రూరత్వం మొదలైంది. ఇయ్యాల పొద్దుగాల మీ ఇంటికి ఒకడు వచ్చిండు.. ఆనికి నీవు అంబలి పోసి పంపినవ్.., అవునా... కాదా..? అవును అన్నట్టు ఏడుసుకుంటనే తల ఊపింది. ఆయినా అన్నలని నాకు తెల్వదు, నీరసంగా కనిపిస్తే అంబలి పోసి ఇచ్చిన, అంతకుమించి నాకేం తెల్వదు సారూ.

నీరసంగా ఉంటే అంబలి పోసి ఇస్తావా.., నా పెండ్లం లేక మూడు రోజులైతుంది, నాకూ... ఒంట్లో నీరసంగా ఉంది.. అంటూ దేవమ్మకు మరింత దగ్గరికెళ్ళి శెప్పాడు. దేవమ్మ గుండె శెరువైంది. పటేలా దీని గుడిసె సోదా శెయ్యాలే.. అన్నాడు పటేల్ను సూస్తూ. సరే అన్నట్టు తలూపాడు పటేల్. దేవమ్మని కొట్టుకుంట గుడిసెకాడికి తీసుకొచ్చిండు. గుడిసె మూసుకొని ఉంది. పిలగాడు లేడు. దేవమ్మ అక్కడేం జరిగిందో మొత్తం పూసగుచ్చినట్టు శెప్పి.. శేసి సూపించింది. అయినా పోలీసు విన్లేదు, జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్ళి గుడిసె తలుపును తన్ని దేవమ్మని లోపలికి తోసిండు. గుడిసెలోంచి కోడిపెట్ట ఎగిరి బయటికొచ్చింది. ఆ కోడిపెట్ట కాలిగోరు పోలీసుచేతికి గీసుకపోయింది, అక్కడే ఉన్న సిపాయిలకు దాన్ని పట్టుకరమ్మని శెప్పిండు. అప్పటికే దేవమ్మ కొడుకొచ్చి వాకిట్ల నిలవడిండు. పోలీసు పిలగాన్ని సూసుకుంట తలుపేసిండు.

కొంచేపైనాక తలుపు తీసుకొని సొక్కా భుజానికి ఏసుకుని బయటికొచ్చిండు, ఎదురుగా ఇద్దరు సిపాయిలు కోడిపెట్టని పట్టుకొని నిలవడ్డారు, ఆ పక్కనే పిలగాడు నిలవడిండు.

వెళ్దాం పద అన్నట్టుగా సైగ శేసిండు పోలీస్, పోతూపోతూ పిల్లాడి తల నిమిరిపోయిండు.

కొంచేపటికి పిలగాడు గుడిసెలోనికి పోయిండు. దేవమ్మ ముద్దగా కూసొనుంది. ఎడంచేతికాడ కొంచెం రైక సినిగింది. శీర శానతొవల్ల సినిగిపోయింది. పైయంత నొప్పులతో పులిసిపోయింది.

పిలగాడు అమ్మా.. అంటూ దేవమ్మ దగ్గరికిపోయిండు. దేవమ్మ ఏంమాట్లాడకుండా లేసి తానానికి వెళ్ళింది. పిలగానికి ఏమీ అర్థం కాక బయిటొచ్చి కూసున్నడు. దేవమ్మ తానం చేసి, లోపలికెళ్లి ఇంగో శీర కట్టుకొని వచ్చింది. ఎండవెట్టిన చింతచిగురు తీసి పొయ్యిమీద యేసింది. లోపలికెళ్ళి గుడ్డు తీసుకొచ్చి ఉడుకవెట్టింది. వంట చేసి తిననికే కూసున్నరు. పిలగాడు దేవమ్మని సూస్తూనే ఉన్నడు, కానీ ఏమీ మాట్లాడలేదు.. మాటలు లేకుండానే తిన్నారు. గుడిసె బయట సాపేసి ఇద్దరు పడుకున్నారు. దేవమ్మ ఆకాశంలోకి సూస్తుంది. అమ్మా అంటూ పిలిసిండు.. దేవమ్మ ఆకాశంలోకి సుస్తూనే పలికింది. వాళ్ళు నిన్నెందుకు లోపలికి గుంజుకపోయిండ్రు.. లోపల నిన్ను కొట్టింండ్రా.. అని తల్లిని చూస్తూ అడిగిండు.

ఆకాశం యిరిగి యీపు మీదపడ్డట్టనిపించింది దేవమ్మకి, ఆరేండ్ల పిల్లాడికి అది తన సొంత కొడుక్కి ఆమె శేయని తప్పుకి శేసిన సాయానికి ప్రతిఫలంగా అనుభవించిన మానభంగం గురించి ఏమని శెప్తుంది. ఆమె రెండు దవడలు బిగుసుకుపోయి ఆ పంటికింద బాధని ఎంత నమిలినా నలగట్లేదు, కండ్లలోని సుడిగుండాల్ని, ముక్కుపుటలదిరే శ్వాసల్ని, శ్వాసలోని ఆయాసాన్ని పిడికిళ్ళు బిగపట్టి...

అవును.. కొట్టారు.. అంటూ ఇంట్లకుపోయి, కండ్లు తుడుసుకొని సినిగిన శీర జాకెట్టు తీసుకొచ్చి కుడుతుంది. రేపటి నుంచి మనల్ని ఎవరు కొట్టరమ్మా.. అంటూ ఒళ్లో పడుకున్నాడు పిలగాడు.

యే యెందుకు అని అంటూ పిల్లాడిదిక్కు తిరిగింది దేవమ్మ. మనకు సొతంత్రం వొచ్చిందంట అన్నాడు సిన్న నవ్వు మోకంతో. నీకెవరు చెప్పిండ్రు అని అడిగింది దేవమ్మ. ఎక్కువొళ్ల పిల్లలు అంటుంటే విన్నా.. సొతంత్రం వస్తే ఎవరిని కొట్టరంటమ్మా.. నిజమే, కానీ సొతంత్రం మనకు రాలేదు. మరీ..!? భారతీయులకు వొచ్చింది. మరి మనమెవరం..? మనం హైద్రాబాదొల్లం.. మనది నిజాం రాజేం.. మల్ల మనకెప్పుడొస్తది.. మనమీద పోలీసోడుండు.. వానీమీద పటేలుండు... పటేల్ మీద దొరుండు... దొర పైన నిజామోడుండు ఇంతమందిని దాటుకొని మనకేడొస్తది బిడ్డ సొతంత్రం.. అయితే మనం భారతదేశం పోదాం.. పోవాలే సదువు యేడ దొరికితే ఆడికె పోవాలే, నిన్ను సదివిస్త.. ఈలోకం సదివినోని మాటనే ఇంటది. మన ఊర్ని యేలే పటేల్, సదువుకున్న ఆయిన బిడ్డ మాట వింటుండు.. రేపు నీవు సదువుతే నీమాట అందరూ ఇంటరు.

మౌనంగా గెలవాలి.. గెలిచినాక ప్రపంచమంతా ఇనిపించేటట్లు అరవాలి... అదే నిజమైన గెలుపు. అని మనసులో అనుకుంది దేవమ్మ. శీర, రైక పక్కనపెట్టి పడుకొని ఆకాశంలోకి సూస్తూ సింతశేస్తుంది. అమ్మా భారతదేశం పోదామే అక్కడైయితే నిన్నెవరు కొట్టరు. సరేనన్నట్టుగా నవ్వుతూ తలూపింది. భారతదేశమైనా.. లోకంలో ఏదేశమైనా.. ఆడదాని బతుకులో ఏం తేడా ఉండదు, ఏం చేతకాని మగాడైనా.. వాడి అధికారం అంతా ఆడదానిపైనే, అయినా మిమ్మల్ని అని ఏం లాభం.. కులాన్నిబట్టి మానానికి, పాణానికి విలువివ్వాలని చెప్పినోన్ని పూజించే ఈ దేశంలో ఉంటే ఎంత.. పోతే ఎంత.. అనుకుంటూ కండ్లు మూసుకుంది.

**చింతకింది శివశంకర్**

**చింతకింది శివశంకర్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా, అంబట్ పల్లి గ్రామం. ఈయన ఇన్ఫోసిస్‌లో టెలికాం ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శివశంకర్ రాసిన మొదటి కథ "స్వాతంత్ర్యం". చరిత కామాక్షి అనే సినిమాకి రచయితగా కూడా పనిచేస్తున్నారు. అలాగే** https://www.youtube.com/c/MrStory-Teller **అనే** Yotube channel **ను పెట్టి పుస్తకాల గురించి చెపుతున్నారు. అంతేకాకుండా** Asura Telugu Podcost **పెట్టి 85 ఎపిసోడ్‌లు పూర్తిచేశారు.**

# వస్తు మారకం!



డాక్టర్ ఎమ్. సుగుణరావు
9704677930

చెట్లు మీద నుంచి కుహ కుహలు, కిల కిలా రావాలు చేసే రంగు రంగుల పక్షులు, పిట్టల మాదిరిగా వుంది న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్.

రకరకాల భాషలు, యాసలు, వేషధారణలతో ఉన్న ప్రయాణీకులతో భారతదేశం మొత్తం కనిపిస్తోంది. ట్రెయిన్ దిగాను. నేనిప్పుడు మెట్రో ఎక్కి ఢిల్లీ యూనివర్శిటీ నార్త్ కేంపస్కు చేరాలి. అక్కడ బియ్యే ఆఖరి సంవత్సరం చదువుతున్న మా అబ్బాయిని కలవాలి. నాకు ఢిల్లీ రావడం ఇది రెండో సారి. మూడేళ్ళ క్రితం మా వాడిని చేర్పించడానికి వచ్చాను. నాకు దారులు గుర్తుండవు. అది నా బలహీనత. అలా నేను మా అబ్బాయి హాస్టలు వుండే విశ్వవిద్యాలయ ప్రాంతం వెళ్ళాలంటే మెట్రో ఎక్కాలి. ఆలోచిస్తూనే ప్రక్క నున్న ప్రయాణికుడిని అడిగాను. అతను హిందీలో ఏదో చెప్పినా అర్థం కాలేదు. మా వాడికి ఏదో స్పెషల్ క్లాస్ వుందట, నన్నే వచ్చేయమన్నాడు. అందుకే ఈ ప్రయాసలు.

అంతవరకూ నన్ను పరిశీలనగా చూసిన ఒక పెద్దాయన, 'నేను అటువేపే వెళ్తున్నాను. మీ బేగ్

ఇవ్వండి' అన్నాడు హిందీలో.

అతనిని ఎక్కడో చూసినట్టుంది. అరవై సంవత్సరాలు పైగానే ఉంటాయి. జుట్టు బాగా తెల్లబడిరది. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. బట్టలు ఇస్త్రీవి కాకపోయినా శుభ్రంగానే ఉన్నాయి. నా దగ్గర పెద్ద లగేజీ లేకపోయినా మా అబ్బాయి కోసం పెట్టిన పచ్చడి సీసాలు, తినుబండారాలు ఒకే బేగులో మా ఆవిడ సర్దింది. ఇంకో బేగులో నా బట్టలు, ఆఫీసు ఫైళ్ళు. సరే ఈయన సాయం వస్తున్నాడు కదా అని ఒక బేగు అందించాను. ఆయనను అనుసరించాను.

అతను రెండు ప్లాట్ఫారములు దాటి ఎలివేటర్ ఎక్కి, బైటకు నడిచాడు. అక్కడ ఆటో స్టాండు దగ్గరే న్యూ ఢల్లీ మెట్రో స్టేషన్. విశ్వవిద్యాలయానికి వెళ్ళాలి అన్నాను. తనే టిక్కెట్టు తీసుకొచ్చాడు. తనకు పాస్ ఉందట. ప్లాట్ఫారం మీదకు వెళ్ళాము. చాలా వేగంగా వచ్చేసింది ఎక్కవలసిన ట్రెయిన్.

గబగబా ఎక్కేసాము. రెండు స్టేషన్లు దాటిన తర్వాత అడిగాను. 'తరువాతే నా విశ్వవిద్యాలయం' అని. వెంటనే జేబు లోంచి ఒక కాగితం తీసి చూపించాడు. చావిడి బజార్, చాందినీ చౌక్, కాశ్మీర్ గేట్, సివిల్ లైన్స్, విధాన సభ... ఇవి దాటిన తర్వాత నేను దిగవలసిన విశ్వవిద్యాలయం స్టేషన్. 'థేంక్స్' అన్నాను. అరగంట ప్రయాణం తర్వాత నేను దిగవలసిన స్టేషన్ వచ్చేసింది. ప్లాట్ఫారం దాటి బయటికి వచ్చి ఈరిక్షా ఎక్కాము. పది నిమిషాల్లో మా వాడి హాస్టలుకు చేరుకున్నాము. నేను ఇద్దరి ఆటో చార్జీలు ఇవ్వబోతుంటే, 'మీది మీరు ఇవ్వండి' అంటూ తన సంచీ లోంచి రెండు ఏపిల్ పళ్ళు తీసి ఆ ఆటో అతనికి ఇచ్చాడు. వెళ్తున్న అతనిని అడిగాను. అయ్యా! మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది. ఎక్కడి వారు? అన్నాను. అతనికి వినబడలేదేమో సమాధానం చెప్పకుండా కదిలిపోయాడు. నేనే పొరపాటు పడ్డానేమో! ఈయన ఎవరో అనుకున్నాను. ఆటో అతను నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆయన చేష్టలకు నాకు ఆశ్చర్యం కలిగింది. ప్రపంచంలో ఎనిమిదో వింత. ఆటో చార్జీలకు బదులు పళ్ళు ఇవ్వడం, దానికి ఆటో అతను ఒప్పుకోవడం ఋూ ఆలోచిస్తూనే హాస్టల్లోకి అడుగు పెట్టాను. గేటు దగ్గర ఒక అబ్బాయి 'నమస్తే అంకుల్' అన్నాడు. తెల్లగా పొట్టిగా ఉన్నాడు. ఆకర్షణీయమైన ముఖం. 'హర్ష చెప్పాడు. తనకు క్లాస్ వుంది. రండి' అన్నాడు ఇంగ్లీషులో. అతడితో లోపలకు వెళ్ళాడు. 'నా పేరు 'లోపా'. మాది మణిపూర్' అంటూ పరిచయం చేసుకున్నాడు.

రూము చిన్నదిగా ఉంది. క్రింద పరుపు, ఒక ఐరన్ టేబుల్, దాని మీద పొందికగా సర్దిన పుస్తకాలు. 'విశ్రాంతి తీసుకోండి' అంటూ అతను గదిలోంచి బైటకు నడిచాడు. చొక్కా తీసి హేంగరుకు తగిలించి, వాష్ రూమ్కు వెళదామనుకునేసరికి జేబులోంచి ఒక కాగితం జారి పడిరది. అది అన్నయ్య రాసిన లెటర్. ఆ మూడు పేజీల ఉత్తరం సారాంశం ఋూ మా ఇద్దరికీ తండ్రి గారి నుంచి సంక్రమించిన ఆ పాత ఇంటిని వదిలేయమంటున్నాడు. అమ్మను,

నాన్నను నేనే చూసుకున్నాను, నీకు భారం లేకుండా. నీది గవర్నమెంటు ఉద్యోగం. మీ ఆవిడా బేంకు ఉద్యోగి. నేను ఈ పల్లెటూళ్ళో సింగిల్ టీచర్. నీ కొడుకు ఢిల్లీలో, కూతురు అమెరికాలో చదువుతోంది. నాకు పిల్లలు సరిగ్గా సెటిల్ కాలేదు. ఇదీ అన్నయ్య వేదన.

ఆయనకు ఆ పల్లెటూళ్ళో ఖర్చులేం ఉంటాయి! పైగా వాళ్ళ ఆవిడ తరపున కొద్దో గొప్పో భూమి వుంది. మనకూ కూతురు వుంది. పెళ్ళి చేయాలి కదా! మన వాటా వదులుకోకండి. ఇదీ మా ఆవిడ వాదన. వాదనకు జోటెయ్యాలా, వేదనకు చోటివ్వాలా? తేల్చుకోలేకుండా ఉన్నాను.

ఆలోచనల్లో ఉండగానే మా అబ్బాయి వచ్చేసాడు. 'డాడీ...' అంటూ హుషారుగా నన్ను చుట్టేసాడు. వాడి వెనక ఇందాకటి లోపాతో పాటు అమ్మాయి. నా పేరు 'రాకా అధికారి' అంటూ పరిచయం చేసుకుంది. చక్కగా రెండు జడలు వేసుకుని, నుదుట మీద చిన్న బొట్టుతో, కాటన్ చీర వేసుకుని, చూడగానే బెంగాలీ అమ్మాయి అనిపించింది. పావుగంట కబుర్ల తర్వాత... అందరం భోజనం చేయడానికి దగ్గరలో ఉన్న సౌత్ ఇండియా రెస్టారెంట్కు బయలుదేరాము.

ఆ హోటల్లో కష్టమర్ల రద్దీ. భోజనం బావుంటుందని వేచి చూస్తూ కూర్చున్నాము.

'ఏమిటీ ఢిల్లీలో వింతలు, విశేషాలు' అన్నాను. 'ఒక అంతర్జాతీయ వింత గురించి చెపుతాము కాదు చూపిస్తాము' అంటూ మా అబ్బాయి మా ముందుకు వచ్చి కేటరింగ్ వారి నుంచి కూరలు తీసుకువెళుతున్న వ్యక్తిని చూపించాడు. నేను ఆశ్చర్యపోయాను. ఉదయం నన్ను హాస్టలుకు దింపిన వ్యక్తి, ఆటో ఆబ్బాయికి ఆటో చార్జీలకు, ఏపిల్ పళ్ళు మారకం చేసిన వాడు...

'ఈయన నాకు తెలుసు. ఉదయం నాకు దారి చూపించింది ఈయనే. అయితే ఎక్కడో చూసిన ముఖం. ఔను. మా ఊళ్ళో ఒక హోటల్ యజమాని. ఈయనలా ఉంటాడు' అన్నాను. ఉదయం వచ్చిన అనుమానం ఇప్పుడు మరింత బలపడిరది.

'ఆయనేనేమో!' అన్నాడు మా అబ్బాయి. లేదు... ఆయన చనిపోయాడు. వంద శాతం కరెక్ట్. మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారు ఇంతకీ ఈ పెద్దాయన ఢిల్లీలో ఏం చేస్తున్నాడు?' అన్నాను.

'ఇడ్లీ వ్యాపారం. కరెక్టా ఏ నాలుగు రోడ్ల జంక్షనులోనో దుకాణం తెరుస్తాడు. ఒక గేస్ స్టవ్, ఇడ్లీ కుక్కరు అంతే! గబగబ ఒక పాతిక వాయలు అంటే ఒక రెండు, మూడు వందల ఇడ్లీలు వేస్తాడు. మెత్తగా హాయిగా తినేట్టు వుంటాయి. దాంట్లోకి చట్నీ, కారప్పొడి. 'అయితే ఇడ్లీలు కొంటే డబ్బులు తీసుకోడు' అన్నాడు మా అబ్బాయి. 'మరి ఫ్రీగానా...?!' అన్నాను ఆశ్చర్యంగా. 'కాదు, ఇడ్లీల ఖరీదు బదులు ఏదైనా ఇవ్వాలి. బిస్కట్ పేకెట్లో, పళ్ళో, కూరగాయలో...' అన్నాడు. 'మరి అందరికీ అవి దొరకవు కదా! బీదా, బిక్కి దగ్గర ఇవి లేకపోతో..?!' అన్నాను. 'అలా ఎవరు ఏమీ ఇవ్వకపోయినా వారికి ఫ్రీయే! అయితే వారిచేత పని చేయిస్తాడు. ప్లేట్లు కడగడమో, పంపు దగ్గర నుంచి నీరు తేవడమో...!' అన్నాడు. 'మై

గౌడ.. మరి అతనికి ఇడ్లీలు, చట్నీ చేయడానికి ముడిసరుకు ఎలా వస్తుంది? వాటికైనా డబ్బు ఇవ్వాలి కదా?' అన్నాను.

'ఏదోలాగా మేనేజ్ చేస్తాడట! వారికి డబ్బులివ్వడట! ఈయన మీద లోకల్ పేపర్లో ఆర్టికల్ వచ్చింది. ఈయనకు ఏం కావలిస్తే అవి ఫ్రీగా ఇచ్చేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఎందుకంటే తనకు ఇడ్లీలు అమ్మగా వచ్చిన వాటిని స్లమ్ ఏరియాలో పేదలకు పంచేస్తాడు. అయితే రోజూ ఇడ్లీలు వుండవు. ఒక రోజు దోసెలు, ఇంకో రోజు పొంగల్, మరో రోజు బిసీబిలా బాత్... అవన్నీ రుచిగా వండుతాడు' అన్నాడు మా అబ్బాయి. ఇంతలో మా భోజనం ప్లేట్లు వచ్చాయి. అందరం ఆకలి మీద ఉండడంతో ప్లేట్ల మీద పడ్డాము. అరగంట తర్వాత మా అబ్బాయితో సహా అతడి ఇద్దరి సహాధ్యాయులను అడిగాను. 'ఇదంతా ఆయన ఎందుకు చేస్తున్నాడు?! ఇలా డబ్బు బదులు ఆహారం బదిలీ...' అన్నాను. వాళ్ళు ముగ్గురూ వెంటనే అన్నారు, 'ఆయన డబ్బును వదులుకుందామనే ఉద్దేశ్యంతో ఉన్నాడు. బహుశా... డబ్బు మీద వ్యామోహం లేనివాడై ఉంటాడు!' అన్నారు.

అయితే దీనిని బార్డర్ సిస్టమ్ అంటారు. అంటే తమకున్న వస్తువులు అవి లేని వారికి మారకం చేసి వారి దగ్గర నుంచి తమకు కావలసిన వస్తువులు తీసుకుంటారు. ఈ వస్తు మారకంలో డబ్బుతో పని లేదు. ఆర్థిక స్థిరత్వం ఉంటుంది. తమ వస్తువులు వృధా పోవు. ఈ రకమైన పద్ధతి క్రీ.పూ. 3000 వ సంవత్సరంలో మెసపటోమియా నాగరికతలో ఉపయోగించారు. అయితే ఈ పద్ధతి అమలుచేయాలంటే నైతిక, నిబద్ధత ముఖ్యం. ఒకరికి ఎక్కువ విలువైన వస్తువులు రావచ్చు. ఇంకొకరు నష్టపోవచ్చు. అయితే ప్రతిఫలం ప్రశాంత జీవితం. ఆర్థిక జంజాటనాలు వుండవు. డబ్బు ప్రసక్తి లేని వ్యవస్థలో మనిషికి ఆనందం దొరుకుతుంది. ఆస్తులు, అంతస్తులు, పేద, ధనిక, భేదం ఉండదేమో!' అన్నాడు ఎకనమిక్ చదివే మా అబ్బాయి.

నాకు మా అబ్బాయితో సహా ఇద్దరి పిల్లలను చూసి ఆనందం కలిగింది. ఈ చిన్న వయసులో ఆ పెద్దాయన ధర్మ సూక్ష్మాన్ని అర్థం చేసుకున్నారనిపించింది. వారు సరైన దారిలోనే వెళుతున్నారు. వెళ్ళవలసింది పెద్దలమైన మేము కదా! అనుకున్నాను. భోజనం పూర్తిచేసి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళాను. అక్కడికి పొడుగ్గా సన్నగా ఉన్న ఒక ముప్పయ్యేళ్ళ యువకుడు వచ్చి 'ఎక్స్యూజ్ మి సార్... ఇందాక మీరు పిల్లలకు ఆ ఇడ్లీ పెద్దాయన కథ చెప్పారు కదా... ఆయనను మీరు ఎక్కడ కలిసారు?!' అన్నాడు.

'ఢల్లీ యూనివర్శిటీ హాస్టలు దగ్గర...' అన్నాను, అతని వంక పరిశీలనగా చూస్తూ. 'ఆయనను కలవాలి ఎక్కడ దొరుకుతాడు?' అన్నాడు. 'ఇప్పుడే హోటల్లో ఏదో కొనుక్కొని వెళ్ళారు. బహుశా వాటిని పంచడానికి ఏ స్లమ్ ఏరియాకో వెళ్ళి ఉంటారు' అన్నాడు నా వెనక వచ్చిన మా అబ్బాయి. 'మీ కెందుకు? ఆయనతో ఏం పని?' అన్నాను అనుమానంగా. సమాధానం చెప్పకుండా ఆ యువకుడు వేగంగా ఆ హోటల్ నుంచి బైటకు నడిచాడు. నా గుండెల్లో రాయి పడిరది. కొంపదీసి ఈ పెద్దాయనను ఏమైనా చేస్తారా, ఇప్పుడు ఆయనను

గురించి ఎంక్వయిరీ చేసిన యువకుడు. ఒక 'డాన్'లా కనిపించాడు. నల్ల కళ్ళద్దాలు, తెల్ల బట్టలు. ఎందుకో ఆ క్షణంలో కొద్దిగా నా గుండె దడదడ లాడిరది. అవన్నీ మనసులోనే దాచుకుని, ఆ హోటల్ లోంచి బైట పడ్డాను.

ఆఫీసు పని కోసం సుప్రీం కోర్టుకు బయలుదేరాను, మా అబ్బాయి బుక్ చేసిన టాక్సీలో. టాక్సీ ఎక్కిన నేను గతంలోకి వెళ్ళాను. మా ఊళ్ళో ఒక పెద్దాయనది ఇడ్లీ వ్యాపారం. ఆయన పేరు చలమయ్య. ఆయనకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు గురవయ్య, చిన్నవాడు ధర్మయ్య. చలమయ్య సైకిల్ మీద ఇడ్లీలు అమ్మే స్థాయి నుంచి ఒక కార్పొరేట్ స్థాయిలో ఇడ్లీ వ్యాపారవేత్తగా ఎదిగాడు. మా చిన్నప్పుడు రూపాయికి ఐదు ఇడ్లీలు. దానితో పాటు చట్నీ, కారప్పొడి, నెయ్యి, ఇంకా కావలసినంత సాంబారు.

అంత ఎదిగినా ఆ ధరలు మాత్రం ఎదగలేదు. అవి సామాన్యుడికి అందుబాటులో వుండేవి. ఆయన తదనంతరం ఆయన కొడుకులు గురవయ్య, ధర్మయ్య ఆయన పంథాలోనే ఆ హోటళ్ళు నడిపేరు. అయితే ఆ ఇద్దరికీ పిల్లలు పుట్టి వాళ్ళు పెద్దవాళ్ళయి బిజినెస్ మేనేజ్మెంట్ డిగ్రీలు, పెద్ద కాలేజీల్లో లా పట్టాలు పొందేసరికి, తమ తండ్రుల వ్యవహారం నచ్చలేదు. ఇంకా దేశంలో సంపన్నుల జాబితాలోకి వెళ్ళవలసిన వాళ్ళం. రాష్ట్ర స్థాయి ధనికుల జాబితాలోనే ఉండిపోయాం అనుకుని తమకు చదువు నేర్పిన ఆర్థిక సూత్రాలు అమలుపరిచారు.

ఇది పెద్దవాళ్ళయిన గురవయ్య, ధర్మయ్యలకు నచ్చలేదు. వాదోపవాదాలు జరిగాయి. ఘర్షణలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో పెద్దవాడు గురవయ్యగారు తన అరవై అయిదో యేట ఒక రాత్రి పూట హార్ట్ ఎటాక్తో చనిపోయాడు. తమ్ముడు ధర్మయ్య అరవయ్యేళ్ళవాడు. అన్నయ్య మరణం తట్టుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో ఆస్తి తగాదా మొదలయింది. తమ తాతగారు మొదలుపెట్టిన మొదటి హోటల్ భవనం, స్థలం కోట్లలో పలుకుతోంది. అది ధర్మయ్య పేరన వుంది. అది తమదే అంటూ గురవయ్య పిల్లలు కోర్టుకెక్కారు. 'కాదు మా నాన్నది' అంటూ ధర్మయ్య పిల్లలు దానికి కౌంటర్ వేసారు. కారణం అది ధర్మయ్యదే! తన భార్య నుంచి సంక్రమించిన స్థలం కాబట్టి వారు పోరాడి కోర్టులో గెలిచాడు. ఐతే అలా గెలిచిన ఆ స్థలం తన కొడుకులకు చెందాల్సింది. తిరిగి తన అన్న కొడుకులకు రాసేసి, తాను తీర్థయాత్రల కోసం బస్ ఎక్కాడు. అయితే ఆ బస్సు గోదావరి దగ్గర జరిగిన ఘోర ప్రమాదంలో బోల్తా పడి గోదావరిలో కొట్టుకుపోయింది. అలా ధర్మయ్య చనిపోయాడు.

నేనెక్కిన కారు సుప్రీం కోర్టు ఆవరణలో ఆగింది. నా ఆలోచనలు టక్కున ఆగిపోయాయి. ఆ చనిపోయిన ధర్మయ్యగారు ఈ ఢిల్లీ నగరంలోని పెద్దాయనల ఉండడమే నాకు షాక్ కలిగించింది. కోర్టు లోపలికి వెళ్ళి నా పనుల్లో తలమునకలయ్యాను, ఆలోచనలకు స్వస్తి చెప్పి.

* * *

కోర్టులో పని ముగించుకుని తీరిక లభించడంతో తాపీగా మెట్రో స్టేషన్లో ట్రెయిన్ ఎక్కి

విశ్వవిద్యాలయం స్టేజి దగ్గర దిగి మా వాడి హాస్టల్ వైపు నడక సాగించాను. అయితే కొంత దూరం నడిచేసరికి దారి తప్పాను. అయోమయంగా అనిపించింది.

ఇంతలో ఒక టీ బంకు కనిపిస్తే ఆగాను. 'సార్' అంటూ మధ్యాహ్నం హోటల్ దగ్గర ఆ పెద్దాయన గురించి ఎంక్వయిరీ చేసిన యువకుడు అతని వెనక ఇంకో నలుగురు. అదే వయసు వారు కనిపించారు. అంతా ఖరీదైన మనుషుల్లాగే ఉన్నారు. 'సార్... మీరు చెప్పిన దారిలో వెతికాం. ఆయన దొరకలేదు' అన్నాడు ఆ యువకుడు. 'ఇంతకీ మీరెవరు? ఆయనతో మీకేం పని?' అన్నాను. 'మీరు హోటల్లో అందరికీ ఇడ్లీలు అమ్మే పెద్దాయన గురించి చెపుతుంటే విన్నాం. ఆయనను మీరు అనుకుంటున్నట్టు ఎవరో కాదు, ఆయన ధర్మయ్యగారు. మా చిన్నాయన. ఈ అబ్బాయిలు వారి పిల్లలు. ఆయన కోసం వెతుక్కుంటూ వచ్చాం ఢల్లీ. ఇక్కడ ఉన్నాడని తెలిసి' అన్నాడతను. 'నేను వారి మాటలకు ఆశ్చర్యపోయి 'ధర్మయ్యగారు బస్సు ప్రమాదంలో చనిపోయారు కదా?' అన్నాను. 'లేదు. మా చిన్నాయన చనిపోలేదు. ఆయనకు బస్ ఎక్కే ముందు వాష్ రూమ్కు వెళ్ళాల్సివచ్చింది. ఐతే ఆయన సీటులో బేగు, శాలువా, స్వెట్టర్ వుంచి క్రిందకు దిగాడు. ఆయన ఉన్నాడనుకొని డ్రైవర్ బస్ పోనిచ్చాడు. ఆ బస్ గోదావరి నదిలో పడిరది. ఆయన చనిపోయాడని అందరం అనుకున్నాము. డేడ బాడీ దొరకకపోవడంతో ఆరు నెలల తర్వాత తెలిసింది, ఆయన బస్ ఎక్కలేదని... వెతికితే ఢల్లీలో ఉన్నాడని తెలిసి వచ్చాము. ఆయన దొరకడంలేదు' అన్నాడతను విచారంగా.

నేను క్షణం ఆలోచనలో పడి 'ఆయన దారిలో వెళ్ళండి దొరుకుతాడు' అన్నాను స్థిరంగా. 'అంటే?!' అన్నారు వాళ్ళు అయోమయంగా. 'అదే ఆయన దారే...' అన్నాను మళ్ళీ మళ్ళీ.అతను ఒక్క క్షణం ఆగి 'మీరు చెప్పిన విషయం అర్థమయింది. 'దారి తప్పిన వాళ్ళం అని మా చిన్నాన్న మమ్మల్ని ఆయన పిల్లల్ని వదిలి తన దారి వెతుక్కున్నాడు. మాకు ఇప్పటికి అర్థం అయింది. ఆయన చూపిన దారే బాగుందని. అందరం కలిసిపోయాము. ఈ ఆనందం ఆయనతో పంచుకోవాలని వస్తే ఆయన దొరకడంలేదు' బాధగా చెప్పాడు అతను. 'ఫరవాలేదు. దొరుకుతాడు' అన్నాను. వారి ముఖాల్లో సంతోషం కనిపించింది. అక్కడి నుంచి కదిలారు.

నేను వారికి చెప్పిన విషయం నాకు ఆశ్చర్యం, ఆనందం కలిగించింది. కుతంత్రపు ప్రపంచం బొరుసైతే అది ధర్మాన్ని దారి తప్పించేది. అది నాణేనికి ఒక వైపు. ఈ ధర్మయ్యగారు మరో వైపు. ఆయనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న మా అబ్బాయి లాంటి యువతరం, ఇంకా ఆ పెద్దాయన దారిలోకే నడవడం సాగిస్తున్న ఆయన కుటుంబం.

అలా ఆలోచనల్లో ఉన్న నేను పక్కకు తిరిగి చూస్తే మా అబ్బాయి హాస్టలు వైపుగా రోడ్డు పక్కలో వున్న రావిచెట్టు కనిపించింది. ఆ చెట్టు క్రింద కూర్చుని భోజనం చేస్తున్న ఒక యాచకురాలు. ఆమె చుట్టూ కోతుల గుంపు. తన అన్నాన్ని వారికి పంచుతోంది. ఆ చెట్టు చూసేసరికి హాస్టలు వైపు వెళ్ళాడానికి దారి తెలిసింది. అలాగే నాకు మనసులో తొలుస్తున్న

సమస్యకు దారి దొరికింది. నా జేబులో గుండెకు దగ్గరగా ఉన్న మా అన్నయ్య రాసిన ఉత్తరం రేపిన అలజడి లేదు.

అన్నయ్యకు ఫోన్ చెయ్యడానికి నిర్ణయించాను. వాదనలో అర్థం వున్నా వేదనలో పరమార్థం ఉందని బోధ పడిరది. వెంటనే ఫోన్ చేసాను. అన్నయ్య గొంతు వినిపించింది. 'ఆ ఇల్లు నువ్వే తీసుకో. ఒక పని మాత్రం నా కోసం చెయ్యి' అన్నాను. 'ఏమైనా డబ్బులు ఇమ్మంటావా? ఎంత డబ్బు ఇమ్మంటావో చెప్పు. ఇస్తాను' అన్నాడు అన్నయ్య. 'డబ్బులేమీ వద్దు. వస్తు మారకం. అంటే బార్టర్ సిస్టమ్.' 'అంటే ఏంటిరా?' అన్నాడు అన్నయ్య. 'మనం చిన్నప్పుడు అమ్మ పని పాటూ చేసుకుంటూ మా ఇంటి పెరట్లో ఉన్న వేపచెట్టుకు ఉయ్యాల కట్టి దాంట్లో నన్ను ఉంచేది. నువ్వు ఉయ్యాల ఊపుతూంటే నేను నిద్రపోయేవాడిని. అందుకే ఆ చెట్టు కొట్టించకు. అక్కడ మళ్లీ ఉయ్యాల కట్టి దాంట్లో ఊగాలని ఉంది నాకు. నన్ను ఊపేది నువ్వే!' అన్నాను. అవతలి నుంచి ఏడుస్తున్న అన్నయ్య. అవి ఆనంద బాష్పాలు. నా కళ్లు కూడా తడిసాయి సాంత్వనతో.

* * *

## డాక్టర్ ఎమ్.సుగుణరావు

డాక్టర్ ఎం. సుగుణరావు స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం. ప్రస్తుతం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. వెటర్నరీ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. భారత ప్రభుత్వరంగ బీమా సంస్థలో ఉద్యోగం చేసి, సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందారు. దాదాపు 30 ఏళ్లుగా కథలు రాస్తున్నారు. ఇప్పటివరకూ 225కు పైగా కథలు రాశారు. వీటిలో 70 కథలకు బహుమతులు అందుకున్నారు. పలు కథలు అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. 'జాబిలి మీద సంతకం', 'నేలకు దిగిన నక్షత్రం' పేరుతో కథా సంకలనాలు వెలువరించారు. ఆకాశంలో ఒక నక్షత్రం కథ.. ఇంగ్లీషు నాటకంగా రూపుదిద్దుకుంది. దేవుడిని చూసినవాడు, మంచుపల్లకి, దుర్గమ్మ కూతురు కథలు కన్నడంలోకి అనువాదం అయ్యాయి. 'క్షమాభిక్ష' కథకు స్వాతి మాసపత్రిక అనిల్ అవార్డు దక్కింది. 2020లో నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ నిర్వహించిన కథల పోటీలో.. 'పోలేరమ్మ' కథ రూ.15000 బహుమతి గెలుచుకున్నది. వీటితోపాటు వివిధ కథలకు బహుమతులు, సన్మానాలు అందుకున్నారు.

# ది అన్టోల్డ్ సీక్రెట్స్ ఆఫ్ ఉమెన్ సప్రెషన్

## The Untold secrets of women suppression



పద్మజ బొలిశెట్టి

"హలో సూరజ్!".

"హాయ్ డాడ్! హౌ ఆర్ యూ..? హౌ ఈజ్ యువర్ హెల్త్?".

"ఐయాం ఫైన్ రా! నీకో విషయం చెప్పాలి!".

"ఓహ్.. చెప్పు డాడ్! ఏంటీ విశేషం? ఎదురింట్లో మీ పాత గర్ల్‌ఫ్రెండ్ ఏమైనా దిగిందా?".

"అరేయ్.. మాట మార్చకురోయ్! అమ్మ ఉంది పక్కనే.. లిటిగేటేషన్స్ పెట్టకు! తనతో వాదించలేను. సరేలే గానీ.. మీ మామ్ నీకో సంబంధం తెచ్చింది. అమ్మాయిది ఐటీ జాబ్. ఫొటో చూశా.. బాగుంది! ఒకసారి నువ్వుకూడా చూసి చెప్పురా! షి ఈజ్ వెయిటింగ్ ఫర్ యువర్ ఆన్సర్".

"ఇప్పుడెందుకు డాడ్! కొద్దిరోజుల్లో యూఎస్ నుంచి ఇండియా వస్తానుగా. వచ్చినంక చూద్దాం. ఈ ఫొటోల్లో ఎడిటింగ్.. అవీ ఇవీ ఉంటాయి. ఒరిజినాలిటీ మిస్ అవుతుంది!".

"ఏదో.. తన సంతోషం! ఒక్కసారి వాట్సాప్ చూసి

చెప్పురా.. నీ ఒపీనియన్".

"ఓకే డాడ్!"..

అని ఫోన్ పెట్టేసి.. వాట్సాప్‌లో పిక్ ఓపెన్ చేశాను.

ఆ అమ్మాయి.. అవును అదే అమ్మాయి!

సరిగ్గా ఆరునెలల క్రితం. ముంబైలో ఉండగా, ఒకరోజు ఈవినింగ్ బీచ్‌కు వెళ్దామని పంకజ్, సుశాంత్‌గాడికి ఫోన్‌చేస్తే.. ఒకడేమో స్విచ్ఆఫ్, ఇంకొకడు ఏదో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయానని ఇరుకు గొంతుతో సమాధానం.

ఆ రోజు పూర్తిగా ఎండకాకుండా.. అలా అని మబ్బులు లేకుండా, కాస్తంత డస్కీగా ఉన్నది వాతావరణం. ఆ చల్లని వాతావరణంలో ఒక్కణ్నే బాల్కనీలో కూర్చోలేక.. అరగంట ప్రయాణానికి ట్రాఫిక్‌లో ముప్పావుగంట వెయిట్ చేసి బీచ్‌కు వెళ్లిపోయా!

సూర్యుడు పూర్తిగా సెలవు తీసుకొని, చంద్రునికి స్థానం ఇస్తున్నట్టు.. మసక బారుతున్న సమయంలో, దూరం నుంచి ఒక్కసారిగా ఓ తెల్లని మెరుపు. 'ఏంటా!?' అని పరిశీలిస్తూ చూస్తుంటే.. దూరంగా తెల్లని చుడీదార్ మీద, గులాబీ రంగు చున్నీ. రింగుల జుట్టు. ఐదడుగులకు రెండుమూడు అంగుళాలు ఎక్కువ ఉంటుందేమో! గోధుమ %--% ఎరుపు రంగు కలగలిసిన మేనిఛాయతో ఒక ప్రకాశవంతమైన ముఖం. అందులోంచి సూటిగా చూస్తున్న పెద్దకళ్లు. అలలకు కొద్దిదూరంలో కూర్చొని ఉందా అమ్మాయి.

పైన చుక్కల ఆకాశం, కింద ఇసుక నిండిన బీచ్‌లో అలలు వచ్చి ఒక్కొక్కటిగా తన కాళ్లను తాకుతూ.. కాళ్ల కిందున్న ఇసుకను బతిమిలాడుకొని తీసుకెళ్తున్నాయి.

మొదటి చూపులోనే కాస్త దగ్గరగా వెళ్లి, తనను పలకరించాలని అనిపించింది. కాస్తంత దగ్గరగా వెళ్లి.. భయంతో కూడిన నటనతో..

"హాయ్!" అన్నాను.

తను చూడలేదు. మళ్లీ..

"హాయ్! ఐయాం సూరజ్. వర్కింగ్ ఇన్ ఐటీ సెక్టార్" అని చెప్పాను.

మళ్లీ నిరాశే!

"ఎక్స్‌క్యూజ్‌మీ! మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్!".. పేరు తెలుసుకోవాలనే తాపత్రయంతో మళ్లీ అడిగాను.

తను చూసి..

"రేష్మ" అని మెల్లిగా చెప్పింది.

"ఓహ్.. నైస్ నేమ్! మీరు రెగ్యులర్‌గా బీచ్‌కు వస్తారా!? ఐ థింక్ యూ లైక్ బీచ్ వెరీ మచ్".

"ఇక్కడ ఖాళీ ఏది ఉండదు! ఆకాశం %--% భూమి %--% సముద్రం..

ఒకదానికొకటి విడదీయరాని పెయింటింగ్‌లాగా, ఒకరినొకరు గూఢచారిలాగా రహస్యంగా గమనించుకుంటాయి. ఇక్కడ.. ఈ ఎడారి బీచ్‌లో పురుషులు, స్త్రీలు, ప్రకృతి.. హింస నుంచి తమను తాము రక్షించుకోవడానికి దాగి ఉంటారు"..

ఆమె చెప్పిన సమాధానంలో ఏదో తెలియని లోతైన విశ్లేషణ దాగి ఉంది. ఆమె కళ్లలో సహజత్వంతో కూడిన గాంభీర్యం ఉట్టిపడుతున్నది. ఇంకేమీ మాట్లాడకుండా అక్కడినుంచి వచ్చేశాను.

దూరం నుంచే ఒక గంటసేపు.. ఆ సాగర అలల సరిగమల మధ్యన ఆమెనే చూస్తూ ఉండిపోయా!

కట్ చేస్తే..

ఆ అమ్మాయే ఈ అమ్మాయి. వావ్.. ఎగిరి గంతేసినంత పని చేసి, మామ్‌కు కాల్ చేశా!

"అమ్మాయికి ఓకే అయితే.. నాకు ఓకే!" అని చెప్పేశా

నిశ్చితార్థం ఏదో ఫార్మల్‌గా.. నేను లేకున్నా, పెద్దలలో జరిపించమన్నాను. ఆ రోజు నిఖాలో తనను చూస్తుంటే.. తన అమాయకత్వం, హుందాతనంతో ఫెయిరీ క్వీన్‌లా కనిపించింది. నా కళ్లు మళ్లీ మళ్లీ తన వైపే తిరిగేంత కంట్రోల్ తప్పాయి.

ఆ తర్వాతి రోజు రాత్రి..

అందరూ ఎంతో ఆతృతతో ఎదురుచూసే రాత్రి అది. సమయం లేకపోవడం, దూరం వల్ల కనీసం పెళ్లికి ముందు తనను కలిసి, తన అభిప్రాయాలు తెలుసుకునే అవకాశం రాలేదు. అందుకు నన్ను నేనే తిట్టుకుంటూ.. ఈ రోజు ఎలాగైనా తనతో విషయం చెప్పి, ఒక హగ్ అయినా ఇవ్వాలనే ఆరాటంతో ఎదురుచూస్తూ ఉన్నా. తను మాత్రం ఏదో ఫార్మల్‌గా.. పాలగ్లాసు అదీ తేకుండా, సింపుల్‌గా కుచ్చిళ్లు నేలకు జారుతున్న ఎర్రరంగు చీరలో, జడలో కొన్ని విరజాజులతో గదిలోకి వచ్చింది. తనను చూసి ఆటోమేటిగ్గా నాలో కంగారు మొదలైంది. నేనే నిల్చొని.. తనకు 'వెల్కమ్!' చెప్పా!

'కూర్చో!' అనగానే, తను మంచంపై కూర్చున్నది.

నేను ఇంకాస్త పక్కకు జరిగి.. టేబుల్‌పై ఉన్న రోజా పువ్వు తీసుకొని తనకు అందిస్తూ..

"హాయ్! ఐ లవ్ యూ! ఇది నేను నిన్ను చూసిన మొదటిరోజు చెప్పాలనుకున్న విషయం. ఇలా చెప్తున్నందుకు హ్యాపీ" అని చెప్పా.

తను ఏమీ మాట్లాడకపోయేసరికి..

ఇంకొంచెం పక్కకు జరిగి.. తన చేతిని పట్టుకొని దగ్గరగావెళ్లి కిస్ చేసే ప్రయత్నం చేశా..

వెంటనే తను..

"నో!" అంటూ.. కోపంతో నా చెంపపై ఒక్కటిచ్చింది.

"..ప్లీజ్ డోంట్ టచ్ మీ" అని అరుస్తూ.. ఏడుస్తున్నది.

ఎంతో మధురమైన అనుభూతిలా మిగలాల్సిన ఆ రాత్రి.. మా మధ్య నిశ్శబ్ద నిశీధిలో ఒంటరి ప్రయాణం. చెప్పుకోలేని, విప్పలేని రహస్యాల కౌగిట్లో కట్టిన గోడల మధ్యన.. ఇరువురి అష్టదిగ్బంధం.

ఉదయాన్నే నా ఫ్రెండ్ నీరజ ఫోన్ కాల్..

"హాయ్! ఒరేయ్ కంగ్రాచ్యులేషన్స్! పార్టీ ఎప్పుడు ఇస్తావ్? ఎలా ఉన్నావ్ హ్యాపీ కదా?".

"హ్మ్.. బతికే ఉన్నా!".

"ఏంట్రా ఆ సమాధానం?".

పరీక్షల్లో ప్రశ్నలన్నిటికీ సమాధానం తెలిసీ, పెన్ను మరిచిపోయిన వాడి పరిస్థితి ఎలా ఉంటుందో.. అలా ఉంది నా పరిస్థితి.

రాత్రి జరిగిన విషయాన్ని చెప్పాక..

"తనను సాయంత్రం ఇంటికి తీసుకురా! పరిచయం చేద్దువు గానీ" అన్నది నీరజ.

ఫోన్ పెట్టేసి.. రేష్మను పిలిచా.

"నా ఫ్రెండ్ నీరజ! సైకాలజిస్ట్ తెలుసుగా.. సాయంత్రం వాళ్ల ఇంటికి రమ్మంది. వెళ్దాం!" అని చెప్పా.

ఆటోమేటిగ్గా అడిక్ట్ అయిన నా కళ్లను తనవైపు నుంచి తిప్పుకొంటూ ఉంటే.. తను నన్నే చూస్తున్నది.

ఆ చూపుల్లో.. వసంతకాలపు లేతచిగుళ్ల నుంచి వేకువజామున వచ్చే తాజాదనం ఉంది.

కోయిల గానంలో, మయూర నాట్యంలో, చిరుగాలుల సవ్వడిలో వినిపించే ప్రశాంత స్వరంతో.. ఒక అద్భుతం ఆకాశం నుంచి నేలకు జారినట్లుగా..

"ఓకే..!" అన్నది.

సాయంత్రం కాగానే.. ఇద్దరం కలిసి నీరజ వాళ్ల ఇంటికి వెళ్లాం.

నీరజకు తనను పరిచయం చేశాను.

"హాయ్! బిజీగా ఉండి మీ పెళ్లికి రాలేకపోయా. వీడూ నేనూ చిన్నప్పటి నుంచి బెస్ట్ ఫ్రెండ్స్! అల్లరి వెధవ.. నీతోకూడా స్టార్ట్ చేసే ఉంటాడు" అంటూ తనను లోపలికి తీసుకెళ్లింది నీరజ.

నేనూ వారితోనే వెళ్లబోతుంటే..

"నేను తనతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి సూరజ్! నువ్వలా బయటికి వెళ్లి టీ తాగేసి రా!" అంటూ.. నవ్వుతూనే నన్ను గెంటేసినంత పనిచేసింది నీరజ. నేను అలా గుమ్మంవైపు రెండు అడుగులు వేశానో లేదో.. రేష్మను తీసుకొని తన గదిలోకి వెళ్లింది నీరజ.

అయితే.. నాకు ఆ గుమ్మం దాటాలని అనిపించలేదు.

ఎందుకంటే.. ఆ నల్లని కాటుక కళ్ల వెనుక దాగిన నిగూఢ రహస్యం తెలుసుకోవాలనే ఆత్రుత నాది.

"ఇలా చూడమ్మా! ఆడపిల్లలకు అన్ని పరిస్థితులూ ఒకేలా ఉండవు. నన్ను చూడు.. అమ్మ, నాన్న అందరూ అమెరికాలో.. పిల్లలు కూడా! బట్ ప్రొఫెషన్ కోసం నేను ఇక్కడే ఉండిపోయా. కొన్నిటిలో అడ్జస్ట్ అవ్వాలి. ఆర్ యూ హ్యాపీ విత్ సూరజ్? లేదా ఇంకేదైనా బ్రేకప్ లవ్?".. సూటిగా మ్యాటర్‌లోకి వచ్చేసింది నీరజ.

ఆమె మాట పూర్తి చేయకముందే..

"అలాంటిదేమీ లేదండీ! సూరజ్‌లోని ప్రశాంతత, సెన్స్ ఆఫ్ హ్యూమర్.. అన్నిటి కంటే తను మనుషులను అర్థం చేసుకొనే విధానం అంటే నాకు ఇష్టం. ఐ లైక్ హిజ్ గుడ్ మ్యానర్స్" అంటూ చెప్పింది రేష్మ.

"ఓహ్ గుడ్! అయితే మరింకేం!? ఏ అమ్మాయికైనా మొదటిరాత్రి ఉండే టెన్షన్ అలానే ఉంటుందిలే! కాస్త చనువు పెరిగితే నువ్వే సర్దుకుంటావు సంతోషంగా.." అన్నది నీరజ.

కొద్దిసేపు నిశబ్దం.

"లేదు డాక్టర్! ఈ భయం.. ఎప్పుడో ఓసారి వచ్చిపోయే చుట్టం కాదు. జీవితాంతం నన్ను అంటిపెట్టుకొని ఉండే నా నేస్తంలా ఉంది".

"ఎందుకలా? టెల్ మి ద రీజన్? నేనేమైనా హెల్ప్ చేయగలనేమో?! ఎప్పటినుంచి ఉంది చెప్పు ఈ భయం?".

ఆమె పెదాలు తడుపుకొంటూ.. నేలకేసి చూస్తూ..

"డాక్టర్.. నేను ఈ బయటి ప్రపంచానికి దూరంగా, ఒక చిన్న మారుమూల గ్రామం నుంచి వచ్చిన వ్యక్తిని. నాకు చిన్నప్పుడు.. సరిగ్గా ఆరేండ్ల వయసు ఉంటుంది. మా ఇంటికి కొందరు పెద్దవాళ్లు వచ్చి మా వాళ్లతో.. 'ఇదే చివరి అవకాశం! ఇప్పుడు చేయకపోతే మీరు

పాపాలు చేసినవారు అవుతారు. మీరు మన ఆచారం నుంచి వెలివేయబడుతారు!' అని గట్టిగా వాదించారు. వాళ్లు వెళ్లిపోయాక రాత్రివరకూ అమ్మ ఏడుస్తూనే ఉన్నది.

తెల్లవారిన తర్వాత ఒక ముసలావిడ మా ఇంటికి వచ్చింది. మా నాన్నమ్మ నాకు చాక్లెట్స్ కొనిచ్చి, ఎత్తుకొని శిథిలావస్థలో ఉన్న ఇంటిలోకి తీసుకెళ్లింది. అక్కడ నన్ను ఒక బల్లపై పడుకోబెట్టింది. ఒకవైపు నిప్పుల్లో కత్తిని పదును చేస్తున్నారు. ఒకావిడ వచ్చి నా దుస్తులను తొలగించింది. నేను ఏడుస్తుంటే.. నా చేతులను ఆ ముసలావిడ గట్టిగా పట్టుకున్నది. నా కింది భాగంలో ఒక పదునైన కత్తితో కోసినట్లు అనిపించింది. నొప్పితో నేను అరుస్తూ ఉంటే.. దానిపై ఒక నల్లని పొడిని ఉంచింది. నేను చాలా భయపడ్డాను. నొప్పితోకూడిన ఆ షాక్‌ను నేను ఇప్పటికీ అనుభవిస్తున్నాను. చిన్నప్పుడు ఇలాగే చేయబడ్డ మా కజిన్.. తనకు బాబు పుట్టే సమయంలో ఓవర్ బ్లీడింగ్ అయ్యి చనిపోయింది. ప్లీజ్ డాక్టర్.. అసలు తనకేమైంది. నేను కూడా అలాగే చనిపోతానా? ప్లీజ్ టెల్ మీ ద ఫ్యాక్ట్స్ ప్లీజ్!"..

రేష్మ గొంతు వణికిపోతున్నది. ఆమె నిలువెల్లా కదిలిపోతున్నది. నీరజ సోఫాలోంచి లేచి.. రేష్మ దగ్గరికి వచ్చింది. తనను దగ్గరికి తీసుకుంటూ..

"భయపడకు!" అని ఓదార్చింది.

రేష్మ ఏడుస్తూనే..

"చెప్పండి! నాకు ఏమైంది?" అని అడిగింది మళ్లీ.

"ఈ ప్రకృతిలో స్త్రీకి మాత్రమే ఉత్పత్తితోపాటు పునరుత్పత్తి శక్తి ఉంది. ఒక స్త్రీ మాత్రమే పురుషుని కంటే ఎక్కువగా తనలో తానే మనగలుగుతుంది. అన్నిటికంటే.. పురుషుని కన్నా స్త్రీకే ధైర్యం ఎక్కువ. ఎటువంటి పరిస్థితుల్లోనైనా జీవించే సామర్థ్యం.. ప్రకృతి తనకు కల్పిస్తుంది. దానిని గుర్తించిన పురుషుడు.. క్రమంగా స్త్రీని నిర్వీర్యం చేయాలని ఎన్నో ఆచారాలు, ఎన్నో సిద్ధాంతాలు, కట్టుబాట్లతో అనునిత్యం ఆమెను కట్టివేస్తున్నాడు. దానిలో భాగంగా జరిగిన ఒక క్రూరమైన మతాచారమే.. ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్!" అంటూ ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

మళ్లీ తానే..

"స్త్రీ జననాంగ విచ్ఛేదం.. అంటే 'ఖత్నా' అని పిలిచే ఒక క్రూరమైన సంప్రదాయం ఇది. స్త్రీ జననేంద్రియాల్లోని మృదువైన క్లిటోరిస్ తలను కత్తిరించడం. దీనివల్ల తనకు లైంగికపరమైన ఆసక్తి తగ్గి, పెళ్లికి ముందు కానీ తర్వాత కానీ ఇతరులతో సెక్స్‌పట్ల విముఖత వ్యక్తం చేస్తుంది. కేవలం స్త్రీని పిల్లలు పుట్టించడానికి మాత్రమే పనికొచ్చేలా చేసే ఒక దురాచారం ఇది. ఇది ఆఫ్రికా దేశాల్లో కొన్ని మిలియన్ల మంది స్త్రీలపై.. నిత్యం జరుగుతున్న క్రూరమైన చర్య ఇది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చొరవ వల్ల దీనిపై కొంత అవగాహన ఏర్పడి,

కొన్ని దేశాల్లో ఇలాంటి దురాచారంపై నిషేధం ఉంది. కానీ, మన దగ్గర బహిరంగంగా ఎవరూ చర్చించనీ.. కొన్ని తెగలు ఇంకా ఈ ఆచారాన్ని పాటిస్తున్నాయనేది ఒప్పుకోవాల్సిన నిజం!"..

నీరజ గొంతులో అంతులేని ఆవేదన.

"నీరజా! అమ్మ ఫోన్ చేసింది. మమ్మల్ని రమ్మంటున్నది!" అంటూ నీరజ గది తలుపులు తట్టాను.

కాసేపు మౌనం తర్వాత.. తలుపులు తెరుచుకున్నాయి.

నీరజ దగ్గర సెలవు తీసుకొని.. రేష్మను తీసుకొని అక్కడినుంచి వచ్చేశా.

మరుసటి రోజు..

"ఇవ్వాళ ఆఫీస్ నుంచి త్వరగా వస్తాను. బీచ్‌కు వెళ్దాం!" చెప్పాను ఆమెతో.

తల దించుకునే.. "అలాగే!" అన్నది.

ఆ సాయంత్రం..

అలల నడుమన నిశ్శబ్దంగా నడుస్తున్నాం ఇద్దరం.

రేష్మ మెల్లిగా..

"సూరజ్! నీకో విషయం చెప్పాలి. దాన్ని నువ్వు ఎలా తీసుకున్నా నాకు ఇష్టమే! నీ లైఫ్‌లో నేను.." అంటూ ఏదో చెప్పబోయింది.

"ప్లీజ్ స్టాప్.. రేష్మ!" మృదువుగానే అన్నాను.

"లెట్ మీ కంప్లీట్ సూరజ్! నేను నీకు సెట్ అవ్వలేను. నిన్ను నేను ఏ విధంగానూ సుఖపెట్టలేను. అసలు విషయం నీకు తెలియదు. నేను"..

"నాకంతా తెలుసు రేష్మా! నీరజతో నువ్వు చెప్పిందంతా నేను విన్నాను. చూడు రేష్మా! నేను నిన్ను ఈ భూమి – ఆకాశం – సముద్రం – గాలి.. అదిగో దూరంగా కనిపించే ఆ లైట్ హౌజ్‌లోని అగ్ని సాక్షిగా ప్రేమించాను. ఇక ఈ జీవితం నీతోనే! ట్రస్ట్ మీ!"..

అంటూ నా మోకాళ్లపై కూర్చొని, చేతిలో గులాబీ పువ్వుతో.. తన కళ్ల వైపే చూస్తూ అడిగాను.. నా కళ్లలో నీళ్లు నింపుకొని.

రేష్మ గొంతులోని బాధను దిగమింగుకుంటూ.. తన కళ్లలోనూ నీళ్లు నింపుకొన్నది.

అవి ఆనందబాష్పాలేనని గుర్తించడానికి నాకు ఎక్కువ సమయం పట్టలేదు.

నా చేతిలోని గులాబీని అందుకుంటూ..

"నాలాగా ఇకముందు ఏ అమ్మాయి కూడా ఇలా అవగాహన రాహిత్యంతో బాధకు గురై.. జీవితాంతం నొప్పిని అనుభవించొద్దు. ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్‌కు వ్యతిరేకంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో నేనూ పాల్గొంటాను. నాలాంటి వాళ్ల

కోసం నేనూ పనిచేస్తాను సూరజ్" అన్నది.

"ఓకే! నీ ఇష్టం" అన్నాను.

ఆ బీచ్‌లో..

ఆమె ఒంటరిగా ముందుకు నడుస్తూ పోతూ ఉన్నది.

మొదటిసారి తనను కలిసినప్పుడు.. 'ఈ ఎడారి బీచ్‌లో ప్రకృతి, స్త్రీ.. హింస నుంచి తప్పించుకోవడానికి దాగి ఉంటారు' అని తను చెప్పిన సమాధానంలో తాత్వికత కొద్దిగా అర్థం అయినట్లుగా..

ఈ రోజు తను నడుస్తుంటే..

ఆమె కళ్లు ఆ చీకటిని చీల్చడానికి వెళ్లే ఓ వెలుతురు కిరణంలా..

తన మాట నిశ్శబ్దాన్ని కదిలించే ఆది ప్రణవ నాదంలా..

ఆమె చూపు అగ్నిపర్వతం వెదజల్లే ఎర్రని వెచ్చని లావాలా..

ఆ ప్రశాంత తీరంలో సాగిపోతున్నది.

అనంత సంఘర్షణలను, సంవేదనలను, సంచలనాలను అనాదిగా అనుభవిస్తూ.. అధిగమిస్తూ నిలుస్తున్న ఆటుపోటుల సముద్రంలా.. నేను కూడా ఆమెను అనుసరిస్తున్నా.

దూరంగా.. నింగీ – నేలా కౌగిలించుకుంటున్నాయి.

ఎత్తుగా.. నీరు – సూర్యుడు ముద్దాడుకుంటున్నాయి.

ఎగురుతున్న రెండు పక్షులు.. మరింత పైకెగిరి ఒకటిగా, ముద్దగా కనిపిస్తున్నాయి.

## పద్మజ బొలిశెట్టి

పద్మజ బొలిశెట్టి స్వస్థలం మంచిర్యాల. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఎక్కువగా కవిత్వం రాస్తుంటారు. 30కి పైగా దేశ విదేశాల కవయిత్రుల కవిత్వాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. 'ది అన్‌టోల్డ్ సీక్రెట్స్ ఆఫ్ ఉమెన్ సప్రెషన్'.. రచయిత్రి మొదటి కథ. ఆఫ్రికా దేశాల్లో ఎక్కువగా కనిపించే.. 'ఖత్నా' అనే సాంఘిక దురాచారం ఆధారంగా ఈ కథ రాశారు పద్మజ. 'ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్ (ఎఫ్‌జీఎం) అనేది స్త్రీ జననేంద్రియ విచ్ఛేదం అనే క్రూరమైన దురాచారం. ఇది భారత్ సహా 30 దేశాలలో నేటికీ సజీవంగా ఉన్నది. 20 కోట్ల కంటే ఎక్కువమంది బాలికలు, మహిళలు ఈ ఎఫ్‌జీఎం దురాచారానికి బలయ్యారు. స్త్రీలకు సంబంధించిన సామాజిక రుగ్మతలను సమాజానికి తెలియజేసే ఒక చిన్న ప్రయత్నమే.. ఈ కథ ముఖ్య ఉద్దేశం' అని అంటున్నారు రచయిత్రి.



**రావుల పుల్లాచారి**
**9949208476**

# గడువు

తెల్లవారి మామూలుగా 4గంటలకు నిద్రలేచే బాలమల్లు, గత కొద్ది రోజులుగా, నలత నలతగా నిద్రపడుతుంటే 3గం. లేచి కూర్చుంటున్నాడు. మనసు నిండా ఆలోచనలు, ఆందోళన కలుగుతుంటే, వాటి నుండి కొంత ఉపశమణం పొందడానికి, ఇంటి ముందు, ఉన్న వ్యాయమ శాలలోకి తలుపు తీసుకొని వెళ్ళాడు. వ్యాయమశాలతో స్విచ్ వేశాడు, వెలుతురు ఎక్కువ ఇవ్వని నాలుగు బల్బులు, ఆ ప్రాంగణం అంతా గుడ్డివెలుగులు నింపాయి, గోడకు వేలాడుతున్న తన గురువు పహిల్వాన్ వెంకన్న ఫోటోను దండం పెట్టుకొన్నాడు. పేయ్యి మీద ఉన్న బనియన్ విప్పి, కట్టుకొన్న దోవతిని లంగోటిలా సవరించి కట్టుకున్నాడు, స్వరం సవరించుకొని, ఒకటి ..రెండు.. అంటూ హనుమాన్ దండీలు చేయడం ప్రారంభించాడు. అలా యాభైవరకు చేశాడు, స్టూల్ మీద ఉన్న టవల్‌తో చేతులు తుడుచుకొని గోడకు నిలబెట్టి ఉన్న 'ముక్దార్స్'ను చేతుల్లోకి తీసుకొని, జబ్బ కండరాలు అదురుతుంటే గుండ్రంగా తిప్పాడు. కొంత సేపు సవ్యంగా, మరికొంత సేపు వ్యతిరేఖ దిశగా తిప్పాడు, అలా అరగంట వరకు

చేశాడు. అలాగే యాభై కిలోల వెయిట్ లిఫ్టింగ్ చక్రాలను, నాలుగు, ఐదుసార్లు పైకి లేపుతు, అంతే నెమ్మదిగా కింద పెట్టసాగాడు, వీవైనన్ని బస్కీలు తీశాడు. అప్పటికి శరీరం చేమటతో నిండి పోయింది, తన గురువు బతికి ఉన్న రోజుల్లో ఇప్పుడు చేసిన ఫీట్స్ అన్నింటినీ రెట్టింపు సంఖ్యలో చేసేవాడు, అప్పటి వయసు లేదు, ఇప్పటి వయసు పైబడ్డ రోజులు వేరనిపించింది. తాను అరవై ఏళ్లు దాటినా ఈ మాత్రం చేస్తున్నందుకు మీసం మెలేసుకున్నాడు.

ఆరోజుల్లో తాను సాధించి, ర్యాకుల్లో భద్రపరుచుకున్న మెడల్స్‌ను గర్వంగా చూసుకొన్నాడు.

ఒకటే ఏమిటి జిల్లాల్లో, రాష్ట్రాల్లో, నేషనల్, ఇంటర్నేషనల్‌లో జరిగిన కుస్తీ పోటీల్లో పొందిన కప్పులను, బిరుదులను వరుసగా అమర్చుకున్నాడు, వాటన్నింటిని

రెండు చేతుల్తో ప్రేమగా పుణికి చూసుకొన్నాడు.

ఆనాడు తనను పెద్ద పహిల్వానుగా ప్రభుత్వం గుర్తించి, రాష్ట్రపతి చేతుల మీదుగా పెద్ద

షీల్డ్ అదుకొంటున్నపుడు తీసుకొన్న ఫొటోను ఫ్రేం కట్టించి వ్యాయమశాలలో ఎదురుగా పెట్టాడు, తదేకంగా ఫొటోను చూసిన బాలమల్లు, చేతి కండల్ని బొమ్మ బాగాల్ని చిత్రంగా ఎగిరించాడు.

అప్పటికి ఏడుగంటలు అయ్యింది, వ్యాయామశాలకు ఉన్న ద్వారం మూసి, దొడ్లోకి వెళ్లాడు. అక్కడ మాటకు కట్టిన ఆవులు, తన రాక కోసం ఎదురు చూస్తున్నట్టు ఉన్నాయి.

తన భార్య వసంతలక్ష్మి చనిపోయిన తరువాత, వాటి ఆలనా, పాలనాతో పాటు, పాలు పితకడం బాలమల్లు చూసుకొంటున్నారు, రెండు ఆవుల పాలు పెద్ద సర్వలో పిండుకొని, ఇంట్లోకి వెళ్ళి, దంతదావడం చేసుకొని లీటర్ పాలు తాగి బయటకు వచ్చేసరికి పూర్తిగా తెల్లవారింది. ఇంటి ముందు వరండాలోని బల్ల మీద హరహాసనం వేసుకొని సాధన చేస్తున్న మనిషిలా కూర్చున్నాడు. అలా కూర్చున్నప్పుడల్లా, అతని మనసు నిండా, గతం మెదులుతు ఉంటుంది తమది ప్రధానంగా వ్యవసాయ కుటుంబం అయినప్పటికి, తాత, తండ్రి నుండి కూడ వహిల్వాన్ వంశంగా ఆ చుట్టు పట్ల గ్రామాల్లో పేరు పొందింది.

తండ్రి స్థాపించిన వ్యాయమశాలలోనే, వ్యాయమ విద్యల్లోని కర్రసాము, కుస్తీ పట్లు నేర్చుకున్నాడు. దానికి తోడు శరీర ధారుడ్యాన్ని పెంచుకొన్నారు. తల్లి చనిపోయిన తర్వాత, ఊల్లో ఉన్న బడిలో పదవ తరగతి వరకు చదువుకొని ఒదిలేశాడు.

తనకు 'ఇరవై ఏళ్ళు దాటగానే, మా అమ్మ తమ్ముడు, నా మేన మామ కూతురు . వరలక్ష్మీతో పెండ్లి జరిపించారు. మూడు ఎకరాల భూమి మా ముగ్గురి జీవితాలకు ఆధారమైంది.

వరలక్ష్మికి వ్యవసాయ మెలకువలన్ని తెలుసు కాబట్టి, అన్నీ ఆమే అయి,

వ్యవసాయం

నడిపించింది, అప్పటి వరకు నాకు బతుకు, తేలికగానే కనిపించింది.

మాకు వరుసగా ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. ఆ సమయంలో, నాయన వరలక్ష్మీ తోడు ఉంటు కుటుంబాన్ని ఈడ్చుకు వచ్చారు. నాయన కాలం చేసిన తర్వాతనే, సంసార భారమంతా తన మీద ఒరిగింది, తనకు వచ్చిన పహిల్వాన్ విద్యతో కుటుంబాన్ని నెట్టుకు రావడం ఎలా అనే భయం ప్రారంభం అయింది.

వరలక్ష్మీ తనను ఏనాడు, మీరేం పనిచేస్తలేరు, ఇంత సంసారాన్ని ఒక్కదాన్ని ఎలా

లాగించాలని, వరలక్ష్మీ తనను నిలదీయకపోవడం కూడా తనకు అవమానంగా అనిపించసాగింది.

ఆమెకు పోలాల్లో ఏదైనా సాయం చేద్దామని పొలాల్లోకి వెళితే, నువ్వు ఎం చేస్తావయ్యా, నువ్వు పెద్ద పహిల్వానవుగదా!! అలా వెళ్ళి గట్టు మీద కూర్చో అనేది చిన్నగా నవ్వుతు.

వరలక్ష్మీ అలా అన్నప్పుడుల్ల, తన మీద ప్రేమతోనా ! లేక ఎకసెక్కంగా నా ? ఆనేది తనకు అర్థం కాకపోయేది, నేను ఏ సాయం చేద్దామనుకున్నప్పటికీ నా సాయాన్ని అంగీకరించేది కాదు! బహుశా నా మీద ఉన్న అభిమానమేనని అర్థం అయింది. సంసారం గడవడానికి తాను కూడా కొంత సంపాదించాలనుకున్నది. ఒక రోజు బాగా ఆలోచించుకొని, విశేష ప్రజాధారణతో వరంగల్‌లో ఆడుతున్నా జెమినీ సర్కస్‌లో చేరాలని వెళ్లాడు. సర్కస్ మెనేజర్ బహద్దూర్ సింగ్‌ను తెలుసుకొని, తాను గెలుచుకున్న పతకాలు, రాష్ట్రపతి రివార్డు చూపించి దానికి తోడు తన శరీరంలోని కండరాలన్నింటిని, వివిధ భంగిమల్లో ప్రదర్శించి చూపించాడు.

బాలమల్లును పరీక్షగా చూసిన బహద్దూల్ సింగ్, మంచి యువకుడు, దానికి తోడు శరీర సౌష్టం గలవారు అనుకొని తన సర్కస్‌లో పహిల్వాన్‌గా నియమించుకుంటే మంచి

ఆకర్షణగా ఉంటుందని భావించి వెంటనే ఒప్పుకొన్నాడు, బాలమల్లు అడిగినంత జీతం కూడా ఇస్తానన్నాడు. జెమినీ సర్కస్‌లో బాలమల్లు చేస్తున్న పట్లు అన్నీ, పిల్లల్ని పెద్దల్ని బాగా ఆకర్షిస్తుంటే, సర్కస్ పహిల్వాన్ పేరు సంపాదించుకొన్నాడు.

సర్కస్ వాళ్ళతో రెండు మూడు రాష్ట్రాలు కూడా తిరిగాడు. నెలనెలా వచ్చే జీతం ఇంటికి పంపేవాడు. వీలైనప్పుడల్లా ఇంటికి వచ్చి పిల్లల్ని చూసుకొనేవారు.

ఇది కొంతకాలం బాగానే గడిచిపోయింది, వన్యప్రాణుల సంరక్షణ అంటూ ప్రభుత్వం

తీసుకు వచ్చిన చట్టం వల్ల సర్కస్‌లోని మగాల్ని, ఏనుగుల్ని ప్రభుత్వానికి అప్పగించారు.

వెను వెంటనే సర్కస్ మూతపడి పోయింది. తనలాంటి ఎందలో కళాకారుల బతుకులు బజారు పాలయ్యాయి, కొంత మంది కళాకారులు తమకు వచ్చిన విద్యలను

నగర కూడళ్లలో ప్రదర్శనలు ఇచ్చుకొంటు బతుకు గడపసాగారు.

ఏది కూడా ఎంతో కాలం సాగలేదు, కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే, అదో విషాధగాథ అనిపిస్తుంది.

సర్కస్ విద్యలన్నింటిని ప్రజలు పూర్తిగా నిరాదరించండం వల్ల అన్నీ మూతపడిపోయాయి. సర్కస్ గురించిన విశేషాలను, ఈనాటి తరానికి కథలు కథలుగా చెప్పాల్సిన పరిస్థితి

ఏర్పడింది అనేది పెద్ద విషాదంగా మారిందనిపిస్తుంది బాలమల్లుకు.

మూడునాళ్ళ ముచ్చటగా ముగిసిపోయిన తన సంపాదన వల్ల తిరిగి ఇల్లు చేరాడు.

తనకు తన కుటుంబానికి ఇంత తిండి పెట్టలేని తన విద్య మీద హేవగింపు కలిగింది.

కాని, కోడిరామకష్ణా, ధారాసింగ్ లాంటి యోధుల్ని ఆదర్శంగా తీసుకొని సాగాలనుకొన్న తన ధడ నిశ్చయాన్ని సడలనివ్వలేదు.

కొంతమంది యువకుల్ని తన వ్యాయమశాలలో చేర్చుకొని, వాళ్ళకు శిక్షణ ఇస్తు, కొంత

ఉపాధి సంపాధించుకోవడం ప్రారంభించాడు. బాలమల్లు నేర్పించే, విద్యల్ని శిష్యులు కూడ శ్రద్ధగా నేర్చుకొని, ఇంటర్వ్యూలకు వెళ్ళి, పోలీస్ ఆఫీసర్లుగా, వ్యాయామ ఉపాధ్యాయులుగా, ఎందరో ఉద్యోగాలు సాధించుకొని బాలమల్లుకు పెద్ద మొత్తంలో పారితోషకం ఇచ్చుకొని ఘనంగా సన్మానించుకొనేవారు.

ఇప్పటికి తన శిష్యులు, ఎంతో అభిమానం చూపిస్తూనే ఉన్నారు.

తనకు కష్టకాలం వచ్చిందని కాలం ఆగలేదు, రెండు ఎకరాలు అమ్ముకొని, ముగ్గురు ఆడ పిల్లల పెండ్లిళ్లు చేశాం. వరలక్ష్మి నేను సంతోషంగా ఉన్నాం. ఆసంతోషం ఎంతో కాలం నిల్వ లేదు.

ఇంతలోకే వరలక్ష్మి తీవ్ర జబ్బుపడింది.

ఆమెకు వచ్చిన 'భోగం ఏమిటో తెలియక ముందే ఉన్న ఎకరం భూమి కూడ అమ్మక తప్పలేదు

ఇవన్నింటిని గమనిస్తున్న వరలక్ష్మీ ఒకరోజు తనతో అంది. "ఏమయ్యా నన్ను పట్టుకొని ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా నా, వ్యాధి ఇదీ అని డాక్టర్స్ చెప్పలేక పోతున్నారు. పిల్లల పెండ్లిళ్ళు చేశాము నాకా తప్తచాలయ్యా ... నా కోసం నువ్వు మరింత పైసలు ఖర్చుపేడుతు, అప్పుల పాలుకాకు. నేను బతికి బట్ట కట్టేలా లేను, దండం పెడతాను, నువ్వు మాత్రం అప్పులు చేయకు అంటు ప్రాధేయపడింది. వరలక్ష్మీ నన్ను భర్తగా నా కర్తవ్యం నన్ను చేయనియి, నా బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు అవుతుంది ఆమెను ఒప్పించాలని అన్నాడు.

"సుతరాముగా నా నోరు మూస్తూ, నువ్వు నా కోసం చాలా చెశావయ్యా, నిన్ను చేసుకొని

నేను సుఖపడ్డాను కాని, నువ్వు నన్ను చేసుకొని సుఖపడలేదయ్యా... నా మాట నమ్ము,

నన్ను, నిలువరిస్తూనే కన్ను మూసింది,

వరలక్ష్మి అంతరంగా వెళ్ళి పోయినందులకు, బాలమల్లు కంటి నుండి చుక్క కన్నీరు రాలేదు.

కాని గుండె గాయమయింది.

ఆలోచిస్తున్న కొద్ది గతం అంతా చిక్కుపక్ష దారపు ఉండలా ఉంది. దాని లో నుండి

ఏ పోగు లాగినా, నిరాశజనకంగానే ఉంది, ఏ ఒక్కటి ఆశా జనకంగా ముందుకు సాగడం లేదు.

ఆలా ఉంటేనే బతుకు అవుతుందేమో, అనుకొన్నాడు, బాలమల్లు నిర్లిప్తంగా అప్పుడే బుల్లెట్ బండి మీద వచ్చిన, బాలమల్లు ప్రియ శిష్యుడు ముకుందం అంత దూరం నుండే దండం పెడుతు వచ్చాడు. ముకుందాన్ని కళ్ళతోనే పలకరించి, చేతితో ఆహ్వానిస్తు, కూర్చోమంటు కుర్చీ చూపించాడు. 'ఆ! చెప్పు ముకుందం నువ్వు వెళ్ళిన పని ఏమయింది' అంటు అడిగాడు బాలమల్లు

స్కూల్ హెడ్ మాస్టర్ గారిని కలిశాను, మీ స్కూల్‌లోని పిల్లల కోసం, మా గురువు.

పహిల్వాన్ బాలమల్లు గారి ప్రోగ్రాం ఏర్పాటు చేయండి, మీ పిల్లలు వద్ద నుండి తల రూ.యాభై వసూలు చేసి ఇచ్చినా, మా గురువు గారిని ఆదుకున్నవారు అవుతారని అడిగాడు దోరా!

ముకుందం గారు మీరు ఇంతగా చెప్పాలా! ప్రతి ఏడాదిలాగానే, ఈ సంవత్సరం కూడ

వారి ప్రోగాం ఏర్పాటు చేసే వాడిని కాని, మా స్కూల్ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

అందుకే ఈసారి, బాలమల్లు గారి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయలేక పోతున్నాము, దయ చేసి గురువుగారిని ఏమి అనుకో మానండి, అంటూ ప్రాధేయపడ్డాడు దొర. వినయంగా చెప్పాడు "ఫర్వాలేదు ముకుందం బాధ పడకు" అంటు ధర్మంగా ఒక నిట్టూర్పు విడిచి, నొసల్ని మూసి వేళ్లతో రుద్ది మెల్లగా అన్నారు.

"స్థిరమైన ఉపాధిని ఇవ్వలేని ఏవత్తిలో కూడ, మనిషి చివరంట కొనసాడలేడని ఇప్పుడు అనిపిస్తుంది. ముకుందం.

దొరా! అంత మాట అనకండి, మీకు లభించిన అవార్డులను, రివార్డులన్నింటిని చూస్తూంటే, మీ శిష్యులమైన మేము ఎంతో గర్విస్తుంటాము దొర' గొప్పగా అన్నాడు ముకుందు.

వద్దు ముకుందం, ఈ కష్ట కాలంలో నువ్వు నాకోసం వెన్నంటి ఉంటున్నావు, అది చాలు. తటపటాయించిన బాలమల్లు, కుర్చీలో సర్దుకు కూర్చుంటు "ముకుందం.. నేను చాలా మంది దగ్గర అప్పు చేశాను, పాపం వారికి వడ్డీ కూడా కట్టలేకపోతున్నాను. వారంతా నా మీది గౌరవంతో అడగలేకపోతున్నారనిపిస్తుంది. వారు డబ్బు అడగకుండా నన్ను మౌనంగా హిసిస్తున్నారనిపిస్తుంది...! గద్గద స్వరంతో అన్నాడు బాలమల్లు.

"అయ్యో! గురువుగారు, వారంతో నన్ను కలుస్తూనే ఉన్నారు, వడ్డీ గురించిన ప్రస్తావన

ఏమి తేవడం లేదు ... వారంతా ఒక నిర్ణయానికి వచ్చారట" నసుగుతు చెప్పాడు ముకుందం ' ఏమిటి? నిన్ను కలుస్తున్నారా!' ఆశ్చర్యంగా ముకుందం వైపు చూశారు.

" అవును, వడ్డీ పైసలు మీనుండి ఆశించడం లేదు, అసలు ఇస్తే చాలంటున్నారు దొరా !'

"అయితే, నా మీద సానుభూతి చూపిస్తున్నారా! ముకుందం ... అది నాకు నచ్చదు.

ఇప్పటికీ నేను వారి దష్టిలో ఒక మెట్టు దిగజారననిపిస్తుంది, ఇది నేను భరించలేము....

నేను ఏమైనా ఫర్వాలేదు, వారి వద్ద నుండి ఏ మాట చెప్పి డబ్బు తీసుకొన్నానో...

తిరిగి ఇచ్చె అపుడు కూడ ఆ మాట ప్రకారమే ఇస్తాను,

రేపు ఒకసారి వారిని తీసుకోనిరా! మాట్లాడాలి". ముకుందం'అంటు మౌనంగా

లోపలకు వెళ్ళాడు...

ముకుందం మర్నాడు ఉదయమే, బాలమల్లుకు అప్పు ఇచ్చిన నలుగురు వ్యక్తుల్ని తీసుకువచ్చారు. వారందరిని సాదరంగా లోపలకు ఆహ్వానించిన బాలమల్లు తన ముందు కూర్చోపెట్టుకున్నాడు. కాని, ఎవరు ఏమి మాట్లాడలేక పోతున్నారు.

బాలమల్లు ఆ గంభీర క్షణాల్ని ఛేదిస్తూ గొంతు విప్పాడు.

మీరు నాకు అప్పు ఇచ్చి ఆపత్కాలంలో నన్ను ఆదుకున్నారు. మీ అప్పును వడ్డీతో సహా త్వరలోనే తీర్చుకుంటాను నన్ను నమ్మండి !" గొంతు తడబడుతూ మెల్లగా అన్నాడు.

"దొరా! మీకు దండం పెడతాము, మాకు వడ్డీ వద్దు, అసలు ఇవ్వండి చాలు అంటూ ముకుందం ముందు కూర్చున్న వ్యక్తి అన్నాడు.

'అయ్యా! అమ్మగారు బతికి ఉన్నపుడు, మేము, మీకు డబ్బులు ఇచ్చాము, అమ్మగారు

చనిపోయి కూడ మూడు సంవత్సరాలు దాటి పోయాయి,

మాకు కూడా అవసరాలు ఉంటాయి.

ఇపుడు ఇస్తేనే బాగుంటుంది, మరో పక్కన కూర్చోన్న వ్యక్తి ఇదే అదనంగా

భావించి గట్టిగానే అడిగాడు.

ఇస్తారు...

మా గురువుగారు, మీ అందరి డబ్బులు

...... బతిమాలుతు అన్నాడు ముకుందం

మన ఊరి పెద్ద పహిల్వాను కదా! వారి నుంచి మాకు ఎలాంటి వడ్డీ అవసరం లేదు. దయచేసి మా అసలు మాకు ఇప్పించండి చాలు..! "వచ్చిన వారిలో మరో ఇద్దరు ముందుకు వచ్చి అన్నారు.

" ఆగండి! నాకు వడ్డీ మాఫీ చేయవలసిన అవసరం లేదు. నాకు ఒక రెండు నెలల గడువు ఇవ్వండి, వడ్డీ, అసలు ఇస్తాను' అర్థింపుగా ఆడిగాడు బాలమల్లు.

"ఇప్పటికే టైం చాలా ఇచ్చాము, ఈ రోజు డబ్బులు ఇస్తే వెళ్ళిపోతాము దొరా!

ముకుందం కంగారుపడిపోతు 'గురువుగారు ఇస్తానంటున్నారుగా, రెండు నెలలు ఓపిక పట్టండి ప్లీజ్.. అంటూ వాళ్లను బతిమిలాడసాగారు. 'లేదు మాకు డబ్బులు కావాలి! మీ గురువుగారికి చెప్పి ఇప్పించు ముకుందం అంటున్న వాళ్ళను చూస్తున్న బాలమల్లులో మొదటి సారి అవమానభారంతో, పళ్ళు పట పటలాడుతు, పిడికిళ్ళు చిగించుకున్నాయి, ఎంతో కష్టంగా తమాయించుకొన్నాడు, అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా లోపలకు వెళ్ళాడు.

చేతుల నిండా తనకు వచ్చిన గోల్డ్ మెడల్స్‌ను, రజత పతకాలను, మరికొన్ని పెద్దపెద్ద కప్పులన్నింటిని పట్టుకు వచ్చి వాళ్ళ ముందు పెట్టాడు.

" ఇవన్నీ....

నేను గెలిచి సాధించిన బంగారు, వెండి పతకాలు, వీటన్నింటి విలువ లక్షల్లో ఉంటుంది, మీలో ఎవరికి, కావలసింది, వారు తీసుకువెళ్ళండి.

'అయ్యా ! అవన్ని మీరు సాధించుకొన్న ఎంతో విలువైన పతకాలు, కావచ్చు, కాని ఆవన్ని మేము సంపాదించుకొన్న మా డబ్బుకు సరిరావయ్య !

"అవన్నీ మాకు అక్కర లేదు, మాకు కావలసింది, డబ్బు' ముక్త కంఠంతో అన్నారు, ఊహించని మాటలు విన్న బాలమల్లు ఎంతో భావోద్యోగానికి లోనవుతు, నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ముకుందం వేరు పేరునా వేడుకొంటు, మా గురువుగారు అడిగిన వాళ్ళందరిని సమయం ఇవ్వండి! నన్ను నమ్మండి.. పెద్దాయనను ఇచ్చింది పెట్టకండి!' మీరు వెళ్ళండి'

అంటు వేడుకొన్నాడు.

'మీ దగ్గర డబ్బు అ తీసుకొన్నది నేను నేను చెప్పిన గడువులో మీ డబ్బులు మీకు అప్పజెపుతాను." అంటు చేతులు జోడించబోయిన బాలమల్లు రెండు చేతుల్ని, ఆ వచ్చిన వారే చేతులు కలపకుండా ఆపారు."

ఆకస్మికంగా చేతులు జోడించి దండం పెట్టపోయిన బాలమల్లు పనికి, అప్పులవారు ఉగ్ర్భాంతి చెందుతూ బాలమల్లు మొహంలోకి సూటిగా చూడలేక పోతు...

'సరే, దొరా! మీరన్న గడువులో మాత్రం తప్పకుండా డబ్బులు ఇవ్వండి" అంటూ ఒకరొకరుగా వెళ్ళిపోయారు.

గురువుగారు, మీరు ఇంత అధైర్యపడిపోతు వాళ్ళకు దండం పెట్టబోతుంటే, నేను చూస్తు తట్టుకోలేక పోయాను, అంటూ ముకుందం బాలమల్లు దగ్గరగా వెళ్ళాడు.

ముకుందాన్ని బాలమల్లు గట్టిగా కౌగలించుకొంటు..

ముకుందం, నేటినుండి నేను ఒక నిర్ణయానికి వచ్చాను, వాళ్ళ డబ్బు చెల్లించేవరకు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో, లారీల్లోని ధాన్యపు బస్తాలను, లోడ్, అన్ లోడ్ చేస్తాను స్థిరంగా అన్నాడు.

గురువుగారు, మీరు బస్తాలు మొస్తారా! కండ్లల్లో నీళ్ళు తిరుగుతుంటే గద్గదికంగా అన్నాడు ముకుందం,

బాధపడకు ముకుందం, ఇన్నాళ్లు నేను పెంచుకొన్న కండల్లో సత్తువ ఉంది. నేను నమ్ముకున్న శరీర ధారుఢ్యం ఉంది, వంద కేజీల బస్తాలు మోయడం ఒక లెక్క కాదు ముకుందం .. మొహం మీద ముసిరిన సన్నటి చెమట చుక్కల్ని తుడుచుకుంటూ అన్నాడు. "ఇంత కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నారు గురువుగారు, మీ తప్పు మీ శిష్యులమైన మేమంతా కలసి తీర్పుతాము, దయచేసి, మీరు నిశ్చింతగా ఉండండి" అన్నాడు

'వద్దు ముకుందం, నేనే తీర్చుకొంటాను. కానీ, నా కున్న అనుమానం ఒక్కటే.. భగవంతుడు ఆ ఆయుష్షును ఇచ్చిన గడువులోపల నేను వీళ్లందరికీ అప్పు తీర్చడానికి పెట్టిన గడువు ముందు వస్తుందోనని అర్థం కావడం లేదు... కంపిత స్వరంతో తాను అనుకొన్నా మాటలు యాదచ్ఛికంగా పైకి అనేశాడు బాలమల్లు భయం భయంగా..

## రావుల పుల్లా చారి

స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజురాబాదు. తల్లి తండ్రులు ఈశ్వరమ్మ రావుల దశరథం. 1950 లో న్మించారు. బి.కాం. తర్వాత నీటి పారుదల శాఖలో ఉద్యోగంలో చేరారు. వివిధ హోదాలో పనిచేసి 2008 లో సూపరింటెండెంట్ గా పదవీ విరమణ పొందారు. . అంతకుముందు నుండే సాహిత్యం వైపు అడుగులేశారు. కవితలు, కథలు, నాటక రచనలు మనసు పెట్టి రాయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు ఇరవై నాటికలతో పాటు బెత్తెడు జాగ " కథా సంపుటి నాలోకి" . వ్యాస సంపుటి " వాళ్ళిద్దరు కవితా సంపుటి " ప్రచురించారు. జంతువులే ప్రధాన పాత్రలుగా ఎంచుకొని కథలను రాశారు. రచ్చబండనాటిక 2016 లో నిర్వహించిన 20వ నంది నాటకోత్సవాల్లో ప్రదర్శితమై రెండు తెలుగు రాష్ట్రాలకుగాను ద్వితీయ రచనగా నంది అవార్డును అందుకన్నారు. 2014 లో తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ రచయిత అవార్డు తో సన్మానించింది.

# నిరుపేద



**సూర్యప్రసాద్ రావు**
**9885156844**

ప్రపంచ ప్రసిద్ధి చెందిన మా మల్టీనేషనల్ కంపెనీ రజతోత్సవ సంబరాల సంరంభాలు ప్రారంభమైనాయి. దేశమంతా విస్తరించిన అన్ని శాఖల ఉద్యోగులకు, మా అభయ ఛారిటబుల్ ట్రస్ట్ భాగస్వాములకు ఆ ఆరురోజుల పండుగే! విందులూ వినోదాలు చర్చలు, సెమినార్లు, భవిష్యత్ ప్రణాళికా రచనలలో కాలమే తెలియడం లేదు. ఉదయం తొమ్మిది గంటలకే అల్పాహార విందు తరువాత ప్రారంభమయ్యే సమావేశాలు ఇండోర్ ఎ.సి. ఆడిటోరియం అలుపూ సొలుపూ తెలియనీయడం లేదు. సామూహిక వివాహ వేడుకల్లా, సామూహిక వ్రత నిర్వహణా విధానాల్లా పాల్గొనే వారిలో నూతనోత్సాహం నింపుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం ఒంటిగంటకు దేశీయ వంటకాలతో షడ్రసోపేతమైన విందుభోజనం ఓ గంట కునుకు ప్రసాదించి తీరుతుంది! అందుకే మధ్యాహ్నం నాలుగు గంటలకు మొదలై స్వల్ప టీ విరామంతో రాత్రి తొమ్మిది గంటలకు ముగుస్తున్నాయి!

ఛైర్మన్ గారి పర్సనల్ సెక్రటరీగా రజతోత్సవ సంబరాల నిర్వహణ బాధ్యతలన్నీ నా భుజస్కంధాలపై వేసుకొని పదిమంది అసిస్టెంట్ల సహాయంతో ఆ మహోత్సవాలలో ఎట్టి లోపాలు రాకుండా చూడడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాను. ఆరు రోజుల కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి.

ఆ ఆరు రోజుల కార్యక్రమాలు రూపొందించడంలో, సాహితీ, సాంస్కృతిక మనోవైజ్ఞానిక, మనోరంజక ప్రోగ్రాములతో

అతిథులనందరినీ అలరించినందులకు, మానసికోల్లాసం కలిగించినందుకు ఛైర్మన్‌గారు నన్ను అభినందించారు. ఎక్కడా విసుగూ విరామం లేకుండా, ఠంచనుగా అనుకున్న సమయానికి తగిన విధంగా, ఎవ్వరినీ నొప్పించక నేను నొచ్చుకోకుండా నిర్వహించిన కార్యక్రమాలకు అతిథుల ఆదరణ అందుకున్నాను. అందులో నాతో పాటు కలిసి పనిచేసిన సి.ఇ.వో పాత్ర ప్రముఖంగా ప్రశంసించదగింది! అందుకే ఆరు రోజులు ఆరు క్షణాల్లో అయిపోయాయనిపించింది!

ముగింపు సమావేశం ఛైర్మన్‌గారి అధ్యక్షతన ప్రారంభమై అతిథుల అంతరంగ ఆవిష్కరణకు అవకాశమిచ్చింది. కంపెనీ విధి విధానాలపై, నడుస్తున్న భవిష్యత్ కార్యక్రమాలపై అనుభవాలు వివరించమని ఆహ్వానించబడ్డాయి.

"మా కంపెనీ హితులకు, సన్నిహితులకు, శ్రేయోభిలాషులకు, నిర్వహణలో ప్రము-ఖపాత్ర వహించే నిర్వాహకులకు, తమ శక్తి సామర్థ్యాలతో మన సంస్థను ఈ స్థాయికి తెచ్చిన ఉద్యోగ మిత్రులందరకూ స్వాగతం! సుస్వాగతం! శుభ స్వాగతం!

పాతిక సంవత్సరాల క్రితం చిన్న వ్యవస్థగా ప్రారంభమైన మన కంపెనీ ఆర్థిక వ్యవహారాలు, పెట్టుబడులు, షేర్‌లు, లావాదేవీలు అనూహ్యంగా పెరగడం ప్రారంభించి సుమారు పదిహేను సంవత్సరాలైంది! అప్పటి వరకూ నత్తనడక సాగిన షేర్లు, లాభాలు, లాభాల వాటాలు దినదిన ప్రవర్ధమానంగా పెరగడం ప్రారంభించాయి. ఎందరో ఔత్సాహికులను ఆకర్షిస్తున్నాయి. సామాజిక సేవను ప్రోత్సహిస్తున్నాయి. ఈ సందర్భంగా మిమ్మల్ని మనసు విప్పి మాట్లాడమని, మీ అమూల్యమైన, నిర్మాణాత్మకమైన సలహాలతో, సూచనలతో మన బంగారు భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు వేయవలసిందిగా ఒక్కొక్కరిగా వేదిక మీదకు ఆహ్వానిస్తున్నాను".

నా స్వాగత వచనాల తరువాత ఒక్కొక్కరు వేదిక మీదకు వచ్చి తమ అమూల్యమైన అంతరంగాలను ఆవిష్కరించడం ఆరంభించారు. "మిత్రులారా! కంపెనీ ప్రారంభమైన దగ్గరనుండీ మనలో కొందరం భాగస్వాములుగా ఉంటున్నాం! పి.యమ్. చెప్పినట్లుగా పదిహేను సంవత్సరాల నుండీ షేర్ల విలువ బాగా పెరిగింది. అభయ ఛారిటబుల్ ట్రస్ట్ భాగస్వామ్యానికి ఎందరో ముందుకు వస్తున్నారు. మన కంపెనీలో షేర్లు కొనాలని ఎందరో తహతహలాడుతున్నారు. దానికి కారణం ఛైర్మన్ గారు చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు! మురికివాడలను బాగు చేయడంలో, స్కూళ్ళను స్థాపించడంలో, నిర్వహించడంలో, వారికి కనీస అవసరాలు సమకూర్చడంలో మనల్ని భాగస్వాములను చేస్తున్నారు. కనుకనే మనం కూడా చిత్తశుద్ధితో భారీ పెట్టుబడులు పెడుతున్నాము. ఫలాలు రాబట్టుతున్నాం!" ఒకరు భాగస్వామ్యం వివరించారు.

"డియర్ ఫ్రెండ్స్! కంపెనీ భాగస్వామ్యం గొప్పదా... మన అభయ ఛారిటబుల్ షేర్లు కొనడం గొప్పదా... అని ప్రశ్నిస్తే..." చెట్టుముందా... విత్తుముందా... అనే సామెత గుర్తుకు వస్తుంది. మేము రెండింటిలోనూ మా వంతు కృషి చేస్తూ ఆనందాన్ని

అనుభవిస్తున్నాం! కంపెనీ ఈ విధంగా దినదిన ప్రవర్ధమానంగా వర్ధిల్లాలని మనలాంటి వారెందరో మనతో చేయికలపాలని ఆశిస్తున్నాము!"

"మా కంపెనీ నిర్మించే పేదల గృహ సముదాయాలకూ, స్కూలు బిల్డింగ్‌లకూ, మరుగుదొడ్లకూ రాజీపడని నాణ్యత తగ్గని స్వల్పమైన లాభాలతో నిర్మించే అవకాశమిస్తున్న ఛైర్మన్ గారికి కృతజ్ఞతలు తెలపకుండా ఉండలేను!"

"అనాధ శరణాలయాల నిర్వహణకు, స్కూళ్ళల్లో మధ్యాహ్న భోజన పథకాలకు అవసరమైన అన్ని సంబారాలను సమకూర్చే అవకాశం కలిగించినందులకు ఛైర్మన్ గార్కి హృదయపూర్వక నమస్కారాలు సమర్పించుకొంటున్నాను!"

అభయ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న అనేక సామాజిక సహకార పునరుద్ధరణా కార్యక్రమాల్లో తమవంతు ఇతోధిక సహాయ సహకారాలందిస్తూ అత్యంత సంతృప్తిని, ఆత్మీయ అనుభూతిని తమ పొగడ్తల ద్వారా తెలియజేసిన భాగస్వాముల ఆనందాన్ని ఛైర్మన్‌గారు చిరునవ్వుతో స్వీకరించారు. అందుకు సమాధానం చెప్పమని సైగ చేశారు.

అందరి ఆత్మీయ భాషణలు పూర్తయిన తరువాత నేను తిరిగి మైక్ ముందుకు వచ్చాను. 'ఆత్మీయ అనుభూతులు పంచిన అందరికి కృతజ్ఞతా భివందనములు తెలియపరు-స్తున్నాను. ఇంతటి అమోఘమైన, అనూహ్యమైన నిర్మాణాత్మక కార్యక్రమాలు ప్రారంభం కావడానికి కారణం... ఒక ఆశ్చర్యకరమైన, నమ్మశక్యంగాని, ఒక అద్భుతమైన సంఘటన! అది జరిగి నేటికి సరిగ్గా పదిహేను సంవత్సరాలైంది. ఆ సంఘటన వివరించమంటే, సభికులంతా కోరుకుంటే నేను తప్పక వివరించుదా మనుకుంటున్నాను, అదీ... ఛైర్మన్‌గారి అనుమతితో!"....

క్షణం విరామమిచ్చి ఛైర్మన్ గారి వైపుచూచి ఆయన అంగీకారం తీసుకున్నాను. ఆ విరామాన్నే అతిధులు భరించలేకపోయారు. "చెప్పండి! ఏం జరిగిందో? ఏం జరిగిందో?" అతిధులంతా మూకుమ్మడిగా ఆసక్తిని చూపించారు. "ఒకసారి బిజినెస్‌టూర్‌లో ఉండగా... మార్నింగ్ వాకింగ్ తరువాత ఛైర్మన్‌గారు తమ పర్స్ పోగొట్టుకున్నారు. హోటల్‌కు తిరిగి వచ్చిన తరువాత తెలిసింది! పర్స్‌పోయిందని"!

"వాట్! ఛైర్మన్‌గారి పర్స్‌పోయిందా!" ఒకరు ఆశ్చర్యం ప్రకటించగానే ఒక్కొక్కరుగా తమ సంభ్రమాశ్చర్యాలు ప్రదర్శించారు. "అందులో ఎంతో విలువైన కరెన్సీ ఉండాలే!" "ఇండియన్ కరెన్సీయే కాదు.. డాలర్లు, పౌండ్లు ఉండి ఉండాలే!" "ఎన్నో కంపెనీల కార్డులు ఉండాలే!" "డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు ఉండాలే!" వారి రకరాల ప్రశ్నలతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే నేనందుకున్నాను... చిన్న సూచన చేశాను. ఆ సంఘటన యధాతధంగా వివరించాలంటే సభ నిశ్శబ్దంగా ఉంటే మంచిది!" అంతే! సభలో గుండు సూది వేస్తే వినిపించేంత నిశ్శబ్దం ఆవహించింది.

"నా పర్స్‌పోయింది... రాజేష్!" ఛైర్మన్ గారన్నారు. "ఎప్పుడుపోయి ఉంటుందంటారు?" "ఏమో! ఎప్పుడు పోయిందో గమనించలేదు. బహుశః మార్నింగ్

వాకింగ్ తరువాత పోయి ఉంటుంది!" ఆయన ఆలోచనలో పడ్డారు. 'ఈరోజు మురికివాడల్లో మార్నింగ్ వాకింగ్ చేశారు. అక్కడే పోయి ఉండాలి' ఆయనవైపు ప్రశ్నార్థకంగా చూశాను. 'అక్కడే పోయి ఉంటుంది రాజేష్! అయినా సాయంత్రానికి ఎవరో ఒకరు తెచ్చి ఇస్తారులే!' నిబ్బరంగా అన్నారు. నేను కంగారు పడ్డాను. 'సర్' అందులో వేల రూపాయలున్నాయి. ఫారిన్ కరెన్సీ ఉంది! ఎన్నో కార్డులు ఉన్నాయి! పోలీస్ కంప్లెయింట్ ఇద్దాము?' ఆయన అనుమతిని అడిగాను. "ఉన్నా... పరవాలేదు రాజేష్! ఎవరో ఒకరు తప్పకుండా తెచ్చి ఇస్తారు!" "నాకు నమ్మకం లేదు సర్! వెంటనే బ్యాంక్‌లకు ఫోన్ చేసి కార్డుల్ని బ్లాక్ చేయమని చెబుతాను, ఎకౌంట్స్ సీజ్ చేయమని చెబుతాను... ఫారిన్ కరెన్సీ వస్తే ఇన్‌ఫామ్ చేయమంటాను' కార్యాచరణ వివరించాను.

'లేదు రాజేష్! నాకు పేదరికం నిజాయితీ మీద నమ్మకం ఉంది! వారి పవిత్రమైన హృదయాల మీద ప్రగాఢమైన విశ్వాసముంది! వాళ్ళ కరుణాతరంగాల మీద అపనమ్మకం కలిగే అవకాశం లేదు. తప్పకుండా సాయంత్రం దాకా వేచి చూద్దాం! పర్స్ తప్పకుండా దొరుకుతుంది! అందులో మన ఫోన్ నంబర్లు అడ్రస్‌లున్నాయి. సాయంత్రానికి ఫోన్‌కాల్ తప్పక వస్తుంది!".

చైర్మన్ గారు నిర్లిప్తంగా విశ్రాంతి కోసం రూమ్‌లోకి వెళ్ళిపోయారు. పేదల అంతరంగాల మీద ఆయనకున్న అవ్యాజానురాగానికి, నిజాయితికి నాకు అమితాశ్చర్యం వేసింది! పర్స్ దొరకదని తెలుసు! ఏ చర్య తీసుకోవాలన్నా సాయంత్రం దాకా ఆగాలి!

ఆయన ప్రశాంతంగా హోటల్ రూమ్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు! నేను బయట కారిడార్లో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాను.సరిగ్గా ఐదు గంటలకు చైర్మన్ గారి ఫోన్ రింగయింది. స్పీకర్ ఆన్ చేశాను. "హలో" నేనే జవాబిచ్చాను.

"చైర్మన్‌గారి పర్స్ మా మురికివాడలో దొరికింది! మీరు వాడ చివరనున్న పబ్లిక్ ఫోన్ దగ్గరకు వస్తే అందచేస్తాను"అది ఓ పిల్లవాడి గొంతులా ఉంది. స్పీకర్‌లోంచి ఆ సంభాణంతా విని చైర్మన్‌గారు బయటకు వచ్చారు.

"వెళ్దామా... రాజేష్! నేను చెప్పానా... లేదా... తప్పకుండా నా పర్స్ దొరకుతుందని... అది సేఫ్‌గా తిరిగి నా చేతికి వస్తుందని" ఆయన ముఖంలో చిరునవ్వు అందంగా తొంగిచూసింది."అలాగే సర్! వెళ్దాం రండి!" మురికివాడ ముందు పబ్లిక్ టెలిఫోన్ ముందు కారు ఆపించాను. ఎదురుగా పర్స్ చేతితో పట్టుకున్న పిల్లవాడు కనిపించాడు. కారు ఆగిందో...లేదో... దిగిపోయి గబగబా ఆ పిల్లవాడి చేతిలో నున్న పర్స్‌ను లాక్కునేంత పని చేశాను.

క్షణంసంగంలో పర్స్‌ను ఓపెన్ చేసి పర్స్ విలువను అంచనా కట్టాను. నోట్లన్నీ యధాతథంగా ఉన్నాయి. ఫారిన్ కరెన్సీ సెఫ్‌గా ఉంది. ఇక బిజినెస్ కార్డుల గురించి చెప్పనక్కరలేదు. "పర్స్ సేఫ్‌గా ఉంది సర్!" ఆనందంతో ఆయన కందించాను. "ఉంటుందని అప్పుడే చెప్పానుగా!" నిర్లిప్తంగా అన్నారు. ఆ పిల్లవాడి వైపు ఎగాదిగా చూశాను. బాగా

మాసిపోయిన చొక్కా నిక్కరు. అక్కడక్కడా చిగురులు కనిపించకుండా మాసికలు వేసి ఉన్నాయి. తైల సంస్కారం లేని జుట్టు... నిరుపేదరికానికి నిలువెత్తు నిదర్శనంలా ఉన్నాడు. సుమారు పది, పన్నెండేళ్ళుండవచ్చు. వయసు తెలియడం లేదు.

ముందుగా నేను కారు ఎక్కబోతుంటే... ఆ పిల్లవాడన్నాడు. "అయ్యా!' అని పిలిచాడు... నేను కారు దిగి ఏమిటన్నట్లు చూశాను. 'నాకు కొంచెం డబ్బు కావాలి!" వినయంగా అడిగాడు. "చూశారా సర్! పర్స్ తిరిగి ఇచ్చినందుకు వెయ్యో, పదివేలో అడగబోతున్నాడు!' కళ్ళతోనే ఎక్స్‌ప్రెషన్ ఇవ్వగలిగాను. "ఎంత కావాలి బాబూ?" ఛైర్మన్ గారు మృదువుగా అడిగారు. 'ఒక్క రూపాయి ఇప్పించండి!" ఆ పిల్లవాడు మరింతవినయంగా అడిగాడు. 'ఒక్క రూపాయా?' నేను నిశ్చేష్టుడనైనాను. వాడిని, వాడి పేదరికాన్ని చులకనగా చూసినందులకు తలదించుకున్నాను. "ఎందుకు బాబూ?' చైర్మన్‌గారు వివరమడిగారు.

'అయ్యగారూ! పర్స్ దొరికినదగ్గర నుండీ మీ నంబర్‌కు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. మురికివాడలో ఫోనుండదుగా! తీరా పబ్లిక్ ఫోన్ దగ్గరకు వచ్చేసరికి రూపాయి అవసరమైంది. ఈ షాపువాడి దగ్గర రూపాయి అప్పు తీసుకొని మీకు ఫోన్ చేశాను. రూపాయి అతడికి తిరిగి ఇవ్వాలిగా! అందుకే రూపాయి అడిగాను. నాకీయనవసరం లేదు. ఆషాపు వాడికివ్వండి!'

సమాధానం కోసం ఎదురు చూడకుండా వాడు మురికివాడలో కలిసిపోయాడు. కథ ముగించి నేను సభికుల వైపు చూశాను. క్షణకాలం సంభ్రమాశ్చర్యాల నుండి తేరుకొనిన సభికులంతా ముక్తకంఠంతో ఒకే ఒక ప్రశ్నవేశారు. "తరువాతేమైందో చెప్పండి! మమ్మల్ని సస్పెన్స్‌తో అర్థాంతరంగా వదలి వేయకుండా మిగిలిన కథ చెప్పండి!" వారికి సమాధానం చెప్పడం కోసం ఛైర్మన్ గారివైపు చూశాను. "ఇప్పుడు మిగిలిన కథ నేను చెబుతాను...." ఛైర్మన్‌గారందుకున్నారు. "పేదవారి గురించి నేను చెప్పిన మాటలు నిజమైనాయి! ఆ పేద పిల్లవాడు రూపాయి తీసుకోకుండా యధాతథంగా నా పర్స్ తిరిగి ఇవ్వడం ద్వారా వారి నిజాయితీ నిరూపించబడింది. వారి కరుణాంతరంగాలు ఆవిష్కరించబడ్డాయి. వాళ్ళ పవిత్రమైన హృదయాలు, నిష్కల్మషమైన జాలి, దయ, సానుభూతి అవగతమైనాయి. అవి నాకంటే ముఖ్యంగా నా పి.యస్.రాజేష్ ముందు సాక్షాత్కరించాయి.

"షాపువాడికి రూపాయి ఇచ్చేసి ఆ పిల్లవాడిని అనుసరించమని వాడి వివరాలు సేకరించమని, వారి ఆర్థిక స్థితిగతులను అవగాహన చేసుకు రమ్మనమని మురికివాడకు పంపించాను. ఆ మురికివాడ పరిస్థితిని అంచనా కట్టి తిరిగి వచ్చేంతవరకూ అక్కడే ఉంటానని షరతు విధించాను.

సరిగ్గా అరగంటకు రాజేష్ తిరిగి వచ్చాడు. అతడు సేకరించిన వివరాలు వారి నిరుపేద జీవితాల స్థితిగతులు నా హృదయాన్ని ద్రవింపచేశాయి. ఆ రోజుకు సరిగ్గా ఆ పిల్లవాడి అక్క చనిపోయి పదిరోజులైంది. మరునాడు, పదకొండవ రోజు కనీసం

ముగ్గురికైనా అక్క ఆత్మశాంతికై అన్నం పెట్టాలని తండ్రీ కొడుకులు ఆశపడ్డారు. అందుకు కూడా డబ్బు దొరకలేదు. ఆ సమయంలోనే నా పర్స్ దొరికింది. అందులో డబ్బు ఖర్చు పెట్టి అన్నదానం చేయమని ఎందరో ప్రలోభపెట్టారు. కానీ వాడి నిజాయితీ అందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా నా పర్స్ క్షేమంగా నన్ను చేరుకొంది!" క్షణం ఆగి కథ కొనసాగించాడు.

"అప్పుడే ఆ మురికివాడను దత్తత తీసుకోవాలనిపించింది. వారికి కనీస సౌకర్యాలు కల్పించాలనిపించింది. ముఖ్యంగా మరుగుదొడ్లు కట్టించి, మురుగు పారుదల సౌకర్యాలు పెంచి ఆరోగ్యాన్ని హరించే దోమలు వైగరాలు నివాసం చేయకుండా చేయాలనిపించింది. ప్రాథమిక వైద్యశిబిరం నెలకొల్పాలనిపించింది. విద్య నేర్పడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలనిపించింది. అందులో భాగంగా మొట్టమొదటగా మరునాడు ఆ పిల్లవాడి అక్క దశదిన కార్యక్రమం సందర్భంగా ఆ మురికివాడలో అందరికీ ఆహారపు పొట్లాలు పంచి పెట్టమని, ఆవిధంగా అన్నదాన కార్యక్రమం చేయమని పి.యస్.ను ఆదేశించాను. ఆ క్షణం నుండి మన అభయ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించే కార్యక్రమాల్లో విప్లవాత్మకమైన పెనుమార్పులు కావాలని ఆశించాను. అందుకు అందరూ సహకరించారు. నెమ్మదిగా మురికివాడలు అభివృద్ధి చెందడం మనం కనులారా చూస్తూనే ఉన్నాం!"

ఛైర్మన్‌గారు ఉపన్యాసం ముగించి కూర్చుండిపోయారు. సభ నిశ్శబ్దం నుండి తేరుకునేలోగా పదిహేనేళ్ళ క్రితం ఆరోజు సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్‌గారి ప్రసంగ పాఠ సారాంశాన్ని సభికులకు జ్ఞప్తి చేశాను. "స్నేహితులారా! సమాజంలో ఉన్న వాళ్ళంటే గౌరవం... పేదవారంటే చులకన! ఉన్న వాళ్ళు ప్రలోభాలకు లోనుకారని, నిజాయితీ వారికి మాత్రమే ఉందని, ప్రగాఢమైన నమ్మకం! పేదవారంతా ఆశాపరులు, స్వార్థపరులు, నిజాయితీ లేనివారని, విశ్వాసం లేనివారని మన అంతరంగాలలో పాతుకుపోయింది.

ఈరోజు జరిగిన ఒక అద్భుతమైన సంఘటన ఆవిధంగానే ఆలోచించే రాజేష్ అంచనాలను పటాపంచలు చేసింది. లక్షల విలువైన నా పర్స్ దొరికినా ఒక్క రూపాయి కూడా ఆశించక కేవలం నాకు ఫోన్ చేసినందులకు అప్పుగా తీసుకున్న ఒక్క రూపాయిని మాత్రమే ఇవ్వమన్న మురికి వాడల్లోని పది పన్నెండేళ్ళ పేదపిల్లవాడు వాళ్ళ నీతి నిజాయితీలకు పట్టం కట్టాడు. వాడి కరుణాంతరంగాలను ఆవిష్కరించాడు.

సమాజంలో తినడానికి తిండిలేని, నిలువ నీడలేని అటువంటి పవిత్రమైన వారి మనుగడకు, పురోభివృద్ధికి మన అభయ ఛారిటబుల్ ట్రస్ట్ స్థానం కల్పించాలి! మరిన్ని సంక్షేమ పథకాలు, సేవా కార్యక్రమాలు రూపుదిద్దుకోవాలి! ప్రతీపైసా అవసరమున్న వాడికి అందుతుంది. అటువంటి మరికొందరికి చేయూతనిస్తారు. కనుక మన పెట్టుబడులు మురికివాడల పునరుద్ధరణకు వినియోగించుకుందాం! ప్రభుత్వమేదైనా మేచింగ్ గ్రాంట్ ఇస్తే దానిని సద్వినియోగపరుచుకుందాం!"

ఆరోజు ఛైర్మన్‌గారి ప్రసంగ పాఠ సారాంశం జ్ఞప్తికి తెచ్చిన తరువాత

అభయఛారిటబుల్ ట్రస్ట్ సాధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను వివరించాను. "మనం ఎన్నో అనాధాశ్రమాలు నెలకొల్పాం! మానసిక వికలాంగులకు ఆశ్రయం కల్పించాం! నిరుపేద వృద్ధాశ్రమాలు నిర్మించాం! ఎందరినో దత్తత తీసుకొని ఉన్నత విద్యాభ్యాసం అందించాం! మరెందరినో ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, లాయర్లుగా, టీచర్లుగా తీర్చిదిద్దాం! నిరుపేద యువతులకు సామూహిక వివాహాలు చేయించాం! ప్రతీ జంటకూ మాంగల్యాలు, జత పట్టుబట్టలు, చిన్న కుటుంబానికి కావలసిన వంటపాత్రలు, తదితర నిత్యావసర వస్తువులను దానంగా అందిస్తున్నాం! అందుకే మన ఛారిటబుల్ ట్రస్ట్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఎందరో ధనవంతులు ముందుకువస్తున్నారు. అందుకు కారణం...ఆరోజు జరిగిన మురికివాడ సంఘటనే! ఆ పిల్లవాడే మన ఛారిటబుల్ ట్రస్ట్ దిశానిర్దేశాన్ని మార్చగలిగాడు. అందుకు ఆ పేద పిల్లవాడికి హృదయపూర్వకమైన కృతజ్ఞతలు సభాముఖంగా సమర్పించకుండా ఉండలేకపోతున్నాను!" నా గొంతు గద్గదమవ్వడం స్పష్టంగా తెలుస్తోంది.

క్షణకాలం సభలో గుండుసూది వేస్తే వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది. మరుక్షణంలో కలకలం మొదలైంది. ఒకరు లేచి సమయానుకూలమైన సందర్భోచితమైన మంచి ప్రశ్న సంధించాడు. "ఇంతకూ ఆ పిల్లవాడెవరు? ఇప్పుడెక్కడ ఉన్నాడు? ఏం చేస్తున్నాడు? ఎలా ఉన్నాడు? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నలకు సమాధానం లభించేంత వరకూ సభలో కలకలం సద్దుమణగదు!"

అందరూ... ఔనంటూ ముక్తకంఠంతో ఆ ప్రశ్నలను సమర్థించారు. ఉత్కంఠతో అందరి చూపులూ నా మీద, ఛైర్మన్‌గారి మీదకు ప్రసరించనారంభించాయి. నేను ఛైర్మన్‌గారిని, సి.ఇ.ఒను మార్చి మార్చి చూస్తున్నాను. ఛైర్మన్ గారి ఆదేశానుసారం సి.ఇ.ఓ.ను ప్రసంగించవలసిందిగా ఆహ్వానించాను. అంతవరకూ వేదికపై ఓ మూల ఆశీనుడైన సి.ఇ.వో మైక్ ముందుకు రావడంతో కలకలం కొంత సద్దుమణిగింది. "సభకు నమస్కారం! ఆ పేద పిల్లవాడెవరో నాకు తెలుసు! తరువాత ఏం చేశాడో తెలుసు! ఛైర్మన్‌గారు అనుమతిస్తే ఆ పిల్లవాడి కథ వినిపిస్తాను" అని సి.ఇ.వో అనగానే సభలో నిశ్శబ్ధం రాజ్యమేలసాగింది.

ఛైర్మన్‌గారు చిరునవ్వుతో అంగీకారం తెలుపగానే సి.ఇ.వో ప్రారంభించారు. "డియర్ ఫ్రెండ్స్! ఛైర్మన్‌గారు పర్సు పోగొట్టుకున్న అరగంటకు మురికి కాలువ ఒడ్డున ఆయన పర్స్ ఆ పిల్లవాడికి కనిపించింది. అందులో ఏవేవో కార్డులున్నాయి. వేలు, ఐదు వందలు, వంద రూపాయల నోట్లున్నాయి. వాటితో బాటు ఏవేవో రంగురంగుల నోట్లు కనిపించాయి. వెంటనే ఆ పిల్లవాడు తన తండ్రికి ఆ పర్స్ చూపించాడు. తనకు తెలిసిన ఇంగ్లీషులో వాడు ఆ కార్డుపైనున్న యజమాని పేరు, అడ్రస్, ఫోన్ నంబర్లు చదివి వినిపించాడు.

"ఈయన పెద్ద పారిశ్రామిక వేత్తరా! ఎన్నో ఫ్యాక్టరీలు, కంపెనీలున్నాయి. ఎందరో

ఆయన క్రింద పని చేస్తున్నారు. ఇందులో డబ్బు విలువ మనకు తెలియదు. కార్డుల విలువ అంతకన్నా తెలియదు. ఆయనకు పర్స్ అందజేయడమెలాగబ్బా!" వాడి నాన్న ఆలోచిస్తుంటే వాడే పరిష్కారం సూచించాడు.

"ఇందులో ఫోన్ నెంబర్లున్నాయి నాన్నా? ఆయనకు ఫోన్ చేస్తే వచ్చి తీసుకు వెళతాడు. ఇందులో నుండి వందరూపాయలు తీసుకోనా! అక్క చనిపోయి రేపు పదకొండవ రోజు! ముగ్గురికి అన్నం పెడదామన్నావుగా!" ఆశగా అన్నాడు. "వద్దురా! అందులో రూపాయి కూడా తీయవద్దు! నా మీద ఒట్టు! మీ అమ్మ మీద... అక్కమీద ఒట్టు! వెంటనే బయలుదేరి ఫోన్ చేసి ఆయనను రమ్మనమను... పర్స్ జాగ్రత్తగా అందించు! నేను పనికి వెళ్తున్నా! తిరిగి వచ్చేసరికి పర్స్ నాకు కనిపించకూడదు!' వాడి నాన్న పనికి వెళ్ళిపోయాడు.

వాడు అమ్మ ఫొటో, అక్క ఫొటోల ముందు పర్స్ ఉంచాడు. రెండు ఫొటోలకు దండలు వేసి ఉన్నాయి. తొమ్మిదవ రోజు ఉదయాన్నే తండ్రితో కలిసి స్మశానానికి వెళ్ళి అక్కకు ఇష్టమైన వస్తువులన్నీ ఆమె సమాధిపై ఉంచి వచ్చిన దగ్గరనుండీ ఆ ఫొటోలనే తదేకంగా చూస్తున్నాడు. 'ఎప్పుడూ అమ్మ అబద్ధమే చెప్పేది! నిజం చెప్పేది కాదు! అవసాన దశలో కూడా ఎప్పుడూ తనకు అనారోగ్యంగా ఉందని నిజం చెప్పలేదు. ఆకలిగా ఉ ందంటే... అన్నం పెట్టేది! చాలక ఇంకా కావాలంటే తను తినేదానిలోంచి కూడా పెట్టేసేది.

'అమ్మా! నీకు అన్నం ఉందమ్మా....' అని అడిగితే... ఉందనే చెప్పేది! అన్నం గిన్నే వెదకబోతుంటే.... 'నా కాకలిగా లేదురా.... అని' అబ్ధం చెప్పేది. తనను స్కూల్లో చదివించడానికి తెల్లవారకముందే పనిలోకి వెళ్ళేది. అక్కడినుండి ఏవేవో తెచ్చి అక్కకూ, తనకూ తినిపించేది. రాత్రి చాలా సేపటి వరకూ మిషన్ కుడుతూ మెలకువతో ఉంటే...' అమ్మా! ప్రొద్దున్న ఎప్పుడో లేచావుగదా! నిద్ర రావడం లేదా' అంటే 'నిద్ర రావడం లేదురా' అంటూ అబద్ధం చెప్పేది.

ఒంట్లో బాగుండక గవర్నమెంట్ హాస్పటల్‌కు వెళ్ళి వస్తుంటే... 'ఏమైందమ్మా...' అంటే 'ఏమీ లేదురా... బాగానే ఉన్నానురా' అబద్ధమాడేది. కాన్సర్‌తో ఆఖరి క్షణాల్లో ఉ ంటే... 'ఎలాగున్నావమ్మా' అని అడిగితే 'బాగానే ఉన్నానురా! చక్కగా చదువుకోరా! స్కూలుకు వెళ్ళిరా!' అబద్దాలు చెప్పి తనను స్కూలుకు పంపించి... 'తిరిగి వచ్చే సరికి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయింది! పోతూ... పోతూ... ఆయమ్మ మూడు రోజుల పాటు ఆ పిల్లవాడికి కడుపునిండా భోజనం పెట్టించింది. చుట్టుప్రక్కల వాళ్ళు ఆమె పోయిన తరువాత మూడు రోజులపాటు తమ వంటలతో ఆ పిల్లవాడికి ఆకలి లేకుండా చేశారు".

చెబుతున్న కథకు కళ్ళు చెమ్మగిల్లాయేమో... క్షణకాలం ఆగి సి.ఇ.వో కళ్ళ తుడుచుకొని కథను కొనసాగించాడు. "ఈసారి వాడి అమ్మ స్థానంలోకి అక్క వచ్చింది. అమ్మలాగా ఆకలిలేకుండా చూసుకునేది! తాను తినడం మానైనా వాడికి కడుపునిండా పెట్టింది. అమ్మలాగే అబద్ధాలతోనే వాడిని మభ్యపెట్టింది. రెండు మూడిళ్ళలో పని చేసేది. అర్ధాంతరంగా నాన్న అనారోగ్యంతో మంచంపడితే అన్ని అక్కే చూసుకునేది. అర్ధాకలితో

నిద్రపట్టకపోతే... అమ్మ జ్ఞాపకాలతో కలత నిద్రతో కలవరపడుతుంటే.... అక్క చక్కని జోలపాట పాడేది... ఆ పాట నాకు తెలుసు...

"నిదురపోరా తమ్ముడా... నిదురపోరా తమ్ముడా
నిదురలోన గతమునంతా నిముసమైనా మరచిపోరా"

సి.ఇ.వో పాడుతున్న ఆర్ద్రగీతం పల్లవి అందరి కళ్ళను చెమ్మగిల్లేలా చేశాయి.

"కలలు పండే కాలమంతా కనుల ముందే కదలిపోయే
లేత మనసుల చిగురు టాశ పూతలోనే రాలిపోయే..."

నిరాశను అద్భుతంగా ఆలపించిన తీరు మూగ బాధకు గురి చేసింది.

"జాలి తలచి కన్నీరు తుడిచే దాతలే కరువాయె
చితికిపోయిన జీవితమంతా చింతలో చితి ఆయె
నీడనిచ్చే నెలవు మనకు నిదుర యేరా తమ్ముడా...."

ఆదుకొనే అన్నదాతల కోసం, ఆసరాకోసం ఆరాటపడే నిరుపేద బ్రతుకుల వెతలన్నీ కళ్ళకు కట్టేలా పాడడంతో అతడి పాట సభికుల హృదయాలలో జాలి కరుణ కురిపించాయి. మనసులను కదిలించాయి. క్షణకాలం ........ నిశ్శబ్దం ఆవహించిన వాతావరణం నుండి సభికులను వెలుపలకు రప్పించాలని... నేనే చప్పట్లతో ఇహంలోకి రప్పించాను. సభ కరతాళధ్వనులకు శిరస్సు వంచి సి.ఇ.వో కథను కొనసాగించాడు.'అక్క కూడా అనారోగ్యం పాలై ఆకలిని తీర్చలేని తరుణంలో... ఆమె మంచంపై మృత్యువుతో పోరాడే సమయంలో ఆ పిల్లవాడు తండ్రిని ఓ ప్రశ్న వేశాడు.... అక్క ఎప్పుడు చచ్చిపోతుంది నాన్నా!' 'ఎందుకురా... అలా అడిగావు?" నాన్న విచారంగా అన్నాడు. 'ఆకలేస్తోంది నాన్నా! మూడు రోజులపాటు కడుపునిండా తినవచ్చుగా!' వాడి అమాయకత్వానికి తండ్రికి నవ్వాలో... ఏడవాలో అర్థం కాలేదు. మరి వారం రోజులకు వాడికి కడుపునిండా తినే అవకాశం ఇచ్చి అక్క వెళ్ళిపోయింది. ఈసారి వాడు తినలేకపోయాడు. ఊహ తెలిసిన వాడైనాడుగా! తాను అన్నది జరుగుతుందని అనుకోలేదు. అక్క కూడా అమ్మలాగే అబద్ధాలు చెప్పిందని... తనకు దూరమైందని అర్థమైంది! అక్క పోయిన పదవరోజు వాడికి ఛైర్మన్‌గారి పర్స్ దొరకడం, తిరిగి ఆయనకు ఇవ్వడం జరిగింది. ఆ మరునాడు అందరికీ ఆహారపు పొట్లాల రూపంలో అన్నదానం జరిగింది".

క్షణం విరామ మిచ్చి కథనం కొనసాగించాడు. "అతడి నిజాయితీకి ఫలితం దక్కింది. కరుణాంతరంగాన్ని అదృష్టం వరించింది. ఆయన సహాయ సహకారాలతో స్కూల్లో మధ్యాహ్నం భోజనం చేయగలిగాడు. స్కూల్ ఫస్ట్ సాధించాడు. ఓ కార్పోరేట్ కళాశాలలో పైసా ఖర్చు లేకుండా ఇంటర్ చదవగలిగాడు. ఐ.ఐ.టి. సీటు సాధించి అభయ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఐ.ఐ.యంలో యం.బి.ఏ.లో ర్యాంక్ సాధించగలిగాడు. మార్కెటింగ్, ఫైనాన్స్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రస్తుతం ఓ మంచి కంపెనీలో మంచి హోదాలో ఉద్యోగ నిర్వహణ చేస్తున్నాడు. ఇదీ... ఆ పేద ఇంటి పిల్లవాడి కరుణామయ గాథ!"

సి.ఇ.వో చెప్పడం పూర్తి చేసి కళ్ళను కర్చీఫ్‌తో అద్దుకోసాగాడు. ఆ పిల్లవాడి కథ ముగిసేలోపు ఛైర్మన్‌గారి సంజ్ఞ నందుకొని.... అతడు వెనుదిరిగేలోపు అద్దుకొని మైకు నందుకున్నాను. "డియర్ ఫ్రెండ్స్! నాడు మన ఛైర్మన్ గారి పోయిన పర్సును తిరిగి ఇచ్చి నా అంచనాలను తలక్రిందులు చేసి ఛైర్మన్‌గారి అచంచలమైన నమ్మకాన్ని వమ్ము కానీయని ఆ పేద ఇంటి పిల్లవాడు ఇక్కడే ఉన్నాడు.... మన మధ్యనే ఉన్నాడు.... మంచి హోదాలో ఉన్నాడు!" కావాలనే క్షణకాలం విరామమిచ్చాను. "ఇక్కడే ఉన్నాడా? మన మధ్యనే ఉన్నాడా? అయితే అతడెవరో చెప్పండి! ఏం చేస్తున్నాడో చెప్పండి! అతడిని సభకు పరిచయం చేయండి!"సభికులంతా ముక్తకంఠంతో ప్రశ్నలవర్షం కురిపించారు.
"అతడు ఎవరో కాదు... ఎవరో కాదు... మన కంపెనీ సి.ఇ.వోనే ఆ పేద పిల్లవాడు!" సి.ఇ.వో చేయి పట్టి పైకెత్తి సభకు పరిచయం చేస్తుంటే స్టాండింగ్ ఒవేషన్‌లో సభ అతడిని అభినందించింది.

అప్పుడే వేదిక ముందుకు వచ్చిన ఛైర్మన్‌గారి కరతాళ ధ్వనితో పులకించిపోయిన సి.ఇ.వో. ఆయనకు, తనకు ఉజ్జ్వల భవిషత్తునిచ్చిన తండ్రి లాంటి ఆయనకు పాదాభివందనం చేయకుండా ఉండలేకపోయాడు. సి.ఇ.వో పాదాభివందనం పూర్తికాకముందే ఛైర్మన్‌గారు అతడిని ఆత్మీయ ఆలింగనంతో బంధించి వేశారు.
ఆ అపురూపదృశ్యం కనిపించకుండా కనుకొలకుల్లో కన్నీటి బిందువులు అడ్డువచ్చాయి. నాకైతే కళ్ళజోడు తీసి తుడుచుకుందామనిపించలేదు..... ఎందుకంటే.... అవి... ఆనందభాష్పాలు!!.

**ఎం. సూర్యప్రసాద రావు,**

**సూర్యప్రసాద రావు ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ (జంతుశాస్త్రం) చేశారు. ఖమ్మంలోని శీలంసిద్ధారెడ్డి జ్యోతి కళాశాలలో జంతుశాస్త్ర హెచ్‌వోడీగా పనిచేశారు. ఇప్పటి వరకు 350 కథలు, 200 సంప్రదాయ వ్యాసాలు, వంద కవితలు, ఐదు కథాసంపుటాలు వెలువరించారు. వివిధ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో పాతిక కథలకు బహుమతులను అందుకున్నారు. ఈయన రచనలపై నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఒకరు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'అనిర్వచనీయం' నవల చతురలో, 'అతడు ఆమె ఓ చిలిపి అమ్మాయి' నవల స్వాతి మాసపత్రికలో ప్రచురితం అయ్యాయి.**

# మూడు దావల దిష్టి



**పాలగిరి విశ్వప్రసాదరెడ్డి**

'నేలనపడి ఊపిరితో వున్న యెద్దును కటికకు ఎట్లమ్ముతావు సోమీ!' అప్పటికి పావుగంట నుండి మాలిండ్లలో వున్న పెద్దమనుషులంతా కట్టకట్టుకునొచ్చి నిలేస్తున్నారు. అందరూ యాభై అరవై యేండ్ల పైబడినోళ్ళే.

ఇంటి వసారాలో అరుగుమీద కూర్చొని కలబందనారతో పగ్గం పేనుకుంటున్న నాగన్న అంతసేపూ తలకాయొంచుకొని వాళ్ళ మాటలు, నిలదీతలు వింటూనే వున్నాడు. కొందరు వసారాలో కింద కూర్చుని వున్నారు. ఇంకొందరు అరుగునానుకుని నాగన్నకు దగ్గరగా నిలబడి వున్నారు. వాళ్ళలో ఒక పెద్దమనిషి – నాగన్న నాయన కాలంలో 'ఇంటి మాలోడు'గా వున్న పెదరాజు – కలబందనార పాయలు చిక్కుతీసి నాగన్న చేతికిస్తూ సాయపడుతున్నాడు.

'పెద్దరెడ్డి వైయుండి నువ్వే ఊరికట్టడి దాటితే ఎట్లబ్బా!' – నార అందిస్తున్న పెద్దమనిషి అనునయంగానే నిలదీసినాడు.

పేనిన భాగాన్ని తొడకిందనుండి వెనక్కి జరుపుకుని, ఆ పెద్దమనిషి చేతినుండి నారపాయను అందుకుంటూ నాగన్న తలెత్తినాడు.

'పెద్దరెడ్డె వడురా! పెద్దరెడ్డి నయితే దాని వూపిరి నిలిచిపోయిన్దాకా సగదీరి, గుంతతీసి పూడ్చిందును. దాని బతుకంతా నాకే చాకిరీచేసింది. అట్లాంటిదాన్ని నాకు ఉసి లేకనే అమ్ముకుంటున్నా. మా యబ్బ కాలంనాటి ఈ లంకంత కొంపతప్ప నాకేముంది! పైన దంతెలు ఇరిగిపోయి మెత్తు రాలిపోతాంటే సరిచేయిచ్చు కోలేకుండా!' – అన్నాడు.

'నీ యిబ్బందులెట్లన్నా వుండనీ, అంతోయింతో భూమి, యెద్దులు, యెనుముల యాసంగం ఉన్న మారాజువి. మీ నాయన, అబ్బల కాలం నుండీ ఊరిలో పదిమందికి మంచీ చెడ్డా చెప్పిన కుటుంబం. నువ్వు కట్టడి దాటడం సరికాదబ్బా!' – ఆ మాల పెద్దమనిషి గిరిగీసి దాటొద్దన్నట్లు అనునయంలోనే కటువు ధ్వనించినాడు.

నాగన్న పేనుతున్న పగ్గాన్ని నడిమధ్యనే విసురుగా పక్కకుతోసి – 'మీరందరూ కట్టుబాట్లు, కట్టడ్లను దాటకుండానే బతుకుతున్నారా? రైతుకు, మాలోనికి యాడన్నా సంబంధం మిగులుందారా? మీ బతుకులు మీయయినాయి, మా బతుకులు మాయయినాయి. మీ పిల్లోళ్ళు తిప్పే ఆటోల్లో మేమెక్కుతా వుండాం. మా దగ్గరలేని సెల్‌ఫోన్లు మీ దగ్గరుండాయి. ఇంగా కట్టడి పేరుతో నాయట్లాటి బక్క రైతుమింద పడటమేందిరా! అయినా ఊర్లో ఇంగా ఏ కట్టుబాట్లయినా బతికున్నాయారా. యా కాలంలో ఉండారు. పోండిరా. నా యెద్దును నేను అమ్ముకొంటాను. ఎవడడ్డ మొస్తాడో చూస్తా' అంటూ లేచి యింట్లోకి నడిచినాడు.

మాల పెద్దమనుషులందరూ ఒక నిట్టూర్పు విడిచి 'పోదాం పాండిరా, పంచాయితీ

పెట్టిద్దాం!' అని తలోమాట అంటూ అనుకుంటూ లేచి తమ యిండ్లదావ పట్టినారు.

* * *

గాడిపాటన కండ్లు మూసుకుని నెమరేస్తా పడున్న యెద్దును చూస్తా వుంటే నాగన్నకు గుండె చెరువవుతావుంది. మక్కి విరిగిన కాలును పారజాపుకుని యెద్దు పడుకునుంది. వారం దినాలనుండి ఎట్ల పడున్న యెద్దు అట్లనే వుంది. అటూ ఇటూ కాలుమార్చి పొర్లలేని స్థితిలో ఒకేవైపుకు పడుకుని వుంది. నేలకానిన వైపు కడుపు, పక్క భాగమంతా తోలు చవికిపోయి పీక్కొచ్చి పుండవుతా వుంది.

వారం కిందట గాడిపాటన కాలుజారి దభేలుమని పడింది. అంతకు ముందు వారం దినాలు తెరపిలేకుండా వానలు కురిసి ఊరూ చేలూ జివజివమని బురద మయమయ్యాయి. ఇండ్లలో గాడిపాళ్ళు ఎంత వూడ్చినా అరకుండా జోమొడుస్తా వున్నాయి. ఊడ్చేటప్పుడు యేమారితే సర్రున కాలు జారేలా వున్నాయి. ప్రాయం మీద పడిన యెద్దులు. నాగన్న మేత జొళ్ళ గాట్లో గుమ్మరిస్తుండగానే, పడుకొనున్న యెద్దులు ఆత్రంగా మేతకోసం లేచినాయి. లేవబోతున్న కొమ్ములెద్దు వెనక కాలు సర్రున జారి దబ్బునపడింది. అంతే లేవలేకపోయింది. నాగన్న అదిలిచ్చినాడు. భార్య, ఈడొచ్చిన ఆడపిల్లలిద్దరితో కలిసి లేపాలని శతవిధాలా పోరాడినాడు. వాళ్ళ తరం కాలేదు.

బయటకుపోయి ఇరుగుపొరుగు, అయిన పొయినోళ్ళను పదిమందిని వెంటేసుకొచ్చినాడు. తలోమాట, తలో సలహా మాట్లాడినారు. కూలబడిన యెద్దు నడుములు పట్టుకుని కొంచెం లేపి ఆ సందున కాడిమాను దూర్చి, అటు నలుగురూ ఇటు నలుగురూ కాడిమాను పట్టుకొని యెద్దును లేపి నిలబెట్టినారు. కాడిమాను యెద్దు కిందనుండి తీస్తుండగానే కాలు నిలబడక మళ్ళీ డబ్బున పడిపోయింది. అందరూ పెదవి విరచినారు. మక్కి విరిగిందని తేల్చినారు.

ఆ దినం నుండి, ఈ వారం దినాలుగా యేటి అవతల పల్లెనుండి బుడేన్‌సాబ్ వచ్చి వైద్యం చేస్తున్నాడు. తనే కొండకుపోయి యెవో ఆకులు కోసుకొచ్చి నూరి, కోడిగుడ్లలోని తెల్లసొనతో కలిపి పట్టు వేస్తున్నాడు. వారం దినాలయినా గుణం కనిపించలేదు. వారం గడిచాక పదిమందీ తోడై మళ్ళీ ఒక్కసారి యెద్దునులేపి నిలబెట్టే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు.

'పాయం మీరింది, యెంక కట్టుకోవడం కష్టం నాగిరెడ్డీ! కట్టుకున్నా లేచి నిలబడుతుందేమో గానీ యాసంగానికి పనికిరాదు. ఈలోపుగా యెద్దు అవతలిపక్క తోలు పాచిపోయి అదొక పుండయితుంది.' అని బుడేన్‌సాబ్ తేల్చేసినాడు.

నాగన్నకు గుండెల్లో యేదో నొప్పి తగిలింది. తనకున్న అయిదెకరాల మెట్టతోపాటు, పదిమందికి యెద్దులతో బాడుగ సేద్యాలకుపోయి నెట్టుకొస్తున్నాడు. రెండెనుముల పాడి అమ్మి భార్య ఉప్పుకు, పప్పుకు సరిపెడుతోంది. అయినా యెదిగిన ఆడపిల్లల చదువులు ఇంటర్‌తోనే ఆగిపోయినాయి. రెండేండ్ల నుండి అనుకుంటున్నా, ముసలెద్దులను అమ్మి కోడెలను పట్టుకొచ్చేందుకు పైకం బిసలేక కాలం వెళ్ళదీస్తున్నాడు. ఇప్పుడు నేలనపడిన యెద్దును బతికినంత కాలం సగదీర్చేంత సత్తువ తనకు లేదు.

ఊర్లో యెద్దులను బాడుగులకు పిలవడం కూడా తగ్గిపోయింది. ఊర్లో ట్రాక్టర్లు యెక్కువవుతున్నాయి. ఎద్దులతో విత్తనం వేసి, సేద్యం చేయించుకోవాల్సిన జొన్న, కొర్ర, వేరుశనగ పంటలు మాయమయి, బుడ్డసెనగపంట వచ్చి పడింది. ఇప్పుడు అప్పుచేసి మళ్ళీ ఇంకో యెద్దును కొనడం కన్నా రెండెద్దులనూ అమ్మడమే మేలనిపించింది.

బుడేన్‌సాబ్‌కే ఫోన్‌చేసి బేరగాండ్లను తోడుక రమ్మన్నాడు.

ఇంతలోనే యెట్ల తెలిసిందో, మాలిండ్లలోని పెద్దమనుషులంతా కట్టకట్టుకుని వచ్చినారు.

ఎద్దు పనిచేయలేక నేలనపడి ప్రాణంతో వుంటే, దాన్ని కటికకు అమ్మే హక్కు రైతుకు లేదు. దానంతకది నడిచి పోయేటట్లుంటేనే రైతు అమ్ముకోవాల. బండికెత్తి పంపే స్థితిలో అమ్మకూడదు. అది మాలల సొంతం. ప్రాణం పోయిన యెద్దయితే మాదిగల సొంతం. అది అనాదిగా ఉన్న ఊరి కట్టడి – అంటూ తన బతుకుకు అడ్డుపడినారు.

ఈ రెండూ వొద్దనుకుంటే, రైతు ఆ యెద్దును బతికినంత దూరం సగదీర్చి చచ్చినాక పూడ్చుకోవాలి.

నలభై యేండ్ల కిందట సర్పంచు సుబ్బిరెడ్డి ఇంట్లో ఈ రకంగా యెద్దు యెత్తుబడితే మాలోళ్ళ కిచ్చినాడు. ఇరవై యేండ్ల కిందట తనవంటి చిన్న రైతే వెంకటసుబ్బన్న యెద్దు కూలబడిపోయింది. బతికినంత కాలం నీళ్ళు, మేపు పెట్టి చచ్చాక కోసుకోవాలని షరతుమీద మాదిగోళ్ళ కిచ్చినాడు. ఇన్నేండ్లకు, కాలం మారిపోయి అన్ని కట్టడులు పోయినాక తనకు ఈ కష్టమొచ్చింది.

* * *

మాలలు అటుపోయిన గంటకు నలుగురు మాదిగ పెద్దమనుషు లొచ్చినారు. నాగన్న యెద్దుకు నీళ్ళు పెడుతుండగా చూసి, యెద్దుచుట్టూ గాడిపాటకు చేరినారు. ఎద్దును పట్టిపట్టి చూసినారు. సానుభూతి పలుకులు పలికినారు.

నాగన్న చేతిలోని తవుడు చేటను ఓ పెద్దమనిషి – నాగన్న నాయన కాలంలో 'ఇంటి మాదిగోడు'గా ఉండిన రాముడు – తీసుకుని యెద్దు మూతిపెట్టి తాగుతున్న నీళ్ళ బకెట్లో కలుపుతూ అక్కడే కూర్చున్నాడు. మరొకరు నిలబడి వుండగా, యిద్దరు గాడిపాట బండమీద పిర్రలు మోపినారు.

ఎద్దుమీద ఆమాట ఈమాట మాట్లాడి, 'నీ యింట్లోనే బతుకంతా బతికి నీకు సేవచేసిన జీవం. దాని రుణం నువ్వు తీర్చుకోలేవు రెడ్డీ! బతికుండగానే చూసి చూసి ఆ మాలోళ్ళకు మాత్రం యియ్యాకు. సగదీరను నీకు అంత బరువయితే, మా ఇండ్లలో రాముల దేవళం కాడికి మోసుకుపోయి పండబెట్టి చచ్చేదాంకా సగదీరుతాం!' అన్నాడు రాముడు.

'ఏమొద్దు పాండిరా! నేను వాళ్ళకు యియ్యను. మీకు యియ్యను. నా సావు నన్ను సావనీయండిరా!' రాముని చేతిలోని తవుడు చేట గుంజుకున్నాడు నాగన్న.

* * *

'ఫోన్‌జేసి రమ్మన్నావంటనే, చిన్నాయమ్మి చెప్పింది', సర్పంచు సుబ్బిరెడ్డిని సమీపిస్తూ నాగన్న అడిగినాడు. వసారా అరుగుకు ఆన్చిన మంచంలో కూర్చుని కాఫీ సేవిస్తున్న సుబ్బిరెడ్డి

'రావోరు కూర్చో' అన్నాడు. పయి మిందున్న తుండుగుడ్డను అరుగుమీద వున్న స్తంభము దగ్గర వేసి, స్తంభానికానుకుని కూర్చున్నాడు నాగన్న. యెద్దు పంచాయితీ కోసమేనని తనకు తెలుస్తూనే వుంది. సుబ్బిరెడ్డి నేరుగా విషయంలోకి దిగినాడు – 'ఏంది వోరు! లేవలేని యెద్దును వూపిరుండగానే కటికకు అమ్ముకుంటుండా వంటనే?' 'ఏమ్ అమ్ముకొంటే? నా యెద్దును నా యిష్టమొచ్చినట్లు చేసుకుంటా మావా! మాలోళ్ళను వెనకేసుకొస్తున్నావా?' నాగన్న గొంతులో బింకం బయటపడింది. 'ఒకర్ని వెనకేసుకొని రావడ మేందోరు! నువ్వు సాటి కాపోనివి, చుట్టానివి. నీకు అన్యాయం జేయాలనుకుంటానా?' 'చుట్టరికాల మాటెందుకులే మావా! నువ్వు యాపొద్దు నన్ను పిలిచి నీ యింట్లో ఆకేసినావు? నా యింటికొచ్చి యాపొద్దు చెయ్యి కడిగినావు? ఎద్దు మాట యెందో చెప్పు'

సుబ్బిరెడ్డికి ఇక యవ్వారం తెంచక తప్పలేదు. తేనె పూసిన మాటలు పనిచేయ వనుకున్నాడు. 'చెప్పడాని కేముందోరు! ఊరికి ఒక కట్టుబాటు, కట్టడి వుందన్నాక నువ్వూ నేనూ అందరం కట్టుబడి వుండాల్సిందే. ఏమ్, నా యింట్లో యెద్దు యెత్తుబడినపుడు మాలోళ్ళ యెదాన కొట్టిండ్లా?' – సుబ్బిరెడ్డి సర్పంచ్ దర్పం చూపినాడు. 'నువ్వు ఇచ్చినావులే నలభై యేండ్ల నాడు. ఇప్పుడు యింగా నా యట్లాటోళ్ళ మెడకు చుట్టడానికా యీ కట్టడ్లు? యాడుండారు మావా అన్ని కట్టడ్లు? ఇంటి మాలోడు, యింటి మాదిగోడంటే అన్నిటికి తల్లేరు పట్టినట్లు ముందుంటాడిరి. మన యింట్లో యెవరైనా చస్తే ఇంటి మాలోడొచ్చి గుంత తీస్తాండాడా? వాళ్ళడిగినంత లెక్క యిచ్చి గుంత తీయించుకుంటా ఉండాం. మెట్టు తెగిపోతే మాదిగోడు యెవడన్నా కుట్టిస్తా ఉండాడా? సెలకోలుకు వార్లు పెట్టమన్నా పెట్టడంలేదే! అయినా యెద్దులు యెత్తిపెట్టి ట్రాక్టర్లు తెచ్చుకున్న నీ యట్లాటోళ్ళకు వాళ్ళిద్దరితో పనిలేదు. మరెందుకు ఈ కట్టడ్లు? ఊర్లో యింగా యెద్దుల సేద్యం చేసుకునే మా యట్లాటి పది ఇరవై మంది సన్నకారు జీవాలను నలిపి పారేయడానికా ఈ కట్టుబాట్లు?' – సర్పంచు సుబ్బిరెడ్డిని ఎదిరిస్తూ మాట్లాడుతున్న నాగన్న స్వరంలో ఆ పదురు కనిపిస్తోంది.

'ఒరే యెర్రి నాగన్నా! ఊరి కట్టుబాట్లు మనం పెట్టినయేరా. వాళ్ళు పెట్టుకున్నయి కాదు. కట్టుబాట్లలో మనకు మేలుచేసేవి నూరుంటే, వాళ్ళకు మేలుచేసేవి ఒకటీ అరా వుంటాయి. వాళ్ళకు మేలుచేసేవి ఒక్కొక్కటే తగ్గిచ్చుకుంటా మనమే వాళ్ళకు అన్యాయం చేసినాము. వాళ్ళకు మనమూ, మనకు వాళ్ళూ అన్నెట్లుండే వాళ్ళం. ఇప్పుడుండామా? మనింట్లో పెండ్లయినా, వాళ్ళింట్లో పెండ్లయినా ఒక్కరవ్వ బంగారు తునక యిచ్చేవాళ్ళం, యిప్పుడిస్తాండామా? మేరగింజలు కొలుస్తాండామా? అన్నీ మానుకొన్నాం కదవోరు. వాళ్ళకు మేలుచేసే ఒకటీ అరా కట్టడిని కూడా ఇప్పుడు మనం కాదంటే, ఇంగ వాళ్ళు దేనికీ మన చెప్పుచేతల్లో ఉండరు. అది తెలుసుకో' – సర్పంచు నాగన్నకు జ్ఞానబోధ చేసినాడు.

'వాళ్ళనెవర్నో చెప్పుచేతల్లో పెట్టుకొనే తాహతు నాకులేదు. ఆ అక్కరా నాకులేదు. ఓట్లకోసమో, యింగోదానికో నీకు అక్కరుందేమో! ఆ అక్కర ఉన్నోళ్ళకోసం నేనెందుకు నలిగిపోవాల మావా? నేను యే కట్టడికి కట్టుబడను. నా పని నేను చేసుకుంటా!' – నాగన్న ఖరాకండీగా చెప్పి, లేచి కిందవేసుకున్న తుండుగుడ్డ విదిలించి పయిమీద వేసుకుని తిరిగి

చూడకుండా దాటుకున్నాడు. 'ఒరే నాగన్నా! నా మాట యినకుంటే తిప్పలు పడతావ్' – వెనుక నుండి సుబ్బిరెడ్డి హుంకరింపు వినపడింది.

* * *

నాగన్న సుబ్బిరెడ్డి దగ్గర యెదిరించి వచ్చినాడే కానీ యే నిర్ణయం తీసుకోవాలో తోచలేదు. తనదీ మాలా మాదిగోళ్ళ బతుకే. ఆ యెద్దును కటికకు అమ్ముకుంటే అంతో యింతో నష్టం తగ్గుతుంది. సర్పంచునూ, మాలోళ్ళనూ, మాదిగోళ్ళనూ కాదని నేలకూలబడిన యెద్దును ప్రాణంతో అమ్ముకోలేడు. వీళ్ళకో, వాళ్ళకో యివ్వడం వల్ల పరోక్షంగా సర్పంచు సుబ్బిరెడ్డి ఆధిపత్యపు నీడ వీళ్ళమీదో, వాళ్ళమీదో మరింత చిక్కగా పరుచుకుంటుంది. నడిమధ్యన అందరి నడుమా తను నష్టపోతాడు. నాగన్న యెటూ నిర్ణయించుకోలేక పోయినాడు. మూడు దావల కూడలిలో నిలబడి నట్లయింది. ఇంటికి వచ్చి భార్య వెంకటసుబ్బమ్మతో జరిగిందంతా చెప్పినాడు. 'ఎవనికీ యియొద్దు. ఎద్దు చచ్చేదాంకా మేతా, నీళ్ళు పెట్టి చచ్చినాక కల్లంలో పూడ్చిపెడదాం! పెసిడెంటు పెత్తనానికీ, దిక్కుమాలిన ఊరి కట్టడులకూ మూడు దావాల దిష్టి తీసి పారేసినా మనుకుందాం!' – అంది ఖండితంగా. భార్యలో వున్న తెగువ నాగన్నలో కనిపించలేదు. దిగులు ఆవరించిన మనసుతో భార్యకు తలవూపినాడు.

* * *

**పాలగిరి విశ్వప్రసాదరెడ్డి**

**పాలగిరి విశ్వప్రసాద రెడ్డి స్వస్థలం కడపజిల్లా, యర్రగుంట్ల మండలం, హనుమగుత్తి గ్రామం. ఈయన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. బి.ఎస్సీ. చదివారు. విద్యాభ్యాసం అనంతరం కొన్నేండ్లు వ్యవసాయం చేసిన ఈయన 25 ఏండ్లకు పైగా జర్నలిస్ట్‌గా పనిచేశారు. విశ్వప్రసాదరెడ్డి రాసిన మొదటి కథ "కాపలా కుక్కలు". ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమయింది. ఆ తరువాత 2005లో పది కథలతో కూడిన "చుక్క పొడిచింది" కథల సంపుటి రచించారు. ఆ తరువాత ఈయన మరో 12 కథలు రచించారు. ఇవి పలు ప్రధాన పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఇటీవల రాసిన 'మూడు దావల దిష్టి' కథ ఆయనకు మరింత గుర్తింపుని తీసుకువచ్చింది. ఈయన యోగివేమన యూనివర్సిటీ వారి 'గజ్జల మల్లారెడ్డి సాహిత్య పురస్కారం, మల్లెమాల సాహిత్య పురస్కారం, కవిత సాహిత్య సాంస్కృతిక పురస్కారాలను పొందారు.**

# కొలిమి



రామా చంద్రమౌళి

చిన్మయి.. అప్పటిదాకా భద్రునితో ఎంతో ఉద్వేగంగా మాట్లాడుతున్న చేతిలోని మొబైల్ ఫోన్‌ను ముందున్న టేబుల్‌పై పెట్టి, వెనక్కి వాలి కళ్లు మూసుకుంది అలసటగా!

టైం తెలుసు ఆమెకు. రాత్రి పదకొండూ పది నిమిషాలు. మానవ శరీరం ఒక బయోవాచ్. సమయం తనంతట అదే తెలుస్తూ ఉంటుంది స్పృహిస్తే. బయట సన్నగా కురుస్తున్న వర్షం చినుకుల చప్పుడు లయాత్మకంగా వినిపిస్తూనే ఉంది. ఎందుకో ఆమె మనసు చాలా ఉద్విగ్నంగా ఉంది.. బాధగా ఉంది. కొండొకచో దుఃఖంగా కూడా ఉంది.

'ఈ దేశంలో ఎందుకిలా విలువలూ, నీతీ నియమాలూ, ధర్మాధర్మ విచక్షణా, మానవీయ ఉదాత్తతా.. ఇవన్నీ వారసత్వంగా కొన్ని వేల సంవత్సరాలుగా కొనసాగుతూ వచ్చీ వచ్చీ.. ఇప్పుడెందుకిలా అతి వేగంగా ధ్వంసమైపోతున్నాయి? కొండపైనుంచి జారిపడిపోతున్న బండరాయిలా! ఎటు

చూసినా మనదేశం లోపలా, బయటి దేశాల్లో కూడా సకల మానవ జాతిలోనే సామూహిక విలువలు లుప్తమవుతూ సాంస్కృతిక విధ్వంసం కొనసాగుతూ వస్తున్నది. ఎందుకు.. ఎందుకిలా.. ఎందుకు ఈ నైతిక పతనం మహోధృతంగా ఒక మహాసముద్రపు ఉప్పెనలా దూసుకొస్తున్నది? ఈ దుష్టతరపు మానవ సమాజంపై కరోనాకంటే కూడా అతిప్రమాదకరంగా!'

ఆమె ముందున్న టేబుల్‌పై వరుసగా పేర్చి ఉన్న పదిహేను సంపుటాల ఇండియన్ నేషనల్ ఎపిక్.. భారతదేశ జాతీయ ఇతిహాసం, పంచమ వేదం.. వ్యాస విరచిత 'మహాభారతం' బౌండ్ సంపుటాలు పేర్చి ఉన్నాయి. టీటీడీ ఆ గ్రంథాలను ప్రచురించి, పద్దెనిమిది వందల రూపాయలకే అందిస్తున్నది. ఆ ధరకు కనీసం వాటి బైండింగ్ కూడా చేయించలేం.

అవి వ్యాసుడు రచించిన ఒరిజినల్ మహాభారతానికి నన్నయభట్టు చేసిన తెలుగు అనువాద.. సరళ తెలుగీకరణ సంపుటాలు. ప్రత్యేకంగా సమయం కేటాయించుకొని గత నెలరోజులుగా ఆ అన్ని సంపుటాలనూ పట్టువిడువక చదువుతున్న చిన్మయి.. చిట్టచివరి పదిహేనవ సంపుటిని కూడా చదవడం పూర్తి చేసి, ఒక రకమైన పూర్ణతృప్తి నిండిన మహదానుభూతితో పరవశించిపోతూ ప్రచలిస్తున్నది.

వేదలూ, శాస్త్రాలూ, పురాణాలూ, ఉపనిషత్తుల పాఠాన్ని సమీకృతపర్చుకున్న ఈ 'మహాభారతం' అనబడే ప్రపంచ మహోత్కృష్ట మహాగ్రంథానికి వారసురాలై.. ఈ పుణ్యభూమిపై పుట్టిన తన జన్మ ధన్యమైనట్టేనా.. అనుకుంటూ, ఆమె తనను తాను ఒకసారి అవలోకించి చూసుకొని పులకించిపోయింది.

ఐదు వేల సంవత్సరాల క్రితం రాసినట్టు చెప్పే మహాభారతం.. ఇప్పటికి కూడా పరిపూర్ణ ఔచిత్యంతో, అన్వయానుకూలతతో వర్ధిల్లుతున్న ఈ ఇతిహాసంలో వ్యాసుడు ఏమన్నాడంటే..

'యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి న తత్ క్వచిత్' అంటే.. ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా లేదు'

( What is in mahabhaarata is every where. what is not in Mahabharata is nowhere ) – అని.

ఈ ఇతిహాసంలో సృష్టించిన పాత్రల చిత్రణ ( Character delineation ), ఉద్వేగ వైవిధ్యత (Range of emotions ) కూడా ఏ ఇతర గ్రంథాల్లోనూ లేదు.

చిన్మయి మొబైల్ ఫోన్ చటుక్కున మోగింది.. ఏదో లోకంలో మునిగిపోయిన ఆమె, ఉలిక్కిపడి ఫోన్ ఎత్తి.. 'హలో' అన్నది. అటువైపు భద్రుడు. 'అంతా రెడీ మేడం'. 'మొత్తం ఎంతమంది మనవాళ్లు'. 'నలభై మంది మేడం'. 'స్థావరమెక్కడ'. 'జూబ్లీహిల్స్ మేడం'.

'మొబైల్ పబ్బా? ఒకవైపు మనం నిర్మూలించుకుంటూ పోతూంటే, మరోవైపు వాళ్లు

జరాసంధుని బాడీలాగ మళ్లీ మళ్లీ పుట్టుకొస్తున్నారు కదా భద్రుడూ!' అన్నది. మళ్లీ తనే..

'ఖాళీగా ఉన్న పోష్ భవనాలను కిరాయికి తీసుకొని, సర్కస్ గుడారాల్లాగ అప్పటికప్పుడు అంతా సెట్ చేసి, ఈ బహిరంగ దందా చేస్తున్న ఆ నిర్వాహకుణ్నీ, బిల్డింగును కిరాయికి ఇచ్చినవాణ్నీ ఈసారి బట్టలు విడిపించి.. అదే జూబ్లీహిల్స్ నడిరోడుపై నెత్తిపైన విస్కీ సీసాలను పెట్టి ఊరేగిద్దామా భద్రుడూ!' అన్నది చిన్మయి ఐపీఎస్.

'కానీ, పొలిటికల్ అండ్ బ్యూరోక్రాట్స్ ప్రెషర్..'. 'అది మామూలే కదా మనకు! చూద్దాం.. ముందు నేనూ, ఇంకో ఇద్దరు లేడీ స్టాఫ్ మఫ్టీలో వెళ్తాం. ట్రూ షేప్ బయటికొస్తది. ఇంకో పావుగంట తర్వాత రెడీ జంగ్.. నేనే అక్కడికొస్తా! లొకేషన్ షేర్ చెయ్యి'. 'ఎస్ మేడం.. సునందా, ఊర్మిళ వస్తారు రైడింగ్‌కు'. 'ఓకే'. . ఫోన్ కట్ చేసి.. కలెక్టర్‌కు లైన్ కలిపింది చిన్మయి. అటునుండి కలెక్టర్.. 'హలో!' అన్నాడు. ఐదు నిమిషాల తర్వాత ఆయన జవాబు.. 'ప్లీజ్ గో ఎహెడ్' అని రాగానే, లోపలినుంచి విద్యుత్తు విరజిమ్ముతుండగా లేచి నిలబడ్డది చిన్మయి. భూమిలోంచి మొలిచిన శివుడి శూలంలా!

***

భయం గొప్పదా? ప్రేమ గొప్పదా? అని ప్రశ్న.  ప్రేమ అనేది ఒక మాయ. కథల్లో, సినిమాల్లో, ఉటోపియన్ కల్పితాల్లో తప్ప.. ప్రేమ ఎక్కడా దీర్ఘకాలం జీవిస్తూ, ఒక వ్యక్తి జీవితాంతం పొగచూరకుండా ఉజ్జ్వలమై తృప్తిని మిగిల్చిన సందర్భాలు ఉండవు. 'ఆలుమగలు మాయ, అన్నదమ్ములు మాయ, తల్లిదండ్రులు మాయ, తాను మాయ, మాయ తెలియనీదు దీనిల్లు పాడాయె విశ్వదాభిరామ వినుర వేమ'.. అన్న పద్యంలో వేమన నిష్కర్షగా చెప్పింది అబద్ధం కాదు. అయితే ప్రేమ మాయ అని తెలియడానికీ, మనిషి అంగీకరించడానికీ ఒక జీవితకాలం పడుతుంది. ఒక సర్వేలో ఇరవై వృద్ధాశ్రమాలలో ఉంటున్న దాదాపు ఐదువందల మంది వృద్ధులను ఒక్కరొక్కరిగా ఇంటర్వ్యూ చేసి, అందరి అభిప్రాయాలను క్రోడీకరిస్తే.. కన్నీళ్ల పర్యంతమవుతూ తొంభై శాతం మంది వెలిబుచ్చిన అభిప్రాయం ఏమిటంటే.. 'ప్రేమ అనేది ఒక భ్రాంతి' అని. అది యవ్వన దశలో ఉడికిస్తూ, ఉరికిస్తూ మత్తులా మనిషిని కమ్మేసి, చక్కిలిగిలి పెట్టి.. రాగితీగలో నుంచి అంతర్ధానమయ్యే కరెంటులా మాయమైపోతుంది. వయసు పెరుగుతున్నకొద్దీ వెలిసిపోయే రంగులా అంతా పాలిపోయి, పాతచెప్పులా మిగులుతూ, ఒట్టి వెలిసిపోయిన వాసనలేని కాగితపు పువ్వులా మిగిలిపోతుంది ప్రేమ.. పరమ వికారంగా! ఇక భయం.. నిత్య నూతనమూ, నిత్య యవ్వనీ అయినది. చిన్నప్పుడు నాన్న కొడతాడనీ, అమ్మ తిడుతుందనీ భయం. బడికి పోకుంటే పంతులు దండిస్తాడని భయం. పెద్దయ్యాక ఆఫీసర్ తిడతాడని భయం. తప్పు చేస్తే ఇంక్రిమెంట్ కట్ చేస్తాడనీ భయం. రోజులు గడుస్తూంటే.. మాట వినకుంటే పెళ్లాం రాత్రికి అన్నీ బంద్ చేస్తుందని భయం.

ఒకప్పుడు మనకు భయపడే పిల్లలు.. మనల్ని భయపెట్టే స్థితికి ఎదిగిన తర్వాత, అవమానకరంగా భయపడలేక భయం. పోలీసోళ్లతో భయం, ఫీజులు ఇచ్చుకొని కూడా డాక్టర్లతో భయం. రాజకీయాల్లోనైతే పార్టీ పెద్ద పదవులివ్వడని భయం, ప్రమోషన్లు ఇవ్వడని భయం.. చివరికి పిల్లలు చరమదశలో పట్టించుకోక కుక్కతిట్లు తిడతారని భయం.

భయమే శాశ్వతం! భయమే సత్యం! భయమే నిత్యం! భయమే జీవితమై.. అంతిమంగా అనుక్షణం వెంటాడుతూ రోగాలతో, నొప్పులతో సంక్లిష్టమై, చావుగా పరిణమిస్తూ.. భయమే మృత్యువు. 'కాబట్టి డియర్ ఫ్రెండ్స్! మనం భయమనే ఆయుధంతోనే ఈ సమాజాన్నీ, రోగగ్రస్తమైన ఈ వ్యవస్థలనూ, ఈ చిలుంపట్టి శిథిలమవుతున్న వర్తమానాన్నీ, అతిస్వేచ్ఛ అనే విచిత్రమైన వ్యాధితో బాధపడుతూ, దారి తప్పుతూ ఏ మరమ్మతులకూ లొంగని మొండి జబ్బుగా మిగిలిపోతున్న ఈ మనుషులను షాక్ ట్రీట్‌మెంట్‌తో సెట్‌రైట్ చేయాలె. బయల్దేరుదామా!'.. చిన్మయి తన నాలుగు బ్యాచ్‌లకు అప్పటికే స్పష్టమైన ఆదేశాలనూ, అసైన్‌మెంట్లనూ ఇచ్చింది. 30 మంది సుశిక్షితులైన నిజాయితీగల పోలీసులు ఒక జట్టు.

ఏక కాలంలో నాలుగు స్థావరాలపై దాడి.

ఔటర్ రింగ్‌రోడ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో.. ఒక ఫార్మ్‌హౌజ్. ఐదు ఎకరాలు. మధ్యలో దేదీప్యమానంగా వెలిగిపోతూ విలాసవంతమైన విల్లా. బయట అతివిశాలమైన పార్కింగ్ ఏరియా. టైల్స్‌తో ఫ్లోరింగ్. అన్నీ హైఎండ్ కార్లు. బీఎండబ్ల్యూ స్థాయికి తగ్గకుండా జాగ్వార్లు, మెర్సిడెజ్ బెంజ్, ఆడి, పోర్చే, లెక్సస్, వోల్వో, ఫెరారీ, ల్యాండ్ రోవర్ వంటివి. వాటిని చూస్తేనే చిన్మయికి అర్థమైపోయింది.. లోపల మనుషులు ఎవరెవరు ఉంటారోనని.

అదొక అనఫీషియల్ అడ్డా. అసలు ఈ ప్రభుత్వాలకు సకల అక్రమ దందాలకు ఆలవాలమై, అక్రమార్జనతో సర్వ దుర్లక్షణాలను కలిగి 'డబ్బు మదం' అనే వ్యాధితో కళ్లనూ, చూపునూ కోల్పోయి, హృదయాన్ని పోగొట్టుకొని, పొగరూ, దర్పమూ తలకెక్కి.. కన్నూ మిన్నూ కానక వ్యవహరించే ఒక ప్రత్యేక జాతితో ఏమి పని. ఈ మదాంధ జనానిది గుడ్లగూబ జాతి. దినమంతా ఎక్కడెక్కడో మంది కొంపలు ముంచుతూ, దేశాన్ని పందికొక్కుల్లా తోడుకు తింటూ.. రాత్రుళ్లు మాత్రం అతి చురుగ్గా సమూహాలు సమూహాలుగా, ఈ అసాంఘిక స్థావరాల్లో మిలాఖాతై.. బృందాలు బృందాలుగా సంచరించే రాక్షస తెగ అది.

బ్రోకర్లు, తార్పుడుగాళ్లు, పేకాట, డ్రగ్స్, ఆల్కాహాల్, వ్యభిచారం.. మనుషుల బలహీనతలన్నిటినీ క్యాష్ చేసుకుంటూ, అన్ని రకాల సౌఖ్యాలను 'అమ్మకానికి' పెట్టగలిగే వృత్తిలో తరించే పరాన్నభుక్కు అజ్ఞాత వర్గం ఒకటుంటుంది ఈ ఉన్నతవర్గ సమాజంలో!

‘గాలం వేసి చేపను పట్టు’, ‘చేపను వలలో పెట్టి బ్లాక్ మెయిల్ దందా చెయ్’, ‘యూజ్ అండ్ త్రో.. త్రో అండ్ ఎగైన్ యూజ్’, ‘హిట్ అండ్ మిస్’, ‘కిల్ అండ్ ఎస్కేప్’ వంటి థియరీలతో కర్కశ సాధన చేసిన జన్మతః క్రిమినల్స్ వాళ్లు. ఈ దేశ దౌర్భాగ్యమేమిటో గానీ, ఈ ప్రభుత్వాలకూ ఈ క్రిమినల్స్‌తోనే చాలా చాలా పని ఉంటుందెప్పుడూ ఎందుకనో. లేకుంటే ఈ దేశ పవిత్ర లోక్‌సభలో 50% మంది ప్రజాప్రతినిధులు నేరస్థులే ఎందుకుంటారు?

ముందు చిన్మయీ, భద్రుడూ మరో ఇద్దరు షూటర్స్ మఫ్టీలో వెళ్లారు లోపలికి. లోపల అంతా ఫిష్ మార్కెట్ కోలాహలం. ఒక పెద్ద రేవ్‌పార్టీ. హైదరాబాద్‌లోని చాలామంది కార్పొరేట్ హాస్పిటళ్లకు చెందిన ప్రసిద్ధ డాక్టర్లు ఉన్నారక్కడ.. తూలుతూ, అమ్మాయిల కౌగిళ్లలో తూగుతూ! విచ్చలవిడి శృంగార ఛాయలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడా ఓ ఇరవై ముప్పై పేకాట టేబుల్స్ ఉన్నాయి. టేబుల్స్ పైనే ఐదు వందల, రెండువేల రూపాయల నోట్ల కట్టలు పరిచి.. అంతా ఓ గమ్మత్తయిన మందూ, తిండీ మసాలాల వాసన.. పెర్ఫ్యూం మత్తు.. కల్లు దుకాణం కన్నా అధ్వాన్నంగా కోలాహలం! బేరర్స్ అందరూ శృంగారాన్ని ఒలకబోస్తున్న వయ్యారులే. చిన్మయి సూచనతో భద్రుడు వెళ్లి ఒక రౌండ్ అంతా పరికిద్దామని కదులుతూండగా.. ఇద్దరు బౌన్సర్లు ఉరికొచ్చారు. భద్రుడు చాలా హుందాగా, వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తుండగా.. అర్థమైపోయింది నిర్వాహకులకు. ఇటువంటి డెన్‌లను నిర్వహించే వాళ్లందరిదీ నిజానికి రేచుకుక్క జాతి అయిఉంటుంది. వాసన పసిగట్టి ఎదురుదాడి చేయడం, అవసరమైతే తప్పించుకొని నీటిలోకి చేపలా జారిపోవడం వాళ్లకు అబ్బిన జన్మవిద్య. ఓ పది నిమిషాలు భద్రుడూ అండ్ అదర్స్.. ప్రాథమిక చర్యలు ప్రారంభించిన తర్వాత, చిన్మయి తన చేతిలోని పిస్టల్‌ను గాలిలోకి కాల్చి ఒక ఉలిక్కిపాటును క్రియేట్ చేసి.. సడెన్‌గా ఒక తుఫాన్ ఉప్పెనగా మారి పైబడ్డట్టు.. అంతా కకావికలు. చెల్లాచెదురు. తత్తరబిత్తర. అప్పుడు ప్రవేశించింది మిగిలిన ఇరవైకిపైగా పోలీసుల బృందం..

ఓ వార్నింగ్.. ‘ఎక్కడివాళ్లక్కడే ఉండండి. డోంట్ మూవ్’ అని గంభీర ప్రకటన. టీవీల్లో ‘బ్రేకింగ్ న్యూస్’ బాంబులు పేలుతున్నాయి. రాజకీయ నాయకులు, సెలెబ్రిటీలు, పెద్దమనుషులు, బడా బాబులు, పరువులేని పనులు చేస్తూ పరువుకోసం పాకులాడేవాళ్లు.. గంట తర్వాత లెక్క తేలింది. ఎనిమిది మంది నిర్వాహకులు, ఒక ఆర్గనైజర్, దాదాపు వందమంది ఏజెంట్లు, మొత్తం వందకు పైగా యవ్వనవతులైన అమ్మాయిలు. గదుల్లో కొనసాగుతున్న అసభ్యకర శృంగార సంభోగ తంతు. భారీ స్థాయిలో డ్రగ్స్.. వయాగ్రా వంటి అనేక ఉద్దీపన టాబ్లెట్లు!

***

రెండో స్థావరం. ఔటర్ రింగ్ రోడ్డుకు దగ్గర్లో ఓ పది ఫర్లాంగుల దూరంలో.. ఒక

నిశ్శబ్ద ఫార్మ్‌హౌజ్.. రెండు ఎకరాల్లో. బయట బోర్డ్.. వెంకటేశ్వరా గెస్ట్‌హౌజ్. లైట్లు వెలుగుతున్నాయి దేదీప్యమానంగా. ఎక్కడా ఎవరూ లేరు. పోర్టికో కింద ఐదారు మోటార్ సైకిళ్లు.. బుల్లెట్లు, పల్సర్, హార్లే డెవిడ్‌సన్.. ఇంకా ఏవేవో స్పోర్ట్స్ బైకులు. జీప్‌ను చూడగానే లోపలి నుంచి నెత్తికి రుమాలు చుట్టుకున్న ఒక రైతువంటివాడు పరుగెత్తుకొచ్చాడు.

చేతులు కట్టుకొని.. 'అయ్యా!' అన్నాడు వినయంగా.. భయం భయంగా. 'ఎవరిదీ గెస్ట్‌హౌస్?'. ఆ పల్లెటూరి మనిషి తన బనీను జేబులో నుంచి ఒక విజిటింగ్ కార్డ్ తీసిచ్చాడు. లయన్ జి. రమణకుమార్. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రిటైర్డ్). గచ్చీబౌలీ. ఇంకేవేవో వివరాలు.

'లోపలెవరున్నారు?'. 'ఆ.. మా అయ్యగారి బిడ్డ'. 'ఇంకా?'. 'ఆమె దోస్తీగాళ్లు'. 'మొత్తం ఎంతమంది?'. 'నలుగురు ఆడోళ్లు.. ఆరుగురు మొగపోరగాళ్లు సర్'. 'ఎప్పుడొచ్చిండ్లు?'.'కాలేజీ నుంచి పగటీలి దొరా'. 'ఇప్పుడేం చేస్తాండ్లు లోపల?''గదే.. తాగుడు తినుడు. మూజిక్ పెట్టుకొని చెంగడబింగడ ఎగురుడు! రూంలల్లకు పోయి ఇష్టమొచ్చినట్టు వాయివరుసలు లేకుంట దుకాణం పెట్టుడు' 'మరి నువ్వేం జేస్తాన్నవ్?'. 'నేనేంజేస్త దొరా.. బక్కపీసుగాన్ని. ఈ చెల్క నాదే! రెండేండ్ల కింద అమ్మిన ఈ పోలీస్ సార్‌కు. పది లచ్చలకు. ఐదిచ్చిండు. ఈ బంగ్లా కట్టిండు.. మిగిలిన పైసలియ్యిమంటే.. 'ఏ పోరా! ఇత్తతియ్యిర. ఏం జేసుకుంటవ్ పైసల్.. ఇక్కడ్నే పనిజెయ్యి నా దగ్గర..' అంటడు. అడిగి అడిగి మా ముసల్ది పానం తీసుకుంది ఉరేసుకొని. అగో ప్రతిరోజూ వాని బిడ్డ, లేకుంటె వాని మదమెక్కిన కొడుకు.. దోస్తులను వెంటేసుకొని వస్తరు. ఒకటే తినుడు తాగుడు.. దుకాణం పెట్టుడు రూంలల్ల. ఛీఛీ లండు ముండలు, దొంగ ముండా కొడుకులు సారు'.

.. అంతా అర్థమైపోయింది సీఐ అర్జున్‌రెడ్డికి. లోపలికి సరసరా వెళ్లి.. స్వర్గలోకంలాంటి ఆ ఇంటీరియర్‌లో.. ఫస్ట్ ఫ్లోర్‌కి వెళ్లి ఒక గది తలుపులను హ్యాండిల్‌తో బాది.. తెరుచుకున్నాక చూస్తే.. మద్‌హోష్‌లో తూలుతూ ఒక రొయ్యకాళ్ల పోరడు.. అటుపక్క బెడ్ మీద ఒంటిపై బట్టలు తొలగిపోయి అన్నీ కనబడుతున్న స్థితిలో ఇద్దరు అమ్మాయిలు.. మద్‌హోష్. దగ్గరికి వెళ్లి పరిశీలనగా గమనిస్తే.. ఐదారు ఖాళీ బీర్ సీసాలు, పక్కన సిల్డినాఫిల్ సిట్రేట్ పెనెగ్రా టాబ్లెట్స్.. టాడాల్ఫిల్ మెగాలిస్ – 50 బిళ్లలు.

ఈ విచ్చలవిడితనం.. అతి స్వేచ్ఛ, ఎవరి హద్దూ అదుపూలేని బీభత్స ప్రవర్తన.. అడిగేవాళ్లెవరూ లేని.. ఒకరకంగా అస్సలే పట్టించుకోని తల్లిదండ్రులు. ఏమిటిది? వీళ్లేనా భావిభారత పౌరులు. 'కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు' అని శ్రీశ్రీ చెప్పింది అక్షరాలా సత్యమేగదా!

అర్జున్ రెడ్డి మొబైల్ మోగింది. 'రిపోర్ట్'.. చిన్మయి గొంతు. 'మనకొచ్చిన రిపోర్ట్ కరెక్టే

మేడం'. 'హౌమెనీ?'.'నలుగురు అమ్మాయిలు.. ఆరుగురు అబ్బాయిలు'.'కరెక్టా? అందరి వివరాలు రికార్డ్ చేసుకొని, అందరినీ అరెస్ట్ చేసి తీసుకురా స్టేషన్‌కు'. 'ఓకే మేడం!'. 'ఓవర్'..

***

స్థావరం మూడు. జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 12. మధురా బృందావనం. రాత్రి మూడున్నర.

సెక్యూరిటీ గూర్ఖా లోపలికి రానివ్వలేదు.. ఎవ్వరినీ ఎంత సముదాయించినా! చిన్మయి సైగ చేయగానే భద్రుడు వాణ్ని మెడలమీద ఒకరకంగా మెలికపెట్టి ఒత్తాడు. అంతే.. వాడు స్పృహతప్పి గిలగిలా కొట్టుకున్నాడు.

పది పోలీస్ టొయోటా కార్లు బుల్లెట్లలా దూసుకొచ్చి, ఆ విశాల ఆవరణలో ఆగాయి. అంతా నిశ్శబ్దం. అటు పక్కన ఒక షెల్టర్ కింద లోపల ఉన్న తొమ్మిదిమంది ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలూ.. ఒక అధికార పార్టీ మంత్రికి చెందిన మొత్తం పద్దెనిమిదిమంది గన్‌మెన్లు మస్తుగా తాగి, కూర్పాట్లు పడుతూ ఏ ఒక్కరు వచ్చినా.. చిన్మయి, పోలీస్ కమిషనర్ గానీ, ఇతర హయ్యర్ ఆఫీసర్లు గానీ గమనించకుండా పొర్లుతున్న తరుణంలో..

ఒక విశాలమైన హాల్‌లో, నిశ్శబ్ద విందు జరుగుతున్నది. టేబుళ్ళపై అన్నీ ఇంపోర్టెడ్ సీసాలు. వివిధ రకాల వెజ్, నాన్ వెజ్ అద్భుత వంటకాలు. అందరికీ సర్వ్ చేస్తున్న ఆడ పరిచారికలు.. ఏదంటే అది అందించేందుకు!

చిన్మయి లేజర్ చూపులతో అందర్నీ గమనించి.. గుర్తుపట్టి.. అధికార పార్టీ మంత్రి మాట్లాడుతున్నాడు లోస్వరంతో.. 'ఇప్పటిదాకా మన ఆడిటర్ గారు మీరందరూ ఇటీవలి ఎన్నికల్లో పెట్టిన ఖర్చును మదింపుజేసి.. అనుకున్న ప్రకారం దానికి రెట్టింపు మొత్తాలను అన్నీ రెండువేల నోట్లతో సూట్‌కేసుల్లో నింపి మీ మనుషులకు చెప్పి భద్రంగా మీరు చెప్పిన ఇండ్లకు చేరవేశారు. ఇట్స్ ఓవర్. ఇక రేపు మీరు పార్టీ మారుతున్నట్టు స్పీకర్ గారికి అఫీషియల్ ఫార్మాట్‌లో ఒక వినతిపత్రం ఇస్తారు. మిగతా అన్ని సంగతులను మన లెజిస్లేచర్ సెక్రెటరీ చూసుకుంటాడు. ఒకే!'.

టపటపా చప్పట్లు. ఆ ప్రసంగాన్నీ, పరిసరాలనూ అదృశ్య కెమెరాలు రికార్డ్ చేశాయి. చిన్మయి మెల్లగా చప్పుడు కాకుండా నడుస్తూ, అందరూ విందుకోసం కూర్చున్న చోటుకు వెళ్లి నిలబడి.. నిశ్శబ్దంగా చూస్తూండగా.. మంత్రిగారి పీఏ మొబైల్‌తో ఎవరికో ఫోన్ చేయబోయాడు. 'నో మిస్టర్ జగదీశ్!' అని అరిచింది చిన్మయి. అంతా నిశ్శబ్దం. 'యు ఆర్ ఆల్ అండర్ అరెస్ట్'.

అంతా ఉక్కపోత.. అందరికీ! ఆ చల్లని ఏసీ హాల్‌లో.. ఎందుకో బయట కుక్కలు గుంపుగా అరవడం వినిపిస్తున్నదప్పుడు.

***

రాష్ట్రం అట్టుడికిపోయింది.. అన్ని టీవీ ఛానెళ్లలో బ్రేకింగ్ న్యూస్‌లతో. ఉదయం ఆరు వరకు చిన్మయి నాలుగో స్థావరం.. నగరంలోని పది ఆన్‌లైన్ వ్యభిచార గృహాల్లోనుంచి మొత్తం ఇరవై రెండుమంది వేశ్యలను పట్టుకొని తెచ్చారు. అందరూ రాజమండ్రి, పాలకొల్లు, కరీంనగర్, వరంగల్‌కు చెందినవాళ్లు. ప్యాసింజర్ ఆన్‌లైన్‌లోనే మనిషిని నెట్‌లో చూసి బుక్ చేసుకుంటాడు. డబ్బును ఫోన్ పే చేస్తాడు చెప్పిన అకౌంట్‌కు. వాళ్లు ఓటీపీ లాగా ఒక కార్ నంబర్ ఇస్తారు.. టైంతో సహా! ఆ సమయానికి కారూ, అమ్మాయీ వస్తారు ప్యాసింజర్ అపార్ట్‌మెంట్‌కు. అంతా వస్తు మార్పిడి. నో రిఫండ్.

చిన్మయి ముందే కోర్టునూ, జిల్లా కలెక్టర్‌నూ, తనలా ఏకరీతి అభ్యుదయ ఆలోచనలుగల సహ ఐపీఎస్ అధికారులనూ కలిసి.. కోర్టులో సూమోటో పిటిషన్ కోసం విజ్ఞప్తి చేసి.. ఒక అవినీతి ప్రతిఘటన ఉద్యమాన్ని నిర్మిస్తున్నది. ఉదయం పది గంటలకు.. జూబ్లీ హిల్స్, రోడ్ నంబర్ 10.. పార్క్ ఏరియా. పదుల సంఖ్యలో అన్ని మీడియా చానెళ్ల కెమెరాలు కళ్లు తెరిచి చూస్తూండగా..

చిన్మయి తన వెంట పదుల సంఖ్యలో సహ ఐపీఎస్ ఆఫీసర్లను తీసుకొని.. అందరూ మోస్ట్ యంగ్.. వెంట గత దినపు చానెళ్లలో ప్రకటించిన నాలుగు స్థావరాలపై జరిగిన దాడుల్లో అరెస్ట్ చేసిన మొత్తం నూటా అరవై రెండు మంది.. డాక్టర్లు, లాయర్లు, కొందరు పోలీస్ ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఒక మంత్రి, అనేకమంది వేశ్యలు, కాలేజ్ ఎగ్గొట్టి రసికులైన ఫాంహౌస్ పావనకారులు, విద్యార్థులు.. అందరినీ ఫొటోలతో సహా.. ప్రజల సందర్శనార్థం ప్రత్యక్ష పరిచినపుడు..

అక్కడ ప్రజల తీర్థం.. జాతర! సమాజంలో సెలెబ్రిటీలుగా చెలామణి అవుతున్నవాళ్లు.. తప్పుచేసిన చిన్న శిశు తరగతి పిల్లలకన్నా హీనంగా సిగ్గుతో తలవంచుకొని నిలబడి ఉన్న పెద్దలను చూస్తూండగా.. చిన్మయి మాట్లాడటం ప్రారంభించింది. 'వీళ్లందరూ ఏ కారణం చేతనైతే అరెస్టయి మీముందు నిలబడి తలలు వంచుకొని ఉన్నారో.. ఇప్పుడు వాళ్లకు చాలా స్పష్టంగా అర్థమవుతున్నది. తాము ఎంత బ్లండర్ చేశారో! ఈ క్షణం వీళ్లందర్నీ వాళ్ల వాళ్ల భార్యాపిల్లలు, కుటుంబసభ్యులు, స్నేహితులు టీవీల్లో చూస్తూంటారు. వీళ్లను కోర్టులో ప్రవేశపెడితే, ఎన్ని రూపాయలు జరిమానా విధించినా నిస్సిగ్గుగా కట్టి జారుకుంటారు. మళ్లీ మళ్లీ ఇటువంటి తప్పులే చేస్తుంటారు. నిజానికి ఈ ప్రవర్తనకు కారణం.. వీళ్లలో జెనెటికల్‌గా ఉన్న నేరప్రవృత్తి. విచ్చలవిడితనం. అనుభవిస్తున్న అతిస్వేచ్ఛ. సమాజంపట్ల అసలు బాధ్యతే లేని జులాయితనం. మనుషులకు అసలైన శిక్ష.. వాళ్ల పరువు పోతున్నప్పుడు తెలుస్తుంది. ఇప్పుడు ప్రజలముందు సిగ్గుతో తలదించుకొని నిలబడ్డ వీళ్లందరూ.. ఇకముందు ఇటువంటి తప్పులను మళ్లీ చేయరని బలంగా నమ్ముతాను నేను. కోర్టు వీళ్లకు జరిమానా విధిస్తే అప్పుడే కట్టి వెళ్లిపోతారు. లేదా డబ్బు కట్టి బెయిల్ తెచ్చుకుంటారు. దోషిగా

నిలబెట్టి మనిషిలో పరివర్తన తెచ్చినపుడు.. అది మనిషిని శాశ్వతంగా మారుస్తుంది. మరో ముఖ్యమైన విషయం గమనించండి.. వీళ్లందరూ బాగా చదువుకున్నవారు. విద్యావంతులు. వీళ్లే ఎక్కువగా తప్పులు చేస్తూ సమాజానికి తలవంపులు తెస్తున్నారు. ఈ దేశానికి వేల కోట్ల రూపాయలను బ్యాంకులద్వారా ఎగ్గొట్టి మోసం చేస్తున్నవాళ్లందరూ ఉన్నత విద్యావంతులూ, హైలీ క్వాలిఫైడే! వేలకోట్ల రూపాయలను ఈ రకంగా తస్కరించినవాళ్లే ఈ మన సమాజానికి చీడపురుగులు..' చిన్మయి గంగలా గలగలా ప్రవహిస్తున్నది.

ఒక్క గంగే క్షేత్రాన్నంతటినీ శుభ్రిస్తూ ప్రక్షాళన చేయగలదా? భ్రష్టుపట్టి పోతున్న విశృంఖలతతో తమను తామే ధ్వంసించుకుంటున్న ఇప్పటి తరం ఈ సత్యాన్ని గ్రహిస్తూ స్పృహించాలె.. ఆలోచించండి. ప్రతి మనిషీ ఒక నది కావాలె. ప్రవహించాలె. మనందరి చుట్టూ కాలుష్య కారకాలైన టీవీ, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, చేయి చాస్తే అందే సకల విచ్చలవిడి సౌకర్యాలు, ల్యాప్‌టాప్‌లు.. ఇవన్నీ రెండువైపులా పదునున్న కత్తుల్లాంటివి.

మనల్ని మనమే.. మనపైకి దండెత్తే ఈ అదృశ్య కాలుష్యంనుంచి కాపాడుకోవాలె!

***

ఆలోచన ఒక అగ్నిమొలక. అది దహిస్తుంది.. వెలుగిస్తుంది కూడా!

**1950 లో జన్మించిన ప్రొఫెసర్ రామా చంద్రమౌళి మెకానికల్ ఇంజనీరింగ్ లో పోస్ట్ గ్రాడ్యుఏషన్ పూర్తి చేశారు. ప్రస్తుతం వరంగల్‌లోని 'గణపతి ఇంజనీరింగ్ కాలేజ్' లో వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఆయన కవి, కథకులు, నవలాకారులు, విమర్శకులు. ఇంతవరకు 76గ్రంథాలను ప్రచురించిన చంద్రమౌళి 32 నవలలు, 385 కథలు, 12 కవిత్వ సంపుటాలు, 3 నాటకాలు, 4 విమర్శా గ్రంథాలను వెలువరించారు. తెలంగాణ రాష్ట్ర అత్యున్నత సాహిత్య అవార్డ్ 'కాళోజీ పురస్కారం – 2020' ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ–రరావు గారి చేతులమీదుగా అందుకున్నారు. చంద్రమౌళి గారి కథలు, కవిత్వం , నవలలు అనేకం పంజాబి, తమిళం, కన్నడ, బెంగాలి, హిందీ వంటి తెలుగేతర భారతీయ భాషల్లోకి అనువదించబడి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని సమకూర్చిపెట్టాయి.**

**2386 ఎంట్రీలను పరిశీలించి ప్రపంచవ్యాప్తంగా 60 మందికి ప్రకటించిన 'నాజి నామన్ ప్రపంచస్థాయి జీవితకాల సాఫల్య పురస్కారం– 2019' భారతదేశంలో ఒక్క రామా చంద్రమౌళికి మాత్రమే దక్కింది.**



ఐతా చంద్రయ్య

# సాధనా శూరత్వము

'సదువు సక్కగ లేనోని బతుకు.. సముద్రంల నాటుపడవ లెక్కుంటది' అని అనుకుంటున్న రాజారాం మెదడు అల్లకల్లోలంగా ఉన్నది. అదే మనాది ముల్లెను కొడుకు ముందు విప్పిండు. కొడుకు పరశురాములు అల్లాటప్పా మనిషి గాదు.

'నీ యవ్వ! ఇదంతా నువ్వే జేసినవు. కులకష్పి అనుకుంట బడికి సరిగ్గా పోనియ్యకపోతివి'.. పరశురాములు కొరకొర చూపులు, రాజారాం పొత్తి కడుపును పరపర కోసేస్తున్నట్టున్నయ్.

'వాణ్ని బడికి తోలియ్యకుండ తాతల నాటి విద్య నేర్చుకొమ్మని తల్కాయె దింటివి. వానికో బంగిరిద్దెల విద్య నేర్పితివి. వాడు అందరిలెక్క బడికి వోతె పదో తరగతి ఎప్పుడో పాసైపోతుండె. ఆ బంగిరిద్దెల విద్యను

ఇప్పుడెవ్వడూ దేకుతలేడు. ఈ బోడ్‌సోడ్ విద్యను నమ్ముకొంటే బతుకు నడిగంట్ల నాగిలిడిశినట్టాయె' రాజారాం భార్య మణెవ్వ కడుపుల కుతకుతలాడుతుంది. ఆ మాటలు విన్న రాజారాంకు వీపుమీద సురుకులు వెట్టినట్టు అయ్యింది. ఓర్చుకోక తప్పలేదు. అప్పుడే పరశురాములు మనసుల ఓ ఇత్తనం నాటుకుంది.

'నన్ను ఎటుగాకుంట చేసినవు గదా! నిన్ను ముప్పు తిప్పలు వెట్టి, మూడు శెర్ల నీళ్లు దాగిస్తా!' అన్నడు తండ్రితోటి. 'అయిందేదో అయ్యింది. ఇంట్ల బాగా సదువుకొని ఆ పదో తరగతి పరీక్షలు మల్లా ఇయ్యచ్చు గదా?' రాజారాం సలహా.

గట్ల ఎన్నిసార్లు జెప్పినా పరశురాములు ఒగ్గూపినట్టు తల్కాయె ఊపె. గానీ, పుస్తకమైతె పట్టకపాయె. లండు సోపతులు వట్టి దున్నపోతుల లెక్క తిరగవట్టె.. రాజారాం రంది.

పెద్దలిచ్చిన భూమి అమ్మి ఇద్దరాడ పిల్లల లగ్గం జేసిండు. చెల్లెండ్ల లగ్గాలాయె.. ఇంకా తన లగ్గం కాలేదని వాని కసి. కులవృత్తి కళలకు ఆదరణ అడుగంటె. సంపాదన లేని పరశురాములుకు ఎవ్వలూ పిల్లను ఇవ్వకపోయిరి. తండ్రి విద్యను తాను నేర్చుకొని, ప్రదర్శించి నాలుగు పైసలు సంపాదించకపాయె.

వారం కింద.. 'వారీ పర్శరాములూ! సిరిసిల్లల నాకు తెలిసినోల్లున్నరు. వాళ్లతోని మాట్లాడ్తా. నువ్వక్కడికి వొయ్యి సాంచాలు నడుపుడు నేర్సుకొని, గదే సాంచాలల్ల జీతముంటె బాగుంటది' రాజారాం సలహా. 'సగమీడు దిరిగినంక సముర్త కట్నాలన్నట్టు.. ముప్పయేండ్లు ముడ్డికిందికొచ్చె. గా ఊర్లె జీతముంటడా?' భార్య జవాబు. వాడు ముందే ఆవారాగాడు. వానికి తల్లి ఊదుపొగ ఎయ్యవట్టె. 'ముందుగాల నాకు లగ్గం జెయ్యి. గప్పుడాలోచిస్త' కొడుకు సిగ్గు విడిచిండు. 'గదేదో శాస్త్రముంది! పిచ్చి కుదిరితే పెండ్లయితది. పెండ్లయితే పిచ్చి నయమైతది.. అన్నట్టు నీకు సొంత సంపాదనుంటే ఎవ్వడైన పిల్లనిస్తడు..'.

పరశురాములు వొయ్యి ఊరుమీద వడ్డడు. రాజారాం మంచమ్మీద ఒరిగిండు. తేనెతుట్టెలోని తేనెటీగల్లాగ ఆలోచనలు.. పాత జ్ఞాపకాలు మెదడును ముసురుకుంటున్నయి.

***

ఆ రోజులల్ల కులవృత్తి విద్యలు బలంగా సాగుతుండేవి. సాధనాశూరుల విద్య ప్రదర్శన చూసి, అంతా సంతోషించి ధాన్యం, పైసలు ఇచ్చేటోళ్లు. కూరగాయలు, ఇంకేవేవో దానమిచ్చెటోళ్లు. శ్రీమంతులు కొత్త బట్టలు పెట్టేటోళ్లు. రందిలేని జీవితం.

ఆ ఊరు చింతమడక. కామునికంత పెద్ద చౌరస్తా. ఆ రోజు సాధనాశూరుల విద్య ప్రదర్శన. బెల్లం చుట్టూ ఈగల లెక్క జనాలు గుమిగూడిండ్రు. ఆట చూపించెటోళ్లు.. అనుభవమున్నోళ్లు. ఊరి మస్కూరీలు అందరినీ పద్ధతిలో కూర్చుండబెట్టిండ్రు. ప్రదర్శన షురువైంది.

పెద్దమనిషి ముందట నీళ్లు, పసుపుపొడి, ఇటుకపొడి తాంబాలాలున్నయి. పసుపు, ఇటుకపొడిని కలిపి నీళ్లు బోసిండు. అందులోకి సూర్య కిరణాలు తొంగి చూస్తున్నయి. చేతులు పైకెత్తి దండం బెట్టిండు.

'ఇటుకపొడి, పసుపుపొడి నీళ్లల్ల కలిసినై గదా! కలిసిపోయిన వాటిని నీళ్ల నుంచి పొడిపొడిగా తీస్తున్నా..' అంటూ ఇటుకపొడి తీసి ఒక తాంబాలంల, పసుపు పొడి తీసి వేరే తాంబాలంల పోసిండు. చప్పట్లు మార్మోగినయి.

'ఇంకోటి చూడుండ్రి..' పెద్దమనిషి నవ్విండు. నాలుగు పందిరి గుంజలను నాలుగు దిక్కుల పాతిండ్రు. మొదటి గుంజకు యువకుడు నారాయణను కట్టేసిండ్రు. మీద, చుట్టూ పరదాలు కట్టిండ్రు. లోపల నారాయణ ఒక్కడే ఉన్నడు. రెండు నిమిషాలాగి పరదాలు విప్పేసిండ్రు. ఈ గుంజకున్న నారాయణ మరో గుంజకు కట్టేసున్నడు.

చప్పట్లతో చౌరస్తా మురిసింది. నారాయణను అట్లే ఉంచి, మళ్లీ పరదాలు కట్టిండ్రు. నారాయణ పందిట్లనే ఉన్నడని అనుకున్నారంతా. పెద్దమనిషి నారాయణను పిలిచిండు.

'వస్తున్నా..' అనుకుంట నారాయణ జనాల గుంపులోంచి వచ్చిండు. పరదాలు విప్పి చూస్తే.. ఎవరూ లేరు. మళ్లీ చప్పట్ల జడివాన. చుట్టూ జనాల గుంపు బాగా పెరిగింది.

ఈల వేసి పెద్దమనిషి రాజును పిలిచిండు. గుంపుల నుంచి వచ్చిన రాజు చేతుల వేపరెమ్మలు ఉన్నయి. ఇద్దరు మనుషులు రాజును కింద కూచోబెట్టి, వేప రెమ్మలు నెత్తిమీద పెట్టిండ్రు. పక్కన ఉన్నాయన రెడీగా ఉన్న సిమెంటు పొయ్యిని నెత్తిమీది వేప రెమ్మలమీద పెట్టిండు. పొయ్యిలో గ్యాసునూనెలో తడిపిన బట్టపేగులేసి, అగ్గిపుల్ల గీసి అంటుబెట్టిండు. పొయ్యి మీద వెట్టిన గిన్నెల నూనె ఉంది. పొయ్యిల మంటలు లేస్తున్నయి. ఇంకొకాయన గోధుమ పూరీలు చేసి, గిన్నెలో వేసిండు. పూరీలు దేవి తీసిండు. రాజు ఖుషీగా నవ్వుతున్నడు.

'అరె! నెత్తిమీద మంట వెడితే జుట్టుగూడ కాలలేదు'.. జనాల మాటల్తో చప్పట్లు లేచినయి. పక్కనున్న చింతచెట్టు నవ్వుతున్నట్టు.. కొమ్మలు – రెమ్మలు గట్టిగా ఊగినయి.

'ఇంకో గమ్మతి చూడుండ్రి!' అంటూ పెద్దమనిషి ఇద్దరికి సైగ జేసిండు. వాళ్లు సొప్పబెండ్లు, దారంతోని మంచం, ఉయ్యాల తయారు చేసిండ్రు. పెద్ద కట్టెకు ఉయ్యాల కట్టిండ్రు. సొప్ప బెండ్ల ఉయ్యాల మీద పెద్దమనిషి కూసున్నడు. ఇద్దరు మనుషులు ఉయ్యాల కట్టెను లేపి, చెరో భుజమ్మీద పెట్టుకొని చుట్టూ తిప్పిండ్రు. బెండ్లు ఇరుగలేదు.. దారం తెగలేదు.

'అదెట్లా?' ఒకాయన అడిగిండు. 'ఈ విద్య మాకు దైవదత్తం..' పెద్దమనిషి జవాబు. మళ్లీ ఈలలు, చప్పట్లు.. ఆకాశానికి అంటినయి. ఇట్లా చిత్ర, విచిత్రాలు రెండు గంటలపాటు చూపించిండ్రు. ఓ పక్కన కుర్చీలో కూసున్న దొర.. 'బాగుందిరా సాధనాశూరుల విద్య! మా ఇంటికొచ్చి రెండు బుడ్ల వడ్లు తీసుకోండ్రి!' అని ఆదేశించిండు. 'దొరకు దండాలు! గిసొంటి వాళ్లతోనే బతుకుతున్నం. మీరు సల్లంగుండాలె దొరా!' పెద్దమనిషి దొర కాళ్లకు మొక్కిండు.

'గీ విద్య ఎట్ల నేర్చుకున్నరు రా?'.. దొర సందేహం. 'దొరా! వంశపారంపర్యంగా మా తాతతండ్రుల నుంచి వచ్చిన విద్య. తరం తర్వాత తరం నేర్చుకుంటున్నం'. దొర వెళ్లినంక.. జనాల మధ్య గుడ్డ పరిచి..

'దానం చెయ్యుండ్రయ్యా!' అంటూ అందరికీ దండం బెట్టిండు పెద్దమనిషి. నాణేలు,

నోట్లు.. ఆ పరిచిన గుడ్డలో జడివాన లెక్క పడినయి.

ఆ పెద్దమనిషే.. రాజారాం. ఇంకో నలుగురితో కలిసి ఊరూరా తిరుగుతూ బట్ట – పొట్టకు తిప్పలు లేకుండా గడిపేవాడు.

***

'ఏందయ్యా! గట్ల బీరిపొయ్యి కూసున్నవ్'.. మణెవ్వ గొంతు విని మరో లోకం నుంచి మానవలోకానికి వచ్చిండు రాజారాం. లేచి కూసొని చెయ్యి అందుకోబోయిండు. 'బాగానే ఉంది సంబడం..' చెయ్యి వెనక్కు లాక్కుంది మణెవ్వ. ముక్కుపుడక మెరుస్తూ ఉంటే.. మణెవ్వ చాయ గ్లాసు అందించింది. తానో చాయ గ్లాసుతో ఉంది. 'ఛీఛీ! వాని బతుకు బండవారిపాయె!'.. అంటున్న భర్త పక్కనే కూర్చొని, వేడి చాయ జుర్రుతున్నది మణెవ్వ. చాయ పాములెక్క నరాలల్లకు పాకింది. పానం ఉషారైంది. 'నేనేం జెయ్యాలె?'.. అన్నది.'ఎక్కడన్నా జీతముండడు. సొంత యాపారం పెట్టిద్దామంటే పెట్టువడికి పైసల్లేవాయె. పైసలు లేనోన్ని పెండల పురుగోలె తీసిపారేస్తరు. గౌర్మెంటు ఇస్తున్న గా పించినితోనే ఇల్లు గడువవట్టె. శిల్లర బాకీలు కుప్పలోలె ఉండె'. 'ఏదన్నా ఉపాయం జెయ్యాలయ్యా!'. 'గింత పెద్దిల్లు ఏం జేసుకుంటం? సగమంత అమ్మి వానికి కిరాణ దుకాణం పెట్టిత్తె బాగుంటది గదా?'. 'గట్లయితే ఇప్పుడేదో సదురుకోవచ్చు గానీ, వాని పెండ్లయినంక ఇరుకుటమైతదేమో..?'.'ఇరుకుడో.. గిరుకుడో.. వాడు తొవ్వల వడాలె!'. గప్పుడే గోడ మీది బల్లి అరిచింది. 'కృష్ణ కృష్ణా! బల్లి గూడ పలికింది. అట్ల జేస్తె బాగనే ఉంటది' రాజారాం ఆలోచన.

***

'అక్కా! ఓ అక్కా!' అనుకుంట ఇంట్లకు ఓ కొత్త మనిషొచ్చిండు. భార్యాభర్తలు అటు చూసింద్రు. పైజామా, గీతల షర్టు. భుజమ్మీద తుండుగుడ్డ, నుదుట భస్మరేఖలు, అతని వెనక ఇరవై ఐదేండ్ల పడుసు పిల్ల. సామ నలుపు, ముఖమ్మీద ఆరబోసిన అమాయకత్వం, చెవులకు రింగులు. ఆ కొత్తవాళ్లు మంచం దాకా వచ్చింద్రు. 'ఏందక్కా? నేను.. బావా! నీ బామ్మర్ది శంకరయ్యను. ఇది భవాని, నా బిడ్డ. బొంబై నుంచి అచ్చిన' అంటూ సూటుకేసు కిందవెట్టిండు.

మొగ్గలెక్క ముడుసుకున్న మణెవ్వ ముఖం.. బీరపువ్వోలె విచ్చుకుంది. 'నువ్వార శంకరీ! గిట్లయినవు ఏందిరా?' అనుకుంట సూటుకేసు తీసి, లోపల వెట్టింది. 'సుక్కతెగి వడ్డట్టు వచ్చినవురా' అంటూ తమ్ముని చేతులందుకొని కండ్లకద్దుకున్నది. 'ఒక ఉత్తరం గూడ రాయకపోతివి. నీ బిడ్డ అప్పుడు శిన్నపిల్ల. దీని పేరు భవాని గదా? నీ పెండ్లాం ఎట్లుందిరా?'.. అంటూ కుశల ప్రశ్నలేసింది. రాజారాం.. భవాని తలనిమిరిండు. మణెవ్వ దంపతుల కాళ్లకు మొక్కింది భవాని. 'మీ అమ్మ బాగుందా బిడ్డా?' అంటూ భవానిని లేపి, గుండెలకు హత్తుకుంది మణెవ్వ. 'మా అమ్మ.. అమ్మ..' అనంగనే.. భవాని కండ్లల్ల నీళ్లు దిరిగినయి. 'మీ

అమ్మకేమైందే?' మణెవ్వలో ఆత్రుత. 'అమ్మ.. సచ్చిపోయిందత్తా..' అంటూ గొల్లుమన్నది భవాని. మణెవ్వ కండ్లు మంచు పూలైనయి. 'గట్లెట్లరా..? శంకరా!' గుండె పిండినట్టయ్యింది. 'ఎవల బిశాది ఏందని గన్నేండ్ల కింద బొంబై వోతి!'.. తుండుగుడ్డతో కండ్లద్దుకున్నడు శంకరయ్య.

'మొదట్ల కూలిగ పన్జేసినక్కా! రాత్రింబగళ్లు పంజేస్తి. పెండ్లాన్ని తోల్కపోతి. పైసలు కూడవెట్టి సాంచాలు కొంటి. బట్టలు తయారుజేస్తి. నాకష్టం లెక్క సాంచాలు పెరిగినయి'.

'మరి!'.. కంటిధారల్ని మణెవ్వ కొంగుతో అద్దుకుంది.

'మంచి పిల్లగాన్ని జూసి భవాని లగ్గం జేత్తి! భవాని మొగడు ప్రైవేటు కంపెనీల పంజేసెటోడు. నా అల్లునిది రాజా గుణం. ఏడాది దిర్గకుండనే ఆళ్లకు కొడుకు పుట్టిండు. గంతల్నే ఏ దేవునికి కన్నుగుట్టిందో! నా బిడ్డ బతుకు అన్యాయమై పోయిందక్కా! ఓ రోజు ముగ్గురూ బైకు మీద సిన్మాకు పోతుంటే.. యాక్సిడెంటైంది. తండ్రి కొడుకులు అక్కడికక్కడే సచ్చిపోయిండ్రు. భవాని దెబ్బలతోటి బైటవడ్డది. నా భార్య, నేను బుద్దార ఏడ్శినం. బిడ్డ బతుకు ఆగమైందన్న రందితోనే నీ మర్దలు మంచంల వడ్డది. ఎన్ని దావకాండ్లు దిప్పినా దక్కలే! ఇగ మా గతి అంగట్ల అవ్వా అంటే.. ఎవనికి పుట్టినవ్ బిడ్డా? అన్నట్టుగైంది. మాకక్కడ నా అన్నవాళ్లెవరూ లేరు. గంతల్నే మీరు గుర్తుకొచ్చిండ్రు. మనసంతా పింజంపింజమైంది. ఇల్లు అమ్మేసి, సాంచాలు కిరాయికిచ్చి వచ్చినం' తన కథ మొత్తం చెప్పుకొచ్చిండు శంకరయ్య.

శంకరయ్య, భవానీ దుఃఖం కక్కేస్తుంటే.. రాజారాం, మణెవ్వ లోపలినుంచి పొంగుకొచ్చిన ఆవేదన అంతా ఇంతా కాదు. శంకరయ్యను గుండెలకు హత్తుకున్నడు రాజారాం. 'శంకరా! మనుషులమంతా పైవాని చేతిల ఆటబొమ్మలం. అదంతా రుణానుబంధం'.. తుండుగుడ్డతో బామ్మర్ది కండ్లు తుడిచిండు. 'అందరి సంగేతేందో గానీ, నా బతుకు బండల పాలైందత్తా!' అంటూ మేనత్త ఒడిలో ఒదిగిపోయింది భవాని.

'మనిషి బతుకుల కష్టసుఖాలు రెండూ ఉంటాయి భవానీ!' వీపు నిమిరింది మణెవ్వ.'నీ బతుకు బండలైందని అనుకోకు. మేమంతా ఉన్నం గదా!' అంటూ ఊరడించింది. గంతల్నే.. 'కల కానిదీ.. విలువైనదీ బతుకూ...' అంటూ సిన్మా పాట పాడుకుంట పరశురాములొచ్చిండు. ముందర వయసు పొంగులతోని భవాని కనబడింది. 'అబ్బో! ఏవలీ ముద్దుగుమ్మ? కొాచిప్పలోలె కండ్లు, చెక్కిన ముక్కు, గంత పొడుగు జడ..' అని మనసులోనే అనుకుంటున్నడు.

'ఏందిరా గట్ల జూస్తున్నవ్! అది భవాని! నీ మేన మరదలు. ఇగో.. మా తమ్ముడు శంకరయ్య. బొంబై నుంచి మూట ముల్లె సద్దుకొని వచ్చిండ్రు..' మణెవ్వ చొరవ సూపుకుంట అన్నది. 'మామా!' పరశురాములు ఆశ్చర్యానందాలు. 'మిమ్మల్ని చూసి చానా కాలమైంది. అంతా బాగున్నరా?'. 'ఏదో బిడ్డా! గిట్లున్నం. నా మేనల్లుడు శానా పెద్దోడైండు. పెండ్లాం పిల్లలంతా..' శంకరయ్య అయోమయంలో ఆశ.'ఆనికి ఇంక లగ్గమే కాలే. మన

సాధనాశూరుల విద్య నేర్సుకొని ఎటూ గాకుంట వోయిండు..' సంగతంతా చెప్పిండు రాజారాం.

ఆ దినం సాయంత్రం భవాని సంగతంతా పూస గుచ్చినట్టు చెప్పింది మణెవ్వ.. కొడుక్కు. భవాని, పరశురాములు చూపులు కలుసుకొని ఒకరినొకరి ఆసాంతం పరిశీలించుకుంటున్నరు. గుండెల గుసగుసలు. భవానికి తన పరిస్థితి గుర్తుకొచ్చి, గంభీరమైంది. మొహం ముడుచుకుపోయింది.

***

నాలుగు రోజులు గుంభనంగ గడిచినయి. గుండెల్ల గుండు సూది గుచ్చినట్టుగుంది భవానికి.. గది నుంచి బయటికి రాలేదు. అక్కను సూడగానే.. గుండెమంటల మీద నీళ్లు వోసినట్టు అయ్యింది శంకరయ్యకు.

'భవాని గురించి అంతా శెప్పితి. అక్కాబావలకు దయ కలిగిందో.. లేదో? భవానిని వాళ్ల కొడుక్కిచ్చి లగ్గం జెయ్యమని అడిగితే! బావ కోపానికొచ్చి కొండెంగలెక్క అయిపోతడేమో? 'ముండ మోసిన పోరిని నా కొడుక్కు చేసుకోవాల్నా?' అని ఒంటికాలి మీద లేస్తడేమో?'.. ఆలోచనలు అల్లకల్లోలం చేస్తున్నయి.

ఇటు జూత్తె మణెవ్వ.. 'నా తమ్ముని బిడ్డ బతుకు ఎనుగుల వడ్డ ఎలుక పిల్లలెక్కాయె. కొడుకును సూత్తె కొండమీది కొంగలెక్కుండె. ఎటు ఎగిరిపోతడో.. వన్నెల పోశెట్టి. భవానిని లగ్గం జేసుకుంటడో?' ఆలోచనాలోచనాలు తిరుగుతున్నయి.

ఇక రాజారాంది.. కుడితిల వడ్డ ఎలుకలెక్కుంది పరిస్థితి. 'బామ్మర్ది, ఆని బిడ్డ ఎన్ని రోజులుంటరో? మాకే తిండికి తిప్పలు గావట్టె. బోడిగుండు మీద కొబ్బరి బోండం పడ్డట్టుంది. కొడుకు ఎట్లా బాగుపడాలె? శంకరయ్య ఏదన్న సాయం జేస్తడో?'.

భవానిని చూసినప్పటి సంది పరశురాములు మనసు అటే లాగుతున్నది. 'భవాని బొమ్మోలె బాగానే ఉంది. కానీ, నా పరిస్థితి.. సంపాదన సున్న, ఖర్చు మిన్న. భవానిది ముందే దెబ్బతిన్న పానం. నాతో పెండ్లికి ఒప్పుకొంటదా?'. భవాని ఒకసారి బయటికొచ్చి చూసింది. అందరి లెక్క తాను గూడ పొద్దున చాయదాగి, పరశురాముల్ని చూసింది. ప్చ్.. ఏం లాభం? నరాలల్ల కొత్త అల్లకల్లోలం పుట్టుకొస్తుంటె.. తిరిగి గదిలోకెళ్లి మంచమ్మీద కూర్చుంది.

***

మధ్యాహ్న మార్తాండుడు వేడిని వెదజల్లుతున్నడు. భోజనాలైనంక అందరూ వసారాల కూసున్నరు. భవాని తల పైకెత్తడం లేదు. 'మా ఇంట్ల ఇంకెన్ని రోజులుంటవురా శంకరీ?' అని అడుగుదామని అనుకున్న రాజారాం, భార్య సైగలతో ఆగాడు. 'బావా! అక్కా!'.. శంకరయ్యలో మొండి ధైర్యం. ఇద్దరినీ మార్చి మార్చి చూస్తున్నడు.

'ముసుగుల గుద్దులాట ఎందుగ్గాని.. నెనొకటి చెప్తా.. మీరు సరేనంటరా?' అని అడిగిండు. 'అందరికీ బాగుంటే అవునంటం..' రాజారాం తెగింపు. మణెవ్వ జాగ్రత్తగా వింటున్నది.

'అయితే వినుండ్రి.. నా బిడ్డ భవానికి మల్ల లగ్గం జెయ్యాలనుకున్న. మీ కొడుకూ లగ్గానికున్నడు. నా దగ్గర లక్ష రూపాలున్నయి. మీరు భవానిని పరశురాములకు చేసుకుంటె.. ఆ లక్ష మీకే ఇస్త. బొంబైలున్న సాంచాలు దెప్పించి, సిద్దిపేటల వెట్టిపిస్త. వాటిని గూడ మీకే ఇచ్చేస్త. పరశురాములు సాంచాల మీద పనిచేసుకుంట నాల్రూపాలు సంపాయించుకుంటడు. తాను బతుకుతడు. మనందర్ని బతికిస్తడు. నేను జిందగీ ఉన్నంతదాక మీతోనే ఉంట. ఇప్పుడేమంటరు?' సూటిగ అడిగిండు.

అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నరు. అందరి కండ్లల్లో కొత్త కాంతులు మెరుస్తున్నయి. భవాని, పరశురాములు కండ్లు కలుసుకొని సైగలు చేసుకుంటున్నయి. ఇద్దరూ భవిష్యత్తు గురించి ఊహల ఉయ్యాలలూగుతున్నరు.

***

**ఐతా చంద్రయ్య**

**ఐతా చంద్రయ్య స్వస్థలం సిద్దిపేట జిల్లా చింతమడక. బీఏ చేశారు. పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. 50 ఏండ్లుగా కథా రచనలో ఉన్నారు. ఇప్పటివరకూ ఈయన 700 లకు పైగా కథలు రాయగా, అవి 22 సంపుటాలుగా వెలువడ్డాయి. 19 కవితా సంపుటాలు, 11 నవలలు, 6 రంగస్థల నాటకాలు, 18 రేడియో నాటికలు, 6 ఏకపాత్ర సంపుటాలు, 29 బాలసాహిత్య సంపుటాలు, మరో 23 అనువాదాలు, 9 ఇతర సంపుటాలను వెలువరించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి, సాహితీ, ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి సాహితీ పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్తు నుంచి వరిష్ఠ పురస్కారంతో పాటు అనేక అవార్డులు, సన్మానాలు పొందారు. వివిధ సంస్థల నుంచి కథా శిల్పి, కవిశేఖర, బాల కథా శిల్పి బిరుదులు ఈయనను వరించాయి. ఐతా చంద్రయ్య రచనలపై పరిశోధనలు చేసి... ఒకరు పీహెచ్‌డీ, మరొకరు ఎంఫిల్ పట్టాలు పొందారు.**

# ఆకాశం



గుమ్మడి రవీంద్రనాథ్

నాంది :

హైదరాబాద్ మహానగరం. జూబ్లీహిల్స్ ప్రాంతంలోని ఓ అధునాతన భవంతి ముందున్న ఆవరణలో.. పచ్చటి తివాచీ పరిచినట్లుగా పచ్చిక (లాన్). ఆ పచ్చదనాన్ని మరింత ఆకర్షణీయపరుస్తూ రకరకాల పూల మొక్కలు. ఎరుపూ, పసుపూ, తెలుపూ.. వివిధ రంగుల్లో విరబూసిన పూలు, ఎనిమిది గంటల ఉదయపు ఎండలో నవనవలు కురిపిస్తున్నాయి. నూతనంగా నిర్మించిన ఆ ఇంటి ముందర ఆవరణలో కుడివైపున ప్రహరీ దగ్గర కళ్లు మూసుకుని ఉంది భూమి. కళ్లు తెరిచి ఈ లోకాన్ని చూడటానికే వణికిపోతున్నది.

ఆ ఇంటి తలుపు తెరుచుకుంది. లోపలి నుంచి ఒక యువతి బయటికి వచ్చింది. పచ్చిక పక్కగా ఉన్న దారిమీదుగా, భూమి వైపు అడుగులు వేస్తున్నది ఆమె. ఉషోదయపు లేత ఎండకన్నా కాంతిమంతంగా మెరుస్తున్నదా యువతి ముఖం. నిర్మలత్వపు గాఢతతో కూడిన అందమైన కాంతి అది.

***

నెల రోజుల క్రితం ఓ ఆదివారం సాయంత్రం ఆరుబయట పచ్చికపై చాప వేసుకొని యోగా చేస్తుండగా.. ఎక్కడినుంచో ఏదో మూలుగు వినిపించినట్లు అనిపించింది ఆమెకు. సాయంకాలపు సంధ్యాకాంతులు పశ్చిమాన్ని నారింజరంగులో వెలిగిస్తున్నాయి. ఆ మూలుగు తనకు సమీపంలోనే అనిపించి, లేచి ఇనుప గేటు తెరిచి బయటికి

రెండడుగులు వేసింది. రోడ్డు పక్కన కనిపించిన ఆ దృశ్యాన్ని చూసి ఒక్కక్షణం ఆమె ఊపిరి ఆగిపోయింది. ఏడెనిమిది నెలల వయసున్న ఒక వీధికుక్క.. రక్తపు మడుగులో పడి ఉంది. ఆ దృశ్యం హృదయవిదారకంగా ఉంది. ఆమె గుండె కదిలిపోయింది. క్షణం ఆలస్యం చేయకుండా, ఇంటిలో పనిచేసే కవితను వెంటబెట్టుకుని.. పాత దుప్పట్ల మధ్య ఆ కుక్కను జాగ్రత్తగా పడుకోబెట్టి, కారులో హుటాహుటిన వెటర్నరీ ఆసుపత్రికి తీసుకువెళ్లింది.

రెండున్నర గంటల తర్వాత ఆ వైద్యుడు, ఆమె దగ్గరికొచ్చి.. 'ఆ కుక్క మీదేనా?' అని అడిగాడు. 'కాదండీ! మా ఇంటి ముందు పడుంది. రక్తం మడుగులో కదల్లేని స్థితిలో ఉంటే చూసి తీసుకొచ్చాను. చాలా రక్తం పోయింది. బతుకుతుందా? అసలు!' ఆ యువతి వివరించింది. అప్పుడు ఆ డాక్టర్ దీర్ఘంగా శ్వాస తీసుకొని.. 'దాన్ని ఎవరో దారుణంగా హింసించారు. నాలుగు కాళ్లూ కట్టేసి చిత్రహింసకు గురిచేశారు. నిర్లక్ష్యానికీ, హింసకీ, 'అబ్యూస్'కీ గురైన ఎన్నో జంతువులను చూశాను గానీ, మరీ ఇంత దారుణమైన హింసను నేనింతవరకూ చూడలేదు! రెండు సర్జరీలు చేయాల్సి వచ్చింది. ప్రాణం కాపాడగలిగాను. కానీ, పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుంది'. ఆ మాటలు విని ఆమె నిర్ఘాంతపోయింది.

'నోరు లేని జీవులమీద కూడా ఇంత క్రూరత్వమేంటి? అబ్యూజ్ ఏంటి?'.. ఆ కుక్కను బ్లూక్రాస్ వాళ్లకో, జంతు సంరక్షణ సంస్థలకో అప్పగించి అక్కడితో వదిలేయాలని అనిపించలేదు ఆమెకు.

తనతో ఇంటికి తీసుకువచ్చి, ఒక గూడు (కెన్నెల్) కొని దానిలో ఉంచింది. ఆడ కుక్క కావడంతో 'భూమి' అని పేరుపెట్టి, దాని సంరక్షణ భారం తనే తీసుకుంది. అయితే, భూమి తన శారీరక గాయాల నుంచి కోలుకుంటున్నది కానీ, తాను అనుభవించిన ఆ 'ట్రామా', మనసుకు తగిలిన 'గాయం' నుంచి మాత్రం తేరుకోలేక పోతున్నది. దాని కళ్లలో జాలి తప్ప 'జీవం' కానరావడం లేదు. తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నదానిలా, నిస్తేజంగా నిర్వికారంగా చూస్తుంది. తోక ముడిచేసుకొని కాళ్ల మధ్య పెట్టేసుకుంటుంది. దాని మనసంతా భయమే! ఆందోళనే! తన గూట్లో ఓ మూలకు పోయి ముడుచుకుపోయి ఉంటుంది. ఆహారం కూడా సరిగ్గా తినదు. మనిషైతే కౌన్సెలింగ్ లాంటివి చేయవచ్చు. నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్నీ నింపే సలహాలు, సూచనలూ ఇవ్వవచ్చు. కానీ, అది మూగజీవి. భూమిని అలా చూస్తుంటే.. జాలితో ఆమె గుండె కరిగిపోతూ ఉంటుంది. తన గతాన్నీ, ఆ దారుణమైన హింసనీ మర్చిపోయి.. భూమి తిరిగి మామూలుగా మారితే చూడాలని ఆశగా ఎదురుచూస్తున్నదామె.

***

ఆరోజు తనకొక ఆలోచన వచ్చింది. దాన్ని కార్యరూపంలో పెట్టడానికే.. ఉదయాన్నే భూమి దగ్గరికి వచ్చింది. రోజులానే, భూమి తన గూటిలో ఓ మూలన పడుకొని ఉంది.. నిర్వేదంగా! ఆమె రాకను గమనించి, బలహీనంగా కనురెప్పలు ఎత్తి ఓసారి ఆమె వైపు

చూసింది అంతే! ఎలాంటి ఉత్సాహమూ లేదు. ఎలాంటి ఉద్వేగమూ లేదు. అప్పుడామె తనతోపాటు తీసుకొచ్చిన వేణువును పెదవులకు ఆన్చుకుంది. ఆమె చూపు కెన్నెల్ లోపల పడుకొని ఉన్న భూమి పైనే ఉంది. ఊపిరి మాత్రం 'భూ'పాళ రాగంలో ఓ మృదుమంజుల నాదంలా మారి, వేణువులోంచి వెలువడుతున్నది. అది అక్కడి గాలితో, పూలతో మమేకమవుతూ.. ప్రకృతినే పారవశ్యంలోకి నెట్టేస్తున్నట్లుంది. ఆ మధుర సంగీతఝురి అలా కొనసాగుతుండగా.. అక్కడొక అద్భుతం జరిగింది. భూమి మెలమెల్లగా తల ఎత్తింది. ఈసారి జాలి గూడుకట్టుకుని ఉన్నా, దాని కళ్లలో ఏదో వింత కాంతి! మొట్టమొదటిసారి తలెత్తడమే కాదు.. మెల్లగా లేచింది. లేచి ముందుకు అడుగులు వేస్తున్నది. భూమిలో ఆ మార్పును చూస్తున్న ఆమె కళ్లు విప్పారాయి. కాళ్ల మధ్య ముడుచుకుపోయిన తోకను.. మొట్టమొదటిసారి కొద్దిగా పైకి లేపింది భూమి! ఆ సంగీత ధ్వని, ఆ మూగప్రాణి అంతరంగాన్ని ఎలా ప్రేరేపించిందో తెలియదుగానీ, భూమి తన తోకను మెల్లగా ఊపసాగింది. ఇన్నాళ్లుగా గూడుకట్టుకుని ఉన్న భయం, ఆందోళన, నిర్వేదం, అభద్రతాభావం.. అన్నీ మంచులా మెల్లగా కరగడం ప్రారంభించినట్లు.. భూమిలో చిన్నపాటి ఉత్సాహపు నీడ కనిపిస్తున్నది. వేణువు భూపాళంలో ఉన్నా.. భూమి గుండె ఆనందభైరవి అయ్యింది.

***

ప్రారంభం :

మహానగరానికి మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక మారుమూల గ్రామం. ఉదయం పది గంటల సమయం. ఏపుగా పెరిగిన అరటి తోట.. ఎండల్లో హరితశోభతో పచ్చగా మెరుస్తున్నది. మగ కూలీలు కొందరు అరటి చెట్లకు సేంద్రియ ఎరువులు వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఎండుటాకుల్ని కొడవలితో కోసి, పారతో చెట్టు మొదలు చుట్టూ తవ్వుతున్నాడు సీతారాముడు. అతని ఏకాగ్రతను చెదరగొడుతూ, కొంచెం దూరంలో కిలకిలమని నవ్వులు వినిపించాయి. తలెత్తి చూశాడు. పక్కనున్న గులాబీ తోటలోకి ఆడ కూలీలు వచ్చారప్పుడే! వాళ్లలో ఒకమ్మాయి మీద సీతారాముడి దృష్టి నిలిచిపోయింది. సరిగ్గా అప్పుడే ఆ అమ్మాయి దృష్టి కూడా అతని మీద పడింది. లంగావోణీ వేసుకుని తెల్లగా వెన్నెల తునకలా ఉన్నదామె. కళ్లతోనే చిరునవ్వులు పంచుకుంటున్నట్టూ.. చూపుల్లోనే పలకరింపుల ప్రసరింపులు జరిగిపోతున్నాయి. వాళ్ల కళ్ల భాష కనిపెట్టిన ఒక యువతి..

'గౌరీ!'.. అని పిలిచి, 'మీ ముచ్చట నాకు దెల్సులే!' అన్నట్టు కిసుక్కున నవ్వింది. ఆ అమ్మాయి పిలుపుతో ఉలిక్కిపడింది గౌరి. సీతారాముడి మీదినుంచి చూపు తిప్పేసుకొని..'నీ పేరేంది?' అని అడిగింది ఆ అమ్మాయిని. ఆ అమ్మాయి ఎందుకో ఒక క్షణం సందిగ్ధపడి..'బేబంటరు' అన్నది. 'బేబి?' ప్రశ్నార్థకంగా పలికింది గౌరి. 'అవును' అన్నట్టు తలూపిందా అమ్మాయి. బేబీ అన్నది ఆ అమ్మాయి అసలు పేరు కాదని అస్సలూహించలేదు గౌరి. అరటితోటలో ఉన్న సీతారాముడు తన్మయంగా గౌరినే చూస్తూ ఉన్నాడు.. 'గౌరి

సక్కదనం ముందల ఆ గులాప్పూల సక్కదనం నిలబడతదా?' అనుకుంటూ! ఆడ కూలీలు గులాబీపూలు తుంచే పనిలో పడ్డారు.

***

పన్నెండెకరాల్లో పాతికేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తూ, ఉద్యోగం, వ్యాపారాలకంటే వ్యవసాయమే లాభదాయకం అన్న సత్యాన్ని నిరూపిస్తున్న శ్రీనివాసరావు అనే ఆదర్శరైతు పొలాలు అవన్నీ. గులాబీ, చేమంతి, బంతి తోటలు, పసుపు, అరటి, కంద, వరిలాంటి పంటలతో పాటు అన్ని రకాల కూరగాయలనూ సహజ వ్యవసాయ పద్ధతుల్లో పండిస్తుంటారక్కడ. సాగులో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ.. 'అనితర సేద్యుడు' అనిపించుకున్నాడాయన. వ్యవసాయంతోపాటు పాడి, కోళ్లు, మేకలు, చేపలతోపాటు తేనెటీగల పెంపకం కూడా చేపట్టాడు. అక్కడ పనిచేసే కూలీలను కూడా సొంతబిడ్డల్లా చూసుకుంటాడు. వాళ్లు కూడా కూలి కోసం పని చేస్తున్నట్టు కాక.. సొంత ఇంటిపని చేస్తున్నట్టు, ఇష్టంగా కష్టపడతారు.

***

మధ్యాహ్నం కూలీలంతా భోజనాలకు కూర్చున్నారు.. చెట్ల కింద! సీతారాముడు, గౌరి మాత్రం.. కాస్త దూరంగా వెళ్లి ఓ కొబ్బరిచెట్టు నీడలో కూర్చున్నారు. ఆ పక్కనే దట్టంగా ఎదిగిన మల్లెపొదలు ఉన్నాయి. బాగా విచ్చుకుని ఉన్న ఓ బొండు మల్లెను కాడతో సహా తుంచి, గౌరి ముక్కు దగ్గర ఆన్చి.. 'ఈ మల్లెపూలు సూడు ఎంత వాసన గొడ్తున్నయో?' అన్నాడు రాముడు. గౌరి ఆ మల్లెల వాసన పీల్చి.. 'అవును.. చానా మంచిగ గొడ్తున్నయ్!' అన్నది.. ఆ పరిమళాన్ని ఆస్వాదిస్తూ. అప్పుడు రాముడు గౌరినొకసారి ఎగాదిగా చూసి.. 'లంగా వోణీల నువ్వెంత ముద్దుగున్నవో!' అన్నాడు మురిపెంగా. ఆ బొండు మల్లెకన్నా స్వచ్ఛమైన నవ్వొకటి గౌరి పెదవులపైన మెరిసింది. పంటలమీది నుంచి వీచే గాలి అలలు, ఆమె ముంగురుల్ని ముఖం పైకి తోస్తున్నాయి. 'నాకాకలైతంది!' అన్నది గౌరి, పొట్టమీద చేతిని ఉంచుకొని. అంతదాకా గులాబీ తోటలో పనిచేసి వచ్చిందేమో.. ఆ నాటు గులాబీ పూల పరిమళం ఆమె ఒంటి నుంచి వస్తున్నది.సీతారాముడు భోజనం డబ్బాల్ని తెరవడానికి ఉపక్రమించాడు.

***

ఆ రాత్రి.. గౌరి చెవిలో ఏదో చెప్పాడు రాముడు. 'బాగా రాతిరైంది గదా?'.. భయంగా, సంశయంగా అన్నది గౌరి. 'తొమ్మిదైతంది గంతే! ఎన్నెల మస్తు గొడ్తంది. ఎండకాలం రాత్రిల్ల ఎన్నెల బాగనిపిస్తది'.. ప్రోత్సహిస్తున్నట్టు చెప్పాడు రాముడు. ఇద్దరూ కలిసి వెన్నెల్లో నడుస్తూ వెళ్తున్నారు. వెన్నెల తళతళలు పడ్డ వరిచేలు.. పిల్లగాలికి ఊగుతున్నాయి వయ్యారంగా! ఒకచోట పంట బోదెపై ఉన్న సన్నటి వంతెన మీదుగా నడవడానికి గౌరి భయపడుతుంటే.. రాముడు చటుక్కున తన రెండు చేతులమీద ఎత్తుకొని కాలువ దాటించాడు. ప్రకృతి,

పంటచేల మధ్య వెన్నెల్లో అలా విహరిస్తుంటే.. ఇద్దరి ఆత్మలూ ఏవో తెలియని ప్రశాంతతతో తేలిపోతున్నాయి.

మంచె దగ్గర ఆగారిద్దరూ. అప్పుడు రాముడు తనతోపాటు తెచ్చిన ఒక సీసా మూత తెరిచాడు. దాంట్లోని ద్రవాన్ని నాలుకమీద వేసుకుని చప్పరించాడు. ముఖం వికారంగా పెట్టి..'సీ! గింత సప్పగున్నదేంది?' అన్నాడు. 'ఏందది?'. 'పట్టుతేనె!'. 'తేనా? తేనె సప్పగుంటదా యాడైనా?'. 'ఎన్నెట్లో నీతాన కూసోని యిస్రాంతిగా ముచ్చట్లు బెట్టుకుంటే, దాని ముందుగాల తేనె గూడ సప్పగనే అనిపిస్తది' అన్నాడు పరవశంగా. 'సాల్లే! బాగా బిస్కెట్లు తినిపించుడు నేర్సినవు'. 'సత్తెంగ జెప్పిన గౌరీ!' 'నీ మాటలు నమ్మ తియ్యిగానీ.. ఆకాసమూ, సుక్కలూ, సల్లగాలి గూడ.. ఇంత మంచిగ ఎన్నడూ అనిపియ్యలే! నాగ్గూడ' చెప్పింది గౌరి. ప్రకృతిలోని ఆ ఆహ్లాదాన్ని తనూ గుండెనిండా నింపుకొన్నట్టు. 'నేనే సాయంగా సెట్టెక్కి దెచ్చిన. జరంత నోరు తెరువే!' అంటూ ఆ పట్టుతేనె చుక్కలు కొన్ని గౌరి నోట్లో వేశాడు రాముడు.

***

గ్రామంలో ఓ రైతు కూతురి పెళ్లి ఆ రోజు. ఆ వేడుకను ఆసక్తిగా చూస్తున్నది గౌరి. గ్రామం మొత్తం తరలివచ్చేసింది పెళ్లికి. పెళ్లికూతురి ముఖం నిండా సంతోషం పొంగిపొర్లుతున్నది. ప్రపంచంలోని సంతోషం అంతా.. ఆమె కళ్లలోకే చేరిపోయినట్లుంది. పెళ్లి కార్యక్రమం ముగిశాక, చివర్లో ఓ పాట స్పీకర్‌లోంచి గట్టిగా వినపడసాగింది. 'నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్త పా!'..

మోహన భోగరాజు పాడిన ఆ పాట మొదలవ్వగానే.. పట్టుచీర, పూలజడ, బంగారు ఆభరణాలతో ముస్తాబై ఉన్న ఆ పెళ్లికూతురు ఉద్వేగంతో దిగ్గున లేచి, నృత్యం చేయడం మొదలుపెట్టింది. పెళ్లికూతురు అలా నృత్యం చేయడం చూసి అబ్బురపడుతూ, గౌరి వైపు చూశాడు సీతారాముడు.

గౌరి కూడా రాముణ్నే చూస్తున్నది. పెళ్లికూతురు నృత్యం చక్కగా చేస్తున్నది.. పాటలోని ప్రతి పదానికి నృత్య భంగిమల్లో భావాన్ని అభివ్యక్తం చేస్తూ. పెళ్లికి వచ్చిన వారంతా హుషారుగా ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతున్నారు. కొన్ని నిమిషాల ముందు మూడుముళ్లేసి తన జీవన సహచరిగా చేసుకున్న తన అర్ధాంగి.. అంతచక్కగా నృత్యం చేయడం చూస్తూ ఆనందంతో మురిసిపోతున్నాడు పెళ్లికొడుకు. ఆ పాటలోని 'ఆడపిల్ల మనసు'ని ఆ అమ్మాయి అలా నృత్యరూపంలో కళ్లముందు ఆవిష్కరిస్తుంటే.. గౌరి మనసూ ఏదో భావోద్వేగంతో నిండిపోయింది. సరిగ్గా అప్పుడే.. అక్కడొక ఊహించని సంఘటన జరిగింది.

***

పెళ్లికూతురు నృత్యం చేస్తున్న ప్రదేశానికి దగ్గర్లో ఉన్న ఒక దుకాణానికి.. 'ఆంజనేయులు కిరాణం' అన్న బోర్డు వేలాడుతున్నది. ఉన్నట్టుండి ఆ సైన్ బోర్డ్ ఊడి, కింద కూలిపోయింది పెద్ద శబ్దం చేస్తూ. సరిగ్గా ఆ క్షణంలో అక్కడే నిలబడి పెళ్లివేడుక చూస్తున్న ఓ పదేళ్ల కుర్రాడి

మీద పడిందది. ఆ దెబ్బకు ఆ అబ్బాయి.. 'అమ్మా!' అని అరిచి కుప్పకూలి పోయాడు.

'అయ్యో.. నా బిడ్డ!' అని అరుస్తూ కొడుకు దగ్గరికి పరిగెత్తింది అతని తల్లి. స్పీకర్లోంచి వస్తున్న పాట ఆగిపోయింది. అంతదాకా ఆనందాలతో వెల్లివిరిసిన ఆ వాతావరణం.. ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది. అందరూ కిందపడిపోయిన ఆ అబ్బాయి చుట్టూ గుమిగూడారు. నేల ఎర్రబారుతున్నది.. ఆ పిల్లాడి రక్తంతో! 'నూటెన్మిది పోను గలుపుండ్రి ఎవ్వలైనా!' అరిచారెవరో. అక్కడున్న జనంలో ఒక డాక్టరు ఉన్నాడు. ఆయన ముందుకొచ్చి.. 'నేను డాక్టర్ని.. శుభ్రమైన గుడ్డొకటుంటే ఇవ్వండి!' అంటూ, ఆ పిల్లవాడి దగ్గర కూర్చొని పరిశీలనగా చూశాడు. మెడ దగ్గర రక్తం ధారగా కారిపోతున్నది. ఎవరో వచ్చి తుండుగుడ్డ అందించారు డాక్టర్కు. దాన్ని ఆ పిల్లవాడి మెడమీది గాయంపైన వేసి, గట్టిగా అదిమి పట్టుకున్నాడు డాక్టర్.

సరిగ్గా అప్పుడే.. గౌరి ముందుడుగు వేసింది. 'ఓసారూ! నువు గట్ల నొక్కినవంటే.. పిల్లగాడు సచ్చిపోతడు. రకతం ఆపనీకి గట్ల నొక్కద్దయ్యా! పోరనికి ఊపిరిగిట్ల ఆడనియ్యవా ఏం?' అన్నది కంగారు పడుతూ. ఆ డాక్టర్ భృకుటి ముడిచి.. 'నువ్వేంటి నాకు చెప్పేది?' అన్నట్లు ఈసడింపుగా ఓసారి ఆమెను చూశాడు. 'నేను డాక్టర్ని. ఎంబీబీఎస్ చదివాను. 'జగులర్ వెయిన్' తెగిపోయింది. బ్లీడింగ్ ఆపుతున్నాను' అన్నాడు. 'వయసోళ్లకైతే గట్ల సెయ్యచ్చు గానీ.. ఈడు సిన్న పిల్లగాడాయె! జరంత 'పైన' నొక్కుండ్రి' చెప్పింది గౌరి. 'నేను అనాటమీ చదివాను. నాకు తెలుసు ఎక్కడ నొక్కిపెట్టాలో..' అహం దెబ్బతిన్నట్లు అసహనంగా చెప్పాడు ఆ డాక్టర్. 'డాక్టర్! యూ అర్ కిల్లింగ్ దట్ బోయ్..' గౌరి గొంతులోంచి ఆ మాట ఒక తూటాలా బయటికి వచ్చింది. అంతే! ఆ డాక్టర్దే కాదు.. అక్కడున్న అందరి ఊపిరీ ఒక్కసారి ఆగిపోయింది! పెళ్లికూతురు ఆశ్చర్యంతో రెప్పవాల్చడం మరిచిపోయింది. అప్పుడు సీతారాముడు కూడా డాక్టర్కు దగ్గరగా వెళ్లి, మెల్లగా చెప్పాడు..

'డాక్టర్! మీరు 'ట్రెకియా' మీద ప్రెషర్ పెడుతున్నారు. అక్కడ నొక్కిపెట్టేస్తే ఆ పిల్లాడి శ్వాస ఆగిపోతుంది'. సీతారాముడు అలా అన్న మరుక్షణం.. నిజంగానే ఆ పిల్లాడి శ్వాస ఆగిపోయింది. అప్పుడు కనిపించింది డాక్టర్ కళ్లలో విభ్రాంతి. గౌరి చటుక్కున వంగి డాక్టర్ చేతిని గాయానికి కాస్త పైకి జరిపింది. 'ట్రెకియా' మీద ఒత్తిడి తొలగగానే, ఆ అబ్బాయిలో శ్వాస తిరిగి ప్రారంభమైంది. కళ్ల ముందు ఏదో అద్భుతం జరుగుతున్నట్లు అందరూ నిశ్చేష్టులయ్యారు. నమ్మశక్యం కానట్లు విభ్రాంతితో చూస్తున్నాడా డాక్టర్. ఆ పిల్లాడి తల్లికి నోట మాట రావడం లేదు. ఊపిరి బిగపట్టి.. గౌరినీ, సీతారాముణ్నీ అలానే చూస్తున్నది.

'సమ్థింగ్ రాంగ్ విత్ ద లంగ్స్! హిజ్ ఛెస్ట్ ఈజ్ మూవింగ్ స్ట్రేంజ్లీ!'.. ఆ పిల్లవాడి పరిస్థితిని నిశితంగా గమనిస్తూ చెప్పింది గౌరి.. రాముడితో. రాముడు గబగబా పిల్లవాడి చొక్కా విప్పాడు. అప్పుడు కనిపించింది.. వాడి పొట్టలో గుచ్చుకుపోయిన ఒక ఇనుప రేకు.

'ఓ గాడ్!' అంటూనే.. 'నైఫ్ కావాలి.. కాస్త పొడుగాటిది!' అని చెప్పాడు రాముడు. బిడ్డ

పొట్టలో దిగబడ్డ రేకును చూసి, వాడితల్లి గట్టిగా ఏడ్చేస్తున్నది. ఎవరో కత్తి తెచ్చి ఇచ్చారు. 'రెండు రిబ్స్ కింది నుంచి ఇన్‌సిజన్ చెయ్యాలి గౌరీ!' చెప్పాడు రాముడు.

వెంటనే గౌరి ఆ కుర్రాడి పక్కటెముకల కిందినుంచి గాటుపెట్టి కోసేస్తుంటే.. ఆ అబ్బాయి తల్లి 'నేను చూడలేను' అన్నట్టుగా తల తిప్పేసుకుంది. పది నిమిషాల్లోనే ఆ 'మేక్ – షిఫ్ట్' శస్త్రచికిత్స ముగిసింది. ఆ పిల్లవాడి ఊపిరితిత్తులు ఇప్పుడు తిరిగి సక్రమంగా పని చేస్తున్నాయి. మెల్లగా కళ్లు విప్పాడు. అది చూసి, వాడి తల్లి భావోద్వేగంతో కదిలిపోయింది. చటుక్కున గౌరి కాళ్లను చుట్టేసుకుంది. ఆనంద బాష్పాలతో గౌరి పాదాలను అభిషేకిస్తున్నది. అదంతా దగ్గరగా చూస్తున్న ఓ ఆడపిల్ల.. గౌరి వంక ఆశగా చూస్తున్నది. ముళ్ల కంచెలో చిక్కుకుపోయి శిథిలమైపోయిన తన జీవితమూ, కొత్తచిగురు వేస్తుందనే ఓ చిరు ఆశ.. ఆ ఆడపిల్ల కళ్లలో క్షణకాలం మెరిసింది. ముందురోజు గులాబీతోటలో, గౌరితో తన అసలు పేరు చెప్పకుండా 'బేబి' అని అబద్ధం చెప్పిన ఆ ఆడపిల్ల కంటి కొసల్లో చెమ్మ ఊరిపోతున్నది.

***

హైదరాబాద్

గ్లోబ్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి. ముఖ్యంగా శస్త్రచికిత్సల్లో అత్యున్నత ప్రమాణాలు కలదిగా పేరుగాంచిన ప్రతిష్ఠాత్మకమైన ఆసుపత్రి. దాని అధినేత (చైర్మన్).. తన ఛాంబర్‌లో తనకు ఎదురుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను ఉద్దేశించి.. 'సో! యూ ఆర్ రిపోర్టింగ్ బ్యాక్..?' అని అడిగారు.

ఎదురుగా ఉన్నవారు.. శస్త్రచికిత్స విభాగంలో అతిముఖ్యమైన సర్జన్లు. అపారమైన వైద్యశాస్త్ర పరిజ్ఞానం, అపురూపమైన మేధస్సూ, అనితరసాధ్యమైన శస్త్రచికిత్సా నైపుణ్యం.. ఆ ఇద్దరి సొంతం.

***

వారిలో ఒకరు డాక్టర్ రామ్, మరొకరు డాక్టర్ ప్రియ! ఇద్దరూ కలిసి చదువుకున్నారు. కాలేజీలో చిగురించిన ప్రేమ, మూడేళ్ల క్రితమే పెళ్లిగా మారింది. పెళ్లి కోసం కూడా వాళ్లు నాలుగంటే నాలుగు రోజులే సెలవు తీసుకున్నారు. అవి తప్ప మళ్లీ ఎప్పుడూ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదా దంపతులు. డాక్టర్ (సీతా) రామ్, డాక్టర్ (గౌరీ) ప్రియ! వైద్యవృత్తి పట్లా, ప్రాణాల్ని కాపాడే పనిపట్లా ఆ దంపతులకున్న అంకితభావం అలాంటిది. చిరుప్రాయంలోనే అత్యంత ప్రతిభావంతులైన సర్జన్లుగా పేరుతెచ్చుకున్న ఆ ఇద్దరంటే.. చైర్మన్ గారికి ప్రత్యేక అభిమానం. నెలరోజుల క్రితం.. పాన్‌క్రియాస్ క్యాన్సర్‌కు సంబంధించిన ఒక అత్యంత అరుదైన, అత్యంత కఠినతరమైన శస్త్రచికిత్సను 23 గంటలపాటు నిర్విరామంగా నిర్వహించి విజయవంతం అయ్యారు డాక్టర్ రామ్, డాక్టర్ ప్రియ. దాంతో ఆ ఆసుపత్రి కీర్తి ప్రతిష్ఠలు పతాకస్థాయికి చేరిపోయాయి. అన్ని పత్రికల్లోనూ ఆ అరుదైన శస్త్రచికిత్స గురించి రాశారు. ఆ సందర్భంగా చైర్మన్ వాళ్లిద్దర్నీ పిలిచి..

'మీ పెళ్లయ్యాక హనీమూన్‌కి కూడా ఎక్కడికీ వెళ్లలేదని నాకు తెలుసు. యూ బోత్ నీడ్ ఎ బ్రేక్! అండ్ యూ డిజర్వ్ ఇట్. ఓ పది పదిహేను రోజులు సరదాగా ఎక్కడైనా తిరిగిరండి. ఎనీ ఎగ్జోటిక్ ప్లేస్ ఆఫ్ యువర్ చాయిస్.. ఇండియా అయినా, విదేశాల్లో అయినా మీ ఇష్టం! ఖర్చులన్నీ హాస్పిటల్ చూసుకుంటుంది. మీ చైర్మన్ నుంచి మీకు ఓ చిరుకానుక!' అని చెప్పారు.

వాళ్లు ఏ యూరప్‌కో, మాల్దీవులకో, స్విట్జర్లాండ్‌కో వెళ్లలేదు. రామ్ తండ్రిగారైన శ్రీనివాసరావు గారి గ్రామానికి.. సీతారాముడు, గౌరిగా వెళ్లారు. అక్కడి ఆ పల్లె వాతావరణంతో మమేకమయ్యారు. ఆ పచ్చటి పొలాల మధ్య స్వచ్ఛమైన గాలి పీలుస్తూ, అక్కడి మట్టి పరిమళాన్ని తమ గుండెల నిండా నింపుకొన్నారు. పల్లెజనంతో కలగలసిపోయి వనాల్ని, వెన్నెల్ని.. ప్రకృతిలోని ప్రతి సౌందర్యాన్నీ అనుభూతి చెందారు. తమలో ఓ కొత్త ఉత్సాహాన్ని నింపుకొన్నారు.

***

హాస్పిటల్‌లో రిపోర్ట్ చేసి, చైర్మన్‌గారి గది నుంచి బయటికి రాగానే.. 'రామ్.. నీతో ఓ కేస్ గురించి మాట్లాడాలి' అన్నది ప్రియ గంభీరంగా! ఇద్దరూ హాస్పిటల్‌లో తమ ఛాంబర్‌కు వెళ్లిపోయారు. 'మొన్న మనం గ్రామంలో ఆ పిల్లవాడి ప్రాణం కాపాడటం చూసి, ఓ అమ్మాయి నా దగ్గరికి వచ్చింది. ఆమె పేరు బేబీ! గులాబీ తోటలో పూలు తుంచే పనిక్కూడా వచ్చింది. ఆ పల్లెలో.. సంతోషంగా జీవిస్తున్నదని అనుకున్నాను. కానీ, ఆ అమ్మాయి వెనుక ఓ గతం ఉంది..' 'కేస్ గురించి మాట్లాడాలి అంటే.. ఏదైనా మెడికల్ ఇష్యూనేమో అనుకున్నా! గతం అంటున్నావ్ ఏం జరిగింది?' అడిగాడు రామ్.

'బేబీది అసలు ఆ ఊరు కాదు. కాస్త దూరంలోని మరో కుగ్రామం. అక్కడ కొన్ని సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు. ఆ కక్షలకు.. కులం ప్రధాన కారణమవడం బేబీ పాలిట శాపమయ్యింది. తక్కువ కులంలో జన్మించడమే ఆమె తప్పయిపోయింది. ఎనిమిదేళ్ల వయసులో ఒక రోజు బహిర్భూమికి వెళ్లి వస్తున్నప్పుడు.. ఇద్దరు యువకులు బేబీని అపహరించుకు పోయారు. నాలుగు గంటల పైశాచికానందం తర్వాత ఆ పిల్ల శరీరాన్ని రోడ్డుమీద పడేసి పోయారు. బడుగు బలహీన వర్గాల పైన ఉండే చిన్నచూపు, ఏం చేసినా తిరగబడలేరన్న అహంకారం.. ఆ మృగాలలోని 'పర్వర్షన్'కు ఆజ్యం పోశాయి. రక్తం మడుగులో నిశ్చలంగా పడి ఉన్న ఆ ఎనిమిదేళ్ల నగ్న శరీరాన్ని చూసి బతికి ఉండే అవకాశం ఏ మాత్రం లేదనే అనుకున్నారట. ఎలాగోలా ఆసుపత్రికి తీసుకువెళ్తే.. అక్కడ పాపను పరీక్షించిన వైద్యుడు ఒకలాంటి షాక్‌తో విచలితుడైపోయాడట. అది కేవలం అత్యాచారం కాదు. దారుణమైన హింస. క్రూరత్వం. పెద్దజాతి, చిన్నజాతిని అణచివేసే హేయమైన రాక్షసక్రీడ. షీ వజ్ బ్రూటలైజ్డ్.. బియాండ్ వర్డ్స్ రామ్!'.

ప్రియ గొంతు గద్గదమైపోతుండటం రామ్ గుర్తించాడు. లోపలి నుంచి దుఃఖం పొంగుకు

వస్తున్నది. కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడలేక పోయింది. భార్య అరచేతిని తాకి, అనునయ పరుస్తున్నట్టుగా గట్టిగా పట్టుకున్నాడు రామ్. ఆమె కంటి నుంచి ఆమెకు తెలియకుండానే అశ్రుకణాలు రాలిపడుతున్నాయి. ప్రియ తిరిగి మాట్లాడసాగింది..

'నిర్భయ, దిశలే కాదు.. ఇంకా ఎందరో 'బేబీ'లు కూడా ఉన్నారు మన చుట్టూ. అంతకన్నా దారుణమైన హింసకు గురిచేశారు ఆ పసిదాన్ని. కాళ్ల మధ్య ధారాపాతంగా కారిపోతున్న నెత్తురు. లోపల గుచ్చుకు పోయిన పదునైన గాజుపెంకుల్ని తొలగించడానికే ఆ డాక్టర్‌కు చాలా సమయం పట్టిందట!'. గగుర్పాటుతో వింటున్న రామ్‌లోనూ బాధ సుడులు తిరుగుతున్నది. ఇద్దరూ ఒకరి చేతిని ఒకరు గట్టిగా పట్టుకొని ఉన్నారు.

'రామ్! షీ నీడ్స్ ఎ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ! ఆనాటి రాక్షసోన్మాదం ఆమె శరీరభాగాన్ని ఛిద్రం చేసింది. కంప్లీట్ జెనిటల్ మ్యుటిలేషన్! బేబీని తిరిగి మామూలు 'ఆడపిల్ల'గా మార్చాలి మనం. ఆ గ్రామంలోని దివాకరం అనే అబ్బాయి తనను ప్రేమిస్తున్నాడట. పెళ్లి చేసుకోమని ప్రాధేయ పడుతున్నాడట. దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని కూడా ఆమె శరీరం గ్రహించలేనంతగా ఛిద్రమైన తను.. తనను తాను అతనికెలా అర్పించుకోగలదు?'.

డాక్టర్ రామ్‌కి అర్థమయింది. 'అనుభూతి'కి కేంద్రబిందువైన 'అతి సున్నితమైన ఒక భాగం' కూడా గాజుపెంకుల పదునుకు బలైపోయిందనీ! అందువల్లే ఆ అమ్మాయి ఒక 'ఐస్ ముక్క'లా మారిపోయిందని! ఆమెకు ఎలాంటి స్పందనలూ, ఎలాంటి భావాలూ ఉండవు. ప్రేమ అనే అనుభూతీ తెలియదు. అన్నీ కోల్పోయినట్టే అనిపిస్తుంటుంది. ఏదో తెలియని 'శూన్యం'! అంతా 'ఖాళీ' అయిపోయిన భావన. కానీ, ఆనందంగా ఉండటం, ఆనందం కోసం ప్రయత్నించడం.. మనిషికున్న విశ్వజనీనమైన హక్కు. ఆ హక్కును ఆమెకు ప్రసాదించాలి.

'బేబీని పెళ్లి చేసుకోవాలని ఆశపడుతున్న ఆ అబ్బాయికి జరిగిందంతా తెలుసా?' అడిగాడు రామ్. 'తెలీదు. తను చెప్పలేదట'. 'సర్జరీకి ఆమె తల్లిదండ్రుల సమ్మతి అవసరం అవుతుంది కదా?''తను అనాథ రామ్! ఆ అత్యాచారం విషయం బయటికి పొక్కగానే.. తల్లిదండ్రులిద్దరూ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారట. ఎవరో దూరపు బంధువు ఒకరి దగ్గర కొన్నాళ్లు పెరిగిందట. ఆ తర్వాత ఆ ఊరు వదిలేసి వచ్చేసిందట!'. 'ఎప్పుడు ప్లాన్ చేద్దాం.. ఆపరేషన్?'.'రేపే!' చెప్పింది డాక్టర్ ప్రియ..

***

మర్నాడు ఉదయం ఏడు గంటలకే బేబిని సర్జరీకి సిద్ధం చేశారు. సర్జికల్ గౌన్లూ, ముఖానికి మాస్కులూ వేసుకొని ఆపరేషన్ థియేటర్లో ఉన్నారు ప్రియ, రామ్. వచ్చేముందు దేవుడి ముందు మోకరిల్లి ప్రార్థించి వచ్చింది ప్రియ. ఆమె అంతకు ముందెన్నడూ ఇలాంటి శస్త్రచికిత్స చేయలేదు. ఇది శరీరాన్ని కోసి, కుట్లు వేసేయడం లాంటిది కాదు. ఒక మోడును 'చిగురింప' చేసే ప్రయత్నమది. మూగబోయిన వీణకు ఊపిరులూదే ప్రక్రియ. నిస్తేజమైపోయిన పుడమి

తల్లికి పులకింతలు రేపే యజ్ఞమది.. జననేంద్రియ పునర్నిర్మాణపు శస్త్రచికిత్స.

అత్యంత ఏకాగ్రతతో ప్రియ ఆ సర్జరీని నిర్వహిస్తున్నది. రామ్.. భార్య పక్కనే ఉండి తన సహకారాన్ని అందిస్తున్నాడు. 'శీర్ష భాగం'లోని నెర్వ్ – ఎండ్స్‌ను సరిగ్గా కలపకపోతే శ్రమంతా వృథా అయిపోతుందని తెలుసు.. ఆ ఇద్దరు వైద్యులకూ! అందుకే ఎక్కడా ఎలాంటి పొరబాటూ జరగకూడదని ఎంతో అప్రమత్తంగా ఉన్నారు. క్షణాలు నిమిషాలు అవుతున్నాయి. నిమిషాలు గంటలు అవుతున్నాయి.

నాలుగు గంటల ఇరవై నిమిషాల తర్వాత సర్జరీ ముగిసింది. బేబిని ప్రత్యేక గదికి తరలించారు. కొద్దిసేపటికి ఆమెకు స్పృహ వచ్చింది. కళ్లు తెరిచి చూసేసరికి ఎదురుగా.. 'గౌరమ్మా, సీతారాముడు' కనిపించారు.

'హాయ్ బేబీ!' గౌరీప్రియ పలకరించింది. 'కంగ్రాచ్యులేషన్స్! సర్జరీ చాలా చక్కగా జరిగిందమ్మా! నువ్విప్పుడు అందరు ఆడపిల్లల్లా మాములుగా అయిపోయావ్. నువ్వు ఆనందంగా జీవితాన్ని గడపగలవు. నిన్ను ఇష్టపడుతున్న ఆ అబ్బాయిని హాయిగా, ఏ సంకోచమూ లేకుండా వివాహం చేసుకోవచ్చు'.. గౌరి మాటలు వింటుంటే, ఆ అమ్మాయి కళ్లలోంచి జలజలా కన్నీళ్లు రాలిపోతున్నాయెందుకో! పొంగిపోతున్న కృతజ్ఞతాభావంతో ఆమె గుండె నిండిపోతున్నది. మాటకూడా రానంత సంతోషపు ఉక్కిరి బిక్కిరి.

'బేబీ.. నీ అందమైన కుడి బుగ్గలోంచి చిన్ని 'గ్రాఫ్ట్' తీసుకొని జననేంద్రియ శీర్షాన్ని కూడా పర్‌ఫెక్ట్‌గా పునర్నిర్మించాం. పూర్తిగా విజయవంతమైన ఆపరేషన్ ఇది. ఐయామ్ సో హ్యాపీ ఫర్ యూ..' డాక్టర్ ప్రియ సంతోషంగా, తెలియని ఉద్వేగంతో చెప్పింది.

బేబి కళ్లు ఇంకా వర్షిస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లుగా గుండెలో పేరుకుపోయిన మంచుగడ్డ ఒకటి కరిగిపోయి, శరీరమంతా గాల్లో తేలిపోతున్న భావన. అప్రయత్నంగా ఆ అమ్మాయి చేతి చూపుడువేలు తన కుడిబుగ్గను మెల్లగా తాకింది.. సర్జరీ కోసం 'కణజాలాన్ని' తీసిన చోట!

***

శస్త్ర చికిత్స జరిగిన నెల రోజులకే పెళ్లి కూతురు అయిపోయింది బేబి. ఏర్పాట్లన్నీ శ్రీనివాసరావు గారు చూసుకున్నారు. కొబ్బరాకులతో వేసిన పచ్చటి పందిట్లో పీటలమీద బేబి పక్కన కూర్చుని ఉన్నాడు దివాకరం. పంతులు గారు వేదమంత్రాలు చదువుతున్నారు. మోగుతున్న సన్నాయి నేరుగా బేబి గుండెల్లోకి పాకుతున్నది తీయగా.. అయితే, ఆమె మనసంతా డాక్టర్ గారి మీదే ఉంది!

సరిగ్గా అప్పుడే కాస్త దూరంలో కారు ఆగిన చప్పుడైంది. మరునిమిషం బేబి కళ్లెదురుగా గౌరీ, సీతారాముడు ప్రత్యక్షమయ్యారు. ఆ దంపతుల్ని చూడటంతోనే బేబీ హృదయం ఆనందంతో ఎగిసిపడింది. గౌరి.. బేబిని చూసి చిరునవ్వు నవ్వింది. దగ్గరగా రమ్మన్నట్టు చేతితో సంజ్ఞ చేసింది బేబి. ప్రియ దగ్గరికి రాగానే.. ఆమె పాదాల్ని పట్టుకొని కళ్లకు అద్దుకుంది.

వేదమంత్రాల సాక్షిగా దివాకరం.. బేబి మెడలో తాళిబొట్టు కట్టాడు. మైకులోంచి అప్పుడొక పాట ప్రారంభమైంది. 'నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్త పా.. డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గనీ! అందాల లోకాన్ని సూపిత్త పా.. చిక్కుబుక్కు చిక్కు చిక్కుబుక్కనీ!'.. 'లే! డాన్స్ చెయ్..' చెప్పింది గౌరి. సిగ్గుపడుతూనే లేచి నృత్యం చేయడం ప్రారంభించింది బేబి. పాట పూర్తవగానే దివాకరం గబగబా ప్రియ, రామ్ దగ్గరగా వచ్చి.. చటుక్కున వారి పాదాలమీద వాలిపోయాడు.

'నో ప్లీజ్! లే దివాకరం..' అంటూ, పైకి లేవమన్నట్టు అతని భుజాల్ని పట్టుకుంది గౌరి.

అతని కళ్లలో అవ్యక్తమైన ఒక భావోద్వేగం. సన్నటి నీటి చెమ్మ. రెండు చేతులూ జోడించి హృదయపూర్వకంగా నమస్కరించాడు. అప్పుడు వచ్చింది ప్రియకు ఆ సందేహం. ఆమె కళ్లు బేబీవైపు చూశాయి.. 'చెప్పేశావా?' అన్నట్టు. 'అవ్.. ఏం దాపెట్లా! అంతా సెప్పేసినా' అన్నభావాన్ని కళ్లతోనే వ్యక్తం చేసింది బేబి. దివాకరం 'పెద్దమనసు'కు ప్రియ కళ్లు చెమర్చాయి.

'ఏయ్ బేబీ! అందాల దునియా సూపిత్త పా.. అన్నావ్‌గా! చూపించు మీ ఆయనకు..' అంటూ బేబిని దివాకరం మీదికి తోసింది ప్రియ. దాంతో దివాకరం, బేబి ఇద్దరూ నవ్వారు.అప్పుడు బేబి.. 'గౌరమ్మా! నీకాడ నేనొకటి దాపెట్నా! నాపేరు బేబి కాదు..' అన్నది. 'మరి?'. 'లచ్మి.. భూలచ్మి!'.'భూలక్ష్మి?'. 'అవును' అన్నట్టు తలూపింది భూలక్ష్మి. అప్పుడు గౌరి ఏదో స్ఫురించినట్టు.. వెనక్కి తిరిగి తమ కారు ఆపి ఉంచిన చోటుకేసి చూసి..

'భూమీ! కమాన్!' అన్నది గట్టిగా. గౌరి చెప్పిన మాటకు కట్టుబడి కారు దగ్గరే ఆగిపోయి, ఎదురుచూస్తున్న భూమి.. గౌరి గొంతు వినగానే చెంగు చెంగున దూకుతూ.. వేగంగా, ఉత్సాహంగా ఆమె దగ్గరికి రివ్వున దూసుకొచ్చింది. ఆనాటి నిర్లిప్తత, నిస్తేజం మచ్చుకైనా లేవిప్పుడు భూమిలో! ఆపకుండా ఊపేస్తున్నది తోకను. గౌరి చుట్టూ గిరగిరా తిరిగేస్తున్నది. గౌరి వైపు ఆరాధనగా చూస్తూ, ఆమె మీదికి ఆపేక్షగా ఎగురుతున్నది.. గౌరి ముఖాన్ని ముద్దాడుతున్నట్టు! మందులతో మానని మానసిక గాయం.. సంగీత చికిత్సకు లొంగింది!

'ఇది మా భూమి!' చెప్పింది గౌరి.

***

ఉపసంహారం

'ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ ప్రియా!'.. ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో చెప్పాడు రామ్.. భార్యతో! 'దేనికి?'.'ఆ అమ్మాయికి నిజంగా కొత్త జీవితాన్ని ఇచ్చావ్'. 'నేను కేవలం మెడికల్‌గా ఓ చికిత్స చేశానంతే! కానీ, గతం తెలిసి కూడా ఆమెను భార్యగా ఇంటికి తెచ్చుకున్న దివాకరమే.. నా దృష్టిలో ఆమెకు కొత్త జీవితాన్ని ఇచ్చినట్టు!'.

రెండుక్షణాలు అగి.. 'కానీ రామ్! మనకు తెలియకుండా ఇంకెందరో ఆడపిల్లలు అలాంటి అకృత్యాల బారిన పడుతూనే ఉంటారు కదా! ఆఖరికి నోరులేని జీవాల్నీ విడిచిపెట్టడం లేదీ కీచకమూకలు. ఈ దురాగతాల్ని మనం ఆపలేక పోవచ్చు. కానీ, ఈ 'భూమి'ల కోసం.. ఈ

'భూలక్ష్మి'ల కోసం ఏదైనా చేయాలని అనిపిస్తున్నది'.

భార్య స్వరంలోని ఆవేదన అతనికి తెలుస్తున్నది. 'ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేద్దాం రామ్! అకృత్యాల బారినపడి, హింసకు గురైన బాధితులకు మనవల్ల చేతనైన సాయం చేద్దాం! సాంత్వన ఇద్దాం.. రామ్!' ఆమె ఉద్వేగపూరితంగా చెప్పింది. క్షణంసేపు కూడా ఆలోచించలేదు అతను. బొటనవేలు చూపిస్తూ.. 'ఐ సెడ్?. ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ!' అన్నాడు. 'ఆశ్రమానికి ఏపేరు పెడదాం?' అడిగాడు.

'ఆకాశ్ అని పెడదాం. ఎన్ని చట్టాలు వచ్చినా, ఎన్ని శిక్షలు పడినా, హేయమైన అఘాయిత్యాలు జరిగిపోతూనే ఉంటాయి. వాటికి 'భూ(లచ్చి)మి'లు బలి అవుతూనే ఉంటారు. అందుకే, 'భూమి' చుట్టూ ఉండే 'ఆకాశం'లా మన ఆశ్రమం వారికి నీడనిస్తుంది'.

ఆ వివరణ అతనికి ఎంతగా నచ్చిందంటే.. చప్పున దగ్గరికి వెళ్లి భార్య నుదుటన ముద్దు పెట్టుకున్నాడు ఆర్ద్రంగా!

అప్పుడామె భర్త చేతిని గట్టిగా పట్టుకుంది. కళ్లలోకి చూస్తూ.. అదోలా అందంగా నవ్వింది. ఆమె చూపులో సిగ్గు కూడా తొంగి చూస్తుంటే.. 'ఏంటి?' అన్నాడు రామ్ అర్థంకాక.

'.. అంతేకాదు! త్వరలోనే మిమ్మల్ని తండ్రిని చేసే మన బాబుకు పెట్టబోయే పేరు కూడా అదే.. ఆకాశ్!' అన్నది ప్రియ. మామూలు ఆడపిల్లలా సిగ్గుపడిపోతూ.. అతని గుండెల్లో దాచేసుకుని!


ఆ క్షణం.. గౌరి, సీతారాముడి హృదయాలలోని ఆనందం కూడా ఆకాశమే అయ్యింది. వారి ఆశయంలా!

***

**గుమ్మడి రవీంద్రనాథ్**

**గుమ్మడి రవీంద్రనాథ్ స్వస్థలం గుడివాడ. ప్రభుత్వరంగ బీమా సంస్థ – యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో డిప్యూటి జనరల్ మేనేజర్‌గా, హైదరాబాద్ రీజినల్ చీఫ్‌గా పనిచేసి , జనవరి 31, 2022 న పదవీ విరమణ పొందారు. ఈయన తొలి కథ "కొస విరుపు". తొలి నవల (ధారావాహిక)– గన్‌మెన్. ఈ రెండూ కూడా ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురితమయ్యాయి. 160 కి పైగా కథలు దాదాపు అన్ని ప్రముఖ పత్రికలలో ప్రచురితమయ్యాయి. అలాగే మరో తొమ్మిది నవలలు స్వాతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, నవ్య, ప్రియదత్త పత్రికలలో ధారావాహికలుగా వెలువడ్డాయి. ఈయన రాసిన కథలకు గాను అనేక బహుమతులు పొందారు. అలాగే ఐదు ధారావాహికలు నవలల రూపంలో పుస్తకాలుగా వచ్చాయి. అవి: గన్‌మేన్, నా నువ్వు– నీ నేను, హైటెక్ ప్రియుడు, మ్యూజిక్ (ఆఫ్ లవ్), సుమధురం. అలాగే నమస్తే నిర్వహించిన కథల పోటీలో ఈయన రాసిన "ఆకాశం" కథ విశిష్ఠ బహుమతిని సొంతం చేసుకుంది.**

# మట్టిబంధం



ఎగుమామిడి
అయోధ్యారెడ్డి

'మన సీతంబాయి పొలం అమ్మేద్దాం బాపూ!'.. పెద్దకొడుకు బయటినుంచి వస్తూనే అన్నాడు.. అందరికీ వినిపించేటట్టు! హైదరాబాద్‌లో ఉంటాడు. హైటెక్‌సిటీలో ఉద్యోగం. ఆరోజే ఊర్లో దిగాడు. పొద్దుననగా బయటికి పోయి, చీకటిపడిన తర్వాత తిరిగొచ్చాడు. గడపదాటి ఇంట్లో అడుగు పెడుతూనే ఇంతపెద్ద నిర్ణయం ప్రకటించాడు.

అరవై ఐదేళ్ల వయసు, మూడెకరాల పొలమూ ఉన్న సన్నకారు రైతు నారాయణ. భూమిని నమ్ముకున్న కష్టజీవి. ఊర్లో పెద్దమనిషి, మర్యాదస్తుడన్న పేరుంది. పొలం అమ్ముదామని పెద్దకొడుకు యాదగిరి అన్నప్పుడు.. ఇంట్లో జనాభా అంతా అక్కడే ఉన్నారు. నారాయణ భార్య శ్యామలమ్మ అప్పుడే వంట ముగించి, మల్లెసాలలో మొగురానికి ఆనుకొని కూర్చున్నది. ఊర్లో దోస్తులతో తిరుగుళ్లు ముగించి, అంతక్రితమే ఇల్లుచేరిన చిన్నకొడుకు తీరుబడిగా కూర్చొని టీవీ చూస్తున్నాడు.

బర్రె పాలు పిండేందుకు సర్వ పట్టుకొని వాకిట్లో

కొచ్చిన నారాయణ.. దూడను దాని మెడకున్న తలుగుతోనే విడిచిపెట్టి, సొప్పకట్ట ఒకటి తీసి బర్రె ముందు వేశాడు. అతనికి చూపు సరిగా ఆనదు. ఒక కంటి శుక్లానికి అప్పుడెప్పుడో కంటివెలుగు స్కీములో ఆపరేషన్ చేయించుకున్నాడు. తర్వాత రెండేళ్లకే ఇంకో కన్నుకు శుక్లం నిండుకున్నది. ఎవరూ పట్టించుకోలేదు. అత్యవసరం కాకపోవడంతో అతనూ పట్టించుకోలేదు. ఒక కంటితో పని నడుస్తున్నదని రెండోదానిపై శీతకన్నువేసి, వైద్యం వాయిదా వేశాడు.

కొద్దిసేపటి తర్వాత బర్రె పొదుగులో చేయిపెట్టి చూసి, దూడను మళ్లా గుంజకు కట్టేసి పాలు పిండటం మొదలుపెట్టాడు.

'బాపూ! నామాట ఇనవడ్డదానే? మన బాయిపొలం అమ్ముదామంటున్న'.. యాదగిరి ఈసారి ఇంకొంచెం గట్టిగా అన్నాడు.

నారాయణ విన్నాడు. కానీ, మాట్లాడలేదు. రెండు మోకాళ్ల నడుమ బిగించి పెట్టిన సర్వలో ధారలుగా పడుతున్న పాల చప్పుడు వినిపిస్తున్నది. రోజురోజుకూ బర్రె ఎండిపోతున్నది. పాలు తగ్గిపోతున్నయి. బర్రెకు పచ్చిమేత వేసి ఎన్నిరోజులైందో? పొలం కాడ కూడా మేసెటందుకు ఏమీలేదు. ఎండు వరిగడ్డి, జొన్నసొప్పలేస్తే పాలిచ్చే బర్రె ఎండిపోక ఏంజేస్తది?

నారాయణ పాలు పిండుకొచ్చి భార్య చేతికిచ్చాడు. కొయ్యకు వేలాడేసిన అంగీ జేబుల నుంచి బీడీకట్ట తీసి, ఒక బీడి వెలిగించాడు. మెల్లగా వచ్చి పెద్ద దర్వాజ పక్కనున్న చెక్క కుర్చీలో కూర్చున్నాడు. నిజానికి సీతంబాయిని అమ్ముదామన్న కొడుకు మాట అతనికి మొదటిసారే వినిపించింది. కానీ, బదులు చెప్పలేదు.

'నువ్వింక వ్యవసాయం చెయ్యలేవు బాపూ! అందుకే బాయిపొలం అమ్మితే మంచిది' మళ్లీ చెప్పాడు కొడుకు. 'అదేందీ.. ఎవుసం జెయ్యలేనా? ఎందుకు జెయ్యలేను? చేస్తనే ఉన్నగద. ఎందుకొచ్చిందిరా అనుమానం?' కొడుకు దిక్కు చూడకుండానే అన్నాడు. అతనికి లోపల కొంత కంగారుగానే ఉన్నది. బాయిపొలం అమ్ముకుంటే ఇంకేమన్న ఉన్నదా? తర్వాత ఏం తింటం? ఎట్ల బతుకుతం? 'చేస్తున్నవు నిజమే బాపూ! కానీ, ఏమన్న ఫలితం ఉంటున్నదా? పతేడూ నష్టపోవుడు. అప్పులు చేసుడు తప్ప!'.

నారాయణ మాట్లాడలేదు. బీడి ముక్క పారేస్తూ లేచివెళ్లి తినడానికి కూర్చున్నాడు. శ్యామలమ్మ వడ్డిస్తున్నది. తింటూనే నెమ్మదిగా అన్నాడు.. 'అట్లనుకుంటే ఎట్లరా పెద్దోడా! రైతు అనేటోడు ఎవుసం జెయ్యక ఇంకేం జేస్తడు? పెట్టుబడుల కోసం, చేతి ఖర్సుల కోసం అప్పులు దునియ మీద అందరు రైతులు చేస్తలేరా? పంటలు పండినంక గింజలమ్మి మళ్లా ఆ అప్పులు తీరుస్తలేరా?'.

'అది పాత ముచ్చట బాపూ! ఇప్పుడు రైతు అప్పుల్లో మునుగుడే తప్ప తేలుడుండది. నా మాటలు నీకు కష్టం కలిగించొచ్చు. బాయిపొలం అమ్ముడంటే నువ్వు భరించలేక పోవొచ్చు. కానీ, మనకు వేరే తొవ్వలేదు. పుట్టెడు అప్పులున్నయి. పొలం అమ్మితేనే వాటి

నుంచి ఒడ్డుకు పడుతం' నచ్చజెపుతున్నట్టు అన్నాడు.

నారాయణ మౌనం వహించాడు. కొడుకు మాటలకు తిండిలో రుచి పోయినట్టు అనిపించింది. ఎలాగో ముగించి లేచాడు.

కొద్దిసేపటి తర్వాత ఇంట్లో అందరి భోజనాలూ అయిపోయాయి. తండ్రి తను చెప్పేది సీరియస్‌గా తీసుకోవడం లేదని భావించిన యాదగిరి స్వరంలో తీవ్రత పెంచాడు.

'మనూరు ఇప్పుడు మునుపటి పల్లె కాదు. పట్టణంలో కలుస్తున్నది. రేపోమాపో మన గ్రామం కూడ కార్పొరేషన్ల చేరిపోతది. మనకు దగ్గర్లోనే కొత్తగ రైల్వేస్టేషన్ వస్తున్నది. కలెక్టరాఫీసు ఇప్పటికే ఇక్కడికి మార్చిరి. ఇంకా నాలుగైదు ఇంజినీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీ కూడా వచ్చినయి. ఎక్కడెక్కడోళ్లో మానూరు సుట్టు జాగలు కొనుక్కొని ఇండ్లు కట్టుకుంటున్నరు. ఇంకా ఎన్నో షాపులు, షోరూములు, వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ అంతా మనూరు సుట్టుపక్కలనే జరుగుతది. పైగా మన పొలం హైవేకు దగ్గరున్నది. మంచి డిమాండ్ వస్తది. అమ్మితే మస్తు ధర పలుకుతది'.

నారాయణ వృద్ధదేహం చెక్కకుర్చీలో ఇబ్బందిగా కదిలింది. కొడుకు వైపు దిగులుగానూ, తనకు ఇష్టం లేనట్టుగానూ చూశాడు.'ఇంత జల్దిన అంత అవసరం ఏమొచ్చింది? ఎక్కువ ధరొస్తే మాత్రం పొలం అమ్ముకుంటమా?' అన్నాడు. 'ఇప్పుడు పరిస్థితులు అట్లున్నయి గనుకే.. అమ్ముదామంటున్న. నువ్వేచెప్పు.. మనూర్లో ఎంతమంది చేస్తున్నరు వ్యవసాయం? ఎవరి పొలాలు చూసినా నీళ్లు లేక పడావు వడి సర్కారు తుమ్మలు మొలిచినయి. అసలు ఊర్ల చాలామంది ఇప్పటికే భూములు అమ్ముకొని పట్నం పోయింద్రు. నువ్వేమో ఇంకా పనికిరాని జాగను పట్టుకొని వేలాడుతున్నవు'.

'నీకెందుకురా బాధ? కష్టం జేసేది నేనుగద!' తండ్రికి కోపమొచ్చింది.

'అవును.. నువ్వే! కాదనను. కానీ, ఎంత కష్టం చేసినా దండుగే అంటున్న. నీ బతుకు మొత్తం మట్టిలోనే గడిపినవు. చెమటలు ధారపోసినవు. కానీ, ఏం సాధించినవు? చేసిచేసి నీ రెక్కలు పోయినయి. పెయ్యి అలిసిపోయింది. నీకిప్పుడు విశ్రాంతి అవసరం బాపూ! సీతంబాయి పొలం అమ్మితేనే మన కష్టాలు తీరుతయి'.

'ఎవుసం జేసే రైతు అలిసిపోవుడు ఏందిరా? చిత్రంగ మాట్లాడుతవు. నాకెందుకు విశ్రాంతి? మట్టిల పుట్టి మట్టిల పెరిగినోణ్ని. మట్టిల కలిసిపోయెదాక.. ఈ మట్టినే నమ్ముకొని బతుకుత. అయినా ఉన్న ఒక్క ఆధారం అమ్ముకొని యాడికి పోతం?'.

'యాడికో పోవుడేంది! మీరూ నాతోపాటే ఉంటారు. మీ బాధ్యత నేను చూసుకుంటా. తమ్ముడు కూడ సిటీలో నా దగ్గరనే ఉండి చదువుకుంటడు'. 'తాతల నుంచి వచ్చిన భూమి. మన బతుకులన్నీ దానితోనే ముడివడి ఉండె. చిన్నతనం నుంచి బడికి కూడ పోకుండ ఎవుసం చేసిన. యాళ్ల తెలువకుండ కష్టం జేసినోణ్ని. ఇప్పుడన్నీ ఇడిసిపెట్టి ఉత్తగ ఇంట్ల కూసుండుమంటె ఎట్లయితది? అయినా నీకిప్పుడు పైసల అవసరం ఏమొచ్చింది? నౌకరి జేస్తున్నవు గద. పొలం అమ్ముతనంట వెందుకు?'.

'నాకు పైసల అవసరమొచ్చి కాదు బాపూ! ఈ అప్పుల ఊబి నుంచి ఎట్ల బయటపడుతవని? సేద్యం కోసం ఇన్నేళ్ల నుంచి నువ్వు చేసిన బాకీలు, పొలం మీద తెచ్చిన అప్పులు, వాటికి వడ్డీలు కలుపుకొని కొండల్లెక్క పెరిగినయి. అవన్నీ ఎట్ల తీరుస్తవు? ఎండిపోయిన బాయి కింద ఏం పంటలు పండిచ్చి తీరుస్తవు? రేపు అప్పులోళ్లు వచ్చి నీ బొండిగె మీద కూసుంటరు. అప్పుడేం జేస్తవు? ఏమున్నయి నీ దగ్గర బాకీలు తీర్చేటందుకు?'.

'అందుకని భూమాతను అమ్ముకుంటార్ర?' నారాయణలో కోపమూ, దానివెంబడే నిస్సహాయతా పోటీ పడినయి.

'కాపుదనం చేసే రైతుకు మట్టితో ఉన్న బంధం ఏంటిదో నీకు తెలుసార..? పొలం అమ్ముకోవడం అంటే పెయ్యిల మాంసం ముక్క కోసిపారేసుకున్నట్టు. కన్నతల్లి లాంటి పొలం ఇడిసి నీతోని రావాల్నా! అదెట్ల కుదుర్తది? నేనైనా, మీ అమ్మయినా పట్నంలో అస్సలు ఉండలేం'.. చెపుతుంటే నారాయణ గొంతు జీరబోయింది. ముఖంలో బాధ కమ్ముకున్నది. భార్య దిక్కూ, చిన్నకొడుకు దిక్కూ విచారంగా చూశాడు. తనలో పొంగుకొచ్చే ఆరాటం, ఆవేదన వాళ్లలోనూ కనిపిస్తుందని భావించాడు. కానీ, అదేమీ లేదు. వాళ్లలో విచారానికి బదులు సమ్మతితో కూడిన ఉత్సాహాన్ని గమనించాడు. తనవాళ్లలో ఈ రకమైన మార్పును అతడు ఊహించలేదు. తట్టుకోలేక తలవంచుకొని ఉండిపోయాడు.

'భూమి తల్లి, మట్టి బంధం.. ఇటువంటి కథలు చెప్పకు బాపూ!' యాదగిరి విసుక్కున్నాడు.

'అవన్నీ బేకార్ సెంటిమెంట్లు. ఒక్క పైసా లాభంలేని ముచ్చట్లు. భూమితో బంధం అంటున్నవు సరే.. మరి అప్పులతో సంబంధం నీకు లేదా? నువ్వు చేసిన బాకీల బరువునంతా నీకు బదులు మేము మొయ్యాలా? వాటిని తీర్చేటందుకు మా జీవితాలను త్యాగం చెయ్యాలా?'.

'భూమి గురించి నీకేం తెలుసురా? భూమి అంటే ఒక్క జాగ మాత్రమేనా? దాంతో ఇంకెన్ని ముడివడి ఉంటయి? నీకు కొత్తగ ఉద్యోగమొచ్చింది. అదిసుత ప్రయివేట్ కొలువు. ఎంతకాలం ఉంటదో, ఎప్పుడు ఏమైతదో తెల్వది. కానీ, నా ఉద్యోగం అట్ల కాదు. తాతల నుంచి నమ్ముకున్నది. మన ఇల్లును నడుపుకొచ్చింది.. మన బతుకులు బాగుజేసింది ఇదే! ఇప్పుడీ పొలం అమ్ముకుంటే రేపేదన్న అయితే రోడ్ల మీదవడి బిచ్చమెత్తుకోవాలె'.

'ఇప్పుడు అంతకన్న గొప్పగున్నదా బతుకు? భూమి ఉండి ఏం జేస్తున్నది? నువ్వు చెప్పే బిచ్చగాళ్లకు ఏ రంధీ ఉండది. ఉన్నకాడికి తింటరు, కంటినిండా నిద్రపోతరు. నీకు ఒక్క దినమన్నా ప్రశాంతమున్నదా?' విసురుగా అన్నాడు కొడుకు.

ఇంత జరుగుతుంటే నారాయణ భార్య, చిన్నకొడుకు వింటూ కూర్చున్నరు. చిన్నోడికి అన్నయ్య ఆలోచన బాగా నచ్చింది.

'నిజంగనే పొలం అమ్మితే బాగుంటది. అప్పుడు అందరి చేతుల్ల డబ్బులుంటయి' అతని

పరిధిలో అంతవరకే ఆలోచించి సంతోషించాడు. పల్లెటూరొదిలి ఎప్పుడు సిటీలో వాలిపోదామా అనే ఉబలాటం అతనికి పెరిగిపోయింది.

'బాపూ! అన్నయ్య చెపుతున్నది నిజమే! నువ్వు మునుపటి లెక్క నాగలి దున్నలేవు. కాయకష్టం చెయ్యలేవు. బరువు పనులు ఇంక నీతోని కావు. అందుకని పొలం అమ్మడే మంచిది' అన్నాడు.

చిన్నకొడుకు మాటతో నారాయణకు చిర్రెత్తుకొచ్చింది. ఎన్నడూ బాయి ముఖం సూడనోడు, కాలికి బురుద అంటించుకోనోడు, ఎవుసం గురించి తోకా తొండెం తెలువని పోరడు సుత తనకు సుద్దులు చెపుతుండు..

ముప్పిరిగొన్న ఆవేశంతో అతడు కొద్దిసేపు మాట్లాడలేకపోయాడు. నిస్సహాయతతో గుండె మండుతున్నది. ఇంట్లో అందరూ ఒక్కటై ఏవో కారణాలు చెపుతుంటే తనేం జెయ్యగలడు? వీళ్లకు ఉన్నట్టుండి తను చేతకానోని తీరుగ కనిపిస్తున్నడు.

'బాపూ.. నేనింత చెప్పినా నీ చెవులకు ఎక్కుతలేదు. నీకు భూమే ముఖ్యమనుకుంటే అట్లనే ఉంచుకో. అయితే ఇక ఈ ఇంటితో నాకేం సంబంధం లేదు. నా నుంచి మీరేమీ ఆశించవద్దు. ఆ పొలంలోనే ఉండండి. అప్పులూ, వడ్డీలు అన్నీ మీరే చూసుకోండి. నేను పోతా'.. యాదగిరి స్వరంలో మార్దవం మాయమైంది.

కొడుకు హెచ్చరిస్తున్నట్టు అన్న మాటతో అప్పటిదాకా మౌనంగా ఉన్న శ్యామలమ్మలో కదలికొచ్చింది. 'అదేందిరా పెద్దోడా అట్ల మాట్లాడుతవు? నువ్వు వేరే, మేము వేరే అన్నట్టు జేస్తవేంది?' అన్నది ఆదుర్దా పడుతూ. 'మరి లేకపోతే ఏంటిదమ్మా! ఆ జాగల ఏమున్నది? అదేమన్నా రేగడి పొలమా? ఏడాదికి మూడు పంటలు పండుతయా? లేకపోతే నది కాలువలేమన్న వస్తున్నయా? ఎప్పుడు చూసినా ఏదో రకంగా నష్టాలు. పెట్టుబడుల కోసం అప్పులు. ఇట్లనే బతుకంతా గడిచిపోయె. ఫలితమున్నదా? ఇప్పటివరకు ఏమన్న బాగుపడ్డమా? దానికంటే ఉన్నది అమ్మేసి బాకీలు కట్టుకొని ప్రశాంతంగ ఉండొచ్చుగద'.

'అన్నిదినాలు ఒక్కతీర్గనే ఉంటయా? కాలం గాకపోతదా.. బాయిల్ల నీళ్లు పుట్టకపోతయా? పంటలు పండనిదే ఇన్నేండ్ల నుంచి మనమంత ఎట్ల బతికినం? ఊర్ల అందరు పంటలు పండిస్తలేరా? కష్టపడాలె. రైతుకు ఓపిక ఉండాలె'.. కొడుక్కు సర్దిచెప్పబోయాడు నారాయణ.

తండ్రి ధోరణి యాదగిరికి విసుగు తెప్పించింది. ఎంతసేపూ అదే పాతకాలం ఆలోచన. ముందుచూపు లేదు. పరిస్థితి అర్థం కాదు. వ్యవసాయం మీద మక్కువతో వాస్తవం ఆలోచించడం లేదు. రైతుకు భూమే సర్వస్వం కావొచ్చు. కానీ, అది పాతమాట. ఇప్పుడు సేద్యం రైతుకు భరోసా ఇవ్వడం లేదు. రైతుకే విలువలేని స్థితి. సంవత్సరాల చరిత్ర ఉన్న తమ సీతంబాయి పొలం ఇప్పుడు సేద్యానికి అనుకూలం కాదు. ఆ రోజులు పోయినయి. తమకున్నది మూడెకరాలు. దానికే సరైన దిక్కులేదు. అది చాలదన్నట్టు ఆశకు పోయి మరింత పొలం కౌలుకు తీసుకోవడం. అందుకోసం మరిన్ని పెట్టుబడులు. విత్తనాలు, ఎరువులు,

పురుగుమందులు, కూలీలు.. ఇట్లా తలకుమించిన అప్పులు. చివరికి చేతులు కాల్చుకోవడం. పైగా తండ్రివన్నీ పాతకాలం పద్ధతులు. పరిస్థితులకు అనువైన పంటలు వేయడు. అదే మూస వ్యవసాయం. గొడ్డు చాకిరీ చేస్తాడు. అన్నీ ఒక్కడే. జీతగాణ్ని పెట్టుకునే స్థితి లేదు.

'మన బాయిల నీళ్లు లేకపోయినా భూమి హైవేకు దగ్గర్లో ఉన్నది గనుక మంచి డిమాండ్ వస్తది. ఎక్కువ ధర కూడా పలుకుతది. నామాట విను బాపూ! వ్యవసాయం జేసి ఏం సాధించినవు చెప్పు? అదే పాడుబడ్డ పాతబాయి. లక్షలు పోసి తవ్వించినా నీళ్లురాని బోరుబావులు. నిండా అప్పులు. మనం బాకీలు కట్టకపోతే కొద్దిరోజులు ఊర్లో ఆసాములు ఊరుకున్నా.. బయటివాళ్లు, బ్యాంకులవాళ్లూ ఊరుకోరు. వాళ్లు పొలాన్ని తెగనమ్మి వచ్చినకాడికి తీసుకపోతరు. నువ్వు ప్రైవేటువాళ్ల దగ్గర తెచ్చిన అప్పులకు వడ్డీలు తలుసుకుంటేనే భయం పుడుతుంది. వాళ్లు మంచోళ్లు కాదు. ఇజ్జత్ దీస్తరు. దానికంటే మనమే మంచి బేరానికి పొలం అమ్మేసి ఎవన్ది వానికి పారేస్తే పాయే' తండ్రి మెదడును ఆసాంతం కడిగేస్తున్నట్టు చెప్పుకొచ్చాడు యాదగిరి.

'పెద్దోని మాట నాకు బాగనే అనిపిస్తంది. నువ్వు కూడ కొద్దిగ ఆలోచన జెయ్యి. నీకిప్పుడు మునుపటిలెక్క చాతనైత లేదు. పాణం బాగుంటలేదు. ఇంక నువ్వు ఎవుసం జెయ్యలేవు. పనిలో నీకు తోడుండేటోళ్లు కూడ ఎవ్వరు లేరు. నీకేదన్న అయితే ఎట్ల? ఇప్పటికే పొలం గెట్టు మీంచి పడి నడుం ఇరగ్గొట్టుకుంటివి. మీదినుంచి మోకాళ్ల నొప్పులు. పెద్దోడు జెప్పినట్టు సీతంబాయి పొలం అమ్మితే మన బాధలన్నీ పోతయి' శ్యామలమ్మ భర్తకు సర్దిచెప్పింది.

'ఇంతమందిమి చెపుతుంటే ఇనవేంది బాపూ! బతుకంత పనిచేసి చేసి దీర్ఘరోగి లెక్క అయినవు. ఇంక నువ్వెంత కాలం కష్టపడ్డా పొలంపైన ఎంత మమకారం ఉన్నా దండుగ. ఇప్పుడున్న బాకీలు వ్యవసాయం మీద ఎన్నటికీ తీర్చలేవు. మన ఊరు పట్నంల కలిసింది. నువ్వు చూస్తుండు.. మన భూమి కొనేటందుకు పెద్దపెద్దోళ్లు ఎగబడుతరు. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ నేను చేస్తా. నువు నిమ్మలంగా ఉండు'.. ఇదే చివరి నిర్ణయం అన్నట్టు పెద్దకొడుకు స్పష్టం చేశాడు.

నారాయణ ఉరిశిక్ష పడ్డ ముద్దాయిలా నిర్వేదంగా కొడుకు దిక్కు చూశాడు. కూర్చున్న కుర్చీలో కుంచించుకుపోయి అసహనంగా కదిలాడు. ఇంట్లో అంతా ఒక్కటై ఎదురుతిరిగిన తర్వాత తను ఒక్కడు ఏం చెయ్యగలడు?

'మీ అందరు చెప్పినయి బాగనే విన్న. మొత్తానికి అందరూ కల్సి నన్ను చేతకానోని కింద జమ కట్టిన్రు. 'ఎవుసం బేకార్' అని చెపుతున్నరు. మీ ఆలోచన అదే అయితే అట్లనే కానియ్యిండి. మీ ఇష్టమున్నట్టు చేసుకోండి' అని కుర్చీలోంచి నీరసంగా లేచాడు. బరువెక్కిన మనసుతో చీకట్లో కలిసిన నీడలా వాకిట్లోకి వెళ్లిపోయాడు.

***

నారాయణ రాత్రంతా కలత నిద్రపోయాడు. కళ్లు మూస్తేచాలు సీతంబాయి పొలం కదలాడింది. ఆ రోజు పొద్దున లేవగానే చాయ కూడా తాగకుండా బాయికాడికి

బయలుదేరాడు. సీతంబాయి అంటే ఆ ఊర్లోనే నెంబర్‌వన్ బాయి. వాగు ఒడ్డున్నే ఉంటది. నారాయణ చిన్నతనంలో చూశాడు. దానికింద ఇరవై ఎకరాల పొలం ఉండేది. అతని తాత ఎంతోకాలం శ్రమించి మెట్టభూమిని అచ్చుకట్టి పంటపొలం కింద మార్చాడు. అప్పుడు బాయిలో పుష్కలంగా నీళ్లు. పైన చెరువులు నిండి అలుగులు పారి వాగు జీవనదిలా ప్రవహించేది. సీతంబాయికి ఏనాడూ నీళ్ల కరువుండేది కాదు.

తాత పోయాక తండ్రి నిర్లక్ష్యం, కష్టపడి పనిచేసే తత్వం లేకపోవడం వల్ల ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం.. తన తాగుడు కోసం పొలం కొంత కొంత అమ్ముతూ వచ్చాడు. బడికెళ్లడం మానుకొని చిన్ననాడే సేద్యానికి మళ్లిన నారాయణ, తన కళ్లముందే భూమి కరిగిపోవడం చూశాడు. చివరికి మూడు ఎకరాలు మిగిలింది. అదైనా గుండెజబ్బుతో తండ్రి హఠాత్తుగా పోయాడు గనుక మిగిలింది. లేదంటే ఏమీ ఉంచేవాడు కాదని నారాయణే కాదు.. ఊళ్లో చాలామంది అంటుంటారు.

మూడెకరాల పొలంతో, మూడుముళ్లు వేసిన శ్యామలమ్మతో బతుకు బండిని లాక్కొచ్చాడు నారాయణ. చిన్నతనంలో తాతగారి వెంబడే తిరుగుతూ వ్యవసాయ పనులు నేర్చుకోవడం, తండ్రి నిర్లక్ష్యంతో కుంటుపడిన సేద్యాన్ని భుజాలపైన వేసుకోవడం.. అట్లా సీతంబాయి అతనిలో ఒక భాగమైంది. చివరికి అదే అతని ప్రపంచమైంది. ఏ వినోదాలూ, వెసులుబాట్లూ అతడెరుగడు. భూమితోనే బంధం, అదే ఆనందం. అతని మూడొంతుల జీవన జ్ఞాపకాలు ఆ పొలంతోనే ముడిపడి ఉన్నయి.

అయితే సీతంబాయి ప్రాభవమంతా గతం. ఇప్పుడది చుక్కకూడా లేని బాయి బొంద. వర్షాలు లేక, చెరువులు ఉనికినే కోల్పోయి, వాగులు కనుమరుగైన పరిస్థితుల్లో.. సీతంబాయి ఎండిపోయి చెలిమెలేని గొయ్యిగా మిగిలింది.

నారాయణ బాయిగడ్డ మీద నిలబడి చుట్టూ చూశాడు. ఎంతో ఆరాటంగా పొలమంతా కలియతిరిగాడు. ఎక్కడా పచ్చదనం లేదు. మరోపక్క కొండచిలువ నోరు తెరుచుకొని మింగడాని కొస్తున్నట్టు పట్టణం వైపు నుంచి కబళిస్తున్న పెద్దపెద్ద కట్టడాలు. విత్తనాలు మొలకెత్తే భూమిలోంచి మొలుచుకొస్తున్న వందలాది ఇండ్లు.. భవంతులు. ఎకరాలకొద్దీ భూమి ప్లాట్లు కొట్టి ముమ్మరంగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం. లాభాపేక్షతో భూములు కొన్నవాళ్లు తమ జాగల చుట్టూ దయ్యాల మాదిరి పాతిన సరిహద్దు రాళ్లు.

'రేపు సీతంబాయిని కొనుక్కునే పెద్దమనిషి ఈ పొలంలో ఎవుసం చేస్తడా? లేక జేసీబీలతో భూమి మొత్తం చదును చేసి ప్లాట్లు గొట్టి అమ్ముకుంటడా?' కత్తితో తన దేహాన్ని పరపరా కోసి ముక్కల కింద కొట్టినట్టు నారాయణ విలవిల్లాడి పోయాడు. వందల ఏండ్ల అతని కుటుంబ చరిత్రను కడుపులో దాచుకున్న సీతంబాయి ఇకపై కనిపించదు. ఆనవాళ్లు కూడా ఉండవు. రిజర్వాయర్లు కట్టినా, ఊరూరుకు కాలువలొచ్చినా, దండిగా వర్షాలు కురిసినా ఇకముందు ఎవరికీ ఏ తేడా ఉండదు.

కాంక్రీట్ సాగు జరిగే ఇక్కడ భూమికి నీటిస్పర్శ తెలియదు. చినుకుపడితే ఆస్వాదించే

మట్టినేల కనిపించదు. నాగేటి చాళ్లకు బదులు సిమెంటు దారులు, పంటమొక్కల బదులు కాంక్రీటు కట్టడాలు లేస్తాయి. చినుకు పడాలి. నాగళ్లు దున్నాలి. విత్తనాలు వెయ్యాలి. మొక్కలు మొలవాలి. ఎరువులు వెయ్యాలి. పంటలు పండాలి. ఇవేవీ ఉండవు. ఇకముందు ఇక్కడ అడుగడుగునా మనుషులు మొలుచుకొస్తారు. జనారణ్యం విస్తరిస్తుంది.

నారాయణ తన పొలాన్ని కళ్లతో మరోమారు జల్లెడ పట్టాడు. ఎక్కడా పచ్చదనం లేదు. నీళ్లు ఉంటే కదా నేల పచ్చరంగు అద్దుకునేది. అదేమిటో ప్రకృతికీ, వ్యవసాయానికీ ఎప్పుడూ పడదు. ప్రకృతి ఎంతసేపూ యాజమానిలా సాధిస్తుంది. తనుకొట్టే దెబ్బలకు ఎదుటివారు కుదేలవుతుంటే చూడటం ఎవరికైనా బాగుంటుంది. ప్రకృతికి కూడా అంతే! ఈ ఏడాదైనా కాలం మంచిగై పంటలు బాగా పండుతాయని రైతు ఆశలగూడు అల్లుకుంటాడు. కానీ, ప్రకృతి కన్నెర్రచేస్తే ఆ గూడు చెదురుతుంది. రైతు మళ్లా ఆశపడతాడు. మళ్లా ఎదురుదెబ్బలు. ఇదిట్లా సాగుతూనే ఉంటది.

నారాయణ పొలాన్ని తనివితీరా చూసుకున్నాడు. పొలంతో ముడిపడిన జీవితకాల జ్ఞాపకాలను మననం చేసుకున్నాడు. పాడుబడిన సీతంబాయి చుట్టూ చెట్లు దట్టంగా పెరిగి బాయి మూసుకుపోయింది. ఎంతో ఆశగా తను తవ్వించిన బోరు బావులను తలుచుకుంటే అతనికి బాధేసింది. తాహతుకు మించి అప్పుచేసి బోరువేయిస్తే బండపడింది. దాంతో దిక్కుతోచలేదు. నీళ్లు లేకుంటే పంటపండే దారిలేదు. అందుకే తెగించి ఇంకిన్ని అప్పులు చేసి రెండోచోట బోరు వేయించాడు. అందులో నీళ్లు బాగానే పడ్డయి. ఇక తన కష్టాలు తీరినట్టేనని సంతోషపడ్డడు.

'ఇంకేంది నారాయణా! నీ అదృష్టం పలికింది. బోరునీళ్లతోని నీ మొత్తం పొలం పారుతది. ఇగ మస్తు పంట..' ఊర్లో అందరూ అంటుంటే నారాయణ ఆనందపడ్డాడు.

బోరు పరిస్థితి వానకాలంలో బాగనే ఉన్నది. కానీ, చలికాలం నుంచి నీళ్లు క్రమంగా తగ్గిపోతూ వచ్చినయి. ఎకరమన్నా నాటు వేద్దామని నెలకిందనే వరి నారు పోసిండు. అది పెరిగి ముదిరిపోయింది. నీళ్లు లేక దున్నిన దుక్కి ఎండిపోయింది. ఇంక చేయగలిగింది ఏమీలేదు. గింజ ఇంటికొచ్చే పరిస్థితి లేదు. దీనికితోడు ఈ యేడు వానకాలం తన పొలం కింద ఇంకో ఐదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశాడు. 'నాకు అన్ని పంటలూ సమానమే' అన్నట్టు ప్రకృతి కత్తిగట్టి దెబ్బతీసింది. నాణ్యతలేని పత్తిని ఏరినా లాభంలేదని, కూలీ ఖర్చులు దండగని పాడైన పంటను చేనుమీదే వదిలేశాడు. చివరికి అతని రుణభారం మరింత బరువైంది. తీసుకున్న భూమికి కౌలు గట్టాలి. సహకార రుణం తీర్చాలి. పంటరుణం మీద సర్కారు వడ్డీ మాఫీ చేసినా.. అసలు కడితేనే మళ్లా అప్పు ఇచ్చేది. మరోవైపు ఇల్లు తనఖా పెట్టి తెచ్చిన బాకీ వడ్డీతో కలిసి ఇంటికన్నా ఎత్తుకు పెరిగింది.

'మన కొంపను ఒక్కసారి చూడు బాపూ.. కట్టి వందేళ్లయినా అయ్యుంటది. కనీసం గట్టిగా మరమ్మతు కూడా చేయించలేక పోయినవు. కొత్తగా ఇంకో ఇల్లు ఎన్నటికీ కట్టలేం. ఇదెప్పుడు కూలిపోతుందో తెలియదు. పైగా దీనిమీదా అప్పు తెచ్చినవు'.. వీపుమీద గుద్దినట్టు

పెద్దకొడుకు అన్న మాటలు కంపముండ్ల లాగా గుచ్చుతూనే ఉన్నయి. నారాయణ మనసు వికలమైంది. బాయిగడ్డ దిగి ఇంటివైపు నడిచాడు.

ముగ్గురు అక్కల పెళ్లిళ్లకు, తండ్రి వ్యసనాలకు ఒక్కో ఎకరం పరాయిదై పోగా చివరికి మిగిలిన మూడెకరాలను నారాయణ ఇప్పటికీ పదిలంగా కాపాడుకున్నాడు. ఎన్ని కష్టాలొచ్చినా అందులో గుంట జాగ అమ్మలేదు. కానీ, ఏళ్ల తరబడి రెక్కలు ముక్కలు చేసుకొని సాగుచేస్తున్నా ఉన్నదానికి అర ఎకరం కూడా పెంచలేకపోయాడు.

అతడు తన పిల్లల్ని చిన్నప్పటి నుంచి బాయి దిక్కు రానియ్యలేదు. పొలం పనులేవీ చెప్పకుండా వాళ్లను చదువుకోమన్నడు. తనూ, భార్యా కలిసి వ్యవసాయం చేశారు. పొద్దు పొడువగానే పొలానికి, పొద్దుగూకినంక ఇంటికి. అట్లా తన బతుకులో, పొలం పనుల్లో అనునిత్యం చేదోడు వాదోడుగా నిలిచిన భార్య కూడా ఇప్పుడు తను వ్యవసాయం చేయలేడని తేల్చేసింది. పొలం అమ్ముదామని అంటున్న కొడుక్కు మద్దతు పలుకుతున్నది. ఈ నేలతో మట్టితో ఆమెకూ బంధం ఉన్నది గదా? ఇన్నేళ్లు ఆమె కూడా కష్టపడింది. అదంతా ఎట్లా మరిచిపోయింది? కొడుకును అడ్డుకోవాలి గదా? ఉన్న కాస్త పొలం అమ్ముకుంటే ఎట్లా బతుకుతామనే ఆలోచన చెయ్యాలి గదా? ఆమెకు పల్లెటూరు నచ్చక కొడుకుతో సిటీలో ఉండాలన్న మోజు పుట్టుకొచ్చిందా?

'ఇంక నువ్వు ఎవుసం చెయ్యలేవు. నీకు చేతకాదు. పెద్దోడు చెప్పినట్టు అమ్మేద్దాం'.. గంట కొట్టినట్టు చెప్పింది. ఎంత చిత్రం..? ఇంతకాలం తర్వాత హఠాత్తుగా తను రైతు కాకుండా పోతున్నాడు. ఇంట్లో అంతా తనను చేతకానివాణ్ని చేయడం నారాయణకు బాధగా ఉన్నది. ఒకసారెప్పుడో పొలంలో ఒడ్డుమీద నడుస్తూ కాలుజారి పడ్డాడు. దానివల్ల ఎప్పుడన్నా వెన్నులో కొంచెం నొప్పి వస్తుంటది. అట్లాగే ఎప్పటినుంచో మోకాలి నొప్పులు. అవేం కొత్తవి కాదు. తన పనులకు ఎన్నడూ అడ్డుకాలేదు.

'ఇన్నేళ్లు వ్యవసాయం చేసి ఏం సాధించినవు? తొండలు గుడ్లు పెట్టే భూమిలో ఏం పండిస్తవు? కష్టం చెయ్యడం, అప్పులు చెయ్యడం తప్ప ఏం మిగిలింది?'.. కొడుకు మాటలు ఈటెల్లా గుచ్చుతున్నాయి. ఇంట్లో ముగ్గురూ ఒక్కమాట మీదున్నరు. తానొక్కడు ఏం చేయగలడు? తను వద్దన్నా ఆగేటట్టు లేరు. 'ఇన్నేండ్లుగా ఎవుసం మీద కాకుంటే వీళ్లు ఎట్ల బతికిన్రు?'.. నారాయణ పైకే గొణుక్కున్నాడు.

***

నాలుగు రోజులుగా తండ్రి ముభావంగా, సర్వం పోగొట్టుకున్నట్టు ఉండటం యాదగిరి గమనించాడు. తండ్రిని అనునయించే ప్రయత్నం చేశాడు. 'రంధి పడకు బాపూ..! మన పొలానికి మంచి ధరొస్తది. అట్లా వచ్చేటందుకు ఏర్పాట్లు చేస్తున్నా. దీంతో మన కష్టాలన్నీ తీరిపోతయి. నువ్వే ఆలోచన పెట్టుకోక హాయిగా ఉండు'.. భరోసా మాటలు పలికాడు.

నారాయణ సమాధానం ఇవ్వలేదు. జీవంలేని నవ్వు నవ్వి ఊరుకున్నాడు. తండ్రి ఆవేదన యాదగిరికి తెలియంది కాదు. సేద్యాన్ని పూర్తిగా నమ్ముకున్న ఒక రైతు మనోభావాలు తన

భూమి చుట్టే అల్లుకొని ఉంటయి. భూమి అంటే రైతుకు వృత్తి. భూమి అంటే రైతుకు ఉనికి. రైతు మట్టిని ఆశ్రయించి బతికే జీవి. మట్టి వదిలి రాడు. అందుకే ఎన్నిసార్లు ఎదురుదెబ్బలు తిన్నా.. రైతు రైతుగానే కొనసాగుతున్నాడు. పెట్టుబడులకు అప్పులమీద అప్పులు చేస్తూ మరో యోచన లేకుండా ముందుకు పోతున్నాడు. రుణాలు తన స్థాయి మించిపోతున్నా ఎప్పటికైనా తీరుస్తాననే నమ్మకం తనకంటే భూమీ్మదే ఎక్కువ ఉంచడం. క్రమంగా ఆస్తులు తరుగుతూ, బతుకులు ప్రశ్నార్థకమవుతున్నా సాగుబాట వీడకపోవడం.

ఇటువంటి పరిస్థితుల్లో పొలం అమ్మాలనే తన నిర్ణయం సరైనదేనని యాదగిరి భావించాడు. పొలం అమ్మడం కేవలం ఒక లావాదేవీ కాదు. వాస్తవానికి అది తండ్రి గుర్తింపును చెరపడమే. ఆయన దశాబ్దాల శ్రమను ఎగతాళి చెయ్యడమే. కానీ తప్పదు. మారిన కాల పరిస్థితులు, వ్యవసాయం చుట్టూ అల్లుకున్న చిక్కుముడులు గత్యంతరం లేకుండా చేస్తున్నయి. అప్పులు తీరిపోతే తండ్రి మళ్లా మామూలు మనిషి అవుతాడని అనుకున్నాడు. పొలం విక్రయంలో మంచి ధర వచ్చేందుకు యాదగిరి నవీన పద్ధతుల్లో ముందుకెళ్లాడు. ఏదో ఒక ధరకు, ఎవరో ఒకరికి తెగనమ్మడం కాకుండా.. తన ఆధ్వర్యంలోనే వేలంపాట జరిపి ఎక్కువమందిని ఆకర్షించాలని భావించాడు. డబ్బు ఖర్చయినా వెనుకాడకుండా ఇందుకోసం ముమ్మరంగా ప్రచారం చేశాడు.

చుట్టుపక్కల ఊళ్లలోనే కాకుండా ఇతర జిల్లాల్లో రియల్ ఎస్టేట్ సర్కిళ్లలోకి ఈ విషయం తెలిసేలా చేశాడు. సీతంబాయి పొలం గురించిన అన్ని వివరాలు, వేలం జరిగే స్థలం, తేదీలతో పోస్టర్లు వేశాడు. బ్రోచర్లు, కరపత్రాలు పంచాడు. ముఖ్యంగా దీనికోసం టెక్నాలజీని, సోషల్ మీడియాను బాగా వాడుకున్నాడు. ఫేస్‌బుక్, ట్విటర్, రియల్ వెబ్‌సైట్లు.. ఇట్లా దేన్నీ వదల్లేదు. వేలంపాట మూడు రోజులు ఉందనగా అన్ని దినపత్రికల్లో ప్రాంతీయ ఎడిషన్లలో ప్రకటనలు ఇప్పించాడు. పెద్ద నెట్‌వర్క్ ఉన్న స్థానిక కేబుల్ టీవీలో ప్రచారం చేయించాడు. యాదగిరి ఇదంతా ఆ ప్రాంతంలో ఇదివరకెవరూ చేయని విధంగా, కొత్తగా సమర్థంగా నిర్వహించాడు.

***

సీతంబాయి పొలం వేలంపాట దగ్గరపడుతుంటే ఆ ఇంట్లో ఒక్కొక్కరి స్థితి ఒక్కోవిధంగా ఉన్నది. పెద్దకొడుకు యాదగిరి భూమి విక్రయపనుల్లో తలమునకలై తిరుగుతుంటే.. శ్యామలమ్మ తెలియని ఉద్వేగంతో ఉక్కిరి బిక్కిరయింది. చిన్నకొడుకు మాత్రం ఉత్సాహంతో ఉన్నాడు. వేలం పనుల్లో అన్నకు ఆసరా అయ్యాడు. ఎప్పుడు పొలం అమ్ముడవుతుందా, ఎంత త్వరగా నగరంలో వాలిపోదామా అనే ఆత్రుత. నారాయణ పరిస్థితి వేరుగా ఉంది. అతని మనోగతం సముద్రంలా లోతుగా ఉన్నది. ఒక మాటా లేదు, ఉత్సాహమూ లేదు. స్తబ్ధుగా, నిశ్శబ్దంగా ఉంటున్నాడు.

అనుకున్న దినం రానే వచ్చింది..

సీతంబాయి గడ్డ మీదున్న చింతచెట్టు కిందనే వేలంపాటకు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఆ

గ్రామం పట్టణంలో కలిసిపోవడం, పొలం హైవేకు దగ్గర కావడం, ముందుముందు అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉండటం, రియల్ ఎస్టేట్ బూమ్ సాగుతున్న ఫలితంగా సీతంబాయి పొలం కొనేందుకు చాలామందే వచ్చారు. సొంత ఊరోళ్లే కాకుండా, వేరే ఊర్ల నుంచి కూడా వ్యాపారులు దిగారు. పక్కన టౌన్ నుంచి వ్యాపారస్తులు చేరుకున్నారు. ఇంకా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి దూరప్రాంతం నుంచి వచ్చినోళ్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఉంటున్న తమ పిల్లల సూచన మేరకు అందుబాటులో ఉంటే కొందామని కొందరు, అసలు వేలం ఎట్లా జరుగుతుందో చూద్దామని ఇంకొందరు ఉత్సాహపడ్డారు.

ఊరి కొత్త సర్పంచ్ యువకుడు. చిన్నతనం నుంచి కలిసి చదువుకున్న యాదగిరి అతనికి దగ్గరి మిత్రుడు. సర్పంచ్ స్వయంగా వేలంపాట నిర్వహించాడు. వెనుక చింతచెట్టు మొదట్లో కూర్చొని ఉన్నాడు నారాయణ. అక్కడ జరుగుతున్నదంతా అతనికి ఏదో కలలాగా ఉంది. పక్కన ఎవరు పలుకరించినా ధ్యాసే లేనట్టు తనలోకంలో ఉండిపోయాడు.

'ఇంకొద్దిసేపట్ల పొలం ఎవడో దక్కించుకుంటడు. కాయితాలు రాయించుకుంటడు. తర్వాత ఇంక అది నాది కాదు. పరాయి పరమైతది. ఎట్లాంటి పొలమిది? నా జవసత్వాలు ధారపోసిన. కన్నబిడ్డ తీర్గ చూసుకున్న. ఎన్నెన్ని పంటలు పండిచ్చిన. పంట బాగుంటే సంతోషపడ్డ. పాడైతే బాధపడ్డ. దురదృష్టం అనుకున్న. కాలం కలిసి రాలేదనుకున్న. కానీ, ఒక్కనాడు కూడ భూమిని తప్పుబట్టలే. మట్టిమీద నిందెయ్యలే. ఇప్పుడీ నేలను ఎవడు కొంటడో..? కొన్నోడు ఎవుసం జేస్తడా? లేక ఇంకేదన్న జేస్తడా? కచ్చితంగ వాడు భూమి దున్ని పంటలైతే పండియ్యడు. ముందు మిషిన్లు పెట్టి సీతంబాయిని కూడిపేస్తడు. తర్వాత మొత్తం మూడెకరాలు మట్టంజేసి ఏ బిల్డింగులో, ఇండ్లనో కట్టించి మళ్ల అమ్ముకుంటడు. ఇంక సీతంబాయి ఆనవాలు కూడ దొరుకది. విత్తనాలు మొలకలెత్తే నేల, కడుపులకు పట్టెడు మెతుకులు పెట్టే నేల.. ఇకపైన కాంక్రీటు కట్టడాల కింద అణిగిమణిగి కనిపించకుండా పోతది'.. నారాయణకు తల గిర్రున తిరిగినట్టయింది. ఒంట్లో సత్తువనంతా తోడేసినట్టయి బలహీనంగా చెట్టుకు జారవడి కండ్లు మూసుకున్నాడు. అతనికి తన తాత గుర్తుకొచ్చాడు. ఆయనతో కలిసి పొలంలో పనిచేయడం గుర్తుకొచ్చింది. నాగలి దున్నడం, ఒడ్డు చెక్కడం, గొర్రు కొట్టడం, పంట కోయడం, కుప్పకొట్టడం, మోపులు మోయడం.. ఒక్కటేంది ఎవుసం పనులన్నిటికీ తనకు తాతనే గురువు. తాత పోయాక తండ్రి నిర్లక్ష్యం వల్ల ఎవుసంతో పాటు, ఇంటి బాధ్యతలు కూడా మోయడం నేర్చుకున్నడు. తండ్రి మరణంతో ఇక ఎవుసమే తన లోకమైంది.

సర్పంచ్ వేలం ప్రారంభించాడు. మొదట భూమి అమ్మకానికి పెట్టుకున్న నియమ నిబంధనలు అందరికీ వివరించాడు. తర్వాత సీతంబాయి చరిత్ర గురించి గొప్పగా చెప్పాడు. ఇదివరలో ఆ బాయి కింద ఎన్ని ఎకరాలు పొలం పారేదో తెలిపాడు. బాయి పొలం హైవేకు దగ్గరగా ఉందన్న విషయాన్ని గుర్తుచేశాడు. భవిష్యత్తులో ఆ భూమికి సమీపాన జరిగే అభివృద్ధి గురించీ, కాలుష్యం లేని ఇక్కడి వాతావరణం గురించీ ఆకట్టుకునే విధంగా

వివరించాడు. సర్పంచ్ తెలివిగా ఎండిపోయిన సీతంబాయి ప్రస్తుత పరిస్థితిని మాత్రం ప్రస్తావించలేదు. అయినా అది తెలియని విషయమేమీ కాదు. నిజానికి అదెవరికీ అవసరం లేదు కూడా! ఎందుకంటే అక్కడున్నోళ్లు సీతంబాయి పొలాన్ని ఇప్పుడొక ఆస్తిగా కొనేందుకొచ్చారు తప్ప వ్యవసాయ క్షేత్రంగా కాదు.

వేలంపాట నడుస్తున్నది. నారాయణకు సర్పంచ్ గొంతు ఎక్కడో దూరంగా లీలగా వినిపిస్తున్నది. పైనుంచి తాత దేనికో తనను గట్టిగా మందలిస్తున్నడు. ఆయన ముఖంలో కోపం కనిపిస్తున్నది. మరోపక్క సీతంబాయి పొలం దీనంగా తననే చూస్తూ ఏదో నిలేసి అడుగుతున్నది. తనకేదీ అర్థం కాలేదు. తర్వాత క్రమంగా ఏ దృశ్యాలూ కనిపించకుండా పోయినయి.

సీతంబాయి పొలం అనుకున్నదానికన్నా ఎక్కువ ధరకు అమ్ముడైన ఆనందంలో పరుగు పరుగున తండ్రి వద్దకు వచ్చాడు యాదగిరి. 'బాపూ! నేను చెప్పినట్టే జరిగింది. పొలానికి మంచి ధర పలికింది. ఇంక మన బాధలు తీరినట్టే!' ఉత్సాహంగా చెప్పాడు. తండ్రికి వినపడిందో లేదోకానీ.. ఆయన పలుకలేదు. కనీసం కదిలినట్టు కూడా అనిపించలేదు. యాదగిరి తండ్రి భుజం పట్టి కుదిపాడు. జీవంలేని నారాయణ దేహం.. ఒక పక్కకి ఒరిగి సీతంబాయి పొలం మట్టిని ప్రేమగా తాకింది. ***

**ఎ.యం.అయోధ్యారెడ్డి (ఎగుమామిడి అయోధ్యారెడ్డి) స్వస్థలం సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామం. 11 ఫిబ్రవరి 1955న పుట్టారు. నాలుగు దశాబ్దాలుగా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. పదో తరగతి వరకు స్వగ్రామంలోని హైస్కూల్లో, సిద్దిపేట ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం రాజనీతి శాస్త్రంలో ఎం.ఏ, తర్వాత డాక్టరేట్ చేశారు. 1982లో జర్నలిజం మీద మక్కువతో పాత్రికేయ రంగంలో ప్రవేశించి జర్నలిస్టుగా దాదాపు మూడున్నర దశాబ్దాలు చేశారు. వచన సాహిత్యం (కథలు, నవలలు), ముఖ్యంగా ప్రపంచ సాహిత్యం విస్తృతంగా చదువుకున్నారు. కాలేజీ కాలం నుంచి రచన చేపట్టి ఎంతో ఆసక్తితో కథలు రాశారు. తొలికథ "మృత్యువులో వ్యత్యాసం" 1974 లో గులాబి మాసపత్రికలో అచ్చయింది. ఇప్పటి వరకు 70కి పైగా కథలు, రెండు నవలలు రాశారు. 30 విదేశీ కథలు, ఒక విదేశీ నవల తెలుగులోకి అనువదించారు. ప్రపంచ దిగ్గజ రచయిఎతల ఇరవై క్లాసిక్ కథల అనువాద సంపుటి "కథా సంగమం" ఈ ఏడాదే వచ్చింది. నాటి ప్రసిద్ధ పత్రికలైన భారతి, యువ, ప్రభ, పత్రిక, జ్యోతి నుంచి నేటి అన్ని దిన, వార, మాస, వెబ్ పత్రికల్లో కథలు, అనువాదాలు ప్రచురితం అయ్యాయి. ఇవేకాకుండా పలు పత్రికలకు, ఆలిండియా రేడియో కోసం సాహిత్య విమర్శలు, వాణిజ్య, క్రీడా రంగ వ్యాసాలు రాశారు. . నాగిరెడ్డి చక్రపాణి, సాహితిగౌతమి, పాకాల యశోదారెడ్డి, మాడభూషి తదితర పలు పురస్కారాలు అందుకున్నారు.**



# బతుకు కుయ్యం

## -జనపాల శంకరయ్య

ఓ రోజు సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ గారి ఇంటర్వ్యూ టీవీలో వచ్చింది. 'కథ, పాట, పద్యం, కవిత్వం.. మానవత్వం ఉన్న మనిషిగా తీర్చిదిద్దుతయి. సమాజహితమే సాహిత్యం! మానసిక ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపిస్తూ.. జీవిత సాఫల్యాన్ని పూర్తి చేసేది సాహిత్యం!' అని ఆ ఇంటర్వ్యూలో చెప్పారాయన. ఆ మాటలకు బూర రాజేశ్వరి ప్రభావితమైంది. కాళ్లతోనే కలం, కాగితం అందుకుంది. మనోధైర్యాన్నిచ్చే కవిత్వం రాయడం మొదలుపెట్టింది. అంగవైకల్యాన్ని లెక్క చేయలేదు. దృఢసంకల్పంతో ముందుకు దూసుకుపోయింది. అందరి మనసులపై కైతల బాణాల్ని ఎక్కుపెట్టింది. గురిచూసి వదలడం మొదలుపెట్టింది.

'అయ్యలారా! ఆలోచించండి! అన్ని జీవులలో మనిషి పుట్టుక గొప్పది. అమూల్యమైనది. శరీరంల మొస ఉంటేనే.. ఏదైనా సాధించవచ్చు. ఊపిరి వదలగానే ఈ శరీరం ఉబ్బి.. గబ్బు వాసనైతది.

మద్యానికి బానిసలై, అప్పుల ఊబితో ఉరితాళ్లకు ఊగులాడకుండ్రి. ఆకులు, అలములు, రేగడి మట్టిని తిని బతికిండ్రు ఓనాడు. కష్టం, సుఖం అన్నీ కలిస్తేనే అసలైన జీవితం. మీ పెళ్లాం, పిల్లగాండ్లు తెర్లు ఐతరు. ఒక్కసారి నన్ను చూడండ్రి! అవిటి బతుకైనా.. ఏదో సాధించాలని, నాలో తపన ఉంది. అన్ని అవయవాలూ బాగుండి పిరికోళ్లయి సస్తుండ్రు ఎంతోమంది. నాకు ఎన్నో కోరికలున్నా.. అన్నీ తీరుతయా? సావు పరిష్కారం కాదు! బతికి గెలుద్దాం! ఆత్మతృప్తితో ఆనందాలే చిందిస్తూ, అందరి కోసం బతుకుదాం!'..

బూర రాజేశ్వరి రాసిన కవితలు, ఆమె మాటలు.. వివిధ పత్రికల్లో, లోకల్ కేబుల్ వార్తల్లో, వాట్సప్ గ్రూపుల్లో ప్రసారమయ్యాయి. ఆమె పేరు రాష్ట్రమంతటా మార్మోగిపోయింది. రాజేశ్వరి.. రాష్ట్ర సర్కారు దృష్టికి వచ్చింది. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా.. 'ఉత్తమ మహిళ' అవార్డునిచ్చి సత్కరించింది. రాజేశ్వరి తల్లి అనసూయ, పెద్దన్న ఆమె వెంటే ఉన్నరు. వాళ్ల మనసు పొంగిపోయింది.

'సిరిసిల్ల సాహితీ సమితి'.. రాజేశ్వరికి తమ సంఘంలో సభ్యత్వమిచ్చి, 'ఉత్తమ రచయిత్రి' అవార్డుతో సన్మానించిది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఒక వీడియో క్లిప్‌లో.. బూర రాజేశ్వరి రూపం, నడక, మాటలు.. ప్రతిఒక్కరి హృదయాన్ని కదిలించాయి.

ఒక ఇంటర్వ్యూలో..

"నీ కోరిక ఏమిటి?" అని అడిగిన ప్రశ్నకు..

"సుద్దాల అశోక్ తేజతో ఒకసారి మాట్లాడాలని ఉంది" అని చెప్పింది రాజేశ్వరి.

ఆ ఇంటర్వ్యూను సుద్దాల అశోక్ తేజ, ఆయన సతీమణి నిర్మల చూసిండ్రు. ఆగమాగంగా సిరిసిల్లలోని రాజేశ్వరి ఇంటికి వచ్చి.. కలిసిండ్రు."ఎవరి వల్ల ఇంత సాహసం చేయగలిగినవు. ఏ ధైర్యంతో కవిత్వాన్ని ఆయుధంగా వాడినవు" అని ప్రశ్నించిండు అశోక్ తేజ."కవిత్వం రాయడానికి స్ఫూర్తి మీరే! టీవీలో మీ ఇంటర్వ్యూ చూశాను. అవిటితనమైనా అందరి మనసులో నిలవడానికి కారణం మీరే!" అన్నది రాజేశ్వరి. ఆ మాటలతో పట్టరాని సంతోషంతో..

"బిడ్డా! నీ మాటలు నా గుండెను తాకినయి. ఎన్నో అవార్డులు పొందినా రాని సంబురం.. నీవల్ల లభించింది" అని కళ్ల నిండా నీళ్లు నింపుకొని, రాజేశ్వరికి నమస్కరించి.. కొండంత వాత్సల్యంతో దగ్గరికి తీసుకుండు అశోక్ తేజ.

"బాపూ! మీరు గింత గొప్పోల్లు. నన్ను దగ్గరికి తీసుకుంటే నూరేళ్లు బతికి, మనో

దౌర్బల్యం ఉన్నోళ్లకు నా 'కవితల' ద్వారా మనోధైర్యాన్ని నూరిపోస్తా!" అంటూ మనసు ఉప్పొంగగా స్పందించింది రాజేశ్వరి.

"సరే బిడ్డా! నువ్వు ఎట్లా చదువుకున్నవు? స్కూలుకు వెళ్లినవా? ఒక్కదానివే వెళ్లినవా?" అని అడిగిండు.

"బాపూ! మా చెల్లె మల్లీశ్వరి, అన్నబిడ్డ లతతో కలిసి బడికి వెళ్లిన. నడువరాకున్నా పోరాటం చేసిన. ఆరాటంతో ఉడుం పట్టుపట్టి ఏడో తరగతి దాకా సదువుకున్న. కొందరు సార్ల సహాయంతో ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు రాసి పాసయిన!" అంటూ చెప్పింది రాజేశ్వరి.

"చూడు బిడ్డా! ధైర్యే సాహసే లక్ష్మి అన్నట్లు నువ్వు ధైర్యంతో అన్నిటినీ ఎదుర్కొంటున్నవు. ఆ భగవంతుడు నీకు తోడ్పడుతుండు! శభాష్ బిడ్డా!".

"బాపూ! నాకు వచ్చే వికలాంగుల పెన్షన్ నుంచి ఏటా 15 ఆగస్టు, 26 జనవరికి ఓ బడికి వెయ్యి రూపాయలు ఇస్తా! ఆ డబ్బులను ఆటల్లో విజేతలకు బహుమతులుగా అందజేస్తరు. గదో ఆనందం నాకు".

"సరే.. బిడ్డా! నీ కవితలన్నీ నేను తీసుకుంటున్న.. 'సిరిసిల్ల రాజేశ్వరి కవితలు' పుస్తకంగా అచ్చువేస్తానని మాట ఇస్తున్నా! అట్లాగే మా అమ్మనాన్న సుద్దాల హనుమంతు – జానకి గార్ల అవార్డు ఈసారి నీకే దక్కుతుంది" అంటూ సంబురంతో అన్నడు అశోక్ తేజ.

* * *

భాగ్యనగరం నడిబొడ్డున కళలకు నెలవైన రవీంద్ర

భారతిలో.. ఎందరెందరో మేధావులు, కవి గాయకులు, నాయకులు, అభిమానుల నడుమ.. 'సిరిసిల్ల రాజేశ్వరి కవితలు' పుస్తకాన్ని, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించి, ఆశీర్వదించిండు. సుద్దాల అశోక్ తేజ.. తన తల్లిదండ్రుల పేరున 'సుద్దాల హనుమంతు %--% జానకి అవార్డు' రాజేశ్వరికి అందించిండు. సప్పట్ల సప్పుడులో ఆయన మాట్లాడుతూ..

"సంకల్పం ముందు వికల్పం ఎంత? దృఢచిత్తం ముందు దురదృష్టం ఎంత? ఎదురీత ముందు విధిరాత ఎంత? పోరాటం ముందు ఆరాటం ఎంత? ఈ మాటలకు సజీవ ఉదాహరణ సిరిసిల్ల రాజేశ్వరి! భౌతిక వైకల్యాన్ని సవాలు చేస్తూ జీవిస్తున్న సమర యోధురాలు!" అంటూ కీర్తించిండు.

ఈ సందర్భంగా 'సిరిసిల్ల సాహితీ సమితి'

రాజేశ్వరిని ఘనంగా సత్కరించింది. తమ ప్రకటనలో..

"మా సభ్యురాలు రాజేశ్వరికి వైద్యఖర్చులు, జీవ

నోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధారం చూపాలి" అంటూ విజ్ఞప్తి చేసింది. అక్కడున్న మేధావులు కొందరు.. ఎవరికి తోచినంత వాళ్లు ఆర్థిక సాయం అందించిండ్రు. చూస్తుండగానే లక్ష రూపాయలు

పోగైనయి. ఆమె కుటుంబం సంబురం.. అంబరాన్ని అంటింది. నాటి ముఖ్యమంత్రి చెవుల్లోనూ రాజేశ్వరి చరిత్ర దూరింది. వెంటనే ఆమెకు పది లక్షలు ప్రకటించిండ్రు. ఆ పైసలను ఆమె పేరున బ్యాంకు అకౌంట్లో వేసి.. ప్రతినెలా వడ్డీ అందేట్లు చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలు అందినయి. ఆమె కుటుంబం, అభిమానులు అందరూ సంబురపడ్డరు.

సాయంత్రానికి ఇల్లు చేరిండ్రు. హైద్రాబాద్‌లో జరిగిన సంబురాన్ని ఇంట్లో పిల్లా జెల్లా చెప్పుకొని సంతోషపడ్డరు. గప్పుడే కన్నారం విశ్వబ్రాహ్మణ సంఘం పిలుపురాంగనే.. రాజేశ్వరి, అమ్మ అనసూయ, అన్న ఓదెలు కలిసి కళాసాగర్ భవనానికి చేరుకున్నరు. విశ్వబ్రాహ్మణ సంఘం వారు 'ప్రాణ రక్షక' అవార్డుతోపాటు రూ.పదివేల నగదు అందిస్తూ, రాజేశ్వరిని ఘనంగా సత్కరించిండ్రు.

"రాజేశ్వరి కవితలు ఎందరెందరో పానాలను నిలిపినయి. మహారాష్ట్ర సర్కారు తమ పాఠ్యాంశాల్లో

'రాజేశ్వరి చరిత్ర'ను చేర్చింది" అని వ్యాఖ్యాత తనదైన శైలిలో చెప్పిండు.

ఆ ప్రశంసలను మనసులో మూటగట్టుకొని ఇంటిదారి పట్టిండ్రు.

"అవ్వా! చెల్లె రాజేశ్వరి మనసు, ఆలోచనల గొప్పదనంతో మన కుటుంబం ఒక గాడిలో పడ్డది. మొన్నటిదాకా ఓ పూటకు ఉంటే.. ఇంకో పూటకు లేదు. తమ్ముడు రామచంద్రం సాంచలు నడుపుతుండు. సమ్మక్క, మల్లీశ్వరి బీడీలు చుడుతుండ్రు. అయ్య వోయినప్పటి సంది గింత దాకా! కుటుంబాన్ని ఈదుకచ్చిన. గిప్పుడు ఐదేళ్లు నోట్లెకు పోతున్నయి".. సంబురాన్ని తట్టుకోలేక అన్నడు ఓదెలు.

"నిజంగా బిడ్డ! రాజేశ్వరికి గిన్ని పైసలు రావట్టే! ఇంట్ల అందరం నోట్లె నాలిక లెక్క కలిసి కడుపునిండా తింటున్నం" ముఖంమీద చిరునవ్వులు ఒలుకుతుంటే.. అన్నది అనసూయ.

"అవ్వా! గిప్పుడు నాకు గుండెధైర్యం పెరిగింది. రేపు దసరా. మంచిగ జరుపుకొందం! సరేనా అవ్వా!?" అని అడిగిండు ఓదెలు.. గుండెనిండా ప్రేమతో!

* * *

తెల్లారింది. ఓదెలు సైకిలెక్కి మార్కెట్‌కు పోయిండు. శియ్యకూర తెచ్చి ఇంట్లో

బెట్టిండు. సారంపెల్లికి పోయి ఈతకల్లు దెచ్చిండు.

"అవ్వా! పొద్దిమీకి బంతి గూకుందాం" అని .. సాంచల పనిలలో చేరిండు.

రాజేశ్వరిది ఉమ్మడి కుటుంబం. మాపటీలికి అందరూ బంతి కూసుకున్నరు. విస్తర్లల్ల శియ్యకూర, బజ్జీలు, పూరీలు వడ్డించిండ్రు. అందరూ తింటాంటే.. ఓదెలు గిలాసల్ల ఈతకల్లు పోస్తుండు. పిల్లలూ, పెద్దలూ సంబురంతో ముచ్చట్లు వెట్టుకుంటుండ్రు. ఎవలకు కన్నుకుట్టిందో.. నవ్వుకుంట మాట్లాడుతున్న ఓదెలుకు ఒక్కసారి సరం పడ్డది.

రేవతి గిలాసల నీళ్లిచ్చి, ఈపుల సరిసింది.

"అవ్వా! మొస మఱుత లేదు. బొచ్చెల బగ్గ నొత్తుంది. ఎడమ చెయ్యి గుంజుతంది. తల్లడం మల్లడం అయితంది!" అనుకుంట తిండి మీదికెల్లి లేచిండు.

ఆయాసంతో విలవిల లాడుతున్నడు ఓదెలు. శెమటతోని పెయ్యంత తడిసింది. అప్పటిదాకా అందరిలో ఉన్న ఆ సంబురం.. ఒక్కసారి అడుగంటింది. అందరి మనసుల్లో ఆందోళన, భయం ముసురుకుంది. వాడకట్టు డాక్టర్‌ను తోలుకచ్చింది అనసూయ. ఆయినె చూసి..

"అవ్వా! గిది గుండెనొప్పి లెక్క ఉన్నట్టుంది. జెప్పన పెద్ద దవాఖానకు తీసుకపోండ్రి" అన్నడు.

అనసూయకు గుండెల రాయిపడ్డట్టు అయింది. ఆడనే కూలవడ్డది. రాజేశ్వరి కడుపులో కవ్వం తిరిగినట్లు అయ్యింది.

"నాకు వచ్చిన పైసలు తీసుకోండ్రి. అన్నను కాపాడుకోవాలె. వదినె, చిన్నన్న.. జల్ది పోండ్రి!" అని ఏడుసుకుంటనే అన్నది రాజేశ్వరి.

ఓదెలును ఆటోలో కూర్చోబెట్టిండ్రు. ఒక దిక్కు రామచంద్రం, మరో దిక్కు విజయ, అనసూయ కూసున్నరు. వాళ్ల చేతుల లక్ష రూపాయలు వెట్టింది రాజేశ్వరి.

దగ్గర్లనే ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు తోలుక పోయిండ్రు. ఓదెలును చూసిన డాక్టర్..

"ఇక్కడ గాదు. కరీంనగర్ పోవాల్సిందే!" అన్నడు.

గదే ఆటోలో కన్నారం బయల్దేరిండ్రు.

కన్నారం చేరుతున్నమనంగా.. ఓదెలుకు చెమటలు గుమ్మరించినయి. నోటమాట ఆగింది. మొసకొట్టుడు మొదలైంది. లబోదిబోమని గుండెలు కొట్టుకుంటూనే.. ఓ పెద్ద దవాఖానల శెరీక్ జేసిండ్రు. యాభైవేలు అడ్వాన్స్ పెట్టిండ్రు. అప్పటిదప్పుడే.. ఇరవై ఐదువేల సూదిమందు ఇచ్చిండ్రు ఓదెలుకు. గ్లూకోజ్ పెట్టిండ్రు. ఒక్క గంట

గడిచినంక.. క్యాలికి అచ్చిండు. దగ్గరికి రమ్మంటూ.. విజయకు కండ్లతోనే సైగ చేసిండు.

"విజయా! నువ్వు పైలం. ఇంట్ల అందర్నీ మంచిగ చూసుకో! కలిసిమెలిసి ఉండుండ్రి. అవ్వా! నా పిల్లలు లత, భాస్కర్, సందీప్ పైలం.. నాకేం గాదు. గానీ, జరగరానిది జరిగితే.. నా గుండె ఆగినా! మొస ఆగినా! నా పెండ్లాం, పిల్లలు.." అంటూ కండ్లల్ల నీళ్లు వెట్టుకుంట..

భార్య విజయను, తల్లిని దగ్గరికి తీసుకున్నడు.

"తమ్ముడూ! నేను మంచిగైతె.. అందరం మంచిగుందం. ఒగాల్ల నేను సచ్చిపోతే! మీ వదినెను, పిల్లలను, చెల్లెళ్లను, అవ్వను తెర్లు గానియ్యకు. మంచిగ చూసుకో!".. కన్నీళ్ల ధార జారి పడుతుండంగ ఒప్పజెప్పిండు ఓదెలు.

"అన్నా! నువ్వు జల్ది మంచిగైతవు. రంది పెట్టుకోకు. చెల్లె రాజేశ్వరికి వచ్చిన పైసలు లక్ష ఇచ్చింది. ఇల్లు అమ్మి అయినా.. నిన్ను కాపాడుకుంటం. నువ్వు మంచిగ్గావాల్నని చెల్లెండ్లు, పిల్లలు అందరూ దేవుండ్లకు మొక్కులు మొక్కుతుండ్రు" అని ధైర్యం నూరిపోసిండు తమ్ముడు రామచంద్రం.

* * *

రాత్రంతా బెడ్ పక్కనే ఉండి.. పెనిమిటి అవసరాలను తీర్సుకుంట సేవ చేసింది విజయ.

మూలసుక్క పొడుస్తుండగా..

"విజయా! దూపైతంది!" అన్నడు ఓదెలు.

ఓ గిలాసల మంచినీళ్లు ఇచ్చింది. తాగుతుండగా మల్ల సరం పడ్డది. తలమీద, వీపుల మెల్లగ చరిచింది. ఐనా తల్లడం మల్లడం ఐతుండు. కిందమీద ఐతుండు.

విజయకు నోట మాట రాలేదు. ఏడుసుకుంట వొయ్యి డాక్టర్లను, నర్సులను పిల్చుకచ్చింది. వాళ్లు ఓదెలును ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకుపోయిండ్రు. విజయకు కాళ్లు, చేతులు చల్లబడ్డయి. గుండె వేగం పెరిగింది. లోపలికి పోనిస్తలేరు. అత్త, మరిది దగ్గరికిపోయి వాళ్లను నిద్రలేపింది. గుండెల్లో దడ పెరుగుతుంటే, కన్నీళ్లు కాలువలై పారుతుంటే.. పత్తికాయ పగిలినట్లు ఏడుపుతో జరిగిన సంగతి చెప్పింది. ముగ్గురి మనసుల్లో భయం జొర్రింది. ఆగమాగం అవుతున్నరు. ఏం జరుగుతుందో అర్థంకాక బిక్కుబిక్కుమనుకుంట కూసున్నరు.

రాత్రి గడిచింది. పొద్దుగాల డాక్టర్లు వచ్చిండ్రు.

"మా ప్రయత్నం మేం చేసినం.. ప్రాణాలు కాపాడలేక పోయినం సారీ!" అన్నరు.

ముగ్గురూ దుఃఖసాగరంలో మునిగింండ్రు.

ఇంటికాడ.. ఏడుపును దిగమింగుకొని, పిల్లలకు ధైర్యం చెప్పుకొంటనే ఎదురుచూస్తున్నది రాజేశ్వరి. పొద్దు నెత్తి మీదికి వచ్చింది. ఇంటి ముంగట అంబులెన్స్ ఆగింది. శవాన్ని దించి.. ఆకిట్ల గడ్డిమీద పండుకోబెట్టింండ్రు. పిల్లలు, రాజేశ్వరి కుటుంబమంతా ఒక్కసారి ప్రభంజనంవోలే అయింది. కర్మకాండలు పూర్తి చేసింండ్రు. రాజేశ్వరి గుండె నిండా మోయలేని ఏడ్పు ఆవరించి ఉన్నా.. అనుభవమున్న పెద్దమనిషిలెక్క..

"అవ్వా! వదినె.. ఎవ్వలమైనా ఎల్లకాలం ఉండేటోళ్లం గాదు. ఎన్ని రోజులు భూమ్మీద నూకలు బాకీ ఉన్నాయో! గప్పటి దాక 'బతుకే ఓ కయ్యం' ఇది. 'ఆత్మహత్యల' జోలికి పోవద్దు. గది పెద్ద పాపం. మన బాధ్యతల్ని మరిచిపోవద్దు. పిల్లల బాధ్యత మనమీద ఉన్నది" అని బుద్ధి చెప్పింది.

* * *

కొంతకాలం గడిచింది. ఓదెలు మరణగాయం.. కొద్దికొద్దిగ మానుతున్నది. గంతల్నే.. పక్కింటోళ్లకు జరం వస్తే.. వెళ్లి చూసచ్చింండ్రు అనసూయ, రాజేశ్వరి. గంతే! వీళ్లకూ జరం, దగ్గు అందుకుంది. సర్కారు దవాఖానకు పోయి పరీక్షలు చేయించుకుండ్రు. తల్లీబిడ్డలకు కరోనా పాజిటివ్ వచ్చింది. ఇద్దర్నీ సిరిసిల్ల సర్కార్ దవాఖానల క్వారెంటైన్లకు తీసుకుపోయింండ్రు.

ఇంకేముంది.. 'నోరోటి ఆడితే నొసలోటి ఆడినట్లు' ఒక్కసారి భయంలోకి జారుకుండ్రు.

తనకూ, తన తల్లికి కరోనా పాజిటివ్ వచ్చిన విషయాన్ని ఫోన్ ద్వారా సాహితీ మిత్రులకు చెప్పింది రాజేశ్వరి. విషయాన్ని వాళ్లు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో.. సిరిసిల్ల పట్టణమంత పాకిందీ వార్త.

చంద్రంపేట అంజమ్మ పూటకూళ్ల ఇంట్ల రాత్రిపూట తిండికి వచ్చినోళ్లకూ ఈ ముచ్చట తెలిసింది.

"అరేయ్! రచయిత్రి రాజేశ్వరికి కరోనా వచ్చిందంట. గిప్పుడంటే.. బతుకమ్మ చీరలు బతుకునిస్తున్నయి. ఇంతకుముందైతే.. నేతన్నకు ఉరే గతి. నేనుగూడ ఫ్యాన్‌కు ఉరేసుకుందమని నైలాన్ తాడుతో తయారుగున్న! టీవీల రాజేశ్వరి మాటలు శెవుల సొర్రినయి. గంతే, తాడు ఇడిసి పక్కకు పారేసిన! లేకపోతే నా బొంద మీద గడ్డి మొలుస్తుండె" అన్నడు సురేష్.

"అరేయ్ సురేష్‌గా! నేనైతే బ్రాండిల ఇసం గల్పుకున్న! దేవతోలె ఆమె మాటలు

మనసుకెక్కి 'ఛీఛీ.. గింతపిరికోన్నా?' అని సీసా పెంటల ఇసిరికొట్టిన!" అన్నడు శేఖర్.

'బతుకు బరువు మోయలేక సావు అంచుల దాకా పోయిన ఎందరికో.. రాజేశ్వరి మాటలు పునర్జీవితాన్ని ఇచ్చినయి. అలాంటి రాజేశ్వరి కష్టాల్లో ఉన్నప్పుడు అందరం అండగ నిలువాలె!' అని ప్రతి ఒక్కరూ తీర్మానించుకున్నరు. విషయాన్ని వాట్సప్ గ్రూపులల్ల షేర్ చేసింద్రు. సిరిసిల్లలోని అన్ని ఇండ్లల్ల గిదే చర్చ

వెట్టింద్రు. ఎంతోమంది కదిలింద్రు. సిరిసిల్ల దవాఖానకు క్యూ కట్టింద్రు. రాజేశ్వరికి మందులు, పండ్లు, పోషకాహార కిట్లు, ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలిచింద్రు. తనకోసం సిరిసిల్లవాసులంతా కదిలిరావడంతో రాజేశ్వరి మనసు తబ్బిబ్బు అయ్యింది.

"అయ్యల్లారా! గింత భయంకర ఆపద సమయంలో ఈ అవిటి రచయిత్రిపై మీరు చూపుతున్న ఆప్యాయతకు, అనురాగానికి నా గుండె పొంగింది. నా భయం బద్దలైంది. మీ ఆశీస్సులున్నయి. నాకేం గాదు" అని అందరికీ తలవంచి దండంపెట్టింది రాజేశ్వరి.

"మీరు, మీ అమ్మ కరోనా నుంచి జెప్పన కోలుకోవాల్నని ఎములాడ రాజన్నకు మొక్కుతున్నం. ఈ గండం నుంచి బయటపడే దాకా నీ వెంటే ఉంటం. జీవితంపై విరక్తి చెందిన మాకు.. మీ మాటలతో బతుకు మీద ఆశ పుట్టించింద్రు. మా ప్రాణాలు గాలిలో కలిసిపోకుండ కాపాడింద్రు. మేమంతా మీ అభిమానులం!" అంటూ కన్నీళు ్లు పటపట రాలుస్తూ చెప్పింద్రు.

"బిడ్డా! రాజీ.. నాకు దమ్ము ఎత్తేసుకత్తంది. ఆయాసం ఎక్కువైతంది. నువ్వు.. అందరూ పైలం బిడ్డా! వదినెలు నీకు ఎట్ల సేవ జేస్తరో.. ఏమో!? అనే దిగులుంది. దేవుడు నిన్ను గిట్ల పుట్టించె! ఒకళ్ల మీద ఆధారపడుడాయె!" తల్లడిల్లింది ఆ తల్లి మనసు. మాట్లాడుతుండంగనే.. మొసరాక ఆగమాగమైంది అనసూయ. డాక్టర్లు వచ్చింద్రు.. "రాజేశ్వరీ! మీ అమ్మకు ఆక్సిజన్ లెవెల్స్ పడిపోతున్నయి. ఐసీయూలోకి తీసుకెళ్తం! మేం జేసే ప్రయత్నం మేం జేస్తం.. మీరు దేవుడి మీద భారమేయండి.." అంటూ అనసూయను తీసుకెళ్లింద్రు. రాజేశ్వరి మస్తు బెంగ వెట్టుకున్నది. పక్కపక్కనే ఉన్నప్పుడు ఏమీ అనిపించలేదు. గిప్పుడు చెరో దగ్గర అయ్యేసరికి అక్కడ ఏం జరుగుతున్నదో తెల్వక ఆందోళన చెందుతున్నది. కొడుకు, కోడళ్లు దూరం నుంచే మాట్లాడుకుంట పోతున్నరు. రాత్రి గడిచి తెల్లారింది.

అక్కన్నే ఉన్న నర్సులను పిలిచి..

"మా అమ్మకెట్లుంది?" అని అడిగింది రాజేశ్వరి.

"ఇప్పుడే ఏం చెప్పలేం! ఇంకా ఆక్సిజన్ లెవెల్స్ తక్కువనే ఉన్నయి" అని చెప్పింద్రు

వాళ్లు.

తన అవస్థను చెప్పుకోడానికి ఐసీయూ లోపలున్న అనసూయ దగ్గర ఎవర్లేరు. గంతల్నే దమ్ము ఎగపోత పెరిగింది. మృత్యువుతో పోరాడి పోరాడి.. కొడుకు, కోడలు వచ్చేసరికి తుదిశ్వాస విడిచింది.

"అమ్మా! అన్నీ నువ్వే అయి మమ్మల్ని నడిపించినవు. ఇగ మాకు దిక్కెవరు?" అని గుండె పగిలి ఏడ్చింది రాజేశ్వరి.

కరోనా నిబంధనలు పాటిస్తూ.. అనసూయ అంత్యక్రియలు జరిపింద్రు కొడుకు, కోడలు. అభిమానులు, కవులు, కళాకారులు.. నిబంధనలతో ఆ కార్యక్రమంలో పాల్గొన్నరు. అమ్మలేని బాధను భరిస్తూనే.. కరోనాను జయించింది రాజేశ్వరి.

ధైర్యాన్ని కూడగట్టుకుని..

'రాజైనా! బంటైనా! ధనికుడైనా! పేదైనా.. ఎవలైనా మట్టిలో కలిసేదే కదా! మిగిలేది.. మంచి, చెడు' అనుకుంటూ ఆత్మస్థయిర్యాన్ని మరింత పెంచుకుంది. వదినెలు మంచోళ్లు. తల్లిలేని లోటు తీరుస్తూ.. సాయం అందిస్తూనే ఉన్నరు. తనకు జరిగిన గాయాలను కవి సమ్మేళనాలలో కవితల రూపంలో వెల్లడించింది రాజేశ్వరి. రెట్టింపు పదునుదేలి ముందుకు సాగుతున్నది. తన అవిటితనాన్ని మరిచి.. తెగింపుతో, పట్టుదలతో, సాధన చేస్తూనే ఉన్నది. రాజీ పకుండా.. 'బతుకే! ఓ కయ్యం!' అనుకుంటూ.

**జనపాల శంకరయ్య స్వస్థలం, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు. ఏడో తరగతితోనే చదువును ఆపేసినా.. ఉన్నత విద్యాభ్యాసంపై మక్కువతో ప్రైవేట్‌గానే ఎం.ఎ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు. పద్య, వ్యాస రచన, బుర్రకథ ప్రక్రియల్లో అనేక రచనలు చేశారు. 'కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు', 'బహుముఖ ప్రజ్ఞాశాలి కల్వకుంట్ల తారక రామారావు బుర్రకథ', 'తెలంగాణ సమరశంఖం', 'అవినీతిపై అక్షరాంకుశం', 'పర్యావరణ పరిరక్షణ పాంచజన్యం', 'వైద్యం – ఆరోగ్యం' కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించారు. సిరిసిల్ల సాహితీ సమితి ప్రధాన కార్యదర్శిగా, రాజన్న సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా సాహితీ సేవ చేశారు. ఈయన రాసిన 'ఆచార్య దేవోభవ' శతకానికి పాలకొల్లు విశిష్ట పురస్కారం, చెలిమి సాంస్కృతిక సంస్థ పురస్కారం దక్కాయి.**

# రోహిణి ఐ.ఏ.ఎస్



**తటవర్తి నాగేశ్వరి**

"త్వరగా పోనివ్వు ముత్యాలు.. వాళ్లు వెయిట్ చేస్తూ ఉంటారు" అన్నది సోషల్ వెల్ఫేర్ కమిషనర్ రోహిణి.

"సరే.. అమ్మగారూ!" అంటూ కారు స్పీడ్ పెంచాడు ముత్యాలు.

ఏసీ ఆఫ్ చేయమని చెప్పి.. కార్ విండో ఓపెన్ చేసింది. టేకు చెట్ల మీదినుంచి చల్లటి గాలి వీస్తున్నది. బాసర చేరే సరికి మధ్యాహ్నం దాటింది. అప్పటికే అక్కడ మహిళలు గుమిగూడి ఉన్నారు. కారు దిగగానే.. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సదానందం, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మార్కస్.. రోహిణికి బొకేతో స్వాగతం పలికారు. అక్కడ ఉన్న మహిళలు గౌరవప్రదంగా లేచి నిల్చున్నారు. రోహిణి దగ్గరికి వచ్చి లబ్ధిదారుల జాబితా చూపిస్తూ..

"వీళ్లలో చాలామందికి ఇంతకుముందే రుణాలు ఇచ్చాం మేడమ్" అని ఏదో చెప్పబోయాడు ఈడీ.

"ఆ రుణాలు కట్టలేదా?" అడిగింది.

"గత ప్రభుత్వం రద్దు చేసిందమ్మా" అన్నాడు డిప్యూటీ డైరెక్టర్.

"మరి పాత రుణాలను ఎందుకు గుర్తుచేస్తున్నారు?" అడిగింది.. ఈడీని చూస్తూ.

"ప్రతి ఏడాది కొత్త కమిషనర్ రావడం.. రుణమేళా ఏర్పాటు చేయడం.. ఆనవాయితీగా మారింది తప్పా, వీళ్ల జీవితంలో మార్పు లేదమ్మా! అదే తమకు చెప్ప

బోతున్నా!" చెప్పాడు ఈడీ.

"మనం తెద్దాం..! వీళ్లు గౌరవప్రదంగా బతకడమేకదా మనకు కావాల్సింది" అన్నది రోహిణి.

"మమ్మల్ని మనుషులుగా ఎవరు చూస్తున్నారు మేడం? సెక్స్ వర్కర్ల లెక్క. అధికారుల నుంచి ఊళ్లో మోతుబరుల వరకూ.. అందరూ అలాగే చూస్తున్నారు" అన్నది వాళ్లలో ఓ అమ్మాయి.

అందం, తెలివి పోటీ పడినట్టున్న ఆ అమ్మాయిని చూస్తూ..

"నువ్వు చదువుకున్నావా?" అడిగింది రోహిణి.

"డిగ్రీ డిస్‌కంటిన్యూ.. మేడం!".

"ఎందుకలా?".

"ఇంటర్ దాకా చదవడమే మాకు చాలా గొప్ప మేడం. రెండో తరగతిలో మొదలయ్యే హేళన.. కొన

సాగుతూనే ఉంటుంది. ఆ ఎగతాళి భరించలేక కూలీకి వెళ్లి బతుకుతుంటాం. మా జీవితాలు ఇలాగే రాలిపోతుంటాయి".. కళ్లలో నీళ్లు ఉబికి వస్తున్నాయి.

రోహిణి కళ్లూ.. అరుణిమ దాల్చాయి.

"ఏమని హేళన చేస్తుంటారు మిమ్మల్ని?"..

పీఏ రామ్మూర్తి ఎంటరై చొరవగా అడిగాడు.

"ఒకడు.. 'మీ నాన్న ఎవడే?' అని అడుగుతాడు. ఇంకొకడు.. 'నీకు నాన్న ఎవరో తెలీదు కదా!?' అంటాడు.." ఇంకా చెప్పబోతుంటే, రోహిణి అడ్డుకొని..

"ఐ నో.. నాకు తెలుసు. మీ అవమానాల జాబితా నా దగ్గర కూడా ఉంది. మీరు చేయని తప్పులకు మీరు గిల్టీగా ఫీలవ్వాల్సిన అవసరం లేదు. మీరెవరూ చదువులు మానకండి" అన్నది రోహిణి.

తన ఎదురుగా ఉన్న ఆ అమ్మాయి కళ్లలోకి చూస్తూ..

"నువ్వు స్టడీస్ కంప్లీట్ చెయ్.. నేను సపోర్ట్ ఏర్పాటు చేస్తాను" అని చెప్పింది రోహిణి.

"ఇలా చాలామంది చెప్పి పోతుంటారు. ఈ కాలనీలో డిగ్రీ వరకు వచ్చింది ఈ పిల్లొక్కతే. ఏటికి ఎదురీదుతున్నది" అన్నది అక్కడున్న ఓ మహిళ.

"నీ పేరు ఏంటమ్మా?" అడిగింది రోహిణి.

"సాయమ్మ!" చెప్పిందామె.

ఆమె వైపు చూస్తూ%॥

%“సాయమ్మా! నేను ఇంకో గంట ఇక్కడే ఉంటా కదా. ఈ అమ్మాయిని బట్టలు సర్దుకొని రెడీగా ఉండమను. నేనే తీసుకెళ్లి చదివిస్తా” చెప్పింది రోహిణి.

నమ్మశక్యం కానట్టు చూసింది ఆ అమ్మాయి.

అక్కడ గుమిగూడిన జనం దిక్కు తిరిగి..

“జోగిని వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసి చాలాకాలమైంది. మీ జీవితాల్లో మార్పుకోసమే ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఇక ఎవరూ మీ పిల్లల్ని జోగినిగా మార్చాల్సిన పనిలేదు. మీకు నచ్చిన వృత్తిని మీరు ఎంపిక చేసుకోండి. మిమ్మల్ని ఎవరైనా ఇష్టపడితే

నిరభ్యంతరంగా పెళ్లి చేసుకోండి. అందుకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం కూడా కొంత డబ్బు ఇస్తుంది. ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తుంది. మిగతా వాళ్లలాగే మీరంతా పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను” చెప్పింది రోహిణి.

ఒక్కసారిగా హర్ష ధ్వానాలు మిన్నంటాయి.

తిరుగు ప్రయాణంలో తనతోపాటు తీసుకెళ్లాలనుకున్న అమ్మాయి తల్లి బసంతిని కలిసింది. అనారోగ్యంతో మంచంపైన పడుకొని ఉన్న ఆమెవైపు చూస్తూ..

“మీరు దిగులు పడకండి. మీ అమ్మాయిని పెద్ద

ఆఫీసర్ని చేస్తాను” హామీ ఇచ్చింది రోహిణి.

బలహీన దేహంతోనే పైకి లేచి, రోహిణి కాళ్ల మీద పడినంత పనిచేసింది బసంతి.

అక్కడినుంచి కదిలి, ఆ అమ్మాయిని తన కారులో ఎక్కించుకొంది.

“ఇంతకీ నీ పేరేంటి?” అని అడిగింది రోహిణి.

“హాసిని”.

“గుడ్ నేమ్”.

“మా అమ్మతో ఎవరో ఒక పెద్ద

మనిషి జత కడితే నేను పుట్టానట. ఒకరోజు అతను అమ్మ దగ్గరికి వచ్చి, ఈ పేరు పెట్టమని చెప్పి.. పదివేలు ఇచ్చి వెళ్లాడట. ఆయన సుహాసినిగారి ఫ్యాన్ అట. మళ్లీ అతను మా అమ్మ కంటికి కనిపించలేదు!”.. చెప్పింది హాసిని నవ్వా.. దిగులూ కలగలసిన చూపుతో.

నాలుగున్నర గంటల ప్రయాణం తర్వాత.. కారు హైదరాబాద్‌లో రోహిణి ఇంటి ముందు ఆగింది.

భార్య వెంట వచ్చిన హాసినిని చూసి.. రఘోత్తమ్ భృకుటి ముడిపడింది.

“ఏంటి అలా చూస్తున్నారు?” అడిగింది రోహిణి.

"ఇప్పుడే టీవీలో చూస్తున్నానోయ్.. నీ ఘనకార్యం" అన్నాడు రఘోత్తమ్.

భర్తను హాసినికి పరిచయం చేసి..

"హాసినీ.. అది నీ గది. వెళ్లి ఫ్రెషప్ కా!".. అన్నది ఒక గదిని చూపిస్తూ.

హాసిని బిడియంగా ఆ గదిలోకి నడిచింది.

భార్యవైపు చూస్తూ..

"ఇది మీడియాకి స్పెషల్ న్యూస్ అయ్యింది. ఒక జోగిని అమ్మాయిని కమిషనర్ అడాప్ట్ చేసుకొన్నారని న్యూస్ టెలికాస్ట్ చేశారు" చెప్పాడు.

"సారీ.. తను జోగిని కాదు" అన్నది రోహిణి.

"అఫ్‌కోర్స్! రెస్క్యూ హోమ్స్ ఉన్నాయి కదా.. అక్కడ వదిలి రాలేకపోయావా?".

"నేరుగా అక్కడికి పంపిస్తే ఆ అమ్మాయి అడ్జస్ట్ అవ్వాలి కదా! ఉండనీయండి మనతో కొద్దిరోజులు".

"ఓకే మేడం! మీ మాట మేం ఎలా కాదనగలం?".

కాసేపటికి.. హాసిని స్నానం చేసి వచ్చింది. డైనింగ్ టేబుల్ దగ్గర హాసినికి స్వయంగా వడ్డించింది

కమిషనర్.

"హాసినిని మంచి కాలేజీలో చేర్పించి, మంచి హాస్టల్లో అకామిడేషన్ ఏర్పాటు చేద్దాం" చెప్పాడు

రఘోత్తమ్.

"నాకు కిచెన్‌లో కాస్త జాగా ఇవ్వమ్మా చాలు. నేను ప్రైవేటుగా డిగ్రీ పూర్తి చేసుకుంటాను" అన్నది హాసిని.

"నిన్ను తెచ్చిందే కాలేజీలో చేర్పించడానికి.. కదా హాసినీ!" అన్నాడు రఘోత్తమ్.

హాసిని భయంగా చూసింది.

"వద్దమ్మా.. నన్ను జోగినీ పిల్ల అని ఎగతాళి చేస్తారు".

"వాళ్లకు ఎవరు చెబుతారు? నువ్వు కూడా చెప్పకు".

"మీరు నన్ను చదివించడానికి బాసర నుంచి తెచ్చినట్టు ఇప్పటికే మీడియాలో వచ్చింది కదమ్మా!".

"భయపడకు హాసినీ.. కాలేజీలో ఎవరైనా టీజ్ చేస్తే, నాకు కాల్ చెయ్. జీవితంలో మళ్లీ వాడు రోడ్డుమీద నడవకుండా చేస్తాను" అన్నాడు రఘోత్తమ్.

"నాకోసం గొడవలెందుకు సార్?".

"హాసినీ.. సొసైటీలో అందరితోపాటే నీకూ సమాన హక్కులు ఉన్నాయ్. నువ్విలా అధైర్యపడితే ఎలా?".. ధైర్యం చెప్పింది రోహిణి.

డిన్నర్ తర్వాత తమ గదిలోకి వెళ్లారు భార్యాభర్తలు. గదిలో వాతావరణం గంభీరంగా ఉంది. బయట వర్షం వస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. చల్లటి గాలి ముఖానికి తగలడంతో కిటికీ వేయడానికి వెళ్లిన రోహిణి.. కిటికీలోంచి బయటికి చూస్తూ అలాగే నిల్చుండి పోయింది.

"ఏంట్రా! అలా నిల్చుండిపోయావ్?" అడిగాడు రఘోత్తమ్.

"మావయ్యగారు గుర్తొస్తున్నారండీ".

"నాన్నను నాకంటే నువ్వే ఎక్కువ గుర్తు చేసుకుంటావ్ రోహిణీ".

"ఒక అనాథను తీర్చిదిద్ది.. తన కోడలిగా కూడా చేసుకున్నారు కదా!".

"అమ్మానాన్న లేని వాళ్లందరూ అనాథలేనా? మనం భూమ్మీద కొచ్చినప్పటినుంచీ ప్రకృతి సదా మనకు తోడుగానే ఉంటుంది" చెప్పాడు రఘోత్తమ్.

"అమ్మెవరో తెలీదు. నాన్న ఎవరో తెలీదు. ఊహ తెలిసే నాటికే ఆశ్రమంలో ఉన్నాను. నెలకొకసారి మావయ్యగారు వచ్చేవాళ్లు. 'నీ కేర్‌టేకర్ వీరేనమ్మా!' అని పరిచయం చేసింది వార్డెన్. మావయ్యగారు మంచి బట్టలు, తినుబండారాలు తీసుకొచ్చి ఇచ్చేవాళ్లు. 'నన్ను మీ ఇంటికి తీసుకెళ్లొచ్చు కదా అంకుల్' అని అడిగానోసారి.

'నిన్ను ఇంత శ్రద్ధగా చూసుకొనేవాళ్లు ఎవరూ అక్కడ ఉండరమ్మా' అని చెప్పారు.

మళ్లీ నేను అడగలేదు. డిగ్రీ పూర్తయ్యాక..

'పీజీ చేస్తావా?' అని అడిగారు.

'మీ ఇష్టం!' అన్నాను.

అప్పటికే నేను ఆశ్రమం నుంచి హాస్టల్‌కు షిఫ్ట్ అయ్యాను. అందరూ సెలవు రోజుల్లో సొంతిళ్లకు వెళ్తే.. నేను వెళ్లడానికి ఏ ఇల్లూ లేక హాస్టల్ గదిలోనే ఒక మూలన ముడుచుకొని కూర్చొనేదాన్ని. ఒకరోజు మావయ్యగారు వచ్చారు.

'సివిల్స్ కోసం నిన్ను ఢిల్లీ పంపిస్తున్నాను' అని చెప్పారు.

'నేనా?' అన్నాను ఆశ్చర్యపోతూ..

'నేకేం! నీ స్టడీ ట్రాక్ రికార్డ్ చాలా బాగుంది. నీ టాలెంట్‌కు 'సివిల్స్' సాధించడం పెద్ద కష్టమేం కాదు' అన్నారు.

ఆయన మాటలను కాదనలేదు. రెండేళ్ల తర్వాత సివిల్ సర్వీస్ సాధించాను. ఒక జిల్లాకు జాయింట్ కలెక్టర్ అయ్యాను. ఒకరోజు నా బంగ్లాకు వచ్చారు. ఆయన కాళ్లకు నేను ఎప్పట్లా నమస్కారం చేశాను. నా భుజాలు పట్టి పైకి లేపి..

'నీకు పెళ్లి కళ వచ్చిందమ్మా!' అన్నారు.

మీ ఫొటో చూపించి..

'నాకొడుకు రఘోత్తమ్. ఐఐటీ కాన్పూర్‌లో ఎంటెక్ చేశాడు. నా ఆరోగ్యం సహకరించడం లేదని నా రాజకీయ వారసుడిగా వాణ్ని ఎన్నికల్లో నిలబెట్టాను. నిజానికి వారసత్వ రాజకీయాలు నాకు నచ్చవు. కానీ, నా కొడుకు అయితేనే గెలుస్తాడని పార్టీ పెద్దలు అనడంతో నేను మౌనం వహించక తప్పలేదు' అని చెప్పారు.

ఫొటోలో చూడగానే మీరు నాకు నచ్చారు. ఉన్నత విద్యాభ్యాసం చేసి, శాసనసభ్యులుగా ప్రజాజీవితంలో ఉన్న మిమ్మల్ని కాదనడానికి నాకు ఏ కారణం కనిపించలేదు. నాకు ఇంత మంచి జీవితాన్ని ఇచ్చిన మావయ్యగారు.. నాకు దైవ సమానులు. ఆయన మాట కాదనడం నాకు సాధ్యం కాని పని. అలా మీరు నా జీవితంలోకి వచ్చారు. మావయ్య గారిని మించిన ప్రేమ మీరు నిరంతరం చూపుతూనే ఉన్నారు. ఏనాటిదో మన బంధం. కానీ, తరచూ నేను అనాథనని గుర్తుకొస్తూ ఉంటుంది. ఈరోజు హాసినిని చూస్తే.. నా గతం అంతా నా కళ్లముందు ఒకసారి కదలాడింది. తనకూ తండ్రెవరో తెలీదు.. నాకూ నా తండ్రి ఎవరో తెలీదు".. చెప్పడం ఆపింది రోహిణి. ఆమె కళ్లలో కన్నీళ్లు. కదిలిపోయాడు రఘోత్తమ్.

"నువ్వు అనాథవి కాదు రోహిణీ? నీకు నేనున్నా" అన్నాడు. భర్త నుదుటిని ముద్దాడింది రోహిణి.

"హాసిని లాంటి వారికి మన సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది.." అన్నాడు ఆమెను దగ్గరికి తీసుకుంటూ.

రోహిణి అతని గుండెలపై తల పెట్టింది.

"మావయ్యగారు తన ఆఖరి రోజుల్లో నా దగ్గర ఒక మాట తీసుకున్నారు".

"ఏ విషయంలో?".

"జోగిని వ్యవస్థను సమూలంగా తుడిచేయాలని ఆయనెప్పుడూ చెబుతుండేవారు. 'ఒక సివిల్

సర్వెంట్‌గా వాళ్ల జీవితాల్లో వెలుగు తీసుకురావడానికి నువ్వు పని చేయాలి తల్లీ!' అని చెప్పారు. అందుకే.. నేను ఏరి కోరి సోషల్ వెల్ఫేర్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. రాష్ట్రవ్యాప్తంగా వాళ్ల పునరావాసం కోసం పనిచేస్తున్నాను. ఇదే మావయ్య గారికి నేనిచ్చే నివాళి అని భావిస్తున్నాను. హాసిని లాంటి తండ్రిపేరు చెప్పుకోలేని అమ్మాయిలు, తండ్రెవరో తెలియని వాళ్లు.. ఈ సమాజంలో చాలామంది ఉన్నారు. వాళ్ల జీవితాల్లో మార్పు కోసం ప్రయత్నించాలి".. అన్నది భావోద్వేగంతో.. "తప్పకుండా!" అన్నాడు రఘోత్తమ్.

రోహిణి నిద్రపట్టక అటు వైపు తిరిగి కదలాడుతుంటే.. రఘోత్తమ్ ఇటువైపు తిరిగి ఆలోచనలో పడ్డాడు. అతనికీ నిద్రపట్టడం లేదు. లేచి వెళ్లి కిటికీ దగ్గర నిల్చున్నాడు. చల్లటి

జల్లు కురుస్తూనే ఉంది.

'అనాథ అన్న ఫీలింగే రోహిణిని దహించి వేస్తున్నది. ఇంక తన జన్మరహస్యం తెలిస్తే.. ఇంకా ఎంత కుంగిపోతుందో!?' అన్న ఆలోచన.. రఘోత్తమ్‌ను నలిబిలి చేస్తున్నది. ఒక్కసారిగా గతం కళ్లముందు కదలాడింది.

"ఏం మాట్లాడుతున్నారు మీరు?" అన్నది

కిరణ్మయి.

"వేరే ఎవర్ని చేసుకున్నా.. తన లైఫ్ చాలా డిస్టర్బ్ అవుతుంది.." అంటూ ఆగాడు సర్వోత్తమ్ రావు.

"ఏదో దిక్కులేని పిల్లను దేశోద్ధారకుడిలా చదివిస్తున్నారంటే.. చూసీ చూడకుండా వదిలేశాను. ఇప్పుడు 'ఇంటికి కోడలిగా తెస్తా' అంటే, ఎలా ఊరుకుంటాను?".. కిరణ్మయి హూంకరించింది.

"తను ఇప్పుడు ఐఏఎస్ ఆఫీసర్. అనాథ కాదు".

"నా కొడుక్కు ఏ ఆఫీసర్ అవసరం లేదు. జనం పేరుతో వాడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసి, రాజకీయాల్లోకి దింపారు. ఇప్పుడు వాడి వ్యక్తిగత జీవితం కూడా నాశనం చేస్తారా?".

కిరణ్మయి తన మాట వినేలా లేదని అతనికి అర్థమైంది. తీవ్రమైన మానసిక వ్యధతో.. సర్వోత్తమ్ రావుకు గుండెపోటు వచ్చింది. డాక్టర్లు ఆపరేషన్ అవసరం అన్నారు. ఆపరేషన్‌కు వెళ్లేముందు కొడుకును పిలిచాడు. ఒక నిమిషం ఇద్దరి మధ్య మౌనం నడిచింది.

"ఏంటి నాన్నా! ఇంత మథన పడుతున్నారు?"

అడిగాడు రఘోత్తమ్.

"రోహిణిని పెళ్లి చేసుకోరా!".

"అమ్మా, మీరూ మాట్లాడుకోవడం నేను విన్నాను నాన్నా. నాలాంటి పొలిటీషియన్‌ని పెళ్లి చేసుకోవడానికి తనే ఆలోచించాలి".

"నీకేం రా.. నువ్వు బంగారానివి".

"ముందు మీరు ఆపరేషన్‌కు వెళ్లి రండి నాన్నా".

"ఆ ఆపరేషన్ టేబుల్‌పైనే ప్రాణాలు పోయినవాళ్లు చాలామంది ఉన్నారు. నాకు మాటివ్వు.." అంటూ చెయ్యి చాపాడు సర్వోత్తమ్ రావు.

"మీరు తనకు చారిటీ చేశారని తెలుసు నాన్నా! బట్.. నౌ షీ ఈజ్ యాన్ ఆఫీసర్. బలవంతంగా మన నిర్ణయాలు అవతలి వాళ్లపై రుద్దకూడదు కదా నాన్నా!?".

కొడుకు వైపు అదోలా చూశాడు.

"తనకు అభ్యంతరం లేకపోతే నేను సంతోషంగా చేసుకుంటాను నాన్నా! కానీ, నాదో సందేహం".. అంటూ ఆగాడు రఘోత్తమ్.

'ఏంట్రా?' అన్నట్టు చూశాడు తండ్రి.

"తను ఇప్పుడు పెద్ద ఆఫీసర్. ఆమె కులాన్ని, మతాన్ని చూడకుండా ఎవరైనా చేసుకుంటారు. అలాంటిది.. మన ఇంటికి కోడలుగా రావాలని ఎందుకు పట్టుబడుతున్నారో తెలుసుకోవచ్చా?" అడిగాడు.

ఒక నిమిషం తటపటాయించాడు సర్వోత్తమ్ రావు.

"తన గురించి ఒక రహస్యం నాకు మాత్రమే తెలుసురా! అది ఏ రోజైనా ఒక ప్రశ్నగా మారొచ్చు. ఏ మార్గంలోనైనా బయటికి వస్తే.. ఈ పురుషాధిక్య సమాజంలో తన వివాహ జీవితం దెబ్బతింటుందని నేను భయపడుతున్నాను" చెప్పాడు సర్వోత్తమ్ రావు.

ఆసక్తిగా తండ్రి ముఖంలోకి చూస్తూ..

"ఏంటి నాన్నా.. ఆ రహస్యం?" అడిగాడు

రఘోత్తమ్.

కొడుకు కళ్లలోకి చూస్తూ..

"మీ నాన్న ఇంతకాలం బయట తిరుగుతున్నాడంటే.. అది రోహిణి తల్లి దయేరా" అన్నాడు.

ఇంకా ఆశ్చర్యపోయాడు రఘోత్తమ్.

"అవును రా! ఆ రోజు నేనే స్వయంగా జీపు నడుపుకొంటూ ఓ గూడేనికి వెళ్లాను. తిరిగి వెనక్కి వచ్చే సమయానికి చీకటిపడింది. జీపు లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదు. ఊరి పొలిమేర దాటగానే.. గడ్డిమోపు నెత్తిన పెట్టుకొని ఒక మహిళ రోడ్డు పైకి వచ్చింది. నేను ఆమెను గమనించలేదు. జీపు తగిలి కిందపడి తీవ్రంగా గాయపడింది. తను నిండు గర్భిణి. నా ముఖంలో కంగారు చూసి.. 'మీరు కావాలని నాకు బండి తాకించలేదు కదా దొరా! ఈ దెబ్బలతో నన్ను గూడెంలోకి తీసుకెళ్తే.. మావాళ్లు కోపంలో మిమ్మల్ని కొట్టి చంపినా ఆశ్చర్యంలేదు. నన్ను బేగిన దవాఖానకు తీసుకెళ్లండి దొరా!' అని వేడుకుంది. వెన్నులో చలీ, జ్వరం మొదలైంది. ఎలాగోలా హాస్పిటల్‌కు తీసుకెళ్లేసరికి రక్తం చాలాపోయింది. ఎవరో ఒకర్నే బతికించే అవకాశం ఉందని చెప్పారు డాక్టర్లు. కొన ఊపిరితో ఉన్న ఆమెకు విషయం చెప్పాను. 'నన్ను బతికించక పోయినా సరే.. నా బిడ్డను మాత్రం బతికించండి' అని వేడుకుంది. యాక్సిడెంట్ కేసు కావడంతో హాస్పిటల్ సిబ్బంది ఇచ్చిన కంప్లయింట్‌తో

అప్పటికే పోలీసులు వచ్చారు. ఆ నిమిషం.. నా వల్లే ప్రమాదం జరిగిందని తను

చెప్పి ఉంటే, జైల్లోకెళ్లి ఊచలు లెక్కపెట్టుకొనే వాణ్ని. ఎవరో రోడ్డుమీద బండితో గుద్దేసి పోతే.. నేనే కాపాడి తీసుకొచ్చి, దవాఖానలో చేర్చానని చెప్పింది. తన పేరు, ఊరు.. ఏ వివరాలు కూడా చెప్పలేదు. ఆపరేషన్ థియేటర్లోకి పోయే కాసేపటి ముందు..

'మీ ఆయన పేరు చెప్పమ్మా! నీకేమైనా అయితే నీ బిడ్డను తండ్రి దగ్గరికి చేరుస్తా' అన్నాను.

కళ్లలో ఊపిరి నిలుపుకొన్న ఆమె ఎగశ్వాసతో..

'మా బిడ్డలకు తండ్రులెవరో మాకే తెలియదు దొరా! మావి ఊరుమ్మడి బతుకులు.. నేను జోగినిని' అన్నది.

షాక్ అయ్యాను.

'నా బిడ్డను మళ్లీ మా గూడానికి చేర్చమాకు దొరా! ఆడపిల్ల పుడితే దాన్ని కూడా మావాళ్లు జోగినిగా మారుస్తారు. ఎక్కడైనా అనాథాశ్రమంలో చేర్పించి పుణ్యం కట్టుకోండి' అని నా చేతులు పట్టుకుంది. ఆపరేషన్ థియేటర్లోకి వెళ్లిన ఆమె.. మళ్లీ బయటికి రాలేదు"..

సర్వోత్తమ్ కళ్లలో నీళ్లు..

"ఆ బిడ్డను ఇంటికి తీసుకు రావడానికి మీ అమ్మ ఒప్పుకోదని తెలుసు. పైగా లేనిపోని అభాండాలు వేస్తుంది. నెత్తుటిగుడ్డుని హాస్పిటల్‌లోనే ఉంచి.. ఆమె శవాన్ని పోలీసుల సాయంతో ఖననం చేయించాను. నాకు తెలిసిన ఆశ్రమంలో పసికందును చేర్చాను. ఆ గిల్టీ ఫీలింగ్ ఇప్పటికీ నన్ను దహించి వేస్తూనే ఉంది. ఇప్పటి వరకూ ఆమె జన్మరహస్యం ఎవరికీ చెప్పలేదు. రోహిణికి చెబితే తల్లిని యాక్సిడెంట్ చేసి చంపిన వ్యక్తిగా.. నన్ను అసహ్యించుకుంటుందేమోనని భయం. పైగా విషయం మన ప్రత్యర్థులకు చేరితే.. రాజకీయ జీవితం సమాధి అవుతుందేమోనని మరో భయం. మనం రోహిణికీ, ఆమె తల్లికీ రుణపడి ఉన్నాం నాయనా! ఈ విషయాలేవీ మీ అమ్మకు తెలియవు. ఒక దుర్మార్గ పూరిత వ్యవస్థకు రోహిణి తల్లి బలైంది. మన వల్లే రోహిణి అనాథగా మారింది. తను తెలివైన అమ్మాయి మాత్రమే కాదు. ఉన్నత సంస్కారవంతురాలు. మనం అండగా ఉండాలి. మన ఇంటి కోడలిగా చేసుకుని కాపాడుకోవాలి!"..

చెప్పడం ఆపాడు సర్వోత్తమ్ రావు. అప్రయత్నంగా తండ్రి చేతిలో చేయి వేశాడు రఘోత్తమ్.

"ఏంటీ అక్కడ నిల్చొన్నారు?".. రోహిణి మాటలతో గతంలోంచి బయటపడ్డాడు రఘోత్తమ్.

వెనక్కి తిరిగి, ఆమె ముఖంలోకి చూస్తూ..

"ఎందుకో నిద్ర పట్టలేదు రోహిణీ!" అన్నాడు.

"హాసిని గురించి ఆలోచిస్తున్నారా?" అడిగింది.

"అవును. తనను కూడా నీకులానే మంచి ఆఫీసర్‌ని చేయాలి" అన్నాడు స్థిర సంకల్పంతో.

"మిమ్మల్ని చూస్తుంటే మావయ్యే గుర్తొస్తున్నారు".. అంటున్న రోహిణి ఐఏఎస్ పెదవులపై.. సంతోషంతో కూడుకున్న చిరునవ్వు మొలిచింది.

మరుసటి రోజు.. హాసినిని దత్తత తీసుకుంటున్నట్టు మీడియాలో ప్రకటించాడు రఘోత్తమ్.

# తటవర్తి నాగేశ్వరి

**తటవర్తి నాగేశ్వరి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా గౌరవరం. ఎంఏ (తెలుగు) చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పదవీ విరమణ పొందారు. 2012 నుంచి కథలు రాస్తున్నారు. మొదటి కథ.. 'తదనంతరం' ఆంధ్రజ్యోతి 'నవ్య' వీక్లీలో ప్రచురితమైంది. 'దాడి' కథ.. రమ్యభారతి సాహిత్య మాస పత్రిక నిర్వహించిన కథల పోటీలో బహుమతి దక్కించుకున్నది. శ్రీకళ్లేపల్లి వెంకటశాస్త్రి శత జయంతి పురస్కార కథల పోటీలో 'నవ్వు నవ్వించు' కథకు బహుమతి అందుకున్నారు. మొదటి నవల 'మమజీవన హేతునా'.. 'స్వాతి' మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైంది. 'నవ్య' వీక్లీ, 'తురగా' ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలో 'కల్కి' సీరియల్‌కు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వివిధ పత్రికలు, సాహితీ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో సంధ్యారాగం, సత్యభామ, గురి, అమ్మరుణం, అమ్మకోసం తదితర కథలకు బహుమతులు అందుకున్నారు.**

# జీవన తీరాలు



**బద్రి నర్సన్,**
**9440128169**

“పప్పా .. హమ్ కాలేజ్ జావ్ చూ.. అంటూ తను కాలేజీ వెళ్తున్నానని రాజేశంకు చెబుతూ సుభద్ర సైకిలెక్కి బయలుదేరింది. ‘ తే బరా బరా చే..’ అంటూ గుజరాతీలో సరేనమ్మా అని కూతురుకి బదులిచ్చాడు రాజేశం. అసలుకు రాజేశం సొంతూరు వరంగల్ దగ్గరి శంభునిపేట. కట్టుబట్టలతో ఊరును వదిలిపెట్టి సూరత్ లో అడుగు పెట్టి ఇప్పటికి ఇరువై రెండు ఏండ్లయితాంది. అప్పుడాయన వయసు ఇరువై ఏండ్లు. వచ్చిన నాల్రోజులకే డైమండ్ నగర్ లోని ఓ బట్టల మిల్లులో పని దొరికింది. రోజుకు పన్నెండు గంటల పని. మిల్లు పక్కనే ఉన్న కిరాయి గదిలో కూడా పగలో రాత్రో పన్నెండు గంటలు మాత్రమే ఉండచ్చు. పనిలో ఉన్నా, పడుకున్నా మగ్గాల టక టక చప్పుడు మాత్రం చెవుల దగ్గరే ఉంటది. ఇప్పుడు ఒడిశా కార్మికులు ఉండే కిస్మత్ కాలనిలో నివాసం. రాజేశం భార్య పేరు దీపాలి బెహరా.

ఆమె ఒడిశాలో పుట్టి పెరిగింది. రాజేశం దీప అని పిలుస్తాడు. రాజేశంకు ఒక్కతే బిడ్డ. కొడుకుల్లేరు. ఆయన తల్లి పేరు భద్రమ్మ. ఆ పేరు కలిసేలా బిడ్డకు ఈ పేరు పెట్టాడు. సుభద్ర ఇప్పుడు బి ఎ చదువుతోంది. ఇన్నేండ్లు ఇంటి ముచ్చట తెలువకుంటనే బతుకుతున్నాడు. లేక లేక పుట్టిన కొడుకు ఎటు పోయిండో ఆ తల్లికి తెలియదు. తల్లి బతికి ఉందో లేదో కొడుక్కి తెలియదు. అప్పటికే తల్లి అరవై ఏండ్లామె. ఇప్పటికి బతికి ఉండే అవకాశం లేదని మల్లేశం మనసులోనే తల్లిని తలచుకొంటూ బాధ పడుతూ ఉంటాడు. అక్క సుగుణ తన కన్నా ఐదేండ్లు పెద్దది. పెండ్లయింది. రాజేశం ఊరిడిసేనాటికి సుగుణకు రెండేండ్ల వయసు కొడుకు ఉండె. అక్కంటే రాజేశంకు ఎంతో ఇష్టం. అల్లుణ్ణి ఎత్తుకొని ఆడుకున్న రోజులు ఇంకా గుర్తున్నయి. తల్లి మాదిరే అక్క కూడా తన కోసం ఏడ్చి ఏడ్చి ఊర్కున్నదేమో అని దిగులు పడుతుంటాడు. ఈ బాధలన్నీ తనకే కానీ దీపకు, సుభద్రకు ఏమి తెలియదు. దీప దృష్టిలో ఆయనొక అనాథ. సూరత్ లనే పుట్టి గుజరాతీ పిల్లలా పెరిగిన సుభద్ర తానొక వలస కార్మిక కుటుంబపు పిల్లను అనుకుంటుంది. దీపాలి తండ్రి సూర్యకాంత్. ఒడిశా నుండి ఎప్పుడో వచ్చి మిల్లు పనిలో చేరాడు.. ఆమె తల్లి చిన్నప్పుడే కాలం చేసింది. సూర్యకాంత్ అనారోగ్యంతో చనిపోతే సేట్లు ఎలాంటి పరిహారం ఇచ్చేందుకు ముందు ఒప్పుకోలేదు. మిల్లులో కాక ఇంట్లో చచ్చిపోతే పైసా ఇయ్యమని అన్నారు. సమ్మె నోటీసు ఇచ్చినంక వాళ్లు దిగి రాక తప్పలేదు.. అప్పుడు యూనియన్ లీడర్ గా ఉన్న రాజేశంకు దీప పరిచయమైంది. ఆమె ముఖంలో సూర్యకాంతే దీనంగా కనబడ్డాడు. ఒంటరిగా ఎలా బతుకుతుందని ఇంటికి తెచ్చుకొని ఇల్లాల్ని చేసుకున్నాడు.

రాజేశంకు తాను ఊర్లో విన్న ఆనాటి చివరి తెలుగు మాటలు ఇంకా గుర్తున్నాయి.

'పోరండ్ల రాజేశం ఇల్లెక్కడ?' ఒక గొంతు మెల్లగా అడుగుతోంది.

అప్పుడు రాత్రి ఒంటిగంట దాటింది. ఆ మాటకు అరుగు మీదనే పడుకున్న రాజేశంకు తెలివైంది. బేల్ కట్ పట్టీల పొక్కల్లోంచి బయటికి చూసిండు. బయట మంచంల పడుకున్న లచ్చన్నను లేపి అడుగుతున్నారు.

'కాలేజీల చదువుకుంటాడు..' అని ఇంకో ఆయన ప్రశ్న.

వెంటనే రాజేశం లేచి డ్రెస్ సంకలపెట్టుకొని ఇంటెనుక తలుపు తీసుకోని బయటకొచ్చి పక్కింటి పరారీ గోడ దుంకి చింతకింది మూలకు చీకట్లు ఉన్న పాయిఖానాల దాక్కున్నాడు. పెరట్ల లైట్ వెలిగింది. తెరిచిన చిన్న తలుపులోంచి ఇద్దరు సివిల్ డ్రెస్ లో ఉన్న కానిస్టేబుళ్లు బయటికి వచ్చినారు. అటు ఇటు వెదికి కోపంగా బూతులు తిడుతూ వెళ్లిపోయారు. కొద్దిసేపు ఆగి చీకట్లనే ఊరు దాటిండు. తల్లిని కలవాలని ఉన్నా ఏ ప్రమాదం పొంచి ఉందోనని భయపడ్డాడు.

బిఎ చదువుతున్న రాజేశం ఇట్లా ప్రాణభయంతో ఊరు దాటడానికి

కారణమేమిటంటే ఆ రోజు ఓ కాలేజీ స్టూడెంట్ హత్య జరిగింది. కాలేజీలో రెండు యూనియన్లు ఉండేవి . రెండింటి మధ్య ఎప్పుడు కోట్లాటలే. పొద్దున్నే రూములో వ్యాయాయం చేస్తున్న విద్యార్థిని కొట్టడానికి వెళితే అది ఆయన చావు దాక వెళ్ళింది. రాజేశం దాడి చేసిన వారి పక్షం. తాను రూములోకి వెళ్ళలేదు కానీ బయట సైకిల్ మీద ఉన్నాడు. కొట్టి బయటకు రాంగానే ఒకణ్ణి సైకిలుపై ఎక్కుంచుక పోయిండు. అంటే దాడి చేసిన వారిలో ఒకడు అన్నట్లే.

అదే రోజు ఒంటి గంటకు కాలేజీ గేట్ దగ్గరికి పోలీసులు వచ్చినారు. బయటికెళుతున్న స్టూడెంట్స్ నుంచి ఇద్దరిని పట్టుకొని అందరి ముందే బట్టలూడదీసి కట్ డ్రాయర్ మీదుంచి కొట్టుకుంటూ, తన్నుకుంటూ పట్టుకు పోయారు. వారి వెనుకే రాజేశం ఉన్నాడు. పోలీసులు తనను చూసి కూడా వదిలేసేసరికి ఊపిరి పీల్చుకున్నాడు. అయితే ఊహించని రీతిలో పోలీసులు అర్ధ రాత్రి ఇంటికి రావడంతో కథ మారిపోయింది.

అయితే రాజేశంకు తెలియని అసలు సంగతి మరోటుంది. ఆ రోజు ముందటి రాత్రి హసన్ పర్తిలో నక్సలైట్లు ఓ భూస్వామిని చంపేశారు. వచ్చిన దళంలో ఒకరు 'రాజేశం..కానియ్' అన్నారని, అ వెంటనే తుపాకీ పేల్చిన చప్పుడచ్చిందని విన్నవారు పోలీసులకు చెప్పారు. ఆ మాట ఈ రాజేశం మెడకు చుట్టుకుంది. దానికి కూడా ఒక బలమైన నేపథ్యముంది.

అదేమిటంటే– రాజేశంకు పాటలంటే మహా ఇష్టం. మంచిగా పాడుతాడు కూడా. ఆ పాటలు విన్న తెలుగు లెక్చరర్ ఓ రోజు ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ మరో పది మంది స్టూడెంట్స్ ఉన్నారు.

లెక్చరర్ మాట్లాడుతూ 'ఈ వేసవి సెలవుల్లో మీరంతా గ్రామాలకు తరలండి ప్రోగ్రాం లో పాల్గొనాలి. ఊర్లలో వెట్టి చాకిరీ, తక్కువ కూలీరేట్లు కొనసాగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా పోరాడేందుకు గ్రామాల్లో సంఘాలు ఏర్పడాలి. గ్రామస్తులకు ఈ విషయాలన్నీ వివరించేందుకు ఊర్లలో అక్కడక్కడా మీరు మీటింగులు పెట్టాలి.. మీరు హసన్ పర్తి  వెళ్ళాలి. అదే ఊర్లో దళితవాడల్లో తింటూ పడుకోవాలి. మన రాజేశం మంచి పాటగాడు.. ఊర్లలో పాడే పాటల పుస్తం ఆయనకు ఇస్తా.. ప్రాక్టీస్ చేస్తాడు. స్పీచ్ లు ఇచ్చేవాళ్లకు నేను ట్రైనింగ్ ఇస్తాను. సరేనా..' అన్నాడు

అసలు టైముకు సగం మంది జారుకున్నారు. మిగిలిన అయిదుగురు చిన్న సంచుల్లో బట్టలు సర్దుకొని హసన్ పర్తికి వెళ్లారు. వారిలో రాజేశం ఒకడు. పోయిన రోజే హోటల్ దగ్గర చాయ్ తాగుతూ అక్కడున్నవారితో తాము వచ్చిన పని గురించి చెప్పారు. కొందరు ఆసక్తిగా విన్నారు, కొందరు సరే బాగుందన్నారు. వచ్చిన పని తొందరగానే లైన్లో పడిందని వారిలో హుషారు పెరిగింది. రాజేశం ఆగలేక ఒక పాటెత్తుకున్నాడు. మరింత మంది గుమికూడారు. పొద్దు గుంకినంక మా వాడల మీటింగ్ పెట్టుండ్రని కొందరు

ముందుకొచ్చారు. ఇదంతా జరిగిన గంటకే వీరికోసమే అన్నట్లు పోలీసు జీపు వచ్చి ఎదురుగా, అడ్డంగా ఆగింది. దాన్ని చూడగానే  భయపడిపోయి తలో దారి పరుగు తీశారు. పోలీసులు వెంటపడి ముగ్గురిని పట్టుకున్నారు. చిక్కినవారిలో రాజేశం ఒకడు. వీరి సంచుల్లో ఉన్న పుస్తకాలను చూసి స్టేషన్ కు తీసుకొనిపోయారు. రెండు రోజులు పగలు రాత్రి లాకప్ లో పోలీస్ మర్యాదలు. అయినా లెక్చరర్ పంపాడని చెప్పలేదు. మరునాడు ఓ అడ్వొకేట్ వచ్చి వారిని విడిపించుకు వెళ్ళాడు. పోలీసులు ఈ ముగ్గురి వివరాలు, ఫోటోలు, వేలు ముద్రలు తీసుకున్నారు. ఇది జరిగిన మూన్నెల్లకు హసన్ పర్తిలో భూస్వామి హత్య జరిగింది. రాజేశంకు దీనితో సంబంధం ఉందని నమ్మిన పోలీసులు ఆ రాత్రి ఇంటికి వచ్చారు. ఇలా పారిపోవడంతో  రాజేశంపై హత్య కేసు నమోదు చేసి నక్సలైటుగా ముద్ర వేసి  పరారీలో ఉన్నట్లు రికార్డు చేసుకున్నారు.

***

ఇక్కడ మాత్రం అది తన గతమే కానట్లు వలసకూలీగా రాజేశం బతుకు బండి సాగుతోంది. పెరుగుతున్న కూతురును చూస్తుంటే రాజేశంకు ఎప్పటినుంచో 'నీకో బావ ఉన్నడే..' అని చెప్పాలనిపిస్తుంది. బిడ్డను తన అల్లుడికిచ్చి పెళ్లి చేయాలనీ ప్రాణం కొట్టుకొంటోంది. కూతురు పుట్టకపోతే ఈ బంధాలే గుర్తుకు వచ్చేవి కాదేమో.. అక్క ఎలా ఉందో.. అల్లుడు ఎంతవాడయ్యాడో.. ఏం చేస్తున్నాడో.. అని మనసు ఇప్పుడు ఎత్తైన కొండ దాటి ఆ వైపు చూడాలని ఆశపడుతోంది. ఏదో కావాలని మనసు బలంగా కోరుకున్నప్పుడు అది ఒకవైపే ఆలోచిస్తుందనడానికి రాజేశం వేసిన అడుగే రుజువు. ఇన్నాళ్లకు ఆయన తన అక్కకు ఉత్తరం రాయాలనుకున్నాడు.

ఓ రోజు రాత్రి షిఫ్టు నుండి వస్తూ పోస్టాఫీసుకు పోయి అక్క పేరిట ఉత్తరం రాసి డబ్బాలో వేసి వచ్చాడు. ఈ విషయం ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. తాను మాత్రం ఫలితాల కోసం చూసే విద్యార్థిలా జవాబు కోసం ఎదురుచూస్తున్నాడు. వారం గడిచింది.

రాత్రి ఎనిమిదింటికి డ్యూటీ చేసి వచ్చిన రాజేశం స్నానం చేసి అన్నం గిన్నె కోసం ఎదిరిచూస్తూ వాకిట్లో మంచం మీద కూచున్నాడు. మెల్లగా నడుచుకుంటూ వచ్చిన నలుగురు ఆయన ముందుకొచ్చి నిలబడ్డారు. 'నీ పేరేంది?' అని ఒకాయన అడిగాడు. ఏమాలోచించకుండా 'రాజేశం' అన్నాడు. వెంటనే నలుగురు ఆయన్ని అదిమి పట్టుకొని బయటకు తీసికెళ్లారు. 'మీరెవలు, నన్నెటు తీస్కపోతుండ్రు..' అన్నా జవాబు ఈయకుండా బయట సిద్ధంగా ఉన్న కార్లో వేసుకొన్నారు. ఆ చప్పుడు విన్న దీప పళ్లెం చేత్తో పట్టుకొని పరుగున రాగానే కదిలిపోతున్న కారు ఆమెకు కనబడింది. వెంటనే లోపలి గదిలో చదువుకుంటున్న బిడ్డకు ఈ  విషయం చెప్పింది. ఇద్దరు కలిసి పోలీస్ స్టేషన్ కు పరుగుతీశారు.

ఇన్స్ పెక్టర్ తో సుభద్ర 'మారా పితనే కోయి లెయి గయు' అంది.

‘ తెలంగాణ పోలీస్ తేనే లెయ్ గయి’ అని చెప్పాడాయన.

‘సా మాటే..’ అని తీసుకుపోవడానికి కారణమడిగింది.

‘ఆమ్నే ఖబర న థీ..’ అని తెలియదన్నాడాయన.

అసలు ఈ తెలంగాణ ఏమిటి.. అక్కడి పోలీసులు ఇతన్ని తీసుకుపోవడమేమిటి.. ఏదీ తల్లీ కూతుళ్ళకు అర్థం కాలేదు. అదే రాత్రి యూనియన్ లీడర్ దగ్గరికి వెళ్లారు. తాను ఎమ్మెల్యేతో లేబర్ మినిష్టర్ ని కలిసి రాజేష్ భాయ్ ఎక్కడున్నా ఇంటికి రప్పిస్తానని ఆయన భరోసా మాట చెప్పాడు. అంతకు మించి ఏమిచేయలేని వీరు ఇంటికి తిరిగి వచ్చారు.

రాజేశం అక్కకు రాసిన ఉత్తరం శంభునిపేట పోస్టాఫీసు నుండి సుగుణ చేతికి రాకుండా సరాసరి పోలీస్ స్టేషన్ కు చేరింది. నక్సలైట్ల కట్టడి, ఆచూకీ  కోసం పోలీసు నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్న యుద్ధతంత్రంలో భాగంగా ఆ ఉత్తరం యొక్క గమ్యం మారింది.

హసన్ పర్తి భూస్వామి హత్యతో పాటు పలు తీవ్రవాద సంఘటనలతో సంబంధమున్న దళసభ్యుడు రాజేశం ఇన్నాళ్లకు పోలీసులకు చిక్కాడని ఫొటోతో సహా పత్రికల్లో వార్త వచ్చింది. పొద్దున్నే పత్రికలో రాజేశం ఫోటో, వార్త చూడగానే ప్రకాష్ ‘అయ్యో.. ఇట్లయిందేమి..’ అనుకున్నాడు. ప్రకాష్ జనవాణి పత్రికలో సీనియర్ జర్నలిస్టు. చదువుకునే రోజుల్లో విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న, విలేకరిగా నక్సల్స్ వార్తలు, కథనాలు వ్రాసిన అనుభవం ఆయనది. తనకు తెలిసిన వాస్తవాన్ని చెప్పేందుకు వెంటనే పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు.

సర్కిల్ ఇన్స్ పెక్టర్ తో ‘ సార్.. ఇది నక్సలైట్ రాజేశం ఫోటో కాదు. ఈయనెవరో అమాయకుడు.’ అన్నాడు.

‘లేదయ్యా బాబు.. ఈయన మా రికార్డుల్లో తప్పించుకు తిరుగుతున్న నక్సలైట్ గా ఎప్పుడో రాసుంది. నేను కొత్తగా ఎక్కించింది కాదు.’ అని సర్కిల్ ఆయన మాట నమ్మలేదు.

‘అసలు రాజేశం కాలేజీలో నా క్లాస్ మేట్. నాకు బాగా తెలుసు. ఆయన ఊరు కేశవపట్నం. ఇప్పటికి ఆయన అన్నదమ్ములు ఆ ఊర్లోనే ఉన్నారు” అని చెప్పాడు.

‘సరే..చూద్దాం’ అంటూ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఏదో పని ఉందంటూ వెళ్ళిపోయాడు.

ప్రకాష్ సరాసరి మోటార్ సైకిల్ పై కేశవపట్నం వెళ్ళాడు. రాజేశం తమ్ముడు సుధాకర్ కు విషయం చెప్పి, ఒప్పించి ఆయన ఆధార్, ఓటర్ కార్డులు తీసుకోని తన వెంట పోలీస్ స్టేషనుకు తీసుకొచ్చాడు.

‘ సార్.. ఈయన కేశవపట్నం రాజేశం సొంత తమ్ముడు సుధాకర్ .. మీరు సూరత్ నుంచి తెచ్చిన రాజేశంను ఈయనకు చూయిస్తే అతడు తన అన్న అవునా కాదా

చెప్పేస్తాడు' అన్నాడు కొంత ప్రాధేయపూర్వకంగా.

సర్కిల్ సాబ్ కొంత మెత్తబడి సుధాకర్ వెంట తెచ్చిన రుజువులను పరిశీలించాడు.

తండ్రి పేరు, ఊరు వివరాలు, రాజేశం చదువుకున్న స్కూళ్ళు, దగ్గరి దోస్తులు, బంధువుల వివరాలు నోటు చేసుకున్నారు. చాల జాగ్రత్తగా వ్యవహరించకపోతే నేరగాడు జారిపోవడమే కాకుండా తనకు పెద్ద రిమార్కు వస్తుందని ఆయన మనసులో ఉంది.

'కొద్దిసేపు మీరు బయట ఉండండి..నేను డిఎస్పీ సార్ తో మాట్లాడి చూస్తాను' అన్నాడు నిదానంగా.

అరగంట తర్వాత ఓ కానిస్టేబుల్ వచ్చి 'సార్ రమ్మంటున్నాడు' అంటూ ప్రకాష్ ను లోపలి తీసుకెళ్లాడు.

' కలిసేందుకు సార్ పర్మిషన్ ఇచ్చారు . ఇదేదో తెల్లగోలు అవడం అందరికి మంచిదే అన్నారు. మీరు నాలుగు గంటలకు రండి..వెళ్దాం ' అన్నాడు.

బయటికి వచ్చిన ప్రకాష్.. సుధాకర్ ను ఎటు పోనీయకుండా తన ఇంటికే తీసికెళ్ళాడు.

భోజనం చేసి ముచ్చట్లతో గడిపి ఇద్దరు మూడింటికే స్టేషన్ వైపు బయలుదేరారు.

ముగ్గురు కలిసి పోలీస్ కారులో జైలులో ఉన్న రాజేశం దగ్గరికి వెళ్లారు..

' రాజేశం.. మీ తమ్ముడు నిన్ను కలవడానికి వచ్చాడు. చూడు.. ఏమైనా మాట్లాడేది ఉంటే మాట్లాడు' అన్నాడు సర్కిల్ నిదానంగా.

ఆ మాట విన్న రాజేశం చేతులెత్తి మొక్కుతూ కన్నీళ్లతో ' సార్.. నేను ఒక్కణ్ణే..నాకు అన్నదమ్ములు లేరు. ఈయనెవలో నేనెన్నడూ చూడలేదు. సూరత్ నుంచి నన్నెందుకు తెచ్చిండ్రో నాకర్థమైతలేదు. మాది శంభునిపేట. ఊర్లె మా అక్క ఉంటది. సూరత్ ల భార్య బిడ్డ ఉంటారు. వాళ్ళెంత పరేషాన్ అయితున్నారో.. నేనిక్కడున్నట్లు చెప్పనైనా చెప్పండి.' అని బతిమాలుతున్నాడు.

'ఏదైనా ఫోన్ నెంబరుంటే నాకివ్వు ' అన్నాడు ప్రకాష్.

రాజేశం సర్కిల్ వైపు చూశాడు.

ఆయన ఫోను తన దగ్గరే ఉందని చెప్పి అడిగిన నెంబర్లు ప్రకాష్ కు ఇచ్చాడు.

' మరి నువ్వు తప్పించుకు ఎందుకు తిరుగుతున్నావయ్యా..' అన్నాడు ఇన్స్ పెక్టర్ రాజేశంతో.

చదువుకొనే రోజుల్లో విద్యార్థి హత్య, గ్రామాలకు తరలండి, తాను పారిపోయిన కారణాలు అన్నీ వివరంగా చెప్పాడు.

పోలీసులు రాజేశంను శంభునిపేటకు తీసుకెళ్లి సుగుణకు చూయించారు. ముందు ఆశ్చర్యపోయిన సుగుణ విషయం తెలుసుకొని 'మా తమ్ముడు అసుంటోడు కాదు' అంటూ పోలీసుల కాళ్లపై పడింది. దీనితో పోలీసులకు మరింత స్పష్టత వచ్చింది. రికార్డుల్లో

ఎక్కడో తప్పు జరిగిందని వారికీ అనిపించింది. పైనుంచి అనుమతి వచ్చేదాకా రోజూ పోలీస్ స్టేషన్ కు వచ్చే కండిషన్ తో రాజేశంను ప్రకాష్ కు అప్పగించారు. సుగుణ తమ్ముడి వెంటే ఉంది. మరుసటిరోజు సూరత్ నుంచి ప్రకాష్ వద్దకు వచ్చిన దీప, సుభద్రలు రాజేశం పట్టుకొని ఏడ్చి విషయమంతా తెలుసుకొని ప్రకాష్ చేసిన మేలుకు చేతులెత్తి దండం పెట్టారు. సుగుణ మరదలు, కోడల్ని దగ్గరికి తీసుకొంది.

'బావ, అల్లుడు ఇంకా రాలేదేంది.. ఎక్కడున్నారు..' అన్నాడు రాజేశం.

'ఇద్దరు షోలాపూర్ ల చద్దర్ల మిల్లుల పనిజేస్తున్నరు. బండి ఎక్కింద్రు..రాత్రికి దిగుతరు' అంది.

ఏమిటి అన్నట్లు తండ్రి ముఖం చూసింది సుభద్ర.

'ససరా, బనేవి ఆవ్తా' అన్నాడు రాజేశం.

ఆశ్చర్యంతో పాటు కొంత సిగ్గుపడిందామె.

'మొగడు.. మొగడు..' అన్నది సులోచన నవ్వుతూ.

***

బద్రి నర్సన్

**రచయితగా, కాలమిస్ట్‌గా చిరపరిచితులైన బద్రి నర్సన్ స్వస్థలం జగిత్యాల. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. డిగ్రీ వరకూ జగిత్యాలలోనే విద్యాభ్యాసం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ, ఎంఎడ్ చేశారు. పాఠశాల స్థాయినుంచే సాహిత్యాభిలాషను పెంచుకున్నారు. బాల్య స్నేహితులతో కలిసి 'సాహితీ మిత్ర దీప్తి' అనే సంస్థ ద్వారా కవితల పోటీలు నిర్వహించారు. ఎంపికైన రచనలను పుస్తకాల రూపంలోకి తెచ్చారు. ఓయూలో చదువుతున్న రోజుల్లోనే 'రంగుల కల', 'విముక్తి కోసం' సినిమాలకు రచన, దర్శకత్వ శాఖల్లో పనిచేశారు. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగంలో చేరారు. 2015లో విరమణ పొందారు. పదేండ్లుగా సమకాలీన అంశాలపై వివిధ పత్రికలకు విశ్లేషణాత్మక వ్యాసాలు రాస్తున్నారు. దివంగత కవి, చిత్రకారుడు అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని పుస్తకంగా తెచ్చారు. తన జీవితంలో అత్యంత సంతృప్తిని ఇచ్చిన అంశం ఇదేనని నర్సన్ చెప్తారు. సాహిత్యంపై మక్కువతో 30 వరకూ కథలు రాశారు.**

# వడ్లు



–రాయపాటి హైమావతి
ఫోన్ : **80081 69672**

"మనం బాన్స్‌వాడా తండాకి వెళుతున్నాం.." చెప్పింది కలెక్టర్ ఝాన్సీ రాథోడ్.

"ఓ.కే.. మేడమ్." అంది డీ.ఆర్.ఓ రాగిణి.ఎందుకని అడగలేదు.కలెక్టర్ ఝాన్సీకి సర్‌ప్రైజ్ విజిట్స్

చేయడం అలవాటు.ఉదయం ఎనిమిదింటికల్లా కలెక్టర్ బంగ్లాకి వచ్చింది రాగిణి.

ఇద్దరూ ఒకే కారులోనే బయలు దేరారు.కారు బయలుదేరే ముందు సి.సి.రాంబాబుకి ఫోన్ చేసింది రాగిణి

"మేడమ్ విజిట్ వుంది కదా ఏర్పాటు చేసారా?" అడిగింది.

"ఏం విజిట్ మేడమ్ ?" అడిగాడు అమాయకంగా రాంబాబు.

"అదేంటి పోగ్రామ్ తెలీదా? " అడిగింది స్వరం తగ్గించి.ఝాన్సీ రాగిణి మాట విని

"ఇది అఫిషియల్ విజిట్ కాదు కదా రాగిణీ.." అంది.

"సెక్యూరిటీ రీజన్స్ వున్నాయి కదా మేడమ్." అంది. "పర్వాలేదు..మనల్ని ఎవరూ టార్గెట్ చేయరులే.."

అని ఒక న్యూస్ పేపర్ రాగిణికి ఇచ్చింది.అది ముందు రోజు పేపర్.ఒక న్యూస్ ఐటమ్ మార్కింగ్ చేసి

వుంది. విషయం అర్ధమైంది రాగిణికి."ఇప్పుడు మనమేం చేయగలం మేడమ్." అడిగింది.

"ఊర్లో పరిస్థితి అంచనా వేద్దాం.ఇలాంటి మరణం మరొకటి జరగకుండా చూడాలి కదా.." అంది ఝాన్సీ.

డ్రైవర్ ముత్యాలును చూస్తూ "బాన్స్‌వాడా తండా తెలుసు కదా నీకు.." అడిగింది.

"ఊర్లోకి ఎంటరయ్యాక తెలుసుకుంటానమ్మా.." అన్నాడు.బాన్స్ వాడా కథనం రాగిణి ముందు మరోసారి కదిలింది.'బిడ్డను కోల్పోయిన తల్లి ఆత్మహత్య.' అది వార్తకు పెట్టిన హెడ్డింగ్. మరోసారి వార్త చదివింది.

"గంగూబాయి పాతికేళ్ల యువతి.మగ సంతానం కోసం మూడోసారి కూడా గర్భం దాల్చింది.మళ్లీ ఆడపిల్లేపుట్టింది.దాంతో ఆమె భర్త భీమ్లా నాయక్ యధావిధిగా పుట్టిన బిడ్డ గొంతులో వడ్లు వేసి చంపేశాడు.

బిడ్డను కోల్పోయిన గంగూ భాయి శోక భారంతో ఆత్మహత్య చేసుకుంది.గతంలో ఆమెకి పుట్టిన మరో

ఇద్దరు ఆడపిల్లలను కూడా భీమ్లా నాయక్ గొంతులో వడ్ల గింజలు వేసి చంపేసినట్టు గ్రామస్తుల కథనం.పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు భీమ్లా నాయక్‌ను జైలుకి తరలించారు."

"తనేమో ఆత్మహత్య చేసుకుంది.ఆమె భర్త జైలుకెళ్లాడు.ఎవర్ని కలవాలి మేడమ్?" అడిగింది రాగిణి.

"గంగూ బాయ్ తల్లి కూడా ఆడదేగా! బిడ్డను కోల్పోయిన బాధలో ఆమె కూడా వుంటుంది.మన పరామర్శ ఆమెకి కొంత స్వాంతన ఇస్తుంది కదా.?" అంది ఝాన్సీ.

"గంగూ బాయి తల్లిది కూడా అదే ఊరా మేడమ్.." అడిగింది రాగిణి.

"భీమ్లానాయక్ స్వయానా ఆమెకి తమ్ముడే.ఒకే ఊరు." అంది ఝాన్సీ రాథోడ్.

"ఇది చాలా దారుణం మేడమ్.ఆడపిల్లని బ్రతకనివ్వరా?" అంది.ఆమె స్వరం వణికింది.రాగిణి కళ్ళు

వర్షించడం గమనించింది. "కంట్రోల్ యువర్‌సెల్ఫ్ రాగిణీ." అంది ఝాన్సి.

కారు రోడ్డు మీద వున్న గుంటల్లో పడ్డంతో ఎత్తెత్తి కుదేస్తూ వెళుతుంది.

"ముత్యాలూ.. కాస్త నిదానంగా వెళ్లు" అంది రాగిణి.కలెక్టర్ ఝాన్సీ ఐదు నెలల గర్భిణి.

"నేను తిన్నగానే వెళుతున్నాను మేడమ్.రోడ్డు దారుణంగా వుంది.ఇటీవల వచ్చిన వర్షాలకు రోడ్డు

కొట్టుకు పోయింది " చెప్పాడు."ఈ రోడ్డు వేసి ఆరునెలలే కదా అయ్యింది." అంది ఝాన్సీ.

"కాంట్రాక్టర్ ఎమ్.ఎల్.ఏ మనిషి కదా..సగం లాక్కుని వుంటాడు." అంది రాగిణి.

"అఫ్‌కోర్స్.." అంది ఝాన్సీ. "వాడ్ని బ్లాక్ లిస్ట్‌లో పెడదాం మేడమ్.." అంది రాగిణి.

"ఎమ్.ఎల్.ఏ కి..సి.యం బ్లెస్సింగ్స్ వున్నాయ్.." అంది ఝాన్సీ.

"సి.యం ఇలాంటి కరెప్షన్స్ ఒప్పుకోడు మేడమ్."అంది.ఝాన్సీ నవ్వింది.ఆ నవ్వులో నిస్పృహ కన్పించింది.

"సి.యం గారి అబ్బాయి యం.పి కదా అతని నియోజక పరిధిలోనే ఈ అసెంబ్లీ వుంది.ఎం.ఎల్.ఏ ని

గట్టిగా మందలించలేని పరిస్థితి యం.పిది. పైగా ఈరోడ్డు యం.పి లాడ్స్‌లోంచే వేసింది." అంది ఝాన్సి.

"మీరు అనుమతిస్తే నేను ఒకసారి ఆ కాంట్రాక్టర్‌ని పిలిచి వాయిస్తాను మేడమ్.ఈ రోడ్డు మళ్లీ వాడి చేతే

వేయిస్తా." అంది."నీ స్పార్క్ నాకు నచ్చుతుంది రాగిణీ." అంది ఝాన్సి..

"మీలాంటి సిన్సియర్ కలెక్టర్ దగ్గర పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం మేడమ్." అంది రాగిణి.

"నిన్ను ఏరి కోరి వేయించుకున్నాను రాగిణీ..మంత్రిగారు జిల్లా అంతా ఆడాళ్ల రాజ్యం అయిపోయిందని

నవ్వుతూ అంటూ వుంటాడు.." అంది ఝాన్సీ."నిజమే మేడమ్..ఎస్.పి శాన్వీ కూడా మీకు లాగే  స్పిరిట్

వున్న అమ్మాయి.తను మన జిల్లా ఎస్.పి గా వుండడం కూడా విశేషం.." అంది.

"ఎస్..శాన్వీకి ఒకసారి ఫోన్ చెయ్..సూసైడ్ చేసుకున్న గంగూ భాయి ఫ్యామిలీ హిస్టరీ..ఊర్లో పరిస్థితి

వాట్సప్ చేయమను.." చెప్పింది."ఎస్..మేడమ్." అంది రాగిణి.శాన్వీకి ఫోన్ చేసింది రాగిణి.

"మనం వెళ్తున్నట్టు చెప్పొద్దు" అంది ఝాన్సీ.

"మీ మూమెంట్ శాన్వీకి తెలీకుండా వుండదు మేడమ్" అంది.నవ్వుతూ ముత్యాలు వైపు చూసింది ఝాన్సి.

"కారు కదిలిస్తే మీ మూమెంట్ ఇంటల్ జెన్స్ వాళ్లకి చెప్పాలి మేడమ్.మీ సెక్యూరిటీ వాళ్ల బాధ్యత కదా." అన్నాడు ముత్యాలు.

"ఊర్లో హడావిడి వద్దని చెప్పు.మీడియా హడావిడి కూడా వద్దు.." చెప్పింది రాగిణికి.

"మా రెవెన్యూ వాళ్లకి మెసేజ్ పెట్టాను మేడమ్. అందుబాటులో ఉండమని.బట్ మనం పిలిస్తే తప్పా

వాళ్లు రారు." చెప్పింది.రెండు గంటల జర్నీ తర్వాత బాన్స్ వాడ చేరుకుంది ఝాన్సీ బృందం.

అప్పటికే మఫ్టీలో ఇద్దరు ముగ్గురు కానిస్టేబుళ్లు గ్రామంలోకి ప్రవేశించి వున్నారు.

గ్రామంలోకి అడుగుపెట్టాక "గంగూ బాయి మదర్ ఇళ్ళు ఎక్కడ వుందో కనుక్కో." చెప్పింది ముత్యాలునుచూస్తూ ఝాన్సీ. కారు ఆగంగానే ముత్యాలు దగ్గరకు ఒక మఫ్టీలో వుండే ఐ.డి కానిస్టేబుల్ వచ్చాడు.

ముత్యాలు ఏదో చెప్పడంతో "టు మినిట్స్ సమయం ఇవ్వండి." అని వెళ్లి సమాచారం సేకరించి తన బైక్ ముందుకు ఉరికించాడు.అప్పటికే కొందరు ఇళ్లలో నుండి బయటకు వచ్చి చూస్తున్నారు.ఊర్లో కొచ్చిన

కారు ఎవరిదా?! అని కళ్లు చిట్లించి చూస్తున్నారు.ఊర్లో శ్మశాన వాతావరణం కన్పిస్తుంది. కారు నెమ్మదిగాగంగూ బాయి తల్లి ఇంటిముందు కొచ్చి ఆగింది.గంగూ బాయి తల్లి కమిలిని ఒక కుక్కి మంచం మీద

పడుకొని వుంది.కలెక్టర్..డి.ఆర్.ఓ లను చూసి లేచింది."కలెక్టర్ గారు.." చెప్పింది రాగిణి.

వడలిపోయిన చేతులతో నమస్కారం చేసింది కమిలిని. ఏడ్చి..ఏడ్చి సొమ్మసిల్లిన చారికలు ఆమె మొఖం

మీద స్పష్టంగా కన్పిస్తున్నాయి."దరిద్రుడు నా బిడ్డను చంపేశాడు.." అంది ఏడుస్తూ. ఆమె చేతిని

ఓదార్పుగా పట్టుకుంది ఝాన్సి."అందుకే కదా జైలుకి వెళ్లాడు.ఇక వాడికి చిప్పకూడే.." అంది రాగిణి.

"భగవంతుడు ఎవర్నిస్తే వాళ్లని తీసుకోవాలి కానీ మగపిల్లాడికోసం వెంపర్లాడడం ఏంటమ్మా..? ఇద్దరు

బిడ్డలను పోగొట్టుకొని మూడో బిడ్డను కూడా కాపాడు కోలేని దౌర్భాగ్యానికి కుమిలి

పోయి ప్రాణాలు

తీసుకుంది నా బిడ్డ." అంది కమిలిని.దాదాపు అరవై ఏళ్ల వృద్ధుడు కారుని చూసి లోపలికి వచ్చాడు.

"గంగూ నాయన.." చెప్పింది కమిలిని.

"కలెక్టర్ మేడమ్ మిమ్మల్ని పరామర్శించడానికి వచ్చారు.." చెప్పింది రాగిణి.

బలహీనమైన చేతుల్తో నమస్కారం పెట్టాడు సోనూనాయక్.

"తోడ పుట్టిన వోడని బిడ్డని కళ్ళలో పెట్టుకొని చూసుకొంటాడని నా ఇంటి ఆడది ఆశ పడింది.వాడు పశువయ్యాడు.భార్యని చంపుకున్నాడు.కనుపాపలని చిదిమేశాడు" అంటూ వెక్కి..వెక్కి ఏడ్చాడు సోనూ నాయక్.

కాసేపు ఝాన్సీ ఏమీ మాట్లాడలేదు.

"మీకు కలిగిన దు:ఖాన్ని మేము పూడ్చలేం పెద్దయ్యా.ఇది ఉంచండి" అని పదివేల రూపాయల్ని ఒక

కవర్లో పెట్టి ఇచ్చింది."ఈ పైసలు ఏం చేసుకుంటాం కలెక్టరమ్మా.బెయిల్ మీద ఆ దుర్మార్గుడు మళ్లీ

వస్తాడట.ఆడు ఇంక అసలు ఈ ఊర్లో తిరగకూడదు.ఉరి వేయించండి వాడ్ని" అన్నాడు

సోనూ నాయక్ రొప్పుతూ. "చట్టం తన పని తాను చేసుకు పోతుంటుంది పెద్దయ్యా.." అంది రాగిణి

"చట్టం చట్టు బండలు కాకుండా కాపాడండి తల్లీ.ఈ గర్భ శోకం మరెవరికీ కలగకూడదు." అంది

కమిలిని. తిరుగు ప్రయాణ మయ్యారు ఇద్దరూ.

"ఎన్ని మరణాలు ఆపగలం రాగిణీ." అంది నిర్వేదంగా ఝాన్సీ.

"ప్రపంచాన్ని చూడకముందే ఈ లోకం నుండి ఆ పసిగుడ్డుల్ని పంపేయడం దారుణం మేడమ్" అంది

రాగిణి. "ఈ సమస్యకి పరిష్కారం లేదా అమ్మా." అన్నాడు ముత్యాలు డ్రైవ్ చేస్తూనే.

"మనిషి మనస్తత్వం లోనే మార్పు రావాలి ముత్యాలూ..ఏ బిడ్డ అయితేనేం..?" అంది రాగిణి.

"వీడు పుట్టడానికి ఒక ఆడది కావాలి.వీడు సెక్స్ వాంఛ తీర్చుకోవడం కోసం ఒక ఆడది కావాలి.వాడి

కడుపున మాత్రం ఆడపిల్ల పుట్టకూడదు.ఇదెక్కడి ఘోరం." అంది ఝాన్సీ కోపంగా

తనలో తానే

గొణుక్కుంటూ.శాన్వి సమాచారం పంపింది.తిరిగి ఏదో మెసేజ్ టైపు చేసి పంపింది.కాసేపటి తర్వాత

దాన్ని డిలీట్ చేసింది.వాళ్ల కారు నిజామాబాద్ చేరుకొనే లోపు ఎస్.పి శాన్వీ ఫోన్ చేసింది.

"అతడి బెయిలు కేసు వాదించడానికి ఎవరూ ముందుకు రావడం లేదట మేడమ్.." అంది శాన్వీ

కలెక్టర్ పెట్టిన మెసేజ్‌కి జవాబుగా ఝాన్సీ ఆలోచిస్తూ.

"వాడు బయటకు రావాలి శాన్వీ..హుక్ అండ్ క్రుక్.." అంది.

ఒక నిమిషం ఆలోచించి .."ఎస్.. మేడమ్.." అంది శాన్వీ..

***

తన బెయిలు కోసం ఎవరు ప్రయత్నించారో అర్ధం కాలేదు భీమ్లా నాయక్‌కి.భీమ్లా ఊర్లో కొచ్చాడని

తెలిసి అందరూ తలుపులు వేసుకున్నారు.అతడ్ని ఇంట్లోకి రానివ్వ కూడదని అందరూ తీర్మానించుకున్నారు. "నా బిడ్డను పొట్టన పెట్టుకున్న వాడ్ని చంపేస్తా.." అన్నాడు సోనూ నాయక్.

"వాడి చేసిన పాపమే వాడ్ని అంతం చేస్తుంది." అంది అతని భార్య కమిలిని

"తమ్ముడు అని కనికరం చూపిస్తావేమో వాడ్ని బ్రతకనివ్వకూడదు.." అన్నాడు సోనూ నాయక్.

"అట్టాంటోడు భూమికి భారమేనయ్యా..వాడు నా తమ్ముడు అయితే నేం " అంది కమిలిని.

అతడ్ని ఎలా మట్టుబెట్టాలా అని చూస్తున్నాడు సోనూ నాయక్..

***

కట్టెల పొయ్యిలో అన్నం వండుకొని అందులో గంజి పోసుకొని తిన్నాడు భీమ్లా నాయక్.

కూరలు ఎలా చేయాలో అతడికి తెలియదు.నాలుగు రోజులు గడిచాయి.

ఉన్న కాసిన్ని బియ్యం అయిపోయాయి.జేబులో రూపాయి డబ్బులు లేవు.ఎవరూ ఇంటి దర్వాజా తెరవడంలేదు.బావ సోనూ నాయక్ తన విషయంలో కారాలు మిరియాలు నూరుతున్నాడని అర్ధమైంది.

తెగించి ఒకరోజు వెళితే "అరే దగుల్బాజీ మీ బావ నిన్ను చంపేస్తాడు వెళ్లిపో.."అంది

కమిలిని.

కాళ్లీడ్చుకుంటూ ఇంటికొచ్చి పడ్డాడు.అప్పు కూడా పుట్టే మార్గం కన్పించడం లేదు.

కడుపులో పేగులు నక..నక లాడుతున్నాయ్.తన భార్య గంగూబాయి గుర్తొచ్చింది.ఎక్కడ్నించి

తెస్తుందో తెలీదు వండిన కూర వండకుండా పెట్టేది.రోజు మార్చి రోజు నాటుకోడి తెచ్చి వండిపెట్టేది.

తనకిష్టమని వంకాయ,ఎండుచేప వేసి వండి పెట్టేది.గోంగూరలో మెత్తాళ్ళు వేసి వండేది.విప్పసారా తాగి

నాటుకోడి నంజుకొంటే తనకి స్వర్గం కన్పించేది.ఇద్దరు బిడ్డల్ని భర్త పొట్టన పెట్టుకున్నా మళ్లీ నీళ్లు

పోసుకుంది గంగూభాయి "ఈసారి ఎవరు భూమిమీద కొచ్చినా.. ఉసురు తియ్యకయ్యా." అంది ఒక రోజు

"సర్లేవే." అన్నాడే కానీ.భీమ్లానాయక్ మనసులో ఆలోచనలు మారలేదు.

"ఆడపిల్లో పుడితే దానికి ఎవరు కాపలా కాస్తాడు.? మగపిల్లాడయితే నాలా జల్సాగా బ్రతికేయచ్చు"

అనేవాడు.గంగూ భాయి భయం భయంగా చూసేది."పుట్టించే వాడ్ని నే వున్నా కదే భయమెందుకు?"

అనేవాడు అదేదో గొప్పగా."పుట్టి లోకం కూడా చూడకుండా నువ్వు సాగనంపుతున్న నా బిడ్డల ఉసురు

నీకు తగులుతుందయ్యా.." అనేది."అదంతా నీ గుబులు లేవే.పుట్టించేది నేనే కదా.వద్దనుకొనే హక్కు

కూడా నాకే వుంటుంది.అయినా నాలుగు రోజులు చాకాక చంపలేం గానీ పుట్టిన సందిట్లో చంపితే

నష్టమేముంది.?మగపిల్లాడు పుట్టేవరకూ నీకు ఈ కష్టాలు తప్పవు కాస్త ఓర్చుకో.." అనేవాడు.

గంగూబాయి కన్నీరు మున్నీరై రాత్రంతా ఏడుస్తా కూర్చొనేది.

"ఈసారన్నా నా కడుపులో ఒక మగ నలుసు పుట్టేలా చూడు సామీ.." అని గుడులూ,గోపురాలు తిరిగేది.

గంగూభాయి కన్నీళ్లు సముద్రంగా మారి ఆ ఉప్పెనలో కొట్టుకు పోయినట్టు కలలొచ్చాయ్ భీమ్లానాయక్కి.

ఒకరాత్రి ఎవరో తట్టినట్టు అన్పిస్తే దిగ్గున లేచాడు. “ఎవరు..?” అడిగాడు.

“నా తోరా..?” పిలిచాడు ఒక అగంతుకుడు. “ఎవరు నువ్వు?” మళ్ళీ అడిగాడు భయంగా..

“ముందు బయటకు రా.” చెప్పాడతడు.భయపడుతూనే నీరసంగా తూలుతూ బయటకు వచ్చాడు.

అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు వున్నారు.“ఎవరు మీరు?..” అడిగాడు.వాళ్ళేమీ చెప్పలేదు.

“ఎవరో తెలిస్తే చస్తావ్..” అన్నారిద్దరూ.వణికి పోయాడు భీమ్లా నాయక్.

“ఎందుకొచ్చారు?” అడిగాడు. “రా చెబుతాం..” అన్నారిద్దరూ.“ఎక్కడికీ..” అని అడిగాడు.

వాళ్లిద్దరూ  భీమ్లానాయక్ మెడపట్టి ముందుకు నెట్టారు.“ఎక్కడికి తీసుకెళుతున్నారు.?” మళ్ళీ అడిగాడు.

“తెలీదు.నడువ్..” అన్నాడు ఒక వ్యక్తి.“నేను అరుస్తా.అరిస్తే...ఊర్లో జనాలు బయటకు వస్తారు.” అన్నాడు

“నిన్ను చంపినా ఎవరూ బయటకు రారు.మూసుకొని మాతో రా ” అన్నాడు ఒక వ్యక్తి.

కాస్త దూరంగా పెట్టి ఉంచిన జీపు లోకి ఎక్కించారు భీమ్లానాయక్‌ని. జీపు కదిలింది.

“ఎక్కడికి తీసుకెళుతున్నారు?” కలవరంగా అడిగాడు.“తెలీదు.” అన్నాడొక వ్యక్తి.

కాసేపు ప్రయాణం చేసిన తర్వాత పొలాల సమీపం లోని ఒక నిర్జన ప్రదేశంలో జీబు ఆగింది.

అప్పటికే అక్కడికి వచ్చి ఆగివున్న కార్లోంచి ఇద్దరు ఆడవాళ్లు దిగారు.

వాళ్లనెప్పుడూ తను చూసినట్టు గుర్తు లేదు.ఒక శాల్తీ దగ్గరకొచ్చింది.

“ఎవరు మీరు?” అడిగాడు భీమ్లా నాయక్ భయ భయంగా.అందులో ఒకామె ముందుకొస్తూ..

“మే మెవరో చెప్పేముందు నీకో కథ చెప్పాలి..” అంది.“ఏంటి మీరు చెప్పే కథ?” అడిగాడు.

“అది కూడా వడ్లు కథే...” అంది ఆమె.వెనక్కి విరిచి కట్టిన చేతుల్తో ఉన్న అతడ్ని ముందుకు నెడుతూ

కల్లాల్లో కుప్పగా పోసిన వడ్లు దగ్గరకు తీసుకొచ్చింది. “ఇవి నువ్వు తింటావా ?” అడిగింది.

"వడ్లు ఎలా తింటారు?" అడిగాడు. "తిని చూడు.ఎలా వుంటాయో తెలుస్తుంది." అంది.

"మీకేమయినా పిచ్చా.." అన్నాడు అరుస్తూ.వెనుక నుండి మరో శాల్తీ ముందుకు వచ్చి

"పసివాళ్ల గొంతులో వడ్లగింజ వేయడం మాత్రం పిచ్చితనం కాదా?" అంది.

"మీరేవరో నాకు అర్థమయింది.మీరు పోలీసులు కదూ.." అన్నాడు.

"మే మెవరో నీకు చెబితే వచ్చే లాభం ఏమీ లేదు.కానీ ఒక కధ చెబుతాను విను.." అంది మొదటి శాల్తీ

మళ్లీ."ఏంటా కధ.." అడిగాడు భయ భయంగా."అనగనగా ఒక ఊరు..ఆ ఊరిలో నీలాంటి ఒక తండ్రి.  నీకు లాగే ఆడపిల్ల సంతానం వద్దు అనుకున్నాడు.పుట్టిన బిడ్డను అచ్చు నీలాగే వడ్ల గింజను వేసి

చంపాలనుకున్నాడు.ఆ బిడ్డ తల్లి తల్లడిల్లి పోయింది.బట్ నీ అమాయకపు భార్యలా తనను తాను దహించుకోలేదు.ఫుల్‌గా తాగి ఒళ్లు తెలీక పడున్న వాడ్ని లాంతర్‌లోని చమురుని వంచి గుడెసె తగల బెట్టి బిడ్డను తీసుకొని రాత్రికి రాత్రే ఊరు వదిలి పరుగులు తీసింది.బిడ్డను పొదివి పట్టుకొని కాలువలూ,గట్లూ ముళ్ల

పొదలు దాటుకొని ఒక ఊరిలో కొచ్చి పడిపోయింది.సొమ్మసిల్లి పడిపోయిన ఆ తల్లిని, గుక్క పెట్టి ఏడ్చి

ఏడ్చి కొనఊపిరి తో ఉన్న ఆ బిడ్డను ఆ ఊరు అక్కున చేర్చుకుంది.స్పృహలోకొచ్చిన ఆ తల్లి బిడ్డను తనివి తీరా కౌగిలించుకొని ఏడ్చేసింది.అమ్మ స్పర్శతో ఆ బిడ్డలో మళ్లీ ఊపిరాడ్డం మొదలై గుక్కపెట్టి ఏడ్వడం

మొదలు పెట్టింది.స్తన్యం ఇచ్చి "చంపేశానమ్మా.. నిన్ను చంపాలనుకున్న ఆ దుర్మార్గుడ్ని మీ నాన్నను

నిప్పు పెట్టి చంపేశాను.."అని పిచ్చిదానిలా అరిచి ఏడ్చింది.ఊరి జనాలకు విషయం అర్థమైంది.

ఊరు ఆదరువుగా నిలిచింది.తనని కాపాడ్డానికి అమ్మ ప్రాణాలు అడ్డుగా వేసిందని ఆ పసిదానికి

కాలక్రమంలో అర్ధం అయింది.జీవితం విలువ తెలిసింది.చదువే లోకంగా బ్రతికింది.అమ్మ ఆశే ప్రపంచంగా మిగిలింది.ఊరు మొత్తం హారతులు పట్టేలా ఐ.ఏ.ఎస్ సాధించింది.ఊరి చరిత్రలో ఎవరూ సాధించలేనివిజయం సాధించింది." అంటూ ఆగింది.అక్కడున్న సిబ్బంది ఉత్కంఠ తో వింటున్నారు.

ఒక నిమిషం ఊపిరి పీల్చుకొని..“ ఆ ఐ.ఏ.ఎస్ నేనే ” అంది.ఆమె కళ్ల వెంట నీళు ౢ ప్రవాహమవుతున్నాయ్

“ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్ మేడమ్..” అంది మరో శాల్తీ.

“ఎలా కంట్రోల్ చేసుకోవాలి శాన్వీ.ఆరోజు అమ్మ నన్ను కాపాడకపోతే ఏమయ్యేదాన్ని.ఉన్నతమైన ఈ

స్థాయికి ఎదిగే దాన్నా.?ఈ ప్రపంచాన్ని చూసే దాన్నా.?ఈ దుర్మార్గుడు పొట్టన పెట్టుకున్న ముగ్గురు

బిడ్డలు నాలా ఏ ఐ.ఏ.ఎస్సో.. డాక్టరో...ఇంజనీర్ గానో మారి సమాజానికి సేవ చేసే వాళ్లు కదా..” అందిదు:ఖోద్వేగంతో. బీమ్లా నాయక్ ఆమెని గుర్తు పట్టాడు.“మీరు కలెక్టర్ ఝాన్సీ కదూ..” అన్నాడు.

“అవును రా బాడ్కోవ్” అని అతని మొఖం మీద బలంగా గుద్దింది ఝాన్సీ..

“భూమ్మీద కొచ్చిన వాళ్లందరూ కలెక్టర్లూ..డాక్టర్లు కాలేరు.అయినా నా బిడ్డను నేను చంపుకుంటే

మీ కభ్యంతరం ఏంటి?” అన్నాడు.ఐ.పి.ఎస్ శాన్వీ ముందుకొచ్చింది.

“చట్టానికి అభ్యంతరం వుంది.అందుకే నిన్ను అరెస్ట్ చేశాం.బట్ అదే చట్టం నీలాంటి నరరూప

హంతుకుడికి బెయిల్ కూడా ఇచ్చింది.నీది క్షణికావేశం అనీ,విచారణ చేసి శిక్షించమంది.అందుకే నిన్ను

ఇలా విచారిస్తున్నాం.” అంటూ వుంటే అడ్డు పడ్డాడు భీమ్లా నాయక్.

“అర్ధ రాత్రుళ్ళు ఊరి బయటకు తీసుకొచ్చి విచారణ చేయరు.మీరేదో దురుద్దేశంతో నన్ను తెచ్చారు.”

అన్నాడు.

“సదుద్దేశమే..నీకు వడ్లు రుచి చూపాలనుకుంటున్నాం.అందుకే నీబెయిల్‌కి లాయర్ ని కూడా పెట్టి భయటకుతెచ్చాం.తిను ఎలాగూ ఆకలితో వున్నావ్ గా తిను..” అని అతడి మెడపై పిస్తోలు పెట్టింది శాన్వీ.

“ఈ వడ్లు తినాలా..ఇవి తిని బ్రతకడమేనా?” అన్నాడు.

“బ్రతుకుతావో లేదో తింటేగదా తెలిసేది..” అంది ఝాన్సీ.అతడి చేతుల్ని విడిపించి నలుగురు పోలీసులు రౌండ్‌గా నిలిచారు.“ఇవి తిని నువ్వు బ్రతికితే వదిలేస్తాం..” అన్నది ఝాన్సీ.

“నాకేమయినా అయితే మీకు ఉద్యోగాలు పోవడం ఖాయం” అన్నాడు భీమ్లా నాయక్

చావు తెలివి

తేటలు చూపిస్తూ."వీడితో మాటలు ఏంటి మేడమ్.వేసేస్తాం నా కొడుకుని." అంది కోపంగా శాన్వీ.

"ఆగు శాన్వీ.. " అని మళ్లీ భీమ్లా నాయక్ ని చూస్తూ.."ఇవి తినరా ఇవి తిని నువ్వు బ్రతికితే నిజంగానే

నిన్ను వదిలేస్తాం." అంది ఝాన్సీ గుప్పెడు వడ్లు అతడి చేతికిస్తూ.

"మాట తప్పరుగా" అన్నాడు ఆశగా భీమ్లానాయక్.

"అమ్మతోడు వదిలేస్తాం.ఆ తర్వాత చట్ట ప్రకారమే నీకు శిక్ష పడుతుంది" అంది ఝాన్సీ.

ఆశగా ఆ గుప్పెడు వడ్లు తీసుకొని గొంతులో పోసుకున్నాడు భీమ్లానాయక్.

నిజంగానే అవి అతడి గొంతులో అడ్డు పడ్డాయ్.గుటక వేశాడు.ఊపిరి ఆడని ఫీలింగ్.

గొంతులో వడ్లు వేసి తాను ఆయువు తీసిన ముగ్గురు పసిగుడ్లు అతడి కళ్లముందు కదిలాడారు.

గొంతు పిడచ కట్టుకుపోతున్న వైనం.అతడి ఊపిరి పోతుందా?

****

# రాయపాటి హైమావతి


సామాజిక చైతన్యం కల్గిన కథలు చదవడం ఇష్టం.

లోకం చూడక ముందే అమ్మ కడుపులోనే కన్ను మూసే పసికందులను చూసి గుండె తరుక్కు పోయేది. ముఖ్యం గా తెలంగాణా సమాజం లోని గిరిజన తెగల్లో ఇలా పసికందులను చిదమి వేస్తున్నారని తెలిసి రాసిన కథ ఇది. రాసి కంటే వాసి ముఖ్యం అని నేను నమ్ముతాను.

ఒక గొప్ప ఆశయం తో మంచి సాహిత్యాన్ని ప్రజలకు ఇవ్వాలని తపిస్తున్న ముల్కనూర్ గ్రంథాలయం వారికి.. నమస్తే తెలంగాణా యాజమాన్యంకి కృతజ్ఞతలు.

# యోగక్షేమం వహామ్యహమ్!



**లక్ష్మీ గాయత్రి**
**సెల్ : 6302555947**

"మీకోసం ఎవరో ఒక పెద్దావిడ, ఒకాయన వచ్చారు సార్. మిమ్మల్ని చూసి పోవాలని వచ్చారట." వినయంగా చెప్పాడు సెక్రటరీ జీవన్. "పెద్దావిడా... " ఆశ్చర్యంగా చూశాడు మూర్తి. "అమ్మేమో" అన్న ఆశ మనసులో చిచ్చుబుడ్డిలా గుప్పున వెలిగి... మరుక్షణమే ఆరిపోయింది. అమ్మ ఎందుకొస్తుంది... అసలు ఎలా వస్తుంది?! తన గురించి అమ్మ కి తెలిసే అవకాశమే లేదు. ఇందు అమ్మ ఊసే ఎత్తదు. ఉన్న ఒక్కగానొక్క సంతానం హృదయ్ కి నానమ్మ గురించి తెలియనే తెలియదు. ఇంక తను లివర్ కేన్సర్ తో ఆస్పత్రిలో ఉన్నట్టు అమ్మకెలా తెలుస్తుంది?! నిరాశగా వెనక్కి వాలాడు మూర్తి. "ఇప్పుడు నాకు ఎవరితోనూ మాట్లాడే ఓపిక లేదు జీవన్. వాళ్లెవరో ఏమిటో నువ్వే కనుక్కుని, మాట్లాడి, పంపించెయ్యి." అన్నాడు జీవన్ సరేనన్నట్టు తల ఊపి, వెళ్లాడు. మళ్లీ ఐదు నిమిషాల్లో లోపలికి వచ్చి, "ఆయన మీకిమ్మన్నారు సార్.. " అంటూ చిన్న కాగితం

ముక్క ఇచ్చాడు.   మూర్తి అనాసక్తిగానే చదివాడు…"మూర్తీ, నీ గురించి తెలిసి, అమ్మా నేనూ వచ్చాం…రాఘవ"

అది చదువుతూనే ఒక్క ఉదుటున లేచి కూచున్నాడు మూర్తి.  "వాళ్లని లోపలికి తీసుకురా జీవన్. తర్వాత తలుపులు వేసేసి నువ్వు వెళ్లిపో. బైట డోంట్ డిస్టర్బ్ బోర్డు పెట్టి, నర్స్ కి చెప్పు. మూడు కప్పులు స్ట్రాంగ్ కాఫీ.. ఫిల్టర్ కాఫీ తెప్పించి లోపలికి పంపు." గబగబా చెప్పి, నీరసం వచ్చినట్టు వెనక్కి జేరబడ్డాడు.   జీవన్ మొహంలో ఆశ్చర్యం దాచుకుంటూ తల ఊపి వెళ్లిపోయాడు.  మూర్తి తల తిప్పి తలుపు వైపే దృష్టి కేంద్రీకరించాడు.  "అమ్మ!"….ఇప్పుడు ఆ తలుపు తీసుకుని లోపలికి వస్తుంది అమ్మ! అమ్మ ని చూసి ఎన్నాళ్లు.. కాదు.. ఎన్నేళ్లయింది? ఖచ్చితంగా పదేళ్లు. అమ్మని తనింటి నుంచి గెంటేసి…ఇరవై సంవత్సరాలు!! అవును.. ఒక మనిషి తనంతట తాను ఇంట్లోంచి వెళ్లిపోయే పరిస్థితులు కల్పిస్తే అది గెంటెయ్యడమే. ఇందు అలాంటి పరిస్థితుల్ని భేషుగ్గా కల్పించింది. తను చూసీ చూడనట్లు ఊరుకున్నాడు. అమ్మ… నాన్న కూడా లేని అమ్మ.. ఏకాకి అయి, అయినా సరే దర్జాగా వెళ్లిపోయింది. అమ్మ వెళ్లిపోయినందుకు తను ఏనాడూ బాధపడలేదు సరికదా అమ్మ కి పల్లెలోనే బావుంటుందని కూడా అనుకున్నాడు. ఇదిగో, వారం రోజుల క్రితం డాక్టర్ తనకి లివర్ కేన్సర్ అని ఖరారు చేశాక, మళ్లీ అమ్మ పదే పదే గుర్తుకు రావడం మొదలైంది.  పెద్దయాక కూడా తనకేమైనా ఒంట్లో బాగాలేకపోతే అమ్మ ఎలా లాలించేదో గుర్తొచ్చింది. ఈ యాభై ఏళ్ల వయసులో, మృత్యువు పొంచి చూస్తున్న వేళ, మళ్లీ అలాంటి లాలన కోసం మనసు కొట్టుకుపోయింది! ఇప్పుడు అమ్మే తన పక్కన ఉంటే ఏం చేసేది?! ఏడుస్తూ కూచునేది మాత్రం కాదు! తనకి తెలుసు… అమ్మ చాలా ధీరోదాత్తురాలు! ఆ పదానికి అర్థం ఏమిటో తనకి సరిగ్గా తెలీదు. కానీ అమ్మ మాత్రం అదే! ఖచ్చితంగా అదే!! అలాంటి అమ్మని తను వెళ్లగొట్టేశాడు! కన్నతల్లిని బాధ పెట్టడం వల్లనే తనకి ఈ జబ్బు వచ్చిందేమోనన్న పశ్చాత్తాపం డే వన్ నుంచీ మూర్తిని బాధించసాగింది. ఉండబట్టలేక ఇందుతో అన్నాడు కూడా.   "చాలా ఫూలిష్ గా ఆలోచిస్తున్నారు మీరు. తల్లిదండ్రుల్ని చూడని వాళ్లందరికీ రోగాలొచ్చేస్తున్నాయా..?! మీ ఖర్మ కొద్దీ మీకొచ్చింది అంతే!" అంది ఇందు

"మీ ఖర్మ" అన్న మాట వినగానే మూర్తికి చివుక్కుమనిపించింది. "మన ఖర్మ" కాదు… "మీ ఖర్మ"!!   అవును. అంతేగా. "ఇందిరా ఫార్మా" కంపెనీ అధినేత్రి ఇందిరామూర్తి, భర్త అనారోగ్యం కారణంగా కంపెనీ బాధ్యతలన్నీ భుజాన వేసుకుంది. కంపెనీకి వెళ్లాలంటే చక్కగా ముస్తాబవాలి. నవ్వుతూ పనులు చక్కబెట్టాలి. ఆస్పత్రి

గుడ్డలు వేసుకుని, సూదులు ఒంటికి గుచ్చుకుని, కదలా మెదలకుండా పక్క మీద పడి ఉండే ఖర్మ తనదే. తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. తెల్లగా, పొట్టిగా, బక్కపల్చగా ఉన్న ఆకృతి లోపలికి వచ్చింది. నిర్మలంగా ఉన్న ఆ మొహంలో.. కళ్లజోడు వెనుక నుంచీ కూడా ఆ చూపు ఎంత దయార్ద్రంగా ఉందీ?! ఎంత నిష్కల్మషంగా, ప్రేమగా ఉందో?! "అమ్మా.. " మూర్తి అప్రయత్నంగా చెయ్యి చాపాడు. సావిత్రమ్మ చప్పున ముందుకొచ్చి కొడుకు చెయ్యి అందుకుంది. "అమ్మా.... " మూర్తి కళ్లు నీళ్లతో నిండిపోయాయి. "నేనూ నాన్న దగ్గరికి వెళ్లిపోతున్నానమ్మా"

"నీ మొహం" సావిత్రమ్మ ప్రేమగా కొడుకు బుగ్గలు పుణికింది. "నన్ను దాటించకుండా నువ్వెక్కడికి వెళతావురా.. నా పూజలన్నీ ఏమైపోవాలీ?" అంటూ పక్కనే ఉన్న రాఘవ వైపు చూసి నవ్వింది. "చిన్నప్పటి నుంచీ ఇంతే... ఉత్త భయస్థుడు."

రాఘవ కూడా స్నేహితుడి వైపు చూస్తూ చల్లని వెన్నెల లాంటి నవ్వు నవ్వాడు. అమ్మ మాటకి ఒక్కసారిగా పుంజుకున్నాడు మూర్తి. ధైర్యాన్ని సిరంజిలోకి ఎక్కించి, నరాల్లోకి పంపించినట్టయింది. అవును... ఇప్పట్లో తనకేమీ కాదు. అమ్మ ఎక్కడున్నా తను బావుండాలని పూజలు చేస్తూనే ఉంటుంది. డాక్టర్లు చెబుతూనే ఉన్నారు కదా... చాలా ఎర్లీ స్టేజి.. భయపడవలసిందేమీ లేదూ అని. అది అమ్మ పూజల వల్లే! అమ్మ ఎంత నిష్టగా పూజ చేస్తుందో తనకి తెలుసు. ఇందుకి షో ఎక్కువ. వరలక్ష్మీ వ్రతానికి లక్ష రూపాయల దాకా ఖర్చు చేస్తుంది. నిత్యపూజ మాత్రం సున్నా. "అమ్మా.. నీకెలా తెలిసింది?!"

"కాకొచ్చి కబురు చెప్పింది గాని, నాన్నా, నేను నీ దగ్గర ఓ వారం రోజులు ఉందామనుకుంటున్నానురా."

"అమ్మా...!" మూర్తి ఆనందం రెట్టింపు అయింది. "నన్ను చూసేసి వెళ్లిపోతావేమోనని భయపడుతున్నానమ్మా!"

"పిచ్చితండ్రి..అలా ఎలా వెళతాను? వీలైతే నిన్ను నాతో బాటు తీసుకువెళ్లాలని ఉంది నాకు!"

మూర్తి మాట్లాడలేదు.. అయిష్టతతో కాదు.. "అమ్మతో కలిసి వెళతానా" అన్న అపనమ్మకంతో.

కాఫీలొచ్చాయి. డాక్టర్ వచ్చి వెళ్లాడు! రాఘవ స్నేహితుడి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు. తల్లీకొడుకూ మిగిలారు. "కాలక్షేపానికి విను..!" సావిత్రమ్మ తన సెల్ కొడుకు తల పక్కన పెట్టింది. "న కాంక్షే విజయం కృష్ణ.. నచ రాజ్యం సుఖానిచ"

ఘంటసాల భగవద్గీత వస్తోంది. "అమ్మా.. " చప్పున మళ్లీ మృత్యుభయం కమ్ముకుంది మూర్తిని. "నేను చచ్చిపోతానని.. చచ్చిపోబోయే ముందు భగవద్గీత వినిపిస్తున్నావా..?!"

సావిత్రమ్మ చల్లగా నవ్వింది. "ఇంచుమించు నలభై సంవత్సరాల నుంచీ భగవద్గీత నిత్యం పారాయణ చేస్తున్నాను నేను. చచ్చిపోతాననే చదువుతున్నానా?!"

మూర్తి మాట్లాడలేదు! "ఆర్ట్ ఆఫ్ లివింగ్ అని ఈనాడు చెబుతున్నారు చూశావా... యుగయుగాల కిందటే ఆ ఆర్ట్ ని గ్రంథస్థం చేసి మనకి అందించాడు కృష్ణ పరమాత్మ! ఆ స్వామి ఉన్నాడూ అని నువ్వు ఎంత దృఢంగా నమ్ముతావో, సమస్త రకాల బాధల నుంచీ నువ్వు అంత దూరమవుతావు! శారీరకంగా సుఖపడటానికి సంపాదన ఎంత అవసరమో, మనశ్శాంతికి ఆధ్యాత్మికత అంత అవసరం! పెద్దవాళ్లు మనతో బాటే ఉ ంటే, మన చెయ్యి పుచ్చుకుని ఆధ్యాత్మికత బాట పట్టిస్తారు! నేనిప్పుడు చేస్తున్నది అదే! ప్రశాంతంగా, ఏమీ ఆలోచించకుండా విను! నీ మనసుకి శాంతి దొరుకుతుందో లేదో చూడు!"

మంత్రముగ్ధుడిలా తల్లి మాటలు విన్నాడు మూర్తి. ఇహ తర్కించకుండా భగవద్గీత వినడం ప్రారంభించాడు. "దేహినోస్మిన్ యధా దేహి.. కౌమారం యవ్వనం జరా.."

అవును. చిన్నప్పుడు పరిగెడుతూ క్రికెట్ ఆడిన శక్తి తనకిప్పుడు లేదు. బాల్యం, యవ్వనం దాటేశాడు. బీపీ, సుగర్ శరీరాన్ని లొంగదీసుకున్నాయి. స్టేజి మీద తన పాత్ర చివరికి వస్తుంటే, ఇహ తెర వెనక్కి తప్పుకోవలసిన సమయం ఆసన్నమైందని వేరే ఎవరో చెప్పాలా?! ఎటూ తెరమరుగవడం తప్పనిసరి అయినప్పుడు, ఏ రకంగా అయితేనేమీ?! "అమ్మా... "

"ఏమిటి నాన్నా?!"

"డిశ్చార్జ్ చేశాక, నువ్వూ, నేనూ కలిసి మన ఊరు వెళదాం! నీ దగ్గర కొన్నాళు ్లంటానమ్మా"

***

చిన్న డాబా ఇల్లు! ముందు వైపు మధు మాలతి, సన్నజాజి, విరజాజి, వెనుక వైపు ఆనప, బీర, కాకర తీగెలతో కప్పుకుపోయి, లతాగృహంలా కనిపిస్తోంది. విశాలమైన పెరట్లో, తూర్పున గోశాల. తాటాకు కప్పిన ఆ పాక మీద కాశీరత్నం పూలతీగె నిండుగా విస్తరించి, పాకలో గోమాతకి పువ్వుల గొడుగు పట్టినట్టుంది! ఇంట్లో కాలు పెడుతూనే పెరట్లో నూతి దగ్గరికి వెళ్లి, అక్కడి గోలెంలో నీళ్లతో కాళ్లూ, చేతులూ,

మొహం కడుక్కుని, గోశాల వైపు నడిచింది సావిత్రమ్మ. చిన్నపిల్లాడిలా తల్లి వెనక వెనకే వస్తున్న మూర్తి, తనూ కాళ్లూ, చేతులూ కడుక్కుని, గోశాలలోకి వెళ్లాడు! "బావున్నావా తల్లీ.. " ఆవు గంగడోలు నిమురుతూ ఆప్యాయంగా అడిగింది సావిత్రమ్మ. ఆవు ఆమె రాకకి ఆనందిస్తున్నట్టు మెడ సాచి సావిత్రమ్మ కి మరింత దగ్గరగా మొహం పెట్టింది. పక్కనే మరో చిన్న గుంజకి కట్టేసి ఉన్న దూడ, తల్లిని రాసుకుంటూ ముందుకొచ్చి సావిత్రమ్మ తొడల్ని తలతో పొడిచింది. "అయ్యో, నిన్ను మర్చిపోలేదురా నాన్నా.. " సావిత్రమ్మ వంగి దూడని నిమురుతూ ముద్దు చేసింది. "ఇది సురభి! ఈ బుజ్జి దూడ గౌరి!" అని కొడుక్కి చెబుతూ, జబ్బ పట్టుకుని సురభి దగ్గరగా తీసుకువెళ్లింది. మూర్తి చెయ్యి పట్టుకుని సురభి గంగడోలు నిమిరించింది. తర్వాత చేతులు జోడించి నమస్కారం చేస్తూ, "అమ్మా, సురభీ! నీకు తెలియనిదేముంది.. వీడు నా ఒక్కగానొక్క పిల్లాడు! వీణ్ణి చల్లగా చూడాలి నువ్వు!" అంది. రాత్రి పడుకోబోయేముందు ఏలకపొడి, కలకండ కలిపిన గోరువెచ్చని ఆవుపాలు పెద్ద వెండిగ్లాసు నిండా తెచ్చి కొడుకు చేత తాగించింది. ఆ మర్నాటి నుంచీ మూర్తి దినచర్య సరికొత్తగా మొదలైంది. తెల్లవారుజామునే అమ్మతో బాటూ లేవడం, స్నానం చేసి, దేవుడి ముందు దీపం వెలిగించి ఒక పావుగంట సేపు నిశ్చలంగా ధ్యానం చేయడం. తర్వాత వేడిగా కాఫీ తాగి, గోశాలకు వెళ్లి, సురభి, గౌరి ఇద్దరి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి, సురభి గంగడోలు నిమురుతూ మృత్యుంజయ మహా మంత్రాన్ని ముమ్మారు చెప్పడం. అదయాక, అలా పొలాల వైపు వాకింగ్! సావిత్రమ్మ కబురంపగా వచ్చిన ఆయుర్వేద వైద్యుడు ఏదో లేహ్యం, గుళికలూ ఇచ్చాడు. వేళకల్లా అవి వేసుకోవడం. అమ్మ పెట్టే సాత్వికాహారాన్ని తీసుకోవడం! రెండు పూటలా గోరువెచ్చని ఆవుపాలు తాగడం! సావిత్రమ్మ ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండదు. వంటపని అయి-పోతే భాగవతమో, రామాయణమో చదువుకుంటుంది. ఇంటికి ఎవరో ఒకరు ఏదో ఒక సలహా కోసం వస్తూనే ఉంటారు. అదిగాక, మధ్యాహ్నం మూడు దాటాక బోలెడు మంది ఆడవాళ్లు, మగవాళ్లు వస్తారు. వాళ్లందరినీ కూర్చోబెట్టి, రామాయణం, భాగవతం చెబుతుంది. సాయంత్రం మళ్లీ స్నానం, ధ్యానం. రాత్రికి గ్లాసెడు గోరువెచ్చని పాలు మాత్రమే ఆహారం!! తల్లి బుక్ షెల్ఫ్ లో కొన్ని ఇంగ్లీషు పుస్తకాలు కూడా కనిపించాయి మూర్తికి. అవి ఎవరు చదువుతారా అనుకున్నాడు మూర్తి. ఇంతలో ఒకరోజు కొడుక్కి ఒక పుస్తకం తీసుకొచ్చి ఇచ్చింది సావిత్రమ్మ. అదేమిటా అని మూర్తి కుతూహలంగా చూశాడు. Holy Cancer" అమిత్ వైద్య అనే వ్యక్తి రాసిన పుస్తకం అది.

Holy Cancer. How a Cow saved my life అని ఉంది. "చదువు. చాలా బావుంది" తల్లి చిరునవ్వుతో చెప్పింది. "చాలా బావుందా...నువ్వు చదివావా?!" ఆశ్చర్యంగా అడిగాడు మూర్తి

"అమ్మా.. నువ్వు ఇంగ్లీష్ నేర్చుకున్నావా.. ఎప్పుడూ...ఎవరు నేర్పారు?!" మూర్తి ఆశ్చర్యానికి అంతు లేదు. "చెబుతాను. విను. ఆరోజు ఆస్పత్రిలో నీ గురించి నాకు ఎలా తెలిసిందీ అని అడిగావు కదా.. "

"అవును"

"నాకు ఇంగ్లీష్ నేర్పిందీ..నేను వాడుతున్న స్మార్ట్ ఫోన్ నాకు కొనిచ్చి, దాని వాడకం నేర్పిందీ, నీ గురించి నాకు చెప్పిందీ ఒకరే.. "

"ఎవరమ్మా. ." మూర్తి కుతూహలం రెట్టింపు అయింది. "చెబుతున్నా..! నేను నీ దగ్గర నుంచి వచ్చేశాక, నాకంటూ ఒక ప్రపంచాన్ని ఏర్పరచుకున్నాను. పూజాపునస్కారాలు, గోసేవ నాకు మొదటి నుంచీ ఇష్టమైన విషయాలు. భాగవతం, రామాయణం చదువుకుంటూ, తెలియనివి నేర్చుకుంటూ, తెలిసినవి నలుగురికీ చెబుతూ కాలక్షేపం చేస్తున్నాను. అలా ఉండగా ఒకరోజు నాకు ఫోన్ వచ్చింది. "నానమ్మా... నేను నీ మనవణ్ణి" అన్నాడు అవతలి నుంచి. నేను నిలువునా చలించిపోయాను. నేను వచ్చేసే టైంకి వాడు ఏడాది వాడు. ఇప్పుడు పదహారేళ్లు. "నానమ్మా.. నేను నీ దగ్గరకి రావచ్చా" అని అడిగాడు. కళ్లనీళ్లొచ్చాయి నాకు. రమ్మన్నాను. వచ్చాడు.

"మా ఇంట్లో ఎవ్వరూ ఉండరు... ఆ సైలెన్స్.. ఐ హేట్ నానమ్మా" అని వాడు అంటూంటే నాకు మీ నాన్నగారే గుర్తొచ్చారు. ఇల్లనేది సందడిగా ఉండాలనేవారాయన. అప్పుడే అంతా బావుంటుంది అనేవారు. హృదయ్ మనింట్లో ఎవరూ ఎందుకు లేరు అని మిమ్మల్ని అడిగి, నీ సెల్ లో నా ఫోన్ నంబర్ పట్టుకుని, మీకు చెప్పకుండా ఫ్రెండ్స్ తో కలిసి పిక్నిక్ పేరుతో ఇక్కడికి వచ్చాడు. ఇప్పుడు కనీసం రెండు నెలలకోసారైనా వస్తాడు. సురభి, గౌరి వాడు పెట్టిన పేర్లే. ఈ ఇల్లు ప్రస్తుతం నడుస్తున్నది వాడి ఊపిరితోనే!!"

మూర్తి నోట మాట రాలేదు! కానీ రక్తం ఉరకలేస్తోంది. గుండె గంగావతరణంలా "తొందర తొందర నడకల వెను వెన్కనె వేల్పుటేరు" లా పొంగుతోంది!!

***

పదేళ్ల తర్వాత.. ఇందిరా ఫార్మా" కంపెనీ అధినేత హృదయ్ తండ్రి రామమూర్తి షష్ఠిపూర్తి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి! ఎనభై ఏళ్ల ముదివగ్గు మూర్తి తల్లి

సావిత్రమ్మ సోఫాలో కూర్చుని ఉంది. మూర్తి లేచి, "నేను ఎక్కువగా మాట్లాడటానికి ఏమీ లేదు గానీ, రెండే రెండు మాటలు చెబుతాను. మొదటిది... మీ ఇళ్లల్లో పెద్దవాళ్లు ఉంటే వాళ్లని పెన్నిధిలా కాపాడుకోండి. మనం ఎలా బతకాలో... ఎలా బతికితే జీవిస్తామో చెప్పగలిగేది వాళ్లే! రెండోది కోరిక తీరడం కోసం భగవత్ప్రార్థన చెయ్యకండి. ఫలితం ఉండదు. మిమ్మల్ని మీరు సంపూర్ణంగా తీర్చిదిద్దుకోవడం కోసం ఆ పరమేశ్వరుని ఆశ్రయించండి. ఫలితం చక్రవడ్డీలా పెరుగుతుంది!! ఇక అందరూ లేచి తృప్తిగా భోజనం చెయ్యండి!" అన్నాడు.

సావిత్రమ్మ, హృదయ్ ఇద్దరూ చిరునవ్వుతో ఒకరినొకరు చూసుకున్నారు! "అనన్యాశ్చింతయంతో మాం.." మైక్ లోంచి ఘంటసాల స్వరంతో శ్రీకృష్ణ పరమాత్మ పలుకుతున్నాడు!

***

**పేరు లక్ష్మీ గాయత్రి. విశాఖపట్నం నివాసిని. 1980 లో ఇంగ్లీష్ లిటరేచర్ లో డిగ్రీ తీసుకున్నాను. రచయిత్రిగా నా గతమంతా సార్వభౌముల ఖడ్గ చాలనంలోనూ, పంచకళ్యాణి గుర్రాల పరుగులోనూ గడిచింది. 1983 నుంచి దాదాపు 30 సంవత్సరాల పాటు చందమామ పిల్లల మాసపత్రిక లో కథలూ, సీరియల్స్ రాశాను. అన్నిటి కంటే పెద్ద సీరియల్ "స్వర్ణ సింహాసనం" 2000 లో పబ్లిష్ అయింది. ఆ రోజుల్లోనే ఆంధ్ర పత్రిక (నా మొదటి కథ ఆంధ్ర పత్రిక లోనే వచ్చింది) స్వాతి వీక్లీ, మంత్లీ ల్లో నా కథలు వచ్చాయి. 1983లో ఈనాడు సబ్ ఎడిటర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ కి వెళ్లి, రామోజీరావు గారి ప్రశంసల్నీ, ఉద్యోగాన్నీ గెలుచుకోవడం. కానీ కారణాంతరాల వల్ల అసలు ఆ ఉద్యోగంలో చేరకనే పోవడం నా దురదృష్టం. విశాఖపట్నం లోకల్ పేపర్ లో పన్నెండు సంవత్సరాలు పనిచేసి, ప్రస్తుతం ఇంటిపట్టునే ఉంటున్నాను.**

# నీవు పాడే పాట..



**ఎమ్. రామలక్ష్మి**
**80084 44415**

నేను ఒక పాటని. చాలా రోజుల కిందటి సంగతి, "ఓ సజనా! బరఖా బహార్ ఆయి.." అని సుగుణ గొంతులోంచి నేను మళ్లీ మళ్లీ పుడుతూనే ఉండే రోజులవి. ప్రతి రోజూ తను మధ్యాహ్నం మూడయ్యేసరికి పొయ్యి మీద టీ పెట్టి గ్రాంఫోన్ లో మేముండే రికార్డ్ పెట్టేది. అందులో మేము నాలుగు పాటలం ఉన్నాం, అయినా తను నా దగ్గరే స్టైలస్ స్టిక్ పెట్టేది. మిగితావారందరూ నన్ను ఈర్ష్యగా చూస్తుంటే నాకు భలేగా ఉండేది. రికార్డ్ లోనుంచి రావడం అందరిముందూ గొప్పగా ఉన్నా, సుగుణ గొంతులో నుంచి రావడం నాకు ఇంకా హాయిగా ఉండేది. సుగుణకి పెళ్లయ్యాక, నాగ్ పూర్ శంకరం దగ్గరకి వచ్చినప్పుడు, శంకరం ఇచ్చిన మొదటి బహుమతి ఈ రికార్డ్.

నాగ్ పూర్ లో రైల్వే క్వాటర్స్ లో ఉండే తెలుగువారందరికీ సుగుణ పాటలు తెగ నచ్చుతాయి. వాళు వచ్చినప్పుడల్లా తనని పాడమని అడుగుతారు. తెలుగు పాటలు చాలా బాగా పాడుతుంది తను. ఎవరైనా హిందీ వాళ్లు వస్తే నాకు చాలా సంబరం. వాళ్ల ముందు ఫస్ట్ నన్నే పాడుతుంది సుగుణ. అందరూ తనని మెచ్చుకుంటే నాకు ఎంత సంబరమో.

తను టీ తాగుతూ మమ్మల్ని వింటుంటే కూడా ఎంత హాయిగా ఉండేదో. ఎందుకంటే సుగుణ పాడడమే కాదు, చాలా బాగా వింటుంది, పాటే తానైపోతుంది.

సుగుణ దగ్గరకి తెలుగు ట్యూషన్ కి పిల్లలొస్తారు. వాళ్ళకి సుగుణ చెప్పే కబుర్లూ, కథలూ, చిన్ని చిన్ని పాటలూ చాలా సరదాగా వింటారు. ట్యూషన్లు బానే ఉంటాయి కానీ, ఇవి మొదలయ్యాక తన గొంతు లోనుంచి జారి పడే అవకాశం నాకు కాస్త తగ్గింది. ఒకసారి తెలుగువాళ్ల ఫంక్షన్లో ఎవరో చెప్పారు, తను ఒక తెలుగు పాట చాలా బాగా పాడుతుందని, అందరూ తనని పాడమని బలవంతం చేసారు. సుగుణ సున్నితంగా మెల్లిగా మెత్తగా 'మనసున మల్లెల మాలలూగెనే%ా%.' అని మొదలు పెట్టింది. ఏమా మార్ధవం, ఏమా ఆర్ద్రత... పరాయి భాష పాటైనా, నా మనసు ఆర్తి తో చెమ్మగిల్లింది. ఆ రోజు రాత్రి శంకరం సుగుణని దగ్గరకు తీసుకుని "ఎందుకంత బతిమాలించుకున్నారు అమ్మాయిగారు" అని అడిగాడు.

అందులో మల్లీశ్వరి మళ్లీ విడిపోతామేమో అన్న బాధతో, భయంతో పాడుతుంది కదా, నాకు ఎప్పటికీ అలాంటి బాధ వద్దు బాబూ. అందుకే అందులో పూర్తిగా లీనమయ్యి పాడలేను" అంది శంకరాన్ని హత్తుకుపోతూ.

మరి పూర్తిగా లీనమయ్యి ఇష్టంగా పాడే పాట ఏమిటో "అని అడిగాడు శంకరం సుగుణ సోగ కళ్ళలోకి చూస్తూ, ఆమె జడతో ఆడుకుంటూ. నేను ఆత్రంగా చూస్తున్నాను ఏమంటుందో అని. పక్కన ఉన్న రికార్డ్ లోనుంచి 'రసిక్ బలమా' 'ఆజారే పరదేశి ' , 'యే షాం కీ తన్ హాయియా' ఇవన్నీ కూడా ఆత్రంగా చూస్తున్నాయి. దానికి తోడు సుగుణ పెళ్లికి ముందు పాడుకున్న తెలుగు పాటలు కొన్ని చాలా ఎదురు చూస్తున్నాయి.

కానీ సుగుణ శంకరాన్ని లాలనగా హత్తుకుంటూ ఒళ్లో పడుకోబెట్టుకుంటూ 'సడి సేయకో గాలి, సడి సేయబోకే' అంటూ ఒక తెలుగు పాటనీ మెత్తగా బంగారు తల్లిలా జో కొడుతూ పాడింది. శంకరం ఆమె ప్రేమలో కరిగిపోతూ నిదురపోయాడు.

నాకు సంతోషంతో కూడిన ఈర్ష్య వచ్చింది. నాకు లోపల ఏదో నమ్మకం, నిద్ర జోకొట్టడానికి పాడింది కానీ, నేనంటేనే తనకి ఇష్టం. కొంచెం మబ్బు పట్టగానే, రికార్డ్ పెట్టి, పనులు చేసుకుంటూ నన్నేగాపాడుకుంటూ ఉండేది.

సుగుణ ఏ పని చేసినా కూని రాగాలు తీస్తూనే ఉండేది. పక్కింటావిడ కబుర్లు చెప్పడానికి వస్తే పాల మీగడ లాంటి గలేబాల మీద బుల్లి బుల్లి అందమైన పూలు కుడుతూ అందమైన జడని ఒక చేత్తో వెనక్కి తోసుకుంటూ సొగసుగా మాట్లాడేది. చేసేది ఏ పనైనా ఎంత అందంగా చేసేదో.

శంకరం మంచివాడు, సుగుణ అంటే ప్రాణం, ఒకసారి ఎదో ఒక నైట్ డ్రస్ తెచ్చాడు వేసుకోమని, "ఛీ.. ఛీ..! నేను వేసుకోన" నింది సుగుణ. "ఇంట్లో రాత్రి పూట వేసుకోవడానికి కూడా నీకు అభ్యంతరం ఏమిటి" అన్నాడు శంకరం. వాళ్ళిద్దరూ పోట్లాడుకోవడం అదే మొదటిసారి. మళ్లీ ఉదయానికల్లా రాత్రి పోట్లాడుకుంది

మరచిపోయి మళ్ళీ కలిసిపోయారు. సుగుణ రోజూ లాగే ఉదయం పూజ చేసుకొని సుప్రభాతం చదువుతూ శంకరాన్ని లేపుతుంటే మేము హమ్మయ్యా అనుకున్నాం.

రోజులు మూడు తెలుగు పాటలూ, ఆరు హిందీ పాటల్లా మధురంగా గడిచిపోయాయి. గ్రాంఫోన్ ప్లేయర్ కి, మా రికార్డ్ లకీ మంచి స్నేహం ఉండేది. మేము గ్రాంఫోన్ ప్లేయర్ ని "మావయ్యా" అని పిలిచేవాళ్లం. మావయ్య మీద గిర గిరా తిరుగుతూ పాటలు బయటకి వస్తుంటే మాకు చాలా బావుండేది. ప్రతి సంవత్సరం కొత్త రికార్డులు ఏవో ఒకటి వచ్చినా ఇంకా మా రాజ్యమే నడుస్తూ ఉండేది.

చూస్తుండగా సుగుణ కీ, శంకరానికీ ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. శంకరానికి ఆంధ్ర ప్రదేశ్ కి ట్రన్స్ ఫర్ అయ్యింది. బొబ్బిలి వచ్చాక హిందీ పాటల సందడి బాగానే తగ్గిపోయింది.

మా గ్రాంఫోన్ మావయ్య కి కొత్త రికార్డులు ఎన్నో పరిచయం అయ్యాయి. ముత్యాల ముగ్గు డైలాగులూ, ఘంటసాల గారి ప్రైవేటు పాటలూ మమ్మల్ని బానే వెనక్కి నెట్టేసాయి. అయినా సుగుణ పిల్లలకి జడలు వేస్తూ, సాయంకాలం దీపాలు వెలిగిస్తూ, జాజి పూల మాలలు కడుతూ పాడే మధుర గీతాల్లో నాకెప్పుడూ చోటు ఉంటూనే ఉండేది. కాకపోతే ఒక కొత్త చిక్కు వచ్చింది, సుగుణ పెద్ద కూతురు సంధ్య కి కాస్త సంగీతం రావడం మొదలుపెట్టింది. దాంతో ఒక వృద్ధ వీణ మాస్టారుతో వీణ నేర్పించడం మొదలుపెట్టారు. ఆయన ఠంచనుగా సాయంత్రం 4 గంటలకల్లా వచ్చేవారు. సుగుణకి ఇంక తీరిగ్గా టీ తాగుతూ మమ్మల్ని పలకరించే టైం లేకపోయింది.

ట్యూషన్ కి చాప వేయడం, వీణ తీసి రెడీ పెట్టడం, సంధ్య ని కూర్చోపెట్టడం, దీనితోనే సరిపోయేది. నిజానికి నేర్పేది సంధ్యకే అయినా నేర్చుకునేది సుగుణే. పక్కనే కూర్చుని, వీణని చూస్తూ చూస్తూ నేర్చేసుకుంది సుగుణ.

మాస్టారు వెళ్లగానే పిల్లలు ముగ్గురూ పోలోమంటూ బయటకు పరిగెత్తేవారు ఆటలని. అప్పుడింక సరస్వతీ దేవి వాయిల్ చీర కట్టుకుని వయ్యారంగా కూర్చుని వీణ వాయిస్తున్నట్లు సుగుణ చకచకా ఆవాల్టి పాఠాన్ని పాడుకుంటూ వాయించేసుకునేది. కొన్ని సార్లు, మా పంట కూడా పండేది. మమ్మల్ని వీణ మీద పలికించాలని సుగుణ ప్రయత్నాలు చేస్తూ ఉండేది. స్వరాల్ని కూడబలుక్కుంటూ, రాగాల్ని ఊహిస్తూ మొత్తానికి మాకు వీణా స్పర్శా సౌఖ్యాన్ని కలిగించేది. తనకి సరిగ్గా వచ్చే వరకూ చేసే సాధన కు పిల్లలు నవ్వులూ, కేరింతలూ, పక్క వాద్యాలు. అవి బంగారం రోజులు.

ఉద్యోగం లో శంకరానికి పని వత్తిడి చాలా ఉండేది. దాంతో ఒకప్పటిలా గోముగా పాటలు పాడమని అడిగే దృశ్య కావ్యాలూ, మోహన రాగాలూ తగ్గినా, వారి అనుబంధం మాత్రం చెక్కుచెదరకుండా మౌన రాగాలు పలికిస్తూ సాగిపోయింది. కొత్త సినిమాలూ, కొత్త పాటలూ, ఇంట్లో వీణా గానాలూ, వీటితో మా హిందీ పాటలం బానే వెనక్కి పడ్డాం. మా గ్రాంఫోన్ మావయ్య మాత్రం చాలా బిజీగా ఉండేవాడు.

ఒక్కసారి మమ్మల్ని ఎవరైనా వింటే బాగుండు తనని పలకరించగలుగుతాం అనిపించేది. ఇంతలో ఒక దారుణం జరిగింది. ఒక చిన్న డబ్బా మమ్మల్ని శాశ్వతంగా వెనక్కి నెట్టేసింది. ఈ చిన్న డబ్బా.. టేప్ రికార్డర్ అని, ఎప్పుడంటే అప్పుడూ, ఎక్కడంటే అక్కడ చాలా సులువుగా పెట్టేసుకోవచ్చు, దాంతో హఠత్తుగా మమ్మల్ని ఎవరూ పట్టించుకోకుండా అయిపోయింది.

మేమంటే పాటలం గాబట్టి రికార్డు మీదా ఉండగలం, క్యాసెట్టు మీదా ఉండగలం, కానీ పాపం గ్రాంఫోన్ మావయ్య అలా కాదు కదా. ఎక్కడికి వెళ్ళిపోయాడో తెలీదు, మళ్ళీ ఎప్పుడూ చూడలేదు.

పాత పాటల పల్లకీ జ్ఞాపకాల్ని మోసుకుంటూ అలమరాలెక్కింది. కొత్త పాటలు జోరుగా హుషారుగా కారులో షికారు కొడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఎన్నో వందల పాటలు పుడుతుంటే, ఆపాత మధురాల్ని తట్టి పలకరించడానికి ఏ గొంతుకి మాత్రం కుదురుతుంది?

సుగుణ మాత్రం మబ్బు పట్టగానే ఒక్కసారి నన్ను పాడుతుంది. ఆ గొంతుని ఆర్ద్రంగా తడుముకుంటాను మళ్ళీ ఎప్పటికి పిలుస్తుందో కదా అని.

కాలం తెచ్చే కొత్త మార్పుల్ని చూస్తూ చూస్తూ అలమారాలో ఓ మూలగా జీవితాన్ని గడిపేసాము. నేను అప్పుడప్పుడూ రేడియోలో వినపడతాను గానీ, అది పూర్తిగా నేను కాదు. సుగుణకి వినపడి ఆమే గొంతులోనుంచి, తన కంఠాంతరంలో నుంచి బయటపడే నేనే నేను.

సుగుణ లాంటి బంగారాలు అమ్మలయ్యి, అమ్మమ్మలయ్యి బాధ్యతల్ని తలమీదకెత్తుకొని పాటల్ని గుండెల్లో పెట్టిమూసేసారు. వేసవి వెన్నెలలో పెరట్లో మడత మంచాల మీద మల్లెపూల సువాసనల మధ్య మెత్తటి చీర కట్టుకొని వత్తైన జుట్టుని జడగా అల్లుకుంటూ, పిల్లలకీ కథలు చెప్తూ, మమ్మల్ని కూడా ప్రేమగా పిలిచి తన గొంతుతో హత్తుకున్న ఆ అందాల రాసి మమ్మల్ని మళ్ళీ అలా పిలవడం ఇంక కలే.

సుగుణ చూస్తుండగా సుగుణమ్మ అయ్యింది, అమ్మమ్మ అయ్యిందిగా మరి. పిల్లలు ఎప్పుడైనా పాడమంటే, అబ్బే గొంతులో జీర వచ్చిందర్రా అని పాడడం ఎప్పుడో ఆపేసింది. ఆ జీర మమ్మల్ని కోస్తుందనీ, మాకు నొప్పెడుతుందనీ తనకి భయం పాపం.

ఆ జీర ను మేము లెక్క చేయమనీ, ఆమె గొంతులో నుంచి రావడం మాకెంతో ఇష్టమనీ తనకి తెలీదుగ పాపం. ఎవరైనా తనని బలవంతపెట్టి మమ్మల్ని పిలిపిస్తారనీ ఎంతో ఆశ ఎదురు చూస్తుంటాను. టీవీలు వచ్చాక, పాటల కార్యక్రమాలు పెరిగాక ఎంతోమంది పాత పాటలు పాడుతున్నారు. కానీ, నన్ను పెద్దగా ఎవరూ పాడలేదు. ఎవరైనా నన్ను పాడినా కూడా నాకు ఆనందం ఏమీ లేదు. కానీ, అది విని నన్ను గుర్తు చేసుకుని, సుగుణేమన్నా నన్ను గొంతు చేసుకుంటుందేమో అని ఆశ. ఎన్నోసార్లు వర్షపు

రాత్రులు ఎదురుచూసాను  తనకి నేను గుర్తొస్తానేమోనని, అసలు తనకి ఆ ధ్యాసే లేదు. నాకు శంకరం మీద పిచ్చి కోపం వస్తుంది. అప్పట్లో అంత గోముగా అది పాడు, ఇది పాడు అని అడిగేవాడు, అంతలా ఎలా మర్చిపోయాడు.డాబా మీద చాపలు పర్చుకొని, వెన్నెల్లో నక్షత్రాల కింద పడుకుని పాడుకునే పాటల కంటే బాగున్నాయా ఈ టీవీలో ఎవరో పాడే పాటలు. ఏసీలు, ఫ్యాన్లూ... ఉక్కిరిబిక్కిరిగా లేదా వీళ్లకీ??

ఆరుబయట కూర్చుని నీలి మేఘాలలో గాలి కెరటాలలో అని ఎంత బాగా పాడుకునేది సుగుణ, మరి ఆ గదుల్లోనే పనుల మధ్యలో ఉంచేస్తే గొంతు పూడుకుపోయిందేమో పాపం, పాడడమే ఆపేసింది. పాడే గొంతు ని పూడ్చేస్తే ఊరుకుంటుందా , సుగుణ మెత్తని గుండెని వత్తిడి చేసింది. వీణలు మీటాల్సిన చెయ్యి ఏవేవో పనులు చేయాలంటే ఎందుకు వింటుంది? ఇంక లేవనంది. పాటని మర్చిపోయేటట్టు చేసిన జీవన శైలి బ్రైన్ స్ట్రోక్ రూపంలో వచ్చి అన్నీ మర్చిపోయేట్టుగా చేసింది. మంచాన పడేసింది.

తనే లోకంగా బ్రతికిన సుగుణ, మౌనంగా తన లోకంలో తాను  ఉంటుంటే ఎలా తట్టుకోవాలో తెలీలేదు శంకరానికి. ముగ్గురు కూతుర్లూ వచ్చారు, సుగుణని చంటి పిల్లలా చూసుకున్నారు.

ఏ భావమూ లేని స్వచ్ఛమైన కళ్ళతో వాళ్లని చూస్తుండేది సుగుణ. అందరూ ఇంట్లో నే ఉండడం, పిల్లలు ఇంట్లోనే ఉండడంతో, ఎవరో మొత్తానికి పెట్టెలో ఉన్న రికార్డులను తీసి అలమరాలో పెట్టారు. నేను ఉన్న రికార్డు పైకి కనపడుతూ ఉండేది. సుగుణ నిశ్చలమైన చూపులు అన్నిటినీ ఒకేలా చూస్తున్నాయి. నన్ను గుర్తుపట్టలేదా, ఈ రికార్డు చూసి నేనేమైనా తన మనసులో మెదిలితే, అనక గతం ఏమన్నా గుర్తుకు వస్తుందేమో అని ఆశ నాకు. కానీ, ఏమి లాభం?? తన గొంతులో నన్ను ఇంక ఎప్పటికీ నింపుకోలేదు కదా అని పుట్టెడు దు:ఖం వస్తోంది నాకు తనని చూస్తుంటే.

తమకెన్నో తీపి గుర్తులిచ్చిన తల్లికి తామే గుర్తులేకపోవడం చాలా కష్టంగా ఉంది కూతుర్లకి. కూతుర్లూ, మనవలూ, మనవరాళ్లూ కళ్ళ ముందే తిరుగుతున్నా, ఏ భావం లేకుండా స్వచ్ఛంగా చూపులు ప్రసరిస్తూ నిర్వికారంగా ఉంది సుగుణ.

ఒకరోజు పెద్ద మనవరాలు అలమరా లో నేను ఉన్న రికార్డు ని తీసి ఇది ఏమిటి తాతయ్యా అని అడిగింది. నా దృష్టి అంతా సుగుణ మీదే ఉంది. వాళ్లంతా మాట్లాడుకుంటూ ఉన్నారు. శంకరం ఆ రికార్డ్లు ఎలా ఉండేవో ఆ రోజుల్లో, గ్రాంఫోన్ మీద ఎలా పెట్టేవారో చెప్తున్నాడు పిల్లలకి. సుగుణ కళ్ళల్లో వచ్చిన చిన్న మార్పుని గమనించలేదు ఎవరూ.

హఠాత్తుగా ఆఖరి మనవరాలు "అమ్మమ్మ తల తిప్పి మన వైపు చూస్తోంది" అంది. ఒక్కసారి శంకరం "సుగుణా, సుగుణా" అంటూ దగ్గరరకి వెళ్ళాడు.. అందరూ ఆ రికార్డు ని ఎలా ప్లే చేయాలి అనే హడావుడి లో ఉన్నారు.  అయ్యో శంకరం ఇంకా

గుర్తు రాలేదా, పోనీ నన్ను ఏదైనా టేప్ రికార్డరో అయినా పెట్టి వినిపించొచ్చు కదా. సెల్ ఫోన్ లొ కూడా వినిపిస్తారు కదా. నేను ఎవరికీ తట్టలేదు ఏంటి?

ఎవరో చెప్పారు పాత గ్రాంఫోన్ రికార్డులు దొరికే షాపు ఒకటి ఉందని. అర్జెంట్ గా మనిషిని పంపి తెప్పించారు. నాకు ఎక్కడో ఆశ, గ్రాంఫోన్ మవయ్య ఏమన్నా వస్తాడేమోనని. కానీ కాదు, ఇంకేదో పాత గ్రాంఫోన్ ప్లేయర్ వచ్చింది.

నేను ఉన్న రికార్డుని పెట్టి ప్లే చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. సుగుణ చూపులన్నీ ఆ రికార్డు కవర్ మీదే ఉన్నాయి. వీళ్లెవరికీ తెలీదు. శంకరానికేమో గుర్తురావడం లేదు. సుగుణ నన్ను కోరుతోంది, నన్ను వినాలని అడుగుతోంది, అందులో నేను ఉన్నానని వీళ్లకి తెలీదు. అయ్యో ఎలా?? ఆ పాత రికార్డు ప్లేయరు బరబరా గీరుతోంది, కానీ మేము బయటకి రాలేక పోతున్నాము. ఇక నేనే ఎలాగొలా బయటకి రావాలని ప్రయత్నం చేసాను. “ఓ సజనా... బరా బహార్ ఆయి..”

ఓహ్ అని అందరూ చప్పట్లు కొడుతూ రికార్డర్ పని చేసిందని సంతోష పడుతున్నారు. “బర్సే పుకార్ ఆయి” అని ఇంకా నేను వస్తున్నాను. నేను సుగుణ వంకే చూస్తున్నాను. ఆమె కళ్లు ఒక్కసారి ఆనందంగా వెలిగాయి. తన పెదాల మీదకి చిన్న చిరునవ్వు వచ్చి గాలిలో కలిసిపోయింది. నన్ను పలకరించింది... నన్నే పలకరించింది.

అమ్మమ్మ నవ్వింది” అన్నారు పిల్లలు, ఇంతలో పాట ఆగిపోయింది . ఎవరో మళ్ళీ ప్రయత్నం చేస్తున్నారు పాట రావాలని... కానీ నేనింక రాను, సుగుణ వెళ్లిపోయింది, అది నాకే తెలుసు. వీళ్లింకా గమనించలేదు. ఇంక నేను వినబడను.

బయట చిన్నగా వాన పడుతోంది, ఇలాంటి వానంటే సుగుణ కి ఎంత ఇష్టమో, నేను వెళ్లాలి, నీలి మేఘాలలో తను మళ్లీ కలుస్తుందేమో.. శెలవా మరి.

–మేరా

**ఎం.రామలక్ష్మి స్వస్థలం పాలకొల్లు. శ్రీకాకుళం జిల్లాలో విద్యాభ్యాసం కొనసాగించారు. తిరుపతి మహిళా యూనివర్సిటీ నుంచి ఎంఏ (సోషల్ వర్క్) పట్టా అందుకున్నారు. యూఎస్ఏలో ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్) చేశారు. ఏడేళ్ల అమెరికావాసం తరువాత.. 2001 నుంచి 2018 వరకూ తెలుగు టెలివిజన్ రంగంలో వివిధ స్థాయుల్లో బాధ్యతలు నిర్వహించారు. మా టీవీ పునాది కార్యక్రమల రూపకల్పన, భక్తి టీవీ, ఎస్వీబీసీలలో ప్రోగ్రామింగ్ అధికారిగా, భారత్ టుడే చానల్‌కు కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహించారు. భారత్ టుడే చానల్‌లో ‘చెప్పాలని ఉంది’ కార్యక్రమ్మనికి ప్రయోక్తగా అనేకమంది ప్రమ-ుఖులను ఇంటర్వ్యూలు చేశారు. ‘అమ్మ’ జ్ఞాపకంతో రాసిన ‘నీవు పాడే పాట’.. రచయిత్రికి మొదటి కథ.**

# కాకతీయ కేతనం



**మత్తిభానుమూర్తి**
**9989371284**

"గణపతి దేవుడు.. ఏడి?"

ఎవరో చిన్నగా అన్నారు.

"ఇక్కడే ఉన్నాడే.." "అయ్యో .. ఏడి.." "గణపతి దేవా.. యువరాజా ఎక్కడున్నారు?" "గణపతి దేవా.. దేవా.."

"అయ్యో.. కనపడటంలేదు. వెదకండి వెదకండి.."

సైనికులు అటూ ఇటూ పరుగులు పెడుతున్నారు.

అది యుద్ధభూమి. అక్కడ శవమై పడిఉన్నాడు కాకతీయ మహారాజు మహాదేవుడు. యుద్ధగజం అంబారిలో తండ్రి సరసనే కత్తి ఝుళిపిస్తూ కనిపించిన యువరాజు గణపతిదేవుడు తండ్రిమరణించాక మాయ-ఎమైపోయా డు. అంతకు ఐదుఘడియల ముందు కాకతీయమహారాజు మహాదేవుడు కత్తిదూసి యుద్ధంచేస్తూ అంబారి నుండి క్రిందికి దూకాడు. అప్పుడే వెనుకనుండి ఓ శత్రుసేనాపతి విసిరిన బాణం దూసుకొచ్చి ఆయనకు వెనుక నుండి ఎడమ డొక్కలో దిగబడింది. అయినా తట్టుకున్నాడు. మీదకు దూసుకొస్తున్న శత్రువీరులను ఎదుర్కున్నాడు. కాని శక్తి క్షీణిస్తున్న మహాదేవుడ్ని శత్రు సైన్యాధ్యక్షుడు అత్యంత నైపుణ్యంతో దూకుడుతో మీదకు వెళ్లి పోరాడి సంహరించాడు. చుట్టూ ఉన్న అంగరక్షకులు, కాకతీయవీరులు ఆయనను రక్షించలేక పోయారు. నేలవాలిన తమ మహారాజు పార్థీవశరీరాన్ని నీరునిండిన కన్నులతో చూడటం మినహా మరేమీ చేయలేక పోయారు.

పరుగుపరుగున వచ్చి పడ్డాడు రేచర్ల రుద్రయ..

కాకతీయ సైన్యాధ్యక్షుడు. అతన్ని దూరంగా యుద్ధంలో నిమ గ్నుడిని చేసి ఇక్కడ మహాదేవుడ్ని నిర్జించారు.

మహాదేవుడ్నిచూసి బావురుమన్నాడు రుద్రయ. మహారాజు శిరస్సును వొడిలో జేర్చుకుని విలవిలలాడి పోయాడు. "రెండు ఘడియలు.. రెండే రెండు ఘడియలు కాపాడలేకపోయారా నీచులారా.. నేనే వచ్చి కాపా డుకునేవాడిని. మహారాజును పొట్టన పెట్టుకున్నాము కదరా. ఇప్పుడు అనుమకొండ ఎలా వెళ్ళాలి.. మహా రాజు మృతదేహంతో వెళ్లి కాకతీయప్రజలకు ఏమి సమాధానం చెప్పాలి.. ఎలా జవాబు చెప్పాలి.."

కుమిలిపోతున్నాడు అరివీర భయంకరుడు రుద్రసేనాని. మహాదేవుడి నిర్జీవశరీరాన్ని చూస్తూ తల్లడిల్లి పోతు న్నాడు. శత్రువులను బూతులు తిట్టాడు. చేతకాని కాకతీయ సైనికులపై అరచాడు. గావుకేకలు వేశాడు.

యుద్ధ భూమిలో తలోదిక్కున యుద్ధం చేస్తున్న మహామహా కాకతీయ వీరయోధులు పిల్లలమర్రి బేతిరెడ్డి, చెరుకు బొల్లయ, విరియాల సూరన, మల్యాల కాటయనాయకుడు, కామిరెడ్డి, విరియాల బేతరాజు, చౌండ.. మహారాజు ధ్వజకేతనం కూలడం చూసి పరుగుపరుగున అక్కడికి వచ్చారు. మహాదేవరాజు శవమై రుద్రయ ఒడిలో ఉండటాన్ని చూసి దిగ్భ్రమతో నిలబడిపోయి ఆనక ఆయన శరీరంపై పడి ఏడవసాగారు.

అప్పుడు గొణిగాడు దళపతి నాచన, "యువరాజు.. మన గణపతిదేవుడు.."

చివ్వున చూశాడు రుద్రయ.. "ఏడి.. యువరాజు ఎక్కడ?" ఎక్కడా కనిపించలేదు.

"శత్రువులు అపహరించుకు పోయారు సేనాని.."

మరుక్షణం నాచన తల వొక్కవేటుతో తెగి ఆవలపడింది. ఆయన కరవాల ప్రహారానికి మరో తల అందకుండా అందరూ నేలపై పడిపోయారు. "క్షమించండి మహాసేనాని.. క్షమించండి.."

ఇప్పుడు అసలుసమస్య మహారాజు మరణించడం కాదు. ఇప్పుడు కాకతీయరాజ్యం రాజులేని శ్మశానరాజ్యం. ఎవ్వరూ లేని నిస్సహాయ. శత్రువులంతా తలో వైపు కమ్ముకుంటారు.

అటూ ఇటూ చూశాడు.

కాకతీయ మహారాజును చంపి యుద్ధంలో విజయం సాధించిన దేవగిరిమహారాజు జైత్రపాలుడు గాని, దేవగిరి సైన్యాధ్యక్షుడు జల్లన, ప్రధానమంత్రి బసవసురుడు.. ఏరి కనిపించరేం.. మహాదేవుడి పార్థీవదేహాన్ని వదిలేసి వెళ్లి పోయారేం.. మహాదేవుడి శిరస్సును ఖండించి తమతో తీసుకుపోయి దేవగిరిలో కందుకక్రీడ ఆడటానికి ఎందుకు ఆసక్తి చూపలేదు.. కాకతీయ ఛత్ర కేతనాలను..ఇతర రాజరికహోదాలను స్వాధీనపరచుకోలేదు?.. గణపతి దేవుడ్ని తీసుకుని మాయమయ్యారంటే వాళ్ళ ఆలోచన ఏవిటి..

రుద్రయ ముందు తేరుకున్నాడు. సేనానులను, దళపతులను చూస్తూ అన్నాడు, "మహారాజు మహాదేవుల వారు వీరమరణం పొందారు. యువరాజు గణపతిదేవుడు కోటలో ఉన్నారు.. ఇదే అందరికి.. రాజధానిలోని సాధారణ ప్రజలందరికీ ఇదే చెప్పాలి.. అర్ధమైందా.. నేనన్నది విన్నారా.. ఏం చెప్పాలి?!.. యువరాజు కోటలో ఉన్నారు!!.. సరేనా.."

అందరికి అర్ధంఅయ్యింది. వాళ్ళంతా సైనికులు. రాజు చనిపోయి, యువరాజు శత్రువులకు చిక్కాడంటే సాధా రణ ప్రజల్లో కలిగే అలజడి, శత్రురాజుల్లో తొణికే రణోత్సాహం వారు అర్ధంచేసుకోగలరు.

"అలాగే మహాసేనాని.." అన్నారు.

కళ్ళు తుడుచుకుని లేచి అందరిని మహాదేవరాజు శవంచుట్టూ నిలబెట్టి ప్రమాణం చేయించాడు. "మనం యువరాజు గణపతిదేవుని తోడ్కొని మాత్రమే తిరిగి అనుమకొండ వెళతాం.. లేదా ఇక్కడే మరణిస్తాం. అప్పటి వరకూ స్కంధావారం విడిచి వెళ్ళం. ఇది మన మహారాజు శ్రీశ్రీశ్రీ మహాదేవులవారి పార్ధివ శరీరంపై ఆన.." వంట్లో సలసలమండుతున్నరక్తం నిలువెల్లా పొంగుతుండగా.. అందరూ నిండుహృదయంతో, ముక్తకంఠంతో నినదించారు.

అనంతరం మహాదేవుని శరీరాన్ని రుద్రయ భుజాన వేసుకున్నాడు. స్కంధావారానికి చేరారు.

నిజానికి దేవగిరిపై యుద్ధం ప్రకటించి మొదట దండయాత్ర చేసినవాడు కాకతీయ మహాదేవరాజే. ఈయనకు ముందు కాకతీయరాజ్యాన్ని పాలించిన తన అన్న రుద్రదేవరాజు మరణానికి జైత్రపాలుడే కారణం అని మహా దేవుడి అభిప్రాయం.

అనుమకొండకు పక్కలో బల్లెంలా ఉంది దేవగిరిరాజ్యం. ఇరురాజ్యాలమధ్య ఐదేళ్ళుగా నిరంతరం యుద్ధాలు తప్పడంలేదు. సేవణులుగా పిలవబడే యదువంశానికి రాజు జైతుగి అనబడే జైత్రపాలకుడు.. శత్రు భీకరుడు. ఇటీవల కాకతీయులపై కత్తికట్టాడు. క్రీ.శ. 1195లో రుద్రదేవుడి మరణంతో కాకతీయరాజ్యానికి పరీక్షాకాలం ఎదురయ్యింది. రుద్రదేవుడు నిజమైన మహానేత. ప్రజలు రుద్రదేవుడ్ని మర్చిపోలేకపోతున్నారు.

సైన్యమంతా స్కంధావారానికి చేరేసరికి అనుమకొండ నుండి మహాప్రధాని గంగాధరమంత్రి, మంత్రులు శాక్య శివుడు, భరద్వాజుడు తదితర ముఖ్యులు వార్త తెలియగానే హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మహా రాజు మరణించిన విషాదం కంటే యువరాజు అదృశ్యం వారిని మరింత భయపెడుతోంది.

"యువరాజును కూడా ఆ దుర్మార్గులు సంహరించారేమో..?!!"

రుద్రసేనాని ఆ మాటను ఖండించాడు. శత్రువును ఎవరైనా యుద్ధభూమిలోనే చంపుతారు. తమ కోటకు తీసు

కుపోయి తీరుబడిగా చంపరు. కేవలం అధిక ప్రయోజన లావాదేవీల కోసమే

రాజకుటుంబీకులను బందీలుగా తీసుకుపోతారు. కానీ చిత్రంగా దేవగిరిరాజ్యం కాకతీయులపై గెలిచింది. కాబట్టి కాకతీయరాజ్యాన్ని ఆక్రమించు కోవచ్చు. సహజంగా యుద్ధానంతరం ఓడిన రాజ్యపు ఛత్ర కేతనాలను చిన్నాభిన్నం చేసి అవమానిస్తుంది.

సప్తాంగాలను స్వాధీనపరచుకుంటుంది. దీనిపై ఇరుపక్షాల సంధివిగ్రహిలు సమావేశం కావాలి. యుద్ధానంతర

కార్యకలాపాలు ఏమీ జరగలేదు. కేవలం మహారాజును సంహరించి, యువరాజునుబంధించి సైన్యంతోసహా వెళ్లి

పోయాడు దేవగిరి మహారాజు జైత్రపాలకుడు.

కిం కర్తవ్యమ్ ? ఇప్పుడు మనం ఏమి చెయ్యాలి??

***

"కిం కర్తవ్యం?" అంతవరకూ చెప్పి ప్రశ్నించాడు ఎలకుర్తి మండలేశ్వరుడు రేచర్ల రుద్రయ.

"చెప్పండి. అప్పుడు నా మనఃస్థితి.. ఇటు మహారాజు పార్థీవదేహం, అటు యువరాజు అదృశ్యం, గెలిచిన రాజు వాళ్ళ కోటలోకి వెళ్ళి ద్వారాలు మూసుకోవడం.. మేమంతా ఓడిపోయి వాడి కోట ఈవల స్కంధావారంలో దిక్కుతోచక నిలబడిపోవడం. అప్పుడు నేనేమి చెయ్యాలో.. చెప్పండి.." అన్నాడాయన.

అప్పుడాయన ఆతుకూరిపురం గ్రామంలో రుద్రేశ్వర దేవాలయం ఆరుబయట రాతిబండలపై కూర్చుని ఉన్నా డు. ఆయన ముందు ఓ పాతికమంది వద్దంకులు కూర్చుని రెప్పవేయ్యకుండా ఆయన చెప్పేది వింటున్నారు. అందరి మనస్సులో అదే ప్రశ్న.. అప్పుడు రుద్రయ ఏమి చేసి ఉంటాడు?!

ఆయనను అడగడం ఉత్సుకత కొద్దీ అడిగేశారు గాని ఆయనే ఇలా ప్రశ్నిస్తే ఏమి చెప్పాలో వాళ్ళకు తోచలేదు.

ఆరోజు శ. సం. 1135 శ్రీముఖనామ సంవత్సరం మధుమాస వసంత శుక్లపక్ష సప్తమి శనివారం.

తెల్లవారితే అంటే రేపే అష్టమి ఆదివారంనాడు పుష్యమి నక్షత్రాన రుద్రేశ్వరుడి ప్రతిష్టాపన ముహూర్తం. (క్రీ.శ1213 మార్చి31.)

%ప్రారంభించిన యాభైఏళ్లకు రుద్రేశ్వరాలయం పూర్తయ్యింది. ప్రతిష్టాపనోత్సవానికి అలంకారాలు జరుగుతుండ గా అక్కడక్కడా తుది మెరుగులు దిద్దుతున్నారు శిల్పులైన వద్దంకులు. దేవాలయనిర్మాత, కాకతీయ సకల సైన్యాధ్యక్షుడు, మండలేశ్వరుడు రేచర్లరుద్రయ పక్షంరోజులుగా అక్కడేఉంటూ ముగ్గురు మహావ్యక్తులు కలలు గన్న ఆ

దేవాలయ పూర్తిరూపాన్ని దగ్గరుండి తృప్తిగా చూసుకుంటున్నాడు. ప్రక్కన రుద్రయ తల్లిదండ్రుల పేర్ల పై నిర్మిస్తున్న కాటేశ్వర, కామేశ్వర ఉపాలయాలు, నంది మండపం, లిఖిత శాసనం, దాని కోసం ప్రత్యేక మండపం.. నిర్మాణం కూడా పూర్తయ్యాయి.

పొద్దు ఏటవాలింది. పటమటిగాలి చిందులు వేస్తూ రివ్వురివ్వున చక్కిలిగింతలు పెడుతోంది.

దూరంగా ఆతుకూరు చెరువు తవ్వకం జరుగుతోంది. చెరువులోని మట్టిని తట్టలతో ఎత్తి ఎడ్లబళ్లలోకి పోస్తు న్నారు మట్టి మనుష్యులు. వారి పాటలు, మాటలు ఎడ్ల మెడళ్ళలోని చిరుగంటల సవ్వడిలో కలగలిసి గాలిలో తేలి వస్తూ కర్షక లోకపు కల్యాణానికి నాందీ గీతాల్లా చెవులకు సోకుతున్నాయి.

ఇక్కడ శిల్పుల ఉలిశబ్దాలు రాతికి దెబ్బతగులుతుందేమోనన్నస్పృహతో మంద్రంగా కళపెళలాడుతున్నాయి. అనుమకొండ వేయి స్థంభాలగుడి, ఈ ఆతుకూరు రుద్రేశ్వరాలయం రెండూ ఎప్పుడో మహారాజు రుద్రదేవుని ఊహల్లో పురుడు పోసుకున్నవే. క్రీ.శ. 1163లోనే అనుమకొండ వేయిస్థంభాలగుడి పూర్తవ్వగా ఈ గుడి మరో యాభై ఏళ్లకు ఇప్పుడు పూర్తిరూపం దాల్చింది. పునాది నుండి విమాన కలశం వరకూ అణువణువూ ప్రత్యేకత లతో యాభై ఏళ్లపాటు ఎందరో మహామహుల ఆలోచనలు, భావనలు కలగలిపి వాటికొక ఆకారం సాకారం చేసినవాడు ప్రధాన స్థపతి రామప్ప. ఎదురుగా సమున్నతంగా భాసిస్తోన్న విమాన గోపురాన్ని చూస్తూ పుల కించిపోతున్న రుద్రయకు దగ్గరగా ఓ ప్రశ్న వినవచ్చింది.

"మహాసేనాని.. కాకతీయవంశం ఆంధ్రసామ్రాజ్యాన్ని స్థాపించడానికి అహర్నిశమూ పోరాడుతున్న వంశంగా..

గణపతిదేవమహారాజు కాబోయే చక్రవర్తి అని స్థపతి రామప్ప మాతో అన్నారు. అందుకు కారణం మీరేనని.. ఆనాడు గణపతిదేవుని శత్రుసేనలు బందీని చేసి తీసుకుపోతే మీరు చేసిన గొప్పనిర్ణయాల వల్లనే కాకతీయ కేతనం అవనతం కాకుండా తిరిగి సమున్నతంగా ఎగురుతోందని అందరూ చెప్పుకుంటారు. అంతటి క్లిష్ట సమ యంలో ఇంటాబయటా మీరెంత కఠినపరీక్షలు ఎదుర్కున్నారో.. గణపతిదేవులవారిని తిరిగి కాకతీయ సింహా సనంపై ఎలా ప్రతిష్టించారో.. తెలుసుకోవాలని కోరికగా ఉంది స్వామి.."

ఓ యువశిల్పి దగ్గరగా వచ్చి అన్నాడు. విన్నాడు రుద్రయ. అప్పుడాయన చూపు గర్భాలయద్వారంపై భార్య అన్నమ తో సహా చెక్కిన తమ మిధునశిల్పం పై నిలిచివుంది.

అతని ప్రశ్నకు రుద్రయ ఏమిజవాబు చెబుతారోనని, ఉలిశబ్దాల మధ్య ముచ్చట్లు చెప్పుకోవడం అలవాటున్న వద్దంకులంతా చెవులు రిక్కించారు. రుద్రయ నిశ్శబ్దంతో ఆ యువశిల్పి మరో ప్రశ్న సంధించాడు.

"మీరే ఎందుకు అనుమకొండ సింహాసనాన్ని ఆక్రమించలేదు.. రేచర్ల వంశపాలనను ఎందుకు ప్రారంభించ లేదు?" ఇబ్బందిగా కదిలాడు రుద్రయ.

ఈ ప్రశ్న ఎప్పుడూ ఎవరో ఒకరు అడుగుతూనే ఉంటారు. తనేదో గొప్ప త్యాగంచేశానని.. ఘనకార్యం సాధించా నని చెప్పుకోవడం ఆయనకు సుతరామూ ఇష్టం ఉండదు. కానీ ఇప్పుడు ఇక్కడ ఈ సమయలో ఆయనకు చెప్పాలనిపించింది. కారణం ఆ శిల్పి అన్న ఒక మాట.. "ఇంటా బయటా.."

అవును. అందరూ అడిగేది వినేది చూసేది బయటజరిగిన మంత్రాంగం.. యుద్దాలు. కాని ఇంట జరిగిన సంఘ టనలు ఎవరూ ఎప్పుడూ అడగలేదు. తనూ ఎప్పుడూ ఎవ్వరికి చెప్పలేదు. నిజానికి చెప్పకూడనివి!!

ఆనాడు తన ఇంట జరిగిన సంఘటనలు.. ఇంటి పోరు.. గుర్తొచ్చి నవ్వుకున్నాడు రుద్రయ. ఆయన నవ్వు చూసిన శిల్పులంతా ఉలిలు ప్రక్కన పడేసి ఆయన ప్రక్కకు చేరారు. ఇక చెప్పక తప్పింది కాదు రుద్రయకు.

ఆ క్లిష్టసమయం క్రీ.శ. 1199 లో వచ్చింది.

దేవగిరిరాజు బంధించి తీసుకుపోయిన గణపతిదేవుని ఎన్నో టక్కుటమారవిద్యలను ప్రదర్శించి తిరిగి కాకతీయ

సింహాసనంపై కూర్చుండబెట్టిన సేనానుల బృందానికి అధినాయకుడు రేచర్ల రుద్ర సేనాని. కాకతీయ రాజ్యమే కాదు సర్వదేశాలు ఆయన తంత్రజ్ఞతను.. ముఖ్యంగా ఆయన త్యాగాన్ని వేనోళ్ళా కీర్తించాయి.

గణపతిదేవుడయితే కన్నతండ్రిలా చూస్తాడు. 'కాకేత రాజ్యభార ధౌరేయుడు' అన్న బిరుదునిచ్చి, సైన్యంలో సర్వ సైన్యాధ్యక్షుడు పైన సలక సైన్యాధ్యక్షుడు అనే అత్యుత్తమపదవి సృష్టించి జీవితాంతం ఆయనే ఉండేలా పేరోలగంలో ప్రకటించి తన కృతజ్ఞత చాటుకున్నాడు. రాజధాని అనుమకొండలో, నిర్మాణమౌతున్న క్రొత్త రాజ ధాని ఓరుగల్లులో.. రాజ్యంలోని ఏ ప్రాంతానికి వెళ్ళినా ఎదురయ్యే ప్రజల చూపుల్లో కనపడే ఆరాధన.. అభినం దన ఆయన ఈ పదిహేనేళ్ళుగా అనుభూతిస్తూనే ఉన్నాడు.

కానీ రుద్రసేనాని స్థితప్రజ్ఞుడు. తొణకని నిండు కుండ. నిత్యమూ కాకతీయ చత్ర కేతనాల పరిరక్షణే ఆయన ధ్యేయం. చెరువుల, దేవాలయ నిర్మాణం దైవప్రేరిత ప్రసాదాలుగా భావిస్తూ నిర్మిస్తూ జీవితాన్ని చరితార్థం చేసుకుంటూ సాగిపోతున్నాడా కర్మయోగి.

దేవగిరిపై యుద్దానికి పోయి మహారాజు మహాదేవుడు మరణించడం, యువరాజు గణపతిదేవుడు అదృశ్యం కావడం, కాకతీయ స్కంధావారం ఏమి చెయ్యాలో తోచక నిలబడిపోయిన సంఘటన వరకు చెప్పి అడిగాడు రుద్రసేనాని. "కింకర్తవ్యం?"

ఎవ్వరూ చెప్పలేనట్లు మాట్లాడలేకపోయారు. తనే కొనసాగించాడు.. బయట జరిగినవి చెబుతూ ఇంట జరిగి

నవి మనసులో మననం చేసుకుంటూ..

గెలిచినరాజు ఓడిన యువరాజును బంధించి తీసుకుపోయి నిశ్శబ్దంగా ఉండటంలో

ఆంతర్యం ఏవిటి..? మన

కాకతీయమంత్రులు, సేనానులు తీవ్రంగా బుర్రలు పగలగొట్టుకుంటున్నారు స్కంధావారంలో. కలుగులో దాగిన

ఎలుకను ఎలా బయటకు లాగాలి అనేది అందరి ఆలోచన. సాధారణంగా జరిగే దౌత్యవిధానం సంధివిగ్రహిని పంపడం. అదే చేశాడు రుద్రసేనాని. సంధివిగ్రహి పాపయబట్టారకుడు వెళ్లి పక్షం రోజులయినా తిరిగి రాలేదు. కానీ మహాప్రధాని గంగాధరమంత్రి ఉద్దండుడు. ఓరుగల్లునగర అధ్యక్షుడు ఇందులూరి పెదమల్లనను, నియోగాధిపతులను, బహాత్తరనియోగాధిపతి దమ్మవీరను.. అందరిని హెచ్చరించాడు. ప్రజల దైనందినంలో ఎలాంటి ఒడుదుడుకులు ఉండరాదని ఆజ్ఞలు జారీచేశాడు. రాజ్యమంతటా ఎక్కడా నిత్యావసరాల కొరత ఉండకూడదని వర్తక సమయాల శెట్టిలందరికి వర్తమానం పంపాడు. రాజ్యమంతా ప్రశాంతత ఉన్నా ఏదో నిగూఢమైన బాధ రాజ్యమంతా వ్యాపించి వుంది.

రోజురోజుకు రుద్రయ అల్లకల్లోలమై పోతున్నాడు. మహాయోధుడైన రుద్రయకు అద్భుతమైన పోరాటపటిమ తప్ప రాజకీయం చాతకాదు. ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవం లేదు. అదే అన్నాడు గంగాధరమంత్రితో. ఆయనతో ఘడియ ఘడియకు చర్చిస్తున్నాడు. వార్తాహరులు అటూఇటూ అశ్వాలపై పరు గులు పెడుతున్నారు చర్చల లేఖలతో.

“మనం తెగించి కోట మీదికి పోదామంటే మనం కోట ఘడియలు తెరిచేలోగా..”

“వద్దు వద్దు.. నీభయం నిజమే. యువరాజుకు ఏదైనా కీడు తలపెట్టవచ్చు జైతుగి..” అన్నాడు గంగాధరుడు.

ఆ గంగాధరుడే మరునాడు ఓ వ్యక్తిని వెంటబెట్టుకుని స్కంధావారానికి వచ్చాడు.

“రుద్రా.. ఇతను మన చారుడు. దేవగిరికోటలో పూలమాలవాడుగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు వార్తలు మనకు చేరవేస్తాడు. జైతుగి గురించి ఆసక్తికరమైన సంగతి చెబుతున్నాడు.. విను..” అన్నాడు.

రుద్రయ ఆసక్తిగా చూశాడు.. “చిత్తం మహాసేనాని. జైత్రపాలకుడు పెద్ద గందరగోళం మనిషి. బంధించి తెచ్చిన యువరాజు గణపతిదేవులవారిని ఏమి చెయ్యాలో తెలియడం లేదాయనకు. కొన్ని రోజులు రాజమందిరంలో ప్రత్యేక గదిలో ఉంచుతున్నాడు. కొన్నిరోజులు కారాగారంలో సంకెళ్ళతో కట్టి వేయిస్తున్నాడు. అసలుఎందుకు బంధించామూ!? అని సేనాపతులను అడుగున్నట్లు వినవచ్చింది.”

రుద్రయ ఆశ్చర్యపోయాడు. గంగాధరమంత్రితో, ఇతర యుద్దసేనానులతో చర్చించి దేవగిరిరాజు జైత్రపాలుని గందరగోళానికి తగినట్లు తమ యుద్దతంత్రాలు ఉండాలని నిర్ణయించారు.

అ మర్నాడు రుద్రయ ఊహించని సంఘటన జరిగింది.

ఉదయాన్నే రుద్రయభార్య అన్నమ ముగ్గురు కొడుకులు లోకచమూపతి, పెద్దగణపతి, కాటయలను వెంట బెట్టుకు వచ్చింది. స్వతస్సిద్ధమైన వీరత్వంతో ఎదిగిన ముగ్గురూ చమూపతులుగా కాకతీయ సైన్యంలో గౌర వం పొందుతున్నారు. వారి ముఖాలు వెలిగి పోతున్నాయి. మహారాజు మరణించిన విషాదంగాని, యువరాజు బంధి అయిన బాధగాని లేదు సరికదా వారి ముఖాలలో తెలియని ఆనందం తుళ్ళిపడుతోంది.

ఆమె రుద్రయ గొల్లెనలో ఉన్న వారందరిని బయటకు వెళ్ళమని సంజ్ఞ చేసింది. వెళ్ళాక ఏకాంతంగా దగ్గరకు వచ్చి అన్నది, "అనుమకొండ అంతటా.. మీరే కాబోయే మహామండలేశ్వరులని చెప్పుకుంటున్నారు."

తుళ్ళిపడ్డాడు రుద్రసేనాని. అప్పుడర్ధమయ్యింది వాళ్ళ ముఖలలోని వెలుగుకు ఆధారం. ఇలాంటి మాట ఏదో

ఇక్కడ స్కంధావారంలో కూడా గుసగుసగా అనుకుంటున్నట్లు చెవిన పడింది. కానీ పెడచెవిన పెట్టాడు.

"అలాంటిది ఏమీలేదు. వెళ్ళండి. ఇది చెప్పడానికా యుద్ధభూమికి వచ్చింది?!.." అన్నాడు తీవ్రంగా.

ముగ్గురూ తండ్రి ఇలాగే అంటాడని ఊహించగల యుక్తవయస్కులే. తండ్రిగారి ఈ కోపం మనం ముందే అను

కున్నాం కదా అన్నట్లు నలుగురూ ముఖాలు చూసుకున్నారు. పెద్దకొడుకు లోకయ చమూపతి అన్నాడు, "తండ్రి.. మన రేచర్లవంశచరిత్ర, మన తాతముత్తాతల మహోన్నత వీరత్వాలు.. అన్ని మీకుతెలుసు. మీ శక్తి యుక్తులు జగత్విఖ్యాతమే కదా. మీరు అనుమకొండ సింహాసనాన్ని అధిరోహించినట్లయితే ఎదురు ప్రశ్నించే వారెవ్వరూ లేరు. మీరు ఆ దిశగా ఆలోచన చేయకూడదా?! కాకతీయరాజ్యం తిరిగి మీ నాయకత్వాన రేచర్ల రాజ్యంగా ప్రభవిస్తుంది.."

"నోర్ముయ్..ఎవరునీకు ఈఆలోచన నూరిపోసింది? పొండి వెళ్ళిపొండి.." అరచాడు రుద్రసేనాని. మరో కొడుకు అన్నాడు, "ఇది మా అభిప్రాయమేకాదు నాన్నగారూ. మీకు చెప్పలేక ఎందరో మీవెనుక అనుకుంటున్నారు."

ఉద్వేగమూ రౌద్రమూ కలగసిన ఆయన ముఖం చూసి మౌనంగా నిష్క్రమించారు నలుగురూ.

ఇది వీళ్ళకుపుట్టిన బుద్దా.. లేక ఇతరులుకూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తూ ఇదే కాకతీయ రాజ్యానికి మంచి, సులభమైన పరిష్కారంగా భావిస్తున్నారా?! వాళ్ళు భావిస్తున్నట్లే తను రాజ్యాధికారం ప్రకటించుకుంటే తప్పేముంది.. ఇప్పటికే తనొక మండలేశ్వరుడు.. పరిపాలనలో తగినంత అనుభవముంది. తమ రేచర్ల వంశా నికి, కుటుంబానికి ఎంతో

ఘనచరిత్ర ఉంది.

ఎందులో? అవును ఎందులో..??

విశ్వసనీయతలో! తిరుగులేని యుద్ధ కౌశలంలో!!

కాని విశ్వాసఘాతుకంలో లేదు. అతనికి వెంటనే రేచర్ల ముచ్చారెడ్డి గుర్తొచ్చాడు. స్వయంగా అతని అన్న.

ఆయన చేసిన విశ్వాసఘాతుకానికి మహారాజురుద్రదేవుడు ఎంత వ్యధననుభవిచాడో రుద్రయకు నరనరానా వ్యాపించి ఉంది. తను ఎప్పుడూ ఆ తప్పు చెయ్యడు. కాకతీయసామ్రాజ్య స్థాపన పరిపూర్ణం కావాలి. తెలుగు మాట్లాడేవారి ప్రాంతమంతా ఏకరాజ్యంగా ఏకఛత్రం క్రిందికి రావాలి. క్రొత్తగా నిర్మిస్తున్న ఓరుగల్లు మహానగరమై ఆంధ్ర ప్రజల రాజధానిగా జగత్ప్రసిద్ధం కావాలి.

రుద్రదేవుడు తనను ప్రాణప్రదంగా చూశాడు. మహాదేవుడు, గంగాధరుడు, తను.. ముగ్గురం స్వంత అన్నద మ్ములా అన్యోన్యంగా ఉండటం చూసి ఆయన ఎంతో ఆనందించేవాడు.

"మనం ఆంధ్రసామ్రాజ్యం స్థాపించాలి రుద్రా.. అందుకు మనం ఎంతో పోరాడాలి. అప్పుడే మన ఆశయం రూపు దాలుస్తుంది. సమాజం ఎన్నో తరాలు మనల్ని కొలుస్తుంది. చరిత్ర మనకొక అధ్యాయం లిఖిస్తుంది.."

ఎంత అద్భుతమైన భావన.. ముగ్గురిలో అవి నరనరానా ఇంకిపోయాయి. ముఖ్యంగా గణపతిదేవుడు ఆయ నకు ప్రతిరూపంగా ఎదుగుతున్నాడు. అందుకే ఆయన తమ్ముడి కొడుకైన గణపతిదేవుడ్ని దత్తత తీసుకు న్నాడు. మహాదేవుడు కూడా అన్నమాటకు ఏనాడూ ఎదురాడి ఎరుగడు.

కాని ఊహాతీతంగా మూడేళ్ళలోనే పరిస్థితులు తిరగబడ్డాయి. ఇప్పుడు తనను అనుమకొండ సింహాసనాన్ని ఆక్రమించమని కోరుతున్నారు. ఆక్రమించాలట.. తను ఎలా అంగీకరిస్తాడు?!

రుద్రయ ఆలోచనలను భగ్నపరుస్తూ మహాప్రధాని గంగాధరమంత్రి మరో గూఢచారిని వెంటబెట్టుకు వచ్చాడు. వెనుక బేతిరెడ్డి, బొల్లయ, మల్యాల చౌండ తదితర సేనానులు, మండలేశ్వరులు..

"రుద్రా.. ఈ గూఢచారి చెప్పేది విను. మనం మన ప్రజలకోసం గణపతిదేవుడు కోటలోనే ఉన్నాడని చెబితే

అక్కడ జైతుగి అది నమ్మేసి కంగారుపడుతున్నాడట. గణపతిదేవుడు కోటలోనే ఉంటే మరి మనం బంధిం

చింది ఎవరిని? అసలైన కాకతీయ వారసుడినా లేక మరొకడినా అని అందరి మీదా అరుస్తున్నాడట.."

గూడచారి అవునన్నట్లు తలఊపాడు వినయంగా. రుద్రయతోపాటు ఇతర సేనానుల ముఖాల్లోకూడా విభ్రమ!

"అసలే గందరగోళం గాడు.. యువరాజుకు ఏదైనా ఆపద తలపెడితే.." చెరుకు బొల్లయ సంశయించాడు.

అందరూ ఆ భయసంశయంలో ఉండగా గంగాధరుడు అన్నాడు, "వాడికి అడ్డుకట్ట వెయ్యడానికి మన పాపయ

భట్టారకుడు ఉన్నాడుకదా.." అంతా ఆయనవంక చూశాడు. "సంధివిగ్రహిగా వెళ్ళిన పాపయభట్టారకునికి దేవ గిరి ప్రధానమంత్రి బసవరసుడు తన ఇంట ఆతిధ్యం ఇచ్చాడు. ఆయన మన పట్ల కొంచం సావదానంగా ఉన్నా డు. ఆయన మాట జవదాటడు జైతుగి. అందువల్ల పాపయ అక్కడ ఉన్నంతకాలం యువరాజు గణపతిదేవు ని ప్రాణాలకు ముప్పు రాదు.."

అంతా ఊపిరి పీల్చుకున్నారు. గంగాధరమంత్రిని ప్రశంసాపూర్వకంగా చూశారు.

"మరొక విషయం.. దేవగిరి మరోమంత్రి హేమాద్రి పంత్ కుమార్తెకు మా అబ్బాయిని ఇచ్చి వివాహం చెయ్యడా నికి నిశ్చయ తాంబూలాలు అయ్యాయి. ఈలోగా ఈ యుద్ధం ముంచుకు వచ్చింది. వచ్చే మాఘమాసంలోనే ముహూర్తం..." వివరించాడు గంగాధరమంత్రి.

బేతిరెడ్డి నవ్వాడు. " రుద్రదేవమహారాజు యుద్దనీతినే నువ్వూ పాటిస్తూ శత్రురాజ్యంతోనే వియ్యమాడుతున్నా వన్న మాట.. గంగాధరా.."

"అవకాశం అలావచ్చింది బేతిరెడ్డి.."

"ఇవ్వాళ శత్రురాజ్యం రేపు మిత్రరాజ్యం కావచ్చు కదా బేతిరెడ్డి.." అన్నాడు మల్యాల కాటయ. రుద్ర సేనాని కొంచం తెప్పరిల్లాడు. అతనికి తనవీరత్వానికి గంగాధరుని వ్యూహాచాతుర్యం బాగా జతకలుస్తుందని నమ్మకం. ఈ పెళ్లిబంధుత్వం అందరిలో క్రొత్త యుద్దవ్యూహాలకు ఊపిరులూదింది. అందరూ తీవ్రంగా ఆలోచిస్తుండగా అన్నాడు గంగాధరుడు.

"నాకొక ఆలోచన వచ్చింది.." అందరి వంక చూసి చెప్పాడు. "మన రుద్రయకొడుకు గణపతిని కొంతకాలం యువరాజుగా సింహాసనంపై కూర్చోబెడదాం. మనకోటలో కూడా దేవగిరి గూఢచారులున్నారు. అందువల్ల అక్కడ కొంత గందరగోళం కొనసాగించవచ్చు.."

అందరూ చప్పట్లు కొట్టారు. "భేష్ గంగాధరా.. ఎంతయినా రుద్రదేవులవారి అనుంగు శిష్యుడవు. ఆయన బుర్ర పూర్తిగా నీకు వచ్చేసింది.." అంతా ఆనందంగా తలొక మాటా అన్నారు గాని ఏమీమాట్లాడకుండా ఉండిపోయా డు రుద్రయ. కారణం అతనికి తప్ప ఎవ్వరికి తెలియదు.

అందరూ బయటకు వెళ్ళాక లోపలికి వచ్చి రుద్రయకు చేతులెత్తి నమస్కరించాడు

గణపతి, రుద్రసేనాని రెండవ కుమార రత్నం. నవ్విన రుద్రయ ముఖంలో జీవంలేదు. తన కొడుకు నిజంగానే యువరాజుగా సింహా సనంపై కూర్చోబోతున్నాడు. అతనికి కుటుంబ సహకారమే కాదు అపరచాణక్యుడు గంగాధరుని ఆశీస్సులు కూడా ఉన్నాయా??

మరునాడు భార్య అన్నమ వచ్చింది. ముఖం మధ్యాహ్నసూర్యబింబంలా వెలిగిపోతోంది.

" తండ్రి గారి ఆశీస్సులు లభించాయని మీ ముద్దులకొడుకు మురిసిపోతున్నాడు.." అన్నది.

ఏమి చెప్పాలి ? తనెందుకు ఈ పరిణామాలకు సంతోషించడం లేదు??

"తండ్రి అధిరోహించని సింహాసనం కుమారుడు అధిరోహించడం.. భలే.. ఆశ్చర్యంగా ఉంది కదూ.. నాకైతే గొప్ప

గర్వంగా ఉంది స్వామీ.." తల్లిగా పులకించిపోతోంది. ఇది మూడునాళ్ళముచ్చట అని వీళ్ళకు తెలియదా..

వీళ్ళతో గంగాధరమంత్రి కూడా చేతులు కలిపాడా.. ఆయన ఆ రాజ్య మంత్రితో వియ్యమందబోతున్నాడు. ఆయన గణపతికి మాట ఇచ్చాడా.. వీళ్ళంతా కలిసి తనపేరు చాటున గూడుపుఠాణి చేస్తున్నారా.. అయితే

యువరాజు గణపతిదేవుని ఏమి చెయ్యబోతున్నారు.. వీళ్ళే ఏదో చేసి జైతుగి మీదికి తోసేస్తే?!

అన్నమ అన్నది, " నా కొడుకు సింహాసనంలో కూర్చోబోతున్నవేళ వాడి వెంట కాకతీయ కేతనం, ఛత్రం, వీవెనలు, పంచశబ్దాలు.. లాంటి సకలలాంఛనాలూ ఉంటే.. అది కన్నులపండువగా ఉంటుంది. మహారాజు మహాదేవునితో అవన్నీ ఇక్కడే యుద్ధభూమికి వచ్చాయట. మీరే వాటిని భద్రపరచారట. స్వామీ.. మీకొడుకు సింహాసనం అధిష్టించేవేళ.." ఆమె మాటలను తొట్రుపాటుతో ఖండించాడు రుద్రయ. "లేవు లేవు. అవి మహా

రాజు పార్థివదేహంతో పాటు ఆరోజే గంగాధరమంత్రి అనుమకొండకు తీసుకువెళ్ళాడు. నాదగ్గర లేవు. అయినా

తొందరపడుతున్నావు అన్నమా.. మన గణపతి కాకతీయసింహాసనంలో కూర్చోవడం నాకు అంగీకారం కాదు.

కుక్కపని కుక్క చెయ్యాలి.. గాడిద పని గాడిద చెయ్యాలి.."

"నా కొడుకు కుక్క, గాడిద కాదు.. జవనాశ్వం.. మహాయుద్ధ గజం.." రోషంగా అంది.

అనునయంగా ఆమె భుజంపై చెయ్యివేసి, "చూడు అన్నమా.. కొడుకు ప్రయోజకుడైతే సంతోషించని తండ్రిని కాను నేను. కానీ మన వంశ దృక్కోణం అది కాదు. నాకు ఇష్టంలేని దానిని నువ్వు ఆచరిస్తావా.. చెప్పు." అతని మాటలోని మమత, గొంతులోని మార్దవంకు ఆమె జవాబుచెప్పలేక భోరున ఏడ్చింది. పరిపూర్ణమైన రుద్రయ వ్యక్తిత్వం ఆమెకు తెలుసు. భర్త అడుగుజాడల్లో కదిలే సాధ్విలలామ ఆమె. ఎదిగిన కొడుకులను చూసుకుని ఆనందించే

సగటు రాచరిక తల్లి. కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది. నిరత్తరుడై నిలబడిపోయాడు రుద్రయ.

తన సంశయాత్మక చిత్తం, నిర్ణయం తీసుకోవడంలో డొల్లదనం ఆయనకే తెలుస్తోంది.

రాజు ఉన్నాడో లేడో తెలియని స్థితిలో బలహీనమైన కాకతీయరాజ్యం పట్ల ప్రధాన రాజ్యాలు చూస్తూ కూర్చో లేదు. అన్ని వైపులా దాడికి సమాయత్తమౌతున్నారని వార్తలొస్తున్నాయి. వార్తలకన్నా వేగంగా శత్రుసేనలు నలుమూలలా చుట్టుముడుతున్నారు. వెలనాడు పృథ్వీశ్వరుడు ప్రక్కనున్న మన సామంతరాజ్యాలను ఆక్ర మించుకుంటున్నాడట. తూర్పునుండి కులోత్తుంగచోళుడు ఓరుగల్లు వైపు దూసుకొస్తున్నాడట. పడమర ముదిగొండ నాగతిభూపాలుడు కొరివి మండలంవరకు వచ్చేసినట్లే.. దక్షిణాన మరొకడు.. మరొకడు..

అంతర్గతంగా కూడా వేర్వేరు ఆశావహులు వాళ్ళతో చేతులు కలుపుతున్నట్లు అనుమకొండలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

రుద్రయకు మళ్ళీసందేహం.. తనకొడుకు గణపతిచమూపతి ఎవరితోనైనా చేతులు కలుపుతున్నడా.. ఎవరైనా సేనానులు, మండలేశ్వరులు అతనిని ఆమోదిస్తున్నారా.. ఫ్చ్.. ఇలా అలోచించడం రుద్రయకు క్రొత్త.. ఈ కుట్రలు కుతంత్రాలు ఊహకందవు. యుద్ధభూమిలోకి దూకడమే సులువు.

మహాసేనానులు, ప్రధాని గంగాధరుడు, ఇతరమంత్రులు కూడా సమాయత్తమై యుద్ధతంత్రం రూపొందించారు.

అందరి ఆశయం వొక్కటే.. కాకతీయ కేతనం సముజ్వలంగా ఎగిరి తీరవలసిందే. కాకతీయ ఛత్రం సింహాసనం వెనుక సమున్నతంగా నిలబడవలసిందే.

ఒక ఓటమి చవిచూసి విజయంకోసం పరితపిస్తూ స్కంధావారంలోనే ఉన్న కాకతీయసేనలు సమధికోత్సాహం తో మహాయోధుల నాయకత్వాన నలువైపులా దూసుకుపోయాయి.

అన్నివైపులా శత్రువులను నిలువరించడం, తరమడం ప్రారంభమైంది. దేవగిరి దగ్గర స్కంధావారంలోనే ఉంటూ

అన్నివైపులా యుద్ధంచేస్తున్న కాకతీయసైన్యాన్ని సమన్వయం చేస్తున్నాడు రుద్రసేనాని. అన్నివైపులనుండి శుభవార్తలే వినవస్తున్నాయి. కసితో ఉన్న సైన్యం వీరవిహారం చేస్తోంది.

ఆ సమయంలోనే గంగాధరమంత్రి మళ్ళీ మతి చెడగొట్టాడు. "నీ కొడుకు.. అదే.. మన యువరాజు గణపతి

చమూపతి.. గొప్పగా నటిస్తున్నాడు. నిజమైన యువరాజు గణపతిదేవుడుకూడా అలా ప్రవర్తించలేడేమో.. దేవగిరి గూఢచారులను గుర్తించి వారిముందు మరీ జీవిస్తున్నాడు అచ్చమైన యువరాజులా.."

మళ్ళీ దిగులు ఆవహించింది రుద్రయను.

రేపు అసలైన యువరాజు వచ్చాక వీడు సింహాసనం దిగను అంటే..

గంగాధరమంత్రి కూడా వీడినే కూర్చోబెట్టేలా ఉన్నాడు. ఆయన విజయవంతంగా తిరిగి వస్తే అప్పుడు ఏమి

జరుగుతుందో.. రుద్రేశ్వరా.. నువ్వే దిక్కు..

కాకతీయసైన్యం తలో దిక్కునా మొహరించి శత్రుసైనికులను ఎదుర్కోవడం అనుమకొండవాసుల్లో ఆనందం కలిగించింది. కారణం యువరాజు గణపతిదేవుడు మంచి యుద్ధతంత్రాలతో నాయకత్వం వహిస్తున్నాడని ప్రజలు భావించడం. అది తెలిసి రుద్రయ మరీ గందరగోళమై పోయాడు.

అప్పుడే గంగాధరుడు స్కంధావారానికి వచ్చాడు. "రుద్రా.. నాకో ఆలోచన వచ్చింది. నిజానికి దేవగిరి సేణువు లకు ప్రధానశత్రువు మనం కాదు. హొయసల బల్లాలుడు. ఇప్పటికే ఆయన సేణువులరాజ్యంలో కొంత భాగా న్ని ఆక్రమించుకున్నాడు. జైతుగి ఏమీ చెయ్యలేక నిస్సత్తువగా ఉండగా, తగుదునమ్మా అని మనం దేవగిరి పై దండెత్తి అన్ని పోగొట్టుకుని దిక్కులు చూస్తున్నాం. నువ్వంటే బల్లాల మహారాజు ఇష్టపడతాడు. నువ్వే స్వయంగా వెళ్లి మన పరిస్థితి వివరించి ఆయన సహాయం అర్థిస్తే.."

ఇక చెప్పనక్కరలేదు. యుద్ధతంత్రంలో దీనికి తిరుగులేదు. దేవగిరికి తూర్పున అనుమకొండ ఉంటే దక్షిణం గా హొయసలరాజ్యం ఉంది. హొయసల బల్లాలుడు మహాయోధుడు. దేవగిరి సేణువులను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. ఇప్పటికే కొంత భాగాన్ని ఆక్రమించాడు. ఆయనకు రుద్ర దేవుడు, ఆయన తండ్రి రెండవ ప్రోల రాజు సామంతులుగా విశ్వసనీయులుగా ఉండేవారు. రుద్రసేనాని వీరోచిత యుద్ధ నైపుణ్యం ఆయనకు బాగా తెలుసు. ఎప్పుడూ ప్రశంసిస్తూ ఉంటాడు కూడా.

అప్పటికప్పుడు ముఖ్య అంగరక్షకులతో హొయసల వైపు కదిలాడు రుద్రసేనాని. "ఇక్కడి వార్తలు ఎప్పటిక ప్పుడు నీకు చేరవేస్తాను. కార్యం విజయవంతంగా నిర్వహించుకుని రా రుద్రా.." అన్నాడు గంగాధరుడు. అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చి, "జైతుగి చావు మూడింది.." అన్నాడు బల్లాల మహారాజు. " సమయం మాకు తెలియజెయ్యి రుద్రా.. మీకు సహాయంగా దేవగిరిపై దాడి చెయ్యడం తథ్యం.." అంటూ అభయమిచ్చాడు.

అక్కడ ఉండగానే మరోవార్త పంపాడు గంగాధరుడు. ముదిగొండ చాళక్యరాజు నాగతిభూపాలుడు విసురునాడు (కొరవి) మండలాన్ని స్వాధీన పరచుకున్నాడు. అనుమకొండ వైపు సాగివస్తున్నాయి అతని సేనలు.

"నాగతికి అంత ధైర్యం లేదు. అనుమకొండలోనే ఎవరో సహకరిస్తున్నారు.." గంగాధరుడి సమాచారం.

"కోటలో ఏవేవో జరుగుతున్నాయి.. మన గణపతిమీద కూడా నాకుసందేహాలు కలుగుతున్నాయి.." అన్నమ సమాచారం. ఈవార్తకు రుద్రసేనాని మహొగ్రుడయ్యాడు.

ముదిగొండ కుసుమాయుధుడిని, వాడి తమ్ముడు ఈ నాగతిని రుద్రదేవుడు ఎన్నోసార్లు తిప్పితిప్పి కొట్టాడు. అయినా వాడు సమయంచూసి ఇప్పుడు మళ్ళీ ఆక్రమ

ణ ప్రారంభించాడు. వాడికి జీవితాంతం గుర్తుండే అవమానం చెయ్యాలి.

ముఖ్య మహాసేనానులంతా వేరువేరు దిక్కులలో శత్రువులను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు తనే వాడి భర

తం పట్టాలి. పట్టరానిక్రోధంతో వాయువేగ మనోవేగాలతో అనుమకొండకు వచ్చిపడ్డాడు. అప్పటికే ఓ అక్షౌహిణీ

సేనను రుద్రయకోసం సిద్ధంచేశాడు ఆయన సేనాపతి రాజనాయకుడు. రుద్రయ యుద్ధశంఖం పూరించే నాటికే

నాగతి ససైన్యంగా వికటాట్టహాసాలతో అనుమకొండలోకి చొచ్చుకు వచ్చాడు. అతని ధాటికి అనుమకొండ పుర

వాసులు భయంతో భీతిల్లిపోతున్నారు.

అయితే కేవలం ఒక్కపూట కాలంలో నాగతి తోక విరిచేశాడు రుద్రసేనాని. రుద్రయ రాకతో రెచ్చిపోయిన కాక తీయసైనికులు నాగతిసైన్యాన్ని కకావికలు చేశారు. అనుమకొండవీధుల్లో వెంటపడి నరికి చంపారు. నాగతిని పట్టి బంధించారు. అతన్ని తన రధంవెనక చక్రానికి కట్టివేశాడు రుద్రయ. నాగతి చత్రాన్ని, కేతనాన్ని చింపి తనఅశ్వాల కాళ్ళకుకట్టాడు. ఓముక్కచింపి తన తమ్మిపడగ (ఉమ్మిబుట్ట) కు చుట్టాడు. జంట అశ్వాలు పూన్చిన తనరధాన్ని అనుమకొండ వీధివీధికి తిప్పుతూ తమ్మిపడగలో ఉమ్మివేస్తూ తీవ్రాతితీవ్రంగా అవమా నించి అనుమకొండ ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాడు. ఆసమయంలో స్థానికంగా నాగతికి సహాయపడిన వాళ్ళు ఒక్కరంటే ఒక్కరు కనిపిస్తే వొట్టు. తనకొడుకులు ఎక్కడైనా కనిపిస్తారని వో కంట వెదికాడు రుద్రయ. ఎవ్వడూ కనిపించలేదు. నాగతిని, అతని సైన్యాన్ని కొరివి దాటి, ముదిగొండ దాటి పది ఆమడల దూరం తరిమి తరిమి కొట్టి ఆనక శాంతించాడు.

ఈ సంఘటనతో కాకతీయ పౌరుషం, కాకతీయసేనానుల స్వామిభక్తి గురించి తెలుగురాజ్యాలలో ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. అన్నిదిక్కులలో ఆక్రమించుకోవడానికి వచ్చిన శత్రువులు తోక ముడిచారు.

అనంతరం తిరిగి దేవగిరి పొలిమేరల్లో ఉన్న స్కంధావారానికే వెళ్ళిపోయాడు రుద్రయ.

మరునాడు అన్నమ భర్తకు భోజనం తీసుకువచ్చింది. "ఊరిలోకి వచ్చిఇంటికి రాకపోవడం నాకెంత బాధగా ఉంటుందో అలోచించారా..?!" అంది రోషంగా. "నేను అనుమకొండకు పెళ్ళికి రాలేదు అన్నమా.. అయినా నేను తిరిగి అనుమకొండ వచ్చేది యువరాజులవారి తోనే.." అన్నాడు. ఎన్నోరోజుల తర్వాత భార్య చేతి భోజనం. తృప్తిగా తిన్నాడు. ఆమె కొడుకుల ప్రస్తావన తెస్తుందని ఎదురుచూశాడు. చివరికి తనే తెచ్చాడు,

“ఏవంటున్నారు నీ కొడుకులు?”

“తండ్రి వీరవిహారం చూసి గడగడ వణకుతున్నారు..” ఆ వొక్కమాటతో మౌనంగా నిష్క్రమించింది అన్నమ.

అతని మనసు ఏదో శంకిస్తూనే ఉంది. చారులను నియోగిద్దామంటే తన ఇంట్లోకి తనే చారులను పంపడం..

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు కదా!!

అనుమకొండలో నాగతికి జరిగిన అవమానం తెలిసి దేవగిరి జైత్రపాలకుడు క్రోధంతో రగిలిపోయాడని వార్త. గణపతిదేవుడ్నికూడా రథానికి కట్టి దేవగిరిలో తిప్పి అవమానించాలని సమాలోచనలు చేస్తున్నట్లు వేగులు వార్తలు తెచ్చారు. గణపతిదేవుడ్ని ఎలా వదిలించుకోవాలో చెప్పండని మంత్రులను అడిగినట్లు మరో వార్త.

***

దేవగిరి పట్టణం బ్రాహ్మణవీధిలో హేమంత పంత్ ఇంట పెళ్లి బాజాలు మ్రోగుతున్నాయి.

అత్యంతరమణీయంగా అలంకరించిన వివాహవేదిక.. ప్రక్కగా ఉజ్వలంగా మండుతున్న అగ్నిహోత్రం.. అన్ని ప్రక్కలా కూర్చుని ఏకకంఠంతో వేదగానం చేస్తోన్న వేదవేదాంగపారంగతులు, మహారుషులు. అదొక బ్రాహ్మణ వివాహవేదుక కావటాన అక్కడ అట్టహాసాల కన్నా వైదిక శాస్త్రీయతే ఎక్కువ ద్యోతకమాదుతోంది.

అయితే జరుగుతోంది సాధారణ బ్రాహ్మణుని ఇంట పెళ్లి కాదు. సాక్షాత్తూ మహారాజుగారి అంతరంగిక సలహా

దారు, మహామంత్రి హోదాకలిగిన పండితోత్తముడు, మహాకవి, శాస్త్రకోవిదుడు హేమంత పంత్ గారి ఇంట పెళ్లి.

వియ్యాలవారు కూడా సామాన్యులు కారు. కాకతీయరాజ్య మహాప్రధాని గంగాధరమంత్రి గారు.

హేమంత పంత్ చేసిన ఏర్పాట్లకు తగ్గట్లు వియ్యాలవారుకూడా భారీగానే తరలివచ్చారు. నాలుగురోజుల పెళ్లికి

పక్షంరోజులుగా అనుమకొండనుండి దేవగిరి వరకు మేనాలు, పల్లకిలు, అశ్వరథాలు, అంబారీల ఏనుగులు,

గూడు ఎడ్లబళ్ళు.. ప్రవాహంలా వస్తూనే ఉన్నాయి. అంతమంది తరలి రావడం ఆశ్చర్యంగానే ఉంది దేవగిరి వాసులకు.

కాని వారంతా బంధువులరూపంలో ఉన్న మహాసేనానులు, అరివీర విక్రములైన యుద్ధవీరులు, మెరుపు వీరులయిన లెంకలు, ఒంటరులు.. కన్నుమూసి తెరిచేలోగా ఒక్కొక్కరూ వందమందిని నోరెత్తకుండా మట్టు బెట్టగల కాకతీయ వీరాధివీరులు.. అని

దేవగిరి వాసులకు తెలియదు.

తమ యువరాజుని రక్షించుకోవడానికి అంత్యయుద్ధానికి సమాయత్తమై మైలారదేవుడికి, రుద్రేశ్వరుడికి, పద్మాక్షికి మ్రొక్కి చావోరేవో తేల్చుకోవడానికి మృత్యుగహ్వరం లాంటి శత్రువు కోటలోకి ప్రవేశించారు. నున్నని గుండ్లు.. మీసాలులేని మూతులు.. పరమభాగవతోత్తముల్లా జంధ్యాలు సవరించుకుంటూ బ్రాహ్మణవేషాలతో.

“అనుమకొండ శత్రువుల తాకిడితో అల్లకల్లోలంగా ఉంది. అందువల్ల యువరాజు, సేనానులు, యుద్ధ వీరులు ఎవ్వరూ రావడం లేదు. కేవలం మన బ్రాహ్మణబంధువులే.. అతిధ్యం అదిరిపోవాలి సుమా..” అన్నాడు గంగా ధరుడు హేమంత్ పంత్ తో.

ఆయన హాయిగా నిట్టూర్చి, “మా మహారాజు గందరగోళంగాడు కాబట్టి అంగీకరించాడు గాని పక్కలోబల్లెంలా

ఉన్న కాకతీయమంత్రితో వియ్యమంటే మరో మహారాజు అంగీకరిస్తాడా బావగారూ..” అంటూనే ఏర్పాట్లు భారీ

గానే చేశాడు పంత్.

కాకతీయయోధులు మెల్లమెల్లగా నగరమంతా తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు. ఒక బృందం రాజకోట

లోకి, స్త్రీవేషాలతో వున్న మరో బృందం అంతఃపురంలోకి కూడా చొచ్చుకుపోయారు. అందరూ లోదుస్తుల్లో బాగా నూరిన చురకలు దాచుకున్నారు. ఏ క్షణమైనా వివాహవేదిక రణవేదిక చెయ్యడానికి పెళ్లి కుమారుడితో సహా అందరూ సంసిద్ధులై ఉన్నారు. అందరి ధ్యేయం వొక్కటే.. గణపతిదేవుని విడిపించుకు పోవాలి. లేదా ఇక్కడే చావాలి!

అప్పటికే లోపలనున్నవేగులు గణపతిదేవుడ్ని ఎక్కడ బంధించారో రుద్రయకు చేరవేశారు. ఆ మందిరమంతా మెరపుయోధుల్ని నియోగించాడు రుద్రయ. పండితోత్తముడుగా పేరున్న హేమంత్ పంత్ ఇంట వివాహం కావ దంతో వేగులు, సైనికులు అక్కడ ఎవ్వరూ లేరు.

గణపతిదేవున్ని ఎలా తప్పించాలి.. వెంట ఎవరు ఉండాలి.. ఏ అశ్వరధం అధిరోహించాలి.. ఆ రధం ఎంత వేగం గా పోవాలి.. ఎన్ని ఘడియల్లో దేవగిరిపట్టణం దాటాలి.. చుట్టూ ఉండాల్సిన ప్రత్యేక ఒంటరి మెరపు యోధులు వారి అశ్వాలు.. ఆయుధాలు.. అన్నీ ప్రణాళిక ప్రకారం సంసిద్ధం!!

అప్పుడే పెళ్లిమండపం వద్దకు యాదవుల యువరాణి సోమలదేవి వచ్చింది. సుమారు ఎత్తులో అంతంత మాత్రపుఛాయలో నిండైన అలంకరణలో రాణితనపు హొదాతో హుందాగా ఉన్న సోమలను అందరూ చూస్తుం డగా కాకతీయయోధులు ఆ వివాహ మందిరమంతా విస్తరించి కమ్మేశారు.

తుది పోరాటానికి బయలుదేరే ముందే హొయసల బల్లాలుడికి వర్తమానం పంపి తమ ఎత్తుగడ వివరించాడు

రుద్రయ. హొయసల సైన్యం కదిలింది దేవగిరి వైపు.

పెళ్లి మండపం వద్దకు మహారాజు జైత్రపాలకుడు వచ్చాడు. హేమంత పంత్ తన బంధువులతో ఎదురేగి ఆహ్వా

నించి మహారాజుకు ఉచితాసంలో కూర్చుండబెట్టాడు. ఆయన అక్కడున్న పండితులతోనూ, కవులతోనూ ముచ్చట్లాడుతున్నాడు.

మేళతాళాలు మారుమ్రోగుతున్నాయి. పెళ్ళికుమారుడు విడిదినుండి సన్నాయిమేళం మధ్య వచ్చి అందరికి

నమస్కరించి పెళ్లి పీటమెక్కాడు. పెళ్లి కూతురిని మేనమామలు బంగారుతాపడం చేసిన పెళ్లిబుట్టలో మ్రోసు కుని తెస్తున్నారు. పెళ్లి కుమార్తెతో యువరాణి సోమలదేవి మేలమాడుతూ వెంటరాగా..నవ్వులతో సరదాలతో వేదఘోషతో ఆ పెళ్లిపందిరి అంతా కళకళలాడుతోంది.

మరి రెండుఘడియలకు సర్వసేనాని జల్లన పరుగున వచ్చి మహారాజు చెవిలో చెప్పాడు "హొయసల బల్లా లుడు మనపై దండెత్తి వచ్చాడు మహాప్రభూ.. బల్లాలుని మహా సైన్యం దేవగిరి పొలిమేరలకు చేరింది.."

గందరగోళమై పోయాడు జైతుగి. ఊపిరి బిగబెట్టి చూస్తున్నారు కాకతీయ మెరుపువీరులు.. అప్పుడప్పుడూ

చురకలపైకి వెళుతున్నాయి వాళ్ళ చేతులు. అందరిచూపు క్రీగంట రుద్రయ వైపే. ఆయన కనురెప్ప కదిలిస్తే

చాలు.. జైతుగి వైపు ఉరకడానికి సన్నద్ధం.

దేవగిరి మహాప్రధాని బసవరసుడు, ఇతరమంత్రులు, సేనానులందరూ పరుగున అక్కడికి చేరుకున్నారు జైతుగి అనుజ్ఞ కోసం. అప్పుడొచ్చాడు హొయసల సంధివిగ్రహి కన్నడదాసు. వెంట కాకతీయ సంది విగ్రహి పాపయ భట్టారకుడుతో పాటు సేవణుల సంధి విగ్రహి చముండశర్మ.

జైతుగికి తనను పరిచయం చేసుకుని, "దేవగిరి మహారాజు జైత్రపాలుర వారికి హొ-యసల మహారాజు బల్లాల దేవుని వారి ప్రతిపాదన. తక్షణం కాకతీయ యువరాజు గణపతిదేవుని భేషరతుగా విడిచి పుచ్చాలి. లేకుంటే సంకులసమరమే. పొలిమేరల్లోని కొన్నిగ్రామాల స్వాధీనం కాదు. ఏకంగా దేవగిరి స్వాధీనమే హొయసలవీరుల తక్షణ కర్తవ్యం.." స్పష్టం చేశాడు సంధివిగ్రహి కన్నడదాసు.

జైతుగి కోపంతో ఊగిపోతూ, "ఇది కాకతీయ, సేణువుల మధ్య సమస్య. బల్లాలునికి ఏమి పని?"

మరుక్షణం రుద్రయ ఎగిరి దూకి జైతుగి నడుముదొరక బుచ్చుకుని చురక ఆయన కంఠానికి గురిపెట్టాడు.

కనురెప్పవేయకముందే కాకతీయ మెరపుయోధులు అక్కడున్న సేవణముఖ్యుల పైకి లంఘించి అందరి కంఠాలకు తమ చురకలను ఆనించారు. ఇదంతా క్షణంలో వెయ్యోవంతుకాలంలో జరిగిపోయింది. పెళ్లి మండ పం బిర్రబిగదీసుకుపోయింది. మహిళలు హాహాకారాలు, కెవ్వుకేకలతో మేళతాళాలు, వేదపటనాలు ఆగి

పోయాయి. రుద్రయ అరిచాడు, “రాజనాయకా.. యువరాజులవారిని బంధ విముక్తులను చెయ్యి. కారాగారం నుండి తప్పించి ఘడియల్లో ఇక్కడికి తోడ్కొని రావాలి..”

అందరూ చిత్తరువులై నిలబడి పోవగా మరి మూడు ఘడియలకు కాకతీయ యువరాజు గణపతిదేవుడు మెరపువీరుల మధ్య వివాహమండపానికి విచ్చేశాడు.

తమ యువరాజును చూసుకుని కాకతీయ యోధుల కన్నుల్లో ఉద్వేగం.. ఆనందభాష్పాలు..

రుద్రయ అరిచాడు, “గంగాధరా.. చెప్పు జైత్రపాలుడు తల త్రుంచివేయనా.. అనుజ్ఞ ఇవ్వు..”

గంగాధరుడు కంగారుగా అన్నాడు. “రుద్రా.. ఆగాగు. ఇది వేదమంత్రాలతో ఘోషిస్తున్న పవిత్ర వివాహ వేదిక. దీనిని రక్తసిక్తం కావించొద్దు. యువరాజుని తీసుకుని నువ్వు వెళ్ళిపో. నా కొడుకు వివాహం ప్రశాంతంగా జరగ నివ్వు..” అన్నాడు. దేవరసుడు, హేమంత పంత్ కూడా రుద్రసేనాని ముందు మోకరిల్లారు చేతులు జోడించి.

జైతుగి ఏమీ చెయ్యలేక హుంకరించాడు, “ఆనాడే ఈ గణపతిదేవుడ్ని నరికిపారేసి అనుమకొండ స్వాధీనం చేసుకుని రావాల్సింది. తప్పు చేశాను..”

“ఇప్పుడు మేమా తప్పుచెయ్యం జైత్రపాలా.. శత్రుశేషం లేకుండా దేవగిరినంతా అగ్నిప్రీతం చేసి వెళతాము..”

యుద్ధావేశంతో ఊగిపోతున్నాడు రుద్రయ.

అప్పుడు వినిపించింది మరో కంఠం. “రుద్రసేనా.. జైత్రపాలక మహారాజుల వారిని విడిచిపుచ్చు..”

అది హొయసలరాజు బల్లాలునిది. అప్పటికే వచ్చి ఉన్నాడాయన. “ఇది వివాహ వేడుక. అందునా బ్రాహ్మణ పెళ్లి. ఇక్కడ కత్తులకు చురకలకు ప్రవేశంలేదు. జరిగింది జరిగిపోయింది. కాకతీయులవీరత్వం మాకుతెలుసు. జైత్రపాలుడు మీపై గెలిచాడు. మహాదేవరాజును సంహరించి యువరాజుని బంధించారు. అలా వారూ విజయు లే. కాబట్టి ఇరువురూ యుద్దావేశాలు వదిలేయండి. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకొండి..” ఆగాడు.

ఉద్రిక్తత కొంచంతగ్గింది. రుద్రయ, గంగాధరుడు గణపతిదేవుని దగ్గరకు వెళ్లారు. జైత్రపాలుడు బల్లాలుని వద్దకు వచ్చి ఆయనను గొనిపోయి ఉచితాసంపై పై కూర్చోబెట్టి గౌరవించాడు. సోమలదేవి తండ్రి వద్దకు వచ్చి నిలుచుంది.

అంతా చేష్టలుడిగి నిలుచుండి పోయారు. సమస్యకు ముగింపు ఏవిటో ఎవ్వరికి స్పష్టమౌడం లేదు.

బల్లాలుడు సోమలదేవిని పరిశీలనగా చూశాడు. ఆమెను దగ్గరకు పిలిచాడు. సాలోచనగా చెయ్యి పట్టుకుని

అన్నాడు, "నాదొక సంధి ప్రతిపాదన. కాకతీయ మహానేత, ఒకప్పటి మా సామంతుడు, మా విశ్వాసపాత్రుడు రుద్రదేవుడు నిర్వహించినదే.. వివాహ బంధం. కాకతీయ యువరాజు గణపతిదేవునికి, దేవగిరి యువరాణి సోమలదేవికి వివాహం. ఇది నా ప్రతిపాదన. ఇరు పక్షాలు దీనికి అంగీకరించాలి.."

ఇందులో కాదు వద్దు అనడానికి ఎవ్వరికి అవకాశం లేదు.

"పురోహితులారా.. ఆ వివాహపీఠానికి ప్రక్క మరొక పీఠం వెయ్యండి. ఊ.. వెళ్ళండి పీఠం అలంకరించండి.."

రెండు ఘడియలు నిశ్శబ్దం. అనంతరం పుత్రికను స్వయంగా జైతుగే వేదిక పైపు తీసుకువెళ్ళాడు. రుద్రయ ముఖంలోని అంగీకారం చూసి వివాహవేదిక వైపు కదిలాడు గణపతిదేవుడు. "ఊ.. మ్రోగించండి భజంత్రీలు.." అంటూ అందరిలో ఉత్సాహం కలిగించి మందిరంలో వివాహశోభ పునరుద్దరించాడు హొయసల బలాల్లుడు.

యుద్ధతంత్రం వివాహమంత్రాలతో ముగించడం రుద్రదేవుడు నిర్వహించిన గొప్ప దౌత్యవిధానం. కాకతీయ, యాదవుల వైరం కూడా చివరికి వివాహబంధంతోనే ముగిసింది.

స్కంధావారానికి చేరుకున్న నూతనవధూవరులతో కాకతీయ సైనికపటాలం విజయవంతంగా కదిలింది అను మకొండ వైపు. అప్పటివరకూ దాచిపెట్టిన కాకతీయ ఛత్రం, కేతనం బయటకు తీశాడు రుద్రసేనాని. అభిషక్త యువరాజు గణపతిదేవుని అశ్వరథానికి ముందు తన అశ్వంపై కేతనం చేతపట్టి పంచశబ్దాలైన భేరీ, బాకా, డోలు, ఘటం, శంఖాలు చేస్తున్న విజయధ్వానాల మధ్య సైనికుల జయజయ శబ్దాల చేస్తుండగా కదిలాడు మహా సేనాని రేచర్ల రుద్రయ అనుమకొండ వైపు.

***

"చివరికి మా హొయసల మహారాజుగారు సైన్యాన్ని పొలిమేరల్లో వుంచి సంధిప్రయత్నం చేస్తేనే జైతుగి అంగీక రించాడన్నమాట.." అన్నాడు రుద్రేశ్వరదేవాలయ స్థపతి రామప్ప. ఆయన ఎప్పుడు వచ్చాడో ఏమి విన్నాడో గాని రుద్రయ వాక్రువాహానికి అడ్డుకట్ట వేశాడు.

"విన్నది చాలు లేవండి. రేపే సుముహూర్తం. కాకతీయ మహారాజు గణపతిదేవులవారు స్వయంగా విచ్చేస్తు

న్నారు.. దైవప్రతిస్థాపన నిమిత్తం. రుద్రసేనాని నిలబెట్టిన కాకతీయకేతనం, ఛత్రం రేపు మనమంతా చూద్దాం.."

అన్నాడాయన. అంతాకదిలారు. రుద్రయ, రామప్ప దేవాలయప్రాంగణమంతా కలయతిరుగుతూ గర్భాలయం

వరకు వెళ్లి అక్కడ ఆగారు.

"మీ దంపతుల మిధునశిల్పం అందరినీ ఆకర్షిస్తోంది. మీరేమో..వద్దు, అది తీసివేయమని పోట్లాడుతున్నారు."

"అవును రామప్పా.. అది రేపు ప్రభువులు చూస్తే.."

"ఈ దేవాలయఅద్భుతాలలో నిర్మాణదారు జంటశిల్పం కూడావొకటి. ముందు చక్రవర్తులవారిని చూడనివ్వండి మహాసేనాని. ప్రభువులకు మీరంటే ఎంతో గౌరవం.. పితృసమానులుగా గౌరవిస్తారు. ఆ విగ్రహ ఏర్పాటు గురించి గతంలోనే వారికి విన్నవించాం. సంప్రదాయ విరుద్ధం కాబట్టి తొలగించమంటే అప్పుడు ఆలోచిద్దాం.." ఇలా రెండేళ్లుగా నచ్చజెబుతున్నాడు రామప్ప. రుద్రయ, అన్నమ ల మిధునశిల్పం చెక్కి గర్భాలయ ప్రవేశ ఎడమద్వారం పై ఏర్పాటు చేశాడు రామప్ప. అన్నమ శిల్పాన్ని చూస్తుంటే స్కంధావారం నుండి అనుమకొండ వచ్చాక జరిగిన సంభాషణ గుర్తొచ్చింది రుద్రయకు.

***

కాకతీయ మహారాజుగా గణపతిదేవుడ్ని సింహాసనంపై కూర్చోబెట్టేవరకు విశ్రాంతి లేదు రుద్రయకు. శాస్త్రోక్తంగా

సమస్త లాంఛనాలతో విధివిధానాలతో అభిషిక్తుడయ్యాడు గణపతిదేవుడు. కాకతీయచరిత్రలో మరో అధ్యాయం

ప్రారంభమయ్యింది.

ఆ రాత్రి భోజనాలవేళ ఎప్పటినుండో మనసులో ఉన్న భావనలు బయటకొచ్చాయి.

" ఆనాడు.. గంగాధరుని కొడుకు పెళ్ళికి ఆహ్వానించినా దేవగిరి ఎందుకురాలేదు నువ్వూ నీ కొడుకులు?" మెల్లగా, మెత్తగా అడిగాడు రుద్రయ. ఉహించని ప్రశ్న హటాత్తుగా వచ్చేసరికి ఖంగుతింది అన్నమ.

"పిల్లల యుద్ధతంత్రాలు, ప్రయాణాలు నాకు తెలియదు. అక్కడ జరగబోయే భీభత్సం ఉహించే నేను రాలేదు.."

"ముదిగొండ నాగతికి.. మన తాత్కాలిక యువరాజు సహాయపడ్డాడని నా సందేహం.. నిజమేనా?"

"నాకూ సందేహమే. కాని వాడు మీకొడుకు. రేచర్ల బిడ్డ. తప్పుచెయ్యడు.. కానీ కానీ.." ఆమె కంఠం వణికింది.

రుద్రయకు కూడా సంభ్రమం. ఏమి జరిగి ఉంటుంది.. చెప్పమన్నట్లు చూశాడు ఆమెవైపు.

"ప్రతిరోజూ నన్ను రాజప్రాసాదానికి రమ్మని పల్లకి పంపేవాడు. ఆరోజు పిలుపు లేదు.

పల్లకి రాలేదు. సందేహం కలిగి నేనే వెళ్ళాను.. భోజనం తీసుకుని మరీ..”

“అదేవిటి? రాజనగరానికి నువ్వు భోజనం తీసుకెళ్లడం ఏవిటి?”

“అవును. వాడికిష్టమైన దద్ధ్యోజనం వండి విషంకలిపి తీసుకెళ్ళాను. వాడేమైనా తండ్రి మాటను జవదాటుతు న్నాడేమోనన్న సందేహం.. ఎక్కడో.. మనసు మూలల్లో. అదే జరిగితే వాడికి ముద్దలు చేసి తినిపిద్దామని..” ఆమె వొక్కసారిగా బిగ్గరగా ఏడ్చింది. “నాబిడ్డ అలాంటివాడు కాదు మహాసేనాని.. కాదు..” అలా చాలాసేపు భారం తగ్గేవరకు ఏడ్చిఏడ్చి తలతిప్పి భర్తను చూసింది.

ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకుంటున్నాడు మహాసేనాని రుద్రయ.

***

నడుముకున్న ఉత్తరీయం తీసి కళ్ళోత్తుకున్నాడు రుద్రసేనాని.

“ఆమె ఈ దేవాలయంలో ఉండాల్సిందే. నీతో అంగీకరిస్తున్నాను స్థపతి..”

మరునాడు.. ముహూర్తం సమీపిస్తోంది. దేవాలయప్రాంగణమంతా మామిడితోరణాలలో అరటిస్థంభాలతో అలం

కరించారు. మంత్రులు, సేనానులు, మండలేశ్వరులు, శిల్పాచార్యులు, పండితులు, కవులు, రాజ్య, మండల ప్రముఖులు, ఆతుకూరు గ్రామస్తులు.. తొలిసారి దేవాలయప్రాంగణంలో తిరుగాడుతూ ఆలయ విన్నాణానికి, నిర్మిత విధివిధాలకు, శిల్పాల అందచందాలకు, విభిన్నఅంశాలను ఏర్చి కూర్చిన రూపకల్పనకు దిగ్భ్రమలో ఉ ండిపోతున్నారు.

స్థపతి రామప్ప, నిర్మాణదారు రేచర్ల రుద్రసేనాని హడావిడిగా తిరుగుతూ ఎక్కడా తప్పులు దొర్లకుండా పరికి

స్తున్నారు. రాచబాటపై కలకలం.. కాకతీయచక్రవర్తి, మహా మండలేశ్వరుడు, దాయగజకేసరి శ్రీశ్రీశ్రీ గణపతి

దేవుల వారి ఆగమన సందోహం..

అందరూ ఎదురు చూస్తున్నట్లే దూరంగా ఎగురుతూ ముందు కనిపిస్తోంది కాకతీయ కేతనం.. సముజ్వలంగా సమున్నతంగా.. ముందు కేతనంపట్టి అశ్వంపై వస్తున్నవాడు రేచర్ల మండలేశ్వరుడు, రుద్రసేనాని వారసుడు గణపతి చమూపతి. వెనక సప్తాశ్వర సమారూఢమైన రథంపై గణపతిదేవుడు.. ఆయనకు వెనగ్గా పైఎత్తున అటూ ఇటూ కదలుతున్నాయి రెండు కాకతీయఛత్రాలు.. చేతపట్టినవారు లోకచమూపతి, కాటయ చమూ పతి. రేచర్ల ఘన వంశ వారసులు.. రుద్రయ కుమారులు.

ఎత్తైన రుద్రేశ్వర దేవాలయ అంచున నిలబడి ఆ మనోహరదృశ్యాన్ని సజలనయనలతో వీక్షిస్తున్నవారు రేచర్ల

రుద్రయ, అన్నమ పుణ్య దంపతులు.

***











ముల్కనూర్ - నమస్తే తెలంగాణ కథల పోటీలు 2019, 2020 బహుమతుల

పంపిణీ కార్యక్రమాల్లో విజేతలు, ప్రముఖులు

# ఇది కథా వైభవం..

సాహితీ సంబురం..

పండుగలా 'సమస్త తెలంగాణ-ముటుకనూరు ప్రజా గ్రంథాలయ' కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

- రచయితల్లో స్ఫూర్తినింపిన కార్యక్రమం
- పుస్తకం లేని ఇల్లు అంధకారమే : కవి, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్
- మరింత సహకారం అందిస్తా : మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు
- పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం : హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్
- కథలు సామాజిక అంశాలను స్పృశిస్తాయి : జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

సమస్త తెలంగాణ-ముటుకనూరు ప్రజా గ్రంథాలయం సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలు-2021 విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముటుకనూరు వేదికగా సాహితీ ఉత్సవానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రచయితలు, సాహితీ అభిమానులు తరలిరాగా, పుస్తకాల విందు, ఆట గొప్పతనాన్ని తెలిపిన వక్తల ప్రసంగం ఆద్యంతం అందరినీ ఆకట్టుకోవడంతో పాటు వారిలో స్ఫూర్తిని నింపింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, కవి దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదితరుల చేతులమీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక బహుమతులను అందుకొని మురిసిపోయారు. ఎప్పుడూ లేని విధంగా ముటుకనూరు వంటి ఒక గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, ఈ కథల పోటీల ద్వారా నేటి తరానికి రచనల పట్ల ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.
- హనుమకొండ సబర్బన్/భీమదేవరపల్లి, జూన్ 26



## పుస్తకం లేని ఇల్లు అంధకారం

[illegible]

## కొత్తతరానికి ఆసక్తి పెరుగుతుంది...



[illegible]

## నూతన రచయితలకు ప్రోత్సాహం



[illegible]

## ఇదే స్ఫూర్తితో మంచి కథలు రాస్తా



[illegible]

## పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం



[illegible]

## రచనలకు ప్రాణం పోస్తున్నారు



[illegible]

## సాహిత్యాన్ని వెలికితీయడం మంచి పరిణామం



[illegible]



[illegible]

## కథలు సామాజిక అంశాలను స్పృశిస్తాయి



[illegible]



[illegible]

## కొత్త తరానికి స్ఫూర్తి



[illegible]

[illegible]



కార్యక్రమంలో పాల్గొన్న రచయితలు, సాహితీ అభిమానులు



[illegible]

## రెండువేల కథలు వచ్చాయి...



[illegible]

## భవిష్యత్తులో మరింత ప్రోత్సాహం



[illegible]


ప్రజా గ్రంథాలయం


ములకనూరు






ప్రజా గ్రంథాలయం





ముల్కనూర్ ప్రజా గ్రంథాలయంలో సరస్వతీ అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమం
















నమస్తే తెలంగాణ, ముల్కనూరు
ప్రజాగ్రంథాలయం
కథల పోటీలో బహుమతి 2019
పుస్తకం ముఖచిత్రం

## 2019 కథల పోటీ విజేతలు

1. **విత్తనం** : పెద్దింటి అశోక్ కుమార్
2. **హరామ్** : హుమాయున్ సంఘీర్
3. **ఒట్టిపోయిన అడవి** : శిరంశెట్టి కాంతారావు
4. **బేబక్క** : పుట్టగంటి గోపీకృష్ణ
5. **అమ్మ పండుగ** : ఎగుర్ల గణేష్
6. **సిద్ధయ్య మఠం** : రామా చంద్రమౌళి
7. **ఖుర్బాని** : సయ్యద్ గఫార్
8. **అంటరాని బతుకమ్మ?** : డా. సిద్దెంకి యాదగిరి
9. **అమ్మల గాజులు** : డా. ప్రభాకర్ జైనీ
10. **రేణుక** : పర్కపెల్లి యాదగిరి
11. **ఒడి బియ్యం** : గంగుల నరసింహారెడ్డి
12. **గడి** : చందు తులసి
13. **బొడ్రాతు** : రావుల కిరణ్మయి
14. **అతడు మార్గదర్శి** : కూతురు రాంరెడ్డి
15. **తులసమ్మ బతికింది!** : యు. రాజ లింగమూర్తి
16. **సుక్కబర్రె** : మ్యాకం రవికుమార్, పెద్దపల్లి
17. **బూరుగు సందుగ** : చెన్నూరి సుదర్శన్
18. **స్వీట్ బాక్స్** : నండూరి సుందరీ నాగమణి
19. **పోరాటం** : చేవూరి శ్రీరాం, హన్మకొండ
20. **ఒక ఆకుపచ్చని ఆశ** : బి. మురళీధర్, ఆదిలాబాద్
21. **బతుకు వాసన** : గంగ్రకోట సూర్యనారాయణ శర్మ
22. **గుట్ట మీద దేవుడు** : మధుకర్ వైద్యుల

# కథ 2020

నమస్తే తెలంగాణ. ముల్కనూరు ప్రజాగ్రంథాలయం



నమస్తే తెలంగాణ, ముల్కనూరు
ప్రజాగ్రంథాలయం
కథల పోటీలో బహుమతి 2020
పుస్తకం ముఖచిత్రం

| నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజా గ్రంథాలయం | | | |
|---|---|---|---|
| **కథల పోటీ – 2020 విజేతల జాబితా** | | | |
| ప్రథమ బహుమతి (1) | | | |
| 1 | గస్సాల్ | కటుకోజ్వల ఆనందాచారి | 99487 87660 |
| ద్వితీయ బహుమతులు (2) | | | |
| 2 | అమృతం | సయ్యద్ సలీమ్ | 75886 30243 |
| 3 | కుక్కసద్ది | డా.కాలువ మల్లయ్య | 91829 18567 |
| తృతీయ బహుమతులు (3) | | | |
| 4 | ఆకుపచ్చ తివాచీ | బి.వి.రమణమూర్తి | 98489 87239 |
| 5 | ఇదీ హత్యే కదా? | బి.వి.గిరిజ (కలం పేరు సుశోభ) | 89850 38173 |
| 6 | వృత్తి | కె.వి.నరేందర్ | 94404 02871 |
| ప్రత్యేక బహుమతులు (6) | | | |
| 7 | తక్కెడ | చందు తులసి | 99855 83022 |
| 8 | నషా | సయ్యద్ గఫార్ | 81067 40593 |
| 9 | ఉత్తమ నటుడు | యన్నంరెడ్డి వెంకటరెడ్డి | 98494 18365 |
| 10 | పాజిటివ్ | డా. వెల్దండి శ్రీధర్ | 98669 77741 |
| 11 | ఆరాధ్య | పొన్నాడ గౌరి | 63052 65908 |
| 12 | నిర్వాణ | ప్రొ. రామా చంద్రమౌళి | 93901 09993 |
| విశిష్ట బహుమతులు (10) | | | |
| 13 | ఋణం | ఎంఆర్వి సత్యనారాయణ మూర్తి | 98486 63735 |
| 14 | మా ఊరి ధన్వంతరి రాంరాం తాతా | డా.జనపాల శంకరయ్య | 80747 27108 |
| 15 | కర్మకాండ | బి.నర్సన్ | 94401 28169 |
| 16 | ఈద్ కా చాంద్ | హనీఫ్ | 83285 86518 |
| 17 | తీర్పు | గాజోజు నాగభూషణం | 98854 62052 |
| 18 | సుక్కబర్రె | వేముగంటి శుక్తిమతి | 99081 10937 |
| 19 | చీకటి వెలుగులు | స్ఫూర్తి కందివనం | 96527 45117 |
| 20 | మనసున మనసై | చింతపట్ల పద్మా రమేష్ | |
| 21 | గంగిరెద్దు గానుగెద్దు | సుగంధ శ్రీనివాస్ | 77300 65637 |
| 22 | అడవి బతుకులు | డా. దిలావర్ | 98669 23294 |